# కొండ కోనల్లో



## తెలుగు గిరిజనులు

# కొండకోనల్లో తెలుగు గిరిజనులు

ఆటమనదే పాటమనదే - అన్నివిద్యలుగల్లవారము
వేటమనదే వెట్టిమనదే - వేయివిద్యలుగల్లవారము
కొలువుమనదే కొలతమనదే - కోటివిద్యలుగల్లవారము
జంగంకాము జోగుకాము - జోటలుండే బాలలము
వీట్లంకాము విద్దెలంకాము - వేడుకల బాలలము
అమ్మవారుయున్నప్పుడు - ఆడేపాడే బాలలము
మనసుకు మంచివారము - మాపటికి దొంగవారమా
సపిరెలు తొక్కవాలె - చాపచుట్టు చుట్టవాలెయా
గుంపెనలాడవాలె - గుళ్ళచుట్టు చుట్టవాలెయా
ఆడవాలె పాడవాలె - వేడికీలు సేయవాలెయా
అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా

-- కొండరెడ్ల పెండ్లిపాట

జోర జోర జోర - పంచ పాండవులార
తొక్కిన భూదేవత - తోడుగాయవలె
మట్టిన భూదేవత - మనసు గాయవలె
కంచునగరి జోడు - కదలి మోగవాలె
జోర జోర జోర - బండి బసవన్న

కల్లుతాగితీమి - కమముతప్పితీమి
కూడుతింటిమి - కులముతప్పితీమి
తప్పులొప్పులు మాకు - దయను జూడవాలె
ఒదిగితీమి కొడుక - కొదువకొంచెము లేదు

లోతుగడ్డనున్న - వీరభద్రుడ
లంబసింగినున్న - బాలరాకాసమ్మ
బోడకొండనున్న - శాంబరమ్మ నీవు
మాడుగులనున్న - మత్స్యకంబేరమ్మ
కొండకంబేరున్న - నీలకంతుడ
ధమ్మము సావడి - వెన్నెల పందిరి
మనము చేరవాలె - బాలనంబరులారా
గ్రామజాకరమ్మ - నిలిపినారు బాబు
గ్రామపోతురాజు - నిలిపినారు కొడుక
గడికాయు కొడుక - గడిపోతురాజ
కాపులుండవాలె - కరుణజూడవాలె
తేనె పండినట్లు - పండుగులు మనకు
పండవాలెనేమో - పంచపాండవులారా

-- నందిపండుగ పాట

# ఆకాంక్ష

'మన ప్రక్కనే అనాదిగా జీవించి మన భాషనే నానాపభ్రంశ రూపాలతో మాట్లాడు గోండ్లు, కోయ, చెంచు, సవర మున్నగు నాటవికులను సంస్కరించుట, వారి జీవన విధానములను బాగా గమనించి, వారి చరిత్రలను వ్రాయుట అనునది మనలో నేటికిని లేదు. పాశ్చాత్యులు వారిని గురించి అనేక గ్రంథాలు వ్రాసిరి.

ఇటీవలనే హ్యూమన్‌డ్రాఫ్ అను జర్మనుడు హైదరాబాదులో ఆటవికోద్యోగియై చెంచులనుగూర్చి, బైసన్ కొండలలోని (గోదావరీ తీరారణ్యములందలి)రెడ్డి అను ఆటవికులనుగూర్చి సమగ్రోద్గ్రంథములను వ్రాసెను. వారిని చూచువారుకూడా మనలో లేరు. అయితే ఆ జర్మనుకు తెనుగురానందున చెంచుల తెనుగును అర్థము చేసికొనలేక చాలాతావుల పొరపాట్లు చేసినాడు. చెంచులనుగురించి తెనుగువారే వ్రాయుటకు ఉత్తమాధికారులు. మనచెంచుల ఆటలు, పాటలు, భాషలోని విశేషాలు, ఆచారాలు, విశ్వాసాలు, దేవరలు, వారి బట్టలు, రూపములు, పరిశ్రమలు వారి ఔషధీవిజ్ఞానము, వారి మంత్రతంత్రాలు, వారి ధనుర్విద్యా పాటవము, వారి గుడిసెలు, ఆహారము మున్నగు ననంతవిషయాలను గూర్చి కొందరుయువకులు ప్రత్యేక కృషి చేయుట యుక్తము.'

'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' సురవరం ప్రతాపరెడ్డి. 1952 పుట 207.

# మనం వారి వారసులం

'ప్రత్యక్ష నిదర్శనమునకై తెలుగువారైన కొండరెడ్లును, చెంచు వారలును మన్నెప్రాంతములనున్నారు గదా. వారి వారసులమే మనమందరము'.

'తెలుగుజానపద గేయసాహిత్యము' డా.బి.రామరాజు 1978,పుట.7.

ప్రతులు: 1000

ప్రథమముద్రణ:

జూలై 2007

ప్రతులకు:

**శక్తి**

305, జనప్రియ అబోడ్స్,

గాంధీనగర్, హైదరాబాదు-500 080.

ఫోన్: 66614787, 66627893

email: saktisrk@yahoo.com

website: www.sakti.in

ప్రచురణ చందా: రూ. 200/-

# నివేదన

పరిశోధనకు అవకాశం ఇమ్మని కోరిన మరుక్షణంలోనే నా దృష్టిని గిరిజనుల పాటలవైపు మరల్చినది ఆచార్య శ్రీ బిరుదురాజు రామరాజు గారు. వారి సంకల్పం, అంతకుముందు రంపచోడవరం గిరిజన ప్రాంతంలో ఐదేండ్లు ఉపాధ్యాయుడుగా పనిచేసిన నా అనుభవం, పరిచయం మళ్ళీ ఉపయోగపడేటట్లు చేసింది. 1976-82 వరకు ఏడేండ్లపాటు విశాఖ, ఉభయగోదావరి, ఖమ్మంజిల్లాలలో, నల్లమల అడవులలో తిరిగి కూర్చిన ఈ సిద్ధాంత గ్రంధానికి "తెలుగు గిరిజన గీతాలు"కు 1982లోనే ఉస్మానియావిశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చింది. కాని నాటినుండి గిరిజనాభివృద్ధికోసం వారి సమస్యలను పట్టించుకునే కృషిలో లీనమ్మైపోయిన నేను 1991లో ఈ గ్రంధాన్ని చిత్తుప్రతిగా మాత్రమే అచ్చువేయగలిగాను.

పల్లాలబొర్రంరెడ్డి (మారేడుమిల్లి), స్వర్గీయ చిన్నంశాంతయ్య (కుండవాడ), రేగంచితుకన్న (మఠం), తోకలగురువయ్య (అప్పాపూర్), కుడుముల అంకన్న (పెదమంతనాల), భూమని వెంకటేశు (దోర్నాల), భూమని రవీంద్ర (దోర్నాల), దాసరి చిన్నమూగన్న (తుమ్మలబయలు), డొక్కులూరి కర్ణయ్య (మారేడుమిల్లి), గడుతూరి చిన్నారావు (రంప చోడవరం), బలుసు పురుషోత్తమరావు (విజయవాడ), ఈ కృషిని తరువాత సంపన్నంచేశారు. గిరిజనులు అందించిన పూలతో నేను కూర్చిన మాల **"కొండకోనలలో తెలుగు గిరిజనులు"**.

క్రమంగా గిరిజనుల పంచతంత్రకధలను, పదప్రయోగ కోశాలను, బహుముఖమైన వారి విజ్ఞానపరిభాషను ప్రచురించే ప్రయత్నంలో ఉన్నాము.

**'ఈ తెగల కళాత్మకమైన సారస్వతం ఎనిమిదికోట్ల తెలుగుప్రజలకు, ప్రపంచానికి జ్ఞానభిక్ష పెడుతుంది. ఎదిగే తరంలో వారి ఆటపాటలు మనో వికాసాన్ని, ఈ అడవులలో పర్యటన ధైర్యసాహసాలను, ఈజాతుల గూర్చిన సదవగాహన మానవత్వపు విలువలను పెంచుతుంది'.**

-- *శివరామకృష్ణ*

# విషయసూచిక

## మొదటి భాగం


**1. తెలుగుగిరిజనులస్థానం - ప్రస్థానం** **3**

వాచకం సర్వవాఙ్మయం

మార్గ-దేశి సంప్రదాయాలు

తూర్పుకనుమలు - తెగల సంస్కృతులు

తెలుగు గిరిజనుల ప్రస్థానం

విశాఖమన్యంలో సంస్థానాలు

నల్లమల అడవులు

**2. తెలుగు వనసీమలలో ప్రకృతి పురుషులు** **35**

ప్రకృతి - ఒకగణితం

విశాఖబయళ్ళు

ఊళ్ళు - ఇళ్ళు - పరిసరాలు

గోదావరి లోయలు

'ఈ అడవి దాగిపోనా'

ఆహార విహారాలు

నల్లమలలో సెలలు, సరులు, కురవలు, కట్టువలు, సారవలు, బరకలు, పడియలు

పుడమితల్లికి - సహస్రనామార్చన

పరిసరజ్ఞానానికి మచ్చుతునకలు

నల్లమల - అక్షయపాత్ర; నరసింహస్వామి వరం

తెలుగువారి అడవుల వర్గీకరణం

**3. దేశకాలాలు - రాగద్వేషాలు** **105**

పేరు - శరీరం - జీవి - పెతర

నమ్మకాల దొంతరలు
దోసాలు – పండుగలు
తిత్రికపిట్ట రెట్ట – తాపడం – నీటికట్టు
చెంచుల దేవరలు – రావగాళ్ళు – ఇలవేల్పులు
బీజప్రధానం – క్షేత్రప్రధానం

**4. పండుగపదాలు** **151**
వార్తయందు జగమువర్ధిల్లుచున్నది
సహజాతాలు – నవరసాలు – కవిసమయాలు
రండోచేరి పాండవులార – భోంచేయరండో
గోదావరి – విశాఖతెగల వ్యవసాయచైతన్యంలో తారతమ్యాలు
దృగ్విషయం – దృక్పథం
గిడసబారిన వ్యవసాయం
వ్యవసాయచరిత్ర – నందిపండుగ
నందిపండుగలో వారంరోజుల కార్యక్రమం
నందిపదం
పాండవయోగంపట్టినవారిని ఉసికొల్పడం
పాండవరాజు పుట్టుక
దొంగలదోపు
కోలన్న – కరువు
కోలన్న అమ్మకం
దానుగుడు
కథలో సంఘటనలు – సమన్వయం
విరుద్ధధర్మాలు – సమన్వయించే మాధ్యమాలు

**5. స్త్రీపుంసయోగం** **239**
ప్రయోగశీలం
ఉన్నవారిసొమ్ములు తినండి – ఊరివారిపనులు చేయండి

# రెండవభాగం

## కొండకోనల్లో తెలుగు పాట


**1. కొండరెడ్ల పాటలు** **261**

ముయ్యచిలుక – పచ్చపూలుగు
చుక్కలున్న సూరెపుదేవి
ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు
కన్నెకు కలుసుకుందాం – దసరాకు దంచుకుందారా
కన్నవారి ముంగిలి – కమ్ముకుంటున్న నీడలు
కన్నెమనసు – దాంపత్యం – మగనాలి
వ్రైపాప – నల్లమయ్య
ఉగుతాప – కట్టుతాప
సుక్కనుదురు సూరెపుడేగ – మద్దివీటిమయలపుంజు
నందాలాడే గుబ్బట్లకు – గందాలు పూసేబుడ్డడు
గంగాలమ్మపండుగ
ముల్లికలు – జారికలు
గుమ్మళ్ళు – డోలగతులు – కోలాటం

**2. విశాఖ గిరిజనులపాటలు** **337**

ఆలపాటలు
లోకాన్ని గెలిచిన చెల్లెలు
మోదకొండమ్మ కథ
మోదమ్మ పదం
దొంగపెండ్లి – గౌరవంగపెండ్లి

**3. నల్లమల చెంచులపాటలు** **401**

రావగాని పాట
మల్లన్నను చేరిన పూలబండి
పెండ్లికొడుకును ఎంచుకున్న చిన్నలింగి

# మూడవ భాగం


| | | |
|---|---|---|
| 1. | శైలి | 419 |
| 2. | తెలుగు సంస్కృతిలో గిరిజనుల భూమిక | 433 |
| 3. | తెలుగు గిరిజన మాండలికం | 471 |
| 4. | కొన్ని మాండలికపదాలకు అర్థవివరణ | 479 |
| 5. | సంప్రదించిన గ్రంథాలు | 491 |
| 6. | సమాచారం, ఆతిథ్యం ఇచ్చిన గ్రామాలు | 501 |
| 7. | వార్తయందు జగము వర్థిల్లుచున్నది | 505 |
| 8. | ఆంగ్లంలో సారాంశం | 525 |
| 9. | పదసూచిక | 529 |
| 10. | సామెతలు | 584 |
| 11. | పొడుపుకథలు | 593 |
| 12. | మరికొన్ని పోలికలు – సందర్భాలు | 595 |

| నెం. | పటాలు - ఫోటోలు - బొమ్మలు | పుట |
|---|---|---|
| 1. | తూర్పుకనుమలు | 9 |
| 2. | వ్యవస్థలు | 13 |
| 3. | ఆంధ్రప్రదేశ్ | 14 |
| 4. | ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనప్రాంతాలు | 15 |
| 5. | దండకారణ్యం | 16 |
| 6. | రంప-గూడెం (1880) | 17 |
| 7. | రంపరాజ్యం (1931) | 18 |
| 8. | నల్లమల అడవులు | 25 |
| 9. | విశాఖజిల్లా గిరిజనప్రాంతంలో వాతావరణం భౌగోళికవిభాగాలు | 40 |
| 10. | విశాఖమన్యం (1929) | 42 |
| 11. | విల్లంబులు, మిట్ట | 45 |
| 12. | విశాఖగిరిజన గ్రామపటం | 47 |
| 13. | విశాఖ, గోదావరి, ఖమ్మంజిల్లాల తెలుగు గిరిజన ప్రాంతాలు | 51 |
| 14. | అడవి - కొండలు - గుర్తులు | 59 |
| 15. | గోదావరిగిరిజనుల గ్రామపటం | 60 |
| 16. | విశాఖగిరిజనుల ఋతువులు-నెలల స్థితిగతులు | 66 |
| 17. | అరకులోయలో కొటియాల ఋతువులు, నెలలు, ఆటపాటలు | 67 |
| 18. | గోదావరిమన్యం ఋతుచక్రం | 68 |
| 19. | డోకి | 69 |
| 20. | గోదావరి విశాఖలో ఆచారాలు-నుడికారాలు | 70 |
| 21. | డిప్పలు | 70 |
| 22. | వెదురు సోలలు | 73 |
| 23. | నల్లమలలో చెంచుగ్రామాలు | 74 |
| 24. | మన్ననూరు సమీపంలో అప్పాపూర్ గ్రామపరిసరాలు | 82 |
| 25. | సర్వే ఆఫ్ ఇండియా పటంలో అప్పాపూర్ | 83 |
| 26. | శ్రీశైలానికి కాలిబాటలు | 84 |
| 27. | అహోబలక్షేత్రం మహామంటపంలో చెంచులక్ష్మినరసింహస్వామి | 89 |
| 28. | కెంటకూర | 91 |

| | | |
|---|---|---|
| 29. | చెంచుల కాలజ్ఞానం | 92 |
| 30. | పిల్లింగగ్రలు, నాగస్వరం | 98 |
| 31. | అడ్డాకులతో కుట్టిన దూబ, బొజ్జ | 118 |
| 32. | కఞ్త్, దిప్పి (దుప్పి) | 126 |
| 33. | బెల్మితిఎల్గు | 131 |
| 34. | బావురుగాడు | 134 |
| 35. | తేనెబుట్ట | 137 |
| 36. | వర్ణవివక్ష | 144 |
| 37. | నమ్మకాలదొంతరలు | 144 |
| 38. | సంస్కారాలు | 146 |
| 39. | చెంచుల ప్రపంచం | 147 |
| 40. | కూరపంది, ఒంటర్‌గాడు | 169 |
| 41. | విశాఖమన్యం వ్యవసాయంలో సమస్యలు - పరిష్కారాలు | 172 |
| 42. | విశాఖజిల్లా చింతపల్లిమండలం లమ్మసింగిలో పాండవులవిగ్రహాలు | 175 |
| 43. | అంబటూలరాజు-అన్నమూలదేవి వంశవృక్షం | 176 |
| 44. | నందిపదంలో మిత్రులు, శత్రువులు | 178 |
| 45. | నందిపదంలో ప్రదేశాలు | 180 |
| 46. | పాతపాడేరులో శివాలయం | 186 |
| 47. | బుడ్డపిల్లి, ఒడిసెల | 196 |
| 48. | కొండరెడ్ల విల్లంబులు | 199 |
| 49. | ఎక్కుబెట్టినవిల్లు | 202 |
| 50. | ఈతచెట్టుమీద పక్షుల గూళ్ళకు ఉచ్చెయ్యడం | 209 |
| 51. | విశాఖమన్యంలో రాజ్యాలు | 213 |
| 52. | విశాఖమన్యం వ్యవసాయంలో సమస్యలు(-), పరిష్కారాలు(+) | 222 |
| 53. | తోడేలు, నక్కబావ | 224 |
| 54. | కొండరెడ్లు | 225 |
| 55. | నందిపదంలో పాత్రధారులు, సూత్రధారులు | 226 |
| 56. | అడవిజంతువులు - ఊరజంతువులు | 226 |
| 57. | ఉత్పత్తి సంబంధాలు - న్యాయాలు | 227 |

58. తుడుము, చిన్నతుడుము, సన్నాయి 227
59. విశాఖగిరిజనులు 228
60. తేనెపట్టు 271
61. బెట్టుడతగూడు 282
62. రేచుకుక్క, కొన్‌రాసిగాడు 286
63. పాదువేట 287
64. సారుడుత వేట 296
65. ఔజం 322
66. మినుములూరులో మోదకొండమ్మపాదాలు 372
67. పాతపాడేరులో మాలగంగుపాదాలు 372
68. కొత్తపల్లిలో ముర్వలమ్మ 375
69. కొండవారి–దిగువవారి దృక్పథాలు 375
70. కొండరాజుల–దిగువరాజుల చుట్టరికాలు 376
71. మోదకొండమ్మ పదంలో ప్రదేశాలు 394
72. సొండవిల్లు 394
73. గూడెంపాతవీధిలో విగ్రహాలు 439
74. చెంచుల విల్లంబులు 432
75. అహోబలక్షేత్రం కళ్యాణమంటపంలో చెంచులక్ష్మి 449
76. భైరవగుహలోని బయన్న శిలారూపాలు 450
77. పక్షుల దర్బారు 470

*❋ జంతువుల బొమ్మలు – కుడుముల అంకన్న పెద్దమంతనాల, దోర్నాలమండలం*

*❋ చెంచుల జీవిత చిత్రాలు – పులిచర్ల గంగయ్య – చింతల, దోర్నాలమండలం*

***ముఖచిత్రం:*** *పండుగకు దేవతలను ఆహ్వానిస్తూ ఇంటిగోడలమీద వారిబొమ్మలు గీయడాన్ని విశాఖగిరిజనులు 'గన్నికలు వలచడం' (కన్యకలు వరించడం) అంటారు. సవరతెగవారు 'ఇడిసింగ్' అంటారు. నెమలిని అంబారీలో ఊరేగిస్తున్న ఈ సవరతెగవారి చిత్రం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థవారు సేకరించారు.*

*❋ విశాఖమన్యం ఫోటోలు పాడేరు ఆర్క్ స్వచ్ఛందసంస్థవారు తీసినవి.*

# మొదటి భాగం


| | | |
|---|---|---|
| 1. | తెలుగుగిరిజనులస్థానం - ప్రస్థానం | 3 |
| 2. | తెలుగు వనసీమలలో ప్రకృతి పురుషులు | 35 |
| 3. | దేశకాలాలు - రాగద్వేషాలు | 105 |
| 4. | పండుగపదాలు | 151 |
| 5. | స్త్రీపుంసయోగం | 239 |

# తెలుగు గిరిజనులస్థానం - ప్రస్థానం

'కొంత బలమూ, ప్రతాపమూ గలవారు కొండ ప్రాంతాలలోనూ, కొండలకు, కొండలకూ మధ్య లోయలలోనూ, సముద్రతీరపు పల్లపుప్రదేశంలోనూ చిన్నచిన్న రాజ్యాలు కట్టుకొని తమకు వశమైనంత దేశాన్ని పాలిస్తూవచ్చారు. ఈ రాజ్యాలను అన్నిటినీ జయించి శాశ్వతముగా ఒక్కమహారాజు అధికారాన ఉంచుకోవడం కష్టమే అయ్యేది. ఈచిన్న రాజులు తమకోటలు, కాకులు దూరని కారడవుల మధ్యా, కొండ కోనలలోనూ కట్టుకొనేవారు. అడవిదారులూ, కొండదారులూ ఆప్రాంతాన ఉన్నవారికే కాని ఇతరులకు తెలియవు. ఈ దొరలను కొండరాజులనీ, మన్నెరాజులనీ అనేవారు. వీరుఅందరూ విల్లమ్ములతో యుద్ధంచేయడంలో చాలా నేర్పరులు. పూర్వకాలములో యుద్ధముచేసే ఆయుధాలలో విల్లమ్ములే ముఖ్యమైనవి. ఏ మహారాజయినా వీరిని తాత్కాలికముగా జయించినా ఆట్టే కాలము వీరిని తనపాదాలక్రింద తొక్కిపెట్టి ఉంచ లేకపోయేవాడు. మళ్లీవారు స్వతంత్రులై తమ రాజ్యం పాలించుకొనేవారు. ఈ చిన్న చిన్న రాజ్యాలచరిత్ర మనకు ఏమీ తెలియదు.'

ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము. మల్లంపల్లి సోమశేఖరశర్మ. 1948. పుట 30.

✲ **వాచకం సర్వవాఙ్మయం**

ఏకత్వం - భిన్నత్వం

పలుకుబడి - ఆటపాటలు - సంస్కృతి

దృక్పథం - నుడికారం - సంస్కారం - కల్పన

✲ **మార్గ-దేశి సంప్రదాయాలు**

✲ **తూర్పుకనుమలు - తెగల సంస్కృతులు**

పరిసరం కరతలామలకమైనా - ప్రకృతి అగోచరమైన పంజరం

ఋతువులు - కార్తెలు; అక్షరజ్ఞానం - అక్షరగంధం

కొత్తపంట చేతికి వచ్చినప్పుడల్లా పండగే

ప్రకృతిలో భిన్నత్వం - సంస్కృతిలో వ్యక్తిత్వం

ఆశయాలు - అవసరాలు

✲ **తెలుగు గిరిజనుల ప్రస్థానం**

దండకారణ్యంలో గోదావరిమన్యానికి - పాలకుల వలసలు

చుట్టుముట్టిన సంతలు

✲ **విశాఖమన్యంలో సంస్థానాలు**

సంస్కృతీకరణాలు

పితూరీలు - ప్రభుత్వాలు

✲ **నల్లమల అడవులు**

## 'వాచకం సర్వవాఙ్మయం' [1]

పల్లెప్రజల సంప్రదాయంలో[2] వాఙ్మయం వెన్నవంటిది. సమాజవికాసంలో వాఙ్మయం రూపుదిద్దుకుంటుంది. చరిత్రగతిలో అలవరచుకున్న నేర్పులతో ప్రకృతిలోని వనరులను మలచుకుంటూ సమాజం ముందుకుసాగుతుంది. నాగరికతలోకి అడుగు పెడుతున్న గిరిజనజీవితం ఇంకా నేలవిడిచినసాముకాలేదు. జాతీయ ప్రయోజనానికై అడవిలో చాలాభాగాన్ని 'రిజర్వ్' చేయడం (ప్రభుత్వం విధించిన 'అడవికట్టు'), కలపవ్యాపారం పెరిగి గిరిజనులు కూలీలుకావడం ఇటీవలి పరిణామాలు. చారిత్రక విభాతసంధ్యలలో ఆటవికజీవితం ప్రకృతినుండి సంస్కృతికి సాగిస్తున్న ప్రస్థానం వారికళలలో రవళిస్తున్నది. తెలుగు జానపదజీవితపు ఈ తొలిదశను గిరిజనుల వాఙ్మయం (పలుకుబడి) సేకరించి అధ్యయనం చేయాలన్న సంకల్పం ఆచార్య శ్రీబిరుదురాజు రామరాజుగారు, వారికి స్ఫూర్తినిచ్చిన సురవరం ప్రతాపరెడ్డిగారి నాటిది.

**ఏకత్వం - భిన్నత్వం :**

ఉపమ, రూపకాదులతో పలుకుబడి వన్నెతేలుతుంటే,[3] నిత్యపల్లవశీలమైన ప్రాంతీయతతో సంస్కృతి పరిమళిస్తుంది. సుఖలోభం, నాయకత్వం జోడుగుర్రాలై జాతిని పరుగుపెట్టిస్తుంటాయి. పాతరాతియుగంనుండి సాగుతున్న ఈ పరుగులో ఐక్యతఎంతో, వివిధదేశకాలాల్లో విలసిల్లిన ఈ వారసత్వంలో భిన్నత్వం అంత.

**పలుకుబడి - ఆటపాటలు - సంస్కృతి :**

పనిలో వడినిపెంచే పాటలుగా - ఐకమత్యాన్నిపెంచే ఆటలుగా - ఆలోచనకు పదునుపెట్టే పొడుపుకథలుగా, ఆహ్లాదకరమైనకథలుగా సంస్కారాలను తరతరాలకు అందించుకోవడంలో శారీరకంగా మానసికంగా తనప్రతిభలన్నిటినీ ప్రతిదశలో మానవజాతి సద్వినియోగం చేసుకొంటున్నది. కారుమబ్బులో కాంతిరేఖవలె కష్టసుఖాలను అనుసరించిన యీకళారూపాలన్నీ జాతిజీవితపు లోతుపాతులకు కవ్వంపట్టేవే. ఏ అందాన్ని మీటినా ఆ సంస్కృతి నిలువెల్ల పులకించి మనోజ్ఞంగా నినదిస్తుంది.

## దృక్పథం – నుడికారం – సంస్కారం – కల్పన :

ఆయాపరిసరాలలో జీవనం, దానికనుగుణమైన విజ్ఞానంతోనిండిన అనుభవాలను బట్టి ఒకసంస్కృతి రూపుదిద్దుకుంటుంది. స్పందన, ప్రవర్తనలను ఒకఒరవడిలో నడుపుతూ, జాతిలో ఒకదృక్పథాన్ని పెంచుతుంది.[4] పరిసరము, మనస్సు ఇలా ప్రభావిత మౌతుంటే, ప్రకృతిని స్వాధీనంచేసుకోవడానికి కనుగొనే పరికరాలు, ఉపయోగించే నేర్పు, శ్రమవిభజన, నాయకత్వం, సమాజసంఘటన, ఇవన్నీ కలిసిన ఉత్పత్తి సంబంధాలతో సామాజికవ్యవస్థ మారాకువేస్తుంది. నుడికారంలో, దృక్పథంలో సంస్కారంలో మార్పుతెస్తుంది. జీవయాత్రకోసం కూర్చుకున్న ఎన్నోరకాల సాధన సామగ్రిలో–స్వయంగా కనిపెట్టినదికొంత, పరిచయంలోకివచ్చిన జాతులవల్ల నేర్చినది, ఆధారపడినది మరికొంత. ఈ సహజీవనంలోని అన్యోన్యతను, ఆదానప్రదానాలను వివిధపార్శ్వాలనుండి పరిశీలిస్తే ప్రతిఅంశం సంస్కృతికి మానదండమే. పండుగలు, ఆచారాలు, సాహిత్యం యీప్రగతిని సాంకేతికంగా, ప్రతీకాత్మకంగా వ్యక్తపరుస్తు ఉంటాయి. నిత్యజీవితానికి అద్దంపట్టడం, అందదుకులను చిత్రికపట్టడమే కాదు, సాహిత్యం; అందునా, గేయం ఒక్కొక్కమజిలీ దాటుకొనిపోయే సమాజపు కల్పనా సీమలను చుంబిస్తుంది. సుఖాన్వేషణలో ఎన్నటికీ తీరని దాహాన్ని సృజనాత్మకంగా మళ్ళిస్తూ, జీవితంలో ఆటుపోటులను మరిపించే ఆటపాటలతో తుళ్ళిపడే ప్రతిపల్లె ఒక గోకులం. ❊

## మార్గ–దేశి సంప్రదాయాలు :

పల్లెజీవితం ఎంతసమగ్రమైనా, అది ఆనాటినాగరికత గ్రామీణకోణం.[5] దేవాలయాలు, పంచాంగాలు, పండుగలు, పురాణాలు, తాత్త్వికచింతన, విశ్వాసాలతో సాత్త్వికారాధనంగా వర్ధిల్లే 'మార్గ' సంప్రదాయం ఒక ప్రక్కనా – బొఢ్రాయి, గరగలు, భీకరాకారంగల మాతృదేవతలు, బలులు, పూనకాలు, వీరగాథలు, వీరంగాలు, బోనాలు, కొలుపులు, జాతరలతో ఉద్రేకంగాసాగే 'దేశి'సంప్రదాయం ఒక ప్రక్కనా మనపల్లెలలో పరస్పరం అరమరికలులేకుండా మన్ననలుపొందుతున్నా, సాంఘికంగా వ్యక్తిఅంతస్థును నిర్ణయించడంలో అతని ఆరాధనవిధానానికికూడా కొంతపాత్ర లేకపోలేదు.

జానపదుల దేవతలకు గణాచారి ప్రతినిధి. దేవతలు ప్రకృతికంటే భావాలకు అధిపతులు. పల్లెజీవితంలో ప్రకృతికన్న వ్యవస్థ ప్రభావం మిన్న. చాలామంది వ్యవసాయకూలీలు, కౌలుదార్లు, సన్నకారురైతులు. పల్లెప్రజల శ్రమలన్నీ సంతలకే దారితీస్తాయి. సంతలోసోకులన్నీ వారిని ఊరిస్తాయి. మనసుకు గిలిపెట్టే ఆమోజులు, ఎప్పుడూ సలిపే తరతమభావాలు, చాలీచాలనిసంపాదన, ఎడతెరిపిలేని పనిపాటులు, ఆసామివల్ల మానావమానాలు నిత్యకృత్యాలు. మట్టికి – మనుగడకు ఉన్న అనుబంధం ఎంత పటిష్టమైనదైనా, ప్రకృతిమీద భక్తికంటే ఆస్తిమీద మమకారం ఎక్కువ. ధనస్వామ్య సమాజం కాబట్టి వాణిజ్య పంటలను వేస్తాడు. ధనికుడిని కావాలని తంటాపడతాడు. కలిసివస్తుందేమోనని గ్రహచారాన్ని సంప్రదిస్తుంటాడు. అతని నైతికనిష్ఠయే ఆవ్యవస్థకు శ్రీరామరక్ష. మరింత న్యాయంకోసం ప్రాకులాడతాడేగాని తిరగబడడు. అభిజాత్యం, ఆర్థికస్థాయి, గౌరవప్రతిష్టల అహంవల్ల సమాజంలో అంతరాలు పెరుగుతుంటాయి. కుటుంబంలో సంపద పెరిగినకొద్దీ స్త్రీ స్వాతంత్ర్యం అడుగంటిపోతుంది. వ్యవసాయం చుట్టూ అల్లుకున్న వృత్తులు, కులాల రూపంలో విడిపోతాయి.

ఈ కులాల తేడాలున్నా, జానపదసంప్రదాయంలో ఆరాధన, ఆటపాటలు ఒక్కటే. అందువలన జానపదసంగీతం, నృత్తరీతులు నైపుణ్యాలలో ప్రాదేశికముద్ర, ఏకసూత్రత అనుస్యూతంగా ఉంటుంది. ఆర్థికమైనఅంతస్తు, కులాలహెచ్చుతగ్గులవల్ల ఆటపాటలలో అందరూ పాలుపంచుకోలేరు. కొందరు ప్రేక్షకులుగానే మిగిలిపోతారు. గేయం–

*బొఢ్రాయి, గరగలు, మాతృదేవతలు, బలులు, పూనకాలు, వీరగాథలు*

నృత్తగతులలో లయబిగువుతగ్గి ఆత్మాశ్రయత, రాగచ్ఛాయలు, అభినయ ధోరణులు అంకురిస్తాయి. పంటభాగ్యాలుగల సమాజం కాబట్టి అన్ని వృత్తులవారు తమపనిలో నైపుణ్యం, కళలోప్రావీణ్యం చూపిస్తారు. గేయగాథలు వినిపించడం, వినోదాలను ప్రదర్శించడం బ్రతుకుతెరువుగా చేసుకొని ఊరూరాతిరిగేందుకు కళాకారులకు ఆస్కారంకలుగుతుంది. కళలపేరిట కొత్తకులాలు ఏర్పడతాయి.అయినా బస్తీసరదాలంటే మక్కువ. వాటిని అనుకరించడంలో ఆనందం ఆధిక్యత.

మన పల్లెలకు వ్యవస్థ, నాగరికత బొమ్మా బొరుసువంటివి. వ్యవసాయం దాని ముడిపదార్థం. కృత్రిమవిలువలతో (బంగారం, నాణేలు) వ్యాపారం దాని చలామణిని నిర్ణయిస్తుంది. దగ్గర ఉన్న పల్లెలు, నగరాలు పరస్పరం ప్రభావితమైతే దూరాల్లో ఉన్న కుగ్రామాలు రాకపోకలు కష్టమై అవసరాలు, అందుబాటు తక్కువ కావడంవల్ల ఒక విధమైన సర్దుబాటు, సంతృప్తి, స్వాతంత్ర్యం కలిగి ఉన్నట్లు కనిపిస్తాయి. కాని ఉత్పత్తి విధానాలలో మార్పులు త్వరగా రాక, పాడిపంటలు అభివృద్ధికాక, అజ్ఞానం, దైన్యం, అసంతృప్తి వెనుకతాండవిస్తూనే ఉంటాయి. భూస్వామి జులుం భరిస్తూ, వెట్టి చేస్తూ సుఖమూ, శాంతిలేని జీవితానికి జనం అలవాటుపడతారు. వ్యవసాయం, నాగరికత వైపు పురోగమిస్తున్న కొద్దీ చోటుచేసుకునే పరిణామాలివి. ❉

## తూర్పుకనుమలు – తెగల సంస్కృతులు :

భారతీయసంస్కృతి ప్రపంచంలోని తొలిసంస్కృతులలో ఒకటి. ఈసంస్కృతి ప్రసారానికిలోనైనప్పటికి, ప్రకృతిసహజమైన హద్దులవల్ల తమ ప్రత్యేకతను నిలుపుకొన్న ప్రాంతాలు చాలాఉన్నాయి. ఈ పరిస్థితులను మనఇతిహాసాలుకూడా చిత్రించాయి. తూర్పుపడమటితీరాలమధ్యలో ఎన్నోకొండలు, పీఠభూములు; వాని మధ్య ఎన్నో అడవులు. వీనిలో ప్రధానమైన వింధ్యశిఖరాన్ని దాటిరావడం ఆగస్త్యునివంటి దృఢవ్రతునికిగాని సాధ్యపడలేదు.



తూర్పుతీరానికి సమాంతరంగావిస్తరించిన తూర్పుకనుమలు ఎక్కడికక్కడ కొండలతో చెల్లాచెదురుగా విడిపోయి మధ్యమధ్య విశాలమైన లోయలు, చరియలు, బయళ్ళతో, పర్వతాలుపరిపాలించే అటవీసామ్రాజ్యాలవలె ఉంటాయి.[6] ఇలా విశిష్టమైన వాతావరణంతో నిండిన ప్రతిభూభాగంలో ఒకతెగ – వారికొక భాష – జీవనవిధానం గల ఈ కనుమలు, అరవైకి పైగాగల తెగలకు నెలవులు. చరిత్రలో దండయాత్రలు ఎక్కువగా దక్కన్‌పీఠభూమి మీదుగా వచ్చినవేకాని, దురాసదమైన తూర్పుకనుమల మీదుగా జరిగినవికావు.

మన దేశచరిత్రలో ప్రముఖపాత్రవహించిన ఆటవిక రాజ్యాలు, మన సాంస్కృతిక చైతన్యాన్ని ప్రభావితంచేసి తామూప్రభావితమైనాయి. ఈ ప్రభావంలోని ఎన్ని విశేషాలకు భావిపరిశోధనలు వెలుగు చూపాలో! చిరకాలం వనవాసం, అజ్ఞాతవాసం చేసిన మానవకథ వికాసవైఖరులు ఎన్నో!

**పరిసరం కరతలామలకమైనా – ప్రకృతి అగోచరమైన పంజరం :**

వనవాసులు, మైదానాలలో ఉన్ననాగరికులకే కాదు, తమలో తమకే ఒకతెగకు మరొకతెగ ఎరుకలేనందున, తమ ప్రాంతంలో వేరొకజాతిపొడలేక బ్రతుకుతున్నందున పెరిగే 'అహం' వల్ల, కాలక్రమేణ వలసవచ్చిన జాతులతో ఆచారాలు కలువక, బాంధవ్యాలు జరగనందున, ప్రతితెగలో శారీరకమైన జన్యుసంబంధమైన ప్రత్యేకతలు కొనసాగుతూ వస్తాయి. ఆప్రాంతంపైన భక్తి, భయము, మమకారము, వదలిపోలేని పిరికితనం, వారి భావజాలంలోఆయువుపట్లు. తరువాతకాలంలో ఉత్పత్తిసాధనాలు వ్యవస్థ, ఏ మార్పుతెచ్చినా ఈభావాలను మరింతబలపరిచినవే. వారివిజ్ఞానం, మతం, కళ,దృక్పథం,కట్టుబాట్లన్నీ ప్రకృతియొక్క ఆలవాలంలో వేలయేండ్లుగా వేళ్ళుదన్నుకొని ఉన్నాయి. "ఉన్నఊరు వాడికి కాటిభయం–పొరుగూరివాడికి నీటిభయం" అని జానపదుల సామెత. ప్రకృతిలో ప్రమాదానికిగల అవకాశం కొత్తవాడిని భయపడితే; ఊరువాడికి, పగలు, పాతశత్రువులు, దుర్మరణాలు ఆయాస్థలాలలో గుర్తుకువచ్చి ఆ భూతప్రేతాలు తనను వెన్నాడుతాయేమోనన్న హృదయశల్యాలవంటి అనుభవాలు కలతపెడుతుంటాయి. గిరిజనుడికి ప్రకృతికూడా భయప్రదమే. ఏ పొదలో పురుగుపుట్ర తారసపడతాయో! ఏ చెట్టుఆకులు, చెలమనీళ్లు ఎటువంటివో! అవసరానికి ఎక్కడ

దొరుకుతాయో! ఏ వాగున, వంకన, మొక్కవలసిన ఆచారాలు ఎరుగక, ఏ దేవతల కోపాలకు తనుబలికావాలో! ఏ మనుషుల హింసాత్మకమైన ఆచారాలకు తను ఎరకాగలడో! ఈసందేహాలతో, నెలవులేనిచోట మసలనొల్లక, ఉన్నచోటనే తాబేలువలె ముడుచుకొని బతికే మనస్తత్వం వారిది. పరిసరం కరతలామలకమైనా, ప్రకృతి అగోచరమైన పంజరం. కౌతుకంఉన్నా పొట్టకు అవసరంలేని సాహసంయెడ ఉపేక్ష. ఆశలున్నా అవసరాన్ని మించనికృషి, 'పిట్టనుకొట్ట – పొయిలోపెట్ట'. ఏపూటకాపూటే పొట్టతిప్పలు. దాచుకొనే అవకాశం తక్కువ.

**ఋతువులు – కార్తెలు; అక్షరజ్ఞానం – అక్షరగంధం :**

వనవాసులకు ఋతువులు – కాలాలు తెలుసు, కార్తెలు ముహూర్తాలు తెలియవు. జానపదులకు అక్షరజ్ఞానం లేదు – గిరిజనులకు అక్షరగంధమేలేదు. గ్రామంలో పూజారితనం, ఒకేకుటుంబంలో సంక్రమిస్తున్నా, ఆతంతులో అందరూ పాల్గొంటారు.

'కష్టపడకపోతే కలిసిరాదు' అన్న వాస్తవిక దృష్టి గలవారైనా, దేవతలు కోపగిస్తే బ్రతికిబాగుపడలేము అనేభయంతో, దారికడ్డం రావద్దని దేవతలకు మొక్కుతుంటారు. అడవి అంతా దేవతలది. పండుకోసినా, వేటతెచ్చినా, తేనెతీసినా, కల్లుగీసినా, పోడుచేసినా, వారిరూపాలైన కొండకోనలకు, వాగువంకలకు, జంతుజాలానికి, క్రిమికీటకాదులకు విన్నవించి మన్ననలు చెల్లించుకోవాలి.

**కొత్తపంట చేతికి వచ్చినప్పుడల్లా పండగే :**

గిరిజనగ్రామం ఒకకుటుంబవ్యవస్థలాంటిది. వావివరుసలకు ఇంటిపేరో, కులచిహ్నమో ప్రాతిపదిక. చుట్టూ అడవిఅంతా గ్రామానిదే. వేరే గ్రామంవారు వేట మార్గాన గడిదాటి వచ్చినా స్థానికులకు వాటాఇవ్వాలి. సాగుకోసం అడవిని శక్తినిబట్టి నరుక్కోవచ్చు. నరుక్కున్నమేర వారిసొంతమే. పూర్తిగావ్యవసాయదారుడైన జానపదుని ఆత్మీయత పొలానికి పరిమితంకాగా, వేట, ఆహార సేకరణలు ప్రధానజీవనాధారమైన గిరిజనుడిపరిధి మరింతవిశాలం. ఊరిమధ్య చెట్లఫలసాయం అందరిదీకాగా, చుట్టూ ఉన్నచెట్లు ఆయా కుటుంబాలవికావచ్చు. కొత్తపంట చేతికి వచ్చినప్పుడల్లా పండుగే. ఏ కూలీకైనా భోజనమే బహుమతి. వ్యవసాయోత్పత్తులు నిలువచేసుకొనే అవకాశం పెరిగి అసూయలు రగులుతున్నా, ఇచ్చిపుచ్చుకునే మొహమాటంలో లాభంమీద ఆశలేదు. అబద్ధాలఊసులేదు. దొంగిలించవలసిన సంపదలేదు. కొత్తజాతులవలసలు

పెరిగి వర్ణాలు ఏర్పడతాయి కాని, వర్గాలులేవు. శ్రమవిభజన వయోలింగభేదాన్ని అనుసరించి. ఆడమగ సమంగా కష్టించే వారిలో ఇష్టమైన మనువును నిరోధించే శక్తి ఎవరికీలేదు. ఆడవారుకూడా సంతలలో సరదాలలో మగవారితో పోటీపడుతుంటారు. అక్కడ సామెతశాస్త్రం, యౌవనం వినోదం, ఆటపాటలే అమ్మవారికి మేలుకొలుపులు.

## ప్రకృతిలో భిన్నత్వం - సంస్కృతిలో వ్యక్తిత్వం :

అనేకజాతులు కాలక్రమేణ వలసరావడంలో ఒకదారీ, ఒరవడి ఉంటాయి. వారు స్థానికులతోకలవడం కుదరకపోతే వేరేగ్రామాలుగానో, వీధులుగానో కుదురుకుంటారు. ఆయాజాతులు వ్యాపించడంలో వారివారి శక్తియుక్తులకు, మనస్తత్వానికి తగిన విన్యాసం ఉంది. ఈ అన్యోన్యతలో ఇంతచక్కని అమరికకు అచటి జంతువుల, వృక్షాల, ఆహారవిహార సంబంధాలలో ఉన్న క్రమబద్ధత, ఒజ్జబంతి కావచ్చు. కానీ ఆస్థావర జంగమాలలోలేని నైతికవ్యవస్థ, సాధనసంపత్తి ఈ సమాజాల ప్రత్యేకత. అదేగదా సంస్కృతి!

తమ నేర్పులగూర్చి, ఆచారాలగూర్చి, అభిజనాన్నిగూర్చి ఏకులంవారి అతిశయాలు వారికి ఉంటాయి. అప్పుడప్పుడు మనసు నిలుపుకోలేని జంటలు ఈ ఉక్కుచట్రాన్ని చీల్చుకొని ఎగిరిపోతూనే ఉంటాయి. కాని అంతరాలు అస్పృశ్యతలవల్ల, భాషా భేదంవల్ల, పాటలు ముఖ్యంగా ఆటలలో అంతగాకలిసిపోలేరు. తేనె, నూనెలవలె తమ ప్రత్యేకతవదలని యీకళలలో ప్రాదేశికమైన ఏకత్వంకంటె జాతిగతమైన వ్యక్తిత్వం ఎక్కువ. ప్రకృతి ఒక్కటైనా స్పందించే తెగల దృక్పథాలబట్టి కల్పనలు పలుకుబడులు, కవిసమయాలు, శైలి, నవరత్నమాలికలో కదలాడే లావణ్యంవలె వన్నెల జిలుగులొలుకుతాయి. సాంఘిక, ఆర్థిక వ్యత్యాసాలుపెరగని ఈ తెగలలో లయాన్వితమైన బృంద గానానికి ప్రాచుర్యం ఎక్కువ.

నాగరికమైన అవసరాలు పెరగనంతకాలం ఆర్థికదృష్టిరాదు. ఆస్తితోగాని వ్యత్యాసాలు ఏర్పడవు. ఉత్పత్తి అధికమైనపుడుగాని వ్యాపారానికి దారులు ఏర్పడవు. ఈ తాకిడులకు దూరంగా ఉన్న సమాజంలో లాభాపేక్షకంటె పరస్పర అవగాహనతో సహకరించుకోవటం ఎక్కువ. జానపదుడు బహువిధమైన కళాపరివారంమధ్య సమన్వయశక్తితో అభినయించి, నాగరికప్రేక్షకుల మన్ననలనాశించవలసిన నటుడు.

గిరిజనుడు ప్రకృతిస్తన్యంవదలని పసివాడు. 'పిట్టగూడు – పిల్లభాష' వలె తను కుటుంబంచుట్టూ తిరిగినా, తామంతా సంస్కృతిలో తిరుగుతున్నా, ఆ ప్రకృతి పరిధిలోనే. దాని పరిభాషదానిదే. ఈ గమనాన్ని నిర్ణయించే కేంద్రాలు ఎక్కడో నాగరిక లోకంలో ఉండవు.

**ఆశయాలు – అవసరాలు :**

కాని నాగరికత ఆశయాలు ఎంత ఉన్నతమో, దానిఅవసరాలు అంత విస్తృతం. అది విస్తరిస్తున్నకొద్దీ దూరాలు దగ్గరౌతాయి. కొండలు తలలు వంచుతాయి. వ్యవస్థల, దృక్పథాల సరిహద్దులు చెరిగిపోతాయి. చరిత్ర కొత్తమలుపులు తెస్తుంది. దాని అడుగు జాడలకోసం తెలుగుదేశపు అడవుల్లో ప్రామాణికమైన అన్వేషణ జరగకపోయినా, ఒక సమగ్రదృష్టికోసం వివిధసంఘటనలను క్రోడీకరించడం అవసరం. ❊

## వ్యవస్థలు

| తెగలు | జానపదులు | నాగరికులు |
|---|---|---|
| దేశిసంప్రదాయాలు | మార్గ, దేశి సంప్రదాయాలు | ప్రపంచీకరణ |
| వస్తుమార్పిడి | సంతలు | నాణేలు – బంగారం |
| అక్షరగంధం లేదు | అక్షరజ్ఞానం లేదు | రాతకోతలు–లావాదేవీలు |
| ఋతువులు | కార్తెలు (పంచాంగం) | కాలెండర్ |
| గణరాజ్యాలు(కులకట్టు) | రాజ్యం | పరిపాలన |
| తప్పు, వెలి | కారాగారశిక్ష | కారాగారశిక్ష |



ఆంధ్రప్రదేశ్
ఒరిస్సా
కోరాపుట్
శ్రీకాకుళం
విజయనగరం
పాడేరు
విశాఖపట్నం
బంగాళాఖాతం
తూర్పుగోదావరి
రాజమండ్రి
కాకినాడ
నారాయణపూర్
జగదల్‌పూర్
ఛత్తీస్‌ఘడ్
భద్రాచలం
కొత్తగూడెం
ఖమ్మం
పశ్చిమగోదావరి
విజయవాడ
గుంటూరు
కృష్ణానది
చందా
కరీంనగర్
వరంగల్
ఉట్నూరు
ఆసిఫాబాదు
అదిలాబాదు
నిర్మల్
గోదావరినది
నిజామాబాదు
హైదరాబాదు
శ్రీశైలం
అమరాబాదు
మహబూబ్‌నగర్
కర్నూలు
మహారాష్ట్ర
కర్ణాటక

## ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనప్రాంతాలు




**తెలుగు మాతృభాషగాగల తెగలు**

| | | 1991లో జనాభా | అక్షరాస్యత శాతం |
|---|---|---|---|
| 1 | కొండరెడ్లు | 76,391 | 17.92 |
| 2 | బగతలు | 1,09,686 | 22.18 |
| 3 | కొండదొరలు | 1,79,334 | 14.96 |
| 4 | వాల్మీకులు | 55,836 | 39.87 |
| 5 | కొండకమ్మరులు | 44,613 | 18.08 |
| 6 | చెంచులు | 40,869 | 24.90 |
| 7 | యానాదులు | 3,95,739 | 14.78 |

## తెలుగు గిరిజనుల ప్రస్థానం :

బ్రాహ్మణాలలో, పురాణాలలో ప్రస్తావించబడిన జాతులు నేడు గుర్తించడం కష్టం. ఐతేరేయబ్రాహ్మణం మూసీనది ఒడ్డున అనాగరికంగా బతుకుతున్న 'మూతిబు'లను పేర్కొన్నది. వాయుపురాణం, కళింగదేశాన్ని ఆశ్రమ ధర్మాలులేని అపవిత్రభూమిగా భావించింది. బోధాయనుడు కళింగదేశంలో ప్రయాణిస్తే ప్రాయశ్చిత్తం విధించాడు.[7]

తెలుగుదేశంలోని అటవీప్రాంతాలను మన్నెకొట్టాలని, సముద్రతీరప్రాంతాలను బోయ కొట్టాలని పిలిచేవారు.

నేడురాష్ట్రంలోని మన్యప్రాంతంలో విశాఖజిల్లాలో బగత, కొండదొర, కొండకాపు, వాల్మీకి, కమ్మరి; ఉభయగోదావరులు, ఖమ్మంజిల్లాలలో కొండరెడ్లు; నల్లమల్ల అడవులలో చెంచులు, తెలుగుమాతృభాషగాగల తెగలు. బోయకొట్టాలలోని యానాది తెగ మాతృభాష తెలుగే కాని కొండప్రాంతాల తెగలకే ఈ పరిశోధనను పరిమితం చేసినందున వారిని కలుపుకోలేదు. వి.శేషగిరిరావు అవరగళ్ వ్రాసిన 'ది నోట్ అన్ రంపఏజన్సీ (1931)' ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త క్రిష్టఫ్‌వాన్‌హెమెండార్ఫ్ చెంచులలో, కొండరెడ్లలో ఐదేండ్లు గడిపి 1945లో ప్రచురించిన 'ది చెంచూస్ ఆఫ్ హైదరాబాద్', 'ది రెడ్డీస్ ఆఫ్ బైసన్ హిల్స్', ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బగతలగూర్చి శ్రీమునిరత్నంరెడ్డి సిద్ధాంతగ్రంథం, ఇవే 1982 వరకు వెలువడిన ఆధార గ్రంథాలు. హెమెండార్ఫ్ రచనలలో, మానవ ప్రగతిలో కీలకమైన విశేషాలగూర్చిన సూక్ష్మమైన పరిశీలన, విచారణ పరిశోధకులకు దారిచూపిస్తున్నాయి. వర్ణనాత్మకంగాసాగిన రత్నంరెడ్డిగారి గ్రంథం విశాఖమన్యంలో సంస్కృతీకరణాన్ని వివరంగా చిత్రించింది.



బాంబూ ఆఫ్ దండకారణ్య. విసూకాలే (1993)

# రంప - గూడెం (1880)


విశాఖపట్నం
గూడెం
రంప
గోదావరి
గోదావరినది
రాజమండ్రి
భద్రాచలం
చింతపల్లి
సబాల్టర్న్ స్టడీస్ I - డేవిడ్ ఆర్నాల్డ్ పుట 92

# రంపరాజ్యం (1931)




**గుర్తులు**




నోట్ ఆన్ రంప ఏజన్సీ,
ఈస్ట్‌గోదావరిడిస్ట్రిక్ట్,
శేషగిరిరావ్ అవర్‌గళ్.
ఎక్స్ట్రా అసిస్టెంట్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్.
గవర్నమెంట్‌ప్రెస్ 1931.

| | |
|---|---|
| 1 | పాతకోట |
| 2 | గుర్తేడు |
| 3 | ఎడ్లకొండ |
| 4 | దారగెడ్డ |
| 5 | ఇర్లవాడ |
| 6 | పుల్లంగి |
| 7 | దేవరవాడ |
| 8 | చవల |
| 9 | వక్కులూరు |
| 10 | వక్కలేటివాడ |
| 11 | బోదులూరు |
| 12 | కుట్రవాడ |
| 13 | మారేడుమిల్లి |
| 14 | పెనికిలపాడు |
| 15 | నూరుపూడి |
| 16 | దేవరపల్లి |
| 17 | గెడ్డవాడ |
| 18 | దారవాడ |
| 19 | కొండమొదలు |
| 20 | తున్నూరు |
| 21 | గొందూరు |
| 22 | కొత్తపల్లి |
| 23 | కచ్చులూరు |
| 24 | ఎర్రమెట్ల |
| 25 | మంటూరు |
| 26 | దేవీపట్నం |
| 27 | రమణయ్యపేట |
| 28 | వెలగపల్లి |
| 29 | చోడవరం |
| 30 | రంప |
| 31 | తాళ్లపాలెం |
| 32 | వెలమలకోట |
| 33 | సిరిపురం |
| 34 | గుంజిగూడెం |
| 35 | సిరిమెట్ల |
| 36 | రవ్వగడ్డ |
| 37 | దారవాడ |
| 38 | పెరికవలస |
| 39 | నులకమద్ది |
| 40 | రామవరం |
| 41 | రాయపల్లి |
| 42 | దుచ్చెర్తి |
| 43 | దుప్పులపాలెం |
| 44 | భీమవరం |
| 45 | వేటమామిడి |
| 46 | మట్లపాలెం |
| 47 | మోహనాపురం |
| 48 | పంద్రప్రోలు |
| 49 | చుప్పరపాలెం |
| 50 | వూట్ల |
| 51 | సీతపల్లి |
| 52 | గోకవరం |
| 53 | కొత్తపల్లి |
| 54 | ముల్లేరు |
| 55 | పిడతమామిడి |
| 56 | వేములోవ |
| 57 | తిమ్మాపురం |
| 58 | ఏలేశ్వరం |
| 59 | అన్నవరం |
| 60 | పులిగోగులపాడు |
| 61 | బొర్నగూడెం |
| 62 | జడ్డంగి |
| 63 | ఎల్లవరం |
| 64 | అడ్డతీగల |
| 65 | కోనలోవ |
| 66 | లాగరాయి |
| 67 | అనంతగిరి |
| 68 | రాజవొమ్మంగి |
| 69 | శరభవరం |
| 70 | బోయపాడు |
| 71 | కొయ్యూరు |
| 72 | కృష్ణదేవిపేట |

**దండకారణ్యంలో గోదావరిమన్యానికి - పాలకుల వలసలు :**

దండకారణ్యం అంచునగల రాజమహేంద్రవరం ఒకనాడు రెడ్డిరాజ్యానికి రాజధాని. 14వ శతాబ్దిలో పోలయ, కాపయ, అనపోతానాయకుల ప్రతాపానికి నిలువలేని రాజమహేంద్రవరం రెడ్డిరాజపరివారంలో పల్లాల, కత్తుల, కారుకొండ మొదలైన ఇంటిపేర్లుగల కొందరు, నేటి పశ్చిమగోదావరిమన్యం రెడ్డిపోలవరంసీమలో కోటనాగవరంలోకి కొందరు, 'చిలువూరి' మన్యంలోని కొరుటూరు, టేకూరు, శివగిరి ప్రాంతాలు, గోదావరిదాటి, కారుకోడి మన్యంలోని పాపికొండలమొదటగల గ్రామం కొండమొదలు, గుజ్జు మామిడివలస, 'చవల'మన్యంలోని బోదులూరు కానివాడ, బొడ్లంకలలోకి చొచ్చుకు పోయారు. ఈ మన్యంలో 'పన్నెండుముఠాలకు నల్లగవర్నర్లు పల్లాలవారు'. తమ గురువులు జంగాలనుకూడా వెంటతెచ్చుకున్నారు. ముఠాదార్లంటే మన్యంలో పదిపన్నెండు గ్రామాలకు జమీందార్లవంటివారు. బాంధవ్యాలతో తెలుగు గిరిజనులలో కలిసిపోయిన వీరందరికీ కొండరెడ్లు అనే పేరువచ్చింది. రాజమహేంద్ర వరం, కోరుకొండ, రామగిరి, పోలవరాలకు ఆనతిదూరంలోఉన్న స్థానికులైన కొండజాతి, గోధనం తమకు లేకనో, గోమాంసనిషేధం తమగౌరవం పెంచుతుందనో పాటించిఉండవచ్చు. అంతేకాక కోయలకు ఇష్టమైన గురగేదెలనుకూడా వీరు తినరు. తరువాతవచ్చిన పాలకవర్గాలతో కలిసిపోవడానికి భాషతోపాటు ఈ ఆచారసామ్యం కూడా అవకాశం ఇచ్చింది. స్థానికమైన తెలుగుజాతిని 'కావి'వారుగా, వలసవచ్చిన వారిని, ప్రత్యేకంగా పల్లాలవారిని, రెడ్లుగా, ఇప్పటికీ పెద్దలు ఎంచుతుంటారు.

సీలేరునది ఆవలప్రాంతం ఝూడ్‌ఖండం - జాడిదేశం. జాడిదేశంలో బెజ్జగివాడ నుండి (నేడు ఒరిస్సా) గురితేడు వలసవచ్చినవారు కన్నమరాజు - ఆయన పరివారం. రాచవారమని వారిఅతిశయం. కాని, వారుకూడా కొండరెడ్లతో వియ్యమంది రెడ్లుగా మారారు.

19వ శతాబ్దిలో అడ్డతీగలమీదుగా దుచ్చెర్తికి గుమాస్తాలుగాచేరిన చక్కావారు బహుశా ప్రక్కన మెట్టప్రాంతాలనుండి వచ్చారు ముఠాదార్లైనారు. విశాఖమన్యం గొలుగొండ సంస్థానంలోని గురితేడు, దుచ్చెర్తి ముఠాలను 1890లో బ్రిటీష్ ప్రభుత్వం గోదావరిజిల్లాలో కలిపింది. వీరూరెడ్లతోకలిసిపోయారు. ఇలావలసలన్నీ వ్యవసాయానికి అవకాశంగల లోయలు, పల్లపు భూములలోనే ఉన్నాయి.

*రెడ్డిపోలవరం, చిలువూరిమన్యం, కారుకోడి మన్యం, జాడిదేశం, చవల, బోనుసీమ*

ఇక్కడి వ్యవసాయపు పనులకు ఆకర్షితులై అప్పటికే జాడిదేశంలో భూస్వాముల రాచరికపు వెట్టికి విసిగిపోయిన కాపులు, కమ్మరులు అటు విశాఖజిల్లాలోకి, ఇటు దారకొండ, గురితేడుమీదుగా తూర్పుగోదావరిలో మారేడుమిల్లి, యార్లగడ్డ రామవరాల వైపు వ్యాపించారు.

కాకతిప్రోలయరాజుచేతిలో క్రీ.శ.1030లో పరాజితుడైన చక్రకూటరాజు నాగ వంశీయుడు భీమమహీవతి. మల్కనగిరి, కుంట, శబరి, గోదావరితీరాలమీదుగా నేడు తూర్పుగోదావరిజిల్లాలోని దేవీపట్నంప్రక్కన తొయ్యేరు చేరారు. (అంతకు మునుపు వారుకొంతకాలంఉన్న గండవాడ ఎక్కడిదో తెలియదు) ఎగువన రేకపల్లి ప్రధాన స్థానంగా, ప్రస్తుత భద్రాచలం, పాలవంచ ప్రాంతాలను ముసునూరు ప్రోలయ పాలిస్తున్నాడు. క్రీ.శ.1323లో ముసునూరు కాపయనాయకుని ప్రతినిధి అనపోతా నాయకుని చేతిలో ఓడిన ఈ నాగవంశీయులు, తొయ్యేరువదలి చోడవరం ప్రక్కన రంపరాజధానిగా 1880వరకు పాలించారు. 1880లో ఈ రంపరాజ్యం పూర్తిగా బ్రిటిష్ ప్రభుత్వంలో కలిసిపోయింది. పరాజితులైన రాజులు వచ్చినదారినే బస్తరు ప్రాంతాల ఆదివాసులు, కోయలు ఈప్రాంతాలకువలస సాగించారు. వీరీప్రాంతాలను ఆక్రమిస్తున్న కొలదీ, నాటి స్థానికతెలుగుతెగ మరింతగా కొండలలోపలికి ముడుచుకున్నారు. బస్తరు ప్రాంతంనుండి వలసవచ్చిన కోయతెగ, పోడు, చెలక వ్యవసాయాలలో నిపుణులు. అందుకే మన్యంలోని దిగువ ప్రాంతాలలో స్థిరపడ్డారు. వేరేభాష, పశుమాంసం అలవాటువల్ల వీరు కొండరెడ్లుగా రూపొందుతున్న స్థానికతెగతో వియ్యమందలేక పోయారు. కాని తమ ప్రాబల్యంగల చోట ముఠాదార్లుగా రాజకీయమైన అధికారం సాధించుకున్నారు.

**చుట్టుముట్టిన సంతలు :**

కాలక్రమేణ వలసవచ్చిన పల్లాలవారు, గురితేటివారు (కన్నమరాజు వగైరా), చక్కావారు, రంప, గొలుగొండ సంస్థానాల ఏలుబడిని తలదాల్చినవారే. వివిధ ప్రాంతాలలో నెలకొన్న ఈ ముఠాదారులందరితో వార్తా సంబంధాలకు, పన్ను వసూళ్ళకు, సంస్థాన మర్యాదలకు, వ్యవసాయోత్పత్తుల రవాణాలకు యంత్రాంగం కావలసివచ్చింది. ఈ అవసరాలను పూరించినవారే మాలలు లేక వాల్మీకులు. దిగువప్రాంతాలనుండి శృంగవరపుకోట, వడ్డాది, మాడుగుల గొలుగొండ, గూడెం,

*చక్రకూటం, రేకపల్లి, తొయ్యేరు, రంప, గూడెం, గొలుగొండ, మాడుగుల*

దారకొండ, గుర్తేడు అటు దుచ్చెర్తి, ఇటు రంపచోడవరంవరకు వీరు వ్యాపించారు. సంస్థానాలలో, గ్రామాలలో కోలగాండ్లులేక బారికలుగా(గ్రామనౌకరు), మన్యమంతటా వ్యాపారులుగా, వ్యవసాయదారులుగా అల్లుకుపోయిన వీరిరాకతో రాజరికం, భూస్వామ్యం, వ్యవసాయం, కమ్మరం, వ్యాపారం విస్తరించి గిరిజనప్రాంతం తన ఒంటరితనాన్ని కోల్పోయింది. సంతలు చుట్టుముట్టాయి. గిరిజనులు జానపదులైనారు.

కోయలు, వాల్మీకులు, కమ్మరులు, గోమాంస నిషేధం పాటించనందువల్ల రెడ్లకు దూరంలోనే ఉండిపోయారు. నాగరికులైన వాల్మీకులకంటె, మరోమన్యంనుండి వచ్చిన (బస్తరు) కోయలే రెడ్లకు సన్నిహితులు. భూమిబలంకోసం చేసే పండుగలు, చెడుపు చిల్లంగులు, వేట, పోడులలో వారు రెడ్లకు పెద్దన్నలు. ఇద్దరూ గిరిజనులు కావడం వారి సహజీవనానికి మరోకారణం. కోయలుకూడా రెడ్లతో వ్యాపారం చేస్తారు. రాజకీయ కారణాలతోపాటు వ్యాపారం వ్యవసాయాలలో పోటీవస్తుందని కావచ్చు, కోయలు అధికంగాగల ప్రాంతాలలో వాల్మీకులు వ్యాపించలేదు.[8] ❊

## విశాఖమన్యంలో సంస్థానాలు :

నిటారుగా దిగే లోయలు, చుట్టుముట్టిన కొండలు ఉభయ గోదావరులవికాగా, విశాఖమన్యంలో విశాలమైనబయళ్ళు, వాలుగాదిగే కొండచరియలు, అత్యధిక వర్షపాతం, పెద్దసంస్థానాలైన విజయనగరం, జయపురం ప్రభావంలోగల మాడుగుల, గొలుగొండ, కాశీపట్నం జమీందారీల ఏలుబడిలో వలసలు వేగంగాపెరిగాయి. తెలుగులు విస్తరిస్తున్నకొద్దీ కుయిమొదలైన మాతృభాషలుగల గిరిజనులు వెనుక కొదిగారు. వీరందరూ కొండచరియలకు బలమైనగట్లుకట్టి, వాగులను మలిపి కోట పొలాలనుండి పల్లపునేలలవరకు, పోడువ్యవసాయంనుండి పిప్పలి, అల్లం, అనాస, పసుపు, అడుసులువంటి వాణిజ్యపంటలవరకు యధావకాశంగా వ్యవసాయం విస్తరింపచేశారు.

### సంస్కృతీకరణాలు :

నలుదిక్కులనుండి వలసవచ్చినవారు పాలకవర్గంగా బాంధవ్యాలు పెంచుకొని బగతలుపెరిగారు. గౌరీపట్నంలోని కందాళగురువులను ఆశ్రయించారు. క్షత్రియుల మనిపించుకోవడానికి జందేలు వేసుకున్నారు. స్థానికులతో కలువక తమచుట్టూ గిరిగీసుకున్నారు. కొటియాలుకూడా ఈ పద్ధతిననుసరించి బగతలు కాజూచారుగాని, కట్టుబాట్లు బిగించడంవలన చిట్టిబగతలుగానే ఉండిపోయారు. బలిఘట్టం స్వామి గగనాంద శిష్యులై కమ్మర్లు మరొకడుగుముందుకేసి మాంసాహారం మానివేశారు. జందేలువేసికొని ఓజులైనారు. వాల్మీకులు గోమాంసంమానివేసి, గురితేటిగురువులను అశ్రయించి హరిభజనలుపెట్టి రామకోవెలలు కట్టుకున్నారు. ఒరియావారైన కుమ్మరులు ఎక్కడా మెతుకేముట్టరు. ఈపాండవదేశంలో పాటపూజారులు కొండదొరలు, భూసారంకోసం నంది, కొలువు పండుగలు చేయిస్తున్నారు. కమ్మరులుకూడా ఇవినేర్చి పౌరోహిత్యం నెరపుతున్నారు. ఈ కులకట్టుబాట్లు సడలిపోకుండా దొప్పకట్టడులు, కుల తప్పులు, ప్రాయశ్చిత్తాలు, చోటాకులు, గురుకట్నాలవంటి శిక్షలు అమలులోకి తెచ్చారు.

మానవుల హృదయాలు ఈ నియమాలకు ఎల్లవేళల లొంగవు. అవి వెతుక్కునే దారులకుకూడా ఆచారప్రతిపత్తి కల్పించవలసి ఉంటుంది. వివిధ కులాలవారు పెళ్ళిళ్ళలో మన్నన చుట్టరికాలని నేస్తంకట్టుకోవడం ('పువ్వులు ముడుచుకోవడం')

*దొప్పకట్టడులు, కులతప్పులు, చోటాకులు, గురుకట్నాలు*

అనుబంధాన్ని, ఆత్మీయతను పెంచుకోవడం ఇక్కడి ప్రత్యేకత. కాని గోమాంస విధి నిషేధాల పేరిట ఇక్కడకూడా సమాజం రెండుగా చీలింది. బగతలు, మాలాకార్లు, కొటియాలు, గౌడు, మూకదొర, మన్నెదొర, రెడ్డిదొరలు గోమాంసం పరిహరిస్తారు. కొండదొర, కమ్మరి, గదబ, ఓజు, వాల్మీకి, ఘూసి, పైడి, డుంబులలో ఈ నిషేధం ఐచ్ఛికం. ఇక్కడ కులాల క్రమం ఇదే. గ్రామంలో ఇళ్ళుకూడా ఈ క్రమంలోనే క్రమంగా దిగువకు కట్టుకోవాలి. సంస్థానాలలో ఒకప్పుడు బగతలు సైనికులు, వాల్మీకులు స్తోత్రపాఠకులు కోలుగాండ్లు, గదబలు పల్లకీబోయీలు, ఘూసీలు గుర్రాలు మేపేవారు, పొరజాలు వాద్యాలుమోగిస్తారు. సంస్థానాలు అంతరించినా పెళ్ళిళ్ళలో ఇప్పటికీ ఆయాపనులుచేస్తారు. ఈ పనులన్నింటికి కళ్ళంలో పొల్లావులు(మేర)ఉంటాయి.

**పితూరీలు - ప్రభుత్వాలు :**

గ్రామసభలో అన్నికులాలకు ప్రాతినిధ్యం ఉంటుంది. గ్రామపెద్దలు మునసబు, ముఠాదార్లు బగత, రెడ్డి, కోయతెగలకు చెందినవారు. ఈ పెద్దరికంతో వారు వెట్టి చేయించుకునేవారు. గ్రామంలో సాగుకుపనికివచ్చే భూములన్నీవారివే. వారిపొలాలలో కూలీలేకనే పనిచేయాలి. ఇల్లు నేయాలి. అధికార్లు వచ్చినప్పుడు బాటలు సెలపడం, డోలీలు మోయడం, బత్తెం సమకూర్చడం, టపాలందించడం మొదలగునవి అందరి కర్తవ్యాలు. ఏదైనాతప్పు దొరికితే కులం వదిలిపెట్టదు. 'కులపట్టెపట్టు - వలపట్టెపట్టు' 'కుండెడు కూటికి దాటగలడుగాని కులానికి దాటలేడు'. ఇటువంటి మొట్టికాయలు తింటున్నా, విశాలమైన అడవిలో కాయకసురు దొరుకుతున్నందున జీవయాత్ర భారం కాలేదు. ఉపవాసం వారిమనుగడలో కీలకం. రంపపితూరీ, రామరాజుపితూరీలలో తిరగబడడంతో మిలిటరీ పోలీసు దురాగతాలలో నలిగిపోవలసి వచ్చింది. ఫారెస్టు, రెవిన్యూ, పోలీసుశాఖల ఆంక్షల జులుంతో కుంగిపోయారు. ❊

# నల్లమల అడవులు




## నల్లమల అడవులు :

ఆంధ్రప్రదేశ్‌మధ్యలో కృష్ణానదికిరుపక్కలగల నల్లమలఅడవులు చిట్టడవులు. ఇక్కడి తూర్పుకనుమలకు శేషాచలం, వెలిగొండ, ఎఱ్ఱగొండ, నల్లమలలని పేరు. ఆదిశేషుడు పర్వతాకృతిపొందినాడని పౌరాణికవిశ్వాసం. ఆశేషుని తలపై శ్రీనివాసుడు (తిరుమల), నడుముపై నరసింహుడు (అహోబలం), తోకపై మల్లికార్జునుడు (శ్రీశైలం) తిష్టవేసినారు. హిరణ్యకశిపుని పూజాగృహం శ్రీశైలమని, సభాగృహం అహోబిలమని నరసింహపురాణం. 'చెంచుల అహోబలపు-శ్రీనారసింహము' అంటూ ఇక్కడిభూదేవికి, మోము సోమశిలకనుమ, పిరుదు గద్దెరాతి కనుమ, కెమ్మోవి ఎఱ్ఱశిలకనుమ, చిత్తం దొంగసానికనుమ; గుబ్బలికొండకనుమ, మంతనాలకనుమలు గుబ్బలుగా అన్నమయ్య

వర్ణిస్తాడు. మహిమాన్వితులైన తమ పూర్వులు 'రావగాళ్ళ' ఏలుబడిలో నల్లమలలున్నట్లు చెంచులుభావిస్తారు. 'సిద్ధమునివరు లిందలి చెంచులెల్ల' అని శ్రీనాథుడు చెంచులజీవన విధానాన్ని ప్రశంసిస్తాడు.

ఓడిపోయిన రాజులెందరికో నల్లమలఅడవి ఆశ్రయమిచ్చింది. వారిసైనికులుగా దిగువప్రాంతాలకు వెళ్ళిన చెంచులు యానాదులైనారు. వేలయేండ్లుగా భారతీయులకు స్ఫూర్తి కేంద్రాలైన శ్రీశైలం, శ్రీపర్వత సంఘారామం, ఇక్ష్వాకుల విజయపురి, అహోబిలం ఈ సీమలోవే కావటంవల్ల ఈ సాంస్కృతికయాత్రికులతో చిరకాలంనుండి చెంచులకు పరిచయం. శ్రీశైలంమల్లన్నను బావగా, నరసింహస్వామిని అల్లునిగా చేసుకున్న ధన్యులీ 'దేవచెంచులు'.

దిగువ ప్రాంతాలనుండి పల్లెప్రజలు వలసవస్తున్నకొద్దీ వెనుకకొదిగే అడవిలేక కూలీలుగామారడం చెంచుజీవితంలో పరిణామాలు. వ్యవసాయం, పశుపోషణ వృత్తిగాగల సుగాలీలు ఈ అడవులలో విస్తరించడంతో చెంచులుకూడా పాడిపంటలకు అలవాటుపడ్డారుకాని ఈ వృత్తులకు తగిన నేర్పు, శ్రద్ధ, చెంచులకు ఇంకా అలవడలేదు. కాని తెలుగులమధ్యనఉండి తెలుగుసంస్కృతిచే ప్రభావితులైనవారూ, తెలుగుల సంస్కృతినిప్రభావితం చేసినవారూ చెంచులే.

సుమారు లక్షయేండ్ల నరజాతిచరిత్రలో పనిముట్ల వాడకం పదివేలయేండ్ల నాటిది. వ్యవసాయం ఐదువేలయేండ్లనాటిది. పారిశ్రామికవిప్లవం తరువాత విస్తరిస్తున్న నాగరికతకు ఐదువందలయేండ్లుకూడా నిండలేదు. నాలుగైదువందలయేండ్లలో ఈ పరిణామాలతాకిడికి తెలుగుగిరిజనులు లోనైనారు. భౌతికసంస్కృతి మారినంత త్వరగా మనస్తత్వం మారదు. మనతెగలసాహిత్యం ఈ పరిణామాలకు స్పందిస్తూ ఎదుగుతున్నా, దాని వికాసానికి ఆధారం ఆటవిక మనస్తత్వమే.

జానపదసంస్కృతి, గిరిజన జీవితంలో ప్రత్యేకతలు, తారతమ్యాలు, తెలుగు గిరిజన వికాసపు స్థూలచిత్రమిది. ఈ విశేషాలకు పురుడుపోసిన తెలుగు వనసీమలలో ప్రకృతి పురుషుల అనుబంధం తరువాతి ప్రకరణం.

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. "ఆంగికం భువనం యస్య వాచకం సర్వవాఙ్మయం
ఆహార్యం చన్ద్రతారాదీః తంనమః సాత్త్వికం శివం"
– కూచిపూడి భాగవతులప్రార్ధనాగీతం.

2. "అంతకడివెడు పాలలో ఒక్కింత మీగడ పేరినట్టులు
మనకు మిగులును గతము లోపలి మంచి, అదియే సంప్రదాయము"
–సినారె.

3. Lore. Munro E. Edmonson. Chapter I. No. P.1. Science is a differentiable mode of acquiring transmitting knowledge. In contrast to lore, it rests on a narrow base. Science attempts to come to grip with the world through a strict pre-occupation with denotative meaning and logical relational state willing to include connotation and analogy as well . And what is distinctive lore and literature is their pre-occupation with connotative semantics and analogic systems of thought.

4. Field theory & social sciences . K. Lewin, P.240. Dorwin Cartight Pub., New York. 1951. Geographical, ecological environment is independent of the thought of the person. This produces in perceptual organs i.e. the retina, the behaviroural environment. In consciousness this evokes the phenomenal behaviour. Finally, this last gives rise to the real behaviour which in turn reacts on the environment and takes place there.

5. The little community peasant society and culture. Robert Redfield. Phoenix Book. University of Chicago 1967

P.21 - They are the rural dimensions of civilisation.

P.20 - Kroeber puts it simply peasants are definitely rural and live in relation to market towns, they form a class segment of a larger population which usually contains urban centres, sometimes metropolitan capitals. They constitute part societies with part cultures.

Page 39 - In East Indian communities, the Pandits and Gurus show by

their examples and tell by their teaching another and higher version of the same life which the ordinary peasant lives. The great and little traditions are inter-dependants.

Page 49 - In fact, the social position of a person depends on which of the two traditions he determines to live by.

6. ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము; కుందూరి ఈశ్వరదత్తు, 1963.

నేడు మహేంద్రపర్వతములు తూర్పుకనుమలను పేరబఱగుచున్నవి. మహేంద్రగిరి గంజాము మండలములోనున్నది. ఈ కొండలు ఉత్కలరాష్ట్రమునుండి తూర్పు సముద్రతీరమునకు నూరు నూటయేబది మైళ్ళదూరమున శ్రీకాకుళము, విశాఖపట్నము, తూర్పుపడమటి గోదావరిమండలములు, కృష్ణా, కర్నూలు, నెల్లూరు, కడప మండలములోనుండి, దక్షిణమున మధురామండలమువఱకు ప్రాకియున్నవి. ఇవి నిమ్నోన్నతములుగాక, దాదాపు రెండువేలయడుగుల ఎత్తును మించిలేవు. విశాఖపట్నము మండలములో పాలకొండలనియు, గోదావరీ మండలములో మలయములేగాక, పాపికొండలనియు, నెల్లూరు, కడపమండలములలో పాలకొండలు, వెలికొండలనియు కర్నూలుమండలములో ఎఱ్రమలలు నల్లమలలనియు, చిత్తూరు మండలములో శేషశైలము, కాళహస్తిగిరులనియు, ఈకొండలకు వివిధ నామములు.

ఆంధ్రదేశములోని సుప్రసిద్ధనదులగు గోదావరీ, కృష్ణ, పినాకినీనదులు పడమటిదిశనుండి ప్రవహించి, మహేంద్రగిరులను జీల్చి సముద్రగాములవుచున్నవి.

విశాఖపట్టణ మండలములో సింహగిరిపై వరాహనృసింహస్వామి, ఖమ్మము మండలములో భద్రాద్రిపై శ్రీరామచంద్రమూర్తి, కృష్ణామండలములో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ, కర్నూలుమండలములో నల్లమలలపై శ్రీగిరిమల్లిఖార్జునుడు, గరుడాద్రిపై అహోబిలనారసింహుడు, చిత్తూరుమండలములోని శేషాచలముపై శ్రీవేంకటేశ్వర స్వామియు ఆంధ్రప్రదేశమునకు అరిగాపులై, యావదాంధ్రప్రదేశమును పరిరక్షించు చున్న దైవశిఖామణులు.

7. Geographical data in early puranas Mr. Singh, 1972 P. 271.

In the opinion of Dr. H.L. Roy Chaudhari, the Mutibas of Itareya brahmana or Muchipas of the Sankhyana sroutasutra should be identified

with the Musikas living on the bank of River Musi. ( A people of this name also lived near river Indus). The Vayupurana regards Kalinga as an impure country where Ashrama Dharma does not prevail. Bodhayana recommends expiation for one who travels in the land of Kalinga.

8. Rebellious Hillmen : The Gudem Rampa Risings 1839-1924. David Arnold, Subaltern Studies I, OUP-1997. P.88

P.89. Gudem and Rampa demonstrate two fundamental characteristics of subalternity in India (and perhaps in peasant societies generally). The precise forms that these took were, no doubt, moulded by the physical environment of the hills and by that almost universal antipathy which hillmen feel towards the inhabitants of the plains.

P. 91. But despite the divisions imposed on the area by outsiders, it has a unity of its own that is more than topographical. Many hillmen belonged to the Gond family of tribals (adivasis) and spoke, with extensive Telugu and Oriya borrowings, the kui language. Their social and religious practices, though greatly influenced from outside, yet possessed distinctive features. Although social anthropologists have emphasized the isolation of popular movements it is striking how much communication was possible between hillmen scattered over this vast area- and how rapidly a fituri begun in one locality could spread to neighbouring tracts. Although Gudem and Rampa had territorial identities of their own, many of the sites sacred to their inhabitants lay outside the tracts, and there is evidence, too, of contacts with hillmen in adjacent areas. It would seem, in fact, that the whole southern and eastern arc of the uplands-from the Godavari to the hills of Madugula—constituted the broader territory with which the Gudem-Rampa hillmen identified themselves.

Who were the hillmen? There is a perplexing variety of answers. In 1847 the Agent for Visakahapatnam claimed that there were no hill tribes at all in Gudem, only a small population which was of ‘pure Hindu race’. Writing almost a century later, C. Von Furer-Haimendorf took a diametrically opposite

view, asserting that both the principal hill communities in Rampa (whom he identified as the Koyas and the Hill Reddis or Konda Bagatas) were tribals. He maintains that the so-called Hill Reddis are not related to the Reddi or Kapu castes of Telugu peasants and that the name ‘Reddi’ may have becomes attached to them solely because they were subjected to the Reddi Kings of Rajahmundry in the fourteenth century. Throughout his monograph Furer-Haimendorf insists on the primitivences of the Hill Reddis. Their physical features, their food-gathering and shifting cultivation, their ‘simple mindedness’ and gullibility in dealing with plainsmen,their ‘unimaginative and unspiritual’ mentality—all are adduced to demonstrate the Hill Reddis’ extreme backwardness. The Koyas, by comparison, are pronounced to be ‘progressive’ and ‘dynamic’. Furer—Haimendorf records the claims of some Hill Reddis to be immigrants from the plains and distinct from the indigenous population, but he is reluctant to accept such calims and holds to his conclusion that the Rampa Reddis are essentially the same primitive tribe that he had found in the hills to the north and along the banks of the Godavari in Hyderabad.

A more satisfactory identification of the hillmen is to be found in the colonial administrator’s reports and gazetteers, and in Edgar Thurston’s caste and tribes of southem India.

‘Christoph von Furer—Haimendorf, The Reddis of the Bison Hills: A Study in Acculturation (London, 1945), PP. 8-10, 28, 35-46, 164-76, 239. Appears that the Reddis of Rampa and Gudem were freshwater fishermen and Bhaktas, a caste of Telugu-Speaking freshwater fishermen and cultivators, said to be distantly related to the Kapu and Telaga Peasant castes. Thurston notes that in Madugula and in the Golgonda zamindari (which encompassed the Gudem hills) the Bagatas were accorded a privileged position. Here their name was reputedly derived from bhakti( in acknowledgement of their special devotion to the local rulers) and in return for their services they had received land grants as mokhasadars (holders of individual villages) or were appointed village headmen (padalu). Elsewhere in confirmation of this view, Bagatas

are described as ‘lords of the hills’ and as long established immigrants from the plains, who constituted all, or almost all, of the muttadars in Gudem and Rampa.

P. 95. Alongside these main communities, and in far smaller numbers, were other hillmen. Kammars, prominent in several of the risings, were blacksmiths by caste, but often practicing cultivation as well. According to Furer Haimendorf they had ‘close affinities’ with the Konda Doras, but held a social position inferior to both them and the Koyas. P.12. Two kinds of priests are mentioned. The jangams were lingayats particularly associated with the Saivite muttadars and Bagata headmen. Furer-Haimendorf thought that they were probably relatively recent immigrants and believed that they intermarried with muttadari families. P.13. Accounts of the 1886 rising in Gudem also refer to a group of priests known as Sivasaris drawn from the Konda Doras, but we have been unable to find any other reference to them.

P.110. Commercial penetration had not waited for the road building of the 1880s however. Even before the Rampa rebellion of 1879 –80, traders and moneylenders were pushing into the hills and beginning to undermine the traditional economy. Malas, a caste of untouchables who in the lowlands were among the most despised of Hindus, were quick to see the economic opportunities created by the more stable conditions of the 1850s and 1860s, and by the gradual extension of British control after 1848. Operating at first as petty traders, like the Brinjaris before them, peddling goods from their pack bullocks and spending months on their trading expeditions into the hills, they acquired the capital and expertise to develop into flourishing traders. They extended their activities to money- lending to cultivators and muttadars, and took over hill villages as their own settlements. In the Malas wake came Komatis, the affluent and powerful trading caste that dominated commerce, especially the grain trade, in the plains. Unlike the Malas, the Komatis rarely lived in the hills, nor did they trouble with petty trade. They sought the larger profits to be made from timber, opium and drink or from the mortgaging of muttadars estates.

❁ రెడ్డిరాజ్య చరిత్ర (2001) మల్లంపల్లి సోమశేఖరశర్మ. తెలుగు విశ్వవిద్యాలయం. పుట. 133.

అభిజ్ఞానశాకుంతలం వ్యాఖ్యలో కాటయవేముడు వివరించిన తన విజయాలలో

1. మొల్లేటిదుర్గం (తూర్పుగోదావరి గంగవరం మండలం)

2. కిమ్మూరుదుర్గం 3. వజ్రకూటం 4. బెండపూడి 5. రామగిరి.

మొల్లేటిదుర్గం: అచటి శాసనమున కాటయవేమారెడ్డి పుణ్యప్రాప్తికై వుప్పల హన్మయ వేమసముద్రము (తటాకము) నిర్మించెనని ఉన్నది. ఈ శాసనం ఒక అక్షరమైనా వదిలి చదవాలని స్థానికుల అభిప్రాయం.

కిమ్మూరుదుర్గం: పెద్దాపురమునకు ఆరుమైళ్ళు ఉత్తరమున ఏలేటి ఒడ్డుననున్న కాంద్రకోట కిమ్మూరని జనశ్రుతి. స్థలచరిత్ర ప్రకారం (కైఫియత్) కాటయవేమారెడ్డి అనంతరము రెడ్డి పెదవెంకప్ప కిమ్మూరు, ప్రోలునాడు, కొత్తపల్లి, గరుగుమిల్లి, కొర్వాడ, గూటాల, ఇసుకపల్లి పెదపాత్రునికి దండపటముగా నొసగెను. నిర్ణయించిన సైన్యమును పోషించుటకైన ఖర్చులు పోను మిగిలిన ఆదాయమును రెడ్డి పెదవెంకప్పకు ఇవ్వవలెనని నియమము.

పుట. 138 జైపూర్‌జమీన్ పాలకులను ఝాడ్‌ఖండ్ పాదుషాలని వ్యవహరింతురు. అది నందపూర్ రాజుల బిరుదనామము.

❁ The early History of Deccan, Yazdani, General, Editor. Part VII – XI P.578. Beta-I succeeded by his son Prola who is set to have subdued a number of Chiefs hostile to his overlord ……. to have straightned the Chakrakuta vishaya, i.e. Chakrakot in Bastar.

❁ ఆంధ్రులచరిత్ర సంస్కృతి: ఖండవల్లి లక్ష్మీరంజనం బాలేందుశేఖరం. పుట. 250.

మంచికొండవంశములోని కేశవనాయకుడు ఆంధ్రదేశమున నొకసామంతుడుగ నుండెను. కూనయనాయకుడు ఈయన పుత్రుడు. కూనయకుమారుడు ముమ్మిడి నాయకుడు కాపయనాయకుని మేనగోడలిని వివాహమాడెను. నేటి భద్రాచలము తాలూకాలోని కూనవరమాయన పేరిటిదే.

❁ భారతి, మాసపత్రిక 1967 అక్టోబరు, నవంబరు. ముసునూరు సాంబశివ రామమూర్తి. ఈ వ్యాసంలో పేర్కొన్న తామ్రశాసనం చాలా విశేషాలను బయట పెడుతున్నది. 'నాగవంశమునకు తొలిరాజధాని వేముఋనాడుదేశములోని గండవాడ.

వింధ్యాద్రి నివాసమునగలిగిన దోషమున పరిహరించు దివ్యతీర్థము రంభను (రంప) భీమమహీపతి రెండవరాజధానిగా చేసికొనెను'.

❃ Madras districts gazetteers, statistical appendix for Vishakapatnam Distrist. 1915.

P.7. In the Agency tracts, the average density of population increased from 67 to 81 per square mile during the decade (1911) . The increase is probably due to in small measure to accurate enumeration – but at the same time there is no doubt that the people of the plains have lost to some extent their fear of the agency and have been migrating theither.

❃ Culture and Public Action, ed. Vijayendra Rao and Michael Walton Permanent black, 2004, New Delhi. p. 164

Mahatma Gandhi once explained, development thinking requires "a recognition that economic activity, at every stage of technical development, has no value except as a contribution to a social aim".

❃ District Gazetteers, Godavari by F.R.Hemingway, 1907.

❃ The Rampa Agency East Godavari dist., Mr. V.N.Seshagiri Rao. Extra Asst. Conservator of Forests 1933. Madras, Superintendent Govt.Press.

❃ Evolution of Scheduled Areas and Changes in Muttadari System in Andhra area (1724 - 1970), Dr. V.N.V.K. Sastry, K.V. Subba Reddy, Tribal Cultural Research & Training Institute of Hyderabad 1991.

❃ Tribes of India : The Struggle for Survival, Haimendorf - 1994 OUP.

❃ Report on the Socio-Economic Conditions of the Aboriginal Tribes of The Province of Madras - 1948, A.Aiyappan - Govt.press, Madras.

❃ Extinction. J.C. Daniel. Natural History Series.

P.15. only in the last 500 years has man began to be the cause of extinction.

❃ Alluri Seetharama Raju 1983 J. Mangamma, State Archives. A.P.

# తెలుగు వనసీమలలో ప్రకృతి పురుషులు

మానవుడు శాస్త్రంద్వారా ప్రకృతిలోకి ప్రవేశిస్తాడు
ప్రకృతి కళద్వారా మానవునిలోకి ప్రవేశిస్తుంది.

✿ **ప్రకృతి - ఒకగణితం**

సంజ్ఞానం - అభిజ్ఞానం

✿ **విశాఖబయళ్ళు**

చలిగూడెం - పులిగూడెం

ఆరుళ్ళ

పసిబయలు

దోరశి

కోట్ల

బయలు

గాళ్ళ

ఉగంకొట్టడం

రకరకాల మంచులు

దోసాలు

✿ **ఊళ్ళు - ఇళ్ళు - పరిసరాలు**

ఎండ్రికనీళ్ళు

అన్నంవార్చుకున్నా - అంబలికుండ తప్పదు

అరవైయారు దుర్గాలకు - పోతుమన్నెం లోతుగడ్డ

✿ **గోదావరి లోయలు**

కొమ్ముమవారు - గట్టువారు

✿ **ఈ అడవి దాగిపోనా**

✿ **ఆహార విహారాలు**

పోడువ్యవసాయం

కొత్తలు కలపడం

పిందెపట్టిన చేనుచేయకు

ఇళ్ళు – పాకలు

వెదురుగొట్టాలు – అనపకాయబుర్రలు

✲ **పుడమితల్లికి – సహస్రనామార్చన**

ఎలుగులు – మనుషుల దాగుడుమూతలు

✲ **నల్లమల అడవులు**

సెలలు, సరులు, కురవలు, కట్టువలు, సారవలు, బరకలు, పడియలు

కురువకింది చెంచులు – కురువమీది చెంచులు

✲ **పరిసరజ్ఞానానికి మచ్చుతునకలు**

అభిరుచులు

సాహసం – సంఘటన

తేనెల ఋతువులు

గడ్డితిని బలిసే జంతువులు – గడ్డలతో బతికే చెంచులు

✲ **నరసింహస్వామి వరం : అభయారణ్యం**

దొంగదారులు – ఆకలిచావులు – అభయారణ్యంపేరిట ఆంక్షలు

✲ **ప్రాంతాలు – తెగలు – జీవనవైవిధ్యం**

తెలుగువారి అడవుల వర్గీకరణం

ప్రకృతికిదూరంచేస్తున్న చొరబాటులు

పట్టుబిగించిన ప్రభుత్వం

## ప్రకృతి - ఒకగణితం :

భూస్వభావం, వాతావరణం పరిణామశీలమైన సృష్టిని వైవిధ్యంతో నింపుతూ ప్రతి ప్రాంతంలో ఒక సామరస్యాన్ని సాధిస్తాయి. అట్టిస్థితికి చేరుకున్న భూభాగంలో భూమి చెట్టుచేమా, జంతుజాలం అవినాభావ సంబంధాన్ని కలిగింటాయి.

భూసారం, వర్షపాతాలకు తగినట్లు వృక్షసంపద - వృక్షాలనుబట్టి కోతులు, పక్షుల వంటి శాఖోపజీవులు, గడ్డీగాదాన్నిబట్టి శాకాహారులైన జంతువులు, వాటిని వేటాడే మాంసాహారులు, వాటి ఆహారసంబంధాలు, నివాసవిశేషాలు, ఒకరిదారికొకరు రాకుండా పాటించే కాలక్రమం, తీసుకునే జాగ్రత్తలు, గమనించే సంకేతాలు, ఇన్నిటికి తగినట్లుగా రూపొందిన ప్రాణుల అవయవ సన్నివేశంతో స్వయంచాలితయంత్రంలా ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా నడుస్తుంది ప్రకృతి.

గణితంలో సోపానక్రమంలో గుణితలబ్ధములు ఒకదానిమీద మరొకటి ఆధారపడి వచ్చినట్లే ప్రకృతిలోకూడా ప్రతిదీ మిగిలినవాటితో సంబంధం కలిగిఉంటుంది. ఏ ఒక్క అంకెను మార్చినా లబ్ధము మారిపోయినట్లే. ప్రకృతిలో ఒక్కవిషయాన్ని మారిస్తే తదనుగుణంగా మరెన్నోమారతాయి.[1]

### సంజ్ఞానం - అభిజ్ఞానం :

భూస్వభావం, వర్షపాతంవలన తెలుగుగిరిజనులున్న అడవులలో ఎంతో వైవిధ్యం ఉంది. ఇక్కడ వర్ధిల్లే వనవాసుల సంస్కృతికి ఈ నేపథ్యం వెన్నెముక. కాబట్టి ఆయా సమాజాల సంజ్ఞాన విజ్ఞానాలు, నేర్పు, సంఘటన, గృహనిర్మాణం, కులాచారాలు, స్థలదేతలు, వినోదాలలో యీ ప్రభావం పారదర్శకంగా కనిపిస్తుంది. ఈ విశేషాలగూర్చి తన ప్రాంతానికి సంబంధించినంతవరకు గిరిజనుడు కొంతవ్యాఖ్యానించవచ్చునుగాని యీఅనుబంధంలోని అంతస్సంబంధాలను, పరివర్తనా సూత్రాలను, అవ్యక్త విశేషాలను అర్థంచేసుకోవడానికి జీవ, భౌతిక, సాంఘికశాస్త్రాలను సంప్రదించడం మనకు తప్పనిసరి. గిరిజనులకు అనుభవంవలన ఆ విజ్ఞానం వెన్నతోపెట్టిన విద్య. పెద్దలమాట వారికి చద్దిమూట. ప్రకృతిలో ప్రతిమార్పుకు స్పందించడం వారికి సహజం. కాని అది మనకు నేర్వవలసిన చదువు. వారిది సంజ్ఞానం (సంజ్ఞ+జ్ఞానం) (బీళిశీటీఱశిఱళిటీ), మనది అభిజ్ఞానం (జీలిబీళిశీటీఱశిఱళిటీ). పదార్ధశాస్త్రజ్ఞులది విజ్ఞానం.[2]

## విశాఖజిల్లాగిరిజనప్రాంతంలో వాతావరణం - భౌగోళికవిభాగాలు




## విశాఖబయళ్ళు :

విశాఖ అడవులలో కొండలు, వాలుగాదిగే చరియలు, మధ్యలో పరచుకొనే విశాలమైన మైదానాలలో లీనమౌతాయి. మట్టి ఎక్కువ భాగం ఖోండలైట్ (ఎర్రనేల). కోందుతెగ విస్తరించినప్రాంతం కాబట్టి ఈమట్టికి భూశాస్త్రవేత్తలు ఆపేరు పెట్టారు.

*కోందుతెగ విస్తరించిన ప్రాంతంలో మట్టి ఖోండలైట్*

ఖోండలైట్ భూములలో అడవులు బాగా పెరుగుతాయి. దానికి తోడు ఇక్కడి వర్షపాతం 150 నుండి 200 సెం.మీ. ఈ అటవీ ప్రాంతాన్ని ఆరుళ్ళ, పసిబయలు, దోరశి, గూడెం, కోట్ల, బయలు ప్రాంతాలుగా గిరిజనులు పిలుచుకుంటారు.

**చలిగూడెం – పులిగూడెం :**

నర్సీపట్నం తరువాత కొండసంతనుండి (డౌనూరు; డౌన్+ఊరు=కొండక్రింది ఊరు) మొదలయ్యే శాంబరికొండలలోని లమ్మసింగి – చింతపల్లి – గూడెం – అమ్మవారి దారకొండ – ఎగువ సీలేరువరకు 'చింతపల్లి', 'గూడెం' మండలాలు, అడవి ప్రాంతం. ఈ ప్రాంతాన్ని 'చలిగూడెం', 'పులిగూడెం' అంటారు. చలి ఎక్కువ, పులులు ఎక్కువ. శ్రీరామరాజు యుద్ధతంత్రాన్ని అడుగడుగునా గుర్తుచేసే 'గొలుగొండ', కృష్ణదేవి పేట, రంపోలుఘాటీ, 'గూడెం', 'పసిబయలు' బ్రిటిష్‌వారిని గడగడలాడించిన పోరుభూములు ఈ గూడెంలోనివే.

**ఆరుళ్ళ :**

వడ్డాది – మాడుగుల నుండి, పాడేరు రోడ్డులో 'గరికబందలు' గ్రామం దాటగనే నాలుగువేలఅడుగులఎత్తైన మినుములూరుఘాటీ మొదలవుతుంది. మినుములూరు, వంతాలు, గడుతూరి, గమ్మెలి, లోచిలి, సొలభం గ్రామాలు, గంగరాజుమాడుగుల వరకు ఆ కొండపట్టెన విస్తరించిన ఆరుముఠాగ్రామాలు. అందుకే ఈ ప్రాంతానికి ఆరుళ్ళ (ఆరుఉళ్ళ) అని పేరు. అత్యధికవర్షపాతం, మంచులవల్ల వీరికి గుమ్మడికాయ ధాన్యం దిగుబడి తక్కువ. (దసరాకువచ్చే మొదటిపంట). మామిడికాయ ధాన్యం ఎక్కువ (వేసవి పంట). ఆ రెండుపంటల 'ఆరుళ్ళవారికి రెండు ఆకళ్ళు' అని నానుడి.

**పసిబయలు :**

ఈ ఆరుళ్ళకాక, మిగిలిన గంగరాజుమాడుగుల మండలం 'పసిబయలు' పచ్చని ప్రదేశం. పల్లపు ప్రాంతం. పసుపుపంట ఎక్కువ. ఆరుళ్ళతప్ప పసిబయలు, గూడెం ప్రాంతాలు ఒకనాటి గొలుగొండ సంస్థానంలోనివి. ❉

ఇక్కడ ఉన్నకోందులు, కొండదొరలుచేసే పోడువ్యవసాయం అసాధారణమైనది. ఆ కష్టజీవులు ఎంత దట్టమైన అడవినైనా నరికి తగులబెట్టి గింజలు చల్లుకోడానికి వెనుకాడరు. కొండచరియలగుండాపారే జోరెలనుమలిపి వారుతీర్చిదిద్దుకున్న మాగాణి పొలాలు, పొలాలకువేసుకున్న రాతిగట్లు అడవితల్లికి అమర్చిన వడ్డాణంలా కనిపిస్తాయి.

జనసంఖ్య, వ్యవసాయం పెరిగి ఈ ప్రాంతాలలో అడవి అంతరించింది. నేడు గ్రామాల చుట్టూ ఉన్న జీలుగ, మామిడి, పనస, చింతలే మిగిలిన వృక్షసంపద.

**ఉగంకొట్టడం :**

చెట్టూ చేమా అంతరించడంతో, నేల సూటిగా వర్షధారాపాతానికి లోనై ఉబ్బి జోరెలు కొట్టి 'ఉగంపొడిచి' పెళ్ళలుపెళ్ళలుగా మట్టికొట్టుపోతుంటే మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రానికి పూడికపెరిగి 1960లలో కొంతకాలం విద్యుదుత్పాదన ఆగిపోయింది. 1991 వేసవి తుఫానులో రవాణామార్గాలన్నీ ధ్వంసమై విశాఖమన్యానికి మిగతాజిల్లాతో సంబంధాలు తెగిపోయాయి. మెరుపువరదలతో కొండవాగులన్నీ పొంగి వైద్యసేవలందిచడానికి వెళుతున్న అంబులెన్స్‌లు కొట్టుకుపోయాయి. అనంతగిరి మండలంలో కొండవిరిగిపడి 60 మంది చితికిపోయారు. 2006లో అరకులోయలోని కోడిపుంజులవలసలో కొండచరియలు విరిగిపడి గిరిజనులు మరణించారు. 'ఉగం కొట్టడం' ఇక్కడ సాధారణ విషయం. ఉగంకొట్టిన జాడలను తెలిపే పరిసరాలపేర్లు వినగానే, ఇక్కడి కొండవాడు భయంతో వణికిపోతాడు.

**రకరకాల మంచులు :**

బుగ్గిమంచు, ముడిమంచు, పొగమంచు, గాందువంటి రకరకాల మంచుల బాధవల్ల, ఇల్లు రైతుకు గౌరవం తెచ్చేది కావడం వల్ల, మదురు గోడలు, మల్లెశాలలతో ధృఢంగా కట్టుకున్న ఇళ్ళకు, నెగళ్ళకు ఇక్కడ కలప, కట్టె చాలా భాగం వినియోగమైంది (ఇళ్ళలో చెక్కకూర్పువల్ల వెచ్చదనం కలుగుతుంది) పొగును (చలిమంట) ఇక్కడ ఫిబ్రవరినెలకు పేరు. కోట్లదేశంలో పొగును పెద్దపండుగ.

**దోసాలు - పండుగలు :**

పొలానికి 'గత్తం'తోలడం, పిప్పలి, పసుపు, అల్లంవంటి వాణిజ్య పంటలు పండించడం, నంది, కొలువు పండుగలు పెద్దఎత్తున వేడుకగా జరపడం, ప్రతినెలా

---

*బుగ్గిమంచు, ముడిమంచు, పొగమంచు, గాందు*

భూమిదోషాలు, అడవికట్టుకు రాకాసి దోషాలు, (నాడు పొలంపనులు నిషేధం) తువ్వడాల పండుగ, జాంకరి పండుగ (భూదేవి పండుగ), జొల్డపండుగ (పొలం చీడల పాలుకాకుండా కశ్మికర్రలు పాతడం) దసరాకు పోతును నరకడంవంటి వ్యవసాయ పండుగలను భయభక్తులతో జరుపుతారు. మన్యంలోని సాధనసామగ్రిలో కమ్మరి, కుమ్మరులలో తప్ప చక్రశక్తికి వినియోగంలేదు. ఈ వృత్తులవారంతా ఆయా కాలాలలో వలస వచ్చినవారే. కుమ్మరి, కమ్మరివంటి వృత్తిపనివారితోసహా ప్రతివారూ రైతులే. సామ, గంటి, చోడి పంటలకోసం కొండపోడు, అపరాలకోసం గరువులు, పిప్పలి, పసుపు, ధాన్యంకోసం పల్లం (ఈ మధ్యన కాఫీ తోటలు) ప్రతి రైతూ కోరుకుంటాడు కాని ఏ పొలమూలేక, ఉన్నదిచాలక ఆసామివద్ద పాలేరుతనానికి కుదిరేవారుకూడా హెచ్చుగానే ఉన్నారు. ❊






## ఊళ్ళు - ఇళ్ళు - పరిసరాలు :

కొండకు ఎగువన పోడు, దిగువన గరువులు, కింద పల్లపు మాగాణులు, అనువైన నెత్తంలో చెట్లమధ్య దోబూచులాడే ఊళ్ళు.

గ్రామం చుట్టూహద్దుగా అమర్చిన రాళ్ళన్నీ ఒక కోట.

గ్రామం మధ్యలో చావడి; గద్దెరాళ్ళు; ఆనుకోడానికి మధ్య మధ్యలో పలకలు;

సత్యాన్ని నిరూపించుకోవడానికి ఒకపక్క సిమ్మాలగద్దె, ఇంకో ప్రక్క గ్రామదేవత సంకులమ్మ.

మధ్య నెగడిబస, ముందు ఆటబయలు; గ్రామానికి ఎగువన వేటబయలు (ఇటింపండుగలో వేటకు వెళ్ళడానికి అందరు కూడుకునే బయలు); గొట్నబయలు (గౌడు = గొల్ల, పశువులను మేపుకు తోలేముందు పశువులను చేర్చే బయలు)

అన్ని వృత్తులవారితో సమగ్రమైన ఊళ్ళు

ప్రతి ఊళ్ళో ఐదారు వందల జనాభా

ఒకటో అరో పెంకుటిళ్ళు (ఇప్పుడు అందరికీ ప్రభుత్వం కట్టిస్తుంది)

ఇంచుమించు ఇండ్లకన్నిటికీ ద్వారబంధాలు, గట్టిలోతాళాలు, ఎర్రమన్ను, పేడమసితో చక్కగా సేమాను పట్టిన నున్నని గోడలు. మంచచక్కగా జారేందుకు కోపిరి గడ్డితిరగేసినేసిన వరుసతో అందగించే ముంజూరులు.

ఇంట్లో పీనె (అరుగు)మీద గూనకుదురు (చనిపోయిన పెద్దలకు గుర్తుగా ఉంచే చిన్నముంత; పండుగనాడు, శుభకార్యంలో, కష్టకాలంలో దీనికి మొక్కుతారు).

వార్పుకుదురు, పిండికుండకుదురు (అంబలి పులియబెట్టేకుండ), పొయ్యి పక్క అలివింబొర్రలు (వ్యాపించే మంటనందుకునే ప్రక్క పొయి కన్నాలు) పైన జోలారు;

అయినింటి (మల్లెశాల = నడిమిల్లు), లోపలింటి (గది), వెలుపలింటి (అరుగు), ఇంటిపక్కన కోళ్ళదొర్రి, ముందు పందులదొర్రి, గొర్రెలసాల, చిక్కుడు పాదులు.

ఇంటిముందున్న చింతచెట్టుకు ఉయ్యాల, చెట్టుపంగల్లో సేకరించుకున్న వంట చెరకు, చెట్టుకింద నూనెవత్తేందుకు (అడుసులు, నూనెగింజలు) బల్లలు.

ప్రతిఊరులో జాకరిమెట్ట (జాకరిదేవత=భూదేవత). ఆగస్టునెలలో కులంవారంతా తొలిపంట 'కొర్రకొత్త'లో గుమ్మడికూర నివేదించి సమానంగా పంచుకుని తింటారు.

*సిమ్మాలగద్దె, గొట్నబయలు, వేటబయలు*

నందిపుట్ట (నందిపండుగలో ఈ పుట్టకు వండినకల్లు పోస్తారు).

దానుగుడు కొండ (దానుగుడు = అడవిరాజు)

గ్రామం సరిహద్దు 'గడి' గడికాసే పోతురాజుమెట్ట. సమతలంగాఉన్న భూమిని చాటే పెదబయలు, సింగరబయలు, (సింగర్బా) చేరుబయలు వంటి పేర్లు;

ఉగాలుకొట్టిన కొండలు: మద్దివలసఉగం, బర్రెలమామిడిఉగం, పాలకొండ ఉగం, గాలిగుప్పఉగం.

ఒకనాటి ఓఢ్రపు ఉనికిని చాటే గ్రామనామాల పలుకుబడులు: కోడాపుట్టు, ముంచెంగిపుట్టు, గుత్తుల పుట్టు, సొలభం, వనభంగి, బీరం, తెలుగు పదాలకుకూడా ఈ పుట్టు చేరింది

అల్లంపుట్టు, బంగారు పుట్టు; సంపంగిపుట్టు.

ఇవీ ఇక్కడ పరిసరాల, ఊళ్ళ, ఇళ్ళ, పొలాల తీరుతెన్నులు. ❇




*సిమ్మాలగద్దె, జాకరిమెట్ట, నందిపుట్ట, దానుగుడుకొండ, వేలంబయలు, గడి*

**ఎండ్రికనీళ్ళు :**

ఎండ్రికలుతొలిచిన ఊటపొలాలలో సున్నపుశాతం కిందిపొరలలోకిచేరినందున, పోడు, గరువులలో సారంతగ్గినందున, మూడేండ్లకొకమారు బలంపుంజుకోవడానికి వదిలిపెట్టవలసినదే. గెత్తంతోలినా, పిప్పలి, పసుపుపంటలకిలా చేయక తప్పదు.

**అన్నంవార్చుకున్నా – అంబలికుండ తప్పదు :**

కొండపోడును ఒలవలతో తువ్వడమే కాక – పసిఎద (విత్తినాక పశువులతో నేలను మట్టించడం) కూడా చేయిస్తారు. సామ (మైసామ లేక కొర్రసామ) ఇక్కడ తొలిపంట (సెప్టెంబర్). ఇప్పటినుండి (మొక్క) జొన్నకాయలు, గుమ్మడి కాయలు, మధ్యలో కొర్రలు, దుంపలు, ఆకుఅలములు, వీటిమీద జీవయాత్ర సాగించవలసినదే. టెంకగిడుగు, తోకగిడుగులున్నా (వర్షానికి తడవకుండా వేసుకునే అడ్డాకులతో కుట్టిన టోపీ – కోటు) వరుసగా ముసురుపట్టిన రోజుల్లో కందమూలాలు తెచ్చుకోవడానికి బయటకు పోవడం పడదు. అటువంటి గడ్డుదినాలైన

'కన్నెనెలలో (ఆగస్టు) కడకాళ్ళ నుండి కాలి వెండిపట్టీలు అమ్ముకు తింటారు'.

'ముక్కనుమకు (డిసెంబరు) ముక్కులు మూతులు
పండుతుంటే ముక్కుకమ్మలు అమ్ముకు తింటారు'.

పంటలు ఇంటికి చేరేనాటికి జీలుగకల్లుబాగా దిగుతూంటుంది. చాలీచాలని దిగుబడి కాబట్టి 'అన్నం వార్చుకున్నా అంబలికుండ తప్పదు'.

కోడిపందేలు, మగనాలితగవులు, కులపంచాయితీలు; పిప్పలి, పసుపులు అమ్మిసంపాదించిన జలుబు వదిలిస్తాయి.

'శివరాత్రి పోయినాక చిక్కెడు గంజైనా దొరకదు'.

నందిపండుగ తీరినతరువాత కోసే చీపుళ్ళనమ్మి పైఅవసరాలు గడుపుకుంటారు. ఏప్రిల్‌లో 'పనసబాసలు' (పనసకాయలు లేతవి తినకుండా ఒక పరువుకు వచ్చేదాకా విధించే నియమం) తీరడంతో అవి కొంత ఆధరువు.

చింతపండు వగైరాలు అమ్మినసొమ్ముతో వేసవిలో ఇంటిపండుగ నెట్టేస్తారు. రోడ్డుపక్క గ్రామాలలో ఒకవారం, లోపలిగ్రామాలలో రెండువారాలుసాగే యీపండుగ, పడుచులు సంవత్సరమంతా నిలవరించుకున్న మోజులకు, ఎప్పుడూ అదుపాజ్ఞలు

విధించే తరతమభావాలకు ఆటవిడుపు. వేడుకల పండుగ అనుచితవిభాగంవల్ల కావచ్చు, ఇటిం ఇటికెపండుగ అనిపలుకుతారు. ఇక్కడవిల్లువేట చాలావరకు అలవాటు తప్పిపోయింది. ఈపండుగదినాల్లో జంతువులను, మిగతారోజుల్లో తారు కోడివేట, ఎగురుచిట్టె, ఉరిమీటు, ఈనెకండెలు, దోనెకండెలతో పిట్టలను పడతారు. నిరంతరం పారే జోరెల్లో చేపలు పట్టడానికి, తీరిక వేళల్లో వలలు అల్లుతున్నవాళ్ళు కనిపిస్తూంటారు. ఉండేలు (ఉండవిలుబద్ద), నారివిలుబద్ద, మిట్ట, చిల్లలమ్ము, శిలబాణం, కొమ్ములబల్లెం, బోడిబల్లెం–వీటన్నింటికి లోపలి అడవిలోకూడా వినియోగం లేకపోయినా, సోపువేట, తొక్కుడువేట (వర్షాలు పడ్డాక, అడుగుజాడవెంట) పొంపుడు వేటల, (తెల్లవారుజామున నలుగురైదుగురు రేవులో కాసి) అనుభవాలన్నీ నిన్నమొన్నటివే.

ఆ వేట సాధనాలు, బయనాగలి, కొండనాగలి, బుర్రనాగలి, తోకనాగళ్ళు, కృషి వికాసాన్ని, కమ్మరం ప్రాధాన్యాన్ని చాటిచెపుతాయి. వేటల పండుగలో ఆయుధాలకు, నాగళ్ళకు పదునుపూయడం మొదటి కార్యక్రమం. అందుకు ఊరివారు కమ్మరికి తొలిగా బత్తెం ఇచ్చి మన్నిస్తారు. అందుకే ఇక్కడ కమ్మరివారిమీద ఒక చతురమైన పొడుపుకథ–

'రాజుమీద ఓజులోడు'

(ఓజు=కమ్మరి; జీడిమామిడిపండులో పండుకింద జీడిఉంటుంది. పండుకంటె దాని విలువే ఎక్కువ).

## అరవైయారు దుర్గాలకు – పోతుమన్నెం లోతుగడ్డ :

ఇటుక పండుగలో వేసేది, రాచ ఉయ్యాల, వెళ్ళేది రాచవేట, కూడేది రాచచావడి, గద్దె, రాచపనుకు. బగతలు పాలకవర్గంకావడంతో ఇల్లు హోదాకు గుర్తుగామారింది. ఇక్కడ ముఠాలను దుర్గాలు అంటారు. ముఠాదారు దుర్గనాయకుడు, మునసబు నాయకుడు. ఇటువంటి 'అరవైయారు దుర్గాలకు పోతుమన్నెం లోతుగడ్డ'. తరువాత కాలంలో గొలుగొండ గొల్లరాజుల రాజధాని. ఈరాచకళ అంతా ఒకనాటి సంస్థానాల ప్రభావం. వంతాలు గ్రామానికి ఏడుచావడులట. గ్రామాలచుట్టూరాళ్ళను కోట ప్రాకారంవలె పేరుస్తారు. అడవిలో పెద్దపెద్ద పనుకులుకూడా ఈ సాంస్కృతిక వాసన వెదజల్లుతాయి. 'పసిబయలు పెద్దలంతా పిల్లపనసఘాటీ(పనుకు)మీద విచారాలు'.

వారందరూ తమచర్చలకోసం ఏర్పరచుకున్నారా అన్నట్లువుంటుంది ఆ పనుకు. విందుల పనుకులు, రాచపనుకులు, భీముడిపనుకులు, ధిమ్సాపనుకులు, (ధిమ్సానృత్యం) దింపుడు పనుకులు, (ఎంద్రిక పర్వతంమీద బ్రిటిష్‌వారికి బంగళా కట్టడానికి వెట్టి మోసేవారు, బరువులను ఆపనుకులమీద దింపుకునేవారు). పెద్దపెద్ద కొండలు 'సూర్య దిమడాలు' (దివాణాలు), 'చంద్రదిమడాలు'. అందుబాటులోఉన్న పనుకులను ఇంట్లో వేసుకుంటారు. రాతి స్థంభాలను ముంగిలిలో నిలబెడతారు.

పాలకవర్గం వారైన (ముఠాదారులు, మునసబులు) బగతలందరు వంశచిహ్నం ప్రాతిపదికగా వియ్యమందినా, సూకూరువారిని మజ్జులు, బాకూరువారిని రాజులు, డోకులూరువారిని నాయుళ్ళు, పాతకోటవారిని పడాళ్ళు, సీకరివారిని దొరలు. లగిసిపల్లి వారిని పాత్రులని పిలుచుకుంటారు. కిలంకోటవారికి రాచెలుకవారని వ్యవహారం. గంగరాజుమాడుగుల మత్స్యరాజువారు గాజుల బలిజవారట. వీరు దుడుమా, సుజన కోటలనుండి వచ్చారు. వీళ్ళపెళ్ళిలో బొయ్యిమీదనో (పెళ్ళిపందిరిలో మధ్యరాట) లేక మెడలోనన్నా తాడుకు గాజు ఉండాలి. వీరు గాజులు అమ్ముకుంటూ ఈప్రాంతాలకు వచ్చారని జనశ్రుతి. రాజు వారిపేర్లలో అనుబంధం. మఠంవారి పెండ్లికొడుకులు కొయ్యూరు జంగాలం అని చెప్పుకుంటారు. వారు పెండ్లిలో జందెంకూడా వేసుకోవాలి. గిన్నెలకోట, కిలగాడవారు మఠంనుండి వచ్చామని పెండ్లిలో చెప్పుకుంటారు. సీకరివారు శ్రీకాకుళంనుండి, కిముడువారు (గొండెలి) పర్లాకిమిడినుండి వచ్చారట. ఇవి జనప్రచారంలోగల నానుడులు. ఈ నానుడులు వలసల విస్తరణతోపాటు వంశచిహ్నాల (టోటెం) ప్రత్యేకతలగూర్చి ఆలోచించడానికి ఎక్కువ ఉపయోగపడవచ్చును.[3]

❈

*సూకూరిమజ్జులు, బాకూరిరాజులు, లగిసిపల్లిపాత్రులు, పాతకోటపడాండ్లు*

## విశాఖ, గోదావరి, ఖమ్మంజిల్లాల తెలుగు గిరిజన ప్రాంతాలు




1. భద్రాచలం
2. చట్టి
3. జగదల్‌పూర్
4. చింతూరు
5. వరరామచంద్రపురం(రేకపల్లి)
6. కూనవరం
7. వేలేరుపాడు
8. పేరంటపల్లి
9. లక్కవరంజంక్షన్
10. సీలేరు
11. గూడెంకొత్తవీధి
12. వాలిసుగ్రీవులకొండలు
13. గుర్తేడు
14. బొడ్లంక – చవల
15. యార్లగడ్డ
16. రామవరం
17. మారేడుమిల్లి
18. గుజ్జుమామిడివలస
19. చిలువూరుమన్యం
20. సీమగండి
21. చుక్కరాతిగండి
22. దేవీపట్నం
23. పోసమ్మగండి
24. కొరుటూరు
25. పోలవరం
26. కొవ్వూరు
27. రాజమహేంద్రవరం
28. కోరుకొండ
29. కాకినాడ
30. గోకవరం
31. బోనుసీమ
32. రంపచోడవరం
33. అడ్డతీగల
34. రాజవొమ్మంగి
35. కృష్ణదేవిపేట
36. రింతాడజంక్షన్
37. చింతపల్లి
38. లోతుగడ్డజంక్షన్
39. గంగరాజుమాడుగుల
40. చలిగూడెం
41. పులిగూడెం
42. కిలంకోట
43. పెదబయలు
44. పాడేరు
45. హుకుంపేట
46. అరకు
47. అనంతగిరి
48. శృంగవరపుకోట
49. మాడుగుల
50. విశాఖ
51. నర్సీపట్నం
52. శాంబరికొండలు
53. పసిబయలు
54. పిట్టగడ్డజలంపల్లి
55. వడ్డాది

## గోదావరి లోయలు :

విశాఖజిల్లాలోని 'గూడెం' ప్రాంతాన్ని ఆనుకున్న తూర్పుగోదావరిజిల్లాలో దారకొండలోపల గుర్తేడుమొదలు రంపచోడవరంవరకు, యార్లగడ్డ రామవరం, ఏలేశ్వరంవరకు, పడమర పాపికొండలవరకు కాటమరాజుకొండ (పెద్ద కొండ), ధారల దుమ్మకొండ, బాసదుమ్మకొండ, విసకొండ, నాగులకొండ; వాలిపర్వతం, గండిసీమ, ఇజ్జలూరు, మద్దులూరుకొండలు, పాపికొండలు మధ్యమధ్య లోతైనలోయలతో విడివడి మూడువేలఅడుగులఎత్తులో క్రిక్కిరిసివిస్తరించే యీపర్వతాలు "పదివేలశేషుల పడగల మయము" అన్న అన్నమయ్య వర్ణనకు అచ్చమైనఆకృతులు. ఒకశ్రేణి తూర్పుగోదావరిలో నాగులకొండవైపు, పశ్చిమ గోదావరిలోకి (పాపికొండలు) మరొకశ్రేణిగా ఇక్కడి కొండలన్నీ రెండుదిశలలో వ్యాపించాయి.

### కొమ్ముమువారు – గట్టువారు :

డొంకరాయి (దిగువసీలేరు) వద్దనున్న మంగంపాడుకు ఎదురుగా సీలేరు ఆవల ఇరవై, ముప్పై గ్రామాలలోకూడా కొండరెడ్లు ఉన్నారు. ఇవి ఒరిస్సారాష్ట్రంలోనివి. గోదావరికి ఇరుతీరాలలో ఖమ్మంజిల్లాలోగల పేరంటపల్లి, కొల్లూరు మొదలు చిట్టం రెడ్డిపాలెం, కొటారుగొమ్ము, రేపాకగొమ్మువంటిగ్రామాల గోదావరి తీరవాసులను 'కొమ్ముమువారు'గా, టేకులొద్ది, ఉప్పనపల్లి, కూటూరుగట్టువంటి గట్టులలో వారిని 'గట్టువారు'గా గిరిజనులు వ్యవహరించుకుంటారు. హెమెండార్ఫ్ ఒకనాటి ఈనైజాం ప్రాంతంలోనే కొండరెడ్లనుగూర్చి అధ్యయనం చేశారు. గడిమన్యంలోగల బొడ్లంక ప్రాంతాలను 'చవల'గా (పచ్చని భూమి), గోదావరిఒడ్డున కొండమొదలు ప్రాంతాలను చిలువూరిమన్యంగా, రంపచోడవరం ప్రాంతాలను 'బోనుసీమ'గా పిలిచేవారు.

ధారలదుమ్మకొండవంటి కొండలనుండి పారే పాములేరు, సోకులేరు, సీలేరు, కన్నేరు, ఏలేరు, బోడిపెట్టవాగు, సీతపల్లివాగువంటి ఎన్నో ప్రవాహాలతో యీ మన్యమంతా కరెంటుతో వెలిగిపోయే నగరంలా ఉంటుంది. మధ్యలోగల ఊళ్ళు ధారగడ్డలు, ధారవాడలు, ధారగూడేలు, ధారకొండలు; అక్కడ దేవతలు ధారాలమ్మలు. విశాఖ జిల్లాలోనివి గడ్డలు, జోరెలు. గోదావరి జిల్లాలో ఏరులు, వాగులు. ❉

*కొమ్ము, గట్టు, చవల, చిలువూరిమన్యం, బోనుసీమ*

## 'ఈ అడవి దాగిపోనా' –

లోయల్లోనుండి సూర్యకాంతి కోసం పైపైకి సాగే మద్ది, వేగిస, మామిడి, నేరేడు, బండారు వంటి మహావృక్షాలు. వాటినిపాకి, ఆచెట్లసిగలను బంధించే పూవుల మేలి ముసుగులవలె అల్లుకున్న అడ్డ, మోదుగ, గిల్లతీగలు.

ఆ గుబురుల్లో రకరకాల పిట్టలు. ఆ కొమ్మల్లో రాచెలుకలు, అలమబండలు; (కొండముచ్చులు) అవి కొరికిపడేసే పండ్లకోసం, అడ్డకాయలకోసం చేరే కొండగొర్రెలు, నెమళ్ళు.

ద్వితీయశ్రేణిలో ఉసిరి, మారేడు, దేవదారు, ముషిణి, రేల, తడ, వెదురు పొదలు. నేలమీద అడవిచేమంతి, పపిడి, చిట్టిజాన, కొండవెంపలి, కరివేప, సుగంధిపాల పొదలు, కన్నె జీలుగలు, పుట్టువెదురులు, చెంగలి. చిత్తడినేలల్లో మసలే అడవిదున్నలు.

లొద్దులలో తిరిగే కణుసులు – సాపుగా విస్తరించే (చాలతక్కువ) ప్రాంతంలో దుప్పులు, వేటకుక్కలు, లంకలలో నెమళ్ళు. వేనంలో కొండగొర్రెలు (వేనం = కొండ పైనవెన్ను, కొండగొర్రెకు 'వేనపు గొగ్గడి' అని ఇక్కడి పేరు). తోముల్లో పందు పిల్లులు (తోము = లోయల్లో పెద్దచెట్లకింద గుబురుగా ఉన్న పొదలు)

దారి వెంట నడుస్తూ పరిసరాలలో కదలికలను పసిగట్టే పులులు
అన్ని చోట్లా ఎలుగులు, చిరుతలు.

'హుప్'మంటూ ఎగురుతున్న అలమబండల కుప్పిగంతులు. ఎక్కడో 'కురిడేకు' మనే ఆ పేరుగల పిట్టలకేకలు. మధురంగా కూసే నెమళ్ళు, కోకిలలు, మైనాలు.
అడవిపూల మదపువాసనలు, రంగురంగుల ఉడతలు.
దారినుండి తప్పుకునే పాలపిట్టల జంటలు;
కణుపులలో నిప్పురవ్వలుపడి పేలుతున్న వెదురుపొదలు.

ఎండుటాకులమీద ఏదో పాకుతున్న జరజర, నడుస్తున్న గలగల; దూకుతున్న చప్పుళ్లవల్ల కలిగే భయాన్ని భగవంతుడికి వదిలి...
చల్లగా జివ్వుమనిపించే నీళ్ళవాగుమధ్య ఎండపొడపడే ఏ రాయిమీదనో చతికిలపడి, ఈ ప్రకృతిని మనసులో బంధించుకోవాలనిపిస్తుంది. ❋

*వేనం, లొద్ది, తోము*

## ఆహార విహారాలు :

ఈప్రాంతాలలోని కొండరెడ్లకు పోడువ్యవసాయం ప్రధానజీవనాధారం. అడవులలో వేట, కందమూలఫలాలు ఆయాకాలంలో ఆదుకునే ఇతర ఆధరువులు. చింత, సీకాయ, చీపుళ్ళు, తేనెవంటి అడవి ఫలసాయం; కుండలు, ఉప్పు, నూనె, బట్టలువంటి వాటిని కొనుక్కోవడానికి మారకద్రవ్యాలు. కరక, కుంకుడుకాయలు అడవి దిగువ ప్రాంతాలలో దొరుకుతాయి.

సామన్నం, చోడిఅంబలి మామూలు ఆహారం. కొండప్రాంతాలలో జొన్న, దిగువ ప్రాంతాల చెలకలలో (గరువు) గంటి (సజ్జ) వేస్తారు. దేశమంతటా పంటల వాడకంలో కట్టుబాట్లు (బాసలు) విడిపోయే 'దేశవిడి'నెల తరువాత వచ్చే ఫిబ్రవరి అంటే బాడ్డంనెల – (చలికాలం గడిచాక మొదట పూసేది బాడ్డంచెట్టు. ఈ చెట్టుకుపూసే ఎర్రనిపూల చుట్టూ పిట్టలు గుంపులు గుంపులుగా మూగి అల్లరిచేస్తుంటాయి. ఇక్కడి కొండవారు ఆచెట్టు కుసుమించే కాలాన్ని ఆ నెలకు పేరుగా పెట్టుకొన్నారు).

## పోడువ్యవసాయం :

పోడువ్యవసాయం 'సెలపడం' (అడవిని నరకడం)తో మొదలవుతుంది.

తరువాత 'కయ్యి (కొయ్య) దిగడం' (పెద్ద పెద్ద మాకులను ముక్కలుగా నరకడం).

అగ్గులు పెట్టిన పదిహేను రోజులకు భూదేవి పండుగ (విత్తనాల పండుగ).

గంగాలమ్మపండుగ (గోదావరి ఒడ్డున అదే సమయంలో మామిడికొత్త) అయిన తరువాత 'మసిగర్ర ఏరడం' అంటే కాలినమాకులను గుట్టలుగా పేర్చి తగులబెట్టడం

విత్తనాలుజల్లి 'తారు వేయడం' (కంచె)

'నలయేరడం', 'తుక్కుఏరడం', 'మునుములు పట్టడం' అంటే మడిచేయడం యీసాగులో వివిధదశలు.

'తువ్వడం' (ఒలవతో సాపుచేయడం) ఎంతో వళ్ళువంగేవాడు చేసేపని. ఈ చిట్రాళ్ళ గరువులలో అన్నిచోట్లా తువ్వడం వలనుపడదు. భూదేవిపండుగ దాటేవరకు కాస్తోకూస్తో కల్లు వస్తూనే ఉంటుంది.

'బుగ్గిఎద' (అగ్గులుపెట్టే రోజులు) రోజుల్లో ఏపనిచేసినా 'ఎడగీతకు (మధ్యాహ్నం కల్లుచెట్టు గీత) చెల్లు'.

*సామన్నం, చోడిఅంబలి*

ఎడగీత తరువాత షికారు (వేట) ఆ నంజకంతో 'పులివేళ' (సాయంత్రం 4 గంటలకు) కల్లుకు మళ్ళీ తయారు.

పనివాడైతే సాయంత్రం ఒక గంట నరుకుతాడు.

ఇంచుమించు ప్రతి దశకు ఏదో పండుగ ఉన్నది.

విత్తనాల కోసం భూదేవి పండుగ

మోడు తీసేటప్పుడు పచ్చిక పండుగ ('పందికిస్తే పచ్చికకు బలం')

సుంకు (సరువు) పడుతున్నపుడు 'పొట్టసరువు'.

పిట్ట చిలక పంది బారినుండి కాపాడమని చేసే 'బడ్డిపండుగ'.

చివరకు పొలిజరగడం. పొలిలోపోతుపోస్తారు. మొలతాడు గీస్తారు. కళ్ళంచేస్తారు. పొలంపనులన్నీ తీరిన నెలకు 'కొండరాజులపండుగ'.

**కొత్తలు కలపడం :**

ఇవికాక మధ్యలో పంట పంటకు పండుగలున్నాయి. పండుగ చేసి 'కొత్తలు' కలిపితేనే ఆ పంటను తినడానికి అనుజ్ఞ వచ్చినట్లు. బొంత, కన్నె సామ, కొర్రవంటి చిల్లర పంటలు ఎన్ని అందుతున్నా అవి ఆ పదిరోజులతోనే సరి.

'కొత్తకు, పాతకు (పంటలకు) ఎడమైన దసరాలో డాకు– డాకు యిబ్బందులు'

'పిట్ట బొట్టకు దీము మెర్రని(ఎర దొరకని)కాలం'

కడగండ్లబతుకు తెరపిలేని ముసురు రోజులు, ఆకలి తట్టుకోవడానికి రకరకాల తిండ్లు – కూరాకులు, వెదురుమొవ్వు, దుంపలు, పోడులో దొరికే దోస, గుమ్మడి, మొక్కజొన్న కాయలు. కొండవాగులలో కలకదేరని నీళ్ళు. అనారోగ్యం. పనసగింజలు, మామిడిటెంకలు, చింతగింజలు, జీలుగబెండు, తాటిపండ్లు, పోగుచేసుకున్నవారికి వాటి అంబలి, రొట్టె కొంత ఆధారం. పొలం చుట్టూఒడ్డిన కుద్దెలు, మీటెలు, అడపలు, ఉచ్చులు, పాదులు, ఓదంలు, బద్దెలలో ఏవన్నా పిట్టలో, పందులో పడితే–

ఆ 'కొత్తన్నం గువ్వకూర' అమరినది ఎంతో విందురోజు. అంతేకాక

'కొత్తచేను కోమటివాడి దుకాణం'

అన్నీ అందులో పండుతాయి. బొంత, సామ, కొర్ర, చోడి, కంది, మినుమువంటి మెట్టధాన్యాలన్నీ ఒకేచోట చల్లుతారు. మధ్యమధ్య "బుగ్గిబట్ట"లలో (మసిగర్రలు ఒకచోట చేర్చితగులపెడితే గుట్టగా పడిన బూడిదరాశి) పూరేదుపిట్టలుదాగే గుమ్మడి, దోసపాదులు.

## పిందెపట్టిన చేనుచేయకు :

రెండవసంవత్సరంనుండి బలం తగ్గుతుంది. అందువలన "పిందెపట్టిన (పాత పడిన) చేను చేయకు" అనిసామెత. రెండు, మూడేండ్లు చేసినతరువాత ఆచేను వదిలేసి మరోకొండన మరోచేను నరుక్కోవాలి. చేనునరుక్కోడం సామాన్యమైన పనికాదు. కాస్తంత చేనైనా ఊరివారందరూ సాయపడితేగాని ఒకదారికి రాదు. ఆరోజు వారందరికి భోజనంపెట్టాలి, ఇంటివద్ద పిల్లతల్లులకు 'కలిమిముద్దలు" పంపాలి. పనిలోకి రావలసీ వేళకు రాలేకపోయినవారికి 'బంటం, మూటకూడు' దాచిఉంచాలి. పంటవచ్చినపుడు అడపాదడపా ఇలాసహకరించే అయినవారితో కలిగినది పంచుకోవాలి. ఇల్లుకట్టుకోవడానికి, వేటపోవడానికి, గొట్టుకు (గోష్టికి వికృతి) కొలువుకు, బాంధవ్యానికి యీ అన్యోన్యతలే ఆసరా.

రెండు మూడేళ్ళకోసారి పొలం పాతబడిపోయినట్లే యిల్లు కూడా శిథిలమౌతుంది. కొత్తగా పోడుకు అనువైన ప్రదేశాన్ని ఎన్నుకోవడంతో, ఇల్లు కూడా అందుకు దగ్గరగా కట్టుకోవాలి. అందువలన గ్రామంలో ఇళ్ళన్నీ చేనుకొకటిగా చెదరిపోయి ఉంటాయి. వీరందరూ 'నగరిబస'లో కలిసే పండుగరోజున, కదంతొక్కే ఆటపాటలలో, వేడుకలలో వెల్లివిరిసే ఉత్సాహంతో, ప్రతిపల్లె కోలాహలంగా ఉంటుంది.

చేలు పిందెపట్టి పోవడంవలన, చుట్టూవిస్తరించేందుకు అవకాశంలేక, గ్రామం తరచు రోగాలవంటి అనామయబాధలకు గురికావడంవల్ల, గ్రామాలు గ్రామాలే వలస పోతుంటాయి. పాతగ్రామాలు పాడుపడిపోతాయి, పాతచేలు చెలకలైపోతాయి. "పాడు" అంటే విధిగా పాడుపడిన గ్రామమే. ఏ కొద్దిమంది ఉన్నా ఆప్రదేశాన్ని పాడు అనరు. కొండవాడ, గుజ్జుమామిడి వలస, మద్దిపీటిలంకలలో, ఎన్నోమంచి భూములు చేస్తూ చేస్తూ వదిలివేయగా అవి నేడు 'రిజర్వ్'లో కలిసిపోయాయి. భూమి బలికోరుతుందనీ, 'పంటగత్తెర' ఉన్నదని – 'కావడి' (జంట), 'కిమ్మ' (గంప), కోళ్ళతో బలితీరడం లేదని

వదిలివేసి పోయినవారే నేడుచాపరాయిలోని ఒకనాటి తీంగ్రాటికోటరెడ్లు, బొడ్డగండిలో సెరంకోటరెడ్లు. ఒకనాటి బలివృత్తాంతాలు, పిల్లలను ఎత్తుకుపోతారనే భయాలవల్ల ఆ ప్రాంతాలతో బాంధవ్యమేకాదు, రాకపోకలకుగూడా జంకేవారు యిక్కడి గిరిజనులు.

**ఇళ్ళు – పాకలు :**

చేనుదగ్గరగా చేనుపాకవేసుకొని పొలంపనులుతీరినాక చాలామంది గ్రామంలోకి వస్తారు. వ్యవసాయానికి ఆధారమైన సమిష్టికుటుంబాలకనువుగా దీర్ఘచతురస్రంగా ఉండే యీయిళ్ళవి 'రివ్వగోడలు' (రాటలపై మెత్తిన గోడలు) వాసాలకు 'కోరెకట్టు', 'పక్కపీనెలు' (అరుగులు) 'నడిమిల్లు' వంటగది, దబ్బగడ్డినేత. వాననీరు ఇంటిచుట్టూ చేరకుండా 'వలుచందిరి పట్టడం' (గాడితవ్వడం) – నిర్మాణ విశేషాలు.

ఆయా అవసరాలకు తగ్గట్టుగా వేసుకొనేవి చేనుపాక, చేటపాక, కొక్కిపాక, గోనెపాకలు. 'చేనుచెయ్యవాలె; చేటపాకవెయ్యవాలె; బొక్కుదెంగవాలె – బొట్టికెత్తవాలె' అని యిక్కడి సామెత.

ఇంటిముందు చిక్కుడుపాదులు, ప్రక్కన కోళ్ళదొర్రి, ఇల్లును ఆనుకొని చేమదొడ్డి, పొగతోట; ఊరిమధ్య చింతమాను చివటలు.

ఇంటినిండా పొగమసి, నాటుపొగాకు మాగినవాసన, వెదురుచాపలు, గోడల నిండా నల్లులు; వీటిని పట్టించుకోకపోతే–వాళ్ళఅడవికబుర్లు కొండంత వినోదం, విజ్ఞానం కలిగిస్తాయి.

**వెదురుగొట్టాలు – అనపకాయబుర్రలు :**

రెడ్లు మంచిమేదరులు. తడికలు, చాపలు, బుట్టలు, అమ్మకానికి కూడా అల్లుతారు. వెదురుగొట్టాలు, అనపకాయబుర్రలే వారిసంస్కృతికి ఆధారాలు. నీటివనరులు సమృద్ధిగాగల అడవికాబట్టి అన్నిరకాలవెదురు దొరుకుతుంది. జీలుగ, తాటిచెట్లకు కల్లుదింపడానికి వెదురుగొట్టాలు, వెదురుతాపలు; కల్లు పోసు కునేందుకు పెద్దడిప్పలు, ఏ ద్రవాన్నైనా వడ్డించడానికి, తాగడానికి రకరకాల డోకులు, (సొరకాయ డిప్పలు) ములచబొంగుల్లో, ఆకుదొన్నెల్లో మాంసాన్ని పొట్లంవేయడం వీరి వంటల, పాత్రల తీరులు. రంపరాజ్యంలో కుమ్మర్లులేరు. కుండలు దిగువ ప్రాంతాల నుండి (కృష్ణునిపాలెం – గోకవరంవద్ద) రావలసిందే. కమ్మరులు ఇనుము సంతలోనే కొనుక్కొంటారు.

---

*రివ్వగోడలు, కోరెకట్టు, పక్కపీనెలు, నడిమిల్లు, దబ్బగడ్డినేత, వలుచందిరిపట్టడం*

సవితి, పలకం (నవంబరు– డిసెంబరు) నెలలో ఇంచుమించు పంటలన్నీ చేతి కందుతూ ఉంటాయి. 'చలికూటికి బాలయేడ్వని కాలం' అది.

పొలులుచెల్లిన తరువాత 'పిండిపండుగ'. (రాగులుపిండివిసరి అంబలి కాచు కోడానికి), 'పప్పులపండుగ' (పప్పులు వేయించితినడానికి) వస్తాయి. ఈపండుగలు ఒక గ్రామంలోతీరి, ఒకగ్రామంలో తీరక, చుట్టాలరాకపోకలకు అడ్డంకి. (పండుగ చేసుకున్న గ్రామంలో, చేసుకోని గ్రామంవారు ఆ పంట తినకూడదు) దేశవిడి (సంక్రాంతి) పండుగ జరిపి 'ఉత్తమ సంకురాత్రి ఊళ్ళమీద పోయిందయ్యా, ఉండే వారైనా – పోయేవారైనా ఇంక ఈ రోజుతో అడ్డంకులు సరి' అని పెద్దలు చాటుతారు.

బాగా కల్లుట్టే యీరోజుల్లో గ్రామాల్లో ఔజం మోగిస్తూ, అర్ధరాత్రి తిరిగే వరకు (తానంపండుగ) (కొండరాజులపండుగ) పదాలుపాడుతూ ఆడతారు. సుమారు నెల రోజులపాటు సాగేయీకొలువులో పాటసాగదు; లయకలువదు. కల్లుతిక్కలో మతి తప్పిన గతులవి. తానంపండుగనుండి గంగాలమ్మపండుగవరకు పల్లెల్లో ఉత్సాహం పట్టశక్యంకాదు. అటవీఫలసాయం అమ్ముకునే రోజులవి. సంతలలో కొత్తకొత్త సరదాలు. దారివెంట జతలవారితో సరసాలు. గంగాలమ్మ పండుగ ముందు వెనుక తొలకరించేవరకు పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి.

కొత్తలుకలపడం, పాలపదును మీదనే జరుగుతుంటే, కాయలు కూరలు ముదిరే దాకా బాసలు చెల్లవు. ఏదైనా బాగాపండినతరువాతనే పుష్టినిస్తుందనే సూక్ష్మదృష్టితో పాటు, ఈ నియమం లేతకాపునే స్వాహాచేయకుండా నిగ్రహించి ముందురోజులకు ఆదుకుంటోంది. శివరాత్రికి చివురించి, గంగమ్మ పండుగనాటికి కుసుమించిన అడవి, ఏటవాలుగ రెల్లపూలను తురుముకొన్న వనకన్యలా కనిపిస్తుంది. మధ్యాహ్నపు మండుటెండలో బూరుగపూల మధువుకు చేరే పిట్టలకేకలతో, ('మధ్యసిత్రం') ప్రకృతి ఉల్లాసకరంగా కనిపిస్తుంది. ఈ రెల్లపూలను అమ్మవారికి ముడిచేదాకా (గంగమ్మ పండుగలో) తెంపరు. తమతల్లి భూదేవత యీకుసుమసంపదతో శోభాయమానంగా ఉండాలన్న సౌందర్యస్పృహ ఇందుకు కారణమేమో. ❈

# అడవి - కొండలు - నెలవ్వులు




1. కట్టువ
2. మెట్ట
3. మందం
4. వేణంఅంచు
5. జవుక
6. కోరెం
7. కొపిరెం
8. తరుము
9. తేలు
10. గొమ్ము
11. ఎకురుకొండ
12. ఒడిదడక
13. కొండ
14. గొంది
15. మెట్ట
16. తారటిఅడవి
17. లాగబొక్క
18. చేటవేణము
19. లంక
20. ఉరుకు
21. లొద్ది

**జంతువుల స్థలాలు:**

1. మెట్ట 2. ఒడిదడక 3. లొద్ది 4. గొంది
5. తారటిఅడవి 6. లంక 7. కొండ 8. తేనెపట్టు
9. లాగబొక్కలో:
నేదులు, ఎలుగుబంట్లు, పాములు, పులులు, నక్కలు, రెంచుకుక్కలు, అడవిపందులు వర్షాకాలంలో తలదాచుకుంటాయి.

**లాగబొక్కలో కాపురంచేసే జంతువులు:**

1.రెంచుకుక్కలు 2.పులి 3.ఎలుగు 4.నేదు 5.పాములు

– *పల్లాలబొర్రంరెడ్డి, మారేడుమిల్లి*


గోదావరి గిరిజనుల గ్రామపటం
రాజులపండుగ
పుట్ట
నగరిబస
పోడు
భూదేవి చింతలు
గుబ్బట్లమామిడి
గోవులమామిడి
గొట్టిబస
ఆటబస
చేవడి (కల్లు) బస
నూరింటి
- దారి -
- దారి -
- దారి -
చెలమ
గంగాలమ్మ
దారిపండుగ
వాగు
వాగు
వాగు
వాగు
వలుకులు దిబ్బ
నీలాటిరేవు
చెలకలు
మగనాలి
మెట్ట

## పుడమితల్లికి – సహస్రనామార్చన :

కట్టువ, మెట్ట, మందం, వేణం, జవుక, కోరెం, కొపిరెం, తరుము, తేలు, గొమ్ము, ఎకురుకొండ, ఒడిదడక, కొండ, గొంది, మెట్ట, తారటి అడవి, లాగబొక్క, చేటవేణం, లంక, ఉరుకు, లొద్ది – ఇవి ఇక్కడి భూగోళంలో వివిధ ఆకృతులు.

ఇక్కడ పరిసరాల పేర్లన్నీ కలిపితే అది అడవికి వర్ణన అవుతుంది.

కరింగిన గొంది (వర్షానికి మట్టికరిగి జారిపోయిన గొంది).

మద్దిమాను దూకుడు (నీటిమద్దిమానులమధ్య రాళ్ళమీదుగా దూకుతూ పారేకొండకాలువ).

కణుజు నాకిన రాయి (కణుజులు చవుడు తినడానికి వచ్చేచోటు).
తుమ్మెదల బొక్క (ఒడ్డున తడిపైవాలే సీతాకోకచిలుకలతో సందడిగాఉన్న వాగుమలుపు)
కోరుకొండ కొమ్ములు (శృంగాలు).
కోరుకొండ వంపులు (కొండ కిందకాలువ మలుపులు).
తియ్యమామిడి గండి (గండి = కొండ దారి)

ఔజంకల్లు; ఔజం = డమరుకంవలె నడుముసన్నగా ఉండేరాయి. ఔజంవంటి కల్లు.

పికిలిపిట్టవేనం (వేనం = 3000 – 4000 అడుగుల ఎత్తున కొండమీద చిట్టీత తుప్పలతోనిండిన సాపునేల). తోటమామిడివాయ(వాగు)=అప్పటిదాకా సాగిన కొండ క్రమంగా వాగుదగ్గర తగ్గి మరల తేలడం మొదలుపెడుతూ స్తనాభోగాన్ని తలపిస్తుంది. ఉసిరిక జవుక (జవుక = కొండకాస్తతగ్గిన భాగం). అంట్లలొద్ది – కొండఅరటి చెట్లున్న కొండలోయ (నీరు పుడితే లొద్ది, పుట్టకపోతే గొంది). ఎగుడుదిగుడు ప్రాంతాన్ని 'ఒడిదుడకల' 'ఒడిదుడకల మెరకపొలం–జారుబురద జాగరత' అని హెచ్చరిస్తుంటారు.

తూరురాయి కట్టువ = (ఆ రాయి తోరణంలా ఉంటుంది. కిందకువంగి పోవాలి)
బద్దిమామిడి లంక (లంక = సమప్రదేశం)
గుజ్జుమామిడివలస = అటువంటి పండ్లుకాసే మామిడిదగ్గర స్థిరపడ్డ వలస గ్రామం.
కూకినలోవగొంది (పెద్దపెద్ద చెట్లు మూసుకొని పొద్దు క్రుంకినట్లుంటుంది).
నెమలాట పనుకు = ఆ పనుకుమీద నెమళ్ళు ఆడతాయి.

---

*పికిలిపిట్టవేనం, కణుజునాకినరాయి, కూకినలోవగొంది*

కరమాటి చిడుగ ( చిడుగ = తుప్ప) కారుమామిడి చూట్టూగల చిడుగ

పులిబరుకుడు మానువంపు = ఆ దారిన వచ్చినప్పుడు ఆమెత్తని మాను బరకడం పులికి అలవాటు (మారేడుమిల్లి దారిలో దేవరపల్లి ఎదురుగా గుబ్బట్ల గండివెనుక – పాత సంతలదారిలో)

పాపికొండ మర్రెం = ('ఆమర్రెం చెక్కలించుకొని పోయింది గోదావరి' అంటారు) మర్రెం = పర్వత కిరీటం ఈ మర్రెం వాడుక పాపికొండ ఒక్కదానికే.

ఉత్తరంమీద విలాసంవలె, వేటాడేసమాజం, పరిసరాన్ని, దాని అనేకభంగిమలను ఎంతఖచ్చితంగా గుర్తిస్తుందో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈపేర్లలో పాతికశాతమైనా మామిడిచెట్టును, ఇతరఫలవృక్షాలను ఆధారంగా చేసుకొన్నవి, మామిడిది ఒంటరిజీవితం. చుట్టూచెట్లలో అది కొంతచోటును సొంతంచేసుకుంటుంది. ఈ మామిడిపండ్లుకూడా చెట్టుకోతీరు. గురమామిడి (గుర = అడవిదున్నలు. అవి మరిగిన మామిడి), ఆకుమామిడి, అంబలిమామిడి, నత్తలమామిడి (దానిపండ్లు వర్షా కాలంలో రాలతాయి. నానిన ఆపండ్లతో ఆచుట్టూ పులిసిన కల్లులాంటి వాసన. ఆనానిన నేలలో నత్తలు తిరుగుతుంటాయి). మామిడికొత్త అన్నిటికంటె నిష్ఠతో చేయవలసిన పండుగ. పండుగచేయకముందు, పూత, కల్లులో పొరబాటున రాలుతుందేమోనని మామిడిచెట్టుకింద కూర్చొని కల్లుతాగరు. మామిడిటెంకలు తినడానికి టెంకలపండుగ, జన్నెలకు (వరుగులకు) 'జన్నెకొత్త'. కొత్తతీరిన తరువాత కలిచేసుకొనితాంద్ర పోసుకోవచ్చు. దీనికి ముందు తప్పనిసరి అయితే 'సోకెలి'తో (తొక్క) మాత్రమే తినాలి.

ఋతుచక్రమంతా మామిడిచుట్టూ అల్లుకున్నదే. 'మామిడికొమ్మలు తడిపే వర్షం' (ఫిబ్రవరిలో వర్షాలకు పేరు) 'కోరుకొండకు మామిడి కోడిగుడ్డంత' ఎర్రగాయ రొండి (మామిడిపండ్లు ఎర్రబడే రోహిణికార్తె). దూలవిడినెల(మే) 'దూలవిడికి మామిడి దులదుల రాలుతుంది'. జూన్‌నెలపేరు 'పెద్దవిడి' ('పెద్దవిడికి మామిడిపేరు లేకుండా పోతుంది').

చిగురిస్తున్న బూసిచెట్టు ఇంద్రధనుస్సును తలపిస్తుంది. ఎర్రని కొత్తచిగుళ్ళు విచ్చుకుంటుంటే, కింద వరుసలో చిగుళ్ళు ఆకుపచ్చగా, ఆకింది వరుసలో పండు టాకులు పసుపుపచ్చ రంగులోకి మారుతుంటాయి. బూసిపండు తీపి, పులుపులు కలిసిన రుచి. బూసికొండ, బూసిగూడెం, బూసిగొంది, బూసికాలువ.

*దూలవిడికి మామిడి దులదులరాలుతుంది - పెద్దవిడికి పేరులేకుండా పోతుంది*

పోలమానుగొంది, పోలోవ (పోలపండ్లు తీయనివి).

ఆహారసేకరణకు ఈవిధమైన నామకరణం ఆయాదశలలో సమాజపు సంజ్ఞానానికి (సంజ్ఞ – సంజ్ఞానం) పునాది.

వేట బాగాకనిపించడంకోసం–ఎండుటాకులమీద నడక, చప్పుడుకాకుండా వేటాడడంకోసం, వేసవికాలంలో కొండలకు అగ్గులుపెడతారు. దట్టమైనఅడవులు ఇరుకైనలోయలు కాబట్టి ఇక్కడ సోపువేటలో పదిమంది జతగూడడానికి అవకాశం దొరికింది. నాలుగువైపుల కమ్ముకొనిసోపడం, అగ్గితోసోపడం, నీటిలోకి, (గోదావరి, సీలేరువగైరాలలోకి) సోపడంవంటివి; సోపువేటలో వివిధపద్ధతులు; ఇక్కడ అమ్ము యొక్కనారస, అంటే, ఇనుపముక్కులకు ఇరువైపుల, పాముపడగపై పాదాలవలె యీనెలుండేటట్లు తయారుచేస్తారు. తగిలినవెంటనే జంతువు ఏ తుప్పలోకో పోయిన జాడ, యీనెవెంట కారేరక్తపుచుక్కలు చూపుతాయి.

**ఎలుగులు – మనుషుల దాగుడుమూతలు :**

పనసపిక్కలు, మామిడిటెంకలు, చింతగింజలు పాతర వేసుకొని దాచుకొంటారు. వేకువనే కొండమామిడిపండ్లకోసం, ఎలుగులు, మనుషులు దాగుడుమూతలు ఆడు తుంటారు. రాలిన తాటిపండ్లకోసం, తెల్లవారేలోపే పడిన చప్పుడు వినిపించడమే తడవుగా పరుగుపెడుతుంటారు. ఆ టెంకలు పాతి తేగలను తింటారు. ముంజల కోసం తాటిగెలలు కొట్టరు. అవి ముదిరితే పండ్లు, ఆ తరువాత తేగలు వస్తాయి గదా.

ఊరిమధ్యలో చెట్లన్నీ 'నూరింటి' (చింత, పనస) ఊరందరి సొత్తు.[4] ఆ ఫల సాయాన్ని అందరూ సమంగా పంచుకుంటారు, లేదా వాటిని అమ్మిన సొమ్ముతో పండుగ ఖర్చుగడుపుతారు. కోళ్ళు 'అక్కర'కు సరిపడ ప్రతివారికి ఉంటాయి. ప్రతి పండుగకు ఇవి అవసరమే. మేకలు ఆసక్తిగలవారు పెంచుతారు. పశువులు పల్లపు వ్యవసాయంగలిగి, నాగలిసేద్యం చేసేవారికిమాత్రమే అవసరం. జంగాలప్రభావంవలన రెడ్లలో కొందరు పందులను పెంచకపోయినప్పటికీ మాంసం అందరికీ యిష్టమైనదే. అవి పంట పాడుచేస్తాయని పెంచడానికి కొంత యిష్టపడరు.

విశాఖ, తూర్పుగోదావరిజిల్లా మన్యాలకు ప్రస్తుతం ఉన్నకులాలలో చివరగా వలసవచ్చినవారు వాల్మీకులే. ప్రతి గ్రామంలో బారికలు (గ్రామనౌకరు) లేక కోలగాళ్ళు

(కొలువుగాండ్లు)వాల్మీకులే కాబట్టి, విధిగా ఒక కుటుంబమైనా వాల్మీకులది గ్రామంలో ఉండి తీరుతుంది. నాటి రోజుల్లో ఏడాదికొకసారే సంతమొహం చూసే గిరిజనులకు, గోనెటెడ్లు, గుర్రాలతో రవాణా సౌకర్యాలు నిర్వహిస్తూ, వాల్మీకులు వ్యాపారరంగాన్ని కైవసం చేసుకున్నారు. శుభ్రత, మన్నన, అవగాహనలతో అధికారుల ఆదరణ సంపాదించుకోగలిగారు. వ్యాపారంద్వారా వ్యవసాయంలోప్రవేశించి పల్లపుభూములను, పండ్లతోటలను తమవిచేసుకున్నారు. కొన్నిగ్రామాలు పూర్తిగా వారివే.

మిగిలిన గిరిజనులకు అక్షరజ్ఞానం కలిగించినది – రామాయణ, భారత గాథలను ప్రచారంచేసినది వీరే. మన్యాన్ని, మిగతా ప్రపంచంలో ఒకటిగా చేయడంలో వీరిపాత్ర గుర్తించదగినది. లాభనష్టాలను అంచనా వేసుకోగల వీరు మాటకారులు. కార్యవాదులు కాని ఖడ్గవాదులు కారు. ఉపయోగపడే ఏమార్పునైనా అందుకోగల చురుకు, ఊహాపోహలు వీరికిఉన్నాయి. వీరిమీద ఎన్నో సామెతలు.

'మాలకు మాటలు పొడుగు – రొయ్యకు మీసాలు పొడుగు'
'మాలవాడి మాటలు తేలిక – నీటిలో మూటలు తేలిక'
'అడవికి అరటాకు మెత్తగ – ఊరికి మాలవాడు మెత్తగ'
'సంకురాతిరి మబ్బులు – మాలవాడి బొంకులు'
'మాటపెరిగితే మాలవీధికి పోవాలి' (నొప్పించక తీర్పు చెపుతాడు)
'మాలవాడి మాట – మంచిమిరియం గిడ్డ'
'ఉల్లిపాయంత మాలవాడు ఊరంతాకంపు'

మిగిలిన గిరిజనులకంటె లౌక్యం నేర్చినవారుకావడం మూలాన వీరిని వారితో పోల్చిఅపార్థం చేసుకోవడం కద్దు. కాని గిరిజనుడు అడవిలోని జీవయాత్రలో ఎంత వాస్తవిక దృష్టితో వ్యవహరిస్తాడో, మాల ఒకరితో వ్యవహరించడంలో తన లాభం గూర్చి అంత శ్రద్ధ వహిస్తాడు. ఎవరి ప్రపంచానికితగిన దృక్పథం వారిది. వాణిజ్యమేధోవృత్తులు స్వీకరించారుగాబట్టి ఆర్థికంగా బలపడే ప్రయత్నం చేస్తూంటారు. రెడ్లలో స్వర్గీయ పల్లాలలింగారెడ్డి, (గుజ్జుమామిడివలస) వాల్మీకులలో లక్కొండశివరాజయోగి (యార్లగడ్డ రామవరం), గొర్లెనాగయ్యదాసు, రామకృష్ణదాసులు (గుర్తేడు) అచలమతాన్ని స్వీకరించినప్పటికీ, ఇది వ్యాప్తిచెందింది వాల్మీకులలోనే. హరిభజనలు, రామకోవెలలు,

*గుర్రాలు, గోనెటెడ్లు*

త్రినాధవ్రతాలుచేస్తూ, గోమాంసాన్నిమాని, తమకు అంటగట్టిన అస్పృశ్యతకళంకాన్ని మాపుకోడానికి ఈ ఆరాధనపద్ధతులతో, ఆర్థికస్థాయితో ప్రయత్నిస్తుంటారు. రామశరణ్ బావా తాను వాల్మీకిశిష్యుడిగా చెప్పుకునేవాడట. ఆ పరంపరలోని వారుగా, వీరు తమను వాల్మీకులుగా పిలుచుకుంటున్నట్లు కనిపిస్తుంది.[5] రంపచోడవరం, ఎల్లవరం తాలూకాలలో (గుర్తేడు, దారగడ్డ, వేటుకూరు, రామవరంతప్పు) అధికశాతం వాల్మీకులు క్రైస్తవులుగా మారారు. గిరిజనులకు ప్రభుత్వమిచ్చే అవకాశాలను అందుకోవడంలో వాల్మీకులతోపాటు మిగిలిన ఆదివాసులు ముందుకు రాలేకపోతున్నారు. ప్రతిభలలో అంతరమున్న ఈ జాతులన్నింటిని ఒకే గాటకట్టడంతో ఈ అంతరాలు మరీ పెరిగిపోతున్నాయి.

గోదావరిఒడ్డున నల్లరేగడి పొలాలలో ఎన్నోతరాలుగా వలసవచ్చిన దిగువరైతులు మిర్చి, పొగాకుపండిస్తారు. గోదావరిమీద రాదారిపడవలు, లాంచీలద్వారా జరిగే కలప వ్యాపారంలో కూలీలుగా, భూస్వాములవద్ద పాలేరులుగా పనిచేసే ఇక్కడి కొండరెడ్లకు చిరకాలంగా బయటి ప్రపంచం తెలుసు. మామిడి, బూరుగమానులను దోనెలుగా తొలచి గోదావరిలో చేపలుపట్టడం రెడ్లు కొంత నేర్చారు. గ్రామాలమధ్య రాకపోకలకు దోనెలను ఉపయోగిస్తారు. ఈప్రాంతంలో కొండరెడ్ల జనాభాచాలా తక్కువ కాని తమప్రత్యేకతను 'దొర్లంకాము దొసలంకాము–తుమ్మెదీరో–మన్నెంకట్ల రెడ్లంమేము తుమ్మెదీరో' అని పాడుకుంటూ చాటుకుంటారు. నైజాంకు చెందిన ఈప్రాంతంలో, బ్రిటిష్‌భూభాగంలోని ముఠాదారీ పరిపాలనలులేవు. గ్రామానికి 'పిన్నపెద్ద', కులమంతటికీ 'కులపెద్ద' నాయకులు. ఈ ప్రాంతం దిగువలో కోయలు విస్తరించారు. ఖమ్మం,గోదావరిజిల్లాల్లో రెడ్ల ఆచారవ్యవహారాలు పోల్చిచూడడంవలన సమాజ వికాసంలోని కొన్ని మౌలిక విశేషాలకు ఆధారాలు దొరుకుతాయి. ❉

## విశాఖగిరిజనుల ఋతువులు - నెలలు స్థితిగతులు

| | |
|---|---|
| శివరాత్రి | 'శివరాత్రి దాటిన తరువాత చిక్కెడు గంజైనా దొరకదు' |
| లంజేటి | చిన్నఅవిటి– అవిటి (సామలు వెన్ను కట్టే కాలం) |
| బందపని | బందపనికి బండెడువర్షం – బండిగాలి |
| మునుకోలు | ముడుకులోతు కాలువలు. ముడుచుకొని కూర్చోవడం |
| అవిటి | పెద్దఅవిటి 'అవిటికివేస్తే ఆకైనా నాటుతది' |
| కన్నె | కన్నెకు కదులు కాలువలు. కదురుపొట్ట<br>'కన్నెనెలకు కాలిపట్టీలనుండి అమ్ముకొని తింటారు' |
| దసరా | దసరాకు దనకాలు; ధన ధన అని చప్పుడుతో వర్షం. దాటెన్ను |
| సవితిపలకం | 'ముక్కనుమ ముక్కులు మూతులు ఎండుతుంటే ముక్కుకమ్మలు అమ్ముకొని తింటారు'<br>'సవితి పలకాలకు చట్టి చెంబులు అమ్ముకొని తింటారు' |

| మంచు | వర్షాలు |
|---|---|
| దసరా – మద్దిమంచు | పొగును – పొక్కువర్షం |
| సవితి – గాందుమంచు | తొలకరి – చిగురాకు ముసురు |
| పలకం – ముడిమంచు | లంజేటి – పిట్టపిల్ల ముసురు |
| సంకురాత్రి – బుగ్గిమంచు | దసరా – ధనకాలు |
| | సవితి – తపతపలు |

| | వేళలు | - | గంటలు |
|---|---|---|---|
| 1. | కోడిజాము | – | వేకువ 4–5 గంటలు |
| 2. | బొమ్మెత్తువేళ | – | ఉదయం 9 గంటలు |
| 3. | ఎడగీతవేళ | – | మధ్యాహ్నం కల్లు సమయం |
| 4. | మధ్యసిత్రం | – | మధ్యాహ్నం 2 గంటలు |
| 5. | మందలవేళ | – | సాయంత్రం 4 గంటలు |
| 6. | పులివేళ | – | సాయంత్రం 5 గంటలు |
| 7. | సేవడి | – | సాయంత్రం 6 గంటలు |
| 8. | గాంధారివేళ | – | రాత్రి 2 గంటలు |

## అరకులోయలో కొటియాల ఋతువ్యులు-నెలలు-ఆటపాటలు

| | | |
|---|---|---|
| పుష్యం | - | సంక్రాంతి - ధింసానాట్యం |
| మాఘం | - | "మాఘంతో మేఘం - ఫాల్గుణంతో వర్షం" |
| ఫాల్గుణం | - | పొగును - సంగిడి ఆటలు, పప్పులపండుగ |
| చైత్రం | - | తోడిపాటలు, ఇటింపండుగ<br>(ఆలపాటలు మొదలు-సంగిడి ముగింపు) |
| వైశాఖం | - | బొయ్‌కుండ (పెండ్లికుండ-ఐరేనికుండ) |
| జ్యేష్టం | - | లంజేటి అంటే పొట్టిజడ (వెన్ను)<br>(ఈనెల పౌర్ణమి అయినాక సామలు ఇక చల్లరు) |
| ఆషాఢం | - | భాద్రపదం - సయిలోరి పాటలు. కొర్రకొత్త |
| ఆశ్వయుజం | - | ఓసనెల |
| దసరా | - | జంతువులు కూడే సమయం. |
| దీపావళి | - | పెద్దలపండుగ |
| మార్గశిరం | - | మంచునెల |

❁ పొరుగుగిరిజనుల ఋతువుల, నెలలవరుస, తెలుగు గిరిజనులకాలచక్రాన్ని మరింత అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ఆదివాసి లోకోర్, పొరబ్‌కథ (ఆదివాసీల పండుగలు) 1978 సమగ్ర గిరిజన అభివృద్ధిసంస్థ, పాడేరు.

# గోదావరిమన్యం ఋతుచక్రం

| | | |
|---|---|---|
| జనవరి – దేశవిడి | : | (సంక్రాంతి) దేశమంతా పండుగవిడిపోతుంది |
| ఫిబ్రరి – బాడ్డం | : | పప్పులపండుగ, పిండిపండుగ, రాజులపండుగ, శివరాత్రి |
| | | ‘రండో చేరి పాండవులారా భోంచేయరండో’ |
| | | ‘లేలేలమ్మారో ఓలే లేలా లేలా’ |
| మార్చి – కొత్తమాస | : | భూదేవిపండుగ, విత్తనాలపండుగ |
| | | ‘పుట్టినదాట భూమి దేవుడు పూరడి పిట్టలవన్నె’ |
| ఏప్రిల్ – కోరుకొండ | : | కోరుకొండకొలువు (రథోత్సవం) |
| | | ‘కోరుకొండకు మామిళ్ళు కోడి గుడ్డంత’ |
| | | మామిడిపండుగ, భద్రాచలంలో దేవుడిపెళ్ళి |
| మే – గంగాలమ్మపండుగ | : | ఎర్రగాయరొండ్డి – కణుసుమొరకలఎండ |
| పండుగ పదాలు | : | ‘ఆడవాలె పాడవాలె – వేడుకాలు చెయ్యావాలెయా’ |
| | | అమ్మవారు ఉండేటప్పుడు ఆడేపాడే బాలలము |
| పెళ్ళి పదాలు | : | అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా |
| | | లిల్లిబూచో లిల్లేలేవో లల్లవారు బాలకోడలా |
| జూన్ – దూలవిడి | : | దూలవిడికి మామిడి దులదుల రాలుతుంది |
| జూలై – పెద్దవిడి | : | పెద్దవిడికి మామిడి పేరులేకుండా పోతుంది |
| అగష్టు–కొత్తలుకలపడం | : | మునుకోలుకు ముద్ద (బొంత) తొలిపంట |
| సెప్టెంబరు – కన్నె | : | ‘కన్నె పిట్ట దిగిందోయ్ పప్పులు చల్లాలి’ |
| అక్టోబరు – దసరా | : | బరువడి (గండుపిల్లి) |
| | | ‘దశమి పోతులు కొరకవాలె’ అనుకుంటుంది |
| | | ‘దసరాకు కొత్తపాతల ఎడం – డాకు డాకు ఇబ్బందులు’ |
| నవంబరు–సవితి, పలకం | : | ‘చలికూటికి బాల ఏడ్వని కాలం’ |
| డిసెంబరు–సవితి, పలకం | : | ‘సవితి పలకానికి జల్లున పంట’ |

| తెలుగునెల | ఆంగ్లమాసం | విశాఖమన్యం | గోదావరిమన్యం |
|---|---|---|---|
| చైత్రం | ఏప్రియల్–మే | ఇటిం | కోరుకొండ |
| వైశాఖం | మే–జూన్ | బైశాగి | కొత్తఅమావాస్య |
| జ్యేష్ఠం | జూన్–జులై | అవిటి (లంజేటి) | దూలవిడి |
| ఆషాడం | జులై–ఆగష్టు | దూలఅవిటి (ఆషాడం) | పెద్దవిడి |
| శ్రావణం | ఆగష్టు–సెప్టెంబర్ | మునుకోలు (బందపని) | మునుకోలు |
| భాద్రపదం | సెప్టెంబర్–అక్టోబర్ | కన్నె | కన్నె |
| ఆశ్వయుజం | అక్టోబర్–నవంబర్ | దసరా | దసరా |
| కార్తీకం | నవంబర్–డిసెంబర్ | సవితి | సవితి |
| మార్గశిరం | డిసెంబర్–జనవరి | పలకం | పలకం |
| పుష్యం | జనవరి–ఫిబ్రవరి | సంకురాత్రి | దేశవిడి |
| మాఘం | ఫిబ్రవరి–మార్చి | శివరాత్రి | శివరాత్రి |
| ఫాల్గుణం | మార్చి–ఏప్రియల్ | పొగును | బొడ్డం |

**డోకి**



# గోదావరి, విశాఖలలో ఆచారాలు - నుడికారాలు

| | | |
|---|---|---|
| కొత్తలుకలపడం | = | వెన్నులుముంపడం |
| దేశవిడి | = | సంక్రాంతి |
| భూదేవిపండుగ | = | నందిపండుగ |
| అడవిరాజులు | = | కొండదానుగుడు |
| గంగాలమ్మ (గొర్లెవారి ఆడపడుచు) | = | మాలగంగు (మండిపర్వతం) |
| రాజులపండుగ, పప్పులపండుగ, విత్తనాలపండుగ, భూదేవిపండుగ | = | నందిపండుగ |
| పన్నెండురాటలపందిరి | = | బొయ్యికట్టిపెండ్లి |
| మన్ననచుట్టరికాలు | = | నేస్తంకట్టడం |
| దూలవిడికి మామిడి దులదులరాలుతుంది | = | దూలపురుగుపడేనెల |
| మునుకోలుకు ముద్ద (బొంత పండేనెల) | = | మునుకోలుకు ముద్ద చేసుకుని కూచోవడం |

## డిప్పలు





**నల్లమలలో సెలలు, సరులు, కురవలు, కట్టువలు, సారవలు, బరకలు, పడియలు:**

ఆంధ్రప్రదేశ్ మధ్యన తెలంగాణా, ఆంధ్రప్రాంతాలలో (కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్గొండ, మహబూబ్‌నగర్‌జిల్లాల) మధ్యగల నల్లమలఅడవులు మట్టిరాళ్ళు, బురదరాళ్ళు పరిణామంచెంది ఏర్పడిన పలకలమీద పేరుకున్న మట్టిమీద పెరిగాయి. వర్షచ్ఛాయాప్రాంతాలైన రాయలసీమ, తెలంగాణలోని యీప్రాంతంలో వర్షపాతం 40–50సెం.మీ. మాత్రమే. మట్టికూడా కొన్ని అంగుళాల లోతైనది మాత్రమే. అందు వలన ఇక్కడ పెరిగేది చిట్టడవి. బిల్లుడు, ఏపె, అందుగ, చిరిమాను, పదిపదిహేను అడుగుల ఎత్తు పెరుగుతాయి. చిటిముటి, జాన, దేవదారు, పరిమి, తునికి, వెలగ, కలేక్కాయలవంటి చిన్నచిన్న పండ్లు ఇక్కడ దొరుకుతాయి.[6]

దుర్గంకొండ, దారబయలుకొండ, శోభనాలకొండ, శిఖరంకొండ, ఫారాబాద్, వట్టివారిపల్లి ఎతైనకొండలు. ఆత్మకూరు దోర్నాలను కలిపే మంత్రాలమ్మకనుమ ఈ అరణ్యానికి పడమటి అంచునవుంది.

అమరాబాద్, పెచ్చెరువు, నెక్కంటి, గుట్టలచేను, మర్రిచెరువు, శ్రీశైలం ఈ నల్లమలలోని కట్టువలు.

గుండంబురుజు, గుండాల, సలేశ్వరం ఎత్తిపోతల, చింతల, మామిడిసెల, కానుగగుంతల ఈఅడవిలో మైదానాలు.

కదలీవనం, అక్కమ్మబిలం, నీలగిరి, ద్వారపుసరి, పాలంకసరి చెప్పుకోదగ్గ కొండసరులు.

రోళ్ళవాగు, పాలంకవాగు, భీమునికొలనువాగు, చిన్నవరంవాగు, నల్లవాగు, కాకలేటివాగు, బుగ్గవాగు, వేములపాయ ఇక్కడివాగులు.

**కురువకింది చెంచులు – కురువమీది చెంచులు :**

రాతినేలలతోనిండిన ఈ భూభాగంలో ప్రవాహాలకు ఉరవడిఎక్కువ. ఆ ఉరవడికి ఈ శిలలన్నీకోతపడి కృష్ణవేణి 'పాతాళగంగ' అయింది. ఒక్కకృష్ణవేణి మాత్రమే కాదు, ఈ భూగర్భస్వభావాన ప్రతివాగూ (కొల్లెంవాగు, పాలంకవాగు) ఒక పాతాళగంగయే. కురవలు, కట్టువలు, సెలలతోనిండిన యీచిట్టడవులలో చిన్న చిన్న రాళ్ళమీద పది అడుగులనడక పంచప్రాణాలకు కలక. (కురవ = కట్టువనుండి లోతునగల సెలలకు దిగేమార్గం. సెల=ఉరవడిగా పారే కొండవాగు). అచ్చంపేట చుట్టూగల గ్రామాలవారిని

'కురువకింది చెంచులు'గా ఎగువన నల్లమలలో ఉన్నవారిని 'కురువమీది చెంచులు'గా పిలుచుకుంటారు.

కురవలుదిగలేక, సెలలుదాటి కట్టువలుచేరలేక, ఒకనాడు నడకదారిన వెళ్ళే శ్రీపర్వతయాత్రికులు 'చేదుకోమల్లయ్య' అని ఘోషించేవారు. ప్రకాశంజిల్లాలోని పాలంక వీరభద్రుని (ఎర్రగొండపాలెంనుండి అలాటందారిలో) యాత్రికులకు 'గుట్టలచేను కురవ (లో) గుండెల్లోగస' అనుభవమే. మహబూబ్‌నగర్‌జిల్లా మన్ననూర్‌దగ్గర సలేశ్వరంతీర్థం (చైత్రపున్నమి) తెలుగు దేశంలోని 'అమరనాథ్'గా పేరుపొందింది.

స్థలవిశేషాలకువాడే పదాలు ఇక్కడి భూగోళం తీరుతెన్నులను వివరిస్తాయి.

బరకలు= సాలుబాట, 'బరకబావుందిగాని రారా, పోవచ్చు'

లొడికలు= గుహలు;

వాలుతలం= కణుజులు, మనుబోతులుండే ప్రాంతం

ఎడగండ్లు= దువ్వ (పులిజాతి) ఉండే ప్రాంతం

చెక్కబద్దెలు= రాళ్ళప్రాంతం

గోబెలు= పందులుండే ప్రాంతం

మడక= నీళ్ళు ఎండిన చోటు

తడకలు= కొండ ఎగుడు

కురవ= తిన్నగా దిగుడు

తోకలు = పొడవుగా నడిచిపోయే రాళ్ళదారి

సరులముడతలలో తేనెపెరలు
సరులలోయలలో పాతాళగంగలు
కురవలలో చిట్టడవులు
కట్టువలలో గడ్డిమైదానాలు

ఈ మైదానాలలో పరుగులుతీసే లేళ్ళు, జింకలు, దుప్పులు, కణుసులు, వానినివేటాడే జాగిలాల గుంపులు – తోడేళ్ళు, చచ్చిన జంతువులకోసం ముసురుకునే గద్దలు, రాబందులు.

చుట్టూ చిరుతలు – గంగలోమొసళ్ళు – సరుల్లో పెద్దపాములు – లాగబొక్కల్లో నేదులు, 'పాతనీళ్ళ'లో పెద్దపులులు.

మానుపిల్లులు, ముంగిసలు, ఉడుములు, బెట్టుడుతలు, కుందేళ్ళు.

నెమలి, అడవికోడి, పూరేడు, కౌజువంటి పిట్టలు ఇక్కడ మృగ, పక్షి సంపద. నీటివసతిగల ఏ గుండంపక్కనో, వాగుపక్కనో కాక, అల్లంతదూరంలో చెంచుల పెంటలు (పేటపెంట=తెరపిగా ఉండేప్రదేశం చెంచులగ్రామంపేరు) ఉంటాయి. నీటి ఎద్దడిగల ఈప్రాంతాలలో జంతువులుకూడా ఆవాగులోనే నీరు తాగడానికివచ్చి ఎదురయ్యే ప్రమాదంరాకుండా, అవి పెంటలమీదపడి పశువుల రుచిమరగకుండా ఇలా జలాధారాలకు దూరంగా పెంటలుంటాయి. ప్రతిపెంటలో ఇళ్ళు పదికిలోపే దూరదూరంగా ఉంటాయి.

యాత్రికులు గ్రామస్థులకు, కావలిగాళ్ళైన మెట్టతలారీలు రక్షణగా ఉంటూ పోలీసువారికి జవాబుదారీగా ఉండేవారు. అటవీశాఖ ప్రతీ ఊళ్ళో తమపనులకోసం 'పెద్దమనిషి'ని నియమించుకొనేది. మెట్టెవ్యవస్థ పుల్లలచెరువు ప్రాంతంలోని నలభై గ్రామాలకు పరిమితం. చెంచుప్రాంతమంతా మిరాశివ్యవస్థ ఉంది. మిరాశిదార్ల కుటుంబాలకే పెద్దతేనెలమీద హక్కు ఉంటుంది. ❊

## వెదురు సోలలు



చెంచూస్ ఆఫ్ హైదరాబాద్ - హైమెండార్ఫ్

# నల్లమలలో చెంచు గ్రామాలు



## నల్లమలలో చెంచు గ్రామాలు జిల్లాలు, మండలాలు

**మహబూబ్‌నగర్‌జిల్లా**

**అమరాబాద్‌మండలం**

25 మన్ననూరు
26 మాచారం
మొలకమామిడి
24 వెంకటేశ్వర్ల బావి
జంగంరెడ్డిపల్లి
6 పదర
చిట్లంకుంట
వంకేశ్వరం
ఇప్పాలపల్లి
29 మారడుగు
30 మద్దిమడుగు
1 ఉడిమిల్ల
మాధవాన్‌పల్లి
8 ఉప్పునూతల
28 లక్ష్మాపూర్
31 తిరుమలాపూర్
33 వట్టివారిపల్లి
27 అమరాబాదు
32 కొమ్మనపెంట
34 సార్లపల్లి
కుడిచింతలబయలు
కొల్లంపెంట
23 అప్పాపురం
పుల్లయపల్లి
ఫరాబాద్
లింగభేరి
మద్దిమలకల
ఇర్లపెంట
సంగడిగుండాలు
పందిగుర్రు
తాటిగుండాలు
35 ఈగలపెంట

**అచ్చంపేటమండలం**

చెవిటిరుపుబండ
2 ఘన్‌పూర్
3 అక్కారం
మన్నెవారిపల్లి
4 సిద్దాపూర్
పులిదేవిబండ
మార్లపైతండ
5 బొమ్మనపల్లి
ఐనోల్
చందాపూర్
10 చౌటుపల్లి
లక్ష్మాపూర్
రంగాపూర్
గుదిబండ

**లింగాలమండలం**

12 లింగాల
అప్పాయపల్లి
పాతదరారం
సాయిపెంట
రాయవరం
అంబటిపల్లి
15 కొత్తకుంటపల్లి
14 సూరాపూర్
పాంగిరి
పిల్లిగిరి
రాంపూర్
అగర్లపెంట
22 బౌరాపురం
చిన్నంపల్లి
7 చందాపూర్
మేకపోతుగుండాలు
కనితిబోడు
పద్మన్నపల్లి

**బల్మూర్‌మండలం**

11 బాణాల
చెంచుగూడెం
21 బిల్లకల్లు
20 కొండనాగుల
9 అంబగిరి

**కొల్లాపూర్‌మండలం**

18 కొల్లాపూర్
మూలచింతపల్లి
17 నార్లపూర్
19 యెల్లూరు
బొల్లారం
పెద్దూటి
బిక్కిట్ల
అంకిపెంట
నిచ్చెనకాలువ
ముద్దినూతిపెంట
జాలపెంట
జిల్లాలపెంట
16 కుడికిల్ల
యలకమానుపెంట
ఎర్రపెంట
జాలలపెంట
యన్నలపెంట
చిరంపెంట
పెగర్లపెంట

**పెద్దకొత్తపల్లిమండలం**

13 పెద్దకొత్తపల్లి
మామిడిదిన్నె
తిమ్మాయపల్లి
కరిపాముల
వాపట్ల

**ఉప్పునూతలమండలం**

పెనిమిల్ల
గువ్వలోనిపల్లి

**అమంగళ్‌మండలం**

నెమతాపూర్
కరకపాడు
ఈకవాయపల్లి
వసుదేవపురం
అనమాసపల్లి
గోవిందాయపల్లి
శంకర్‌కొండ

మైసిగండి
గంగుమార్లతండ
**మహబూబ్‌నగర్‌మండలం**
పంతాపూర్
మహబూబ్‌నగర్
**హన్వాడమండలం**
మైనాన్‌పల్లి
దాచేపల్లి
గుడిమల్కాపురం
తెంకర
వడచెర్ల
నైనోనిపల్లి
బొమరాసిపేట
**కర్నూలుజిల్లా,**
**శ్రీశైలంమండలం**
శ్రీశైలం
**కొత్తపల్లిమండలం**
39 కొత్తపల్లి
పాలెంచెరువు
సదరంపెంట
బండినాయనిపాలెం
శివపురంగూడెం
మాడుగుల
ఎర్రమఠంగూడెం
జానలగూడెం
పైగుడాపురం
**ఆత్మకూరుమండలం**
41 ఆత్మకూరు
45 బైర్లూటి
44 నాగలూటి
40 కొట్టాల చెరువు
43 ఇందిరేశ్వరంగూడెం
రుద్రకోడూరు
వెంపెంట
**బండిఆత్మకూరుమండలం**
51 బండిఆత్మకూరు
50 నెమళ్ళకుంట
52 నాయునిచెరువు
49 నారపరెడ్డికుంట

**వెలుగోడుమండలం**
46 వేంపెంట
47 వెలుగోడు
అబ్బరాజుకుంట
పనిగిడిగూడెం
**సిరివెళ్లమండలం**
58 సిరివెళ్ల
పచెర్ల
**మహానందిమండలం**
53 మహానంది
54 బసవాపురం
**ఆళ్ళగడ్డమండలం**
59 ఆళ్ళగడ్డ
60 అహోబిలం
దోరకొట్టాల
**రుద్రవరంమండలం**
55 రుద్రవరం
56 హరిహరనగర్
**పాణ్యంమండలం**
57 పాణ్యంకాలనీ
**చాగలమర్రిమండలం**
61 చాగలమర్రి
డి. వాణిపెంట
**పాములపాడుమండలం**
గుండాలనట్టు
**ప్రకాశంజిల్లా**
**పెద్దదోర్నాలమండలం**
65 చిన్నారుట్ల
66 పెదారుట్ల
చిన్నగలబండ
68 తుమ్మలబయలు
67 చింతల
69 పెద్దచేమ
పనుకుమడుగు
బండంబావి
కొత్తూరుగూడెం
కొర్రప్రోలుగూడెం
పెద్దదోర్నాల కాలని
71 చిన మంతనాల

70 రోల్లపెంట
చిలకచెర్ల
చెరువుగూడెం
76 నల్లగుంట్ల గూడెం
పెద్దపుట్టి
బలిజపల్లి గూడెం
64 మర్రిపాలెం
74 దోర్నాల
75 పెద్దమంతనాల
**అర్ధవీడుమండలం**
డా॥ చెరువు
72 భూమిలింగం
భీమరాయునిచెరువు
73 రంగాపురం
యచ్చవరం
బొసిరెడ్డిపల్లి
మావుటూరు
గన్నెపల్లి
**గిద్దలూరుమండలం**
79 గిద్దలూరు
మాలకొండపెంట
దిగువమెట్ట
ఇసుకగుండాల
**బెస్తవారిపేటమండలం**
80 బెస్తవారిపేట
**కంబంమండలం**
81 కంబం
**మార్కాపురంమండలం**
82 మార్కాపురం
83 జమ్మనపల్లి
**పెద్దారవీడుమండలం**
84 పెద్దారవీడు గూడెం
చింతలముడిపిడి
85 ప్రగళ్ళపాడు
**పుల్లలచెరువుమండలం**
86 పుల్లలచెరువు
99 గారపెంట
97 చెన్నంపాలెం
మురికిమల్ల

కొమరోలు
96 అక్కపాలెం
94 ఉమ్మడివరం
95 తెల్లగట్ల
గండిబావి
98 మర్రివేముల

**ఎర్రగొండపాలెంమండలం**

62 పాలుట్ల
63 నెక్కంటి
పంతనాల
గుట్టలచేను
పన్నలబయలు
అలాటం
89 నారతడికల
ధారబయలు
90 బూరుగుండాల
88 గార్నిపెంట
దద్దనాల
అల్లిపాలెం
బావిపెంట
సుద్దకుంట
తెలుగురాయునిచెరువు
బిల్లగొండిపెంట
87 హనుమంతుని గూడెం
91 ఎర్రగొండపాలెం
చెర్లగూడెం
జంగమిద్దెల
92 రేగులపల్లి
ఎగువపాలెం
యల్లారెడ్డిపల్లి
వెంకటాద్రిపాలెం
100 మురికిమల్ల

**కొమరోలుమండలం**

93 కొమరోలు

**గుంటూరుజిల్లా,**
**వెల్దుర్తిమండలం**

మండాడిగూడెం
రాచమల్లిపాడు
శ్రీరామపురం
పట్లవీడుగూడెం
శివలింగాపురం
ఎర్రబాలెం
వెల్దుర్తిగూడెం
గంగిరెడ్డిపల్లి
బడలవీడు
కంద్లగుంటగూడెం
గుడిపాడుకాలని
కొతపుల్లారెడ్డిగూడెం
చిన్నపర్లపాయగూడెం
సిరిగిరిపాడుగూడెం
హనుమపురం
పాపిరెడ్డిగుంట
బొతుకులపాయ
దావుపల్లి
పిచ్చయ్యబావితండ
లోయపల్లి
గొట్టిపల్లి
మొరసపెంట
జెండపెంట

**దుర్గిమండలం**

ముటుకూరుగూడెం
కాకిరాల
తెరాల
నిదంపాడుకాలని
అడిగుప్పాల

**మాచెర్లమండలం**

జమలమడకగూడెం
రాయవరం
లింగాపురం
వీరాంజనేయపురం
కొత్తూరు
ఎకోనంపేట
బ్రహ్మానందపురం
చెంచురామాపురం
ద్వారకాపురి
కొత్తపల్లిగూడెం
కొప్పునూరుగూడెం
లక్ష్మీనారాయణపురం
అచ్చమ్మకుంట
బోడనంపాడు
బెల్లంకొండవారిపాలెం
పెద్దఅనుపు
ఎత్తిపోతల
చైతన్యపురి

**నల్గొండజిల్లా,**
**చందంపేటమండలం**

కంబాలపల్లె
తెల్లదేవరపల్లి
చిత్రియల్
రేకులగడ్డ
పొగిళ్ల
రేకులవలయం
యలమలమంద
తిమ్మాపూర్
కాసిరాజుపల్లి
కొత్తపల్లి

**దిండిమండలం**

గోనబొయనపల్లి
బొగ్గులదోనె
చెరుకుపల్లి

**పెద్దవూరమండలం**

నెల్లికల
చింతలపాలెం

**వేములపల్లిమండలం**

చర్లగూడెం
మిరియాలగూడ

---

36 పి.గుమ్మవరం
37 సిరిపురం
38 చత్రంపెంట
42 నల్లకాలువ
48 గట్టుతండా ?

---

***సమగ్రగిరిజనాభివృద్ధిసంస్థ (చెంచు)***
***శ్రీశైలం ప్రాజెక్టు***

## పరిసరజ్ఞానానికి మచ్చుతునకలు :

మహబూబ్‌నగర్ జిల్లా అమరాబాద్ మండలంలోని అప్పాపూర్ పరిసరాలగుర్చిన వర్ణన చెంచులపరిసరజ్ఞానానికి మచ్చుతునక.

**రాళ్ళపేడలు (పడియ) :** ఇదంతా బరక. ఈ బరకలో అక్కడక్కడ పడలు ఉన్నాయి. ఈప్రాంతంలో రేలచెట్లు ఎక్కువగాఉన్నాయి. అందువల్ల వాటిని రేలపడలు అని పిలిచేవారు. కాలక్రమంలో అది రాళ్ళపేడలుగా పిలుస్తున్నారు.

**పులిచచ్చినవంపు :** ఈ కొండవంపులో వాగుపోతుంది. ఈ వంపులో పులిఒకటి ముసలిదై చనిపోయింది. అప్పటినుంచి అది పులిచచ్చినవంపు.

**కర్రెంచర్రి (సరి) :** అప్పాపురం చెంచువాడు బంకకు పోయి బంకతీసుకొని 'దూప' అయితే నీళ్ళుతాగి ఆ చర్రినీడన పడుకొని ఆకాశం వంకచూస్తున్నాడు. ఆ చర్రిపై చెట్టుకొమ్మమీద కర్రికొండముచ్చుని చూస్తూ –

"కర్రెంచర్రిలో కొండముచ్చులుండాలి ఓ లాలి

మా బావనెత్తి తన్నిపాయె ఓ లాలి" అని పాటకట్టిపాడినాడు. కర్రి కొండముచ్చులు ఎక్కువగా ఆచర్రిలో ఉండడంవల్ల కర్రెంచర్రి అంటారు.

**ఎర్రగడ్డలు :** ఒకప్పుడు ఇండ్లుఉండి భూమి చేసేవారు. ఈ భూమంతా ఎర్రగా ఉంటుంది. అందువల్ల ఎర్రబరక లేదా ఎర్రగడ్డలకట్టువ అంటారు.

**పిల్లిగుండ్లు :** ఇక్కడ పెద్ద పెద్ద గుండ్లున్నాయి. ఈ గుండ్లలో ఒక పెద్దగుండుకింద పులి ఉండేది. ఎక్కడ తిరిగినా ఈ గుండు కిందకేవచ్చి పండేది. దీన్ని 'పులిగుండ్లు' పిల్లిగుండ్లుగా పిలుస్తున్నారు. (పులిని చెంచులుపిల్లి అని పిలుస్తారు).

**మేడిగుండం :** ఇది పెద్దగుండం. ఈ గుండందగ్గర మేడిచెట్లు ఎక్కువగా ఉన్నాయి.

**మబ్బుగుండం :** పెద్దలోయలో గుండం ఉంటుంది. నీళ్ళుకూడా మబ్బుమాదిరి ఉంటాయి. ఇక్కడ ఎలుగులు తప్పనిసరిగా ఉంటాయి. పెద్దపాములు (కొండ చిలువలు)కూడా ఉంటాయి. ఇక్కడ చెట్లు, పొదలు ఎక్కువగాఉండి చాలా చల్లగా ఉంటుంది. కొత్తవాళ్ళు ఈ లోయగుండం చూస్తే అదురుకుంటారు.

**పెద్దమ్మవంపు :** ఇక్కడే పారేవాగుని పెద్దమ్మవాగు అంటారు. ఇక్కడ పెద్దమ్మ దేవతను

నిలబెట్టారు. ఈ దేవత బయటనుండి వచ్చే శక్తులను ఈ వంపుదాటి లోపలికి రానీయదు. మరోపక్క రాంపురం నుండి వచ్చే శక్తులను గుండంవాగు దాటిరానీయదు. ఇంకొకవైపు పులిచచ్చినవంపు దాటి ఈశక్తులను రానీయకుండా కాపలాఉండి కాపాడుతుందని నమ్మకం. ఈవాగు గుండంవాగులోకలిసి అక్కడినుండి 'ఏరుమద్దుల', 'సాముకురుకు' మీదుగా భీమునిగుండందాటి జీవగుండం, ధారవాగులను కలుపుకుంటూ వేములపాయవాగులోకలిసి అక్కడినుండి కృష్ణానదిలో కలుస్తుంది.

**కిందిసారవ :** పెంటఎత్తులో ఉండి, సారవ కొంచెం కిందికి ఉంటుంది.

**గోడకింది కట్టువ :** ఇక్కడ రాయిగోడ ఆకారంలో ఉంటుంది. దీన్ని కింద కట్టువ ఉంది.

**ఈతపిల్లల కట్టువ :** ఈకట్టువ మొత్తం ఈతచెట్లు ఎక్కువగాఉంటాయి. ఈ కట్టువలో చెవిటిఎలుగు సంచరిస్తుంటుంది. ఈతచెట్లు పండ్లన్నీ ఈ చెవుటెలుగే తింటుంది. చెంచులువిడిగా పండ్లకుపోరు. అయిదారుగురు కలిసివెళ్ళి పండ్లు తెచ్చుకొని తింటారు. ఈఎలుగుకు చెవుడు. శబ్దం వినబడదు. కండ్లతో చూస్తేచాలు మీదపడి కరుస్తుంది. ఈ కట్టువమీదే దొరలు గుడారాలు వేసుకొని అడవిని కొలిచేవారు.

**పుల్లచింతలవంపు :** ఇక్కడ పుల్లచింతలచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇవి పండ్లు కాస్తాయి. జొన్నగింజలవలె ఎర్రగా పండుతాయి. ఈచెట్లకింద బట్టపరచి చెట్టును 'దక్కితే' పళ్ళురాలి పడుతాయి. అవి చెంచులు బాగాతింటారు.

ఈ వంపుదగ్గర, నీరు ఎప్పుడు ఉంటుంది. జంతువులు నీళ్ళు ఇక్కడే తాగుతాయి. కాని ప్రస్తుతం నీళ్ళు అంతగా ఉండటం లేదు.

**గొల్లోనివంపు :** ఈ వంపులో పెద్దపాము(కొండచిలువ) ఉండేది. ఈ వంపులో ఒక గొల్లోడ్ని మింగితిన్నది. ఇది తెలుసుకున్న చెంచులు ఆ బొక్కను రాళ్ళతో పూడ్చివేశారు. అప్పటినుండి దీన్ని గొల్లోనివంపు అంటారు.

**కడపరాయి :** ఈ ప్రాంతంలో దేవునికడపలు (గడప) ఉన్నాయి. లోపల 14 కడపలు ఉన్నాయి. ఇక్కడి దేవున్ని 'కడపరాళ్ళ లింగమయ్య' అని పిలుస్తారు. దేవుడు లోపలే ఉన్నాడని చెంచుల నమ్మకం. ఇక్కడ ప్రతి సంవత్సరం పండుగచేస్తారు. మేకలు - కోళ్ళుకోసి వండుకుతింటారు. మొక్కుబడులు ఎక్కువగా చెల్లించుకుంటారు.

**గుండంపలుగు :** ఇక్కడ ఉన్న గుండంచుట్టూఉన్న రాయి మొత్తం పలుగే. వీటిమీద పెద్దచెట్లు ఉండవు. ఈ పలుగులో ఎలుగుఎప్పుడూ ఉంటుంది. పిల్లలతో తిరుగుతుంది. గ్రామస్థులను అప్పుడప్పుడు కరుస్తుంటుంది.

**రాకాసి పలుగు :** ఇక్కడి బండ పలుగురాళ్ళతో నిండిఉంటుంది. ఇది గుండం వాగుకిదగ్గరలో ఉంది. రాకాసి ఈపలుగులో నడచివచ్చి గుండంవాగులో స్నానం చేస్తున్న చెంచుఆడపిల్లల్ని చూసేదట. రాకాసిఅడుగులు-రాకాసిపీట ఉండటంవల్ల రాకాసిపలుగు అని అంటారు.

**జీడిమాను చెలక :** ఇక్కడ జీడిచెట్లు ఎక్కువగా ఉన్నాయి. వీటిమధ్య మంచిచెలక ఉంది.

**బుగ్గమట్ట :** బుగ్గమల్లయ్యదగ్గరలో మట్టఎక్కువగా ఉంది. ఈమట్టలో సాగమట్టలు, మాడెపుతీగలు, వెదురుగుమ్ములు ఎక్కువగాఉన్నాయి (దగ్గర్లో ఏడుమట్ల బావిఉంది). ఇదివరకు ఇక్కడపులిఎక్కువగాఉండేది. ఎండాకాలంలో చెంచులు మాడెపుగింజలు ఏరుకొచ్చి గంపలకుపూసి దాచిపెడతారు. వానాకాలంలో తిండిఏమి దొరకనపుడు వీటిని ఉడకబెట్టుకొనితిని పొట్టనింపుకుంటారు.

**గద్దలచరిపెంట :** ఇక్కడి సారవలో వెలగచెట్లు ఎక్కువగా ఉన్నాయి. పశువులను ఇక్కడే దొడ్డికడతారు.

**టేకులగుంత :** ఇక్కడ టేకుచెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ అడవిపందులు ఎలుగులుగుంతలు చేసుకునిపండేవి. వాటిని పందులగుంతలు,ఎలుగ్గుంతలుగా చెంచులు పిలిచేవారు. పగలుకూడా ఎలుగులు ఈ గుంతల్లో పిల్లలతో పండి వర్లుతుండేవి (ప్రస్తుతం ఇక్కడఒక్క టేకుచెట్టుకూడాలేదు. అచ్చంపేటలో సినిమా హాలుకు నరికితీసుకుపోయారు. ఎండిపోయిన మొదళ్ళుఉన్నాయి.)

**గుమ్మడి బొక్క :** ఈ బొక్కలో భీముడు ఉన్నాడట. ఇక్కడే రావగాని చాపకూడా ఉంది. గతంలో ఇక్కడ పులులు ఉండేవి. ప్రస్తుతం చిరుతగండ్లు (దుప్పి) ఎలుగులు ఈ బొక్కలో ఉన్నాయి. (ఈ చర్రిపైనుండి జంతుసంచారం చూడవచ్చు).

**బండజారు :** ఈప్రాంతమంతా ఒకేబండఉంటుంది. ఇది ఏటవాలుగా,నునుపుగా ఉంటుంది. అడవికి పోయే చెంచులంతా ఈ బండకు వచ్చి గొడ్డలి - అంబులు నూరుకొని అడవికిపోతారు. బండవాలు జారే విధంగా ఉంటుంది.

**ఉంగుర్తివాగు :** ఈ వాగువెంబడి మామిడిచెట్లు ఎక్కువగా ఉన్నాయి. వాటి మీద కొండముచ్చులు, బెట్టుడతలు, ఎలుగులు బాగాఉంటాయి. తేనె పెరలు ఎక్కువగాఉండి తేనె బాగా దొరుకుతుంది. ఇక్కడి తేనె చెంచులు, ఎలుగులు పోటీపడి జుర్రుకుంటారు. ఒకసారి ఎలుగు ఒక మామిడిచెట్టుఎక్కి, గాలిలో బారుగా పాకిన కొమ్మమీద తేనెపెరతిని ఆ కొమ్మమీదనుండి వెనక్కి తిరుగలేక జారిదబ్బున కిందపడి నడుములు విరగ్గొట్టు కుంది. అలాగే పడి తెగవర్లుకుంటు అటు ఎవ్వరిని తిరగకుండా భయపెడుతుంది. అది వర్లడంవిన్న చెంచులు అటు పోయేవారు కాదు. అలా నాలుగురోజులు గడిచేటప్పటికి ఆ ఎలుగు ఎక్కడ ఎట్టాపడ్డదో అట్టాగే చనిపోయింది. ఈవాగులో మామిడిచెట్ల తేనెపెరలు ఎక్కువగా ఎలుగులే తింటాయి. ఈ మామిడిచెట్లదగ్గర వీటిసంచారం ఎక్కువ. ఎప్పుడు వెళ్ళినా కనిపిస్తాయి.

**గడ్డిగుంతకాలువ :** ఈ కాలువదగ్గర గడ్డి ఎక్కువగాఉంటుంది. అప్పాపూర్ పెంటలోని గుడిసెలను కప్పడానికి ఇక్కడి ఏడుముళ్ళ గడ్డినేవాడతారు. చుట్టుపక్కల గడ్డికంటె ఈ గడ్డిగుంతకాలువ గడ్డిలో పటుత్వంఎక్కువ.

**పాతనీళ్ళకాలువ :** ఈ కాలువలో నీళ్ళు ఎప్పుడు ఉంటాయి. నీళ్ళకు ఇబ్బంది ఏర్పడినప్పుడు పశువులను ఈ పాతనీళ్ళ కాలువకు తోలుకొచ్చి ఇక్కడే ఉంటారు.

**అరటిపిల్లకాలువ :** ఈ కాలువ ఒడ్డుల వెంబడి అరటి చెట్లు ఉన్నాయి. అరటి పిలకలు ఎక్కువగా ఉన్నాయి.

బరక, మట్ట, దవ్వ, దిన్నె, బోడువంటి స్థలాల వర్ణనతోపాటు నీటిఎద్దడిగల నల్లమలలో వాటి ఉనికిలోని వివిధఛాయలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గుండం (రాతిమధ్య నీరు ఎప్పుడూ ఉంటుంది).

జవుక=కొండకుంగినచోట ఒకటి రెండు నెలలు నీరునిలబడే ప్రదేశం. మడుగు; చెలమ; ఊట, కుంట=చేను మధ్యలో, సెల=కురవల మధ్యలోతుగా పారే దుడుకు ప్రవాహం. వాగు=సాపుగా నిబ్బరంగా పారేది. పడియ - వానపడినప్పుడు నీరు నిలిచేచోటు. దొన- జవుకునుండి పారే ధార. ❊

## మన్ననూరు సమీపంలో అప్పాపూర్ గ్రామపరిసరాలు



## సర్వే ఆఫ్ ఇండియా పటంలో అప్పాపూర్




శ్రీశైలానికి కాలిబాటలు
1. శ్రీశైలం
2. గజ్జలకొండ
3. మొసళ్లగుండం
4. జాతరరేవు
5. అక్కమహాదేవిగుహలు
6. నీలగంగరేవు
7. కదళీవనం
8. సంగరిగుండాలు
9. మేడిమాకులు
10. సలేశ్వరం
11. రాంపూర్
12. భ్రమరాంబ చెరువు
13. అప్పాపూర్
14. బొర్రగుండాలు
15. గుప్తమల్లికార్జునం
16. నాగలూటి
17. పెద్దచెరువు
18. భీముని కొలను
19. భైరవసెల
20. ఇష్టకామేశ్వరి
సలేశ్వరం ఈశాన్యద్వారం మహబూబ్‌నగర్‌జిల్లా
ఉత్తరద్వారం
త్రిపురాంతకం తూర్పుద్వారం గుంటూరుజిల్లా
సోమశిల ఆగ్నేయద్వారం నెల్లూరుజిల్లా
జ్యోతి, సిద్ధవటం దక్షిణద్వారం కడపజిల్లా
పుష్పగిరి నైఋతిద్వారం కడపజిల్లా
సంగమేశ్వరం వాయువ్యద్వారం కర్నూలుజిల్లా
జంగంమఠాలు

**అభిరుచులు :**

చెంచుల వంటకాలు రాయలసీమలో ప్రచురంగా ఉన్నవే. కాని అడవిలో ఉన్న వీరికి కొన్ని ప్రత్యేకమైన అభిరుచులున్నాయి.

కడగదొక్కిన సజ్జబువ్వ - మజ్జిగ

వరిగెబువ్వ - చింతతొక్కు

కొఱ్ఱబువ్వ - కోడితునకలు

సన్నచేపలు - రాగిరొట్టె

జొన్నబువ్వ - మజ్జిగ

ఆరికఅన్నం - కందిపప్పు - బఱ్ఱెనెయ్యి

లేగటిపెరుగు - రాగిసంకటి

కొఱ్ఱబువ్వ - ఉలవచారు

సజ్జఅన్నం - చింతతొక్కు

జొన్నఅన్నం - చింతతొక్కు

'నాపేరు చెవుల చెన్నప్ప - నాలగుఱ్ఱప్ప - గుడ్లగుఱ్ఱప్ప
రాగిసంకటిలోని రాజప్ప' ('రాగిసంకటి - కుందేటి కూర')

'కన్నెగుల్ల తేనె - మెట్ట తాబేలు మాంసం'
ఈ రెండు కానుకగా ఇస్తే ఏ ఆడదయినా వెంటపడుతుందని చెంచుల కబుర్లు.[7]

కుక్క చెంచుపరివారంలో భాగం. ఒక బంగారుకుక్కను తమపూర్వునిగా చెంచులు చెప్పుకుంటారు. ఈసారవలలోని గడ్డిమైదానాలలో పరుగెత్తే జంతువులను, ఉడుములను కుక్కలసాయంతో వేటాడడం సులభం. దబ్బకు, విల్లుకు ఉడుము చర్మాన్ని, అమ్ముపింజ చీలిపోకుండా ఉడుతతోకలను పట్టీలుగా తొడుగుతారు. వేటకు వెళ్ళే సాధారణమైన జట్టు ఆలుమగలే. సోపువేట చాలతక్కువ. సాధారణంగా వేటాడేది ఉడుతలు, కుందేళ్ళు, ఉడుములనే. అమ్ముకు ఇనుపనారసలు కొనుక్కుంటారు. లేదా ఇనుముకొని కాల్చి తామేసాగగొట్టుకుంటారు. ఈనారసలను టోపీగాచేసి అమ్ము కట్టెకు తొడుగుతారు. అడవికిపోవడాన్ని చెంచులు 'పొలంపోవడం' అంటారు. బుడిగెజంగాలు కూడా ఇలాగే చెప్పుకుంటారు.

**సాహసం - సంఘటన :**

వేటలోకలిసేఅవసరం పరిమితమైనా చెంచులు తేనెతీయడంలో గొప్పసాహసాన్ని సంఘటితంగా చూపిస్తారు. ఏపెమాకులు పడగొట్టి, నారతీసి, వెదురుగడలకు (పచ్చివి)కట్టి, మోకుగా తయారుచేస్తారు. ఈవాసాన్ని పదిమందిపట్టి సరిలోపలికి దించాలి. పుల్లలు కొందరు, ఈగలను వెళ్ళగొట్టేందుకు పొగపెట్టడానికి తగినఆకులు తెచ్చేవారు కొందరు, ఏపెనార తీసేవారుకొందరు, వెదురుగడలు తెచ్చేవారుకొందరు, లోపలికి వాసంవెంట దిగేవారొకరు, వాసాన్నిపైన పట్టుకొనేవారు, ఇలా పనులపంపకం. పని అయిపోయిన తరువాత ఆ మోకులు, గడలు అన్నీ అక్కడే పారేస్తారు. ఇంటినుండి తెచ్చేవి తేనెబుట్ట, చిన్నకత్తి, గొడ్డలి మాత్రమే. ఈ తేనెబుట్టకు మైనం కరిపిస్తారు. దీనికి మూతకూడా ఉంటుంది. తేనెపెరలను 'సల్లెం'తో ముక్కలుగానరికి ఇందులో పెడతారు.

**తేనెల ఋతువులు :**

తేనెలుతీసే చెంచులు, అడవి చిగురించడం, పూలువికసించడంతో ఋతువులు గుర్తిస్తారు. కోరిందలు పూసేటప్పుడు (దీపావళి) కాటు తక్కువ (తేనెటీగలకాటు తక్కువ), ఏపె పూసేటప్పుడు ఉట్టితట్టలే (శ్రావణమాసం వట్టిమైనంతప్ప తేనె తక్కువ), ఎర్రబలుసు పూతపగిలినపుడు తేనెరుచి, కాటుఎక్కువ (తొలకరి), పొద్దు గుంకిన తరువాత పొడిచేది కుందేటిచుక్క. అది మలిగేలోగానే (10 గంటలలోగా) కుందేళ్ళు దొరుకుతాయి, ఉసిళ్ళు మంచినంజకం. వాటికి 'కానుగచెట్టు పూచినప్పుడు కాళ్ళు వస్తాయి, రేలచెట్టు పూసినప్పుడు రెక్కలువస్తాయి. ఏగిపూసినప్పుడు ఏగిబండలపై (పెనం) ఎగురుతాయి'.

**గడ్డితిని బలిసే జంతువులు - గడ్డలతో బతికే చెంచులు :**

నల్లమల అంతటా గడ్డిమైదానాలే. గడ్డికి కొవ్వుపట్టడానికి గల సంబంధాన్ని "నాంత్ర గడ్డిమీద అన్నిజంతువులూ బలుస్తాయి. ఐతే చీడగడ్డిమీద ఉడుంబలుస్తాది, ఏడుముండ్ల గడ్డిమీద కణితిపోతు బలుస్తాది" అని చెపుతూ 'ఉబిగడ్లో ఉడుముబలిసె - కారుగడ్లో కణుజుబలిసె'నని పాడుకుంటారు.

ఆయా కాలాల్లో దొరికే చిన్నచిన్నపండ్లు, దొరికే దుంపలు-చెంచుగడ్డ, నూలిగడ్డ, ఎలవారగడ్డ, అడవి తమలపాకుగడ్డ, చామగడ్డ, కోరింతగడ్డ, తుంగగడ్డ, దొండగడ్డలు. గడ్డలకోసం నేలనుతవ్వి, మరలమట్టిని పూడుస్తారు.

తీగలు, గుబుర్లు, ఫెరన్లు, మొదలైన నేలబారుగా పెరిగేమొక్కలు తక్కువ కావడంవలన, సాపుగావిస్తరించే అడవికావడంవలన మూలికలు శ్రమపడకనే కనిపిస్తాయి. కాబట్టి నల్లమలలు చిరకాలంనుండి మూలికలకు, వానిని వెదికే సిద్ధులకు ప్రసిద్ధి. ఈతరహా అడవులలో శ్రీగంధం, రక్తచందనంకూడా దొరకడం మరొకవిశేషం. చుట్టుపక్క గ్రామీణప్రాంతాలకు అందుబాటులోఉన్న ఈఅడవిలో జిగురు, బంక, సారపప్పు, ఇప్పపూవు, చింతపండు, కరక్కాయ, పలకలకుకావలసిన పలకరాయి, పొలికిచెక్క, వ్యవసాయానికికావలసిన కలప, పశువులకుకావలసిన మేత, తేనె, తేనెమైనం, దుప్పికొమ్ములు, జింకచర్మాలు, ఉడుముతోళ్ళు దొరుకుతాయి. చెంచులు వీటిని అమ్మి, కావలసినవి కొనుక్కుంటారు. భౌగోళిక పరిస్థితులవల్ల ఈ చెట్లలో, జంతువులలో కొన్ని, కొన్నిచోట్ల మాత్రమే ఉన్నాయి. తెలంగాణంలో చెంచులుఇప్పసార కాచుకోగా, ఇప్పలు ఎక్కువగాలేని ఆంధ్రప్రాంతంలో చెంచులు, బెల్లంసారాలో నల్లతుమ్మచెక్క బెరడు వేసి (పులియడంకోసం) తయారుచేసుకుంటారు. రాష్ట్రమంతా మద్యనిషేధం ఉన్న రోజుల్లో, గిరిజనులకు ఈనిషేధం వర్తించనందున, ఈనల్లమలలోకి వచ్చి దిగువవారు తాగుతుండేవారు. చెంచులచేత కాయిస్తుండేవారు. ఆ అలవాటు వీరికి వంటబట్టింది. తేనెతో, పండ్లకలితోకూడా సారాకాచుకుంటారు.

ఆహారాన్ని సేకరించుకోవడమేకాని ఆహారాన్ని ఉత్పత్తి (వ్యవసాయం, పశుపాలన ద్వారా) చేసుకొనే జాతికానందున, సమిష్టికుటుంబాలకు ప్రకృతి, సంస్కృతి ఆశ్రయమివ్వలేదు. అందువలన చెంచులవన్నీ ఆలుమగలకు మాత్రమే సరిపోయే 'చుట్టుగుడిసెలు'. ఆహారంకోసం, ఇప్పపూలకోసం మకాం మార్చవలసినందున చిత్తడి నేలలుకాక పొడినేలలైనందున ఈగృహనిర్మాణం అందుకుతగినంతగామాత్రమే రూపొందింది. అయిదుమూరల వ్యాసార్థంగల గుడిసెలు, పైన కరుకులు (వరుసలు) పెట్టి గడ్డికప్పడం, వారి ఇంటితీరు. ఒక్కకాపురానికే ఆస్కారమిచ్చే గుడిసెలైనందున, కొడుకుపెళ్ళి తలపెట్టగనే వేరేఇల్లు కట్టుకుంటారు. తల్లిదండ్రుల తరువాత ఆ యిల్లు చిన్నకొడుకుకు సంక్రమిస్తుంది. అన్నదమ్ములుగల కుటుంబమైతే కలిసి దేవుని గుడిసెను వేరే కడతారు. గుడిసెలో చుట్టూతడికెనుకొంతజరిపి 'దేవుడిమూల' ఏర్పాటు చేసుకుంటారు.

తెలుగుదేశానికి మధ్యలోగల యీఅడవులు ఎందరో రాజులకు ఆశ్రయ మిచ్చినాయి. అలాటంకోట, పచ్చిబోయలకోట, మంతనాలకోటలు – కోటలకు తీర్చిన గుర్రపుబాటలు, మధ్యమధ్య కనిపించేశాసనాలు, దేవాలయాలు, దిగుడు బావులు, చెరువులు, ఆ చుట్టుపట్ల పాడుపడి, కంపపెరిగిన పొలాలు ఈఅడవిఅంతా కనిపిస్తాయి. 'పెచ్చెరువు'లో శ్రీకృష్ణదేవరాయలు తవ్వించిన పెద్దచెరువు, నాగలూటి నుండి శ్రీశైలం నడకదారిలో రెడ్డిరాజులు రాళ్ళుతాపినబాట 'భైరవుని తాపలు'. అలాటంలో కోట, పాడుపడిన చెరువులు, విశాలమైనచేలు అక్కడక్కడ బావులు ఉన్నాయి. కొన్ని ఏండ్లుగా చెంచులతో స్థిరపడిన సుగాలీలవలన చెంచులలో కొందరు వ్యవసాయం చేపట్టారు. అందరూ పాడినేర్చారు. రాజులకొలువులోచేరి దిగువ ప్రాంతాలకువలస వెళ్ళిన చెంచులే బోయలు, యానాదులు. ఎరుకలు, కొరవలు మొదలైన జాతులుకూడా ఈ కుదురులోనివారే. గోమాంసనిషేధం సుగాలీలను, చెంచులను సన్నిహితం చేసింది. కాని సుగాలీలు వ్యాపారులు, పశుపాలకులు, వ్యవసాయదారులు కావడం వలన వారితో సహజీవనంలో చెంచులు వెనకబడిపోతున్నారు. వ్యవసాయానికి అవకాశమిచ్చిన చేలుగల నాగలూటి, బైర్లూటి, రోళ్ళపెంట, పెద్దచెరువు, పాలుట్ల, గుట్టలచేను, అలాటం మొదలుగాగల గ్రామాలు కొంత జనసాంద్రంగా ఉన్నాయి. కృష్ణానది ఒడ్డునే ఉన్నా బూరుగ, మామిడి మాకులు, విస్తారంగా లేనందున దోనెలులేని చెంచులు చేపలుపట్టడం నేర్వలేదు. కృష్ణదాటడానికి కట్టెలనుకట్టి తోసుకుంటూ ఆవలి ఒడ్డుకు చేరతారు.

చెంచుల వ్యవసాయమంతా దిగువపద్ధతిలోనే సాగుతుంది. ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు ప్రత్యేకంగా ఇంటిముందు గాదెలుంటాయి. పశువులకోసం సపారం (రెండురెక్కల పాక) వేసుకుంటారు. నిన్నమొన్నటి వ్యవసాయం, కొద్దిచేలు కావడం వలన చెంచులకుటుంబాలలో గృహనిర్మాణంలో వచ్చిన మార్పేమీలేదు. ఈ చేలుకూడా ఎక్కువభాగం సుగాలీల వశమైనాయి. ❉

*మంతనాలకోట, పచ్చిబోయలకోట, అలాటంకోట, పెద్దచెరువు, భైరవునితాపలు*

## నరసింహస్వామి వరం : అభయారణ్యం



అహోబలక్షేత్రం మహామంటపంలో చెంచులక్ష్మి నరసింహస్వామి

చెంచు అడవిఅంతా గాలిస్తాడు. ఏదోవిధంగా పొట్ట నింపుకుంటాడు. అతనికి నచ్చని తిండిలేదు. వారి ఆడపడుచు చెంచులక్ష్మిని వైకుంఠానికి తీసికెళ్ళినప్పుడు నరసింహస్వామి 'బంతి'పెట్టాడట. చెంచుపెద్దలుకూడా వచ్చారు. ఇంతలో ఒకఉడుము బంతిమధ్యలోంచి పారిపోతూ చెంచులకంటపడింది. విస్తళ్ళలో భోజనం వదిలేసి చెంచులు దానివెంటబడ్డారు. ఈ ప్రవర్తనకు చెంచులక్ష్మి ఖిన్నురాలైంది. తనవాళ్ళకు అందరివలె మంచిభోజనంతినే అదృష్టం రాసిపెట్టలేదా – అని బాధ పడుతుంది. చెంచు ఆకలితో ఉండడు. అడవిలో అతనికి ఏదో ఒకటి దొరుకుతుంది. అతడు పస్తులుండడు అని చెంచులక్ష్మిని నరసింహస్వామి ఓదారుస్తాడు.

**దొంగదారులు – ఆకలిచావులు – అభయారణ్యంపేరిట ఆంక్షలు :**

కాని ఐదుజిల్లాలమధ్య అడవి. చుట్టూవేలాది గ్రామాలు ఈఅడవిమీద ఆధారపడి ఉన్నాయి. వీరందరూ 'కనుమకావలి', 'గొల్లలమామూలు', 'దొడ్డిబత్తెం', మిరాసి మామూలు' ఇలా రకరకాలైన మామూళ్ళు అలవాటుచేసి దొంగదారులు తెరచి, అడవినంతా గుల్లచేశారు. శ్రీశైలం, జలవిద్యుత్ కేంద్రాలకు వెళ్ళడానికి రోడ్డువేయడంతో చెంచులకు యాత్రికులను నడకదారిన తీసుకుపోయే ఆధారంపోయింది. 1978లో పులుల అభయారణ్యంగా ప్రకటించినంతమేర వెదురునరుకు కూలీపనిలేకుండా పోయింది. క్షయవ్యాధితో ఆకలిచావులతో అంతరిస్తున్న 74 తెగలలో ఒకటిగా చెంచులను 1994లో భారత ప్రభుత్వం ప్రకటించింది. నల్లమల తీవ్రవాదుల–ప్రభుత్వ బలగాల రణరంగంగా మారింది. ❈

---

*కనుమకావలి, గొల్లలమామూలు, దొడ్డిబత్తెం, మిరాసిమామూలు*

**ప్రాంతాలు – తెగలు – జీవనవైవిధ్యం :**

నల్లమలలో లంబాడీలు, చెంచులు రెండే అడవిలో నివసించే తెగలు. గోదావరి, ఖమ్మంజిల్లాలలో కొండరెడ్డి, కోయ, వాల్మీకి, కొండకాపు, కమ్మర మొదలైన ఐదారు తెగలున్నాయి. విశాఖలో ఎన్నో తెగలు లెక్కకొస్తున్నాయి. (బగత, బొండో, దుంబు, దియాది, గదబ, ఘూసి, గౌడు, జాతాపు, కోండ్, కొండదొర కొండకాపు, కోయ, కుమ్మర, కొండరెడ్డి, కోటియా, మాలాకార్, మన్నెదొర, మూకదొర, మాలి, ఓజు, పెంగు, పోర్జా, పైడి, రెడ్డిదొర, రోణ, సామంత వాల్మీకి జాతులవారు విశాఖలో ఉండగా వీరిలో బగత, కొండదొర, కొండకాపు, వాల్మీకి, ఓజులు తెలుగు మాతృభాషగాగల గిరిజనులు. వెనుకకు ఒదిగే అడవిలేక నల్లమల చెంచులు కూలీలవుతున్నారు. దిగువ ప్రాంతాలకు వలసవస్తున్నారు. ఆకలిచావులతో నశిస్తున్నారు. తూర్పుగిరిజనులు లోపలికి ముడుచుకుంటున్నారు. ఒకనాడు కలపపనుల్లో, ఈనాడు తమ ప్రాంతాలలోనే కూలీలవుతున్నారు, కాని అడవివదలి రావడంలేదు.

చెంచులు మాడెపువిత్తులను (అడ్డగింజలను), చింతగింజలను ఉడికించుకొని తింటారు. ఆహారం తక్కువగాదొరికే ఆప్రాంతంలో, నిండని పొట్ట చుట్టుకుపోకుండా అటువంటి మోటుతిండి తినకతప్పదు. జానకంప బూడిదలో చింతపండుపిసుక్కొని, దేవదారువంటి ఆకులను ఉడికించుకోడం వంటివి కరువుతిండ్లు. తూర్పుఅడవుల్లో అడ్డగింజలను కాల్చుకుని లోపలిగింజలు తింటారు. చింతగింజలు వేయించి పైపొట్టువదిలించి నానవేసి రుబ్బి అంబలి కాచుకుతాగుతారు. రకరకాల ఆకుకూరలు వారికి దొరుకుతాయి. చెంచులు పాడినేర్చినా ఎప్పటిదప్పుడే ఖాళీచేసేతత్వంవల్ల, సుగాలీలవలె పసులకాపర్లు కాలేకపోయినారు. చెంచులు పాడిచేస్తారుకాని కోడెగిత్తలను, వళ్ళుబద్ధకంవల్ల, కాడికిమప్పరు. ఆపని సుగాలీలకు అప్పచెపుతారు. నల్లమల అడవులను పశువుల మేతకు కేటాయించి, చెంచులను పశువులకాపరులను చేయాలని హెమండ్రాఫ్ సూచించారు.

కాలగతిలో వీలైనంత వెనక్కిపోయి చెంచుల కొండరెడ్ల, పనిముట్లను పరిశీలిస్తే చెంచులే మొగ్గుచూపుతారు. తూర్పుగిరిజనులకు ఒకటే ఋతుచక్రంఉంది. కాని చెంచులకు వనరులబట్టి వేరువేరు ఋతువులు. ఇద్దరికీ దుంపలు తవ్వే గచ్చులి

సమానమే. మెత్తనినేల కొండరెడ్లలో వ్యవసాయానికి అవకాశమిచ్చింది. మామిడి, పనసలవ్యాప్తి టెంకలు, గింజలు దాచుకోవడానికి వీలుకలిగించింది. రెడ్లు వేటలోకలిస్తే – చెంచులు తేనె తీయడంలో కలుస్తారు. చెంచులవలె, రెడ్లు ప్రాణాలకు తెగించి తేనెతీయడానికి సిద్ధపడరు. రెడ్ల ప్రాంతంలో సరులుకూడా తక్కువ. రకరకాల ఆనపకాయ డిప్పలుగల రెడ్లకు, చెంచులవలె తేనెబుట్టవంటి ద్రవపదార్థాలను నిల్వచేసుకునే బుట్టలను కనిపెట్ట వలసిన అవసరం లేకపోయింది. తూర్పుఅడవులు గుర్రాలు, గోనెటెద్లు తిరుగగల లోయలు. నల్లమలలు గాడిదలు మాత్రమే తిరుగగల కురవలు. అవే అక్కడి రవాణా సాధనాలు.

చెంచులు పాడినేర్చినప్పటికీ సేద్యంలో నిలదొక్కుకోని ఆటవికులు. కొండరెడ్లు నాగలిలేని వ్యవసాయదారులు. విశాఖలోని కొండదొరలు, బగతలు పాడిచేయని కర్షకులు. వాల్మీకులు వ్యాపారం చేసే రైతులు. ❈

## <u>కెంటకూర</u> (తంబురవంటి వాద్యం)

**సీకువిల్లు**




**-- పల్లాల బొర్రంరెడ్డి, మారేడుమిల్లి**

# చెంచుల కాలజ్ఞానం

'వెన్నెలనుండి మబ్బుల్లోకి – మబ్బులనుండి వెన్నెల్లోకి'

## ఋతువులు

**ఉసిళ్ళు**
w కానుగచెట్టు పూసినప్పుడు కాళ్ళువస్తాయి
w రేలచెట్టు పూసినప్పుడు రెక్కలు వస్తాయి
w ఏగిపూసినప్పుడు ఏగి బండలపై ఎగురుతాయి

**తేనెలు**
w కోరిందలు పూసేటప్పుడు కాటుతక్కువ (దీపావళి)
w ఏపెపూసేటప్పుడు ఉట్టి తట్టలే (శ్రావణం)
w ఎర్రబలుసు పగిలినప్పుడు కాటుఎక్కువ (తొలకరి)

**గడ్డి**
w నేంద్రగడ్డిమీద అన్ని జంతువులు బలుస్తాయి
w చీడగడ్డిమీద ఉడుం బలుస్తాది
w ఏడుముండ్ల గడ్డిమీద కణితిపోతు బలుస్తాది

## పండుగలు

| | | |
|---|---|---|
| శివుని దొంగపెళ్ళి | – | సంక్రాంతి |
| అసలుపెళ్ళి | – | శివరాత్రి |
| సలేశ్వరం జాతర | – | చైత్రపూర్ణిమ |
| తొలిఏకాదశి | – | పాలంకవీరన్న |
| మంతనాలమ్మ జాతర | – | ఉగాది |

**తెలుగువారి అడవుల వర్గీకరణం :**

నల్లమలలు 'చీమలు దూరని (ఒల్లని) చిట్టడవులు'

చీమలు మధురసం ఎక్కువగా దొరికే పనసలు, మామిళ్ళు, నేరేడువంటి పండ్ల చెట్లుగల అడవులను ఆశ్రయించి ఉంటాయి. ఎన్నోరకాల చీమలు తూర్పుఅడవులలో బారులుగా పోతుంటాయి. ఆ బారులు 'ఈ కొండకు ఆకొండకు ఇనుపలంకెలు' అని కొండరెడ్ల పొడుపుకథ.

'కాకులు దూరని కారడవి' – కొండలలో ఉండేవి జముడుకాకులు. దిగువన ఉండేవి ఊరకాకులు.

తీగలతో అల్లుకున్న ఈ చీకటి అడవులు 'గద్దలుదూరని గిద్దువనాలు' (గిద్దు = చెట్లమీద వేటాడే పక్షి. ఓర్ణంగిద్దు, కొప్పుగిద్దు, అన్నువగిద్దు, మొదలగునవి).

'గిద్దులు చేరని గద్ద వేనాలు'

గద్దలు వేనంమీద (కొండ వెన్ను) వేటాడుతుంటాయి. వనాలలోకి దిగలేవు.

గద్దల నివాసం వేనం – గిద్దుల నివాసం వనం.

'ఎలుగులు దూరని ఎర్రచిడుగలు' (చిడుగలు – కంపలు)

'ఇండిగల వనాలు' (సన్నని ముళ్ళున్న కంపలు)

'పులి ఉన్న (చీకటి) కోనాలు' కొన్ని

'పులులు దూరని పుల్లటడవులు'

పిల్లిజాతికి చెందిన పులులకు, పంజాకింద మెత్తని మాంసందిండ్లు ఉంటాయి. అందువలన అవి నడచేటప్పుడు, వేటాడేటప్పుడు అడుగులు చప్పుడుకావు. పుల్లలు, ముళ్ళున్న చోట తిరిగితే ఆ మెత్తని మాంసంలో గుచ్చుకుంటాయి. అందువలన పులి ఎప్పుడూ దారివెంటనే నడుస్తుంది.

'దారికి దడ్డడు' – దారి వెంట నడిచే బలశాలి – పులి

'అడవికి ఆటగాడు' – నెమలి.

'చేనుకు చేటుగాడు' – చెవులపిల్లి.

'కొండకు కోలగాడు' – వేనంవెంట అరుచుకుంటూ తిరిగే కొండా అడవిరాజుల బంట్రోతు, కొండగొర్రె. ఇలా ప్రాణికోటి ఉనికినిబట్టి, కొండవారు అడవిమీద పొడుపుకథలు అల్లుకుంటారు. ❉

**ప్రకృతికిదూరంచేస్తున్న చొరబాటులు :**

ప్రకృతితో పెనవేసుకున్న జీవనవిధానం కాలక్రమేణ ప్రకృతిని లోబరచుకొనే ప్రయత్నంలో ప్రకృతికి దూరంకావడం, మానవజాతి అవిర్భావంతోనే మొదలైనదేమో. కాని ఇటీవలిచరిత్ర దానివేగాన్ని పెంచింది.

అధికారబలంతో జొరబడినవారినేకాక, బ్రతుకుదెరువుకోసం ఆయా గ్రామాలలో స్థిరపడదలచిన వారినికూడా గిరిజనులు ఆదరిస్తారుకాని అభ్యంతరం చెప్పరు. ఇటువంటివారిద్వారా నాగరికప్రపంచంతో సంబంధంఏర్పడుతుందని సంతోషిస్తారు. జమీందార్లు, ముఠాదార్లు వారివెంటవచ్చినవారు దిగువభూములు ఆక్రమించు కొన్నప్పటికీ గిరిజనులు పట్టించుకోలేదు. ముఠాదారులు గడపపన్నుగా ఒకటిరెండు రూపాయలు ఇంటికి రాబట్టినా తమలో తగవులు తీర్చడానికి వీరిపెద్దరికం సహకరిస్తుందని, ఆ పన్ను చెల్లిస్తూ, మన్నిస్తూవచ్చారు. నాయకులు, పెద్దలయిన వీరికి ఇల్లు కట్టిపెట్టడం ఇతర సహకారాలనందించడంలో గిరిజనులకున్న సదవగాహన, క్రమశిక్షణ సాటిలేనిది. తగువుతీరుస్తూ విధించేతప్పులో కొంత, తమపనులు మానుకొని పంచాయితీచేసే పెద్దలకు ఇవ్వవలసిన కట్నంగాభావిస్తారు. ఒక్కొక్కతగవుకు గ్రామ మంతాగొట్టుకు రావలసి ఉంటుంది. అప్పుడు ముద్దాయి చేతనయినట్లు భోజనం సమకూరుస్తాడు. నేరాన్నిబట్టి, వ్యక్తి స్థోమతనుబట్టి, తప్పుతక్కువగావిధిస్తే, ఆసొమ్ముతో అందరికీ పొగరేకులు కొనిపంచినా సరిపెట్టుకుంటారు.

**పట్టుబిగించిన ప్రభుత్వం :**

ఇటువంటి సభ్యతను, పౌరధర్మాన్ని; తమ పరివారం, బంధువర్గంబలంతో, నాయకత్వంవల్ల వచ్చిన దురహంకారంతో, అధికారులఅండతో, కులాలపేరిట విడిపోయిన సమాజంలో ఒకరిని చేరదీస్తూ, ఒకరిని రెచ్చగొడుతూ, అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ, వెట్టి చేయించుకుంటున్నందుకు, అక్రమంగా హెచ్చు పన్నులు విధిస్తున్నందుకు 1702 నుండి పశ్చిమగోదావరిజిల్లాలో రగులుకున్న రవరవలు 1840లో రంప మునసబుదారు అరాచకాలతో రాజుకొన్నవి. తీవ్రతరమైన అల్లర్లను 1862లో అణచివేసి, మునసబుదారుకు కాపుగా పోలీసు బలగాన్ని బ్రిటిష్ ప్రభుత్వం సమకూర్చింది. ఈ బలంతో మునసబుదారు – మరింతగా దౌర్జన్యాలు సాగించడం;

గిరిజనులు తల్లిపాలకంటె మిన్నగా 'పాండవుల ఫలవృక్షం'గా భావించే కల్లుచెట్లమీద 'చిగురుపన్ను'ను బ్రిటిష్‌వారు, 'మొదలుపన్ను' మునసబుదారు పోటీపడి విధించడంతో పితూరీలు ఉధృతమైనాయి. 1863లో రేకపల్లిప్రాంతం (నేటి భద్రాచలప్రాంతం) బ్రిటీష్‌వారికి బదిలీఅయిన తరువాత, పోడుమీద ఆంక్షలు విధించడంతో ఈ అశాంతి అక్కడిదాకా వ్యాపించింది.

బ్రిటిష్ ప్రభుత్వం 1890లో రంపమునసబుదాను తొలగించి, ఎదురుతిరిగినవారి ముఠాలు రద్దుచేసి, తమకు సాయపడ్డవారికి కట్టబెట్టి పరిపాలనను వ్యవస్థీ కరించింది. అడవిని ముఠాదార్ల హక్కుభుక్తాలనుండి తొలగించింది. ఫారెస్టు, పోలీసు, రెవిన్యూయంత్రాంగంతో మన్యాన్నిఆక్రమించింది. నర్సీపట్నంనుండి చింతపల్లి ఘాట్ రోడ్డు వేయించుకోడానికి బ్రిటిష్‌అధికారి బాస్టియన్ గిరిజనులను క్రూరంగా, అసభ్యంగా హింసించాడు. దానితో శ్రీరామరాజు పితూరీ నిర్వహించవలసిన అగత్యం ఏర్పడింది. అటు రేకపల్లినుండి పాడేరుదాకా(1902–1924) 5000 చదరపుమైళ్ళ మన్యంమొత్తం యుద్ధభూమిగామారింది. ఆనాడుపడిన బాధలను తూర్పుగోదావరిజిల్లా, మారేడుమిల్లి మండలం పుల్లంగివాస్తవ్యుడు శ్రీ పూసర్లబాలేశు 1935లో ఒక పద్యంలో ఇలా వివరిస్తాడు.

**సీసం:** రాజుగారిని బట్ట రానుపోనూ లోను
మధ్య మధ్య ప్రజలకు రద్దు కలిగె
సప్లాయి కోసమై చాలమంది ప్రజల
తిట్టుచు కొట్టుచు తీసుకెళ్ళి
చెయ్యరాని పనులు చెయ్యించి మొయ్యించి.. .. .. ..
అనవసరపు ఇండ్లు అధికంగ కట్టించి
ప్రజలకు కష్టపెట్టుటె కాని పరకయింపా!
అయ్యయ్యో ప్రజలెంత ఆయాసములు బొంది
ఇండ్లకు రాగానె కొందరు చచ్చిరి దెబ్బల వల్ల
తిరుపెల్లి విశ్వనాథను పిల్లవానికి
మలబారు వారలు పట్టిచంపె (మలబారు మిలిటరీ)

విశ్వరెడ్డికి చెయ్యి విరుగగొట్టిరిగాని
వారెవ్వానికి బాగుచేసినారు
ఎఱ్రవెంకన్నటా ఎలమతో ప్రజలకు
ప్రేమలేకను గొట్టె పెంకెబోతు
ముఠాదార్ల మునసబుల మృదువైన పెద్దల
మరియాదలన్నియు మంటగలిసె
ముఠాదార్లకే యింత ముప్పుతిప్పలు బెడితె
ప్రజలకు దిక్కెవరు ప్రేమజూపా
కులములో లేనట్టి గురుతప్పు కొట్టేటి
చెప్పుతో కొట్టిరి చెడ్డవాండ్లు
ఆడవారికి పడక కంపుదని అడుగగా
భయపడి పారిరి పట్లు విడిచి
పారిపోయిన వారి వెంబడించి పోయి
పట్టుకొని కొట్టిరి బాధపెట్టి
పెంటకుప్పలో పెద్దెండ నుంచిరటయా

**సీసం:** 'అన్ని డిపార్ట్‌మెంట్లు అనుకూలమేగాని,
ఫారెస్టు డిపార్ట్‌మెంట్ పరమశత్రువు
అడివంత ప్రజలకూ ఆధారమైయుంటె,
అడవికట్టేసిరన్యాయముగనూ
బ్రతుకు పడిపోయెనని బ్రమసి ప్రజలందరూ
దుఃఖించుచున్నారు మిక్కుటముగా
బీద ప్రజలందరూ బిరబిరా నడవికి
వెళ్ళి కూరా తీసి గంపలో పెట్టుకొని
యింటికి రాబోతె అదొకతంటా
గంపకు ఒక అణా కావడికి రెండణాలు
క్రమముగా పెట్టుమని కదలనివరూ
అడివంత తిరిగియూ ఆకలి దప్పులతో

వచ్చినవారికి వదలకుండె
వుసురుమని ప్రజలంతా ఊరెల్ల
దిరిగియు చాల కష్టపడి సంపాదించి
తెచ్చి చెల్లించియు సెలవు దీసికొని
యడుగక యింటికి అరుగరయ్యె
తేనె మైనము వల్ల తెలగాలుకోయలు
బతికేటి బతుకెల్ల భంగమయ్యె
కోమట్లు మాలలు కొని యమ్మినందున
వచ్చేటి లాభములు వరదగలిసె
ఊర్లు పాడాయెను ఉద్యోగములు పోయె
పరగ్రామమున ప్రజల్ పాటుపడిరి.
మానులను పెంచియూ – మనుష్యుల జంపియూ
– ధనము సంపాదించె దారి యిదియా

**వచనం:** యిందులోనే మరొక కష్టంచూడండి.

ఫారెస్టు రిజర్వులలో ప్రయాణిస్తూ పండ్లు భక్షించినదే నేరమని జుల్మానా వేసెను. అడవిలోఉండే దుంపకూర పండుఫలము జీలుగచెక్క మామిడిటెంక వెదురుకొమ్ములు యిప్పపువ్వులు, ఈతకొమ్ములు, ముఖ్యమైనది కల్లు, యివి వారిభోజన పదార్థములు. ప్రజలకు అక్కరకురానివీ శ్రీగవర్నమెంటు వారికి పనికివచ్చేవీ కర్రతీసుకొనిపోవచ్చును. వెండిరాగి వగైరాగనులుంటే న్యాయమైన వెలయిచ్చి ప్రజలకు సంతోషపరచి తీసుకొని పోవచ్చును. అంతేకాని సదరుతాలూకాలో ఫారెస్టు వేయకూడదు. ప్రజలబ్రతుకు పడగొట్టి దుఃఖపెట్టకూడదు'.

స్వాతంత్ర్యానంతరంకూడా ప్రణాళికారచనలో గిరిజనుని తరతరాల నైపుణ్యాలకు తగిన అవకాశాలు కల్పించలేదు. దిగువ ప్రాంతాల్లో బలహీనవర్గాల సంక్షేమంకోసం ఏ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారో అవి గిరిజనప్రాంతంలోకూడా ప్రవేశ పెట్టారు. కాని గిరిజనుల నేర్పు, మనస్తత్వం ఆటవికభూమికలోనివి. ఈ పరిణామాల వేగానికి తమనుతాము మలచుకోలేని వనవాసులు అడవి నశించి – భూములు

అన్యాక్రాంతమై కాలక్రమేణ ఆకలిదప్పులతో రోగాలతో అంతరిస్తున్నారు.

తెలుగు వనసీమలలోని సమాజాల సంజ్ఞానం, ప్రకృతికి తగినట్లుగా ఎదిగినవారి జీవనవిధానం – కాలక్రమాన వచ్చిన పరిణామాల మౌలిక స్వరూపం ఇది.

నల్లమల, గోదావరి, విశాఖఅడవులలో – వివిధ దశలలో వారితోపాటు ఎదిగిన సంస్కృతిలో రాగద్వేషాల తీరుతెన్నులు తరువాతి ప్రకరణం.

పిల్లింగర్రలు





నాగస్వరం

చెంచూస్ ఆఫ్ హైదరాబాద్ - హైమెండార్ఫ్

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. మానవ విజయం. రచన ఇలిన్ మరియు సెగాల్. అనువాదం: వి.ఆర్.శాస్త్రి. విశాలాంధ్ర ప్రచురణాలయం. 1954 – పుట.52.

2. Encyclopaedia of anthropology David E. Hunde Philip Whitter. Harper & Row Pub. 1976 Page 76.

Cognition: Cognitive anthropological research emphasizes an intellectual approach to the interpretation of culture, which is usually defined in terms of the categories of each society uses to organise its universe and to convey messages among those who share culture. This approach facilitated our understanding of the way in which prediction within a cultural system takes place.

3. A Grammar of Kuvi language 1911, Madras, V.F.V.P. Schuzle.

P.8. "The big tribe Khond is divided into five different classes, 1.Mukhadora, 2.Mannedora, 3. Kondadora, 4.Jatapudora Poraja or Kodulu or Kuvi, 5. Gadaba. The first two tribes lost their original language as they amalgamated with Telugus but each of the caste has its own language".

4. The Rampa Agency of East Godavari District. M.R.Ry. V.N. Seshagiri Rao Avargal. Govt.Press, Madras. 1931.

P. 15. Village communal property is carefully preserved. Topes are the joint property of the villagers and the income there from, especially from tamarind, is distributed amongst the shareholders. New-comers have no claim to a share.

The fruit is collected by the villagers in common from time to time as it ripens and the yield is then and there distributed among the shareholders. When labour is needed for any Government work, one man from each house is expected to present himself, and his wages are distributed amongst all the villagers, the old, the blind, the maimed and the widows all getting a share. Thus it can be seen that the peculiarities of the joint village system are carefully preserved.

Serious crime is rare and theft is almost unknown. In fact, the entrances to the dwellings are not secured by bolts or other fastening. Harvested crops are left in the field or threshing-floor and no one is set to watch them. Seldom does a village resound with the quarrels or wrangles of either sex, and in this respect it presents a marked contrast to the frequent street brawls in the so-called civilized towns.

The people live undisturbed by the rush and bustle of the out-side world. While the village remains entire and its internal economy undisturbed, the Agency man cares not who administers the land.

P.25. Persons suspected of witchcraft are most cruelly treated. It is stated that they used to be taken to the top of a hill where the victims would be actually stoned to death. Even to this day there are several places known as “Chidipi Gandis” places where sorcerers were killed.

Witches are supposed to transform themselves into tigers and to draw the blood of their victim by sucking his toe. The witch turned tiger is supposed to retain one of its human legs.

P.26. Sexual laxity before marriage with a member of a lower caste is punished with instant expulsion from caste, the parents being heavily fined. If the lover is of the same caste he is made to marry the girl and to feed the tribesmen. If a married woman runs away with another of her own class, the aggrieved husband can claim Rs.66-4-0 towards marriage expenses from the lover; if she elopes with a man of inferior caste while in her husband’s house, the husband and his family are fined. Polygamy is permitted. Widows are allowed to remarry. Divorce is not common.

P. 27. The Hill Malas style themselves as Valmikis.

These form the smallest percentage of the population. They are generally literate, and somewhat refined in the Rampa. Mala is certainly a better type of man than the low-country Mala. He is fairer in complexion, better in build and neater in appearance with his cropped head and neatly

combed and greased hair. He is a trader in hill products, and a petty sowcar in the Agency. Most of the Malas own pack bulls which they use for the transport of the hill produce to the markets. Unlike the other hillmen, most of them live on rice which they get from Malkanagiri in the Vizagapatnam District. Almost all the fruit gardens in the north of Chodavaram Division have passed into their hands, for the brainy Mala finds an easy prey in the unsophisticated hillman. Most of the Malas in the Chodavaram Division are converts to Christianity and belong to the Dummagudem Mission, which appears to have done a lot of good in uplifting the condition of these people. But the Yellavaram Malas stick to their old faith. They are generally hated by the other classes for their usury and extortion. Almost all the village servants in the Agency belong to this class. A few are engaged as Muttah clerks. There is a flourishing Christian Settlement at Pullangi.

5. గుర్తేడు వాస్తవ్యుడు, వాల్మీకుల గురువు గొర్లె నాగయ్యదాసు చెప్పిన సీసం ఆధారం.

6. Studies in the eco-climatology of A.P. 1979, Ms. Hemamalini. Thesis submitted to Geography Department, Andhra University

P.No. 6. IV. Though the region is under the influence of both the southwest and northwest monsoon its location (Rayalaseema) in the rain-shadow region appears to be handicapped. Though the thermal factors are favourable to the luxuriant growth of vegetation, the moisture factor is inhibiting factor except at higher elevation.

P.No.11. Nallamala seventy miles long, twenty five miles broad, forest cover is thin due to porous soils and deficient rain fall.

P.No.62. The moisture regime and the thermal regime through A.P., has enormous thermal potential. Its moisture efficiency is very poor with the result that it cannot support forest type of vegetation excepting at higher elevation where water requirements are low and water availability is adequate.

P.67. The dry sub-humid zone in the extreme northern portion is represented by moist semievergreen forests and the rest of the state with dry deciduous vegetation except for a few patches of Mangrove vegetation in deltaic area.

Forest working plan - A.P. Govt., Kurnool Division 71. P. 11.

Abandoned cultivation, fortifications, distinct avenues of Tamarind and Banyan trees, old pagodas some of them deserted and in ruins and numerous tanks in vain, some of them which served as irrigation sources in the past bear testimony to the facts that the country was at one time more populous and prosperous and consequent depopulation followed by the relinquishment of cultivated holdings it has lapsed into jungles.

Terrestrial Environments. J.S. Cloudsley Thompson, London 1975 - II; P.14. Under humid conditions stable salts are leached away.

P.No 30 Morphological adaptation of animals inhabiting various types of terrestrial environment in relation to locomotion, feeding and escape from enemies. Physiological adaptation are also mentioned briefly and the adaptational importance of diurnal and seasonal rhythms is stressed.

P.No.55. Savannahs – dominated by graminea (grass family). There is usually a delicately balanced interaction between climate, soil, vegetation, animals and fire.

As the tree canopy develops more stories, the forest floor becomes poor in lianas and epiphytes.

Trees may be overtopped by tall grasses during rainy seasons. Bulbous and the other geophytes are often abundant. Many trees become selected for fire resistance. Woodland is open rich in terrestrial herbs, tolerant of drought habitat thorn woodlands are even more erophylous; plants with woody photosynthetic stems, fruits are succulent and juicy.

P.No. 61. Termites destroy growing plants especially in the time of drought and their mounds have topographical effects.

Birds Ostrich Emus. Game birds, predatory and scavenging birds such as eagles, falcons and vultures thrive on account of good visibility. Concealment is difficult so cursoroial. Season rhythm –diurnal, nocturnal rhythm. Ecological optimum – Ethnological optimum - Economic optimum.

TIGER: The Story of Tiger, Kailash Shankala 1978. Rupa & Co.

One of the brakes of efficiency of the Tiger is that he cannot easily walk

over broken, thorny ground so that grass country chase is beyond his powers. The Tiger never allows the contents (meat) mixed with the flesh. The Tiger prefer high meat as it is softer. Also they do not want to have to repeat the process of dressing their dinner.

7. The Reddis of Bison Hills - Haimendrof. P. 73. The Reddis are fond of honey and eager to acquire it, but they do not show the same ingenuity and courage in its collection as the Chenchus are jungle tribes of the South. Once on the way to Kutturwada, I saw a great number of honeycombs on the face a highs cliff that would have fallen an easy prey to Chenchus, but the Reddi declared that they would not venture on such and since they never use ropes in taking honey. Their hesitation was perhaps understandable.

❃ Current Anthropology, A Lomax & Conrad Arrensberg 1977.

P.672 . Nomadic fickle and warlike character of Amazonian cultures has been due to lack of protein. Game is arboreal and scarce. In the leafy world, meat is precious. And the hunter is pursued with sexual promises.

❃ The Reddis of Bison Hills.

Gangamma panduga which is observed throughout the Telugu country even among Brahmins and in Gurtedu, Bodlanka muthas… This has been combined with ceremonial first-eating of mangoes. It comprises such non reddy elements as the use of sacred pot a shrine for the Goddess with a Candelabrum, cockfighting and similar amusements.

❃ Cognitive development. A.R.Luria, 1976, Harward University Press . Men can deal even with absent objects duplicate the world through words, which maintain the system of meanings whether or not the person is directly experiencing the objects, the words refer to. Hence a source of productive imagination arises.

❃ Census 1961 volume II part (A) (i) Page10

Next to the coastal plains to the West, except for a widest stretch of about 100 miles between the Godavari and Krishna a series of Hills are met with both to the North of River Godavari as also South of Krishna. These are

referred to as Eastern Ghats. Unlike the Western Ghats of India these Hills do not form a continuous running from the northern edge to the Southern edge. It is perhaps a misnomer to call them Ghats. D.H.K. Spate (India and Pakistan; a general regional geography P.No. 6790" the term Eastern Ghats is honoured by time, but by nothing else, the use give a misleading impression of comparability with the Western Ghats and suggests an entirely non existent homogeneite.

The reason is more in the nature of an uplifted peneplain which is broken by the inter-fluvial uplands of the Krishna and Godavari. It may be convenient to deal with these Eastern Ghats or Eastern Hills in different sections in which some definite group of hills are discernable. In the northern sections which cover the area from the borders of Orissa to river Godavari, the hill ranges run from northeast to southwest and reach elevation of 2,000 feet to 4,000 feet above mean sea level. They are formed of Khondalites (Genisses and sihists-perhaps the oldest rocks of India and Charnockites), between these two rivers for over 100 miles the ghats almost completely disappear. South of Krishna again a section of eastern hills cover the Nallamalai, Erramalai, Seshachalam, Palakonda ranges. This Southern region forms a very interesting geomorphological formation.

❁ Culture and Public Action, Ed. Vijayendra Rao and Michael Walton 2004. Permanent Black. P. 99.

Material poverty results from low productivity, which is caused by intractable coordination problems.

బరక : పనికిరాని పొలం. మాండలిక పదకోశం, 1970.

గొమ్మునేల : గోదావరి వరదతాకిడిగల నేలలకు ఆ ప్రాంతంలో ఉన్న వ్యవహారం.

జవుకు నేల : వానకురిస్తే దిగబడేనేల.

మాండలిక వ్యవసాయ పదకోశం, 1974.

# దేశకాలాలు - రాగద్వేషాలు

**(Time - Space - Emotion - Cognitive Style)**

**(సాంస్కృతిక పరిభాష)**

✲ **హార్డ్‌వేర్ – సాఫ్ట్‌వేర్**
ప్రకృతి – సంస్కృతి

✲ **పేరు – శరీరం – జీవి – పెతర**
రాజులు – గొల్లలు – కన్నెలు – గురువులు – పెతర్లు
కన్నెజీలుగు – దేవగుమ్మడిపండు – రాజులదుంప
నమ్మకాల దొంతరలు – ప్రకృతిలోని అంకెలు
'తల్లి భూదేవత – తండ్రి ఆకాశవేణ్డి – పుట్టించిన బ్రహ్మదేముడ'
వాత – బొట్టు, కుడి – ఎడమ
సంకుమాను – సంకురాట – సంకుపీట – సంకుమండ – సంకులమ్మ
చుట్టరికాలు

✲ **దోసాలు – పండుగలు**
కొండరాజులు – కొండదానుగులు
గోదావరిలో కొత్తలుకలపడం – విశాఖలో వెన్నులుముంపడం
రాజులపండుగ – ఔజంకొలువు; గూపిపండుగ – డోలకొలువు
పండుగ తీరడం
మామిడికొత్త
తల్లిపండుగ – పోతుపండుగ
వేటలపండుగ – ఈటెలపండుగ – ఇటింపండుగ
పూజార్లు – లెంకలు; గొరవలు – వెజ్జులు

✲ **తిత్రికపిట్ట రెట్ట – తాపడం – నీటికట్టు**
గంగాలమ్మ గొర్లెవారి ఆడపడుచు మాతంగకన్య
కొండకు కోలగాడు – ఊరికి బారికవాడు – పసుల పోలిగాడు
నేపథ్యానికి తగిన ప్రజ్ఞ
బగిడె – రోకలిబండ – డొంకెల నమూనాలు

✲ **చెంచుల దేవరలు – రావగాళ్ళు – ఇలవేల్పులు**

చెంచుల పూర్వులు – రావగాళ్ళు

పురాణగాధలు – ప్రదేశాలు

రాజులు – మంత్రులు – కోలగాళ్ళు

పిలుపులు – తలపులు – రోజుల లెక్కలు

మిరాశీలు – మెట్టపన్ను

✲ **బీజప్రధానం – క్షేత్రప్రధానం; ఉత్పత్తి సంబంధాలు – న్యాయాలు**

కాలమహిమ – తాత్త్వికదృక్పథం

## హార్డ్‌వేర్ - సాఫ్ట్‌వేర్ :

దేశకాలాలు హార్డ్‌వేర్; రాగద్వేషాలు సాఫ్ట్‌వేర్; ఈ రెండూ ఆవిష్కరించే చలనచిత్రమే సంస్కృతి. సమదృష్టి, నిటారైనరూపం, నాలుగు కాళ్ళలో రెంటికి సాధనాలను పట్టుకోవడానికి వీలుచిక్కడం, పట్టుకోడానికివీలుగా అమరిన బొటనవేలు. ఇవన్నీ ప్రాణికోటిలో మానవుని ప్రత్యేకతకు కారణాలైనప్పటికీ ప్రతీకాత్మకంగా భావించగలగడం, పరిసరాలపై భావాలను ఆరోపించగలగడం, పంచేంద్రియాలవల్ల అందే జ్ఞానాన్ని క్రోడీకరిస్తూ స్పందనలను సమన్వయించగలిగే ప్రతిభ మానవుని విశిష్టత.[1] పరిసరాలలో, సంబంధాలలో సంక్లిష్టత పెరుగుతున్నకొద్దీ ఈజ్ఞానం-మనోవ్యాపారం కూడా సంకీర్ణమౌతుంది. మానవుని ఈ సాంకేతిక సంవిధానంలో ప్రధానవాహిక భాష.

పరిసరాలను సంకేతాలుగా మార్చి ఆలోచనకు ముడిపదార్ధంగా అందించడం, తిరిగి సమర్థవంతంగా వ్యక్తంచేయడం భాషప్రయోజనం. వివిధకాలాల, అనుభవాలను భాష ప్రకటిస్తున్నట్లే కర్మకాండ, సంప్రదాయంకూడా అవిచ్ఛిన్నంగాసాగుతూ, అనేక పరిణామాలకులోనౌతున్న జాతిఆదర్శాలను, అభిప్రాయాలను, దృక్పథాలను చాటిచెపుతాయి.

పదచిత్రాలద్వారా రూపాన్ని స్ఫురింపజేయడంతేలికే. కాని పూవును తలచినప్పుడు దానివాసన స్ఫురణకురావడం కష్టమే. కాని ఆ సంస్కృతిలో భాగస్వామి ఆ అమూర్తమైన అనుభూతిని నెమరువేయగలడు. ఆ పదం, ప్రయోగం, సందర్భాలనుబట్టి తన్మయత్వం పొందగలడు, చిందులుతొక్కగలడు. ఇది ఆసంస్కృతితో సంబంధంలేనివానికి వెర్రిగా కనిపించవచ్చు. ఆ సంస్కృతికిచెందినవారి అంతశ్చేతనలో లీనమైన అనంతస్మృతులను ఆ పదంశ్రుతిచేస్తుంది. మనసును ఉద్రేకపరుస్తుంది. హృదయాన్ని కదిలిస్తుంది. ప్రతీకాత్మకమైన యంత్రాంగం ప్రకంపనలు ఇలా సుప్తచైతన్యాన్ని మేలుకొలుపుతాయి.[2]

## ప్రకృతి - సంస్కృతి :

పరిసరాలు అవసరాలనెలా తీరుస్తాయో, ఆలోచనలనూ అట్లే రేకెత్తిస్తాయి. స్ఫూర్తినిస్తాయి. పురాగాథలు, కర్మకాండ ఈ వర్గీకరణంమీదనే విస్తరిస్తాయి. ధ్రువ

పరుస్తాయి. తిరిగి ఆ పరిసరాలు, సంస్కృతీ చక్రాంకితాలౌతాయి. జంతువులలో లేని వావివరుసలను జంతుచిహ్నంతో ఏర్పరచుకోవడం, ప్రకృతికి - సంస్కృతికి మానవుడు ఒక సరిహద్దును గీసుకోవడం కావచ్చు. ఇలా ప్రకృతి-సంస్కృతి మధ్యజరిగే ఆదాన ప్రదానాలతో ఏర్పడిన ఒరవడి - దృక్పథాలమీద కాలక్రమేణ కొంగ్రొత్త సమాచారం కోటకట్టుకుంటుంది.

## పేరు - శరీరం - జీవి - పెతర :

గడియారంలోని పెండ్యులంవలె, భాష, ఆకారం, అలవాట్లవల్ల నిర్ణీతమైన పరిసరంలో జీవించే గిరిజనుడికి శరీరము, జీవి, పేరు నీడకూడా తనలో భాగమే.[3] ఏదో వరుసతో పిలుచుకోవడమేగాని పేరుఅడిగితే గిరిజనుడు అనుమానిస్తాడు. అడిగేది దిగువవాడైతే తనమీద ఏం వ్రాసుకుంటున్నాడో అనిభయం. 'ఏం అరెస్టు చేయిస్తావా!' అంటాడు. (పితూరీరోజుల్లో పోలీసులు పేర్లు వ్రాసుకునేవారు). అడిగేది తమవారు అయితే ఆ పేరుచదివి-తన వెంట్రుకలు, గోళ్ళుసేకరించి ఏచెడుపు చిల్లంగి చేస్తారేమో నని అదురు. చనిపోయినవాడి పేరుచెప్పకుండా కోకిరిపేర్లతో మాటాడుకొంటారు. పేరువిని, గాలిలో పోతున్నవాడు అక్కడే తిష్ఠవేస్తాడేమోనని భయం. శరీరం,జీవి ఒకటైన వాడికి చచ్చిన తరువాత గాలిలో ఉనికి ఏమిటి అని సందేహం రాకమానదు (పదార్థానికి -పదానికి సంబంధంవంటిదే అది. పదార్థంపోయినా పదంకొంతకాలం ఉంటుంది కదా). చచ్చిన తరువాత జీవిఉన్నంతసేపు శవాన్నివదలదు. శవం ఇంట్లో ఉందంటే అందరికీ భయం. ఊరివారంతా అక్కడే కూడతారు. భజనలుచేస్తారు. చూపుకురాలేదని ఆ జీవి కోపగిస్తుందేమోనని, బంధువులు వచ్చేదాకా నిరీక్షిస్తారు. శవం మట్టిలో కలిసే దాక గుండెలలో కునుకుఉండదు. చచ్చినతరువాత వాడు అయినవారిని, కానివారిని పూని పీడిస్తుంటాడు. శుభాశుభాలుచెబుతాడు. దినకార్యం తీరకపోతే మరణించినవారి 'చిలక' (జీవి)ఆకుపచ్చని మిడతరూపంలో ఇంటికివచ్చి మంటలోపడేప్రయత్నం చేస్తుంటుంది. అది ఒక సత్యాగ్రహమేమో. దినంతీరిన శవాలు-తీరని శవాలను వెలివేస్తాయట. అందువలన 'నూలుపోగు నూరువరహాల విలువ' అని 'బాస' చేస్తూ మిడతకు నూలుకట్టి పంపుతారు.

ఆకస్మిక ప్రాణనష్టం పొందినవాళ్లు (వీరుండ్లు) భూతాలౌతారని వల్లకాటికి చేరనివ్వరు (దహనం చేస్తారు). దహనానికి, పూడ్చుడానికి తేడా ఉంది. దహనం కక్షతో

చేసేపని అంటారు. ఇటువంటి దండుభూతాలను, మందుపాతర్లను మొక్కుతారు. (ఉదాహరణకు: పాములేరువద్ద ఆముదంమడుగు అనే స్థలం). స్థానికులైన కత్తులవారు 'బలిగెల' అంటే బలగంగలవారుకాగా, వలసవచ్చిన పటాపురెడ్డి కత్తులవారు శస్త్రోపజీవులు.

**పేరుముద్ద :**

పిల్లలకు పెద్దలపేర్లు పెట్టుకోవడం ఉన్నది. 'గంగడవు, సింగడవు పేరు ముద్దముట్టో-విల్లుబద్దపట్టో' అంటూ పురుముళ్లలో(అన్నప్రాశన), ఏపేరు చదివినప్పుడు ముద్దపట్టుకుంటే ఆ పేరుపెడతారు. చాలామంది వారాలపేర్లు పెట్టుకుంటారు. కొండరెడ్లలో చిన్నవాళ్ళు తమను పేరుపెట్టి పిలిచినపుడు 'నీవు నా పేరుముద్ద తింటివా (పురుముళ్ల బంతి), పేరుపెట్టి పిలుస్తున్నావు' అని మందలిస్తారు.

**రాజులు - గొల్లలు - కన్నెలు - గురువులు - పెతర్లు :**

తండ్రులు చనిపోయి పెతర్లు అవుతారు. ఈ పెతర్లకు వేటబసలో మాంసం నివేదిస్తారు. మూడాకులలో నివేదించే పదిరిగలచోట, మధ్యఆకులో పచ్చిమాంసం అడవులరాజు కాటమయ్యకు; ప్రక్కఆకుల్లో కాల్చిన మాంసం పెతర్లకు. ఏడాకుల్లో పెట్టే 'పదిరి' కొన్ని చోట్ల.

సిద్ధాన్నంవలె మాంసం దొరకవలెనని విన్నపాలు.

'రెండుకళ్లు దొరగబొడిచి, నాలుగుకాళ్లు కూలగొట్టి, జీడెంకూరతీగతో దోరపిడ్డట్లు, మాకు ఎదురుగుండ మాంసకావాల; పులసకుండ, వాడకుండ ఎండిన మాంసం ఎండినట్లు, పచ్చిది పచ్చిదున్నట్లు మాకు దొరకవాలె'.

పరిమిఆకులలో గొల్లలకు, రాజులకు, పెతర్లకు మాంసంనివేదిస్తారు. కలరా, వాంతులవంటి అంటువ్యాధులతో చచ్చినవారి సమాధిమీద పరిమిముళ్లకంపవేసి, పరిమిముల్లు దారిలోవేసి తిరిగి చూడకుండావస్తారు. పెతర్లలో కలిసిపొమ్మని పరిమితో హెచ్చరిక. ఆజబ్బు తమకురాకుండా ఉండాలని ముల్లుదారికట్టు. నాలుక, గుండె, చెవి, గోరు, తోకలలోకొంత, ఎర్రగొల్ల, పచ్చగొల్ల, పైడిగొల్ల, పాలగొల్ల, నల్లగొల్ల, తెల్లగొల్లలకు నివేదిస్తారు. అడవిజీవాలను కాచేవి ఈగొల్లలు. పెతర్లకు ప్రత్యేక స్థావరం ఏదీలేదు. మనసుపుట్టినపుడు తమవారివద్దకు వచ్చిపోతారు.

నగరులన్నీ (కొండలు) రాజుల విహారభూములు. కాటమయ్య వేటలరాజు. తూర్పుగోదావరిలో (గుర్తేడువద్ద) అత్యున్నతమైనది, మహిమాన్వితమైనది కాటమరాజు కొండ. మూలికలకు ప్రసిద్ధమైనది దుమ్మకొండ. కాటమరాజుకొండదగ్గర కళ్లెపుగొంది వద్దనున్న ఐదలచెరువు పేరిటివాడే ఐదలరాజు. గొప్ప ఐంద్రజాలికుడుగా పేరుగన్న కన్నమరాజు గుర్తేడు ఐదారుతరాలక్రింద పరిపాలించినవాడు. ఈ అడవిరాజులలోకే పాండవరాజులుకూడా వస్తారు. కాని అడవిరాజులకు, పాండవరాజులకు ఒక స్పష్టమైన విభాగమున్నది. అడవిరాజులు అడవికి ప్రకృతికి అధిపతులుకాగా, పాండవ రాజులు పంటభాగ్యాలకు అనగా సంస్కృతికి అధిపతులు.

## కన్నెజీలుగు - దేవగుమ్మడిపండు - రాజులదుంప :

పాండవరాజులు తానంపండుగరోజుల్లో (పంటలపండుగ) గ్రామానికివచ్చి ప్రజల ఆతిధ్యాన్ని మన్నిస్తారు. భీముడు అభిమానదేవత. అరగని నూలిదుంపలు భీముడిదుంపలు. పెద్దపెద్దవేనాలు భీముడివేనాలు, భీముడిపనుకులు, భీముడిలాగలు. గురితేడువద్ద బబ్బిలోవలో గుహకు మొక్కుతారు. అది రాజులకట్టువ. దేవగుమ్మడిపండు దేవతలదితినే గుమ్మడి మానవులది. కన్నెజీలుగలు (ఫెరన్) కన్నె పాపలవి. కల్లుజీలుగ తమది. ఇలా తినడానికి అనువుగాని పండ్లు, దుంపలు వగైరా దేవతలవి. ఎక్కడానికి వలనుకాని కొండలు రాజులవి. వాటిలో నరులువేటాడబోరాదు. తూర్పుగోదావరిలో ధారలదుమ్మకొండ, బాసదుమ్మకొండ రెండు ప్రసిద్ధమైనపర్వతాలు. బాసదుమ్మకొండకు వేటపోయినవారు, విల్లునుకంప, తోటివాడిని మాల, అన్నాన్ని పియ్యి అని మారుపేర్లతో పిలవాలి. నరులు వేటకువచ్చినట్లు రాజులు గమనించ కుండా ఉండాలని యీనటన. కంటబడితే మనుషులను ఎత్తుకుపోయి తమలోకాన్ని చూపించి 'ఇలా రాకూడదు మీరు' అని మందలించి మరల పంపేస్తారు ఈ రాజులు.

'ఆడవారిని అడవి జీవాలు మోహిస్తాయని' నమ్మకం. బజారుకు భార్యతో వెళ్లడం డబ్బు వదిలించే సరదాఅయితే, అడవిలో ఆడదానితో నడవడం ప్రమాదంతోకూడిన వ్యవహారం. ఆ పువ్వు అందంగా ఉన్నదని - ఈ పిట్ట మాంసం రుచిగా ఉంటుందని ప్రోత్సహిస్తారు. రాముడికి మాయలేడి వెంటపడక తప్పలేదుకదా! అదీకాక ఆడవారిది అంటుముట్టు బ్రతుకు. మయలగాలికి కన్నెలు - రాజులు కోపగిస్తారు.

*దేవగుమ్మడిపండు, కన్నెజీలుగ, రాజులకట్టువ, బాసకొండ, భీముడిపనుకులు*

గన్నికలు (కన్యకలు) కన్నెపాపలు జలదేవతలు - లోయలలో వారి నివాసం (నీరుపుట్టేవాటిని లోయ, లోవ అంటారు; నీరు పుట్టనిచోటు గొంది). కప్ప, ఎండ్రిక, చేపలు వారిపరివారమే. కొండలలో దొనలను మయలపరచరాదు. ఎంగిలిచేయరాదు. పురిటికీడు తీరినతరువాత రేవుదొక్కేఆడవారు, తమసంతానం మురికిని మన్నించమని కప్పకు మొక్కుతారు. కప్పకొండ అని అక్కడక్కడ పెద్దపెద్దకొండలకుపేర్లు అంటే ఆ కొండమీద చెరువు దొన ఏదైనా నీటివనరు ఉన్నది అని మనంఊహించవచ్చు. ఎండ్రిక పర్వతం విశాఖమన్యంలో ఎన్నో జోరెలు పుట్టే ఉన్నతమైన పర్వతం. మత్స్యగడ్డ (సీలేరు) ప్రధాన జీవధార. భారతదేశంలో చేపలను ఆరాధించే ఏకైక తీర్థం మత్స్యగుండం ఒకటే కావచ్చు (పాడేరుకు ఆరుమైళ్ళు-మఠం దగ్గర). మాడుగులరాజులది మత్స్యలాంఛనం. ఈ మత్స్యదేశానికి వనవాసం వచ్చినవారే పాండవరాజులు. మత్స్యగడ్డ, మరికొన్ని గడ్డలుకలిసిన తరువాత, సీలేరుగామారి శబరితోచేరి కూనవరందగ్గర గోదావరిలో కలుస్తుంది (సీలలు-ఎండ్రికలు). చెట్టుపండుగ (జీలుగ) చేసుకుంటూ...

'రౌసుకన్నెలు, మురికికన్నెలు, నీలికన్నెలు, ఎర్రకన్నెలు అందరు అంటుదురు ముట్టుదురు; ఈరోజునుండి మాది ఇంతదాకా మీది'

అని విన్నవిస్తూ కన్నెలకు తొలి కల్లుబొట్టు పోస్తారు.

కాలువ ఒడ్డున పెరిగే ఫెరన్‌లు కన్నెల జీలుగులు. ఇవి జీలుగుచెట్టును పోలిన మొక్కలు (ఫెరన్‌లు పుష్పించని జాతి, జీలుగ పుష్పించే జాతి కాబట్టి గిరిజనుల పోలిక ఆకృతి మాత్రమే) ఈ ఫెరన్‌లను కన్నెలకు కేటాయించడంవలన పెద్దజీలుగ జోలికి వారురారని ఆ విధంగా నామకరణం. ప్రకృతితో వ్యవహరించేటప్పుడు ఆ దేవతల ఇష్టాయిష్టాలకు విలువనివ్వాలి. అనేక విధివిధానాలతో వారిని అనునయించాలి.

కొండ చేనుకు అగ్గులు పెడుతూ -

'డొక్కులార, మిందెలార, పాములార, చీమలార, సిరుకోటి జీవులార, మా పంట చేనుకు నిప్పు పెడుతున్నాం కాబట్టి తప్పుకోండో' అని కేకలు వేస్తారు.

**నమ్మకాల దొంతరలు - ప్రకృతిలోని లంకెలు :**

ప్రకృతిలోని సూక్ష్మమైన మార్పులకు స్పందించే డొక్కి, మిందె, బల్లి, తొండ, ముంగివారి గురువులు. మూర్దెలుక - పందికొక్కు ముహూర్తగాడు. మూర్దెలుకను

*రౌసుకన్నెలు, మురికికన్నెలు, నీలికన్నెలు, ఎర్రకన్నెలు, పాలకన్నెలు*

ముహూర్తగాళ్లు - దిసారి, వాల్మీకితినరు. జీలుగకల్లు పందుపిల్లికి చాలాయిష్టం. అది కల్లుదొంగ. అందువల్ల పందుపిల్లిని చెండినవాడు చెట్టు గీయకూడదు, వాడుచెట్టుఎక్కితే కల్లుఉట్టిపోతుంది. అడవిజంతువులను కుక్క, పులి వేటాడిచంపుతాయి. అందువలన కుక్క, పులి లాగిన ఎంగిలిమాంసం దేవతలకు పెట్టకూడదు. కుక్క తమకుటుంబంలో భాగంకాబట్టి తమకు వచ్చినవాటామాంసంలో కుక్కకు కొంతపడేస్తారు.

ఈ ప్రకృతిలోని ప్రాణికోటికి తమలోతమకు చుట్టరికంఉంది. దాన్ని భగ్నంచేస్తే శిక్షతప్పదు. ఆవరణ వ్యవస్థలోని అన్యోన్యత ఏ కొంచెం తెలిసినా ఈ నమ్మకాల లోతు తెలుస్తుంది. ప్రకృతిలోని లంకెల స్ఫూర్తిగా, నమ్మకాలు దొంతరగా పెరుగుతుంటాయి.[4] (Ecosystem - Beliefsystem - Semantic domains)

నేలమీద పుట్టలు కట్టే చెదపురుగుమీద పొడుపు కథలు
'ఇసుకను మప్పిన వాడు'
ఆ 'జీలకర్రంత జీవుడికి ఏనుగంత గొద్దె' (పుట్ట)
ఆ 'ఎర్రటి బుడ్డికి ఏడు గొంతుకలు' (పుట్టకు తలలు ఎక్కువ)

చెదపట్టే నేలలో చెట్లు పెరగవు. కాబట్టి 'భూమికి గంగదేవి' (ఆటలమ్మ) వంటిది చెదపుట్ట. ఇటువంటి ఈకీటకం వ్యవసాయదశలో గొప్పపండుగకు కేంద్రమయింది. ఆ పండుగలోని గేయగాథలో (తరువాతిఅధ్యాయం) ఈ జంతుప్రపంచం సాంప్రదాయ-కమైన రీతిలో తమ పాత్రలను నిర్వహిస్తాయి. వేదకాలంలో, అగ్ని ఊర్ధ్వజ్వలనంవలె, ఈ చెదలు ఇల్లుకట్టుకోవడం గిరిజనులకు ఎంతోస్ఫూర్తినిచ్చింది. జాంబవంతుడు భూమికి పురుడు చేసినవాడు. అందుకని ఆయనకు పుట్టకూటి విందు, భూదేవిపండుగ తరువాతవేటలో ఎలుగు, పందిగాని దొరికితే పంటలు బాగాపండుతాయని నమ్మకం. భూదేవిపండుగకు పందినివేయాలి. 'పందికిస్తే పచ్చికకుబలం' (పచ్చిక=పైరు) పంది నేలనుతవ్వుతుంది, పంటలను పాడుచేస్తుంది. అందువలన కావచ్చు పందిని బలి ఇస్తారు.

**'తల్లి భూదేవత - తండ్రి ఆకాశవేణ్ణి - పుట్టించిన బ్రహ్మదేముడ'**

ఇది ప్రతి సంకల్పానికి ఓంకారం. భూమితల్లిమీద, గ్రామదేవత సంకులమ్మ మీద (విశాఖ) తగవులలో ప్రమాణంచేస్తారు. అడవి, వేట, పంటలకు సంబంధించిన

నియమాలను ఉల్లంఘిస్తే గ్రామం తప్పువేస్తుంది. భూగోళశాస్త్రం భూమిపై ఆయా భాగాలఉనికిని అక్షాంశ, రేఖాంశాలు ఆధారంగా ఎలా వివరిస్తుందో, అలాగే గిరిజనులు ప్రకృతిని ఆయాదేవతలను విడిచి ఊహించలేరు. ప్రపంచాన్నిగూర్చి ఆలోచించేటప్పుడు జనాభా పెరుగుదల, ప్రకృతిసంపదక్షీణించడం వంటి విషయాలను తలచుకొని, నాగరికులు ఎంత కలవరపడతారో - ప్రకృతికి అధిదేవతలైన వారిని, ఆచారం ప్రకారం మన్నించకపోతే, పులులు ఊరిమీద పడతాయని, రోగాలు ప్రబలుతాయని గిరిజనులు భయపడతారు. అది మొత్తం గ్రామం మనుగడకే సమస్య.[5] ఈ పండుగలు చేయడంలో గ్రామపూజారిదేపైమాట. అతనిసూచనలు అమలుపరచడం గ్రామపెద్దలైన పెత్తందారు మునసబుల బాధ్యత. తొలిగా ఆప్రదేశంలో ఇల్లుకట్టుకున్నవాడే పూజారి. అతని ఇలవేల్పులే క్రమంగా గ్రామదేవతలవుతారు. అతడేగ్రామంలోపెద్ద. కాని కాలక్రమంలో గిరిజనులకు బయటిప్రపంచంతో సంబంధాలుపెరగడం-స్థిరంగా సన్నిహితంగా బహు కుటుంబాలు సహజీవనం చేయవలసిరావడంతో - ఈ సామరస్యాన్ని కాపాడేందుకు ఏర్పడిన లౌకికవ్యవస్థలో మునసబు ముఠాదారులది ప్రధానపాత్ర కాజొచ్చింది.

**వాత×బొట్టు, కుడి×ఎడమ :**

జీడిపిక్క కాల్చినొప్పులకు వాతవేస్తుంటారు. పిక్కలోని నూనెవల్ల ఈవాతకు చర్మం ఉడికిపోతుంది, గాయమౌతుంది. ఈ పిక్కలను ఇష్టంగాతినే ఎలుగులకు, పందు పిల్లులకు దవడలు చీలిపోతుంటాయి. చచ్చినవాడి జీవివచ్చి, దినంలోపల తమను పీడించకుండా, సమాధిమీద ఒక్కోఇంటిపేరు చదివి జీడిగింజతో బొట్టుపెడతారు. ధాన్యం తూర్పారపోసేటప్పుడు కరిమోయకుండా (గాలి) జీడిఆకులు గుచ్చుతారు. కొండదానుగుడు (దానవుడు,అడవిరాజు) కల్లురుచిమరుగుతాడేమోనని జీలుగుచెట్టుకు జీడిపిక్క, పాతచెప్పులు మసిగుడ్డ కడతారు. జీడిపిక్కరక్ష. వాతవేస్తామని బెదిరింపు. పాతచెప్పులు మొదలైనవి చూపించి 'ఇదిచాలా నీచమైనవస్తువు - మీవంటి గొప్ప రాజులకు తగదు' అని విన్నపం. ఈ గడుసుతనం-పిరికితనం కొండవారిలోనే కాదు, ప్రతి భక్తుడి మనస్తత్వంలో కలగలిసి ఉంటాయి.

బొట్టుకు పోయినపుడు (కన్యాదానం) పిల్లకు కట్లవారిబొట్టు, మట్లవారిబొట్టు, కారంవారిబొట్టు, విష్ణుబొట్టు, ఈశ్వరబొట్టుఅని చుట్టాలందరి పేరు పేరునా కుంకుమ బొట్టుపెట్టి -

*కట్లవారిబొట్టు, మట్లవారిబొట్టు, విష్ణుబొట్టు, ఈశ్వరబొట్టు*

'పూససేకు నీకు వేస్తున్నాం ఇక ఈపిల్ల ఫలానావారి కోడలు' అని వెల్లడిచేస్తారు.

మార్గ సంప్రదాయంలోకూడా శుభకర్మ జ్యేష్ఠ పూర్వం - అశుభకర్మ కనిష్ఠ పూర్వం. పెళ్ళి, చావులలో కర్మకాండ ఈతేడాలతో చాలావరకుఒకటే. శుభానికి పసుపు బియ్యం, అశుభానికి ధవళాక్షతలు, నల్లనువ్వులు. శుభంకుడి, ప్రదక్షిణం; అశుభం ఎడమ, అప్రదక్షిణం; శుభంసవ్యం. అశుభం అపసవ్యం.

**సంకుమాను - సంకురాట - సంకుపీట - సంకుమండ - సంకులమ్మ :**

నేరేడు చాలా పవిత్రమైనది. నేరేడుచెక్కది చలువగుణం. పెళ్ళికానివారు నేరేడు పుల్లతో పళ్ళుతోమరాదు. పెళ్ళిలో పెద్దలు నేరేడుబల్లమీద నిలుచుని దీవిస్తారు. గృహ నిర్మాణంలో నేరేడుతొలిరాట. నేరేడుచెట్టుకింద దేవుడిబసకుదిరితే ప్రశస్తం (సంకుమాను = నేరేడు) కళ్లంలోకి ప్రవేశించేముందు పోతుమీదపెట్టిన లచ్చిమిదోకిలో పసుపునీళ్లు నేరేడుమండతో కాళ్లమీద చల్లుకుంటారు. నేరేడు వారికి శంఖం(సంకు) వంటిది. శంఖంలోపోస్తే తీర్థమవుతుంది.

రావిఆకులను కంకణాలుగా కట్టుకుంటారు. శతమానాలు (తాళి) రావిఆకుతో చేస్తారు. నూతన దంపతులు రావి చుట్టూప్రదక్షిణం చేస్తారు.

వేగిసమానునరికితే ఆదారువుఎర్రగా స్రవిస్తుంది. రంగులో రక్తంతోడి సామ్యంవల్ల వృక్షాల్లో మనిషిపాత్ర వేగిసది. గంగాలమ్మ 'ఎర్రమార్గం' దేవత. ఉడుకులు కలిగించి మనుషులను తినివేస్తుంది. ఆమెకువండే బోనానికి మూడువేగిస బొండలుపాతి దానిపై పిడతలో అన్నంవండుతారు.

వనాంతరాన్ని (మూలికను) తీసికోవడానికి ఆచెట్టుమొదట 'సేసలిడి-రాగిడబ్బు ఉంచి' మొక్కి తీసుకోవాలి. చెట్టుకుకూడా రాగద్వేషభరితమైన జీవమున్నది. అతుకు బచ్చలచెట్టు ఎముకవిరిగితే కట్టడానికి పనికివస్తుంది. కానిదీన్ని ఇంటికితెచ్చి వేసుకుంటే ఇంట్లోఎవరి ఎముకయినావిరుగుతుంది. పాముకాటుకు పాముపడగవంటి గీతగల ఆకుమందుకావాలి. పాముమందు, పులిమందు ఇంట్లో దాచరాదు. వాటిజీవం ఇంటతిరగవచ్చు. ఇంట్లో వస్తువులు పాములాజారిపోతాయి. మేకమాంసం బొప్పాయి కర్రతో, ఉడుముమాంసం (చాలాగట్టి) ఒద్ది మానుపుల్లతో కలియబెడితే తొందరగా

ఉడుకుతాయి. కాబట్టి ఆచెట్లకు ఆజంతువులకు వైరమని తర్కం. ఒద్దిపువ్వు ఉడుము ఒంటిమీదపడితే అంతవరకు దాని శరీరం తెగుతుందనుకోవడం అతిశయోక్తి కావచ్చు.

**చుట్టరికాలు :**

పోలికలవల్ల, వస్తుగుణంవల్ల - ఆయాధర్మాలను ఆపాదించడంవల్ల నమ్మకాలు, తంతులు అంతులేకుండా, అంటువ్యాధివలే విస్తరించుకొని పోవడం - పునరావృత మవుతూ ఉండడం సంస్కృతిలో స్వాభావికమైన విషయం. ఈ చుట్టరికాలలో బీరకా పీచులు కొన్ని, శాఖాచంక్రమణాలు కొన్ని, బాదరాయణ సంబంధాలుకొన్ని, మోకాలికి బట్టతలకు ముడివేయడంకొంత. కాకతాళీయంకొంత, ఈ మనోవ్యాపారంలో భ్రమ ప్రమాదాలు - వాటి చమత్కారాలను ఉత్ప్రేక్ష, ఉపమ వగైరాలుగా అలంకారశాస్త్రం వివరించిది. రూపకంగా మతం మన్నించింది. నమ్మకాలవంటి మానసికశక్తులైనా, పదార్థంలోని భౌతికశక్తులైనా చెలరేగితేచాలు - ఊపిరాడనివ్వకుండా విస్తరించడం ఇదేకాబోలు. ఉత్పత్తికి, విశ్రాంతికి, తగినవిజ్ఞానం, వినోదం పెరగాలంటే, నమ్మకాలుగా కథలుగా - కథలు ఆటపాటలుగా ఇలా తరతరాలకు సాగిపోవలసిందే.[6]

ఈ అనంతమైన సృజనాత్మకశక్తితో వివిధభూమికలను కదిలించి మనోమయ ప్రపంచాన్ని, ఆదర్శాలను విస్తరింపచేసినవారు మన దార్శనికులు.

కేవలంసేకరణేకాని వ్యవసాయంనేర్వని చెంచులదేవతలలో సీతమ్మలేదు. పాండవులలో అర్జునుని స్మరించే సందర్భంవేరు. నల్లమలఅంకమ్మ ఒక్క అడవికేకాదు అనుక్షణం చెంచులను రక్షించే దేవత. బయన్న, పోతురాజు ఆతల్లిబిడ్డలు. తేనెపెరలు తీసేటప్పుడు మల్లమ్మకు (మల్ల = కొండ) ఒకచిన్నగడ్డ తీసిపెడతారు. కణిక (కన్యక) దేవతలు బావిలోఉంటాయి. సంవత్సరానికొకసారి బెల్లం, కొబ్బర్లతో వాటిని పూజించాలి. ఈ కణికలు మనిషిని రోగగ్రస్తుణ్ణిచేస్తే గద్దెగాడే దించాలి. మాంసం దొరికినప్పుడు, తేనె తీసినప్పుడు, రోగం వచ్చినప్పుడు ఆయాపద్ధతుల్లో ఆ దేవతలను మన్నించాలి.

సేకరణదశలో ఉపరితలంవరకే చెంచుల దేవతాగణం పరిమితంకాగా, ఉత్పత్తి దశకుచెందిన తూర్పుగిరిజనులు భూమిని - వర్షానిచ్చే ఆకాశాన్నికూడా మొక్కడం ప్రారంభించారు.[7]

---

*శాఖాచంక్రమణాలు, బాదరాయణసంబంధాలు, మోకాలికి బట్టతలకు ముడివేయడం*

వ్యవసాయంవల్ల గ్రామాలు స్థిరత్వంపొందడంతో ఇలవేల్పులు గ్రామదేవతలు అయినారు. ఆడమగకలిసి పనిచేసే అవకాశంపెరిగింది. వ్యవసాయానికి తగిన కర్మ కాండలు విస్తరించసాగాయి. వేటలోక్రమశిక్షణ, చెట్లనునరికి పోడుచేసుకోవడానికి కావలసినసుసంఘటితమైన శ్రమశక్తిని, మూలధనంగా అందించింది. తొడిమలో మొగ్గవలె, కృషిలో ఒదిగి ఎదిగే సమాజం, పంటలు పండేనాటికి పండుగ సంబరాలలో ఆటపాటలలో వేయిరేకులుగా విప్పారుతుంది. పైరుపెరిగేనాటి పండుగలు పంటమీద నమ్మకాన్ని పెంచితే - పంటలనాటి పండుగలు ముందుముందు ఒడిదుడుకులగూర్చి హెచ్చరిస్తాయి. ❊

<u>అడ్డాకులతో కుట్టిన దూబ, బొజ్జ</u>



## దోసాలు – పండుగలు :

'అడవిపై నాగలి మోపడానికి' జనంఎంత భయపడేవారో తూర్పుగోదావరి రిజర్వు అడవిలో కలిసిపోయినలంకలు చెపుతాయి. విశాఖజిల్లాగిరిజనప్రాంతాల్లో వ్యవసాయం అధికం. దేవతలకు ఆశ్రయమైన అడవిని వ్యవసాయంకోసం నరకడం 'దోషం'. కానీ తప్పదుగదా. అందువలన నెలకు రెండుమూడుసార్లయినా దానుగుడు, మావెలి, అమ్మతల్లి దోసమనిచేస్తారు. ఆరోజు పూజాపునస్కారాలతోపాటు వ్యవసాయం పనుల మీద నిషేధాన్ని పాటిస్తారు. దోసంనిషేధం, పండుగ అనుజ్ఞ. వ్యవసాయంలో స్థిరపడి వేటాడేతీరిక, నేర్పు తగ్గిన జాతులకు పరిసరాలంటే ఎంతోభయం. 'అడవికి పోయింది మసి – ఇంటికివస్తేనే పసి' (పశువు), 'తూలితే తల–తేలితే తోక'. ఒకటిఅర తుపాకులు ఉన్నా, పశువులు కాచేందుకు 'గౌడు'లున్నా, అందరినీ అన్నికాలాల్లో ఆకస్మిక ప్రమాదాలనుండి అవిరక్షించలేవు.

**కొండరాజులు – కొండదానుగులు :**

కొండరెడ్ల కొండరాజులు, విశాఖ గిరిజనులకు కొండదానవులైనారు. ప్రకృతిలోని దానవుడికి, సంస్కృతిలోని పాండవులకు పోరాటం నందిపండుగ. 'ఆరుళ్ళ' అలవిగాని గాలితాకిడిగల ప్రాంతం. కాబట్టి అక్కడ గాలిదోసం అదనం. అనువంశికంగా యీ పూజలు జరిపేందుకు పొలాలుకూడాపంచారు. గంగమడి, నందిపూజారిమడి, తాసరి మడి (ఇటిం) మొదలైనవి ప్రతిగ్రామానికి ఉంటాయి. మొదటినుండీ ఈప్రాంతంవారైన కోదులు ఈదోసాలు మరింతశ్రద్ధగా చేస్తారు. తరువాత వచ్చిన కొండదొరలు, బగతలు, వాల్మీకులు ఆ ఒరవడిని పాటిస్తున్నారు.

బగతలు, కొండరెడ్లు పాలకవర్గంగా దిగువవారితో బాంధవ్యాలు పెంచు కున్నందున గోమాంసాలను పరిహరించారు. కొండరెడ్ల గురువులు జంగాలైనందున పందినితినడం తినకపోవడంలో పాక్షికతఉన్నది. కాని అన్నిజాతుల వారులు పిల్లి, కుక్క వంటి 'ఊరజంతువులను' తినరు. కోళ్ళు, మేకలు పెంచడంలో ఆర్థిక దృష్టికంటే 'అక్కర' (అక్కర–భూతవైద్యం, పండుగలు) ఎక్కువ. మొక్కుబడికి గుర్తుగా గోరు కోస్తారు. గోరుకోసినకోడి అంటే మీదుకట్టినముడుపు అన్నమాట. శవంగోరు, ఆ సమాధిమట్టి తీసి కాలవలో 'శిలగలుపు'తారు. ఆదైవంవెంట, జీవివెంట శరీరాన్నికూడా పంపినట్టు.

*గంగమడి, నందిపూజారిమడి, తాసరిమడి, వెట్టిమడి*

పొట్టసరుపు (సరువు–సుంకు) పండుగచేస్తూ 'తల్లి భూదేవత, తండ్రి ఆకాశవేణ్ణి, పుట్టించిన బ్రహ్మదేవుడా, అంకిలివద్దు, అనుమానంవద్దు నీదేభారం' అని కోడిచేత ముత్యాలు ముట్టిస్తారు. అది రెండుమూడు గింజలు ముక్కున పొడిస్తే తమ విన్నపాన్ని దేవతలంగీకరించినట్లే. అలా జరగకపోతే ఒకటిరెండుసార్లు విన్నవిస్తారు. కోడిని ప్రోత్సహిస్తారు, పందితల కదుపుతారు. అప్పటికి ఫలితం లేకపోతే తమవల్ల లోటులేదు కాబట్టి ఎవరో చెడుపుచేస్తున్నారని అనుమానిస్తారు. గొరవలు కొంతహడావిడి చేస్తారు. ఈలోగా అనుకున్న శుభలక్షణాలు సిద్ధించవచ్చు. ఈ కోడి 'ఏడుకొమ్ముల ఎర్ర పోతు', ఆ పంది 'నల్లజీవుడు'. ఈబలులు దేవతలు – మానవులు పరస్పరం ఎరుకపరుచుకొనే మాధ్యమాలు. విశాఖలో పొలానికి చీడరాకుండా, అడవి జీవాలనుండి రక్షించమని పోతురాజుకు, దానుగుడికి మేకనుకోస్తారు. చీడను తగ్గించుతాయని పొలంలో కసిమి కర్రలు, సీతమ్మకర్రలునాటి 'జొల్డ'పండుగచేస్తారు.

## గోదావరిలో కొత్తలుకలపడం – విశాఖలో వెన్నులుముంపడం :

గోదావరి గిరిజనులు దసరాకు తలవెన్నులు మూటకడతారు. 'అపుడు మూట కట్టాం కాబట్టి ఇప్పుడీ తలరాసులు కలుపుతున్నాం' అని కళ్ళంలోని కంకులుకలిపి 'రాజులపండుగ' రోజున (ఫిబ్రవరి) మగవారంతా, నగరిబసలో (కొండదగ్గర) వండుకు తింటారు (పొలులుచెల్లినాక వేటనుకోసి పొలంలోనే తిని, మిగిలినది అక్కడ భూమిలోనే పాతిపెట్టడం వంటిదే ఇది). ఆయాప్రాంతాల్లో రాజులపండుగకు, కొండదయ్యాల పండుగ, గట్టుతేలుపండుగ, పెద్దలపండుగ, పిండిపండుగ, పప్పులపండుగ నామాంతరాలు. ఈ రాజులపండుగ నియమనిష్ఠలతో చేయాలిగాబట్టి గొట్టుబసలో ఆట పాటలుకూడా ఒకహద్దులోఉండాలి. ఈ పండుగకు వాయించే 'ఔజం' గుమ్ముడుకర్రతో అడవిలోనే ఉండితొలవాలి. దేవతలనాహ్వానించే 'లేలపాటలు' మాత్రమే పాడాలి. ఇదే బాణిలో కొన్ని 'పోకిరిపాటలు' దొర్లుతున్నా అవి బయటపడిపాడే ధైర్యంచేయరు. పాటల్లో వైవిధ్యంలేకపోయినా శివరాత్రిజాగారంవలె, ఏకాహంవలె తెల్లవారు ఆడతారు. వారివారి స్థితిగతులకు తగ్గట్టుగా, కల్లుబట్టి సావాసగాళ్ళు కొన్నిచోట్ల, పక్కపొలాలవారుకలిసి కొన్నిచోట్ల, 'కొండరాజుల పండుగ జాతర' (రాజవొమ్మంగిదారిలో రమణయ్యపేట గుడిలో) ఇలా అనేకవిధాలుగా ఈపండుగ చేసుకుంటారు.

*తల్లిభూదేవత, తండ్రి ఆకాశవేణ్ణి, పుట్టించిన బ్రహ్మదేముడ*

విశాఖగిరిజనులు 'సవితి - పలకం' (నవంబరు, డిసంబరు) నెలల్లో 'మంచి దినం' చూసి ధాన్యంవెన్నులుతెచ్చి గూనకుదురుమీదకడతారు (గూనకుదురు = దేవతల పెతర్ల, స్థానం). మరుసటిరోజు 'తోప'వండి(హల్వా) నలుగురికిపంచుతారు. వెన్నులు ముంపక పోతే ఎక్కడా తినకూడదు.

**రాజులపండుగ - ఔజంకొలువు; గూపిపండుగ - డోలకొలువు :**

తూర్పుగోదావరిలో రాజులపండుగ గోదావరిఒడ్డున 'ఔజం కొలువు'తో సాగితే, కానివాడ ప్రాంతంలో సంక్రాంతికి 'గూపిపిపండుగ'గా డోలకొలువు'తో చేస్తారు. ఇక్కడిది దట్టమైన అడవి కాబట్టి కొత్తచేలలో దిగుబడి ఎక్కువ. నగరిబసలో చోడిపిండి వండి, ఆ ముద్దలను బూరుగుకొట్టుపై నిలుపుతారు. గోవులు(యువకులు) సాలకొట్టును అమ్ములతోకొడితే, వేట, తప్పితే మాంసం తక్కువ, మలిదెబ్బ తప్పితే మరీ కాటకం అని నమ్మకం. 'మాగ్రామంలో పంటందు, పాటందు, దూడందు, దుఃఖమందు కష్టాలుగాని లేకుండా ఉండాలంటే ఈదెబ్బతగలాలి' అని కోరుకుంటారు. చెట్లన్నిటి లోపలికి లోతుగావేళ్ళుపారే బూరుగుభూమికి, ముద్దపంటకుసంకేతాలు. గ్రామంలోని ఆటబసలో సామలకుదురు, మట్టికుండ, దానిమీద చేట, గక్కులకర్ర, గూపమ్మ గురుతులు. కర్రతో గీస్తుంటే 'గర్రుగర్రుమనడం' గూపమ్మదీవెన. తల్లిపండుగ కాబట్టి 'కుండాన తిన్నదోయ్ - కుండగగ్గ ముండయా' అని వెటకారం. కువ్వెలకర్రను ఆడమగ పోటీపడి విరవడం (ఆడవారుగెలిస్తే పాడిపంట - మగవారుగెలిస్తే కాటకం), తామరాకులమీద పులగంపై పెట్టిన రొట్టెను కొట్టడం ముందునాటి సరదాలు. గొడ్లపండుగ (గొడ్లకు కుడుములుకట్టి తోలడం) దీనికి అనుబంధం. కొత్తవాళ్ళు 'గౌరవలు పడడం' ఈ పండుగలో ఒకనాటి విశేషం. నాటి గౌరవల సంకల్పం.

'మాడోలలు మువ్వకుండలాగ మోగవాలె. పుట్టగపూజార్లము, పెట్టగ లంకెలము, పెట్టుపోషకర్తలము, పేరుగల్ల దాతలు మీరు, ఘనముగల్ల తల్లులుమీరు. కీడనక, కింకరనక, రోమనక, రొచ్చునక, మనయాటకళ్యాలకి, మీరు తర్లిరండి బాబు, పరుసాలుపలారాలు. తల్లేడుతల్లులవారు, తల్లేడు తానాలవారు, ఇరమట్టి భూమియిది, పొరమట్టి భూమియిది, వన్నెలభూమియిది, పంచేడువన్నెల భూమియిది, తారిన భూమియిది, తాటివన్నెల భూమియిది, పుట్టిన భూమియిది, పూరేడువన్నె భూమియిది,

ఏలిన భూమియిది, ఏడువన్నెలభూమియిది. గరికతో గరిక ఎంచి, మట్టితో మట్టిఎంచి, భూమితోభూమిఎంచి, పంచుకోరపాలించుకోర, కాకలుకాకుంట, కచ్చలుకాకుంట. మీరుఎంచి రండుడుబాబు. ఎంగిలై ఉన్నానుబాబు, సంగిలయి ఉన్నాను బాబు, కొండలు తిరిగినగాని మెట్టలు తిరగలేను, మేడలు తిరిగిన గాని మెట్టలు ఎక్కలేను, నిక్కాకు నిగుడకుబాబు, చక్కగ దయసేయుడు' అని గౌరవలు విన్నవిస్తుంటే చుట్టూపెద్దలు 'చిత్తం రాజుల్లార' అంటూ 'తథాస్తు' పలుకుతారు. ఈ గౌరవలకు పెళ్ళి, వాళ్ళ ప్రతాపాలు గూపికొలువులో మిగిలిన వేడుకలు.

భూదేవత ఇటింపండుగలలో వేటకుముందు కోడిగుడ్డును వేయడం - గొంది కోటలో (గురితేడువద్ద) వింటిబద్ద ఏరుకుని జాజులు (నారు) పోస్తూ -

'పిట్టకు నేద్దామా తమ్మా పింగునేద్దామా
తొమ్మిదిరెక్కల పిన్నుపిట్టకు తుప్పునేద్దామా' అని జలకాలాడడం.
(ఇదేదో అచలమతం పాటవలెఉంది. ప్రక్కగ్రామం గుర్తేడులో అచలమతం గురువులున్నారు. ఈపదంలో వారివాసన కనిపిస్తూనే ఉంది).

ఇలా వ్యవసాయపు పండుగలలో, వేట, శకునంగా ఒదిగిపోవడం శతాబ్దాలు కలిసి సహజీవనంచేసే సంస్కృతిలక్షణం. విశాఖజిల్లాలో నందిపండుగ, కొండరెడ్ల రాజులపండుగ వంటిది. మగవారు ఊరికి దూరంగా నందిపుట్టవద్ద చేసుకునే పండుగలో పుట్టకొమ్ముమిరిచి కోడిపుంజు చెల్లించి కల్లుపోస్తారు. ఈ పండుగ తరువాతే అడవిలో కొండచీపురు విరుస్తారు. గోదావరిలో కొత్తపంటకు పండుగచేసుకునే రోజు పాతధాన్యం, కొత్తధాన్యంకలిసి వండుతారు. అందుకే ఇవి 'కొత్తలు కలపడాలు'. 'కొత్తఫలంతిని కొవ్వి, పాతఫలంతిని బలిసి నా యీడువారికి, తోడువారికి పడపడా దొబ్బుకుపోవాలె' అని సంకల్పిస్తూ కొత్తలు తింటారు. పాత, కొత్తలో సంగమిస్తూ - కొత్త, పాతను లీనంచేసుకుంటూ ఎటువంటి సంక్షోభంలేకుండా కొనసాగే చైతన్య స్రవంతి సంస్కృతి. ❊

**పండుగ తీరడం :**

ధాన్యానికి, పప్పులకు పండుగతీరడంలో ఒకకీలకమైన విశేషం ఉన్నది. వేటాడిన జంతువును పచ్చిది రాజులకు, కాల్చినది పెతర్లకు నివేదించడం రివాజు. ఈ కాల్చడం (లేక వేయించడం) నైవేద్యంతో ముడివడిన అంశమై వ్యవసాయదశలో కూడ మంగలి పెంకలో (మంగలిపెంక=వేయించే మూకుడు) వేయించుకోవడం పండుగతీరడంగా లెక్కించబడుతున్నది. పండుగముందు, ఉడికించుకొని మాత్రమే తినాలి. పంట అందడంలో ఆలస్యాన్నిబట్టి, వాడుకోవలసిన వత్తిడినిబట్టి ఈ పండుగలు కొన్నిటికి చెల్లి, కొన్నిటికి చెల్లవు. అపుడు వాటన్నిటిని ఒకేతెడ్డుతో కలియబెట్టకూడదు. పండుగ తీరినవారిఇంట్లో తీరనివారుతినరు. ఈఆచారాలను ఖచ్చితంగాపాటించే ఖమ్మంజిల్లా ఉప్పనపల్లి రెడ్ల (ఖమ్మంజిల్లా ఏడుగురాలపల్లి) 'గుంపు'లలో (కొత్తచేనునరుక్కోవడానికి చేరిన గుమి) వారివారి స్వగ్రామాల్లో పండుగచెల్లినపుడే విడుదల లభిస్తుంది. కాబట్టి ఒకగుంపుగా చేరినా పండుగలందరికీ ఒకసారి విడిపోవు. పూర్తిగా వలసపోయినా తమ తరంవరకైనా స్వగ్రామంలో దేవతలను, ఆచారాలను మన్నిస్తారు.

మారేడుమిల్లివైపు గ్రామాలు స్థిరత్వం సాధించినందున ఊరివారంతా ఒక రోజునే పండుగ జరుపుకునేందుకు వీలైంది. ఈ ఆచారాలను జరిపించే యంత్రాంగం కూడా రూపొందింది. మొత్తంమీద పిండిపండుగతో చాలావరకు ఈ కట్టడులు విడిపోయి చుట్టాల రాకపోకలకు అవకాశం లభిస్తుంది. మామిడిపండుగ తీరిపోతే అన్నిఅడ్డంకులు తొలగి, అడవిఫలసాయం అమ్మిన సొమ్ములు కూడా చేతిలోపడి పెళ్ళిళ్ళకు తగినకాలం వస్తుంది. కాలానికి తగినట్లుగా మనుగడ సాగించే కొండరెడ్లు 'కొర్రకొత్త – కొడుకుపెండ్లి; అస్రకూడు – దసరాభోజనం ఒక్కసారి కుదురుతాయా' అంటూంటారు. జతపడని విషయాలను ప్రస్తావించినప్పుడు దొర్లే సామెత ఇది.

కొర్రకొత్త= నకనకలాడే ఆగస్టులో అందే తొలి కొత్తపంటపండుగ, నియమ నిష్ఠలతో 'కొత్తలు కలిపేతరుణం'. కొడుకుపెండ్లి = అంటూసొంటూ పాటించక నలుగురికి విందుచేయవలసిన సందర్భం.

అస్రకూడు= (అస్ర – అసలైన) మృష్టాన్నం;

దసరాభోజనం 'దసరాకు డాకుడాకు ఇబ్బందులు' కొత్తలపాతల ఎడం; తిండి

కరువురోజులు. కొర్రకొత్తలో కొడుకుపెండ్లిచేయలేం, దసరాలో అస్రకూడు పెట్టలేం అని దీని అర్థం.

ఉడికించడం, వేయించడం చిన్నఅంశమయినా, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రకృతి, సంస్కృతి హద్దులను తెలియచేస్తూ, తిండిగింజలు వాడుకోవడంలో జాగ్రత్తను విధిస్తూ, మహత్తరప్రయోజనాన్ని సాధిస్తుంది.

**మామిడికొత్త :**

రాజులపండుగలో దేవతలు, పెతరలకు మొక్కడంతో పంటలకు సంబంధించిన నియమనిష్ఠలు తీరిపోతాయి. చుట్టపక్కాలతో, ఆడామగాకలిసిచేసే పొలంపనులలో పెరిగిన పరిచయాలు, రగిలిన ఉద్రేకాలు పురివిప్పేది మామిడిపండుగలో. మామిడి పండ్లు ఏరడం, కోసి, జన్నెలు (వరుగులు) పోయడం, టెంకపప్పు (జీడినుండి పప్పు) తయారుచెయ్యడం, రొట్టె, సురువుల వంటకాలు; మామిడికొక్కులుఏరడం–ఇవన్నీ ఆడవారి పనులు. ఈ మామిడిపండుగలో గుబ్బట్ల (కన్యల) మామిడికి, గోవుల (యువకుల) మామిడికి పెళ్ళిచేస్తారు. ఆటపాటలు, అల్లరికి, విందులకు అంతుండదు. మామిడికొత్త గోదావరి ఒడ్డున ఉల్లాసకరమైన పండుగ. తరువాత మారేడుమిల్లి మన్యంలో వచ్చేది గంగాలమ్మ పండుగ.

**తల్లిపండుగ – పోతుపండుగ :**

నోటికి వచ్చినట్లుగా పాడుతూ, ఆడుతూ కవ్వించుకొనే ఈ తల్లిపండుగలో యువతీయువకులను చూస్తుంటే ఎట్టివారికైనా గుబులుపుడుతుంది. 'బూతులు తిట్టకపోతే గంగాలమ్మ పైచెంగువేయదట'. 'పైచెంగువేయటం' (కడుపుతో ఉండడం) సఫలతకు చిహ్నం. గంగాలమ్మ గుర్తు 'ఘటం'. ఈ పండుగ తీరేవరకు 'కయ్యులు' దిగడానికి వీలులేదు (కొయ్యలు = కొత్తచేలో కాలినమొద్దులు) అంటే 'మసిగర్ర' ఏరడానికి వీలులేదు. పండుగ తీరినరోజు 'మామిడికర్రఅయింది'అంటూ వేటకెడతారు. మరునాటినుండి పొలంపనులు. దుష్టశక్తులను తిట్టడం, పాతచెప్పులు, పాతచీపురు, చింకిచేటలు, కోడిగొద్దెలతో బహిష్కరించడం ఒకతంతు. ఈ గంగమ్మనుకూడా ఊరి బయట ఆమెబసకు అదేవిధంగా సాగనంపుతారు.

కొన్ని గ్రామాలలో ఈ గంగమ్మపండుగ బదులు 'పోతుపండుగ' ఆనవాయితీని బట్టి జరుపుతుంటారు. (బొడ్డగండి, పెద్దమాళ్ళు, పోలమానుగొంది, జలగలోవ,

చెరువూరు, మామిడివాడ, గొందికోట, చాపరాయి, కారుమామిడి, పోలోవ, బొంకు లోవ). గడి (గ్రామసరిహద్దు) కాసేవాడు పోతురాజు. ఈ 'పోతుపండుగ'లో మగవారు కోలాటం వేస్తారు. బూతుపాటలకు అవకాశంలేదు. అయితే భూదేవత మామిడి పండుగలను ఇతర గ్రామాలలోవేడుకగాజరుపుకుంటారు. పోతుపండుగ జరుపుకునే గ్రామాలవారు తల్లిపండుగ జరుపుకునే గ్రామాల పండుగలో పాల్గొంటారు. వరుసలు కలుపుకునేందుకు ఈ విధమైన ఏర్పాట్లు. విశాఖజిల్లాలోకూడా కొలువుపండుగ పోతుపండుగ; నందిపండుగ – తల్లిపండుగ.

**వేటలపండుగ – ఈటెలపండుగ – ఇటింపండుగ :**

విశాఖజిల్లాలో ఇటింపండుగ (ఇటుకలపండుగ, వేటలపండుగ, వేడుకల పండుగ) మామిడిపండుగవంటిదే. వరుసలవారు తగిలితగిలి నీళ్ళు చల్లుకోవడం – అతిథులకు నివాళియిచ్చి (కాళ్ళుకడిగి, అక్షింతలుబొట్టు పెట్టి) డబ్బులు దండు కోవడం. నీళ్ళుచల్లడం ఎంతపంతమో, తలంటుపోసి భోజనంపెట్టడంలో అంత ఆప్యాయత. ఈ పండుగలో కమ్మరికి తొలిగాబత్తెమిచ్చి, నాగలి, కత్తులు, బాణాలకు పదును 'పూయించుకోవడం' వృత్తిపనివారల ప్రాముఖ్యాన్ని తంత్రబద్ధంగా మన్నించడమే. కళ్ళంలో మొదటి 'పొల్లావులు' ఈ మెట్టుకంసాలికే (కమ్మరి). భీముడి జటతీగ, మామిడాకులు, కొమ్మసంపెంగపూలు నాగలికితోరణంగా కడతారు. గొడుగులెత్తడం, తారాజి ఆడడం (ఆడమగ బొమ్మలను ఆడించడం) మామిడికొత్తల వంటివే. ఆడవారు మామిడిపిందెల గౌసుకట్టి నడిచేదారికి వెళ్ళివిప్పుతారు. మామిడి పిందెమీద మచ్చఉంటే వేటకువెళ్ళిన మగవారిచేతిలో జీవం దెబ్బతిన్నట్లు. మచ్చఉండీ జీవం దొరక్కపోతే ఏదో కీడు జరుగనున్నట్లు.

ఇకనుండి మామిడికాయలు తినవచ్చు. వారంరోజులనుండి పదిహేను రోజుల దాకాసాగే ఈ పండుగలో తొలినాడు పప్పు, మలినాడు మారుపప్పులు, గరియంపిట్టు (చోడిపిండి). మధ్యరోజుల్లో మామిడిబోనం, కోళ్ళకోత, దొరికితే వేటమాంసం, అందుకే అంటారు 'పండుగరోజుల్లో తిన్నది పదెత్తులు – ఎల్లకాలం తిన్నది ఏడెత్తులు' ప్రతి పండుగకు ఒక దేవత హర్షిస్తుంది. ఒక ఆంక్షను సడలిస్తుంది. పండుగసరదాలు యువతలో కొత్తఆశలు కలిగిస్తాయి. అవి ఫలించే భావికోసం ఉరకలువేసే వారి ఉత్సాహం, కొండలను పిండిచేస్తుంది.

## పూజార్లు – లెంకలు; గొరవలు – వెజ్జులు :

ఈ పండుగలన్నింటిని గ్రామపూజారి జరిపిస్తాడు. పెద్ద గ్రామాల్లో అతనికి 'లెంకలు' కూడా ఉంటారు. ఈలెంకలకు, పూజార్లకు బంధుత్వసంబంధం. వీరికి కళ్ళంలో పొల్లావులు, వేటలో 'గొరవలకొట్టి' (తుంటిమీద మంచిమాంసం) ఇస్తారు. గ్రామంమొత్తం క్షేమానికిపాటుపడే బాధ్యత ఇతనిది. ఆనవాయితీలబట్టి, అవకాశాలబట్టి విశాఖజిల్లాలో ఒకోపండుగకు ఒకోపూజారికూడా ఉన్నాడు. వ్యక్తిగతంగా కలిగే రోగాలను కష్టాలను పోగొట్టడానికి వెజ్జులు (గొరవలు) అనేవర్గంకూడా ఉంది. ఈ గొరవపడడానికి సంప్రదాయం, వారసత్వం ఏమీలేవు. గోదావరి ఒడ్డున ఒకరిద్దరు ఆడగొరవలుకూడా ఉన్నారు. గోదావరిజిల్లాలో వీరిని సంప్రదించడం ఐచ్ఛికంకాని, విశాఖజిల్లాలో నంది కొలువుపండుగలలో ఆడంబరం అంతావీరిదే. 'తాపడాలు' తీయడంలో వీరు సహకరిస్తేగాని పండుగ నిండుగాజరిగినట్లు కనపడదు. పట్టువాల్చేవాడు, బుగ్గి మంతరిచేవాడు, వెజ్జు, గొరవ ఇలా వీరిలో తరతమభేదాలు. మతంకోసమే మతమని కర్మకాండను నమ్మకాలతో చిక్కుముళ్ళువేసే ప్రత్యేకవర్గం వారిలో లేకపోయినా, ప్రాణపాయంలో ఈ గొరవలే ఆత్మబంధువులు. ఇలా సమాజంలో పాలకవర్గం, పూజారి, గొరవలు, సామాన్యులున్నా అందరూరైతులే. ❊

**కణ్తి, కడ్తి = కణుజు, కణ్తిపోతు**





**దిప్పి (దుప్పి) = ఒర్లుపోతు, ఒర్లుగాడు, ఒంటర్పోతు, దిప్పిపోతు**

## తిత్రికపిట్ట రెట్ట – తాపడం – నీటికట్టు :

చెట్టుమీద తిత్రికపిట్ట రెట్టవేస్తే – రెట్టలోని విత్తనాలు నాటుకుని, బదనిక (రణం) పెరుగుంది. పక్షి ప్రపంచలో తిత్రికపిట్ట చెడుపుముండ. ఈ పరిశీలన మనసులో నాటుకుని ఈ తర్కంపునాదిగా, ఏదైనా రోగం మామూలు వైద్యంతో కుదుటపడకపోతే, ఎవరో చెడుపుచేశారనే అనుమానంతో మేకలు, కోళ్లు, సారా సమర్పించుకుంటూ వెజ్జులచుట్టూ తిరుగుతారు. గిట్టనివారు చెడుపుచేసి శరీరంలో ఇనుప సీలలో, ప్లాస్టిక్ ముక్కలో పెట్టించారనిచెపుతూ, నోటితో కరిచి తీస్తారు. ఆ వైద్యానికి రణంపట్టిన మాకు బెరడు కావాలి. ఇటువంటి చికిత్సలు ఆసుపత్రి వైద్యులు చేయలేరు. అందువల్ల 'దిగువ వైద్యాలు మన్నెపు రోగాలకు చాలవులే' అంటారు. తమబాగును చూసి ఓర్చలేక పోతున్నారు. తమ కష్టాలకు మరొకరి అసూయకారణం అనుకున్నవాడు తాను ఆ పద్ధతిలోనే ఇతరులను ద్వేషిస్తాడు. అటువంటి మనస్తత్వం పువ్వును పురుగువలె తొలిచి వేస్తుంది. తమకష్టాలకు ఎవరోఒకరు కారణం అనుకొని, వారికికష్టాలు కలిగించడంలో కొంత ఉరటపొందుతారు. అసూయతో, పొరుగువారు తనభూమిలోపెట్టిన 'నీటికట్టు' ఊటను మింగేస్తున్నదని, వారి గ్రామాలకు పట్టిన దయ్యాలను తమవైపు మళ్ళించారని భావించి ఆ 'తాపడాలు' తీయించడం విశాఖమన్యంలో మూడేండ్లకోసారి జరిపే నందికొలువుపండుగలలో ముఖ్యమైనతంతు.[8]

సోపువేటలో (రాచవేట) మాంసం అందరూ సమంగా పంచుకున్నా – సొంత వేటలో–విలువిద్యలో, పాదులు మీటెలొడ్డడంలో నేర్పుగలవాడే మాంసం బాగా సంపాదించుకుంటాడు. పైరును కనిపెట్టుకొన్నవాడే పంటను పొందుతాడు. తెగించి ఎక్కడో లంకల్లో వ్యవసాయం చేసేవాడే పొలాన్ని దక్కించుకుంటాడు. ఆటపాటలలో అందెవేసినవాడే నలుగురిని ఆకర్షిస్తాడు. స్వచ్ఛందంగా సాధించుకునే ఈ నైపుణ్యాన్ని, లాభాన్ని ఏవ్యవస్థ పరిహరించలేదు. 'మగోనిగుణం మాంసంకాడ – ఆడదానిగుణం కుండకాడ' అని ఆయా సందర్భాలలో కలవాడి అతిశయం – లేనివాడి లేకితనం అనేకమైన రాగద్వేషాలను మనస్సులో ప్రోదిచేస్తాయి. ప్రత్యక్షంగా కలహించుకోలేని ఈసమాజాలలో ఈఉద్వేగాల విడుదలకు రెండేమార్గాలు. ఒకటి తాగితగవు పెంచుకోవడం, రెండు పగవాడికి కీడుజరిగితే సంతోషించడం. ప్రతిపనికి రాజమార్గం, దొడ్డిదారి రెండూఉంటాయి. తనకు కలిసిరావాలని విన్నవించుకోవడం భక్తిమార్గం

అయితే, అసూయతో దేవతలను ఉసిగొలపడం వామాచారం. తనకష్టాలను తప్పించమని మొక్కడం, తనవల్ల దేవతలకు జరిగిన లోపాలు గౌరవలద్వారా తెలిసికొని బదులివ్వడం సాత్త్వికం. ఇతరులను అనుమానించడం తామసికం. ఈ గుప్తవిద్యలు ప్రయోక్త చాకచక్యాన్నిబట్టి పేలుతుంటాయి. ఆ మంత్రతంత్రాలలో గందరగోళం ఆకాండతాడవం అంతాఇంతా కాదు. తనతెలివి, పలుకుబడితో సాంప్రదాయకమైన సంజ్ఞానానికి వాటిని ముడిపెడుతుంటారు. సాత్త్వికారాధనం, తాత్త్వికవిచారంతో సంబంధాలవల్ల అపుడపుడు తమ వారినమ్మకాలతో, ఆవేశాలతోనిండుగుండెతో ఏకీభవించలేకపోయేవారు జానపదులలో కొందరుంటారు. తామే ప్రేక్షకులుగా, నటులుగా, యాచకులుగా, పోషకులుగా పాలు పంచుకునే గిరిజనులకు ప్రతిభావమూ సాకారమే. ప్రకృతిలో ప్రతివిన్యాసం దేవతా నివాసమే. బహిఃప్రపంచాన్ని మనోఫలకంపై ముద్రించుకోవడంలో దేశకాలాలమీదనే భావవ్యాపారం ఆధారపడిఉంటుంది. అయితే ఈమానసికవ్యాపారంలో భ్రమప్రమాదాలున్నాయి. ప్రకృతిలో వైవిధ్యానికి ఎన్ని వస్తుగతమైన కారణాలుంటాయో, సంస్కృతిలో పరిణామానికి అన్నిసాంఘికమైన, మానసికమైన కారణాలుంటాయి. ప్రకృతి గణితంవలె సూటిగాపోతుంది. సంస్కృతిలో కాలానుగుణంగా తరగలెత్తే లయలన్నీ జీవనరాగంలో లీనమౌతాయి.

పైరుకు చెద శత్రువు. ఆ చెదనే నందిపండుగలో కల్లుపోసి ఆరాధించడం ఆశ్చర్యకరంగా కనిపిస్తుంది. చెద ఇళ్ళుకట్టుకోవడానికి స్ఫూర్తినిచ్చింది. కాని చెదను చంపరాదనే నమ్మకాలు గిరిజనుడికిలేవు. 'జీలకర్రంత జీవుడికి ఏనుగంత గొద్దె' (పుట్ట) అని చెప్పుకునే వారికి, చెదకొయ్యను త్వరగా జీర్ణంచేసుకొని మట్టిగా మారుస్తుందని కూడా తెలుసు. పైరుకుచెదపడితే మందులుచల్లుతారు. అన్నిజాగ్రత్తలు తీసుకుంటారు. చెదపురుగులు ఇళ్ళుకట్టుకునే స్ఫూర్తినిస్తే, తిత్రికపిట్ట అసూయను, ఈర్ష్యను పెంచుకోవడానికి దారితీసి మూఢనమ్మకాలకు బీజంవేసింది. పంచకోశాలు, సప్తలోకాలకు సంబంధించిన జ్ఞానాన్ని వివరిస్తూ మనదార్శనికులు, ఒక అంతరువుకు చెందిన సామగ్రిని మరొక అంతస్తులోని వాటిలో సాంకర్యంచేయవద్దని హెచ్చరిస్తారు.[9] పాశ్చాత్యదార్శనికుడు ఇమాన్యుయేల్‌కాంట్ ఇటువంటి అనన్వయాలను 'అంటిమోనీస్'గా పేర్కొన్నాడు. స్ఫూర్తికి తర్కానికిగల సరిహద్దులను భావావేశంలో వివశులైనజనం విస్మరించి తప్పుదారి తొక్కుతుంటారు.

*జీలకర్రంత జీవుడికి ఏనుగంతగొద్దె, ఎర్రటి బుడ్డికి ఏడు గొంతుకలు*

## గంగాలమ్మ గొర్లెవారి ఆడపడుచు; మాతంగకన్య :

సీమగండి దిగువన, కానివాడ ప్రాంతాలలో మామిడిపండుగ లాంఛనంగా చేసి, వేడుకలన్నీ వేసవిలో గంగాలమ్మపండుగలో జరుపుతారు. గంగాలమ్మపండుగ దారి చల్లబరిచే పండుగ (ఉడుకులు, మశూచికంరాకుండా). గంగాలమ్మ ఎఱ్రమార్గం దేవత. పరిహరించవలసినది. గంగాలమ్మ మాలవారి (గొర్లెవారి) ఆడపడుచు, మాతంగకన్య ముంజమామిడి, కుండాడ, మారేడుమిల్లి, చట్లవాడ, వేటుకూరు, పుల్లంగి మొదలైన గ్రామాలలో వెలసిన గంగాలమ్మలు ఏడుగురు అక్కచెల్లెళ్ళు. ఈమెకు వాల్మీకులే పూజార్లు. వారు చాలావరకు క్రైస్తవులుగా మారడంతో రెడ్డివారే గంగాలమ్మను కొలుస్తున్నారు.

## కొండకు కోలగాడు – ఊరికి బారికవాడు – పసుల పోలిగాడు :

మాలవాడు ఎదురురావడం దుశ్శకునం. మునసబు, మఠాదార్లు రమ్మంటున్నారు అంటూ అతడు ముందరికాళ్ళకు బందంవేస్తాడు. పెద్దల ఆజ్ఞను చాటుకుంటూపోయే కోలగాడు, బారికవాడు మాలవాడు. అదిఅతని ఉద్యోగధర్మం. అడవి జంతువులలో వేసంవెంట అరచుకుంటూ పోయే కొండగొఱ్ఱె గిరిజనుల కథలో 'కొండకు కోలగాడు'. అది ఎదురువచ్చినా దుశ్శకునమే. ఒకోసారి కోలగాడు అత్యవసరమైన వార్తకూడా చెప్పవచ్చు. కొండగొఱ్ఱె అరుపు–క్రూరజంతువు ప్రమాదాన్ని హెచ్చరించవచ్చు. ఎంట్రీత పిట్ట పక్షులలో 'కోలగాడు'. అదికొండరాజులబంట్రోతు. పోలీసుబంట్రోతువలె అన్ని పిట్టలను తరుముతుంది. అది బాగాబలిసి మదించిన కణసుకొమ్ములలో తుప్ప కడుతుందిట (పసుల పోలిగాడు: మన గ్రామాలలో కూడా ఇది పశువులమీద వాలి కనిపిస్తుంది). కాబట్టి అదివెంటతిరిగే కణుసు అడవిరాజు కాటమయ్యదని, ఆ కణుసు నుదుట కాటమయ్య గుర్తులుంటాయని, ఆటువంటి రాజులకణుసును ('సిర్లి కణుసు') కొట్టినవాడికి కీడుమూడుతుందని నమ్మకం. కొట్టకమానరు కాబట్టి బదులుగా పూజలు పునస్కారాలు. ఎంట్రీతనల్లన – మాలవాడునల్లన. ఇరువురూ కోలగాళ్ళు. ఈ రకమైన గూఢార్థాలతో విసురుకునే పరిహాసాలు కొత్తవారికి అర్ధమేకావు. ❉

## నేపథ్యానికి తగిన ప్రజ్ఞ :

గిరిజనులు, జానపదులు, నాగరికులు మౌలికమైన మానసిక ప్రతిభలలో ఎవరికీ ఎవరూ తీసిపోరు. ఎవరి నేపథ్యానికి తగిన ప్రజ్ఞవారిది. వాటి తీరుతెన్నులకు మరికొన్ని ఉదాహరణలు: అరటిఆకును గిరిజనులు తిరగేసి అన్నం వడ్డిస్తారు. మనం ఉపయోగించుకునే వైపు దుమ్ము, ధూళీ, రెట్టలు పడతాయని వారి సమాధానం.

సాధారణంగా జానపదుల పిట్టకథలలో గద్ద రాజు. కాని గోదావరి కథలలో గుడ్లగూబ రాజు (వేటగుంజి). అన్ని పక్షులను గుడ్లగూబ వేటాడుతుందిగాబట్టి అదిరాజు అని ఉపపత్తి. అన్నిపిట్టలు పగలువేటాడితే, గుడ్లగూబ రాత్రి వేటాడుతుంది. గద్ద వారిదృష్టిలోనికి రాకపోవడానికి కారణం - ఇవి 'గద్దలుదూరని గిద్దువనాలు'. వేనంమీదనుండి గమనిస్తూ నిశితమైన చూపుతోవేటాడే గద్దకు ఈ చిక్కని అడవులలో పొదలమాటున దాగే జంతుజాలం కనపడదు. ఉనికిలేనందున దాని ప్రసక్తి లేదు.

పాండవులు చింతమాను చివటలలో వనవాసం చేశారు. ఈ అడవిలో కలపనిచ్చే చెట్లు చాలా ఉన్నవి. కాని ఊరు కట్టుకునేటప్పుడు (పాండవులు సంస్కృతిదేవతలు) వాటిని నరికివేసి ఉంటారు. ఇక గ్రామంమధ్య ఉండేవి మామిడి, పనస, చింతలు. మామిడి, పనసలదగ్గర చీమలెక్కువ. పండుగబసకు తావులు. కాబట్టి నివాసయోగ్యం కావు. బూరుగకు భూమితో సంబంధమున్నా నీడనివ్వదు. అందువలన చింతచెట్టు నీడనే పాండవులు నివాసయోగ్యంగా భావించినట్లు కొండవాడి ఊహ. కాని ఈ వాస్తవాన్ని కథగా సమర్థించడమే జానపదుడి చమత్కారం. పాండవులు వనవాసం ముగించుకొని వెళ్ళిపోతూ చింతకు వేళ్ళు లోతుగా పారేలాగున వెళ్ళమని - బూరుగు వేళ్ళు నేలమీద ఉండాలని బూరుగుచెట్టుతో చెప్పివెళ్ళారట. కాని బూరుగు, మతిమరపు వల్ల తారుమారుగా, చింతవేళ్ళు పైకి, తనవేళ్ళు లోపలికిఉండాలని చెప్పిందట. చింతలు మన్యమంతటాఉన్నాయి. పాండవులకు నిలువనీడనిచ్చినప్పటికీ వాటివేళ్ళు పైపైననే పరచుకొని ఉంటాయి. పెనుగాలికి చింతలు వేళ్ళతోసహా కూలిపోతుంటాయి. సంస్కృతికి చెందిన చింతలు అడవిలో ఉండవు ఉళ్లోనే ఉంటాయి. అవి ప్రజలకు ఉపయోగపడుతుంటే - బూరుగపూలు ప్రకృతిలో పక్షుల దప్పితీరుస్తున్నాయి.

**బగిడె - రోకలిబండ - డొంకెల నమూనాలు :**

బగిడెను (గబ్బిలం) చూసి గొడుగు, చేపదంతాలుచూసి దువ్వెన, రోకలిబండ, పురుగును చూసి రైలు, డొంకెను (ఒక రకమైన ఎలుక - నీళ్ళలో ఉట్టికట్టి పిల్లలు పెడుతుంది) చూసి ఓడ తయారుచేశారట.

యంత్రశక్తికితగిన ఆకృతిని రూపొందించేందుకు ఆ ప్రాణులే నమూనాలైనాయి. కాని దాని లోతును ఆకళించుకోలేనప్పుడు ఇలా భావించడం మానవులందరి లక్షణం. దిగువ ప్రాంతాలనుండి వచ్చిన వాల్మీకులు చాతుర్యంగలవారు గదా! వారు వచ్చిన తొలినాళ్ళలో ఒక ముతాదారుతో 'మహాప్రభో! తమలాంటి మనిషిని చూపిస్తాను' అన్నాడట. ముచ్చటపడ్డ ముతాదారు నీకో మడిచెక్క (పొలం) ఇస్తాను చూపవలసిందిగా కోరాడట. అద్దంఎదుట నిలిపాడువాల్మీకి. ఆశ్చర్యపోయిన ఆపెద్ద సగర్వంగా ఆరోజుల్లో అపురూపమైన ఆ కానుకను ప్రదర్శించుకొనేవాడట. ❊

**బెల్మితిఎల్లు = బెల్లెలు, తెల్లమిట్టఎల్లు, ఎల్గొడు, ఎలుగుబంటి**



## చెంచుల దేవరలు - రావగాళ్ళు - ఇలవేల్పులు :

లింగమయ్య - బయన్న - అంకాలమ్మ - మల్లమ్మ - పోతురాజు - గురువయ్య చెంచుల అభిమానదేవరలు. అడవిలోగల వనరులకు ఈ దేవరలే కాపలా. బయన్న వేటలదొర-మల్లమ్మ తేనెల దేవత. లింగమయ్య లింగాకారంలో ఉంటే కొబ్బరికాయలు, రాళ్ళగుట్ట అయితే మాంసంనివేదిస్తారు. వీళ్ళకు చెంచు మొక్కుతాడు, మన్నిస్తాడు. బతిమాలతాడు-బెదిరిస్తాడు. రెచ్చగొడతాడు. 'దేవరకైన దెబ్బే గురువు' అని నమ్ముతాడు.

**చెంచుల పూర్వులు - రావగాళ్ళు** (రాజులు-రాయుళ్ళు-రావగాళ్ళు) **:**

రావగాళ్ళు, గజ్జెలకొండ రాకాసిని నాశనంచేసి దానిపట్నాన్ని శిలమళ్ళించి, పోతురాజులను చెంచురాజ్యానికి కాపలాగానిలిపి యోగంలోకి పోయారట. గజ్జెలకొండ రాకాసిని చంపడానికి శ్రీశైలం వెనుకనున్న మొసళ్ళకట్టమీదుగా వారు కృష్ణదాటారట. ఇంద్రధనుస్సు రావగానిదబ్బ. నేదులు-రావగాడి పెంపుడుజంతువులు. అవి ఉండేలాగ రావగాడిబొక్క, వాటిలో నీటిగుంటలు-రావగాడి జల్లిగుంతలు. ఒకరకం తేనెపెర, రావగాళ్ళతొడిది, ఒకరకం తాబేలు, అడవితీగ రావగాళ్ళదిగా భావించి చెంచులుతినరు. పెద్దరావగాళ్ళు, చినరావగాళ్ళు, బుడతరావగాళ్ళు, బూడిదరావగాళ్ళుగా వారిని వర్గీకరిస్తారు. తూర్పుగిరిజనులకు పాండవులవలె చెంచులకురావగాళ్ళు ఆత్మబంధువులు.

**పురాణగాధలు - ప్రదేశాలు :**

కిరాతార్జునీయంలో కిరాతరూపం ధరించిన పార్వతీపరమేశ్వరులు వేటగాళ్ళు. నంది, పంది. అర్జునుడు చెంచుయువకుడు (దిడ్డకాడు). బాణందెబ్బకు పంది 'పంది బొర్ర'లో దాగి అక్కమహాదేవి గుహలమీదుగా 'నీలగంగ'కు (నేటి శ్రీశైలంజలాశయం) పారిందట. ఉరుముతున్నప్పుడు 'ఆరెమానులో దాగిఉన్నాం అర్జునా' అంటూ తలచుకుంటారు. అర్జునుడు విల్లును ఆరెచెట్టుతో తయారు చేసుకున్నాడట.

**రాజులు - మంత్రులు - కోలగాళ్ళు :**

చెంచులలో రాజులుగా 'భూమని' ఇంటిపేరువారిని, మంత్రులుగా 'కుడుముల' వారిని చెప్పుకుంటారు. 'ఉడతల', 'మండ్ల'వారు కోలగాళ్ళుగా పెళ్ళితంతు జరిపిస్తారు.

ఉత్తలూరివారికి, దంసంవారికి మంతనాలమ్మ, ఆర్తివారికి నల్లమల అంకాలమ్మ,

పులిచర్లవారికి గంగమ్మ; చిగుర్లవారికి ఈదమ్మ ఇలా ఇలవేల్పులు. ఈ దేవతలకు మొక్కేటప్పుడు ఆ యింటిపేరువారిని తోడ్కొనిపోతారు.

**పిలుపులు - తలపులు - రోజుల లెక్కలు :**

చెంచుల పిలుపులు, తలపులలో చుట్టూగల జంతుప్రపంచం ప్రతిబింబిస్తుంది.

ఎక్కువగా అరిచేవాడు 'బట్టకాయల బావురుగాడు' ('ఆ పక్షి తెగ వర్లుతుంది' - అరుస్తుంది).

'నువ్వేందిరా పులిచింతలెక్క' (పులిచింతపక్షి తెగవాగుతుంది)

'నువ్వేందిరా-మబ్బుగద్దలెక్క'. చేసేది చేసి అమాయకంగా కూచొనిచూస్తుంటది.

'వడ్రంగిపిట్ట' - శకునంపిట్ట, దేవరపిట్ట.

'గిట్టకప్పెరగాడు' - గుడ్లగూబ, మోర (తల) గుడ్లగూబలాగా పెట్టుకునేవాడు.

'పెద్దపులి - మాటవినని పెద్దకొడుకు'.

'ముర్లిగింజల (సారపప్పు) కాలంలో పందిబావ, బాగా బలిసి ఉంటాడు'.

దారిలో జాడలన్నీ పిల్లిజాడలు, జింకజాడలు, బుర్రజింకజాడలు, ఏదు పందుల జాడలు. దేవుడికైనా దొంగపెళ్ళిచేయడం వారికి సరదా. సంక్రాంతినాడు శివునికి జరిగేది 'దొంగపెళ్ళి'. శివరాత్రినాడు అసలుపెళ్ళి. పున్నమినాటినుండి ఏపె, ఆరె నారలనుపేని అమావాస్యవరకు రోజుకో ముడివేస్తారు. అమావాస్యనుండి ఒక్కోముడి విప్పుకుంటూ పోతారు. 'మబ్బులకు, వెన్నెలకు' అంటూరోజులు లెక్కబెడతారు.

**మిరాశీలు - మెట్టపన్ను :**

విశాలమైన అడవిలో తేనెపెరలు-వేట-చెట్లఫలసాయం ముందుగా నెలకొన్న ఇంటివారివి. అలాదక్కించుకున్న వనరులను 'మిరాసీ' హక్కుగా చెంచులు పిలుచుకుంటారు. ఈ పదం రాయలసీమ అంతటా వాడుకలో ఉన్నదే. అయితే అడవిలో ఈ వనరులను చేజిక్కించుకోవడానికి మందిబలం కావాలి. కాబట్టి మిరాసీ కుటుంబం ఒక్కటే దీన్ని అనుభవించలేదు. కాబట్టి మందిని కలుపుకోవడంతోపాటు, అడవిలో ఈ వనరులకు దేవరలనే కాపలాపెట్టి వారికి మొక్కుతుంటారు. ఎవరైనా ఈ వనరులను దొంగిలిస్తే - దేవరకువేస్తానని బెదిరిస్తూంటారు. దేవరకుమొక్కి దొంగలమీదికి ఉసిగొల్పుతుంటారు. తప్పుచేసిన వారిని విచారించడానికి - పెద్దలను తగవు పెట్టమని

కోరతారు. ఈ పంచాయతీ పెద్దలకు 'పిర్రపన్ను' (సిట్టింగ్ అలవెన్స్) ముట్టచెప్పాలి. ఒక్కోసారి తమవాళ్ళమీద అనుమానంతో బయటవాళ్ళను తీర్పు చెప్పమని కోరతారు. క్రమంగా వీళ్ళజుట్టు వారిచేతులోకి పోతుంది. ఇప్పుడు ఫారెస్టువాడుకూడా ఒకదేవర. వారికి వాటా పెట్టడంతో సరిపోరు – అభిమానం చంపుకొని సేవచేయాలి. తమతమ మిరాసీ గ్రామాలగుండా వెళ్ళేయాత్రికులవద్ద చెంచులు 'మెట్టెపన్ను' వసూలుచేసుకునే వారు. రోడ్డుపడిన తరువాత ఈ పన్నులు, యాత్రికులకు సాయపడడంవల్ల దొరికే ఉపాధి చెంచులు కోల్పోయారు. పర్యాటకరంగాన్ని అభివృద్ధిచేస్తున్న ప్రభుత్వానికి తమ కార్యక్రమాలలో చెంచులను భాగస్వాములనుచేసే సంకల్పంలేదు. అలాగే అనాదిగా శ్రీశైలదేవస్థానాన్ని కనిపెట్టుకొనిఉన్న చెంచులకు – కొన్నిమర్యాదలు – వాటాలుండేవి ఒకరిద్దరికి ఉద్యోగాలిచ్చి – కొందరికి దుకాణాలిచ్చి క్రమంగా ఈమర్యాదలకు దేవస్థానం వారు సున్నచుట్టారు. దుకాణాలు తము చేసుకోలేక, చెంచులు బయటవారికి అద్దెకిస్తారు.

ఉమ్మడి ఆస్తులస్థానంలో, వ్యక్తులకు హక్కులుకల్పించడం – అవి వేరొకరి వశంకావడం – ప్రభుత్వం ప్రసాదించే ఈ హక్కులకథ – చెంచుల ప్రాంతంలోనేకాదు – గిరిజన ప్రాంతమంతా ఇటువంటిదే. అందుకనే 'హక్కులు మావి – ఆస్తులు మీవి' 'పేరుమాది – నోరుమీది' అంటూ గిరిజనపెద్దలు గిరిజనేతరులను ఎత్తిపొడుస్తుంటారు.

❊

**బావ్వురుగాడు = గడ్డంపిల్లి**



## బీజప్రధానం - క్షేత్రప్రధానం; ఉత్పత్తి సంబంధాలు - న్యాయాలు

జాతివ్యక్తిత్వంలో పరిసరం విడదీయరానిఅంశం. ఆ పరిసరాల ఒడిలో దొర్లిపోయే కాలంలో వివిధదశలకు వాఙ్మయం, కర్మకాండ అద్దంపడతాయి. దానిలో స్పష్టాస్పష్టంగా దగ్గర దూరాలు కనిపిస్తుంటాయి. టోటెమిజంనుండి రోజువారీతగవులు తీర్చుకోవడం వరకు ప్రకృతితో పోల్చుకుంటూ ఆపునాదులమీదనే ఆయా సంఘటనలను అన్వయించుకోవడమో, సవరించుకోవడమో సాగుతున్నపుడు, ప్రకృతితోపాటు ఈ స్పందన, దృక్పథంమారుతాయి. అనుగుణంగా వ్యవస్థతగినదారిని వెతుక్కుంటుంది. కొత్తవ్యాఖ్యలు చేస్తుంది. పాతకోట చింతలవీధి (హుకుంపేటమండలం, విశాఖజిల్లా) వాస్తవ్యుడు శ్రీకొర్రలక్ష్మన్న చెప్పినకథ ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

ఒక అడవిలో పెంటిపిట్ట రెండుగుడ్లు పెట్టింది. ఆ తావుకు ఇటికలపండుగకు వేటకు వచ్చినవారు అగ్గులుపెట్టారు. పోతుపిట్టవచ్చి 'మనం పారిపోదాం గుడ్లుపోతే పోయినయి, మరలపెట్టుకోవచ్చు బయలుదేరు' అని బలవంతపెడుతుంది. కాని గుడ్లను వదలిపెట్టడానికి ఆ తల్లిమనసు ఒప్పుకోదు. చేసేదిలేక పోతుపిట్ట పెంటినివదలి ఏలంకకో పారిపోతుంది. పెంటి, దేవుడికి మొరపెట్టుకోగా అగ్గులు ఆరిపోతాయి. గుడ్లుపేలిన తరువాత పిల్లలు ఎదిగి తండ్రినిగూర్చి అడుగుతారు. 'వాడు మనను కష్టాలలో వదలి వెళ్ళిపోయాడమ్మా వాడిజోలి మనకువద్దు'అని తల్లి చెబుతుంది. పోతుపిట్ట వీళ్ళేమైనారో చూద్దామనివస్తుంది. 'పిల్లలునావారంటేనావారు, నాతో ఉండా లంటే నాతోఉండాలని' పోతు, పెంటి తగవుపడి రాజు దగ్గరకుపోతారు.

ఆ రాజుకు ఏడుగురు పెళ్ళాలు-ఏడుగురు కొడుకులు. 'పిల్లలు తల్లివే' అని తీర్పు చెపితే తనపెళ్ళాలు పిల్లలు తనను వదలిపెడితే తనకర్మ ఏమౌతేందోననే భయంతో. 'ఒక కొండన చేను నరికారనుకో! దానిలో చోడి విత్తనాలు వేస్తే చోడిచేను, జొన్నవేస్తే జొన్నచేను అంటాము. విత్తనానిదే పంట. చేసుకున్నంతకాలమే చేను. అలాగే నీవు ఏ మగనాలికో పోతావనుకో అపుడు ఈపిల్లలు ఈవిత్తనానివే అవుతారు'అని తీర్పు ఇస్తాడు. దుఃఖంతో ఆపెంటిపిట్ట అగ్గిలోపడి ప్రాణాలువదిలి - చిలకమ్మగా ఒక దంపతులకు పుడుతుంది. ఒక్కగానొక్కపిల్ల. ప్రతివారం సంతకెళ్ళి చిరుతిండి కొనుక్కోమని తండ్రి చిలకమ్మకు డబ్బులిస్తుంటాడు. చిలకమ్మ కొనుక్కోకుండా ఆ డబ్బులు దాచుకుంటుంది.

ఇంతలో ఆ ఊరి రాజుకు (మనపాతరాజే) సంతచేయడానికి డబ్బులులేక వీరింటికి అప్పుకు వస్తాడు. వారిదగ్గరా డబ్బులేదు. ఇంతలోచిలకమ్మ తనుదాచుకున్న డబ్బు తండ్రికిచ్చి 'నాన్నా నాకో మచ్చలకోడెదూడ కొనితే' అని అడుగుతుంది. రాజు 'అటువంటి కోడె నాదగ్గరే ఉంది' అని తన కోడెను అమ్ముతాడు.

పైరురోజుల్లో ఈ కోడెలను, పెయ్యలను మేపుకు అడవికి తోలుతారు. కొన్ని నెలలయ్యాక తిరిగివచ్చినప్పుడు, మచ్చలదూడలనన్నింటినీ చిలకమ్మకట్టేసుకుంటుంది. 'ఏదో సరదాపడుతుందిలే' అని ఊరుకుంటే రోజూఅదేవరుస. ఊరిలోవారు తగవు పెడతారు. అదేరాజు తగవుకువస్తాడు. చిలకమ్మ 'విత్తనానిదే పంట అన్నావుగదా' అని పాతతీర్పు తిరగదోడుతుంది. దూడలను వదులుకోమని పెద్దలు కొత్తతీర్పుయిస్తారు. ఇలా ఎదురుచెప్పే తగవరిఉంటే తనపెద్దరికానికి భంగం కలుగుతుందని భావించిన రాజు, ఆపిల్లను పెళ్ళిచేసుకొని–ఒకమేడలో గాలి, నీరులేకుండా బంధిస్తాడు.

ఆ రాజుకు ఒక్కపెళ్ళాంకూడా వేడినీళ్ళుపెట్టి స్నానం చేయించదు. అందువల్ల వాడికి రోజూ 'పచ్చినీళ్ళ' స్నానమే. పందికొక్కును(మురుదెలుక) బతిమాలి రాజు స్నానమాడే చెరువుకు తన మేడనుండి ఒకసొరంగం తవ్వించింది చిలకమ్మ. ఒక రోజు పొద్దున మసకవెలుతురులో తామరాకుమీద కూర్చున్న చిలకమ్మను, మరొకస్త్రీగా భ్రమించి రాజు ఆమెమీద మోహంతో సమీపించబోయి నీటిలోమునిగిచస్తాడు. ఏడుగురురాణులు ఏడవడానికివస్తారు. చిలకమ్మ ఎందుకు రాలేదని ఆమెమేడకు వెళ్ళి చూస్తే, చిక్కి ఈనెపుల్లలా అయిపోయిన ఆమె రాజుదుర్బుద్ధిని గూర్చిచెప్పడంతో కథ ముగుస్తుంది.

ప్రకృతి మానవుడి వినియోగంతో క్షీణిస్తుంది. ఉన్ననేలను బాగుచేసుకొని ఉత్పత్తి పెంచుకోవలసి వస్తుంది. దానితో ఆస్తి హక్కు ఏర్పడుతుంది. ఈ కథలో బీజప్రధానంగా నడిచే వ్యవస్థ, ప్రకృతిలో మార్పువల్ల క్షేత్రప్రధానమైనది. ఈ ఒడిదుడుకులు సర్దుకోవడానికి కొంత సమయంపట్టినా మార్పుతప్పదు.

**కాలమహిమ – తాత్త్వికదృక్పథం :**

ఉత్పత్తి సంబంధాలతో పాటు న్యాయాలు మారినట్లే, బుద్ధులలో వచ్చే మార్పును తాత్త్వికంగా 'కాలమహిమ'గా చెప్పుకోవడం జానపదులలో సాధారణం.

ఒక ఆసామి తన పొలాన్ని అమ్మాడు. కొంతకాలం తరువాత కొన్నవారికి ఆ పొలంలో లంకెబిందెలు దొరుకుతాయి. వాటిని అమ్మిన ఆసామికి ఇవ్వబోతే - 'ఆ భూమి అమ్మేశాను. దాంట్లో బిందెలు నీవే నావికావు' అంటూ అతడు తిరస్కరిస్తాడు. 'భూమికొన్నానుకాని, దాంట్లో బిందెలు కొనలేదు - అవి నావికావు నీవే', అని కొన్నవాడు వాదించుకొంటూ తీర్పుకోసం ధర్మరాజు దగ్గరకు వెళతారు. ఇరువురి వాదనలు విన్న రాజు, మరుసటి రోజుకు తీర్పు వాయిదా వేస్తాడు. మరునాడు విచిత్రంగా ఆ ఇద్దరు ఆసాములు 'ఆ బిందెలు నావంటే నావి'అని పోటీపడి కొత్తగావాదన వినిపిస్తారు. ఆశ్చర్యపోయిన ధర్మరాజు, ఆ రోజే కలియుగం ప్రవేశించడం, వీరి బుద్ధులలో మార్పుకు కారణంగా గుర్తిస్తాడు.

కాలానుగుణమైన మార్పువలన గిరిజనులు జానపదులౌతున్నకొద్దీ, ప్రకృతి సహజమైన అవరోధాలు అధిగమించి రాకపోకలు పెరిగి సగటుప్రమాణాలకు అనుగుణంగా తమనుతాము దిద్దుకుంటూ తమ వ్యక్తిత్వాన్ని వదులుకుంటున్నారు.

**తేనెబుట్ట**



- చెంచూస్ ఆఫ్ హైదరాబాదు

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. Leslie A. White "The evolution of culture" Cultural and Social Anthropology, ed. Peter B. Hammond. 1964, The Macmillan Co., P. 406 - Man, as an animal, possesses a number of characteristics which qualify him for culture. Among these may be mentioned, an erect posture, which leaves the forelimbs for non locomotory activities, an opposable thumb, which makes the hand an effective grasping organ; stereoscopic, chromatic vision; gregariousness; and possibly a few other traits, but the most important qualification of all is the ability to symbol.

2. Rethinking symbolism -Don Sparber, Trans, Alice L.Morton, Cambridge Studies and Social Anthropology 1975. P.121-2.

For example, in the case of smells the evocational field comprises all recollection likely to corroborate the feeling of recognition, and it is these recollection that evocation passes in review. This relative freedom of evocation is at the very basis of the social use of this psychological mechanism, symbolism.

Richard I. Ford ' Evolutionary Ecology' Explanations for pre historical change James N. Hill 1977, A School of American Research Book. P.164.

Slowly the system becomes more complex, the information content increases and the physical environment is modified from homogeneous severity to patchiness of increased variability.

A Handbook of social & Cultural anthropology, ed. JJ Hannigmenn, P.No. 652.

Conscious ideologies and social organisations are always the dialectical and transformed expressions of a hidden infrastructural logic i.e. neither socio-economic not even historical but relational, symbolic, synchronic, systemic, universal, and ultimately neurological.

Page 653. The structure of unconscious mirrors the logic of language.

Culture and Public Action, ed. Vijayendra Rao and Michael Walton Permanent black, 2004, New Delhi. p. 151

According to Kant, the quintessential cultural value of a good is its ability to evoke an experience of the sublime. It has a quality that causes awe and “stirs the soul”.

See http://www.cultureandpublicaction.org/.

One particularly interesting set of models has been developed by Chwe (2000, 2001), who analyzes rituals and other forms of collective cultural expression as solutions to coordination problems. In order to generate collective action, an individual within a group must know what others in the group know, they in turn must know what she knows, and she in turn must know that they know that she knows, and so on - what game theorists call common knowledge. This sense of culture as a coordinating system is close to the view of many anthropologists. For example, Geertz (1973b, 5) believes, "with Max Weber, that man is an animal suspended in webs of significance he himself has spun". He takes "culture to be those webs" Douglas and Isherwood (1979/1996, 37) Link culture directily to economic life by arguing that "consumption is the essential function of its capacity to make sense" (Douglas and Isherwood 1979/1996, 40).

3. Culture & Experience, Hollowell.

To say so, may seem or suggest a paradox, for the aborigines can and does on some occasions conceptually isolate the "elements" of 'unity' most distinctly. But his abstraction did not put him at war with himself. The separable elements I have mentioned are all present in the metaphysical heart of the idea of 'person'. But the overruling mood is one of belief not of enquiry or descent (body, spirit, ghost, shadow, name, spirit, site and totem).

4. A handbook of Social & Cultural Anthropology ed. JJ Honningman.

Belief Systems Mary B.Black P.545.

Beliefs at the higher levels constant through many domains allow economy in the individuals cognitive system.

Page 601, Symbolic instrumentation – sacrifice.

5. Implicit meaning. Mary Douglas 1975. Routledge & Keganpaul, Introduction Page 5.

Our fears about the perils of global over population or destruction of resources or the evil affects of the countless procreation .... match those of a tribal society worrying about epidemics unleashed by insect or game animals disappearing from the forests because of human quarreling.

6. Lore Munro S. Edmonson. Holt Rynerheard & Winston inc. 1970 P.49-50. We have developed as a species more communicative potential than we 'need' for environmental purposes and hence we transmit in culture an overload of highly consequential but entirely metaphorical structure.

7. Ecological & cultural factors in special perceptual development Berry I,W. Inh, Canadian journal of Behavioral Science. 1971. 3 (4) P. 324-336.

Hunting people are expected to possess good visual discrimination and special skill and their cultures are expected to be supportive of the development of these skills, through the presence of high number or geometrical spatial concepts, a highly developed and generally shared arts and crafts production and socialisation practices whose content emphasizes independence and self-reliance and those techniques are supportive and encouraging of development. Implicit in this argument that as hunting diminishes in importance across samples ranked in terms of the ecology dimension, the discrimination and spatial skills will diminish as will each of the three cultural sides.

8. Page 282. To think in terms of our category of natural causation vs. a function of their culturally constituted attitudes towards the nature of phenominal world, it is based on the idea that some material object can be

projected by sorcery into person's body in order to cause illness. Doctors cannot cure this kind of disease. So native doctors will flourish.

9. ఆంధ్రజ్యోతి వారపత్రిక. విశ్వదర్శనం. కాంట్ జ్ఞానతత్త్వం మీమాంస. నందూరి రామమోహనరావు. 7–8–81.

సంవేదనలు అనుభవాలుగా మార్చుకొని అవగాహన చేసుకునేది మనమనస్సు అయినా సంవేదనలను కలుగచేసేది మాత్రం బాహ్యప్రపంచంలోని వస్తువులే. ఇక్కడ ఒక ముఖ్యవిషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మనస్సునిర్మాణంలో ఉన్నస్థలం, కాలం, పన్నెండుసూత్రాలు, మనకుదృశ్యమానమవుతున్న ప్రపంచానికే తప్ప, యదార్థవస్తువులు స్థలానికి, కాలానికి అతీతమైనవి. అలాగే మన అవగాహనాసూత్రాలకుకూడా అతీతమైనది. కాని మనస్సు అలా ఊరుకోలేదుగదా. కుతూహలం కొద్దీ స్థలకాలాలను అవగాహనా సూత్రాలను యదార్థప్రపంచానికికూడా వర్తింప చేయడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. అలా ప్రయత్నించినపుడల్లా కొన్ని వైరుధ్యాలు మనకు ఎదురువుతుంటాయి.

❁ The human direction James L. Peacock and A. Thomas Kirsch. Preface-XV, 1970, Meridth Corporation Publication.

Recognising the difficulties of analysing subjective phenomena such as religion, we acknowledge the advantage of concentrating on more objective factors such as technology and economics. The temptation to concentrate on easily discernible and further reason to assign it the status of prime mover in the evolutionary process is ................a drunk having dropped his keys in the gutter, proceeded to search for them on sidewalk under the light. A passerby, noting the gutter was the place the drunk had dropped his keys, asked him, why he did not search there instead of on the sidewalk. The drunk replied “there is more light up here”. The moral is that the place most easily lighted is not necessarily the place to find what one is searching for.

❁ The Reddis of Bison hills. P. 202.

❁ Hand book of social & cultural athropology, ed. JJ Honnigman, 1973.

Page 548. Since knowledge of the indigenous natural science classification is of value to the myth analyst … 'Belief Systems' Mary B Black.

❃ Tribal India P. Gilbert. Page 179.

Aryans who invaded India a system of landownership in which the land was considered as the property of God of the Tribe or as God itself. This situation was clearly acknowledged by the invaders who in order to placate Gods of the place, setting aside their priests or Brahmins, engaged the services of the village priests of non-Aryan origin, who being the descendants of the protecting spirit of the place would know how to placate them. This practice was also followed by non-aryan invaders as Gonds and other presumably Dravidian tribes who employed as priests aboriginal tribes men of Mundarian origin –Baigas – Bhuyas – in order to propriate the Gods of the land which they had conquered. In the similar passion the Oraons, who in some regions invaded the land of Mundaries as priests Mundaries. Rajput Chiefs were led to throne by Bhils or Minas.

❃ Lloyd A. Fallers. Nationalism in Uganda in Cultural & Social Anthropology, ed. Peter B. Hammond. P.274.

African ideologists lack the cultural resources which their Asian counterparts find in the religions of High Cultures of Hinduism, Buddhism and Islamism.

❃ ఆకాశ హర్మ్యాలు నిర్మించే అల్పజీవి. ఆంధ్రప్రభ దినపత్రిక, 12 ఆగస్టు 81.

❃ Saivism (Origin, History & Thought) Telugu University 1994, V.N.V.K.Sastry, Chenchu Mallanna - then and now. P.62

ఒకనాడు శ్రీశైలం దేవస్థానంలో చెంచులసేవలు - పూజారులు :

1. కల్యాణసేవలో పల్లకీ సేవ.
2. దసరాతొమ్మిదిరోజులు, శివరాత్రిఐదురోజులు, సంక్రాంతిమూడురోజులు, ఉగాది రెండురోజులు వాహనసేవ.

3. తప్పెట్లసేవ
4. గంధం, పత్రి, బంతి, దివిటీ సేవలు.

తోకల, మండ్ల, పిట్టల వారు పూజారులు.

## I. వర్ణవివక్ష

| ఆవుమాంసం తినే జాతులు/తెగలు | ఆవుమాంసం వదిలేసిన జాతులు/తెగలు |
|---|---|
| అపవిత్రులు (అంటరానివారు) | పవిత్రులు |
| పాలితులు | పాలకులు |
| ఊరిపొలిమేర అవతలదేవతలు | గ్రామదేవతలు |
| వర్ణసంకరానికి శిక్ష : వెలి | తప్పు |

## II. నమ్మకాలదొంతరలు

1.

నూలుపోగు నూరువరహాలు

- పన్నెండురాటలపందిరి చుట్టూ బిళ్ళనూలు చుడతారు (పెళ్ళి)
- మిడతరూపున వచ్చిన పెతరకు దినకార్యం జరిపిస్తామని నూలుపోగు కడతారు (పెతర)

2.

నేరేడు (సంకుమాను)

ఇంటికి తొలిరాట

నేరేడుకింద దేవుడుబస

శుద్ధికోసం నేరేడుమండతో నీళ్ళు జల్లుకుంటారు

వధూవరులు నేరేడుబల్లమీద కూర్చుంటారు

నేరేడు కర్రతో పెళ్ళికానివారు పలుకర్ర చేయకూడదు

**3.**

పండుపిల్లికి జీలుగుకల్లు ఇష్టం

పండుపిల్లి, జీలుగ స్నేహితులు

పండుపిల్లి చంపినవాడు చెటెక్కితే కల్లు తగ్గిపోతుంది

**4.**

మనుషులను తినేది మావెలి

వేగిసచెట్టు నరికితే ఎర్రగా జిగురు వస్తుంది

వేగిసబొండలమీద బోనం

**5.**

కోలగాడు ఎదురురావడం దుశ్శకునం

కోలగాడు మాలవాడు

మాలవాడు ఎదురురావడం దుశ్శకునం

కొండరాజుల కోలగాడు కొండగొర్రె

కొండగొర్రె అరిస్తే దుశ్శకునం

**6.**

పరిమి

పరిమి ఆకుల్లో రాజులకు పెతర్లకు మాంసం నైవేద్యం పెడతారు

చచ్చినవాడి దయ్యం వెంటరాకుండా స్మశానం దారిలో పరిమిముల్లు వేస్తారు

**7.**

తి(త్రికపిట్టరెట్టలో
విత్తనానికి
రణం మొలుస్తుంది.
అసలు చెట్టు
క్షీణిస్తుంది.

తి(త్రికపిట్ట
పక్షి (ప్రపంచంలో
'చెడుపు'ముండ

'చెడుపు'
ద్వారా శరీరంలో, భూమిలో
'తాపడం' (ప్రవేశపెడతారు

గౌరవలు, వెజ్జులు
శివసారులు ఈ 'తాపడం' తీస్తారు

## సంస్కారాలు

### (ప్రకృతి

భూమికి బొడ్డు–ఆకసానికి అడ్డు
...చేమదుంప, చేమఆకు

ఇసుకను మప్పినవాడు - చెద

పచ్చి మాంసం
పచ్చినీళ్ళ స్నానం
పచ్చి బద్దలు

### సంస్కృతి

అడ్డుగుడ్డ కట్టిన ఆడది
మొలతాడు కట్టిన మగవాడు

ఇల్లుసేయడం

కుండన వండిది అంబలి (ఉడికించడం)
పెంకన వేపింది సురువులు (వేయించడం)

గోరుకోసిన కోడి
(ముడుపుకట్టడం)

అడిగినపిల్ల కడిగినముఖం
కాల్దొక్కి కంకణం కట్టవాలె (కన్యాదానం)

## III. చెంచుల ప్రపంచం


చెంచులు
దేవరలు
బయ్యన్న
గురప్పసామి
లింగమయ్య
అంకాలమ్మ
మంతనాలమ్మ
మలల్లమ్మ
మంచిశకునం
దేవరపిట్ట
శత్రువులు
గజ్జెలకొండపట్నం
గజ్జెలకొండరాకాసి
బుడ్డసొరంగాలు
బుడతరాకాసులు
మిత్రులు
గజ్జెలకొండపోతురాజు
మఠంపోతురాజు
ఎల్లగుంతపోతురాజు
సుండిపెంటపోతురాజు
మంతనాలపోతురాజు
తగవరులు
నసాబు
పెద్దమనిషి
మెట్టెతలారి
పిర్రపన్ను
మొసళ్ళకట్ట
నీలగంగ
పందికిరవ
ఇలవేల్పులు
మెట్టెలు
మిరాశీలు
ఉగ్రదేవతలు
మైసమ్మ
(మశమ్మ)
సుంకులమ్మ
పెద్దమ్మ
నూగులమ్మ
అమ్మతల్లి
దుశ్శకునం
అన్నుగోగిద్దు
పెద్దలు
రావగాడు యోగంలోకి పోయిన పెద్దాకుకొండ
రావగాడితొడిది (తేనెపట్టు)
రావగాడి జల్లిగుంతలు (నీళ్ళు
పుట్టించిన ప్రదేశాలు)
రావగాడి దబ్బ (ఇంద్రధనుస్సు)
రావగాడి పెంపుడు జంతువులు (నేదులు)
రావగాడి తీగ
పెద్దరావగాళ్ళు, చిన్నరావగాళ్ళు,
బూడిద రావగాళ్ళు, బుడతరావగాళ్ళు

## IV. విధానం, సంకేతాలు, వస్తువులు

| | | |
|---|---|---|
| కుడి | – | ఎడమ |
| శుభం | – | అశుభం |
| బొట్టు | – | వాత |
| ప్రదక్షిణం | – | అప్రదక్షిణం |
| సవ్యం | – | అపసవ్యం |
| అక్షతలు (పసుపు) | – | అక్షతలు (తెలుపు) దేవతలు |
| | | నల్లనువ్వులు (పితృదేవతలు) |
| నివ్వాళి | – | కొంగుపతికడబ్బు |
| నేరేడు | – | పరిమి |
| పూజ | – | చెడుపు |
| పీనె | – | పాడె |

## V. చెట్లు, జంతువులు, దేవతలు

| | | |
|---|---|---|
| పరిమి | – | పెతరలు |
| వేగిస | – | మావెలి |
| నేరేడు | – | భూదేవి, సంకుదేవుడు |
| జీలుగు | – | పాండవులు |
| కన్నెజీలుగు | – | కన్నెలు |
| అరటిపువ్వుకేసరాలు | – | హనుమంతుపగడ (సత్తెవిత్తనాలు) |
| రెల్లపూలు | – | గంగాలమ్మ |
| దేవగుమ్మడి | – | దేవతలు |
| మంచిగుమ్మడి | – | మానవులు |
| సరితేనె | – | మల్లమ్మగడ్డ |
| ఒంటరికణుసు | – | అడవిరాజులు |
| పుట్టకూడు | – | జాంబవంతుడు |
| రివ్వబెత్తలు | – | శివసార్లు |

| | | |
|---|---|---|
| చేప, తాబేలు, కప్ప, ఎండ్రిక | – | జలగన్నికలు |
| తొండ, బల్లి, డొక్కి, ముంగిస | – | గురువులు |
| అడవిజంతువులు | – | అడవిగొల్లలు |
| క్రూరజంతువులు | – | దానుగుడు |
| ఆరెమాను | – | అర్జునుడు |
| కొండగొర్రె | – | రాజులకోలగాడు |
| ఏట్రింత | – | పక్షులలో కోలగాడు |
| తిత్రికపిట్ట | – | చెడుపుముండ |
| వేటగుంజి (గుడ్లగూబ) | – | పక్షులలోరాజు |
| బింగిరాజు (మైనా) | – | బ్రాహ్మణుడు |
| రాచెలుక (శాకాహారఅడవిజంతువు) | – | దానుగుడు (సాధుస్వరూపం) |
| చెదలు | – | నందమ్మ |
| దేవరిపిట్ట (వడ్రంగి) | – | మంచిశకునం |
| అన్నుగో గిద్దు (తేనెల తెరవడు) | – | దుశ్శకునం |
| ముహూర్తగాడు | – | మోర్ధ (పందికొక్కు) |

**VI.**

| | | |
|---|---|---|
| **దోసం** | **×** | **పండుగ** |
| ప్రకృతి | – | సంస్కృతి |
| నిషేధం | – | అనుమతి |
| దానుగుడు (అడవిరాజులు) | – | పాండవరాజులు |
| అమ్మతల్లి | – | జాంకరి |
| మావెలి | – | గొంతెమ్మ, నందమ్మ |
| బాసలు | – | కొత్తలు |
| ఉడికించడం | – | వేయించడం |
| మారుపేర్లు (నిందాస్తుతి) | – | స్తుతినింద |
| రూపకం | – | రూపకం |

# పండుగ పదాలు

రండోచేరి పాండవులార - భోంచేయరండో ॥
లే లే లేల లేలమ్మారో - ఒలే లేల లేల
జోర జోర జోర - పంచపాండవులార ॥

✩ **వార్తయందు జగము వర్ధిలుచున్నది**

సహజాతాలు – నవరసాలు – కవిసమయాలు

చిహ్నాలు – లెక్కలు – సమీకరణాలు

జ్ఞానం – చైతన్యం

పండుగ – కర్మకాండ – విశ్వాసం

వేళలు

కొలమానాలు

పరిసరాలు

పదాల సంబరాలు – విత్తం కొద్దీ వైభవాలు

✩ **రండోచేరి పాండవులార – భోంచేయరండో**

కోలాటం

పదాల సంబరాలు

ఇల్లుకట్టిచూడు – పెండ్లిచేసిచూడు

గూపిపండుగ

✩ **గోదావరి – విశాఖతెగల వ్యవసాయంలో తారతమ్యాలు**

దృగ్విషయం – దృక్పథం

గిడసబారిన వ్యవసాయం

నంది, కొలువుపండుగలు

✩ **వ్యవసాయ చరిత్ర – నందిపండుగ**

అంబటూలరాజు – అన్నమూలదేవి

ఆసివేయులపట్నం – ఆసివేయులపాప

గౌరమ్మ – నందమ్మ – బండిబసవన్న

గొంతెమ్మ – కోలన్న – భీమన్న

కుప్పకొక పన – పనకొక కుప్ప

పిట్టగడ్డ – జాలంపల్లి – పట్టపుకోలన్న

వనుంగుపల్లిగంత – గురపనుకు దిమడాలు

దానవుల బోడమర్రి – తాతవారి భూములు – గారమూలకోట

మత్స్యరాజులు – నాగరాజులు

- **నందిపండుగలో వారంరోజుల కార్యక్రమం**
- **నంది పదం**
- **నందిపాట**

  మన్యందేవతలు

  జలగన్నికలు

- **పాండవయోగంపట్టినవారిని ఉసికొల్పడం**

  అంబటూలరాజు – ఆసివేయులపాప

  దేవగుమ్మడి పండు

- **పాండవరాజు పుట్టుక**

  దుగ్గలబోయడు

  నందమ్మ – గౌరమ్మ

  పాండవరాజుపెళ్లి

  పాండవుల కష్టాలు

- **దొంగలదోపు**
- **కోలన్న – కరువు**

  కోలన్న అమ్మకం

  విత్తనాలు

  శాపం

  విరుగుడు

  పాండవుల వ్యవసాయం

  కొలువుపండుగ

- **దానుగుడు**

  కౌరవులతో యుద్ధం

  పశువులు మలపడం : ఉత్తర గోగ్రహణం

- **కథలో సంఘటనలు – సమన్వయం**

  అడవిజంతువులు – ఊరజంతువులు

  దేశాలు – మాయలు

  బండి బసవన్న

  సత్తెవిత్తనాలు

  జలకన్యకలు – తాబేలు తారప్ప – తాత సుంకమరాజు

  దేవగుమ్మడి – మంచిగుమ్మడి

  గురువులు

  దేవతల ప్రతినిధులు

  పిట్టగడ్డ జలంపల్లి పట్టపుకోలన్న

  మర్లుపులి

  'పంచపాండవులపంట – దుర్యోధనులవంట'

- **విరుద్ధ ధర్మాలు – సమన్వయించే మాధ్యమాలు**

## వార్తయందు జగమువర్ధిల్లుచున్నది :

జ్ఞానం పెరుగుతుంది సంస్కృతి మారుతుంది
జ్ఞానం సంస్కృతిలో జీవనాడి
సమాజం సంస్కృతిని ముందుతరాలకు అందిస్తుంది
ఆ 'వార్తయందు జగమువర్ధిల్లుచున్నది'[1]

**సహజాతాలు – నవరసాలు – కవిసమయాలు :**

ఆకలిదప్పులు సహజమైనవి. కాని కూడుగుడ్డ, తోడునీడ సహజంగా అమరేవి కావు.[2] మానవులకు సహజాతాలున్నాయికాని సహజకవచకుండలాలులేవు. చెదపురుగు వలె, సాలీడువలె ఇల్లుకట్టుకోవడం అతనికి పుట్టుకతోనే వచ్చినదికాదు. చలిని తట్టుకోవడానికి గొర్రెలకువలె అతనికి ఉన్నిపెరగదు. కాని యీప్రాణికోటి ప్రవృత్తి అంతవరకే పరిమితం. కొత్త పరిస్థితులలో, శరీరధర్మాలతో ముడిపడిన ఈ అలవాట్లను మార్చుకోవడంలో, అవి చాలవరకునశిస్తాయి. తాను మారగలిగి – ప్రకృతిని మార్చ గలిగినది మానవజాతిఒక్కటే. జీవయాత్రకవసరమైన సంభారాలనన్నింటినీ మానవుడు సంపాదించుకుంటాడు, నిర్మించుకుంటాడు. తనఅనుభవాన్ని ముందుతరాలకు అందిస్తాడు. అవసరంలేనివాటిని వదిలేస్తాడు. అనుభవానికిరాని సందర్భాలనుకూడా ఊహించగల ఇంద్రియాతీతమైన భావవ్యాపారంలో మానవుడొకడేసమర్థుడు. తన అనుభవాన్ని, సంకల్పాలను, చేష్టలలో, చిత్రాలలో, భాషలో చూపించగలశక్తిని మొదటి నుండి మానవుడు పెంచుకుంటున్నాడు. ప్రాచీనకాలంలోనే మసలడానికికూడా వీలులేని ఇరుకైనగుహలలోకూడా జంతువుల చిత్రాలుకనిపిస్తున్నాయి. కొండంత దేవునికి కొండంతపూజ చేయలేమని నాడే మానవునికి తెలుసు. అందువలన వేటాడిన జంతువుమాంసం చిన్నతునుక ఒకఆకులో నివేదించేవారు. ఇలా పూర్ణాంకాలను, భిన్నాంకాలను బదులుగా ప్రయోగించడం అనాదిగాఉన్నదే. వేటాడిన లేక వేటాడనున్న జంతువును అనుకరిస్తూ కూతలుకూసేవారు. పాటలుపాడేవారు. గంతులువేసేవారు. ప్రయోక్తనైపుణ్యాన్ని బట్టిమెరుగుదేరిన ఆ భాష, కళ, అలంకారికులు చెప్పినట్లు నవ రసాలను, మానవశీల శాస్త్రవేత్తలు కనుగొన్నట్లు, పధ్నాలుగుసహజాతాలను ఉద్దీప్తంచేసి ఉత్సాహశక్తినిపెంచేవి. పరిసరం, సందర్భం ఆలంబనం–అనుభవాలు కళ ఉద్దీపకాలు.

రానురాను ఉత్పత్తిదశలో శ్రమవిభజన హెచ్చి నైపుణ్యంపెరిగి ఆయాపనులు వృత్తులై స్వతంత్ర శాఖలుగా రూపొందవలసివచ్చింది. ఈవర్గాలలో కొందరికి పలుకుబడి, ప్రాముఖ్యాన్నిబట్టి సుఖస్వాతంత్ర్యాలు పెరగసాగాయి. అందుకుతగినట్లు ఆసాహిత్యం ఒక కాల్పనికమైన జగత్తును, స్వర్గాన్ని సృష్టించి దానిలోవిహరించే భావుకతను పెంచింది. దానిశైలి సంప్రదాయాలు, వాస్తవానికిదూరమై, కవిసమయాలు కాసాగాయి.

**చిహ్నాలు – లెక్కలు – సమీకరణాలు :**

నామరూపాత్మకమైనది ప్రపంచం. ఈ నామకరణంలో దృక్పథం ప్రభావాన్ని, వినియోగంలో ఆపేర్లుపొందే అర్ధవిపరిణామాన్ని పదార్ధశాస్త్రజ్ఞులుగుర్తించారు. సత్యాన్ని రాగద్వేషాలకతీతంగా ఆవిష్కరించేయత్నంలో ఇంద్రియాల కర్తృత్వాన్ని అనగా రంగు, రుచి, వాసన, స్పర్శలను తొలగించారు. ఆకృతి, బరువు, కాలంతోవచ్చే (పదం) సాపేక్షను వదలించుకున్నారు. పరమాణువును దర్శించారు. అక్కడితో ఆగక అణువు లోని తరంగాలను, వానిప్రకంపనాలను లెక్కల్లోకి, చిహ్నాలలోకి, సమీకరణాలలోకి మార్చుకొన్నారు. నామరూపాలనుండి సున్నదాకా ఈఅన్వేషణ సాగింది.[3]

శాస్త్రంవలె సంగీతంకూడా సాహిత్యాన్ని అది స్ఫురణకుతెచ్చే పరిసరాలనుదాటి భావాలను విశ్వజనీనంగా ఆలపిస్తున్నది. శాస్త్రం బహిర్ముఖం–సంగీతం అంతర్ముఖం. తత్త్వశాస్త్రంకూడా వాసనరహితమైన ఆత్మజ్ఞానాన్ని గూర్చి ఘోషిస్తున్నది. ఈ సహస్రాబ్ది సార్వత్రిక లక్ష్యాలను అన్నిదేశాలు తలదాల్చే విధంగా అంతర్జాతీయ సంస్థలు – ప్రభుత్వాలు కృషిచేస్తున్నవి.[4]

జ్ఞానం చెప్పేదానికి, కళ చూపేదానికి, పండుగలలో చేసేదానికి పొందికకుదరక పోతే, సమాజం విశ్వాసం బీటలువారుతుంది. కొంతకాలం మతం ఆ విలువలను వ్యాఖ్యానిస్తూ మెడలువంచుతుంది. తత్త్వవేత్తలు, సంస్కర్తలు, సంస్కృతికి కొత్త ప్రాణం పోస్తారు.

శాస్త్రం, కళ, సాహిత్యం, మతం, వానిలో పాండిత్యంచుట్టూ తిరిగే నాగరికతలో గల అధికోత్పత్తి, స్వతంత్రమైన పాలకవర్గం, మేధావివర్గంలేని గిరిజనసమాజాలలో ఇన్ని విభాగాలు, వర్గాలు, సిద్ధాంతాలుఉండవు. అక్కడ జ్ఞానానికి, కృషికి, ఆనందానికి కర్త భోక్త ఒక్కడే.

## జ్ఞానం – చైతన్యం :

జ్ఞానవ్యాపారం (పరిసరం, ధర్మం, సంకేతం, ప్రయోగం, సిద్ధాంతం) శాస్త్రమార్గం. భావనవ్యాపారం (పరిసరం, ధర్మం, పదం, స్పందన, కళ, కర్మకాండ, విశ్వాసం) మీద విస్తరిల్లేది విశ్వాసం. రెండూ ఆధారాన్ని, స్ఫూర్తిని పరిసరంనుండే పొందుతాయి. ఒక సత్యాన్ని ఆచరించడానికి సమాజచైతన్యాన్ని మీటే కళాపరివారంకావాలి. ఒకఉద్రేకం కార్యరూపందాల్చడానికి యదార్థజ్ఞానముండాలి. జ్ఞానంలేని చైతన్యం గుడ్డిది, చైతన్యం లేని జ్ఞానం కుంటిది. జ్ఞానం, సహజాతం రెండూతగువిధంగా ఒదిగిపోతూ సమాజం ప్రయోజనాలను సాధిస్తాయి.[5]

## పండుగ – కర్మకాండ – విశ్వాసం :

మాటలన్నవి వస్తువుల అర్థస్ఫోరకాలే, వాటిప్రతిరూపాలుకావు. అన్నినమూనాలు వస్తువులభాగాలే. శాస్త్రజ్ఞుడు ప్రకృతిని ప్రయోగశాలలో నిర్మించి పరిశీలించి జ్ఞానం సంపాదిస్తాడు. తన అవగాహనను సూత్రబద్ధంచేసి ప్రపంచానికి అందిస్తాడు. సమాజం పండుగలలో, కొలువులలో ఆయాపదార్థాలనుసేకరించి దేవతలను ఆవాహనంచేసి ఒక కర్మకాండను జరుపుతుంది. వివిధపాత్రలలో తానూపాల్గొంటుంది. ఒకసమాధానానికి వస్తుంది. రచయిత కావ్యాన్ని సుఖాంతంచేసినట్లు, కర్మకాండను జయప్రదంగా జరిపి కొన్ని నమ్మకాలతో, విశ్వాసాలతో జ్ఞానానికి ఉపిరులూదుతుంది.

రకరకాల వృత్తులతోనిండిన నాగరికులవలె పరిమాణాన్ని, కాలాన్ని జానపదులు గంటలు, గజాలవంటిస్వతంత్రమైన మానంలోవ్యవహరించరు. భోజనం పనిపాటలు ఋతువులు – సంతలు – జాతరలు; వీటిని ఆధారంచేసుకొని కాలాన్ని గుర్తిస్తారు. పాత రాతియుగం, కొత్తరాతియుగం అని పనిముట్లనుబట్టి ప్రాక్చారిత్రకులు, భూగర్భ శాస్త్రవేత్తలు శిలల ఆవిర్భావాన్నిబట్టి ఆర్చియన్ మహాయుగమని, గోండ్వానా మహా యుగమని విభజిస్తారు. అవాంతరశాఖలైన భూభౌతికశాస్త్రం – భూరసాయనశాస్త్రం శిలాజశాస్త్రం మొదలైనవానికికూడా ఈవిభాగమే ఆధారం. అది ఆశాస్త్రంచుట్టూ అల్లుకున్న సంస్కృతి. అదేవిధంగా గ్రామాలలో ఎన్ని వృత్తులున్నప్పటికీ ప్రధానమైనది వ్యవసాయం అయినప్పుడు పరిభాషలన్నీ దాన్నిబట్టేఉంటాయి. ఆహారంసేకరించుకునే సమాజాలలో ఆ జీవనవిధానం నుడికారంలో ప్రస్ఫుటమౌతుంది. ఇతరవృత్తుల పడికట్లుకూడా దానిమీద కొంతప్రభావం చూపుతాయి.

**వేళలు :**

'తూతుగొమ్ము పడుతున్నాడు గౌడు' అంటే గొట్నబయలుకు పశువులనువదిలే (సుమారు పదిగంటల) వేళ అయిందని అర్థం. గొడ్లకాపరి బూరనూదడం, పొద్దెక్కింది అనడానికి విశాఖమన్యంలో హెచ్చరిక. ఎడగీత (మధ్యాహ్నంకల్లు) 'మధ్యసిత్రం' (వేసవికాలంలో బూరుగుపూలలో మధువుకై అంటే పిట్టలు వచ్చేవేళ), పులివేళ – పులి షికారుకు బయలుదేరనున్న వేళ (సాయంత్రం 4–5గంటలు). ఇలాగే ఋతువులు, సంతలు, జాతరలచుట్టూ కాలమానం తిరుగుతుంటుంది.[6]

**కొలమానాలు :**

ఆకారాన్ని చేతితో అభినయిస్తూ సూచించడం: కొండరెడ్లు చిన్నపరిమాణానికి చేతిని మలచి, కాస్త పెద్దదానికి మోచేతి కండలను, మరీ పెద్దదానికి తొడలను పట్టి చూపుతూ వివరిస్తారు. (వేటాడే మాంస ప్రీతిగల సమాజం కొలతలు) విశాఖమన్యంలో కంచంలో అన్నం ఎక్కువగా ఉంటే 'పిల్లికూడా దూకలేదు' అంటారు. ఎంతలోతుగా అమ్మునాటుకుందో చెప్పడానికి తొట్టెడుపలం (తొట్టి – అమ్ము మధ్యభాగం), కళ్లంలో ధాన్యరాశిని అమ్ముతో కొలుస్తారు. 'ఈకలతుంటి' 'పింజరికట్టు'. ద్రవాన్ని దిప్పెడు (దిప్ప–సొరడిప్ప) డోకెడు (ద్రవాన్ని తొలిపేచిన్నడిప్ప) కొలతలకు, తూకానికితయారు చేసుకున్న కుంచం, విసకర్ర. ఊరికి ఉద్దెగాళ్ళు (ఉద్యోగస్థులు) ఈ కొలగారాలు. 'ఎన్ని కటుగులు చూశావయ్యా' అంటే ఎన్ని తరాలుచూశావని ప్రశ్నించడం. వెదురు నలభయ్యేండ్లకు ఒకసారిపూస్తుంది. దాన్ని 'కటుగు'అంటారు.

**పరిసరాలు :**

ఆకాశంలో కుందేటిచుక్కలు, కల్లుకావళ్లు. పరిసరాలన్నీ తానంబసలు, జాకరి మెట్టలు, భూదేవిచింతలు, సమర్తచింతలు, కణుజునాకినజాడలు, పికిలిపిట్టవేనాలు, మగనాలిమెట్టలు (కోపగించి వెళ్లిపోయిన పెళ్లాంజాడను ఊరిపొలిమేరలలోని మెట్టలలో వెతుకుతుంటారు). పేరు, శరీరం, జీవి–పెతరలసాపేక్ష ఎరిగినదే. అభినయాత్మకంగా, అనుకరణసహితంగా ఇష్టానిష్టాలను స్పష్టంగాను వ్యంగ్యంగాను సూచిస్తూ సంభాషణ కాకువుతో నిండివుంటుంది.

*ఎడగీత, మధ్యసిత్రం, పులివేళ*

## పదాల సంబరాలు – విత్తం కొద్దీ వైభవాలు :

ఈవిధంగా జానపదులజ్ఞానానికి ఉపయోగం, స్ఫూర్తి ప్రయోజనాలు. ఈజ్ఞానం, ఉత్పత్తులకంటె, సమాజం అవసరాలు ఆకాంక్షలు ఎప్పుడూ అధికంగానే ఉంటాయి. అదేవిధంగా మానవులు వాడే ఇతరసంకేతాల మాదిరిగాకాకుండా మాటలు సాధారణ విశిష్ట లక్షణాలను – వస్తువులమధ్య సంబంధాలను వ్యక్తీకరించగల అపరిమిత సామర్థ్యాన్ని కలిగిఉంటాయి. ప్రకృతినుండి పొందిన స్ఫూర్తి పునాదిగా మనోమయ, ఆనందమయకోశాలలో విహరించే భావాలను, పదకవితాడంబరంతో, అభినయ వైభవంతో, సకలోపచారాలతో వేడుకచేసి విన్నవించు కోవడమే పండుగ. ఇవి విత్తంకొద్దీ వైభవాలు. సిద్ధాంతం భౌతికజగత్తును లోగొనడానికి సాధనం. విశ్వాసం తరగని మనోబలానికి ఆధారం. జీవితానికి రెండూ శరీరం–మనస్సు వంటివి. విద్యవల్ల మృత్యువును తరించి, అవిద్యవలన (దేనికంటే ఉత్తమ విద్యలేదో) అమృతత్వాన్ని పొందుతాడు. ఆ వివేకాన్ని తమ కష్టంలో మేళవించుకున్న పల్లెప్రజలు ప్రాజ్ఞులు.

ఈ ప్రాజ్ఞత, జాతీయక్షేత్రాన్ని తడుపుతూ మానవుని వ్యవసాయాన్ని సఫలం చేస్తున్నది. శాస్త్రవిజ్ఞానం పరిశోధనబలంతో దేశకాలాలుదాటి సార్వకాలిక సత్యాలను ఆవిష్కరించి ఎల్లలోకం ఒక్కయిల్లేనని చాటుతున్నది. పండుగపదాలు చరిత్రను నిరూపించి, విశ్వాసాన్నిపెంచి, భవిష్యత్తును నిర్దేశిస్తాయి. జీవనసమరాన్ని గెలవడానికి గ్రామాన్ని ఒక్క తాటిమీద నడిపిస్తాయి.

ఈ గేయపురాగాథలలోతప్ప, సామాన్య గేయాలలో జానపదులు స్వైరవిహార ధీరులు. నీతిని గట్టునపెడతారు. అవినీతికి పట్టంకడతారు. అలా చేసినందుకు ఆక్రోశిస్తారు. ఈ తబ్బిబ్బులకు శాస్త్రప్రయోగంవంటి కర్మకాండ–గాథలలో స్థానంలేదు. ఇక్కడ నియమనిష్ఠలు పాటిస్తేనే మున్ముందు రెక్కలకష్టం ఫలించేది. ❊

## రండోచేరి పాండవులార – భోంచేయరండో :

తన కృషి ఫలించిన కానివాడ నీలన్నదొర దేవునికి ఆరగింపులిస్తున్నాడు.

కానివాడ దేవుడికి – నీలములో
ఏమేమి ఓరెలు – నీలములో
కొత్తకుండ ఓరెలు – నీలములో
కోనేటి పళ్ళేలు – నీలములో
ఒరుదొప్ప సేసలు – నీలములో
అడ్డాకు పళ్ళేలు – నీలములో

తలకు రుమాలుకట్టుకొని, అంటుముట్టులేని కొత్తకుండలో ఓరెం (ఓగిరం) వండి తామరాకు పళ్ళేలలో, అడ్డాకు పళ్ళేలలోపెట్టి నివేదిస్తున్నారు. తామరాకు పళ్ళేలు కోనేటి పళ్ళేలట. వారిదేవతలు 'దొప్పసేసలు చెల్లియున్న తల్లులు'.

పంటలన్నీ ఇంటికిచేరి పనులన్నీ కుదుటపడిన తరువాత గ్రామమంతా తానం పండుగలో గండిసీమమీద (రంపచోడవరం మండలం) ఔజంకొలువుతో రాజులకు, గ్రామతల్లులకు స్వాగతంపలుకుతున్నది.

ఆటసిరి కళ్ళలోన – ఆడవేడుకలయ్య
పాటసిరి కళ్లములోన – పాడవేడుకలయ్య
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల
మళ్ళీ వచ్చిరి పాండుగూలు – మలకరి దేశాలు
తేలివచ్చిరి పాండుగూలు – తెల్లదేశాలు
తిరిగి వచ్చిరి పాండుగూలు – తిరపతి దేశాలు
కూర్చున్నారు పాండుగూలు – కుసుమనీడలకాడ
చేరున్నారు పాండుగూలు – చెరుకునీడల కాడ
దాగున్నారు పాండుగూలు – దబ్బనీడల కాడ
నిలుచున్నారు పాండుగూలు – నిమ్మనీడల కాడ
తేలివచ్చిరి మా తండ్రులు – చేదండాలమీద

పారివచ్చిన పాండుగులకు – పాదాలైన కడిగి
పట్టుచీర చెంగులతోను – పాదాలైన వత్తి
కాళ్ళు కడిగిన ఉదకంబులు – కాల్వలైపారె
చేతులు కడిగిన ఉదకంబులు – చెరువులైపారె
ఉదకాలెత్తిన ఉదకంబులు – ఊటలైపారె
కూర్చోమని వేసిరిబాబు – కురుచుటక్కుల పీట (కుర్చీ)
పడుకోమని వేసిరిబాబు – పట్టేమంచాలు
దూదోమని వేసిరిబాబు – దూదిపరుపులు
తలగడని వేసిరి బాబు – తారపీటలు
కూర్చున్నారు పాండుగులు – గున్నతాడిపొడవు
నిల్చున్నారు పాండుగులు – నిలువుతాడిపొడవు
వేగునాడు (జామున) కావించిరి – వెల్లదావాలు (దాహాలు)
పరుగునాడు కావించిరి – పాలదావాలు
రండోచేరి పాండవులార – దప్పులారగించు
రండోచేరి పాండుగులార – భోంచేయరండో
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల
చింతకింద సిమ్మస మేసి ఉన్నారు – పాండుగులు (సింహాసనం)
చిక్కుడుకింద చిన్నబోయి ఉన్నారు – పాండుగులు
మామిడికింద మాటమీరి ఉన్నారు – పాండుగులు
చిక్కుడుకింద చిన్నబోయిఉన్నారు – పాండుగులు
జువ్వికింద జూజమాడి ఉన్నారు – పాండుగులు

ముగ్గులులేని యింటికాడ – మేమొల్లమయ్యా
ఉత్తరగన్నిక తెప్పించేము – ముగ్గులువేయించి
అలుకులులేని ఇళ్లకాడ – మేమొల్లమయ్యా
ఉత్తరగన్నీక తెప్పించేము – అలుకులైనచేసి
సాటు, తంబాలు, దూలాలు, సత్తర (అటక), కొమరబల్ల (తేనెబల్ల)

పెండెలు, (వడ్డులు) లేని – యింటికాడ మేమొల్లమయ్య
ఉత్తరగన్నీక తెప్పించేము – సాటులు, (తంబాలు) వేయించి

పాటించి కోసిరిబాబు – పచ్చగడ్డికోత
కూడించి కోసిరిబాబు – కొండగడ్డికోత
దాటించేసి కోసిరిబాబు – దబ్బగడ్డికోత
అంటిమట్టి పుదుకుడుబల్లలు – కోయించేటివేళ
అంటియాకు దారబందాలు – కోయించేటివేళ
గుమ్మడిగింజ దారబందాలు – కోయించేటివేళ
చింతగింజ చిత్తరవన్నెలు – చేయించేటివేళ
మామిండ్లను కొట్టిమరి – మల్లెశాలలుకట్టి
చింతలను కొట్టిమరి – చిన్నశాలలు కట్టి
ఏడెలను కొట్టిమరి – వెలలోకాలుకట్టి
బూరుగులను కొట్టిమరి –భూలోకాలుకట్టి
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల

కమసాలయ్య కమసాలయ్య – రావో కమసలయ్య
రాజులున్న బరిణెశాలకు – రావో కమసలయ్య
అలకాపురికి బరిణిసాలలు – ఏలాగునవయ్యా
కామధేనువు కల్పవృక్షము – ఏలాగున్నవయ్య
కామదేవుడు కల్పవృక్షము – చాలాగున్నవయ్య
మూడుమూళ్ళ పళ్ళెపాకు – ముంగటవెయ్యారజాన (అర్జునా)
ఆరుమూళ్ళ పళ్ళెపాకు – అంగటవెయ్యారజాన (అర్జునా)
సత్తెమైన ముత్తేలమ్మ – కాచికాపాడు
కొక్కెరకోడి కూసేవేళ – కొండ లేచెడివేళ
ఊరకోడి కూసేవేళ – ఊరు లేచెడివేళ
చంద్రుడు జగములను – ఏలేటివేళ
సూర్యుడు చుక్కలు – సుడిదిరిగేటివేళ

సత్యముగల్ల దేవతలకు – పచ్చిబద్దలు శరణు
కోపములేని మాయమ్మకు – కోటిగద్దెలు శరణు
పసిబిడ్డ బాలపాప – చల్లంగ చూడవాలె
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల

**కోలాటం :**

మద్దిబుగ్గి మసడాలు – అంబలైన కాచి
గేదెపెండ చారుకూరని – అరముచేసిరి పాండుగులు
తుమ్మికూర తొమ్మిదేండ్లు – ఆరముచేసిరి పాండుగులు
పాపికూర పదేడులు ఆరముచేసి – పాండుగులు
పుట్టమన్ను అంబలియని ఆరముచేసి – పాండుగులు
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల

తేలివచ్చిరి పాండుగులు – తెల్లదేరాలమీద
తూలివచ్చిరి పాండుగులు – తుమ్మినీడల కాడ
తారివచ్చిరి పాండుగులు – టంగుడునీడల కాడ
మళ్ళీవచ్చిరి పాండుగులు – మలకరిదేశాల
చక్కెరదేవికోటలోన – చేదండాలు పట్టి
తేలివచ్చిరి మా తండ్రులు – చేదండాలమీద
లే లే లేల లేమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల
రారయ్యో పాండుగులార – వన్నాలారగించు
కాకరకాయ కమ్మనంటులు – కలదొంతులు పెట్టె
పేపరకాయ పిండివంటలు – పేదుంపలు వండె
గిలుకులర సేముంతను – గలుకునైన ముంచి
రండోచేరి రాజులార – భోంచేయరండో
పులితోక పట్టెడతాడు – ఏ రాజుకు చెల్లు

పులితోక పట్టెడతాడు – పాండురాజుకు చెల్లు
పిల్లితోక పట్టెడతాడు – భీమన్నకు చెల్లు
పాముతోక పట్టెడతాడు – పాండవరాజుకు చెల్లు
మువ్వలచేట గవ్వలరోకలి – ఏయమ్మకు చెల్లు
మువ్వలచేట గవ్వలరోకలి – సీతమ్మకు చెల్లు

**పదాల సంబరాలు :**

ఈ రోజు యారోజు ఏమిటి – పువ్వులరోజు
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
ఎండాకాలం పైరోజు – పాలపువ్వులరోజు
ఎండాకాలం పైరోజు రెల్ల, మోదుగ, బూరుగ, సంపెంగ
రావో రావో రాగమ్మ – రావో రాగమ్మా
దుమ్మకొండ జలముదొక్కి – రావో రాగమ్మా
రావియాకు రాలదొక్కి – రావో రాగమ్మ
జువ్వియాకు జూజమాడి – రావో రాగమ్మ
భూమిదేవికి కట్టినకోక – ఏమిటి పూలకోక
భూమిదేవికి కట్టినకోక – బూరుగుపూలకోక
ముత్తేలమ్మకుకట్టినకోక – ముషిణిపూలకోక
మావెలమ్మకుకట్టినకోక – మామిడిపూలకోక
సారునమ్మకుకట్టినకోక – సిర్లిపూలకోక

మడుగునపోయే గామతల్లికి – ఏమేమి సాంబురాలు
మడుగునపోయే గామతల్లికి – పదాల సాంబురాలు
మళ్ళీవచ్చిన మావెలితల్లికి – మేలైన సాంబురాలు

ఎక్కడ పాడిపంటలుంటాయో అక్కడపాండవులు, ఎక్కడ వివాహం జరుగుతుందో అక్కడసీతారాములు మన్ననలందుకోవడం భారతీయసాంస్కృతిక సంవిధానం.

అన్ని పంటలకు కొత్తలుచెల్లిన తరువాత గ్రామమంతా చేసుకునే కొండరాజుల పండుగవి ఈ పదాలు. ఆకలిబాధవల్ల, పంటలు పాలపదునులో ఉండగనే కొత్తలు

కలుపకతప్పదు. అపుడు పండుగను వేడుకగా జరుపడం సాధ్యంకాక మూటగట్టిన వెన్నులను, కళ్ళంలో 'తలరాసులు' కలిపి కొత్తలు చేసుకుంటారు. నగరిబసలో ఉపవాసం తీర్చిన తరువాత ఔజంమోగిస్తూ ఊరిలో ప్రవేశిస్తున్న గోవులకు కాళ్ళుకడిగి ఔజాలకు 'ధూపగంధా'లిచ్చి ఆటపాటలతో స్వాగతం పలుకుతున్నారు స్త్రీజనం.

అరణ్యావాసంలో చింతతోపులలో – మద్దిబుగ్గి అంబలితో కడగండ్లబతుకుగడపిన పాండవరాజులు 'నగరిబస'లోకిరాకసందర్భంగా 'వెలలోకాలు'నిర్మిస్తున్నారు. లోపాలు పూరిస్తామని మాటయిస్తున్నారు. కంసాలిని ఈ మల్లెసాలను కట్టరమ్మని పిలుస్తున్నారు. అతని తావున క్షేమవార్తలడుగుతున్నారు. (కామదేవుడు – కల్పవృక్షం) ఎక్కడో బహు దూరాన చక్రకోటనుండివస్తున్న రాజులు ఏ వేగుజామున తాగినజావలో: అర్ఘ్యపాద్యాల తరువాత ఆతిథ్యం అంగీకరించమని ప్రార్థిస్తున్నారు. పులితోకలను, పాములను పట్టెడ తాళ్ళుగాచేసుకొన్న వారిమహిమను ప్రస్తుతిస్తున్నారు. ఈపంటనుఅమర్చే తల్లిసీతమ్మకు తోడుగా గ్రామతల్లులు, మావెలి, ముత్తేలమ్మలను దుమ్మకొండనుండి పారేజలధారలు పాములేరు, సోకులేరు, సీలేరులను దాటి, అడవి అంతటారాలిన పండుటాకులను గలగలాతొక్కుతూ, నవవసంతపు కొలువుబసలోకి వేంచేయమని స్త్రీలు 'నందా' లాడుతూ 'పదాలసంబరాల'తో ఆహ్వానిస్తున్నారు. జగమంతావెల్లివిరిసే కుసుమశోభతో ఆ తల్లులకు సింగారంచేస్తున్నారు.

కొలువుబసలో, ఏ చింతచెట్టుకిందనో చోడిపిండిముగ్గువేసి, సామగింజల బొట్టు పెట్టి, ఆముదపుగింజలను వేయించి పుల్లలకుగుచ్చి వెలిగిస్తూ, గుగ్గిలంలక్కలతో 'మానుధూప'మిస్తూ ఎంతోపవిత్రంగా తొలచిన ఔజానికి పసుపు కుంకుమలను పూస్తూ, అలంకారాలకు అందని హృదయసంగీతంతో, తమపంటను, ప్రకృతి అందాన్ని నివేదిస్తున్నారు.

పాటచిన్నదైనా పాల్గొనేవారిభావాలు అనంతమైనవి. అందరూ పదంకలిపేవరకు, ప్రతివారి మనసు తనిసేవరకు పాటతిరుగుతూనే ఉంటుంది. రెండుమూడు వారాల ముందునుండి ఈఔజం మోతలు–ఆటలు మొదలౌతాయి. కల్లు చిత్తుగావచ్చే ఫిబ్రవరిరోజులు. ఈ రాజులపండుగ గండిసీమ మొదలు గోదావరిఒడ్డువరకు ఒకే విధంగా జరుపుతారు.

కాకతీయరాజులకు ఓడిన చక్రకూట (బస్తరు)రాజుతోపాటు అతని రైతురాణువ కుంటమీదుగా గోదావరిజిల్లాలలో వ్యాపించారు.[7] ఆ రైతులే కోయలు. వీరు భీమన్న భక్తులు. ఈ కోయలప్రభావం ఈప్రాంతాల వ్యవసాయవికాసంలో ప్రముఖమైనది. అందువలన పాండవులపర్యటనలో చక్రకూటంకూడా చేరింది. 'చక్కెరదేవికోట' (చక్కెరదేవి, దంతేశ్వరి) అనడం 'పదం' పొసగించుకున్నతీరు.[8] మావెలికోయలు ఆరాధించే వామాచార దేవత. 'మనుషులను తినేది మావెలి' అంటారు రెడ్లు. కాని రెడ్ల దేవతాగణం అందరూ సాధువులే.

**ఇల్లుకట్టిచూడు – పెండ్లిచేసిచూడు :**

ఆకాశసౌధాలు పెరుగుతున్న రోజులలోకూడా 'పెళ్ళిచేసిచూడు–ఇల్లుకట్టిచూడు' అన్న సామెతకు కాలంచెల్లిపోలేదు. లక్షయేండ్ల మానవజాతి చరిత్రలో మానవుడికి ఒక స్వంతనివాసం ఏర్పరచుకునే అగత్యం, ఏదశలో వచ్చినదో ఏసుఖాన్నిచ్చినదో, వ్యవస్థా పరంగా ఏమార్పులు తెచ్చినదో తెలుసుకొంటే ఈపదం సందర్భశుద్ధి మనసుకు హత్తుకొంటుంది.

చెంచులవి చుట్టుగుడిసెలు. నాలుగుగుడిసెలు కలిసిన బయలుప్రదేశాలు 'పెంటలు' (పేటలు). ఉప్పునపల్లి, కూటూరుగట్లమీద రెడ్లఇళ్ళుకొన్నికూడితే అవి 'గుంపు'లు. చేలు–చెలకలు చేసుకునేందుకు స్థిరపడినవి 'వాడలు', 'పాలెములు' పల్లెలు' (గెడ్డవాడ, కుండవాడ, కానివాడ). ఆహారసేకరణచేసుకునే సంచారజీవితంలో గృహ నిర్మాణంలో శ్రద్ధ, తీరిక, అవసరంఉండవు. అదీకాక నల్లమలలు వర్షపాతం తక్కువగా గలపొడినేలలు. అపుడు 'చుట్టు గుడిసంత సుఖంలేదు...' కొండపోడుకూడా రెండు మూడుయేండ్లకు కొత్తచోట చేసుకోవలసివస్తే ఆకొద్దికాలానికి ఇల్లునుచక్కగా తీర్చి దిద్దుకోవడం కుదరదు. కాని కొండవ్యవసాయం సమిష్టి కుటుంబాలు శ్రమపడితే తప్ప దారికిరాదు. సమిష్టి కుటుంబాలకు, దీర్ఘచతురస్రంగా, లోపల కనీసంఒక్కగదితో వసారాలో నెగడుబసతో విస్తరించిన ఇళ్ళుకావాలి. ఇంట్లో ఏకాంతం దొరకక, సంసారానికి ఏ చెట్టుకిందకో చేరవలసినవాడు సకాలంలో పనికేమి అందుకుంటాడు? (అడవిలోవారికి భద్రత ఏమిఉంటుంది?) కుటుంబంమధ్య సహజీవనం ఏమి పెరుగు తుంది? ఈ అవసరానికి ఏ 'కొక్కిపాక'నో వేసుకుంటే ఒక ఆనందము, ఇంటి మీద మోజు (ఇల్లు సంస్కృతిలో ప్రధానమైన ఆస్తి) ఎలా కలుగుతుంది? అది అలుకులతో,

ముగ్గులతో, సత్తరతో(అటక), చక్కనినేతతో అందగించాలి. వ్యవసాయం ఇంటికి, ఇల్లు – కుటుంబానికి, కుటుంబాలు గ్రామానికి పరస్పరంఆధారాలు. వీటిలో సౌఖ్యము, సౌందర్యము ఐక్యతకు అవసరమని హెచ్చరించేది ఈ రాజులపదం. ఈ పాట 'మంత్రపుష్పం'లో 'ఆయతనవాన్ (ఇల్లుగలవాడు) భవతి' అనే ఆవృతిని గుర్తుచేస్తున్నది.

చేను చెయ్యవాలె – చేటపాక వెయ్యవాలె
బొక్కుదెంగవాలె – బొట్టెకెత్తవాలె
(పెళ్ళి చేసుకోవాలె – పిల్లల్ని కనాలె) అని కొండరెడ్ల సామెత.

మంచియిల్లే కాదు, పొలంలో వాలుగా చేటపాక దించాలి. వేటవలెకాక కొండ వ్యవసాయం ఆడమగ కలిసిచేసేది. ఈ పాకలలో అనుభవాలె సీతపదాలు (పొలి పదాలు) అయినాయేమో!

పెండ్లిచేయడాన్ని 'ఇల్లుచేయడం' అంటారు. పెళ్ళి నిశ్చయంకాగానే ఇల్లు కట్టుకొని కొత్తయింట్లో కాపురంచేయడం చెంచులపద్ధతి. తూర్పుగిరిజనులుకూడా పెళ్ళి చేసుకున్న తరువాత అత్తాకోడళ్ళ కలహాలకు తావివ్వకుండా వేరేఇల్లు కట్టుకొని ఉండడం లేకపోలేదు కాని, సమిష్టి కుటుంబాలుగాఉండి తరువాత విడిపోవడమే ఎక్కువ. వీరిఇళ్ళు ఏ పరిస్థితిలోను చుట్టు గుడిసెలు కావు.

ఇల్లు పుట్టుకతోనే అబ్బడం ఎంతఅద్భుతం! ఆహారాన్నిదాచుకోవడం, పనిముట్లు తయారుగా ఉంచుకోవడం ఎంత ప్రేరణను కలిగించే విషయం! అందుకే ఇవన్నీ గోదావరిలో పొడుపుకథలు.

'ఇసుకను మప్పిన వాడు' (చెదపురుగు)
'మంచుకు కుంచాన పట్టినవాడు' (తేనెటీగ)
'తంబలి తరిమెన పట్టినవాడు' (సున్నిపురుగు)
'తీడని (నూరని) కత్తి' (చెంగలి ఆకు)
'పేననితాడు' (సేమతకాయ) ❊

**గూపిపండుగ :**

కానివాడవైపు జరుపుకొనే గూపిపండుగ, 'డోలలకొలువు'. కర్మకాండ వినోదం ఎక్కువ.

'మన గూపికొలువులకు మీరు తల్లి దిగుడు
ఓ కానెవాడ దేవతలార మీరు తరలిరండు
ఎడ్లకొండనుండేటి ఓ కన్నమరాజు
మన గూపికొలువులకి మీరు తరలి రండో
ఇవదోటి దినమందు మీరు కదలి రండు
విచ్చేసి రాకుంటె విధంచేసి రండు'

గండిసీమలో భూమిపండుగనాడు ఉపవాసం చేసినవారు 'కోలలు' ఇచ్చుకుంటారు (తాడుతో దెబ్బలుతింటారు: 'దండశరణాలు'). లెంకలు ఆదెబ్బలకు పసుపు రాస్తారు. వ్యవసాయమంతా నటిస్తారు. పూజారి విత్తనాలను అందరకు పంచుతాడు. గొడ్లకు కుడుములుకట్టి వదులుతారు. ఒకరిమీదఒకరు చల్లగొట్టాలతో సరసంగా నీళ్ళు చల్లుకుంటారు.

"పుట్టినదట భూమిదేవుడు – పూరడి పిట్టలవన్నె
లే లే లేల లేలమ్మారో – ఓలే లేల లేల
లే లే లేల లేలయ్యారో – ఓలే లేల లేల
తారిదోయ్ భూమి దేవుడు – తాచుపాములవన్నె
పెరిగిదోయ్ భూమిదేవుడు – పేపమూలజమ్మి
ఈజమ్మో ఆజమ్మోయ్ – పాండవుల జమ్మి
పూసిదాట ఔజమోయ్ – పూవులతోటి మోగి
పెరిగిదాట ఔజమోయ్ – పిందెలతోటి మోగి
కాసిదట ఔజమోయ్ – కాయలతోటి మోగి

పండినార పండ్లకోయ్ – పక్షులయిన చేరె
దుల్లినార పండ్లకోయ్ – దుప్పులైన చేరె
రాలినార పండ్లకోయ్ – రాలెలైన చేరె (రాలెపిట్టలు)

పూసినార పండ్లకోయ్ – పూరండ్లయిన చేరె
పూరండ్లకు సాధింపులు – వారెవ్వారు రాజ
పూరండ్లకు సాధింపులు – చాయగ మతులవారు
పూరండ్లకు సాధింపులు – లెంకల పూజార్లు
సత్తెముగల్ల భూమిదేవి – కాచికాపాడు
ఐదలరాజుకు లెంకల పూజార్లు – సాయగ మతులవారు
సత్తెముగల్ల భూమిదేవి – కాచికాపాడు"

కృతజ్ఞతలు చెల్లించుకునేది రాజులపండుగకాగా, భూమిపండుగ ముందు ముందు కృషిసఫలంకావాలని చేసేపండుగ. భూదేవిఅవతారాన్నివర్ణించి, పూవులతో, పిందెలతో, కాయలతో, పండ్లతో తమకు కలిగినకొద్దీ పండుగచేస్తామనే విన్నపాన్ని ఔజంమోతకు అన్వయించగా (పూవులనాడు పూవులమోత – కాయలనాడు కాయలమోత) రసాత్మకత సంతరించుకున్నది. జంతువులు, పిట్టలపాలుకాకుండ తమపంటలను కాపాడేశక్తిని పూజార్లకు, లెంకలకు అనుగ్రహించమని ప్రార్థిస్తున్నారు. పూజారి క్షేమమే (నాయకుడు – పురోహితుడు) గ్రామసౌభాగ్యానికి శ్రీరామరక్ష. ❉

**కూరపంది = కుర్రపంది**



**ఒంటర్గాడు, ప్యంది = పంది,**
**ఒంటర్ప్యంది, బిడ్లగాడు**

## గోదావరి – విశాఖతెగల వ్యవసాయంలో తారతమ్యాలు :

గోదావరి నగరిబసలో 'కొండదయ్యాలపండుగ' (రాజులపండుగ) 'కొత్తలు కలపడం', విశాఖలో 'పెద్దలపండుగ', 'వెన్నులుముంపడం'గా కనిపిస్తుంది. ప్రతియేడూ జరుపుకొనే నందిపండుగలో ఆటపాటలు అంతగాలేకున్నా మూడేళ్ళకోసారి, విడిచి పెట్టిన పొలాలను సాగులోకితెచ్చే సందర్భంలో జరుపుకునే పండుగలో, తల్లి పండుగ కాబట్టి వేడుకలను గేయగాథ చిత్రిస్తున్నది. నందిపండుగ జరిగిన తరువాతనే కొండకు వెళ్ళి చీపురుకోయడానికి, రాజులపండుగ తరువాతనే సోపువేట సాగించడానికి, అటవీ ఫలసాయం సేకరించడానికి అనుజ్ఞదొరికినట్లు భావిస్తారు. రాజులపండుగలోని విన్నపాలు, గూపికొలువులోని తంతులు, సరదాలు భూమిపండుగలోని ఆకాంక్షల మీద విస్తరిల్లిన గోపురం నందిపండుగ, కొలువుపండుగ. ఈకొలువులోకి పోయేముందు ఈజాతుల వ్యవసాయచైతన్యాన్ని పరిశీలించడం అవసరం.

### దృగ్విషయం – దృక్పథం :

విశాలమైన బయళ్ళు, అత్యధిక వర్షపాతంగల విశాఖమన్యంలో, నాగలి పశువులతో చేసే దమ్ముువ్యవసాయానికి వీలు కలిగింది.

గోదావరి, విశాఖజిల్లాల ఋతుచక్రం మౌలికంగా ఒకటేఅయినా విశాఖలో విశేషాలు అక్కడి అదునులో మార్పులను సూచిస్తాయి. దూలవిడినెలకు మామిడి (మే) రాలుతుందని – పెద్దవిడికి (జూన్) మామిడి పేరులేకుండా పోతుందని – కొండరెడ్లలో ఫల'సేకరణ'స్మరణ. అడవిలో మామిళ్ళన్నీ ఇంటికలపగా మారిన విశాఖలో దూలవిడి అనగా దూలపురుగుపడే నెల. తూర్పుగోదావరిలో 'పెద్దవిడి' నెల, విశాఖలో 'బందపని' (బంద=బురదనేల)గా మారింది. 'బందపనిలో బండెడువర్షం – బండెడుగాలి'. 'అవిటి' అవిటిపురుగుపడే నెల. 'అవిటికివేస్తే ఆకైనానాటుతది' అని విశాఖవారి అనుభవం. 'మునుకోలు'కుకూడా ఆపేరిటి పురుగులుపడే నెలగా విశాఖపంచాంగం. మునుకోలుకు వర్షం, ముసురువల్ల బయటకు తేలలేక ముద్దచేసుకుని ముడుచుకొని కూర్చోవాలిఅని విశాఖలోవ్యాఖ్యానిస్తే మునుకోలులో బొంతచేలుపండి (తృణధాన్యం) తొలిముద్ద అందుతుందికాబట్టి 'మునుకోలుకుముద్ద' అని గోదావరిలో కాలజ్ఞానం.

సంస్కృతి సర్వాంగీణంగా వికసిస్తుంది. గోదావరి పిల్లలు చిన్నతనంనుండి విల్లు పడతారు. చంటిపిల్లల ఆటవస్తువులలో విల్లు ప్రధానమైంది. అన్నప్రాశననాడే 'పేరు ముద్ద ముట్టో - విల్లుబద్ద పట్టో' అని పట్టిస్తారు. పిట్టలను వేయడానికికూడా విల్లునే గోదావరిలో వాడుతుండగా, విశాఖలో విల్లు అంతరించి ఉండవిలుబద్ద (ఉండేలు) వ్యాప్తిలోనికి వచ్చింది.

దట్టమైన అడవులలోఉండే కొండరెడ్లకు అడవిజంతువులంటే సరదా. అడవిరాజు లంటే భక్తి. విశాఖగిరిజనులకు అడవిరాజులు దానవులు, అడవి జంతువులంటే భయం. అడవిలో ప్రతిభాగాన్ని గూర్చి కొండరెడ్లవలె చురుకుగా వ్యాఖ్యానించలేకపోయినా, ఊళ్ళో పొలాలకు ఎన్నోపేర్లు, ఎన్నోకథలు చెబుతారు. ఇవన్నీ ఆస్తితగవులలో తిరగతోడు కుంటారు. చూసేచూపులో మార్పుతో దృగ్విషయమే క్రమంగామారిపోతుంది. సమాజం కొత్త వ్యాఖ్యానాలను వెతుకుతుంది. అందుకు తగిన సంస్కారాలకు ఒరవడి దిద్దుతుంది. సంస్కారంలేని జ్ఞానం గుడ్డిది. జ్ఞానంలేని సంస్కారం కుంటిది.

**గిడసబారిన వ్యవసాయం :**

విశాఖమన్యంలో - మంచు తట్టుకోవడానికి దృఢమైన ఇళ్ళు కట్టుకోవలసి వచ్చింది. వెచ్చదనాన్నిచ్చే లోవరుసకూర్పుకు కలప, నేతకు గడ్డి, విస్తారంగా దొరకక పోవడంవల్ల కొత్తయిళ్ళు కట్టుకుంటూ, కొండచేలు మార్చుకుంటూ వలసపోవడం వలనుకాక - ఉన్నచోటనే ఉత్పత్తి పెంచుకోవలసివచ్చింది.

పశుపోషణలో శ్రద్ధలేకపోవడంవలన బక్కచిక్కినఎడ్లు నేలనులోతుగా దున్నలేవు. అక్కడక్కడ ఊటలవల్ల 'ఎండ్రిక నీళ్ళు' (ఊటనీరు నిలచినచోట ఎండ్రికలు భూమిలో నుండి పైకి దారిచేసుకొని వస్తాయి) నిలచి పైపై దుక్కికి 'గడ్డవిరుగదు'. ఆరుదలతో నేలగుల్లబారదు. రెండుపంటలు వేసేటప్పుడు ఈ ఆరుదలకు అవకాశం మరీతక్కువ. నీటితో కరిగి లోపలికి పోయిన పై పొరలలోని లవణాలు నాగలికర్రుకందక లోపలే ఉండిపోతాయి.[9] కోటపొలాలలో ఒండ్రు జోరెలవెంట కొట్టుకుపోతుంది. కొండచెలకల పరిస్థితి మరింతశోచనీయం. ఒకటిరెండు సంవత్సరాలకే మట్టి పూర్తిగాపోయి రాళ్లు బయటపడి ఈచుకుపోయినపశువుల్లా ఉంటాయి. గెత్తంతోలినా గెత్తం కుళ్ళబెట్టడంలో శ్రద్ధలేనందున అది నత్రజని పుంజుకున్న సేంద్రియపుటెరువుకాదు. ఎప్పటికప్పుడు

కొత్తచేను నరుక్కునే కొండరెడ్లలో 'పిందెపట్టిన చేనుచేయకు' అనినానుడి (పిందెపట్టిన= పాతపడిన). చేసినపొలాలనే చేయవలసిన విశాఖలో 'మడికిగెత్తం (ఎరువు) బడికి బెత్తం', 'దేవుడులేని గుడి – కలుపుతీయనిమడి' అనిసామెతలు. ఎరువువేయడం కలుపుతీయడం పల్లపువ్యవసాయంలో చాలాముఖ్యం. మూడేండ్లకొకసారి భూసారం పుంజుకోవడానికి బీడుపెడతారు. పిప్పలిదొడ్డి 'కవ్విన' (తవ్విన) తరువాత ఇది తప్పనిసరి.

ఇప్పటికీ కొండ వ్యవసాయం తప్పనిది కొండదొరలకు మాత్రమే. వ్యవసాయం పెరిగి వేటలోనేర్పుతగ్గి అడవి శత్రువైంది. అడవిజంతువులవల్ల పెంపుడు జంతువులకు ప్రమాదం. 'అడవికిపోతే మసి–ఇంటికివస్తే పసి'.

## <u>విశాఖమన్యం వ్యవసాయంలో సమస్యలు - పరిష్కారాలు</u>

**భూమి:** పాతచేలు, ఉగంకొట్టడం, ఎండ్రికనీళ్ళు, నీటికట్టులు

**అడవి:** క్రూరజంతువులు (దానుగుడు)
అడవికిపోతే మసి – ఇంటికివస్తే పసి

**వ్యాపారాలు:** తూరుపు కుంచం–పడమర కుంచం (తూకాలలో మోసాలు)
చింతలుపూస్తే చెడ్డకాలం, మామిళ్ళుపూస్తే మంచికాలం
(మోతబరువు ఎక్కువ, ధరతక్కువ)
ఆరువేయుల పూరుబయలు (సంతలలో మాయలు)
పల్లాన పదివేయులు (అప్పులు, వడ్డీలు, మోసాలు)

**ఉళ్ళో పరిస్థితులు:** మిత్తికోసం గొత్తిపని, చెడుపులు (అసూయ)
తగవులలో మెలికలు (విత్తుదే పంట × చేనుదే పంట)

**తమకు వీలైన పరిష్కారాలు:**

దేవుడు లేని గుడి – కలుపు తీయని మడి
మడికి గెత్తం – బడికి బెత్తం, అదుపులేని ఆలి – వెలుగు లేని చేని
పిందె పట్టిన చేను చేయకు – కొత్తచేను కోమటివాడి దుకాణం
అడవికి పోతే మసి – ఇంటికి వస్తే పసి
పనిముట్లకు 'పదును పూయించుకోవడం'

**బయటి సహాయం:** విత్తనాలు (అన్నమూలదేవి), ఎద్దులు (నందమ్మ),
భూమికిపట్టా (తాతసుంకమరాజు), కోలన్న (గ్రామనౌకరు)

## నంది, కొలుపుపండుగలు :

ఈ పరిస్థితులలో చాలీచాలని బతుకులను ఆదుకోమని మొరపెట్టుకోవడం తప్ప చేయగలిగిందిలేదు. 'తీరిపోయినకళ్లానికి–కోళ్లుకోస్తే పండదు' అని గిరిజనులకూ తెలుసు. అందీఅందని ఆయాసంలో, ఆశ నిరాశలలోనే కొలుపులు మొదలవుతాయి. ఎడారిలో వర్షాలుపడతాయని ఎవరూయజ్ఞాలుచేయరు. ఒక విశ్వాసాన్ని తనజ్ఞానానికి, ఆచారానికి అనువుగామలచుకొని ఆచరించి సమాజం ఆశపడుతుంది. నాగరికత తాకిడితో ఆశలు, అవసరాలు పైబడుతున్నా, అవకాశాలు పెరుగక అలమటిస్తున్నప్పుడు దిక్కుతోచని వివశత్వంలో నమ్మకాలు, విశ్వాసాలు మరింత పెత్తనంచేస్తాయి. గ్రామపెద్దలు స్వార్థంతో ఈకొలుపులు, జాతరలను కుటీరపరిశ్రమలుగా మార్చుకొని డబ్బుదండుకొంటారు. ఆయుధీకరణంలో పోటీపడడం ప్రపంచశాంతికి ఎలా పరిష్కారం కాదో అదేవిధంగా మితిమీరిన మంత్రతంత్రాలు వాస్తవసమస్యలను పరిష్కరించవు. కాని ప్రతివారూ తమకుతోచినట్టు చేయకమానరు. గేయగాథలు సజీవమైన చరిత్రలు కాని మంత్రతంత్రాలుకావు.[10] కర్మకాండ, మానసిక భూమికలో శాస్త్రప్రయోగం వంటిది. జానపదులు ఊహించుకునే భవిష్యత్తు, గతానికి–వర్తమానానికి అనువైనది. మనలోవలె పాలకవర్గం మారినపుడల్లా సిద్ధాంతాలు విధానాల అమలులో కొత్తపద్ధతులు, సమస్యలకు సరికొత్త పరిష్కారం ఇటువంటి మార్పు జానపదుల ఊహకందదు. అటువంటి సమాజం ఏవిధంగా చరిత్రను అన్వయించుకొని, అవగాహనను పెంచుకొని, సవరించుకొని ముందుతరాలకు అందిస్తుందో ఈ గేయగాథలలో గమనిస్తాం. ❊

## వ్యవసాయ చరిత్ర - నందిపండుగ :

ఒకప్పుడు విశాఖమన్యమంతటాచేసే ఈనంది, కొలువుపండుగలు ప్రస్తుతం దోరశి, పసిబయలులలో మాత్రమేచేస్తున్నారు. గంగరాజు మాడుగులవద్ద కుంబిడిసింగి గ్రామం పాటపూజార్లకు పుట్టినిల్లు. ఒకరిద్దరుతప్ప పాటపూజార్లందరూ కొండదొరలే. వాల్మీకులగ్రామంలో దొరికితే వాల్మీకిపూజారిని, కమ్మరులగ్రామంలో కమ్మరిని పిలుచుకుంటారు. గోదావరిజిల్లాలో పూజారికి లెంకలు తోడుపడినట్లే ఇక్కడకూడా పుట్టుపూజారికి పాటపూజారి, దొంగపూజారి, మట్టుమలపరి సహకరిస్తారు.

భారతదేశానిది వ్యవసాయ సంస్కృతి. వివిధ దేశకాలాలలో వ్యవసాయం సమగ్రంగా వికసించింది. సీత అంటే 'నాగేటిచాలు'. పాండవులున్నచోట పాడిపంటలు ఉంటాయి అని మననమ్మకం. 'మువ్వలరోకలి, గవ్వలచేట సీతమ్మకు–పులితోక, పట్టెడ తాడు పాండవరాజుకు చెల్లు'నని రాజులపదం. ఇక నందిపదంలో చొరవ తీసుకుని పాండవరాజుకు సిరిసీతపాపకు పెండ్లిచేశారు. కుంతీదేవికి కన్నెరికానపుట్టిన కోలన్న పాండవులను ఆదుకుంటూంటాడు. పాండవులు కౌరవులతో ఓడిపోతారు, ఇప్పటికీ ఇంకా గెలువలేదు.

భారత, రామాయణాలు నిశ్చయంగా ఆసియాఖండపువిలువలకు దారిదీపాలు. వివిధభూభాగాలలో అనేకఆరాధనవిధానాలు ఆతత్త్వాన్ని తమసంప్రదాయాలకు అనువుగా వ్యాఖ్యానించి ఔదలతాల్చినట్లే, అక్షరజ్ఞానంలేని జానపదులు వాటిని పాడుకుంటూ తమఊహలకు, దృక్పధానికి అనుగుణంగా మార్చుకున్నారు. అవసరము, అన్యోన్యతతప్ప, జీవితాన్ని ధారపోయవలసిన ఆశయాలు వ్యవస్థాపరమైన బాధ్యతలు లేని సమాజాలలో ఆ పౌరాణికపాత్రల చిత్రణం ఎలాఉంటుంది? ప్రకృతిలో తమనూ ఒకభాగంగా భావించుకునే గిరిజనులు ఈసంస్కృతి ప్రవర్తకులను తమదేవతాగణంలో ఇముడ్చుకుని, ఆదర్శమూర్తులుగా ఎలాస్వీకరించారో వివరించే ఈపండుగపదం, కేవలం సాహితీకౌతుకంతో విస్తరిల్లిన ఊహలవిలాసంకాదు. గతంనుండి భవిష్యత్తులోకి చైతన్యాన్ని నడుపుతున్న జీవనాళిక - వర్ధమానజానపద గీతిక. ❊

విశాఖజిల్లా చింతపల్లిమండలం, లమ్మసింగిలో పాండవుల విగ్రహాలు



## నందిపదంలో ప్రధానపాత్రల చుట్టరికాలు




**పదం సారాంశం –**

**అంబటూలరాజు – అన్నమూలదేవి :**

ఘనులు, మునులు, గంధర్వులు, ఘనకోటిదేవతలు సభచేసిరట. నాలుగు దిక్కులకు గణాచార్లనుపంపి 'ఏ విత్తుదొరికినా పట్టుకురావాలె యీఅవతారంకోసం' అనిపంపించినారట. తూర్పువారికిదొరికిన విత్తునుండి కుర్రది, కుర్రవాడు జన్మించారు. వాళ్ళను చెరోదిక్కునపెంచారు. మంచిపాయం అయినాక తీసుకుస్తే అన్నాచెల్లెలుగా గుర్తించుకున్నారు. అపుడు మాకలి(మహాంకాళి)శక్తినిరావించి వీళ్ళిద్దరిజీవితీయకుండా

మాంసంపీల్చి రూపుమార్చమన్నారట. అయినతరువాత వారిద్దరికీ పెళ్ళిచేశారు. వారికి పుట్టినవాడే అంబటూలరాజు. అతని భార్య అన్నమూలదేవి. అతడు పోడునరికి మధ్యాహ్నం ఎండకు చెట్టునీడన సేదదీరేసమయాన దాహానికి పొన్నబావి చెరువువద్ద పార్వతి రథందింపించింది. ఆ ఏకాంతంలో ఆమె పరమేశ్వరుని 'మోహించు'మని కోరింది. పరమేశ్వరుడు ఒప్పుకోక తప్పలేదు. వారి రతిక్రీడకు ఏడుయోజనాలగడ్డి కదిలిపోతున్నది. ఇదేదో జంతువు కదులుతున్నదని అంబటూలరాజు 'మొగలిపూవు తుపాకి' ఆజాడన పేల్చినాడు. తమఆనందానికి కలిగిన అంతరాయానికి పార్వతి కోపగించి 'ఎవడోవాడు స్త్రీమొహంచూడకుండా అడవులుపట్టిపోవాలి' అని శపించిందట.

## ఆసివేయులపట్నం - ఆసివేయులపాప :

అంబటూలరాజు ఆసివేయులదేశం అంటే మన్యం వెళ్ళి ఆసివేయులపట్నం (పండుగగ్రామం) చేరి ఆసివేయులపాపతో కాపురంచేస్తున్నాడు. అంబటూలరాజుకు చల్దులుమోస్తున్న అసివేయులపాపకు పుట్టనుచూసి పాముమాంసం (వేవిళ్లు) తిన మనసైంది. అంబటూలరాజు పాముకోసం పుట్టదగ్గరకు వెళ్ళాడు. ఆడబొట్టెపుడితే కోడలుగా యిమ్మని-మగవాడుపుడితే పొడిచిచంపుతానని మాటతీసుకొని తల్లేడునాగు పామునిచ్చింది. ఆసివేయులపాపకు దేవగుమ్మడిపండు జన్మించింది. దాన్ని గోర్జలో (మందదారి) పారవేశాడు, చింతగొల్లపాప ఆ దేవగుమ్మడిపండును ఏరుకొని కోయబోగా సత్తెపాండువరాజు జననమందినాడు. మాటప్రకారం పాముపచ్చి కాటువేస్తే, తొండ గురువు విషందించివేసినాడు.

## గౌరమ్మ - నందమ్మ - బండిబసవన్న :

ఆ పాండవరాజు చిలుకుచిక్కెం, చిట్టగొడ్డలి ఏరుకొని అరణ్యంమీద పోతుంటే నందమ్మ వాడిని కోరివచ్చినదట. నాగళ్ళపురికి (పాతాళం) పుట్టినది నందమ్మ 'మేము నిన్ను భరించలేముతల్లీ' అని పాండవరాజు మొత్తుకున్నాడు. 'నేను పుట్టలోఉంటాను. సంవత్సరానికి ఒకసారి పండుగచేయి, నెలకో సత్తెవర్షమిస్తా'ననిచెప్పి పుట్టలోకి వెళ్ళిపోయింది. ఆ పుట్టకోటవారింటికి (చెదలనైనవారు) మిందె, తొండ, బల్లి గురువులను పెండ్లిపెద్దలుగాపంపి పిల్లనడిగించి తెస్తుంటే 'కీసుబాసుదేశం కిముడు

నందపురం' వాడు దొంగపూజారి దొంగచేస్తాడు. వాడిని దండించి నందమ్మను విడిపించి పాండవరాజుకిచ్చి పెళ్ళిళ్ళుచేసి నందమ్మను అనిపివేస్తారు.

## నందిపదంలో మిత్రులు




## నందిపదంలో శత్రువులు




### గొంతెమ్మ - కోలన్న - భీమన్న :

పాండురాజుకు, గొంతెమ్మకు పాండవులు జన్మించారు. కుంతికి కన్నెరికాన పుట్టినవాడు కోలన్న. వాడుపుట్టగానే కరువు వచ్చినదట. భీముడు అన్నమూలదేవికి (అంబటూలరాజు దిగువన వదలివచ్చిన భార్య) కోలన్నను అమ్మిగింజలుతెస్తాడు. అవి అప్పుడేచెల్లిపోగా పాండవులు కృష్ణునిదగ్గర గోవులుదొంగిలించి ఆమాంసం తినబోతారు. ఇంతలో కొండదానుగుడుతో యుద్ధంరావడం - ఆవుమాంసం తినకుండా కృష్ణుడు అడ్డుపడడం జరుగుతాయి. భీముడు దుగ్గలబోయునితోటలో పంటను దొంగిలిస్తాడు.

### కుప్పకొక పన - పనకొక కుప్ప :

ఈవిధంగా బతుకు వెళ్ళదీయలేక అన్నమూలదేవివద్దకు విత్తనాలకోసం భీముడు వెళ్ళాడు. ఎంతపోసినా వాడి కొసరికాయతుంబ నిండకున్నది. నీకు కుప్పకు ఒక్కచాటెడు ధాన్యం అవుతుందని అన్నమూలదేవి శపిస్తుంది. గొంతెమ్మ 'పనకోకుప్ప వేయి, కుప్పకుచాటెడుధాన్యం అవుతుంది'అని శాపంతప్పించుకునే మార్గం భీముడితో చెబుతుంది.

**పిట్టగడ్డ – జాలంపల్లి – పట్టపుకోలన్న :**

తాతసుంకమరాజు వద్దకువెళ్ళి దీవెనలుతీసుకుని రమ్మని కోలన్నను పంపుతారు. మధ్యలో సత్తేడుసంద్రాలు దాటడానికి తాబేలుతారప్ప సాయంచేస్తుంది. తాతసుంకమ రాజు ఇచ్చిన కృష్ణతామరరేకందుకుని వస్తాడు కోలన్న. పంటలు పండుతాయి. పాండవుల లక్కమేడలు, గాజుమేడలు కాలిపోగా – మురుదెలుక (గురువు) సొరంగం తవ్వి ఆ దారిగుండా వారిని తప్పిస్తుంది. తెల్లచేపల సాయంతో సముద్రం దాటివారి నేస్తులు ముసలిబోయలవద్దకు చేరుకుంటారు.

**వనుంగుపల్లిగంత – గురపనుకు దిమడాలు :**

పాండవరాజు చనిపోయినపుడు పూడ్చిపెట్టడానికి ఎంగిలికానినేల (చీమలు, పందులు, చెదలుదేవని) దొరుకక తామే శవాన్నితినడానికి సిద్ధపడతారు. శవాన్ని తింటే పాండవులు పట్టశక్యంకానంత గొప్పవారవుతారని కృష్ణుడు తనగుండెమీద చితిపెట్టి దహనంచేయించినాడట. ఈమధ్యలో ఎప్పుడో శవాన్ని కాపలాకాస్తూ సహదేవుడు ఒకవేలు తినివేసినాడు. అందువలన వాడు తెలివిగలవాడై పశువులనాయకుడైనాడు. సహదేవరాజు 'వనుంగుపల్లి' గంతవెనుక గురపనుకు దివాణాలుదిగి మందలగిరి పర్వతాన పశువులుమేపుతున్నాడు. దుర్యోధనుడు, కర్ణుడు ఆపశువులను బంధించడానికి వచ్చారు. ఆ యుద్ధంలో అడవిమృగాలు, పశువులు చెదరిపోతాయి. భీముడువచ్చి ఎగువకు పారజల్లినవి అడవిజంతువులు, దిగువకు పారజల్లినవి ఊరజంతువులైనవట.

**దానవుల బోడమర్రి – తాతవారి భూములు – గారమూలకోట :**

పాండవులు దుర్యోధనుడి 'గారమూలకోట'ను జయించాలని బయలుదేరతారు. అర్జునుడు కీలుపోయినరథాలకు కీలులు, మేకుపోయినరథాలకు మేకులు అమర్చినాడు. పెదమాడుగుల గంతవెనుక దానవులబోడమర్రిదగ్గర తాతవారిభూములలో, ఏనుగు చిక్కుల్లో దాచిన కోటిగుంపుల హరివిల్లుతీసి అర్జునుడులాగితే దోనగిరి, మలయగిరి, జలగంటపర్వతాలు హోరుహోరుమని ఒకటేమోత. కాని అటువైపునుండి కర్ణుడురథాలు పంపిస్తే మేఘమండలం, చుక్కలమండలం, సూర్యమండలం, నీలమండలం, పాల మండలం దద్దరిల్లిపోతున్నవట. నల్లరాళ్లు బద్దలించుకొని పోతున్నవట. గుమ్మడి కాయంత, గంపంత, అగ్గినిప్పులవాన. ఆకాక ఓర్చలేక పాండుగులు గడియకో, గంటకో పడిపోవటం–పాండవులులేకుంటే ఉగమేల జగమేల అని కృష్ణుడు మాయచేసి కర్ణుని

చంపించినాడు. కాని పాండవులుగారమూలకోట మళ్ళించడంలేదు. అదిదుర్యోధనుడికే 'అమలై'ఉన్నది. పాండవులు కరిపురనగరం తపస్సుకు వెళ్లారు. ఆలోకానలేరు, ఈ లోకాన లేరు; తపస్సు పండితే వస్తారేమో.

**మత్స్యరాజులు – నాగరాజులు :**

ఇటువంటిదే మరోకథ. మత్స్యరాజులను నాగరాజులు చంపసాగాయి. మత్స్యదేవత తన సంతానాన్ని మఠంలోని మత్స్యలింగేశ్వరస్వామి రక్షణలో ఉంచి తాను నాగరాజులతో పోరాడడానికి ఆరుళ్ళలోని గమ్మేలివద్దనున్న మత్స్యపర్వతానికి వెళ్ళిందట. దానుగుడికి – భీముడికి, పాండవులకు – కౌరవులకువలెనే, జలదేవతలైన మత్స్యదేవతలకు – క్రూరజంతువులైన నాగులకు మధ్యవైరాన్ని ఈ కథ వివరిస్తుంది.

ఈ కథలకే అంటుకట్టినది వెలమరాజుకథ. ఆసివేయులపాప – అంబటూల రాజులకు వెలమరాజు జన్మించినాడు. వారిగర్భానపుట్టినవారు రామన్న, లక్కన్నలు. కొండపోడుకు పొయినపుడు ఒకమాయజంతువు వెలమరాజునుచంపేసింది. రామన్న, లక్కన్నలు ఆజంతువుజాడపట్టిపోగా అదిఆడరూపందాల్చి బోదరాజుపట్నాన పొన్నబావి చెరువుకు వెళ్ళింది. పెళ్ళికూతురుగా మారిన ఆ జంతువుఅన్నంపెడితేనే విందు భోజనానికి వస్తామన్నారట. అన్నంవడ్డిస్తూ పెళ్ళికూతురు అసలురూపుతో మీదపడబోతే రామన్న, లక్కన్న పొడిచేశారు. ❊

**నందిపదంలో ప్రదేశాలు**



# నందిపండుగలో వారంరోజుల కార్యక్రమం :

బుధవారంనాడు పాటపూజారిని పండుగగ్రామానికి 'తీసిమోస్తారు' ఆరోజు గన్నికలు (కన్యలు) వలచడం: చిక్కుడుపసరుతో పుట్టుపూజారింట దేవతలబొమ్మలు గీయగా ఆవెంటబొట్లుపెడతారు. అప్పఏడుగురు జలగన్నికలు, శ్రీకృష్ణుడు, దొడ్డగుర్లు, ద్రోణాచార్లు, కామధేనువు, మునులు, ఘనులు, గంధకర్తలు, గురువులు మొదలైన వారు.

గురువారం శంకుదేవుడిచావడికి (గ్రామదేవత) పల్లకీలు (చేటలు) మోస్తారు. ఆ చేటను పూనినవాడుపడితే అది 'పుట్టుపూజారి, మట్టుమలపరి' ఇంటి మీదుగా పిల్లలున్న పుట్టకేపోతుంది. (పిల్లలు=కూటిపురుగులు=చెదపురుగులు) పుట్టకుకాత (ప్రధానంసామగ్రి) మోసి, కల్లుపోసి ఓలియిచ్చి కొత్త చీరంటించి కూటిపురుగులు తోసిన మన్నుతో నాలుగు నందులుచేసి చావడికి తీసుకొస్తారు. నందులకు వన్నెకూర్చి సూర్యచంద్రులకు చూపించి లోపలకు మోస్తారు.

చావడిలో గద్దెవేయడం :- ధాన్యంమీద పచ్చిమంటికుండ. దానిమీద గొంతెమ్మ పూనిన పదిపన్నెండేండ్ల పసిబాల. చుట్టూ రాచెలుకదుంపలు, పిట్టగద్దెలు, పేము జంబిలి, కముజు, కొక్కెర్లు, భీముడిజటతీగలు, పారుటాకులు, గడ్డసారుకూర, అరటి చెట్టు, భీముడిరోకలి, అర్జునుడిహరివిల్లు, ఉన్న దేవతలకు బెత్తరివ్వలు - పేరుస్తారు.

శుక్రవారం నందులకు పెండ్లి వేడుకలు. కులం తిండి.

శనివారం పెళ్ళిసామానులకోసం సంతచేయడం, నందులకు ఊరేగించడం - సాయంత్రం దొంగలాడించిన తరువాత తల్లినందిని 'అనిపేస్తారు'. సారుదుంపతో చిన్న నందిపిల్లను చేస్తారు.

ఆదివారం పాండవయోగం పూనినవారు శివాచారులు పీడపిశాచి తాపడం తీసేస్తారు.

సోమవారం ఉన్ననందులను (సారుదుంప) అనిపేస్తారు.

కంచునగరిజోడును (కంచుకంచం), దనితో (ఉంగరంవేలు) మ్రోగిస్తూ పాటపూజారి పాటపాడతాడు. ❈

## నంది పదం :

వచనం : డెబ్భైమంది దేవగుర్లు గణాచార్లు సభసేసిరట. తూరుపు పదిమంది, పడమరపదిమంది, దక్షిణంపదిమంది, ఉత్తరంపదిమంది ఏ విత్తుదొరికినా పట్టుకుని రావాల; ఈ అవతారంకోసం. తూర్పుదిక్కువారికి దొరికినది. పిట్టతిన్నదో, కాకితిన్నదో పుచ్చుపాదు గిడ్డఒకటిపడివుంటే విత్తుసరకేనని తీసుకొని మర్రివృక్షంక్రింద సభసేసిరట. రోజూ నీళ్ళుపోయడం ఒకకొనపారిది, ఒక పూవుపూసిది, ఒకకాయకాసిది. పండిపోగా చేపుకత్తి తీసికొని బద్దలుచేసి చూసినారు. అన్నచెల్లెలున్నారు. తూర్పుభాగం కుర్రదానికి ఉత్తరభాగంకుర్రవానికి ఇచ్చేశారు. మంచియీడుపాయం అయింది తీసుకువచ్చారట. పెళ్ళిచేద్దామని డేరాఅవతల కుర్రవానికిపెడితే వారిద్దరు అన్నచెల్లెలుగా అనుకున్నారట. పంపించి ఏడుసంవత్సరాలతరువాత పిలిపించారు. అపుడూఅంతే. అపుడుమాకలిశక్తిని కావించి వీరిజీవి తీయకుండా రూపుమార్చేయమన్నారట. మాంసంగుంజేసి రూపకం మార్చినాది. అప్పుడు అన్నచెల్లెలుకు కల్పితంచేశారు. అలాగుండగ అన్నమూలదేవి, అంబటూలరాజు వారేపుట్టినారు. కుర్రది అన్నమూలదేవి, కుర్రవాడు అంబటూలరాజు పెండ్లాడినారు. అంబటూలరాజు అంటే పాంట్రాజు పోడునరుకుతూ అలసిపోయి మధ్యాహ్నం పిట్టబొట్టంత దాగుపడిపోయున్న వేళ జంబనేరేడుచెట్టుకింద నిదురలు తీస్తున్నాడు. అంతలో పార్వతీపరమేశ్వరులవారు రథంమీదపోతుంటే పొన్నబావి చెరువుకాడ పార్వతి 'నాకు దాహమేస్తున్నది రథమాపు' మన్నదట. 'అహ! అలా ఆపడానికికుదరదు మనకు తోవదొరకదు. ఇందుకోసమే ఆడదానితో అడవినడియ కూడదు అన్నది' అన్నాడు పరమేశ్వరుడు. 'కాదుకాదు ఈగచచ్చిది, దోమచచ్చిది, రంకుచేసిది, బొంకుచేసిది మనమేచూడవాలె' అని బలవంతం చేయగా రథమాపినాడు. గంగతాగిదిపార్వతిదేవి. ఇసుకదిబ్బలోన పులుగులాడుతున్నాయి. 'జంతువులకే మోహమున్నది మనకులేదా' అన్నది. 'కాదు నడమదారి దొరకదు. పిట్టచూస్తది, బొట్టచూస్తది' అన్నాడు పరమేశ్వరుడు. ఏంపరవాలేదు. ఆడబొట్టె కోరిక ఎక్కడైతెనేమి' అని పార్వతి తొందరపెట్టింది. పరమేశ్వరుడు పార్వతి మోహిస్తున్నారు. ఏడుయోజనాల గడ్డి కదలిపోతున్నది. ఇదేదో గొప్పజంతువని బొట్ట వేలుచూసి కొట్టేసినాడు అంబటూల రాజు. 'ఇందుకోసమే ఛీ! మానంమర్యాద పోయింది. ఎవ్వడోగానిఇంటి మొహంచూడ కుండ, స్త్రీమొహంచూడకుండ అడవులెంట దెంగేయవాలె, అనిపార్వతి శపించింది. ఇంటికిరాకుండ తుపాకిపట్టుకొని పారేపోయినాడు. ఆసివేయులపట్నం వెళ్లినాడు. ఆసివేయులపాపతో ఉంటున్నాడు.

## నందిపాట :

జోర జోర జోర – పంచ పాండవులార॥ (జోర = శరణు)
తొక్కిన భూదేవత – తోడుగాయవలె
మట్టిన భూదేవత – మనసు గాయవలె
ఎఱ్ఱబూసవల్ల – ఎలుగులెత్తవాలె
పచ్చబూసలవల్ల – పలుకు లాడవాలె

తెలిసిన నుడుగులు – తేల జెప్పవాలె (నుడుగులు = కథలు)
మరచిన నుడుగులు – మతినిగొలుపవాలె
కంచునగరి జోడు – కదలి మోగవాలె
కల్లుతాగితీమి – కమముతప్పితీమి
కూడుతింటిమి – కులముతప్పితీమి
తప్పులొప్పులు మాకు – దయను జూడవాలె

**మన్యందేవతలు :**

లోతుగడ్డనున్న – వీరభద్రుడ
లంబసింగినున్న – బాలరాకాసమ్మ
బోడకొండనున్న – శాంబరమ్మ నీవు
మాడుగులనున్న – మత్స్యకంబేరమ్మ
కొండకంబేరున్న – నీలకంఠుడ

ధమ్మము సావడి – మనము చేరవాలె
ఎటువెళ్ళినారో – పంచపాండుగూలు
బాలనందులకు – భకితి చేయవాలె

**జలగన్నికలు :**

అప్పయేడుగురు – జలగన్నికలు
పులులకూతురు – పుష్పగన్నికదేవి
నాగుల కూతురు – నల్లగన్నికదేవి
ఎలుగుల కూతురు – ఎఱ్ఱగన్నికదేవి

పాముల కూతురు – పాలగన్నికదేవి
వన్నెగల్లవారు – వయసుగల్లవారు
కన్నుగల్లవారు – కన్నెవారంత
పతివ్రతలోయి – బాలపాపలేము

ఏటి ఒడ్డునున్న – శివలె గాంధారమ్మ
రామకచ్చేరులకు – మీరు రావాలె
ధర్మము సావడి – వెన్నెల పందిరి
విరటివారి దేశము – విటిక పండుగలు
కాశివారి దేశము – గంగపండుగలు
కొండవారి దేశము – కొలువు పండుగలు

కోటొక్కయజ్ఞాలు – పెడుతమంటిరి
అన్నెమెరుగము బాబు – అగసు పచ్చులము
పున్నెమెరుగము బాబు – పుణ్యపురుషులము
అంత్రమెరుగము – తంత్రమెరుగము
పాపపున్నెలెరుగని – సిరినరులము

అగ్గిసుగ్గిలతో – భక్తి చేయవాలె
గుగ్గిలపు ధూపాలు – వజ్రరపు సేసలు
గుగ్గిలపు ధూపాలు – పుచ్చుకుండోయని

నల్లఉసిరికాయ – నాగబిరుదులేమొ
గవ్వలచేటలు – మువ్వలరోకలి
మువ్వలరోకలి – ముందు నడవవాలె
గవ్వలచేటలు – గన్నెదుడవవాలె

గుగ్గిలపు ధూపాలు – మీ తాతసొమ్ముల
వజరపు సేసలు – మీ అబ్బ సొమ్ముల
ఎటువెళ్ళినాదో – అప్ప గొంతెమ్మ
ఎటువెళ్ళినావో – అన్న ధర్మరాజ

పిట్టగడ్డ జలంపల్లి – పట్టపు కోలన్న
లే లే లేరన్న – లేకోలన్న
గ్రామదేవతలార – శరణు తల్లులార
తప్పులున్నగాని – ఒప్పులున్నగాని
కాపులుండవాలె – కరుణ జూడవాలె
ఎటువెళ్ళినారు – బాలనంబరులార

(నంబి–నంబరులు=బాలవెజ్జులు)

ఛీ ఛీ ఛీ ఛీయంటె – సిగ్గులేదుర మీకు
లే లే లేయన్న – లెక్కలేదు మీకు
ఆడబొట్టెకైన – రోషమున్నదేమొ
మగ తామసాలు – మనకు బుట్టలేదు
నీతి లేదుర మీకు – పంచపాండవులార

పెట్టుబడులుంటే – పెగలగొట్టవాలె
వెండిబెత్తలతోటి – వెళ్లగొల్లవాలె
మాయబొక్కలుంటె – మనమె చూడవాలె
మిందెగురువన్న – తొండగురువన్న
బల్లిగురువన్న – ముంగిగురువన్న
చేరిరండు బాబు – దేవగురువులార
చేరుమామిడి – చేరిరావాలె
దబ్బవనాలు మీరు – దాటిరావాలె
రంగలాటలోయి – సింగలాటలోయి

సింగలాటలేమొ – మనము ఆడవాలె
పెనుగొండలోని – పెద్ద పేములేమొ
దుమ్ముకొండలోని – రాచెలుక దుంపలు
గొడుగు జంబిలి దారి – మనము వెళ్లవాలె
వెళ్ళుదూర బాబు – బాలనంబరులార
కముజు కొక్కెరలు – మనము తేవాలె

సెనగలు బెల్లాలు – టెంకాయ కొబ్బర్లు
మదురుక్ష ఫలాలు – తేనె మామిడి పండ్లు
భీమన్న దొడ్డికి – బీరకాయలట
సహదేవుడికి – సారుదుంపలట
హనుమంత పగడాలు – సత్తెవిత్తనాలు

వెళ్ళుదూర బాబు – బాలనంబరులార
అగ్గివచ్చినగాని – సుగ్గివచ్చినగాని
కొట్టికొండలాడి – మట్టిమంతరించి
ఎటువెళ్ళినారు – పంచపాండవులు ❉

## పాతపాడేరులో శివాలయం



## పాండవయోగంపట్టినవారిని ఉసికొల్పడం :

అప్పజెల్లెలు - అడ్డమున్నారా
దుక్కిపెండెలు - దురియయున్నారా
అమ్మ వండిన కుండ - ఆనియున్నదా
కోటియజ్ఞాలమీద - తేలిరావలె కొడుక

గిద్దులుదూరని - గద్దవేనాలేమో
కాకులుదూరని - కారటడవులు
పులులుదూరని - పుల్లటడవులు
పాములుదూరని - పేముటడవులు
గోరిండివనాలు - తేలిరండు బాబు

గదవిద్యలవాడు - ఘనుడు భీమన్న
ఉక్కురోకలిబండ - వాడిచేత కొడుక
హరివిల్లువాడు - యన్నఅరుజన్న

సురటికొండలలోన - సురదానుడట
బందలగిరిలోన - బట్టదానుడట
కొండనున్నవాడు - కొండదానుడట
గడపనున్నవాడు - గడపదానుడేమొ
కొండపెండెలు - అవతరించినాడు

ఎటు వెళ్ళిడోయి - ఘనుడు భీమన్న
దానుడు భీముడు - బావమరదులట (దానుగుడు = దానవుడు)
ఎటువెళ్ళినావో - అన్న అరుజన్న
రాతికొండలోనె - రంగదూలవాలె
కాలభైరవుడు - కలయదొక్కవాలె
డెబ్బైయేడుమన్నేలు - దాటిరావాలె
నల్లగొండలోని - అడవిరాయ నీవు

బురదగుండములోని – కప్పదేవుడ నీవు
ఎటువెళ్ళినావో – తమ్ముడ సహదేవ
ఎటువెళ్ళినావో – తమ్ముడ నకులన్న
పాండవులదేశము – కొలువులెత్తినాము

దానుడు పుట్టేటి – ఘడియ వచ్చిదట
తొలకరి మెరుపులు – మెరుసుతున్నవట
వండగండ్ల వరుషాలు – కుంభవరుషాలు
కన్నెకాలువలు – పారుతున్నవట

దానుడు తల్లిర – పూలతంబలి కొడుక
తండ్రి అంజలి మహరాజు – గర్భవాసమందు
పుట్టి ఉన్నడట – ఘనుడు దానుగుడు
దేవి వరముచేత – భీమసేనుడు
వాయు వరముచేత – అన్న అరుజన్న
కొర్రవారల్లుడు – కొండదానుగుడు
బిడ్డిగవారల్లుడు – భీమసేనుడు
దానుడు భీముడు – బావమరదులట

ఆటలకు ఓటెము – పాటలకు పట్టు
గడ్డకు గట్టు లేదు – ఓరి కొడుక
తేనె పండినట్లు – పండుగూలు మనకు
పండవాలె బాబు – పంచపాండవులారా

ఏడుసికలు కట్టవాలె, – ఏడుకోట్ల బొట్లు పెట్టవాలె
భీమసేనుడికి – బొమ్మదిద్దవాలె
పాతరోకలిబండ – అమరించవాలె
కోపచింతలేమొ – వద్దురోయి తండ్రి ❉

**అంబటూలరాజు – ఆసివేయులపాప :**

దండము దండము – అంబటూలరాజు
జనమమెత్తినారు – తెల్లరాజాలమీద
ఢిల్లీ దేశాలు – ఢిల్లీ రాజ్యాలు
అస్రగిరి – ఓ – పర్వతాలమీద
పెసరగిరి – ఓ – పర్వతాలమీద
నాగేంద్రావో – ఓ – పర్వతాలమీద
దోన గిరులు – ఓ దొడ్డవేనాలు
సూర్యదిమ్మడాలు – చంద్రదిమ్మడాలు
అందుకొంటివో – అసివేయులభూమి

పల్లాన – ఓ – పదివేయులు కొడుక
ఆరువేయులు పూరుబయలు – అందితీవకొడుక
రారా రారా – అంబటూలరాజ
దుక్కిపనులేమొ – కదిలినాడుబాబు
సత్తెమైనవాడు – అంబటూలరాజు
ఓలిక పూదులు – వడ్డనపు నాగలి
పలుపులు మోకులు – ఏరుకున్నడట
పూలగొండకేమొ – పులిని తెచ్చిడి
ఎర్రగొండలకు – ఎలుగుకు తెచ్చిడి
ఎలుగుకు పులికి – ఏరుకలిపినాడు
పులికి వెలుపల – ఎలుగుకు దాపల
తెల్లజంకులమీద – దున్నుతున్నడట

అసివేయులపాప – యాదివండినది
అది వండినాది – దేవభోగాలేమొ
పల్లాన పండిది – పాల బుడమలేమొ
నడిగాళ్ళ పండిది – నల్లపనుతురేమో

మెట్టున పండిది - మెట్టుసన్నాలు
కొండన పండిది - కోటి యపరాలు
సల్లసల్లులేమొ - నెత్తినెట్టుకొని
ముత్యాల ముంజూరు - తేలినాది కొడుక

**దేవగుమ్మడి పండు :**

కొంగు విసరగ- కొండలు పెండెలు
చేయి విసరగ - చెలకలు మెట్టలు
వెలుగులయినది - అసివేయులపాప
మూటమామిడి కింద - ముత్యాలాది పుట్ట
గొడిగింత సర్పాలు - యాది యెత్తుకొని
తల్లెడు నాగుర - తల్లి గోధుమనాగు
గరిభి చిన్నెలేమొ - యాది చిన్నెలట
పాము మాంసమంటె - తిందునన్నదట
అపుడట బాబు - కొండనాయుడేమొ
అంబటూలరాజు - వాడు వచ్చినాడు
ఉక్కు గునపము - ఏరుకున్నడట
ఉట్టికావడిబద్ద - ఏరుకున్నడట
గుగ్గిలపు దూపాలు - వాడు ఏరుకొని
తల్లెడు నాగుర - తల్లి గోధుమనాగు
పారిపోయిదేమొ - తల్లెడు నాగు

ఆడబొట్టె పుడితె - నాగుల కోడలి
మగవాడు పుడితె - ఏొడుస్తాను మరి
శాపనాలు అది - పెట్టినాది బాబు
గుడ్డిది సొట్టది - నాగునిచ్చినది
దేవగుమ్మడిపండు - జనిమించినాది ❊

## పాండవరాజు పుట్టుక :

కాలుచేతులులేని – కనక గుమ్మడిపండు
రూపు రేకలేని – రూపగుమ్మడిపండు

చింతగొల్లవాడికి – దొరికినాది బాబు
జో జో జోయని – జోలవేసుకోగా
జలతారుచీరెలు – వారికాయినది
చిరుగు గొంగళిలోన – బొక్కెస వేసుకొని
వాడు తిప్పగేమొ – చింతగొల్లవాడికి
వాడి కండువాలు – పట్టువలువలు
అంబలి తోడిర – కూరవండుమనె
అది మోసిదోయి – చింతగొల్ల బొట్టె
పీటకత్తియేమో – అది యేరినాది

గుమ్మడిపండూర – కొయ్యబోయిదోయి
చెయ్యి కోసెవుబొట్టె – కాలుకోసెవు బొట్టె
గుమ్మడిపండు యేమొ – పగులదన్నుకోని
సత్తెపాండువరాజు – పుడత ఉన్నాడు
గుమ్మడిబద్దలు – జల్లివేసినారు

సత్తెపాండువరాజు – నూనెలు పసుపులు
అడ్డెడునీళ్లకు – ఆటబాలయాయి
కుంచెడునీళ్ళకు – కుగుడుబాలయాయి
చేరెడునీళ్ళకు – చెలగుబాలయాయి
నెమలిపిట్టవన్నె – వన్నెకాడువాడు
పూరడిపిట్టవన్నె – వన్నెకాడువాడు

పాండుగూల ఏమొ – పోడుకట బాబు
ఏమి పండిదోయి – పాండుగూల పోడు

అన్ని అపరాలు – పోసినారు బాబు
పోసి కుప్పలేమొ – వేసినారు కొడుక
ఎగజారు బందలు – పండినాది బాబు
చిలుకు చిక్కమేమొ – చిట్టగొడ్డలేమొ
వాడు ఏరుకొని – సత్తెపాండువరాజు
కఱ్ఱ తేనెలకి – తెఱ్ఱతేనెలకి
వాడు వెళ్ళినాడు – కొండనాయుడేనా

**దుగ్గలబోయడు :**

పనస రోకలిబండ – గదయేరుకొని
కఱ్ఱికంబలిగుడ్డ – భుజాన వేసుకొని
వాడు వెళ్ళినాడు – గజ్జెల భీముడు
గద్దలుదూరని – గిద్దుటడవులు
శంబలుదిరుగని – చిట్టిఅడవులేన
నిమ్మ నీడలకింద – నిలిచినాడు వాడు
జలదికి మొలచీదొ – జంబనేరేడు
పిండిమారుడుపండ్లు – యారదులుచేసి
జారికిది పండ్లు – అరదులు బాబు
దుగ్గలబోయుడు – వేసి యిడ్డడు కొడుక
ఏడేడు లంకలు – ఏకనరకినాడు
తల్లెడు లంకలు – తగుల నరికినాడు
కొమ్మరటి తోటలు – వేసిఉన్నడు
కాసి పూసి యవి – కనకమత్తులేమొ
చూసినాడు కొడుక – గజ్జెల భీముడు
మనసు పట్టలేదు – గజ్జెల భీముడేమొ
చెట్టుకొక కాయ – తీసినాడు వాడు
నిండ గరిసెడికి – మూటగట్టినాడు

*కఱ్ఱతేనె - తెఱ్ఱతేనె; చిలుకు చిక్కం - చిట్టగొడ్డలి*

పయ్యం పయ్యం మీద – నములుతున్నడేమొ
నములుతున్నడేమొ – పంది భీముడేన
నీతి జాతి లేదుర – పాండుగులకు
అప్పుడాట బాబు – దుగ్గల బోయుడు
ముక్కుపోయిన ఒలవకమ్మ – యేరుకొనికొడుక
తోటచూపుకని – వచ్చినాడు
నిక్కి నిగిడి యేమొ – చూసినాడు బాబు
కోపములె వాడికి – పుట్టినాది కొడుక
మూడు గడియలేమొ – భీముడిమీద కొడుక
కొడుత ఉన్నడేమొ – దుగ్గలబోయుడు
చీమకొరికినంత – సందులేదుర
అటునిటువాడు – సూసినాడు భీమ
ఎఱ్రటి కళ్ళకి – ఎక్కె కోపాలు
పచ్చటి మొహానికి – పట్టెకోపాలు
ఓడిపోయినాడు – దుగ్గలబోయుడు
కోటి గద్దెలు గెలిచినాడు – గద్దెల భీముడు
అండంగులువాడు – బొడ్డంగులువాడు
వైము దుంపలేమొ – తెచ్చినాడు కొడుక

వ. దుంపలు తేనెలు ఎన్నితెచ్చిన కరువుతీరదు. నల్లరేగడిబురద తెల్లమద్దిబుగ్గి నిండగరిసెడి అంబలైన వండియ్యమ్మఅన్నడు. పారుగడుపులు పట్టేసివి. మెట్టబలుసు కూర తిన్నరు, మేకమాంసం తిన్నరు.

**నందమ్మ – గౌరమ్మ :**

చెల్లెలు నందమ్మ – అప్పగౌరమ్మ
కొండనాయుడిదేశం – కోరివచ్చినారు
విడుపు విడియలేక – జడుపు జడియ లేక
అరహోరాలు – అంత వండుకొని (అన్నహోరాలు)

ముత్యాల మంజూరు – బయలెల్లినారు
ఎక్కురాళ్ళ ఘాటి – ఎక్కుతున్నారు
దిగురాళ్ళ ఘాటి – దిగుతున్నారు
ముల్లురక్కిదోయి – సిరిసీతపాప (నందమ్మ)
పయ్యెడాల చెంగు – పట్టి నడిచినారు

వ. మధ్యదారిలో చెవుల్లిపిల్లి దసిలింది (తారసిల్లింది)
పెదకొండ అవతల లోకొండ పెడగంతన కొండనాయుడి దేశమని చెప్పింది.

పందిర పందిర – పంది భీమన్న
కొండనాయుడి దేశం – ఎలాగ ఉన్నాది
వెళ్ళగా వెళ్ళగా – కొండజంగాల భూమి
నల్లరాళ్ళఘాటి – నడిచి తేలవాలె
పారుతున్నదోయి – బాలగౌరప్ప
ఎంత గడుసుదోయి – బాలగౌరప్ప
నంది పండుగేమొ – నీకు చేస్తారు
పల్లాన ఉంటేను – నాగులచవితి నాకు చేస్తారు
అరణ్యవాసం – జతలు యొగ్గినారు
కొండరాజ్యం తేలి – బాలనందమ్మ
కొండనాయుడిల్లు – వద్ద వచ్చిదట
దబ్బగడ్డియిల్లు – దడిగట్టుకొని
యీతరెమ్మలయిల్లు – యిలారాలుకొడుక
తాటిమట్టలిల్లు – తడక గట్టుకొని
మూడు నెలలకోయి – నీళ్ళు పోసుకుంటే
ఆరునెలలకోయి – నీళ్ళే ఒల్లడట

అన్నగాద అన్న – దప్పికయయినది
గంగజలములు – యియ్యిమన్నదట
అబ్బవోరి కొడుక – పెద్దజాతి పిల్ల

ముక్కలిపీటలు – వేసి ఉన్నడట
పిన్నమ్మ వండిది – పిండిపెండెపుకల్లు
కన్నమ్మ వండిది – కణుజుదుమ్ము కల్లు
తత్తడది కల్లు – పొత్తడది కల్లు
తాగి చూచి దోయి – బాలనందమ్మ
తీయనె ఉన్నదోయ్ – పుల్లనె ఉన్నదోయ్

ఏమి చెక్కలూర – వేసిచేసినారు
కడుగుచెక్కలోయి – నేలగురిడి చెక్క
మూడురోజులోయి – మురుగబెట్టిరి
తాగిచూడగానె – మత్తులాట
మత్తుమత్తులట – పాణాలయిదట

వ. అరణ్యందారి ఆడపిల్లలు. నేను పెట్టలేను. పల్లమంటె పదివేయుల దేశం. మీరు కూడుగల్లవారు, పాలుగల్లవారు. పాండవదేశమంటె పిండిదుంపలు, సరివెకూర, సారుకూర, బొడ్డుకూర, బొరగకూర నేను పెట్టినదానితో సంతోషపడమన్నడు. కామక కాదు ఒగ్గమన్నారు.

గుగ్గిలపు దూపాలు – వజరపు సేసలు
కోటొక్క యజ్ఞాలు – చేస్తనన్నడు
కొండకుపండింది – కొండకందులట
గరువుకు పండింది – నల్లఉలవలట
మడికి పండినాది – మల్లెపూసలట
పేరున పండింది – పేమంతులట

ముతక వరిబియ్యము – ముతకపప్పులతోను
కోటొక్క కొలువులు – పెడతానన్నడు
పూలుపుట్టలోను – కొదమనాగులాగ
కొలువుతీర్చు తల్లి – తల్లి నందమ్మ
నందిపండుగలు – నీకు చేస్తనన్నడు

కొండనాయుడింట – కోరితీర బాబు
బాలనందమ్మ – బాలగౌరమ్మ
దేవలోకానికి – శరణుజొచ్చితిమి
పుట్టకోటలోన – మీరు ఉంటరట

సంవత్సరానికి – ఒక్క దినములు
ఏడాది పర్వాలు – ఎత్తివచ్చిదేమొ
కొండనాయుడింట – కోరివచ్చితీవి
గుగ్గిలపు ధూపాలు – హారతులు తండ్రి
వజరపు సేసలు – తీసిజల్లుతాము
మాగ్రామానికి – తోడుగాయి తండ్రి
జోర జోర జోర – బండి బసవన్న
కెంపులదిబండి – రత్నాలదిబండి

❋



బుడ్డపిల్లి

ఒడిసెల



**పాండవరాజుపెళ్లి :**

అన్నమూలదేవి – అసివేయులపాప
సత్తె పాండువరాజు – పెండ్లి కబురులు
ఏదేశం పిల్లను – తెద్దమన్నారు
నాగలపురికి – పుట్టి ఉన్నదట
నల్లది గన్నిక – నాగులది మేడ
చీమలు దేవిన – నల్లరేవడి భూమి
గాజు కంబలిల్లు – ఘనగోపురాలు
పెగడాలు వెళ్ళుడు – పెద్దలు వెళ్ళుడు
అన్నదట బాబు – అసివేయులపాప

ఏడుగురు బాబు – పాండువ పెద్దలు
ముంగి గురువన్న – బల్లిగురువన్న
కొండకు పెద్దలు – తొండగురువన్న
చిలుకు చిలుకు దోవతులు – వేసుకున్నదట
మూడుసార్లు కల్లుబోసి – అడిగించినారు

తాత ఓతాత – తాత సుంకమరాజ
అప్ప ఓయప్ప – నాగగన్నికదేవి
పిల్లనియ్యనన్నది – నాగేంద్రరాలు
అన్నదమ్ములు – సూర్యసోమలవారు
ఎలాగోలాగ – ఒప్పుకున్నారు
చెదలనైనవారు – ఒప్పుకున్నరట

ఎన్ని కాయలుర – కల్లు తెచ్చిరి
మూడు కడవలకల్లు – వారుమోసిరి
పదిమనిషి వారు – కల్లుతాగినారు
సారతాగినారు – సంతసావడివారు
సామకల్లులేమొ – మూడుకడవలట

ఆలోచించినారు – పుట్టకోటవారు
ఏడు జతల అరిసెలు – వారికొప్పగించి
పిల్లనడుక్కొని – వెళ్ళిపోయినారు
శరణు దండము – పుట్టకోటవార

పెద్ద గడ్డదూలి – పెయ్యసారు కూర
మైలార ఒడ్డులో – మండి కూరలట

వండించినది – మూడు గరిసెలేమొ
అన్నమూలదేవి – వండించినాది

నాగ సుంకమరాజు – కబురు గట్టుడు కొడుక
చెదలనైన వారికి – కబురు గట్టుడు కొడుక
శుక్కురారము రోజు – సత్తెపాండువరాజు
ఏడుగురు పెద్దలు – వారు వస్తరన్న

లెందుర లెందుర – నూరింటివార
సంత సావడేమొ – మనము వెళ్ళవాలె
సంతలు గోనెలు – కడత ఉన్నరట
మైలారి సంతకు – వెళుదమన్నరట
సాయిలూరి సంతకు – వెళుదమన్నరట
మళ్ళీవారం సంతకు – మనము వెళుదాము
నల్లగోడెలకి – గంతకట్టినారు
వెల్లకోడెలకి – గంటకట్టినారు
సయిలూరి సంతకు – సన్నగాజులు
మయిలూరి సంతకు – సన్నపురి చీర

ఉల్లినూనెలేమొ – సేసుకున్నరట
ముప్పయికోటిమునులకి – కబురువెళ్లుడు తండ్రి
నవఖండ రాజులకు – కబురు గట్టుడు కొడుక
ఎండకని వేసినారు – వెండిపురి డేర

వానకని వేసినారు – వన్నెపురి డేర
మంచుకని వేసినారు – మల్లెపూల డేర
నీడకని వేసినారు – నీలిపూరి డేర

పాలకెత్తువారు – గదబలటకొడుక
పన్నెండు మందిర – పాలకెత్తుకొని
కల్లుతాగినారు – సంతసావడివారు
కల్లుతాగితిమి – కమము తప్పితీమి
కూడు తింతిమి – గుణము తప్పితీమి

పెద్ద పులులకు – పెద్ద 'బేండు' లేమొ
చెవుల పిల్లులకు – పిల్లింగ్రలేమొ
పట్టించినారు – మాఘన పెద్దలు
మూరుదెలుకేమొ – మూర్తగాడుబాబు

మాలపల్లి చేడెలట – లింగు లింగు సారి
వాడపూల బంతులెత్తిరి – లింగు లింగు సారి ❈

**కొండరెడ్ల విల్లంబులు**




-- పల్లాల బొర్రంరెడ్డి, మారేడుమిల్లి

## దొంగలదోపు :

దొంగపూజారి – జాడ తీసినాడు
దొంగచేసినాడు – దొంగపూజారి
దొంగవాడడుగులు – దొడ్డయడుగులు
మూరెడు చేరెడు – దొంగవాడడుగులు

ఏమిగాదబాబు – దొంగపూజారన్న
అన్నము లేదాయె – బట్టలేదయె
ఏల తెచ్చినావు – పెద్దయింటి పిల్ల

వారి అమ్మగారు – ఏడ్చుచున్నరేమొ
ముక్కు చూదమంటె – కనపడదామె
మొగము చూదమంటె – తలయెత్తదాయె
సీతజాడలేమొ – వెతుకుతున్నరట
చింతపూవువన్నె – చీరెగట్టినాము
మల్లెపూవులది – రవికె బెట్టినాము
మామిడి పట్టెడ – పెట్టినాము బాబు
పలక సారులేమొ – గిలకసారు లేమొ

సీతపోతే పోయిదిగాని – పాతలనాటిది బంగారాలు పోయె
భామపోతే పోయిదిగాని – కాసులపేరులే పోయిదన్నరట
దొంగజాడలు – వెతుకుతున్నరట
చెరువు చెంగలితోవ – జారుకున్నడు వాడు

కర్రగోచులవాడు – కర్జుమొకలవాడు
వాడు కావాలెమొ – పుట్టు పూజరన్న
పాతగోచులవాడు – పరికి బుర్రలవాడు
వాడు కావాలెమొ – మట్టు మలపరన్న

మూలపావులవాడు – జాడిపావులవాడు (పావు = అడుగు)
కీసుబాసుదేశం – కిముదు నందపురము

కిముడు నందపురము – దొంగపూజారన్న
మా పిల్లను నీవు – తెచ్చియుంటివ కొడుక

కొడుకులేదని – కొమ్మలేదని
బొంకుతున్నడు వాడు – దొంగ పూజారన్న
సిట్టరాటకేమొ – కట్టినారు వాడిని
అలికి అరవై – ఓలికి ముప్పయేమొ
ఇస్తామని – అంటున్నడట

ఆదివారమురోజు – తాడు దబ్బనము పిల్లకియ్యవాలె
భూదేవియంత – పీనెలుపోసిరి
ఆకసమంత – పందిరి వేసిరి
జోర జోర జోర – పంచపాండుగులార
జోర జోర జోర – బండిబసవన్న

చెయ్యికడిగితె – నోరుకడుగరు
ఆడిదప్పనివారు – పంచపాండుగులు
వంకకర్రకింద – తూరరూర వారు
వాయులవారితో – మాటలాడరట

తాత ముత్తాతలు – మాఘన పెద్దలు
దూలి దుడిచేమొ – కట్టినారు బాబు
దుర్గమాయిదేమొ – మనపట్న మేమొ
పట్నమాయిదేమొ – మన దుర్గమేమొ
పాడు దుడిచేమొ – కట్టినారు బాబు
గడపలాయిదేమొ – మనపట్న మేమొ
గామ జాకరమ్మ – నిలిపినారు బాబు
గామ పోతురాజు – నిలిపినారు బాబు
గడికాయు కొడుక – గడిపోతురాజు
ఏడేడు పంటలు – ఏక కరువులు

పనిపాటలకు బాబు – పల్లకున్నారు
వేట తోటకు బాబు – వెళ్ళకున్నారు
అనుభవసారాలు – సెడి ఉన్నారు

వ. పాండవులు లక్కమేడలు గాజుమేడలు పోయినవని దిగులు పడుతున్నారు. మురుదెలుక, నేలమన్నుదేవేసి, సొరంగందారిగుండా పాతలనాటి నేస్తులు పండు బోయుల దగ్గరకు దారిచూపినాది. భీమసేనుడు, కుండలకావడి కుడిభుజానికి, ఎడమ భుజాన బంగరాల బల్లి (గొంతెమ్మ) నెత్తుకున్నాడు. వెన్నులోన వేటగత్తి కట్టుకున్నాడు. వెళ్ళగ వెళ్ళగ సంద్రాన్ని తెల్లచేపలు చేతులుపట్టి దాటించినారు. ❈

## ఎక్కుబెట్టిన విల్లు




-- పల్లాల బొర్రంరెడ్డి, మారేడుమిల్లి

## కోలన్న - కరువు :

గొంతెమ్మదేవికి - కన్నెరికములోన
కోలన్న పుట్టగనె - కరువు పుట్టినది
కోలన్న పుట్టగనె - అగది పుట్టినది
మూడు పంటలకు - భూదేవతకు
రొడ్డలేదు కొడుక - గడ్డిలేదు బాబు

## పాండవుల రాజ్యం :

పాండవుల రాజం - ఎలాగున్నదీర
పాండవూలబతుకు - దీనెరికమోయి
పంట బాగెములు - మాకులేవు బాబు
వేసెగి ఎండలు - వెర్రి ఎండలేమొ
కాసే ఎండలు - కర్రి ఎండలేమొ

ఏడు పంటలుర - చిన్నకరువు కొడుక
పది పంటలుర - పెద్ద కరువు కొడుక
ఆకసములోన - మేఘము లేదు
ఏడు యోజనాలు - జలములేదోయి

అప్పుడాట బాబు - బంగరాల బల్లి
కొడుకులు యందరికి - అది పిలిచినది
దుంపలు తేగలు - నావల్లగాదు
అన్నరట బాబు - అన్న అరుజన్న
సత్తెమైనవాడు - సత్తెధర్మరాజు
దూది బోగాల - సత్తెధర్మరాజు

దానవుల బోడమర్రి - కిందనట బాబు
తాతవారి భూములు - డేరాలలోన
సిమ్మల సమ్మము (సింహాసనం) - తిరిగి ఉన్నరట

సిమ్మలగద్దె – చిన్నబోయినది
పిట్టగడ్డలోన – పుట్టితీవ కొడుక
కరువు కాలములోన – పుట్టితీవ కొడుక

**కోలన్న అమ్మకం :**

కోలన్న రాజుకు – నీవు అమ్ముకొడుక
రారా ఓరి కొడుక – గజ్జెలభీమన్న
దండలోన యేమొ – నారగట్టుకోని
వెళుత ఉన్నాడు – గజ్జెల భీముడు
కోలన్నకైన – కొనేవాడు లేడు

వాడి పిన్నమ్మర – అన్నమూలదేవి
ఓలి గాదెలెమొ – మలకపాతర్లు
దొంతురు పెనకలు కలిగి ఉన్నదట
గొంతెమ్మ కొడుకులు – కొమ్ముటేనుగులు
అన్నమదేవి కొడుకులు – అంబారేనుగులు

నల్లవాగులు – నడచివచ్చిరి బాబు
నడగళ్ళ ఘాటీల – నల్లవాగుల తోవ
నల్లపనుకుల తోవ – నడచి వచ్చిరి బాబు
మల్లెలు మల్లెలు – జోవెర్లు, జోవెర్లు
ఎగజారు బందలు – చిడుగళ్ళు వేనాలు
దాటి వచ్చినారు – తేలి వచ్చినారు

చుట్టు గోడలిల్లు – సున్నపు గచ్చులు
గాజు గంబలిల్లు – ఘన గోపురాలు
పేరుకి పోయిది – పెద్ద గరబదులు
దాటివచ్చిరి – కోరివస్తిరి బాబు

జోర జోర జోర – జోర బంగరాలబల్లి
బంగరాలబల్లి – బాలగొంతిదేవి

గిలుకుల అట్టుకు – గలుకున ఎక్కిది
అన్ని అపరాలు – తీసినాది బాబు
దేవలోకానికి – తీసి వండినాది

ఒదిగితిమి కొడుక – కొదువ కొంచెము లేదు
ఏమి వచ్చితీవో – గజ్జెల భీమన్న
అడ్డెడు తూమెడు – ఇమ్ముగాదయమ్మ
చేరెడి పిడికెడి – ఇమ్ము గాదయమ్మ
గడియకాయు కొడుక – గజ్జెల భీమన్న
మూడురోజులాయి – ఆరురోజులాయి
ఘోరమైన నాకి – ఆకలాయిదమ్మ
నీవు వార్చేటిగంజి – వో తల్లి
నానోటనె – వార్చుమన్నడట
మున్నూరు – ఓ – ముక్కు గరిసెలేమొ
ముంగలిజావ – ఓ – చెల్లతాగినాడు
ఏమి మాయలుర – గజ్జెల భీముడ
మెతుకులంత ఏమొ – చెల్లతింతివీర
అరుగు కొమ్ములోను – కుగిడినాడు కొడుక
కుగిడి నాడుకొడుక – గజ్జెల భీముడు
కోలన్నకు – అమ్ముతాను తల్లి
అడ్డెడి బియ్యము – ఆడిగ బియ్యము
కుంచెడు బియ్యము – కొదువ బియ్యమేమొ
రొట్టె కాల్చుకొని – తినుమన్నదట
తవ్వెడిచ్చి కొన్నదోయ్ – తవిటి కోలన్న
ఇంటి కొడుకులకు – పరకు పెట్టినది
కోలన్నరాజు – కమ్మితిని తల్లి
తవ్వెడిచ్చిదమ్మ – తవిటి కోలన్న
బాండువాలో – నూనె వేసుతున్నదట

ఏడుకొండలలో – భీమసేనుడేమొ
ఆకులైనవాడు – తెచ్చినాడు బాబు
ఒక్కదొన్నెయేమొ – కుట్టినాడు కొడుక
నింద గరిసెడేమొ – వాడు తాగడము
అర గరిసెడేమొ – ఇంటి మొత్తము

**విత్తనాలు :**

కొసరి కాయతుంబ – పట్టుకున్నడు కొడుక
పరుగెట్టినాడు – గజ్జెల భీముడు
కొండపోడు నేను – కొట్టివస్తిని తల్లి
సిరిసిలియ బందలు – సీత గుంటలమ్మ
జోవర్లు జోవర్లు – నేను కొడితినమ్మ
నేను కాల్చివేసి – వస్తినన్నడట
అడ్డెడు తూమెడు – విత్తనాలు నాకు
ఇయ్యిమోయమ్మ – అన్నమూలదేవి
ఓలి గాదెలు – అది దింపినాది
కొసరికాయ తుంబ – నిండకున్నదట
నా కొడుకులేమొ – కొడుతురు తిడుతురు
ఏమి మాయచేస్తివి – గజ్జెల భీముడ
అని శాపనాలు – పెట్టినాది బాబు

**శాపం :**

కొట్టెబోసినాడు – గజ్జెల భీముడు
ఏడేడు కొండలు – నేను తువ్విన గాని
సిరసిలియ బందలు – నేను తువ్విన గాని
జోవర్లు జోవర్లు – నేను తువ్విన గాని
ఒక్క చేటెడే – అయితదన్నదట
నవ్వుకున్నదట – గొంతెమూలదేవి

**విరుగుడు :**

గద విద్దెలవాడ - గజ్జెల భీముడ
పనకొాక కుప్ప - వెయ్యిగాద కొాడుక
పనకొాక చేట - అవుతదీర కొాడుక

**పాండవుల వ్యవసాయం :**

పిచ్చుక పిట్టలు - పిలిచినాడు కొాడుక
పిరిపిరి గడ్డలు - ఏరించినాడు
అలమపోతులు - పిలిచినాడు కొాడుక
గడ్డిగాబులు - ఏరించినాడు
పులిని దాపల - ఎలుగును వెలుపల
పాములనేమొ - పట్టెడ చేసినాడు
నల్లటావులైన - నాలుగు మందలు
పసివెదలైన - చేయుమన్నడట

**కొాలువుపండుగ :**

లే లే లేరన్న - లే కోలన్న
తాతవారి భూములు - కొాలువు సంబురాలు
తాత సుంకమరాజు - చూచిరావాలె
వెళ్ళిరార కొాడుక - అన్న అరుజన్న
సత్తేడు సంద్రాలు - దాటివెళ్ళవాలె
దాటలేను బాబు - అంటనె ఉన్నాడు
పంచపాండవులు - దాటలేకున్నారు
రా రా రార - ఘనుడు కోలన్న
తాత సుంకమరాజు - చూసి తేవాలె
వెళ్ళ వెళ్ళగ - వెయ్యిబోదెల వనము
కన్నె కాలువలు - కదులుతున్నవట
వానలొడ్డినాయని - నిలబడినాడు
గడ్డఒడ్డునవాడు - నిలబడినాడు

తాబేలు తారప్ప – వచ్చుతున్నదట
వింటివ చెల్లెల – తాబేలు తారప్ప
పన్నెండు సంవత్సరాల – కొలువు లెత్తినాము
కొలువులు సాగక – ఉన్నదోయప్ప
తారప్పకాలు – వాడుపట్టినాడు
తలపాగాలు – వాడు చుట్టినాడు
సప్తసంద్రాలు – దాటి వెళ్ళినాడు
నాలుగు మూలలకి – నాగసర్పాలు
నాలుగుమూలల – అగిని జోతులు
ఎగురుతున్నాడ – తాత సుంకమరాజు
కాలుసేతులులేని – పాండుగులరాజు
తలపాగలు – తీసికొన్నాడు
కృష్ణతామర రేకు – అందుకొన్నాడ
వెళ్ళిన తోవల – మళ్ళుతున్నాడు
సత్తేడు సంద్రాలు – దాటివచ్చినాడు
కొలువులు సాగేవి – తాత సుంకమరాజు
లెండుడు లెండుడు – పంచపాండుగులార
అగినిగుండము – మనము వెళ్ళవాలె
అగినిగుండమంటె – భయములొద్దురోరి
అగిని గుండములు – ఆత్మబంధువులు
నీళ్ళ గద్దెలమీద – మనము గెలియవాలె
పాలగద్దెలమీద – మనము గెలియవాలె
తల్లెడు భూతాలు – తగిలి కొట్టవాలె
పెట్టుబడులుంటె – పెగలగొట్టవాలె
పీడయున్నకాని – పిశాచియున్నగాని
దయ్యమున్నగాని – భూతమున్నగాని
అర్థరాత్రివేళ – కానరానివేళ

గామమందున – వెతికి చూడవాలె
వెండి బెత్తముతోటి – వెదలకొట్టవాలె
దమ్మము సావడి – వెన్నెల పందిరి
మనము చేరవాలె – బాలనంబరులార
రండు కన్నెచెలియ – మనము వెళ్ళుదము
అప్పయేడుగురు – వయ్యారాలవారు
వయ్యారాలవారు – ఓలి బంతులమీద
మనము వెళ్ళవాలె – ఢిల్లీ సావడిలోకి
పచ్చబల్లలమీద – పారిరావలె మనము
గడ్డబోడు బోడు – చెవిలీడె లీడె
నీవె నీవె పాప – నేను నేనె పాప
ఓసు పట్టకుండు – ఎగ్గు సేయకుండు
తేనె పండినట్లు – పండుగులు మనకు
పండవాలెనేమొ – సత్తెపాండుగులార ❈

## ఈతచెట్టుమీద పక్షుల గూళ్ళకు ఉచ్చెయ్యడం




-- భూమని రవీంద్ర, దోర్నాల

## దానుగుడు :

అపుడుగౌంతెమ్మ 'నీబావ' కృష్ణుడు వేణునాదంకర్ర వేగించుకొని ఆదుర్యోధనుల మంద మందలగిరిపర్వతంమీద కాస్తున్నాడు 'కొడుక. దోనగిరి, మలయగిరి పర్వతాల కిందకట్టేసిడ్డారు గోరెండికోట. ఉక్కుసిరికంబంతోడి ఆగోరెండికోట అదిమి, నల్లయావు, కర్రిపడ్డ తీసుకొనివస్తివంటె అనుభవసారాలు చేద్దాము' అన్నది గౌంతెమ్మ. గోరెండి కోటకువెళ్ళి బావా కృష్ణుడా! మాకో కర్రియావు ఇమ్మన్నాడు. 'ఇయ్యలేను' అన్నాడు కృష్ణుడు. కానిభీముడు తెచ్చినాడు. గౌంతెమ్మ ముక్కముక్కలు కోసివేసి మండిసంలోన వేగించింది.

అటుఒకమాలవాడు, ఇటుఒకమాదిగవాడు, చచ్చుడివాడు, చాకలివాడు చుట్టూ కూకున్నారు. ఇంతలో తూరుపు, దక్షిణ, పడమర, వాయువలు కమ్మేసినవి. మందల గిరిపర్వతం మీదపుట్టిన బట్టదానుగుడు బయలుదేరినాడు. తొలకరి వర్షములు మెరుపులు మెరుసుతూ, వడగండ్లవరుసాలు కురుసుతున్నదట. దానుగుడు తెర్లెటి మాంసం చెదలగొట్టి వేసినాడు.

కొక్కి కొక్కి సిగలవాడు – కొండదానుగుడు
కోర కోర సిగలవాడు – కొండదానుగుడు
చిర్ర చిర్ర సిగలవాడు – చిట్టిభీముడు
దానుగుడు భీముడు – యుద్ధమాడివారు
దానుగుడు భీముడు – బావమరుదులట
భీముడి చెల్లెలి – బొంబిలిదేవి
దానుగుడు చెల్లి – ఉంబిలిదేవి
ఉంబిలిదేవి ఉచ్చలోన – భీముడు పెనగినాడు
బొంబిలిదేవి ఉచ్చలోన – దానుడు పెనగినాడు
కోటిగద్దెలు గెలిచినాడు – గద్దెలభీముడు

వ. ఆ చెదిరిపోయినమాంసాన్ని చిర్రున మాలవారుఊదివేసినారు. పుర్రున మాదిగ వారు ఊదివేసినారు. ఎంగిలైపోయిందని పాండవులులేచినారు. 'అహోహో మంచివారు' అనికృష్ణుడు 'మీ బుద్దులు బాగులేవారా బావా' అని వెక్కిరించాడు. మేము తిందిలేదు,

సబ్బండజాతులవారు తిన్నారు. నాలుగువాయువులు చెదరగొట్టడం, ఆమాంసం పులుపునఉన్నదని, మేము అక్కడ వేయడం. కృష్ణుడు నమ్మిక మాంసం కక్కించినాడు.

## కౌరవులతో యుద్ధం :

వ. స్నానాలుచేయించి అన్నవస్త్రాలుపెట్టి టెంకాయ, కొబ్బెర్లు, సద్దిమూటగట్టి పంపిదిగొంతెమ్మ. పెదమాడుగుల (వడ్డాది మాడుగుల) గంత వెనుక ఏనుగచిక్కుల్లో మనఅ(హ)రివిల్లు, దస్తులు (కిరీటం) దానవులు బోడమ(్రి దాటి, తాతవారి భూములకు వెళ్ళి మనంవిడిచిపెట్టి వస్తిమి – మోసి తెమ్మని అన్న అరుజన్న భీముడుతో చెప్పినాడు. ఏడు యోజనాలతో భూమికి జల్దికి (జలధికి) ముట్టివేసినది – ఆకసానికి ఒరగవేసి యిడ్డది కోటిగుంపుల హరివిల్లు.

ఎడమచేతితో– లాగినాడు. దోనగిరి, మందలగిరి, జలగంటపర్వతాలు హోరు హోరుమని ఒకటేమోత. మోతకు భీముడు మూర్ఛపోయినాడు. కృష్ణుడు వచ్చి నిద్ర లేపినట్లు లేపినాడు. అప్పుడు పాండవులంతా కూడివచ్చియుద్ధానికి తయారయినారు. కర్ణుడు రథాలుపంపిస్తే చుక్కలమండలం, సూర్యమండలం, మేఘమండలం, పాల మండలం, నీలిమండలం, నల్లరాళ్ళు బద్దలించుకొని పోతున్నవట. ఆ రథాలమోతకు, గుమ్మడికాయంత అగ్గినిప్పులు, గంపెడంత అగ్గినిప్పులు. ఆ అగ్గికాక ఓర్చలేకున్నారు పాండుగులు. గారమూలకోటలో ఇనుపమేడలు, గాజుమేడలు, లక్కగోడలు; ఆమేడల, మిద్దెలమీద రథందింపేస్తా అన్నాడు అర్జునుడు. ధర్మరాజు 'నా జీవి తేలిపోతున్నది మాకు వృక్షంకింద దించితేకాని వల్లకాదు' అంటే దానవుల బోడమ(్రి తాతవారి భూములకు రథందించితే గంగకు పంపించమన్నాడు. తమ్ముడ! భీమసేన ఈ మధ్య ఎక్కడైనా లేదు గంగ. గారమూలకోట నీలగడ్డ మాత్రం ఏడుకళ్ళాలంత ఉన్నది. అక్కడ వచ్చేరాణువ, పోయేరాణువ. ఇసుకవేస్తే రాలనంత ప్రజ. అంకక జంకక కొండలవెంట పెండెలవెంట తొంగివంగిచూస్తూ వెళ్ళినాడుభీమసేనుడు. ఆచుట్టూ నీటికొంగలలాగా ఉన్నారు సాదులు, బీదులు, మునులు, ఘనులు. ఏడుకళ్ళాలంత చెరువును కలబిలె తిప్పేసినాడు. గంగనీళ్ళు మోసుకుపోయే ఆడవారంత వీడుతగులబడిపోను, పోతు లాంటి కుక్క అని తిట్టడము. ఆగంగ తీసితెచ్చి పాండవులకిచ్చినాడు. అప్పుడు అర్జును డొక్కడే యుద్ధానికివెళ్ళినాడు. కర్ణుడు వేసే బాణాలకు గడియకో గంటకో పడిపోవడం.

*దోనగిరి, మందలగిరి, జలగంటపర్వతాలు*

పాండుగులు చచ్చేటట్లున్నారు. వారులేకుంటే ఉగమేల జగమేల అని మాయపెట్టేసి కర్ణుడిమీద బాణాలు వేయించినాడు కృష్ణుడు. అలోలచ్చునా అని చచ్చినాడు కర్ణుడు. పాండవులు యుద్ధానికోపలేరు.

**పశువులు మలపడం : ఉత్తర గో[గ్రహణం**

పాండురాజు సచ్చిపోయినపుడు ఎక్కడకలుపము సమాధులుపెట్టి అని చూస్తే చీమ తొక్కినచోటే, దోమ మూగినచోటే, అంత దొంగ చేసినచోటే, ఆకు మురిగినచోటే, ఎక్కడైనా కీడుచోటే. ఎలాగుచేతాము అనుకొని తినివేతామన్నారు. కృష్ణుడు వచ్చి మూలకుగిడినాడు. 'నాగుండెమీద కుంపటిపెట్టి కాల్చివేయండి' అన్నడు. శవాన్ని కాపలాకాసే సహదేవుడు చిటికెనవేలు కొరికినాడు. విష్ణుమూర్తిలోకం, సహదేవలోకం కనపడింది. ప్రపంచమంతా పట్టపగలైపోయింది. వారందరూ తింటే కృష్ణుడుకూడా చాలడు. అందుకని కృష్ణుడు మాయపెట్టేసినాడు. అటువంటి సహదేవుడు, వనుంగుపల్లి గంతవెనుక (మినుములూరు దగ్గర) చెరువుదగ్గర కాలిగొమ్ము కంచుతుడుము, కంచుదని అన్నంమూట, అక్కడ యిడేసి వెళ్ళిపోయి గురపనుకుదిమడాలుదిగి మందలగిరి పర్వతంలోకివెళ్ళి పశువులను మేపుతున్నాడు. పసులుకాస్తుంటే పసులు మలపడానికి వచ్చినారు దుర్యోధనుడు, కర్ణుడు మొదలైనవారంతా.

మ[ర్రిచెట్టు కడమొదలు విరిచి, జడ్డలతోటి జీలుగువృక్షం విరిచేసి కౌరవులకు ఓడగొట్టేస్తున్నాడు. ఆయుద్ధకాండానికి మందలగిరి పర్వతంలోని జీవాలంతా చెదరి పోయినవి. భీముడు ఎగపక్క జల్లినవి గురగేదెలైనవి, దిగపక్క జల్లినవి గేదెపోతులైనవి. ఎగువకు కారుకోళ్ళు – దిగువకు ఊరకోళ్ళు, ఎగువకు కొండమేకలు – దిగువకు ఆకు మేకలు, ఎగువకు జల్లివి నక్కలు – దిగువకు జల్లినవి కుక్కలు, ఎగువకు బరవళ్ళు –దిగువకు బావురుపిల్లులు, ఎగువకు కొండగొ[ర్రెలు – దిగువకు ఊరగొ[ర్రెలు అయి పోయినవి. పింజరికొండ, పిట్టగడ్డ, మడిగడ్డ, మన్నెపుకొండ ఆయుద్ధానికి బరులెత్తి పోయింది. ఇక లాభంలేదు కౌరవుల గారమూలకోట మళ్ళించాలనుకున్నారు పాండుగులు. అర్జునుడు కీలుపోయిన రథాలకు కీలులమరించి మేకుపోయిన రథాలకు మేకులమరించినాడు. ఏమిటన్న ఇంతదానికైన అంతదానికైనా రతాలేనా! కాలినడకన వెళ్ళి కొట్టుకొస్తానన్నాడట భీముడు. కాలినడకనవెడితే ఏటిమీద ఆరునెలలు. రథాలమీద

*ఎగువకు అడవిజంతువులు - దిగువకు ఊరకోళ్లు, ఊరజంతువులు*

మాత్రం ఆరువారాలే. మీకు వెళ్లడమేకాని మళ్ళుదోవ కనపడదు. మీబావ కృష్ణుడు లేకపోతే మీసేవశక్తులు చాలవు. తలవెంట గారమూలకోట మళ్ళించడంలేదు. అది దుర్యోధనుడికే అమలైయున్నది. కర్ణుడుమాత్రం చచ్చినాడు. కరిపురనగరం తపస్సుకు వెళ్ళిపోయినారు పాండుగులు. తపస్సు పండితే వస్తారేమో.

వెలమరాజుకు పుట్టినవారు రామన్న, లక్కన్న. వారితండ్రి పోడుచేస్తుంటే మాయ జంతువుమింగివేసింది. ఉంగరాలాటల్లో, తల్లితండ్రిలేని బోయలు ఇదేమిటిరా అన్నరట, జతలవారు. ఇకవారు వెలమవృక్షం కొనసాగినవైపు వెళ్ళిపోయరట. ఏడు సంవత్సరాలు తిరిగి జంతువుజాడపట్టినారు. అది ఆడరూపందాల్చి పొన్నబావిచెరువు వెళ్ళినది. అపుడు ఆ ఊరిబారికవాడు 'దీని చక్కదనానికి మన రాచకొడుకుకు కుదురుతదన్నా'డట. పెళ్ళిళ్ళు చేసినారు. పెళ్ళిభోజనాలకు రామన్న, లక్కన్నరాలేదు. పెళ్లికూతురు పెట్టింది అమృతం కాని మధ్యవాళ్ళు పెట్టింది మైలకూడు, పెళ్ళికూతురు పెట్టాలన్నారట. తీరా, అది కాస్తవచ్చింది కాని పెద్దపులిమళ్ళింది. రామన్న, లక్కన్న వధించినారు. అపుడు వారికి వంతువంతుదేశం వంతుఖండం రాసిచ్చేసినారు. ❊

## విశాఖమన్యంలో రాజ్యాలు



## కథలో సంఘటనలు – సమన్వయం :

వ్యవసాయదశలో గిరిజనుల వస్తువిజ్ఞానంతోపాటు, వారిసంస్కారం, దృక్పథం కూడా విస్తరిల్లింది. అందుకు ఆధారమైన సంఘటనలను వివిధకోణాలనుండి పరిశీలించి ఈ గేయగాధను సమన్వయించవలసివున్నది.

**అడవిజంతువులు – ఊరజంతువులు :**

దుర్యోధనుడు గోవులను అపహరించినపుడు భీముడుచేసిన విధ్వంసకాండకు పశువులు చెదరిపోయాయని, వాటిలో ఎగువకు విసరినవి అడవి జంతువులైనవని, దిగువకు విసరినవి ఊరజంతువులైనవని ఈగాధ. ఇటువంటికధే తూర్పుగోదావరిలో ఒకటి: దుమ్ముకొండమీద భీముడు బొంగరం ఆడుతున్నాడు. ఆబొంగరం బురదవలస (పోలమానుగొంది ప్రక్క) మీద కంగువడ్డది. అక్కడవారు దాన్నిదాచారు. భీముడు దానిన వెతుకుతూ ఆ చెట్లన్నీ పీకడం మొదలుపెట్టాడు. 'ఇలా నాశనంచేయకుబాబు నీ బొంగరం నీకిస్తా' అని ఇచ్చారు. అతను పీకినమేర చెట్లులేవు. ఉత్తగడ్డిమాత్రమే ఉంది.

సముద్రమట్టంనుండి భూమియెత్తు పెరిగినకొద్దీ వందఅడుగులకు 3.22 డిగ్రీల వంతున ఉష్ణోగ్రత తగ్గుతుంది. సముద్రమట్టాన 80డిగ్రీల ఉష్ణోగ్రత, 4,500 అడుగుల ఎత్తున 65 డిగ్రీలకు, గౌరీశంకరశిఖరం (ఎవరెస్టు) మీద 13 డిగ్రీలకు పడిపోతుంది. బెర్గ్‌సన్ సూత్రంప్రకారం, అధిక ఉష్ణోగ్రతగల ప్రదేశాలలోకంటె శీతలప్రదేశాలలో జంతువులశరీరం బాగాపెరుగుతుంది. ఎత్తులో వాయుపీడనంవల్ల జంతువులకుశ్వాస కోశాలబలం ఎక్కువ. కొండలలోని నిమ్నోన్నతాలు, నేలబలం, వర్షపాతం, వర్షచ్ఛాయ– వీటినిబట్టి అడవిలోని కొద్దిభూభాగంలోనే రకరకాల అనుభవాలు కలుగుతాయి. ఈ తేడా వానకొవ్వలి (వానపాము), కొండపిచ్చుకలనుండి ఊరపిచ్చుక, జముడుకాకి, ఊరకాకివరకు కనిపిస్తుంది.[11] ఈ వాస్తవాన్ని కథగా గిరిజనుడు మలచుకున్న తీరులివి.

**దేశాలు – మాయలు :**

దానవుల బోడమర్రి – దానవులు (రాక్షసులు) ఉండే మర్రిచెట్టు, తాతవారి భూములు, గురపనుకు దిమడాలు, మన్యానికి, దిగువకు సరిహద్దులు. కోలన్న, పిట్ట గడ్డ జాలంపల్లి దిగువగ్రామాలు. నందమ్మ నాగుల కూతురంటూ దిగువనుంచి

*వానకొవ్వలి, జముడుకాకి, కొండపిచ్చుక*

వచ్చినదని చెబుతారు. కథాపరంగా పుట్టనాగలోకం. నందమయ్యే బండిబసవన్న. నాగలోకం అనగా పల్లప్రాంతాలు. 'పల్లానపదివేయులు – కొండనొక్కవేయి'. పల్లంలో పదివేలవింతలు, పదివేలమాయలు. కొండలో విశేషాలు దానిలో పదోవంతుమాత్రమే. కొండలలో బయలుప్రదేశాలు సంతలుపెరిగి నాగరికత ప్రభావానికి లోనయినందున అవి 'ఆరువేయుల పూరుబయళ్ళు'. కొండప్రాంతం 'అసివేయులదేశం'. అక్కడ ఉన్నది 'అసివేయులపాప'. పండుగగ్రామం 'అసివేయులపట్నం'.

'కీసుబాసుదేశం కిముడు నందపురము' వాడు దొంగపూజారి. అక్కడివారిది కీసుబాసుభాష (ఒరియా, కుయి మొదలగునవి). బసవన్నను, నందమ్మను, సిరిసీత పాపను దొంగిలించేవాడు దొంగపూజారి.

అంబటూలరాజు దిగువనున్నభార్య అన్నమూలదేవి విత్తనాలుఇస్తుంది. పర్వతాల మల్లారెడ్డికథలో అనుముల బ్రహ్మారెడ్డి విత్తనాలు 'తెచ్చు'కొంటాడు. మత్స్యావతార గాథలో 'ఎరుకోడు దేవలోకం నుండి తెచ్చిన విత్తనం ఏడుగుజ్జులువోవ పోడేసినాడు'.[12] నాగలిని అరకు ప్రాంతాన 'తెలుంగునాగోర్' అంటారు. పశుపాలనం, నాగలితో వచ్చిన అవసరం.

**బండి బసవన్న :**

ఈ వ్యవసాయ వికాసాన్ని నందమ్మను బసవన్నుచేయడం, సారుదుంపను పాండవులకు సంకేతించడంలో కర్మకాండ రూపించినట్లే, విత్తనాలు తెచ్చుకోవడాన్ని, అరటిపువ్వుకేసరాలను రాల్చడంద్వారా అభినయిస్తారు. పుట్టమట్టితోచేసిన బసవన్నకు, సారుదుంపతోచేసిన బసవన్నకు పెండ్లి (సంస్కృతి, ప్రకృతి). ఈ సారుదుంప 'భూమికి బొడ్డు – ఆకసానికి అడ్డు' (చేమకూర). బొడ్డుకోసి బిడ్డనుపెంచుకుంటారు. చేమకూర ఆకులువస్త్రంవంటివి అనిభావన. బొడ్డుకోయడం, గుడ్డకట్టడం అనే రెండుప్రధానమైన సంస్కారాలను సూచించేది సారు(చేమ)దుంప. 'అడ్డుగుడ్డకట్టిన ఆడది– మొలతాడు కట్టిన మగవాడు' అని నానుడి.

**సత్తెవిత్తనాలు :**

కొండఅరటికి 'అలమంతపగడ' (హనుమ = అలమబండ = కొండముచ్చు)

తంత్రనామం. రాచెలుకదుంప కేవలం అడవిదుంపకాగా (గద్దేండ్లు) అడవిలోని కారుఅరటిని ఇళ్ళచుట్టూకూడ పెంచుకొని మంచిఅరటిగా గిరిజనులు మార్చుకున్నారు. అరటిపూల నుండి రాలినవిత్తనాలు ఫలించవు. అవి 'పాండవుల సత్తె విత్తనాలు'. అవి గద్దెకుఒగ్గేసి, మామూలువిత్తనాలు పంచుకుంటారు. పాండవులది కందమూలాలు ఏరుకుంటూ వ్యవసాయానికి ఎదిగిన సంస్కృతి. విత్తనాలపంట దానితరువాత దశ.

**జలకన్యకలు – తాబేలు తారప్ప – తాత సుంకమరాజు :**

కోలన్నను తాత సుంకమరాజు వద్దకు తీసుకొని వెళ్ళినది తాబేలుతారప్ప. లక్క మేడలు కాలిపోగా, పాండవులను సంద్రందాటించినవి తెల్లచేపలు. మత్స్యదేవత మహిమనుగూర్చి చెబుతూ పొరపాటున ఆగుండంలో ఎవరైనా మత్స్యాలకు పండ్లను అందిస్తూ కాలుజారిపడిపోతే ఆ చేపలే మునిగిపోకుండా అడ్డుపడేవని, ఇపుడు మైల వాళ్ళు, నీతిమాలినవాళ్లు రావడంవల్ల ఆ మహిమలు కనిపించడంలేదని అంటారు. తాబేలు, చేపలు, కప్పలు, ఎండ్రికలు జలకన్యకల పరివారం లోనివి. కన్యకలు మానవులపై సానుభూతిగలదేవతలు. వారికినాగరాజులతో వైరం.

**దేవగుమ్మడి – మంచిగుమ్మడి :**

దేవగుమ్మడిపండును ఏరుకొనివచ్చి పాండవరాజును పెంచినది చింతగొల్లవాడు (ఊరిలోగౌడు). మానవులను జంతువులే కాపాడేవి. కొందరు అదృష్టవంతులను ఆ జంతువుల కాపరులైన గొల్లలే పెంచేవారని గిరిజనుల కథలు (పచ్చగొల్ల, పాలగొల్ల, రాణిగొల్ల మొదలైన ఏడుగురు గొల్లలు).

**గురువులు :**

మురుదెలుక సొరంగం తవ్వి సంద్రంఒడ్డు దారిచూపించింది. మూడవ అధ్యాయం చివర క్షేత్రబీజన్యాయాన్ని గూర్చిన కథలో కూడా, మురుదెలుక చిలకమ్మ కోరినసాయం చేస్తుంది. మురుదెలుకకు మానవుల కష్టసుఖాలు తెలుసు. అదికూడా భూమిలోపల ఇళ్ళుచేసుకుని, ఆహారందాచుకుని మనలాగే బతుకుతుందని అంటారు. తల్లేడునాగు పొడిస్తే తొండగురువువచ్చి విషందించుతాడు. చెదలనైనవారిని పిల్లని ఇవ్వమని ఈపెద్దలే పాండురాజుపక్షాన అడుగుతారు. ఈవిధంగా జలకన్నెలు, గురువులు, గొల్లలు మానవులు పక్షాననేఉంటారు.

కొండలో పుట్టిన కొండదానుగుడు భీముడితో యుద్ధంచేసి ఓడిపోతాడు. ఈ దానుగుడు, భీముడు బావమరుదులే. కొండవారిఅల్లుడు కొండదానుగుడు-బిడ్డిగవారి అల్లుడుభీమసేనుడు. తనపంటపొలాలు, పశువులజోలికి అడవిజంతువులు రాకూడదని కోరుకునే భీమునిసంస్కృతి వ్యాపించడానికి, కొండలుపాలించే అడవులుకాబట్టి తన అధికారం చెల్లాలనుకునే దానుగుడిమధ్య పోరాటం సహజం.

**దేవతల ప్రతినిధులు :**

రాజులదుంప(రాచెలుకదుంప, సీమనేరుదుంప) కొండదానుగుడికి సంకేతం. రాచెలుక దానుగుడి ప్రతినిధి ఎలుకజాతిదైనప్పటికీ గబ్బిలంవలె ఎగరడానికివీలుగా సాగేచర్మంగలది. ఈచర్మంసాయంతో అది చెట్లనుండిచెట్లకు దూకగలదు. జీలుగ గెలలను కొడుతుంది. రాత్రించరం దీని వేట సాయంత్రం నాలుగుగంటల తరువాత ఉదయం ఎనిమిదిగంటలలోపలే. ఈ రాజులదుంపను గాలిధూళి కొండదయ్యాల పీడవదిలించే మూలికగా గిరిజనులు ఉభయమన్యాలలో వినియోగిస్తారు. దిగువ ప్రాంతాలకు అమ్ముతారు. ఈ దుంపఆకులు పడగవలె ఉంటాయి. అందువలన అది 'రాచెలుక పడగ'. గడిమన్యం కిలంకోటలోని రాజులను రాచెలుకరాజులంటారు. భీముడికి భీముడిజటతీగ సంకేతం. దీనిని ఇటింపండుగలో నాగేటిమునుకర్రలోపెట్టి భీముడే తమనాగలిని పట్టినట్లు భావిస్తారు.

దానుగుడికి ఊరమేకను బలివేయాలి. తొలకరిముందునుండి దానుగుడి దోషం ప్రతినెలాచేయాలి. నందిపండుగ చేయకుండా కొండచీపురు విరియకూడదు. 'నంది పండుగ చేసిన తరువాత అంకిలి అనుమానంలేకుండా కూరతెచ్చుకుంటాం, నార తెచ్చుకుంటాం, దుంపలకు వేటకు వెడతాం, తేనెలు తీస్తాం' అంటారు. వ్యవసాయం చేస్తున్నప్పటికీ ప్రకృతిమీద గిరిజనుడు ముప్పాతికమువ్వీసం ఆధారపడే ఉన్నాడు. గోదావరిలో వేటలకాటమయ్య మీద ఒకవిధమైన భక్తిప్రపత్తులుండగా, కొండ దానుగుడిని ఓడించాలనే కసి విశాఖలో కనిపిస్తుంది.

గొల్లబిడారులసాయంతో రాజ్యాన్నికాపాడుకొన్న నందపురపు రాజులు కృతజ్ఞతగా శ్రావణమాసంలో 'గొడ్లపండుగ' జరిపించేవారట. దాని ప్రభావంకూడా నందమ్మ బస వన్నల ఊరేగింపులలో ఉండవచ్చు. పసిబయలులోని 'గంగరాజు మాడుగుల' గంగ

రాజు అనే నందపురపురాజు పేరిటిది. ఒరిస్సాగిరిజనప్రాంతాలలో పశువులు దొంగతనాలకు డొంబుజాతివారు పేరుపడ్డారు. ఇటువంటి దొంగతనాలు పాండవులు చేసినవారే. దుగ్గలబోయుడి తోటలో దొంగతనమే కాదు శ్రీకృష్ణుని ఏమార్చి గోవులను కూడా దొంగిలించి ఆ మాంసం తినడానికి సిద్ధపడగా కృష్ణుడే మాన్పించాడు.

జాతి తన్నుతానుదిద్దుకోవడానికి కావలసిన ఆదర్శం కళలో వికసిస్తుంది. ఆ ఆదర్శంలో కనిపించేది తమప్రతిబింబమే. అద్దంలోబొమ్మ అందంగా కనిపించాలంటే సరిదిద్దుకోవలసినది తన ముఖాన్నే. ఆప్రయత్నంలో గిరిజనులు కొంత ముందడుగు వేసి పాండవులతో తాదాత్మ్యంచెందారు.

దానుగుడు పూలతంబలికి వాయువరానపుట్టినవాడట. భారతంలో జెండాపై నుండి కపిరాజు సహకరించినట్లే, ఈ 'అలమంతపగడ' నుండి గిరిజనులకు విత్తనాలు రాలుస్తాడు. దానుగుడికి భీముడికి వైరమున్నందున హనుమంతుడు కలగ జేసుకుని ఆబావమరుదులలో పాండవులకు మేలుచేస్తాడు.

**పిట్టగడ్డ జలంపల్లి పట్టపుకోలన్న:** [13]

'అన్నంవార్చుకున్నా అంబలికుండతప్పదు' అనుకునే గిరిజనులఈ గేయగాథలో అంబటూలరాజు (అంబలి) పార్వతిపరమేశ్వరుల శాపాన అడవులు పట్టినవాడు. అన్నమూలదేవి నుండి (అన్నందేవి) విత్తనాలు తెచ్చిన కోలన్నకూడా అన్నమూలదేవి వలెనే దిగువన జాలంపల్లివాడేకాని గొంతెమ్మకు కన్నెరికాన పుట్టినవాడు. కోలన్న అంటే కోలగాడు గ్రామనౌకరు. ఇతడు సాధారణంగా వాల్మీకి. సరుకు అమ్మే గిరిజనుడికి అయినా, కొనే షావుకారుకయినా, అధికారికయినా ఇతడేమధ్యవర్తి. తనపరపతితో విత్తనాలు ఇప్పించడాన్ని "తవ్వెడిచ్చికొన్నదోయి తవిటికోలన్న"అని వర్ణించారు. అతడు తాతసుంకమరాజువద్దకు వెళ్ళడం–పల్లపు వ్యవసాయానికి సంస్థానాధిపతుల అనుమతి తీసుకోవడమో, ముఠాపన్నులు చెల్లించడానికి కదిలివెళ్ళడమో కావచ్చును. అతడు కన్య గర్భానపుట్టడం మహాత్మ్యమో, భారతకథను యథాతథంగా స్వీకరించడమో స్పష్టంగా తెలియదుకాని అతడు పుట్టగానే కరువుపుట్టినదని గిరిజనుల నిదానం. కాని కన్నెరికాన పుట్టినకర్ణునివలె ఇతడు అవమానాలపాలు కాలేదు. కర్ణుడు కౌరవులతో ఉన్నాడు. కాని కోలన్నమాత్రం పాండవులతోనే ఉన్నాడు.

**మర్లుపులి :**

ఈ పదానికే అంటుగట్టిన వెలమరాజు కథలో వెలమరాజు జంతువుకు ఎరఅవుతాడు. జంతువు కామరూపంతో రామన్న, లక్కన్నలను వెంబడిస్తుంది. మనిషినిమరిగినపులిని 'మర్లుపులి' అంటారు. ఇది 'సగం మనిషి, సగంపులి రూపకం' పులి, చెడుపుముండ ఏడూళ్ళు ఒకరాత్రిలో తిరుగుతాయట. చెడుపుముండకు పులి గుర్రమట. పులి నరమాంసం మరగడం ఎంత ప్రమోదమో మనకూతెలుసు. నిత్య సన్నిహితమయిన 'మెకా'లగూర్చి హెచ్చరించడమే ఈ కథ. కారడవిలో ఉన్నవారికి ప్రకృతితో పోరాటం తప్పనిసరి.

వేదకాలంలో ఇంద్రుడు మిత్రావరుణులు అగ్నిదేవతలు, పురాణకాలంలో సంపదకు, విద్యకు ప్రాధాన్యం పెరిగి లక్ష్మీసరస్వతులాదిగా దేవతలువెలశారు. వీరికి పద్మాలయ, హంసవాహినులుగా స్థానమిచ్చినా ఈ తామరపూల సుగంధాలు, రాయంచల సత్యలోకాలు కాల్పనికమైనవే. అరటిపూరేకులను హనుమంతపగడగా భావించడం అట్టిదే. మహాబోధిని లతలతో పద్మాలతోసూచించడం బౌద్ధసంప్రదాయం. చిత్రశిల్పాలు వికసించని గిరిజనుల ఆరాధనావిధానంలో ఆయాస్థానాలు, పదార్థాలే దేవతల ప్రతినిధులు. పదచిత్రాలే దేవతలను బొమ్మకట్టిస్తుంటాయి.

కొక్కిసిగలవాడు కొండదానుగుడు.  
చిర్రచిర్రసిగలవాడు చిట్టిభీముడు.  
కర్రగోచులవాడు కర్జుమొగాలవాడు పుట్టుపూజారి.  
పాత గోచులవాడు పరిక బుర్రలవాడు – మట్టు మలపరి  
మూల పావులవాడు జాడిపావులవాడు – దొంగపూజారి  
కుంతిదేవి కొడుకులు – కొమ్ముటేనుగలు  
అన్నమదేవి కొడుకులు – అంబారేనుగలు

అడవిలో ఏనుగులు తిండికోసం నానా పాట్లుపడాలి. తిరగాలి. కాబట్టి అవి పెంపుడు ఏనుగులవలె బలిసిఉండవు.

రాజులపదంకంటె, గోదావరి వెజ్జుకంటె, విశేషమయిన పాత్రచిత్రణం – నంది పండుగలో గుర్తించదగినపరిణామం. దేవతలమహిమను తూర్పుగోదావరిజిల్లా యార్ల

గడ్డ రామవరంమండలం చాపరాయికి చెందిన శ్రీపల్లాలబొర్రంరెడ్డి తండ్రి బాలిరెడ్డి వెజ్జులో ఈవిధంగా ప్రస్తుతిస్తాడు.

'వంకమాను కిందవోయి – తూరనివారు బాబు
వాయులవారితోడ – నవ్వనివారు బాబు
జియ్యరుపిట్ట ముక్కులవారు – నాగుబాము నడకలవారు
పెంకలేని వంటలవారు – కత్తిలేని కోతలవారు
కడవలేని వంటలవారు
రాచకొండనున్న రాజులెవ్వరు
దుమ్మకొండనున్న బాలలెవ్వరు
సురటికొండనున్న దేబెలెవ్వరు
పాపికొండనున్న బాబులెవ్వరు
పిట్టగడ్డ జలంపల్లి బాలపట్టపు రాజులాల
ఐదలరాజులు మమ్ము చాలచూడుడు బాబు....'

కుందేలువంటి పరమసాధువులు పాండుగులు. అనగా వట్టిపిరికివారు. దారిలో ఒకపుల్ల అడ్డుగావచ్చినా దానిని దాటేప్రయత్నం చేయలేనిపిరికితనం కుందేలుది. ఆ దారివదలి పక్కగాపోతుంది. కుందేలు 'కాపువాడువేసిన కంచెను దాటనన్నదని – వడ్డెర వాడుతవ్విన నీరు తాగనన్నది' అని చెంచుల పొడుపుకథ. వరుస అయినవారితోకూడ నవ్వనిపాండవులు 'అన్యకాంతలడ్డంబైన మాతృభావనసేసి మరలే' ప్రహ్లాదుని కన్న గుణవంతులు.

తమ దుమ్మకొండ రాచకొండ ఐదలరాజులతో పాటు పక్కనేవున్న విశాఖమన్యం లోని పట్టపుకోలన్ననుకూడ పిలవడం పదాలవ్యాప్తిఫలితం. రాజులపదంలో దేవతలు రూపురేఖలు లేనివారు కాగా, నందిపండుగలో వారితో హాస్యమాడుతూ, బొమ్మగీసే ప్రయత్నం (గన్నికలు వలచడం) కూడా చేశారు. లంబసింగినున్న బాలరాకసమ్మ 'కుంచమంత పాదాలతల్లి రోకలంత ముక్కులతల్లి' అని అతిమానుషమైన వర్ణనకూడా చోటుచేసుకుంది.

నందిపండుగలో పల్లవిజోర (జోహారు) 'సాధువు'. కొలువుపండుగలో 'లేలలు

లెగగొట్టడం' (దేవతలను శత్రువులమీదికి ఉసికొలపడం) రాజుల పండుగలో లేలలు దేవతలను మేల్కొలుపుతాయి. కొలువుపండుగలోని 'లే లే లేరన్న లేగాద చెల్ల – లే లే లేరన్న లే కోలన్న' అని పాడే కొలువుపదాలకున్న ఉద్ధతి రాజులపదంలోలేదు.

## పంచపాండవులపంట – దుర్యోధనులవంట :

పాండవులు వనవాసానికి వచ్చారన్న విషయం గిరిజనులకెంతో ఆత్మీయమైనది. విశాఖమన్యం పాండవులు అజ్ఞాతవాసానికివచ్చిన మత్స్యదేశం. మత్స్యపర్వతం, మత్స్యదేవతక్షేత్రం, (మత్స్యలింగేశ్వరస్వామి) మత్స్యగడ్డలతోనిండిన ప్రదేశం ఇది. 'విరాటరాజు దేశం కాబట్టి ఇటింపండుగ చేసుకుంటాం' అని జననిరుక్తి. మాడుగుల రాజులది మత్స్యలాంఛనం.[14] పాండవరాజులకు ఆశ్రయమిచ్చిన వేటలభూమి ఇది. పంటలభూమి ఇది. ఈవిధంగా పాండవులతో తాదాత్మ్యంచెందిన కొండవారు, కాలక్రమేణ నాగరికత తాకిడికి బహుదీనత్వానికి లోనయినారు. అడ్డపిక్కలు, దుంపలు, ధాన్యాలు, విశాఖసంతలలో కనిపిస్తాయి. పొట్టకోసం పోగుచేసుకున్నవాటినికూడా నిత్యావసరాలై పోయిన బట్టలు, దుప్పట్లు, ఉప్పు, నూనెలు, సబ్బులు, గిన్నెలకోసం అమ్ముకోవలసిన ఆ దుర్గతినిచూస్తే బాధకలుగుతుంది. కూపికిపోయి కూలితెచ్చుకొని పండుగ చేసుకోవడం, 'స్వయంగా గోచీపెట్టుకొని, దైవాన్ని , ప్రభుత్వోద్యోగిని గౌరవించడమంటే, భక్తితోకాదు, భయంతోనే'. రకరకాలరూపాలతో కొండలకు ఎగబ్రాకిన ఆర్థికరూపాలు కొండవారికి అంతుపట్టనివైనవి. కష్టపడకుండా సంపాదించడం (వాణిజ్య, మేధోవృత్తులు) నాటికి నేటికి వారికి ఒక ఆశ్చర్యకరమైన విషయమే.

'దుకాణంబియ్యం' (పండించినవికావు), 'దుక్కమీది ముక్క' (దుకాణంలో చెక్క మీద మాంసంకొడతారు) కొందరికి ఎలాఅమరుతున్నాయో! ఊహించడానికూడా ఊపిరాడనంత వేగంతో ఈనాగరికత పిడుగులామీద పడుతున్నది. న్యూనతాభావంతో క్రుంగిపోతూ, పంటను అమ్ముకోవడాన్ని –

'కొండవారిపంట – దిగువవారివంట'

'పంచపాండవులపంట – దుర్యోధనులవంట'

ఈ సామెతలు కళ్ళకుకట్టినట్లు చెబుతాయి. కొండలలో పాండవులు, దిగువనున్న

కౌరవులతో ఓడిపోతుండడం సజీవసత్యం. ఈ పరాజితభావం మొదటినుండి ఉన్నట్లయితే అసలీగేయగాథ పుట్టకనేపోను. ఇటీవలికాలంలో పెరుగుతున్న ఖర్చులు, మోసాలు, గిట్టుబాటుకాని ధరలు; ఈ దుస్థితి తట్టుకోలేని ఆక్రందనలివి.[15] ❉

**విశాఖమన్యం వ్యవసాయంలో సమస్యలు(-), పరిష్కారాలు(+)**



## విరుద్ధధర్మాలు - సమన్వయించే మాధ్యమాలు :

పదార్థంలోని విరుద్ధధర్మాలను వశంచేసుకుని, కావలసిన విధంగా మేళవించి శక్తిని ఉత్పత్తిచేయడం శాస్త్రప్రయోగం. ధనఋణధృవాలలో శక్తిని వింగడించి అదుపులోనికి తెచ్చిన ఫలితంగా విద్యుత్తు ఉత్పత్తిఅవుతుంది. నగరాలలో ఆగడానికి సాగడానికి గుర్తులుగా ఎర్ర, ఆకుపచ్చరంగులను ఉపయోగిస్తారు. రైలుగార్డు వీటిని జెండాలుగా చూపిస్తే, చతుష్పథంలో (చౌరస్తా) కాంతిప్రసారం ద్వారా ప్రదర్శిస్తారు.[16] స్త్రీపురుష జన్యుకణాలను విభజించగలిగినందుననే కొత్తవంగడాలను సృష్టించుకో గలిగాము. దానుగుడు పాండవులు సాంస్కృతిక దృష్టిలో విభిన్నవర్గాలుకావడం అట్టిదే. ఈ విభాగం, వాటిని ఉపయోగించుకునే నేర్పు మానవునికి అనాదిగా ఉన్నదే. స్త్రీపురుషులు, వెలుగునీడలు, తీపిచేదులు, ఆయా భావాలకు సంకేతాలుగా మానవుని ఊహలకు పునాదులువేశాయి. మనిషి ఇంద్రియజ్ఞానంతో మాత్రమేకాక, సంకేత జ్ఞానంతో జీవిస్తున్నాడు. ప్రకృతిని జీవికకు, తత్వాన్ని సంస్కారానికి ప్రాతిపదికలుగా చేసుకోవడంలోనే శాస్త్రం, కళ అవతరించాయి. ఉభయవర్గాలలో చేరీచేరని వస్తువులు ఒక ప్రత్యేకమైన గౌరవాన్నిపొందుతాయి. ఇరువర్గాల శక్తియుక్తులను సమన్వయిస్తాయి. వంటిమీద పొలుసులతో చూడడానికి చేపవలెఉండి నేలమీద నడుస్తూ చెట్లెక్కుతూ తనంత తానై వేటగాళ్ళకు దొరికిపోయే 'పంగోలియన్' (వాలుగ) మధ్యఆఫ్రికాలోని లే లే జాతిలో ఒకతాంత్రిక స్ఫూర్తినిస్తుంది.[17] రాచెలుక, చెదపుట్ట తూర్పుగిరిజనులకు ఇచ్చిన స్ఫూర్తి అటువంటిదే.

ఈ గిరిజనభారతంలోనేకాక ప్రపంచమంతటా మానవసమాజాలలో గాధల కథన ధోరణి ఇట్టిదే. దేశకాలభేదం ఉన్నా ప్రపంచమంతా పరిసరం ఒక్కటే. దానినుండి మానవజాతి పొందేస్పందన అంతటాఒక్కటే. అందువలన రూపకాలలో, కథనవైఖరిలో సామ్యంఎంతోవుంటుంది. చదువుసంధ్యలుగల సమాజాలకు చరిత్రఎట్టిదో అక్షరజ్ఞానం లేని జానపదులకు పురాగేయగాధలటువంటివి. కాని జానపదులు తమ చరిత్రను అనేక పరిభాషలలో సూత్రబద్ధంచేస్తారు. ఈ పరిభాషలన్నీ ఒకదాని తరువాత ఒకటికాక, మనోవ్యాపారబలంవల్ల ఏకకాలంలోనే ప్రజ్ఞానాన్ని వర్గీకరించి స్పందింపచేస్తాయి. దేశకాలాలతో పాటే మారుతుంటాయి. కాబట్టి కనిపించే సమాధానాన్నిబట్టి లెక్క ఎలా

మొదలైనదో వెతుక్కుంటూ వెనుకకుపోవడంలో సఫలమయినపుడే, భావిలోరాగల సమస్యలనెదుర్కొనే పటిమను జాతిలోపెంచడం సాధ్యమవుతుంది. ఆవరుసలో కూరిస్తేనేతప్ప అంకెలతాళాన్నితీయలేము. సంకీర్ణమైన – సంస్కృతినిర్మాణ వ్యవస్థను ఆవరించిన రాగద్వేషాలను తొలగించి సత్యకాముడనైన నాదృష్టికి స్వచ్ఛజ్ఞానాన్ని, చైతన్య విలాసాన్ని గోచరింపచేయి ప్రభూ! అని జిజ్ఞాసువులు చిరకాలంగా అర్థిస్తున్నారు.[18]

ప్రయోజనాపేక్షతోచేసే కర్మకాండనుజరిపించే గేయగాథలలోశిల్పసౌందర్యానిది తరువాతిస్థానం. ఆయాపాత్రలు ఆయాసందర్భాలలో పాటించవలసిన నియమాలు నిర్దిష్టమైనలక్ష్యం జానపదగాయకుడిని యథేచ్ఛగా విహరించనీయవు. ఆ సొగసులకు చూడవలసినవి పెండ్లిపాటలు. పెండ్లి వధూవరులదైనా, సమాజానికి అది ఒకపండుగ. ఒకసంస్కారం. స్త్రీపుంస యోగోద్భవమైన సామాజికసంబంధాలను స్థూలంగా తెలుసుకొని ఆ వేడుకలలో మనమూ పాల్గొందాం.




కొండరెడ్లు
ప్రకృతి
గన్నికలు – చెట్టుపండుగ
గొల్లలు – మామిడిపండుగ
అడవిరాజులు – రాజులపండుగ
సంస్కృతి
భూదేవిపండుగ
పాండవరాజులు
కొత్తలు
పూజార్లు లెంకలు
పెద్దలు
జంగాలు
పెతర్లు
గూనకుదురు
స్నేహితులు
గంగాలమ్మ
గొర్లె(వాల్మీకి)వారి ఆడపడుచు
మన్నన చుట్టరికాలు
స్థానికులు+వలసలు
కావికట్టు
గ్రామంలో స్థలాలు
గొట్టుబస
నగరిబస
చేవడిబస
నెగడుబస
సమర్తచింతలు
భూదేవిచింతలు
గోవుల,గుబ్బట్లమామిడి
గంగాలమ్మబస
మగనాలిమెట్ట
నాయకులు
గ్రామమునసబు
పెత్తందారు/ పిన్నపెద్ద
ముఠాదారు
మన్సబుదారు (రంప)
పండుగలు
జాతరలు
శివరాత్రి
కోరుకొండ
మందులు,మాయలు
గొరవలు
వెజ్జులు
చెడుపులు
ఉగ్రదేవతలు
మావెలి
దారిపండుగ

## నందిపండుగలో పాత్రధారులు, సూత్రధారులు




| **అడవిజంతువులు** | - | **ఊరజంతువులు** |
|---|---|---|
| గురగేదెలు (అడవిదున్నలు) | - | గేదెలు |
| కారుకోళ్ళు | - | కోళ్ళు |
| కొండమేకలు | - | మేకలు |
| కొండగొర్రెలు | - | గొర్రెలు |
| బరవడి | - | నక్క |
| పండుపిల్లి | - | పిల్లి |
| కొండపిచ్చుక (కన్నె) | - | పిచ్చుక |
| జముడుకాకి | - | కాకి |
| కొండముచ్చు (అలమబండ) | - | కోతి |

## ఉత్పత్తి సంబంధాలు - న్యాయాలు

| కొండపోడు | పొలం | సంత |
|---|---|---|
| బీజప్రధానం విత్తినవానిదే పంట | క్షేత్రప్రధానం పొలంయజమానిదే పంట | కొన్నవాడిదే పంట |
| 'కొండనొక్కవేయి' | 'ఆరువేయుల పూరుబయలు' | 'పల్లాన పదివేయులు' |
| వేయి మాయలు | ఆరువేల మాయలు | పదివేల మాయలు |
| | | 'పంచపాండవులపంట –దుర్యోధనుడి వంట' 'దుకాణం మీద బియ్యం – దుక్కమీద ముక్క' |

తుడుము





చిన్నతుడుము

సన్నాయి




జలకన్యకలు
అడవిగొల్లలు
గురువులు
మర్లుపులి (చెడుపు)
అమ్మతల్లి (మావెలి)
దానుగుడు
(క్రూరజంతువులు)
జాంకరి
పోతురాజు
సంకులమ్మ
ఆసివేయులపట్నం
(పండుగగ్రామం)
ఆసివేయులదేశం
(మన్యం)
(విరాటరాజుదేశం)
ఆసివేయులపాప
అంబటూలరాజు
మిత్రులు
శత్రువులు
దేవతలు
తల్లిదండ్రులు
విశాఖగిరిజనులు
చుట్టాలు
విరోధులు
అన్నమూలదేవి (విత్తనాలు)
తాతసుంకమరాజు (భూమిశిస్తు)
కోలన్న (గ్రామనౌకరు)
నందమ్మ (బసవన్న)
గారమూలకోట
దుర్యోధనుడు

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. ఆంధ్ర మహాభారతము, సభాపర్వము నన్నయ.

2. Understanding sociology S.C. Dube, 1977, NCERT P. 20-21; 8

Man has animal needs but cultural ends. No other animal has needs social and psychological generated by culture. The long spell that human child requires for development is made possible only by social life.

3. Illusion & Reality. Christopher Caudwell, 1956. People's Pub. House, New Delhi. P.146.

Mechanical materialism, for example, started from the position that only those qualities are real into which the observer does not enter. Thus first the world was stripped-off colour, feeling, scent and temperature for these could be easily be demonstrated to have natural component. Einstein advanced this a stage further by demonstrating the dependence of size, weight, duration, and motion on the observer. The development of quantum mechanics impugned even this and nothing invariant was left but a probability wave...... wavical..... a mathematical function.

4. Culture and public action 2004. Permanent Black.

In detaching people from their geographical territories, historical places, or semantic self-adscription frame-works, modernization is creating a new world context. P.180.

5. Illusion & Reality. Christopher Caudwell, 1956. People's Pub. House, New Delhi. P. 266. Science is all active cognition. Art is all active cognition.

Art is the science of feeling - science is the art of knowing. We must know to be able to do. We must feel to know what to do. Page No. 270. Hence the science and art together are able to symbolize a complete universe which includes the genotype itself. Each alone is partial, but the two together make a whole not as fitted together but as they interpenetrate man's struggle with nature in the process of concrete living.

6. The collected essays of A.K.Ramanujan. Ed. Vinay Dharwadker. 2004. OUP. Is There an Indian Way of Thinking.

P.45. Even space and time, the universal contexts, the Kantia imperatives, are in India not uniform and neutral, but have properties, varying specific densities, that affect those who dwell in them. The soil in a village, which produces crops for the people, affects their character (as liars, for instance, in E.V.Daniel's village 1984); houses (containers par excellence) have mood and character, change the fortune and moods of the dwellers. Time too does not come in uniform units: certain hours of the day, certain days of the week, etc. are auspicious or inauspicious (*rahukala*); certain units of time (*yugas*) breed certain kinds of maladies, politics, religions (*e.g.kaliyuga*). A story is told about two men coming to Yudhisthira with a case. One had bought the other's land, and soon after found a crock of gold in it. He wanted to return it to the original owner of the land, who was arguing that it really belonged to the man who had now bought it. They had come to Yudhisthira to settle their virtuous dispute. Just then Yudhisthira was called away (to put it politely) for a while. When he came back the two gentlemen were quarrelling furiously, but each was claiming the treasure for himself this time! Yudhisthira realised at once that the age had changed, and *kaliyuga* had begun.

7. ప్రాచీనాంధ్ర చారిత్రకభూగోళము. కుందూరి ఈశ్వరదత్తు, బి.ఎ., ఆ.ప్ర. అకాడమి. 1963. పుట.146

8. **చక్రకొట్టమండలము :**

చిందకులరాజగు మధురాంతకుని శా.శ.987 నాటి రాజపుర తామ్ర శాసనములోనీమండల నామము పేర్కొనబడినది. ఈ చక్రకొట్టము బస్తరు రాజ్యములోని రాజపురమున కెనిమిది మైళ్ళ దూరముననున్న చిత్రకోటమను గ్రామము. ఈ శాసన ప్రకారము భ్రమరకోట్య మండలములోని రాజపురమును గ్రామమును మధురాంతక దేవునిచే మేడిపోతుడను వానికి దానమీయబడినది. ఈ దానమునకు సాక్షులు చక్రకోట్య మండలములోని శ్రీధారేశ్వర, ముధశేలి, నాగహస్తి, కరణదారియా యనువారలు. శాసన పరిష్కర్తలు చక్రకోట్య మండలమునకే భ్రమరకోట్య మండలమను పేరైయుండవచ్చునని సెలవిచ్చిరి.

పూర్వ చాళుక్య ప్రభువైన మూడవ విజయాదిత్యుడు గెల్చిన చక్రకోటమును, చోళరాజైన రాజేంద్రచోళుడు జయించిన సక్కర కొట్టమును చోళచాళుక్య రాజైన కులోత్తుంగ దేవచోళుడు ముట్టడించిన చక్రకోటమునొక్కటియే.

E. Vol IX Rajapura Gopper Plates of Madhuranatakadeva. No.23. (A.D.1065)

9. Terrestrial Environment. The bacteria in soil require oxygen and are unable to act if water logging prevents the absorption of free oxygen.

మానవులు – మహీధరాలు. మహీధర జగన్మోహనరావు. విశ్వసాహిత్యమాల రాజమండ్రి, పుట. 138. పొలాలు లోతుగాదున్నని కర్రనాగలివల్ల ఏమౌతుంది. ఆధునికమైన ఇనుపనాగళ్ళను మన రైతులు వాడకపోవడానికి – మేతచాలని వాళ్ళ గుర్రాలు బక్కచిక్కి ఎండి ఇనుపనాగళ్ళేం లాగగలవు! భూమిలోతున నీటినిలువకై అరలరలు నిర్మించుకునేందుకు అవకాశం అధికం. నేల పైపొరలలో సున్నం బహు తక్కువగా ఉంటుంది. ఉన్నదంతా నీటిలో కరిగిపోయి పీల్చివేయబడి ఉంటుంది. నేలను తేలికరకం నాగళ్ళతో గోకుతారుగాని దున్నరు. చేలుబాగుండకపోవడంలో రహస్యం ఇదే.

పుట. 129. చలి దేశాల్లో యిండ్లకు నేలంతా చెక్కకూర్పు. గోడలూ చెక్కకూర్పులే. ప్రతి ఇంటా నాగళ్ళు. కొయ్యలేనిదే మానవజీవితమే లేదక్కడ.

10. Handbook of Social and Cultural Anthropology. Ed. John J.Honnigman; Symbolism in ritual context Nancy.

Ritual manipulates a lexicon of social cultural concepts of categories that refer to various domains of experience within a particular society and condense the meaning of these domains. For instance, categories of flora & fauna; categories of persons, body guards and fluids colour and perceptual properties like heat, cold etc. These such as those of binary opposition and associating clustering: I shall call it cultural code. Page No. 582. Ritual symbols or testaments to the joining of individuals in objective social relationships that have personal subjective relevance and internalised normative value. Ritual'fail' when they no longer co-imply this sort of relationship.

11. Indian hill birds. Page 9. Salim Ali, 1942. Oxford. As a mountain ascended, temperature drops at the rate of 3.22 F for every 100 feet. In other words, a temperature that 80 feet sea level will become 65F at 4,500 feet 60F at 6,000 feet and fall to 13.F below zero on the summit of Everest.

Vertical zonation of the above kind is most striking on mountains standing in the tropics. Here the transition from tropical temperate flora becomes far more abrupt in a few thousand feet of a ascent than in many hundred of miles of latitude required to compensate for the fall in temperature experiences in the ascent.

There is a well-recognised natural axiom, known as Bergman's rule that among warm-blooded animals, which inhabit an extensive geographical range, those occupying colder portions grow to a large size than their fellow of warmer portions. Thus in the Northern Hemisphere, animals of the temperate regions average larger than their representatives in the tropics. And the same rule is also found to apply as between forms occupying higher and lower life zones of mountains. Side by side, adoptive modification in this structure also.

12. జానపద గేయాలు – సాంఘిక చరిత్ర. సంపా.డా.బి.రామరాజు, డా.నాయనికృష్ణ కుమారి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ 1974. పుట.104.

13. ప్రాచీనకావ్యంలో తెలుగునాడు – డా॥ పి.నరసింహారెడ్డి, 1991. పుట.140

'పిట్టగడ్డ – జాలంపల్లి పట్టపు కోలన్న' అని నందిపండుగలో ఈ పిట్టగడ్డను చాలాసార్లు ప్రస్తావించారు. మత్స్యరాజ్యంలో ఒకప్రాదేశికభాగమైన 'పిట్టగడ్డ' ఒక గిరిజననాయకుని అధీనంలోదికావచ్చు. రెడ్డిరాజులు, తమసామంతరాజ్యం మత్స్య దేశాన్ని వర్ణిస్తూ పసిబయలులోని లోతుగడ్డను కూడా పేర్కొన్నారు.

14. 'ఒడ్డాది మత్స్యరాజులవంశావళి', సింహాచలం. యం.ఫిల్ వ్యాసం, తెలుగు విశ్వవిద్యాలయం.

పుట.11 మత్స్యవంశపు పుట్టుక దిబ్బిడాగ్ర హారము శాసనము ప్రకారము మూడు లోకములకు ప్రభువు, లోకములందంతటా నిండియున్న వాడైన విష్ణువుకు నాభి కమలమందు బ్రహ్మ ఉదయించెను. బ్రహ్మకు ప్రీతిగా అత్రి పుట్టెను. అత్రికి కశ్యపుడు అను ముని పుట్టెను. ఇతని వంశమునకు చెందిన సారంగుడు అను ముని ఒక రోజు

ఆకాశమునందు విహరించుచూ ముకుంద పర్వతమునకు అనుకొనియున్న మత్స్యనదిని చూసెను. ఆ మునివర్యుడు ఆకాశమునుండి పర్వతము ప్రక్కనయున్న మత్స్యనది ఒడ్డునకు దిగివచ్చి అక్కడ పాపపరిహారప్రాయశ్చిత్తం కొరకు ఘోరమైన తపస్సు భంగము చేయుటకై ఇంద్రుడు మంజుఘోష అను అప్సరసను పంపెను. ఈమె అందచంద ములకు ముగ్ధుడైన మునివర్యుడు తపస్సును విడనాడి ముంజుఘోషను మోహించెను. తరువాత సారంగుడు తనదివ్యదృష్టితో మంజుఘోష తన తపోభంగము నకు ఇంద్రునిచే పంపబడిన అప్సరస అని తెలుసుకొని ఆమెను చేపగా జీవించమని శపించెను. అంతవరకూ మంజుఘోషచే ప్రేరితుడైన సారంగుడు తన వీర్యమును మత్స్యనదియందు జారవిడిచెను. దానిని అదే నదియందు మత్స్యరూపంలో ఉన్న మంజుఘోష సేవించి గర్భందాల్చి పుత్రుని ప్రసవించెను. ఈ బాలుడే సత్యమార్తాండుడు అను నామముతో మత్స్యవంశ రాజ్యమును స్థాపించెను. ఉత్కళ రాజైనటువంటి జయత్సేనుడు సత్యమార్తాండుని శౌర్యపరాక్రమములనుగూర్చి విని తన కుమార్తె అయినటువంటి ప్రభావతినిచ్చి వివాహం చేసెను. ఇతనిని ఒడ్డాది మత్స్యరాజ్య పాలకునిగా నియమించెను. సత్యమార్తాండుని తరువాత ఒడ్డాది మత్స్యరాజ్యమును పరిపాలించిన 23వ రాజైన అర్జునదేవునివరకు మొత్తము (22) ఇరువదిఇద్దరు రాజులు పరిపాలించిరి.

'క్రీ॥శ॥ 1292నాటి దిబ్బిడాగ్రహార తామ్రశాసనంలో మత్స్యవంశానికిచెందిన అర్జునదేవుడు వడ్డాదిరాజధానిగా మాడుగుల, చోడవరం, పిట్టగడ్డ పరిసర ప్రాంతాలను తన అధీనములోనుంచుకొని కాకతీయుల ఆధిపత్యమునంగీకరించి రాజ్యపాలనము చేసినట్లు పేర్కొనబడెను'.

15. P.121. Rebellious Hillmen : the Gudem-Rampa Raisings, 1839-1924. David Arnold. Subltern Studies I, writings on South Asian History and Society. Ed. Ranjit Guha, Delhi - O.U.P. 1997.

In the Eastern Ghats the function of religion may be said to have been two-fold. Firstly it expressed the hillmen's dissatisfaction with their subjugation and offered a means by which they hoped for deliverance from oppression. Secondly, it gave them a new courage, a heightened sense of their common identity as hillmen; it forged a new solidarity that enabled them to fight their materially more powerful opponents.

One can see both these functions in the 1886 rising in Gudem. At the end of 1885 Potukuri Maladu, a Konda Dora Priest (or Sivasari) and cultivator, was visted by Salabi Bodadu, a Sivasari from a neighbouring Mutta. Bodadu said that god had appeared to him and assured him that the hill people would once again rule their country and that they would be successful if they rose in a fituri against the government. Bodadu also told Maladu that he had met the Pandavas in a jungle: they foretold success for the revolt and, as a token, gave him a cane, which he showed to Maladu. Maladu consulted Murla Balauyya, the munsif of Sadiki village and a Bagata, who gave his approval to a fituri. The cane was placed in Maladu's hut and worshipped.

According to the Agent, Bodadu had been wandering about the hills from village to village 'like a man possessed' for the past two years, making 'certain mad prophecies' and saying that the gods favoured a fituri. With the help of Potukuri Maladu, he gathered a band of about twenty Sivasaris and other Konda Doras and in January 1886 they traveled through the hills of Padwa and Madugula, visiting shrines and seeking divine approval for a fituri. Among the sites visited was Matsya Gundam, a rock-pool on the sacred Macheru River near Paderu. On their return they began to make preparations for the rising.

At this point two new characters entered the drama. One was Jani Kakari, a Konda Dora and former landholder from just below the ghats, whose involvement in the fituri will be looked at more closely later. The other was Rajanna Annatayya, a Telugu from Kasimkot in the plains. A 'regular rolling stone', he had been a teacher and police constable (until his dimissal in 1872); he then drifted to Gudem Patavadi where he taught the sons of mokasadar. Perhaps, as with many such leaders, it was lack of worldly success, which turned Anantayya towards millennial beliefs. He joined the discontented hillmen at sadiki claiming that he was Hanuman and would lead a Rama Dandu (Rama's Army) against the British. One of the young villagers, Surla Ramanna, partly through the suggestion of his name, was similarly taken up as an incarnation if Rama. As befitted deities, 'regular worship was paid to them', and hillmen from neighbouring villages came to make obeisance to them and

perform Pujas in their honour. When 'Sri Rama' spoke, he said that the days of the British were over and that the muttadars would regain their ancient authority.

P.124 - 125. Jani Kakari held land in Pesarada, a mokhasa village at the foot of the ghat, but in 1878 lands that he and his co-sharers in the mokhasa claimed as theirs were adjudged by the Principal Assistant Collector to belong to the neighbouring ryotwari village of Pallapunagandhorapalem. Shortly after this decision the Survey Department demarcated the boundary between the two villages in such a way as to deprive Kakari of still more of what hi thought to be his land. Behind both these misfortunes he saw the hand of his rival, Yella Venkaiah, an influential ryot of Pallapunagandhorapalem, who also had Kakari imprisoned for fifteen days for reaping the crop he had sown in a disputed field. Too poor to take his grievance to the courts and feeling, besides, that his enemy and the bureaucracy were conspiring against him, Kakari decided to avenge himself by murdering Venkaiah. At the end of May 1886 he went to Sadiki where he had relatives and knew that discontent was brewing. He promised to join the fituri if the hillmen would first help him against Venkaiah. This was agreed, sacrifices were made for the success of the expendition, and on 3 June Kakari and six men from Sadiki attacked Venkaiah's house. They set it on fire and killed one of the servants, but failed to murder Venkaiah, who by the light of his blazing house recognized Kakari. For the latter there could now be no turning back. Two weeks later he led the raid on Gudem police station and the government bungalow at Chintapalle.

P.111. In years of poor harvest there was little for the hillman to eat or the sahukar to distrain. In bountiful years the sahukars descended at harvest time, like a plague of loccusts, taking the grain from the threshing-floor and the tamarinds from the trees. For the hillman 'good years' and 'bad years' were almost equally bad.

16. Claude Levistrauss. Edmund Leach. 1976. Let me give a very simple example of colour spectrum which runs from violet through blue to green yellow to red. It is discrimination of human brain which brakes up the continum into signals so as to feel blue, green, yellow, red etc.

17. Implicit Meanings. Mary Douglas. Routledge & Keganpaul 1975.

Page 33. In our forest there is an animal with the body and tail of a fish, covered in scales. It has four little legs and it climbs the trees. Anomalous characterstics like the scalytail, would set the Pangolian apart.

18. హిరణ్మయేణ పత్రేణ సత్యస్య పిహితం ముఖం
తన్మే బ్రహ్మాన్ అపావృణు సత్యకామాయ దృష్టయే. – ఛాందోగ్య ఉపనిషత్.

❃ గతితార్కిక భౌతికవాదం – చారిత్రకభౌతికవాదం. ప్రగతి ప్రచురణాలయం. మాస్కో–1980. పుట. 173,183,330. సిద్ధాంతం జనసామాన్యం మనస్సులను ఆవహించగానే ఒక భౌతికశక్తి అవుతుంది.

❃ Culture & Experience; Irwing A. Hollowell, University of Pennsylvania Press, 1967.

Page 216. When one thinks of time, not as a sequence of experiences but as a collection of hours, minutes and seconds, the habit of adding time and saving time come into existence. Time took on the character of an enclosed space; it could be divided, it could be filled up, it could even be expanded by the invention of labour saving instrument.

❃ Plough & pasture. E. Cecil Curwen and Gudmund Hatt. Collier Books, 1961.

It is striking fact that the earliest domestication of certain animals as means of controlling food supplies seems to have taken place at approximately in the same time as the earliest cultivation of cereals, page.15. On the whole, it seems probable, that bread wheat was cheap form of wheat reaching Europe by the Danubaen route while it is possible that a Emmer may have been diffused by the sea route.

Page 49. We have to notice that millet were cultivated in the warmer and sunnier climates.

❃ The Agricultural Systems of The World; D.B.Grigg, Cambridge Geographical Studies, 1974. Page 9.

❃ కళింగదేశ చరిత్ర. సంపా.రాళ్ళబండి సుబ్బారావు. 1930. పుట.421. ఆంధ్రేతిహాస పరిశోధకమండలి.

❋ Science Reporter, October 1981.

❋ కళ్ళంలోని ఆచారాలలో 'రాజులచేట' ఒకటి; పుట 13 మాండలిక వ్యవసాయ పదకోశం 1974. నాగులకు పచ్చిపదార్థాలను నివేదించడం ఆచారం. నాగపంచమి నాగులచవితి పండుగలనాడు పెనంపై రొట్టెలను కాల్చడం కూడా నిషిద్ధం.

నాగారాధన; జానపద సరస్వతి సి.వసుంధర పుట. 73

❋ అమృత సంతానం. గోపీనాథమహంతి. అను పురిపండా అప్పలస్వామి, కేంద్ర సాహిత్య అకాడమీ.

❋ 16. Myth and meaning, Claude Levistrauss, Schocken Books. Newyork, 1979.

Page 23. We could only understand the property of myth at a time when the cybernetics and computers have come to exist in the scientific world and have provided with the understanding of binary operations which had already been put to use in a very different way with concrete objects of living by mythical thought.

❋ 'History organizes its data in relation to conscious expressions of social life, while anthropology proceeds by examinng the unconscious foundation. P.243.

❋ Myth & meaning, Claude Levistrauss. Page 42.

In our societies history has replaced mythology and fulfils the same function, that for the societies, without writing and without archieves the aim of mythology is to ensure that as closely as possible - complete closeness is obviously impossible - the future will remain faithfull to the present and to the past. For us, however, the future should be different from the present, some difference depending on our political preference.

శిల్పాలలో జలదేవతలు :

❋ కాకతీయవైభవతోరణాలు. డా. పోలవరపు హైమవతి 2005. పుట. 62

నీటిపుష్కలతకు చిహ్నమైన రాజహంసలను కాకతీయుల తోరణద్వారాలు భుజాలకెత్తుతున్నట్లు చూపారు. శిల్పంలోని మొసళ్ళు చైతన్యవంతంగా కాళ్ళుపైకిలేచి నిలబడినట్టుంటాయి. తటాకతీరాలపై గంగాధరుడైన శివునిఆలయాలను నిర్మించారు.

కట్టమైసమ్మ తీరాన్ని కాపాడుతున్నట్లు గుళ్ళుకట్టారు. జలసాధనఫలితమే పుష్కలమైన పంటలు. అందుకు ప్రతీకగా అన్నపూర్ణను నిలిపారు.

❁ పుట. 58 అక్కాచెల్లెళ్ళబావి, సవతులబావి, గడియారంబావి, కోడికూతబావి – తలుపులబావి, పుట్టబావి, బలరామునిబావి, శృంగారబావి – ఇలా ఎన్నెన్నో. అక్కచెల్లెళ్ళ జంటబావిలో, ఒకదానిలోమంచినీరు మరోదానిలోఉప్పునీరు ఊరతాయి. సవతుల జంటబావిలో ఒకదానిలో నీరుఊరితే మరోబావిలోఊరదు. శృంగారబావినే వసంత బావి అని నేటికీపిలుస్తారు. ఇది అంతఃపురస్త్రీల ఈతకొలను. వసంతోత్సవాల సమయంలో తరతమభేదం లేకుండా ఈ కొలనుచుట్టూఉండే ఉద్యానవనంలోచేరి రంగులుచల్లుకుంటూ పండుగ జరుపుకుంటారు.

❁ ఈపండుగలు, కథలు, ఆచారాలు పేర్లుమార్పుతో పొరుగుతెగలలోకూడా ఉన్నాయి. 'గన్నికలు వలచడం' – సవరలు దీన్ని 'ఇడిసింగ్' అంటారు.

❁ గిరిజన సాంస్కృతి పరిశోధన శిక్షణసంస్థ మోనోగ్రాఫ్‌లో (1972) భీమసవరల చరిత్ర.

'ప్రస్తుతం మందస తాలూకాలోని మహేంద్రతనయపర్వతంమీద పాండవులు ఉండేవారు. ఒకరోజు ద్రౌపది అర్జునిడిని పులితోక తెచ్చిపెట్టమని కోరింది. అర్జునుడు భీముడికి చెప్పాడు. భీముడు బాణంవేశాడు. కాని దురదృష్టవశాత్తు అది ఆవుకు తగిలింది. దెబ్బతగలగానే అది 'అంబు' అని అరచింది. ఆ ప్రదేశం 'బారువ' పేరు అయింది. భీముడు బాణంతీశాడు. ఆ ఆవు పారిపోతూ దారిలో పేడవేసింది (పొతిలి) ఆ ప్రదేశం 'పొట్టంగి' అయినది. ఇంకా కొంతదూరం పోయి చచ్చిపోయింది. ద్రౌపది ఆ ఆవును వండి వడ్డించింది. భీముడు తప్పమిగతావారు తినకుండా విస్తరాకు తోసేశారు. భీముడు ఆవుమాంసం తిన్నందున పాండవులకు కోపంవచ్చింది. సవరవాడిలా ఆవుమాంసం తిన్నాడుకాబట్టి అతని సంతానాన్ని 'భీమసవర' అని పిలవసాగారు.

# స్త్రీ పుంసయోగం

సృష్టిచేతి ఆయుధం కాంక్ష
సంఘంచేతి ఆయుధం ప్రతిష్ఠ

* **ప్రయోగశీలం**

ఇచ్చిపుచ్చుకోవడాలు

దాచిదాచితింటే – మానుమానుకు వాసన

కలిమిముద్దలు – సాటుభోజనం – పొల్లావులు – పొగరేకులు

తీపలులాగడం– కాల్దొక్కికంకణంకట్టడం – పాపనుఉంచుకోవడం – మగనాలి

ఆలి అరవై – ఓలి ముప్పై

పినతల్లి కోకిరి

మగనాలిమెట్ట – తప్పులమామిడి

అడవికిపారడం

* **ఉన్నవారిసొమ్ములు తినండి – ఊరివారిపనులు చేయండి**

వలసల జాడలు

కావికట్టు

నేస్తం

మూడువర్గాల సంగమం – గంగాలమ్మ పండుగ

గొరవలకొట్టి – నాయకమడి

సిక్కేసి చంపుతా

మార్పుకు మార్గదర్శి – సాదల రామన్నదొర

పోయినింటి బాలగాని – పుట్టినింటి బాలకాదు

## ప్రయోగశీలం :

సమాజం 'స్త్రీపుంస యోగోద్భవం'.[1] చిరంతనమైన సంసారానికది సహజమైన పునాది. గువ్వలదాంపత్యాన్ని గుర్తిస్తూనే చిలకాగోరింకలు అని సృష్టికి వంకలుదిద్దే ఔచిత్యదృష్టి మానవునిది. (చిలకలు గోరింకలు జతగూడవు. కాని వారిరువురి ఈడూ జోడూ చక్కగాకుదురుతుందని ఆఊహ) రంగులపూలను కంటికింపుగా మాలకట్టుకునే ఓపిక మానవునిది. తుష్టిని,పుష్టినికలిగించే కొంగ్రొత్తపంటలను, రుచులను కనిపెట్టే ప్రయోగశీలం మానవునిది.

**ఇచ్చిపుచ్చుకోవడాలు :**

నిత్యావసరాలే సంఘజీవితానికి పునాదివేస్తున్నవి. సమాజం ఆచారాలుగా ఆ తీరుతెన్నులను తలదాల్చుతుంది. చెంచులలో తేనెతీసెటప్పుడు సరిలోనికి దిగేవాని నడుముకు కట్టినమోకును బావమరది పట్టుకుంటాడు. దేవత మల్లమ్మతోపాటు 'బావమరుదులగడ్డ' అనికూడా తేనెపెరలో వాటావేస్తారు. కొండరెడ్లలో కొత్తప్రదేశంలో తొలిగా ఇల్లు కట్టుకున్నవాడు పూజారి. తరువాత వచ్చినకుటుంబం లెంకలౌతారు. లెంకలకు, పూజారికి బందుగులవరుస. నందిపండుగపదంలో అసివేయులపాప వేవిళ్ళు తీర్చడానికి అంబటూలరాజుకు 'తల్లేడునాగు' ఆడపిల్లపుడితే కోడలుగా ఇచ్చే మాటమీదనే తన జాతిలోని పామునుఇస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడంలో ఈతెగలలో ఉన్న కట్టుబాటుకు ఏ నాగరికతకూడా తీసికట్టే.

**దాచిదాచితింటే – మానుమానుకు వాసన :**

విలుకాడు, సోపుకాడు అనేతేడాలేకుండా వేటలో పాల్గొన్నవారందరికీ సమానమైన వాటాయిస్తారు. వేటలో అందరిబాధ్యతలు కీలకమైనవే. పూజారికి 'గౌరవలకొట్టి' మునసబుకు 'దాయం' గ్రామంలో అతిధులకు, శ్రమించి జంతువు జాడ కట్టినవాడికి అంబువేసినవాడికి అదనంగావాటాలు. 'వెనుకసప్ప(ఎంకసప్ప) ఉంచండిరో వేసినోడికి' అని చెంచులు గుర్తుచేస్తుంటారు. పారిపోయేజంతువు గడిదాటితే ఆ పొరుగువారికి వేరే వాటాయివ్వాలి. మాంసంపంచడంలో ఏమాత్రం పొరపాటుజరిగినా అది రవరవలు పెంచుతుంది. 'ముక్కమురుగుద్ది – మాటపెరుగుద్ది'. 'ఎవరివాటాలు వారికి జాగ్రత్తగా

వేయండోయ్' అని హెచ్చరిస్తుంటారు పెద్దలు. సొంతంగా వేటాడి తెచ్చుకున్నా నలుగురితో పంచుకోవడం ముందుచూపుగలవాడి లక్షణం. 'దాచిదాచితింటే మాను మానుకు వాసన' అడవిలో దాచేది మానుతొఱ్ఱలలోనే కదా. ప్రతిమాను ఆమాంసం వాసనకొడుతూ ఆ దాపరికాన్ని బయటపెడుతుంది. అటువంటివాడిని 'ముక్కల పిసినారి' అని దెప్పిపొడుస్తారు. ప్రాప్తాన్నిబట్టిగాని దొరుకని ఈ మాంసంవల్లపెరిగే అసూయలు ఎట్టి పరిణామాలకు దారితీస్తాయో చిత్రించిన శ్రీకృష్ణదేవరాయల పరిశీలన ప్రస్తావించదగినది.

శా. విల్లుందానును భిల్లుడొక్క దరుగన్విందింట దుగ్ధాన్నమున్
భిల్లుండన్యుడు వెట్ట, నారయుడుక న్వీక్షించి, దొబ్బంచు వా
డెల్ల న్వమ్మగ జేసి తన్ననుపరా, నెందే దెగం జూడ గా
నుల్లంబై చననంపు నారచెడు నా, నూహించి పోనంపడే.

కం. ఆ పాలకూటనే నిజ, మేపాడియు దప్పరాడిరే, నెరసున గొం
తేపాటి గన్న నలుగుదురీపని యెంతనుక వెడగుటెద నాటవికుల్

*(ఆముక్తమాల్యద. 4వ అశ్వాసము 222 - 223)*

ఒకభిల్లుడు వేరొకభిల్లుని చూడబోతాడు. మాటాడుకుంటున్నంతసేపు లోపలేదో ఉడుకుతున్న వైనం నేస్తం గమనిస్తూనే ఉంటాడు. చాలాసేపు మాట్లాడుకొన్న తరువాత నేస్తాన్ని సాగనంపడానికి, గేస్తు కొంతదూరం వెంటవస్తాడు. ఇంట్లో ఉడుకుతున్న మాంసం ప్రస్తావనతేకుండా, తనువెళ్ళిపోయాక ఆమొత్తం ఆరగించాలనుకుంటున్నాడు అనిఅసూయపడి, ఇటువంటివే పాతఅనుభవాలు సలుపగా, గేస్తును పొడిచివేయాలని అదనుచూసుకుంటూ వెనువెనుక అడుగులు వేస్తున్నాడునేస్తం. ఇంతలో గేస్తు 'లోపల నార ఉడుకుతున్నది, మరీ దూరం వస్తే అది మాడిపోతుందేమో'నని వీడ్కొలుపుతాడు. ఉడుక్కుంటున్న నేస్తం 'నార ఉడుకబెడుతున్నావా' అంటూ మాంసంకాదన్నమాట అను కొని నోరు వెళ్ళబెడతాడు.

**కలిమిముద్దలు - సాటుభోజనం - పొల్లావులు - పొగరేకులు :**

వేటలోనే కాదు వ్యవసాయంలోకూడా సహకరించిన వారికి శ్రద్ధతో మన్ననలు చెల్లిస్తారు. పాల్గొన్నవారికి భోజనం - ఇంటిలోనున్న ఆడవారికి 'కలిమి' ముద్దలు. పని

లోకి బయలుదేరి ఏదైనా అవాంతరంవల్ల అలస్యమైనవాడికి ఏర్పాటుగా 'బంటం-మూటకూడు', కళ్ళంలో 'పొల్లావులు', ఇల్లునేతకు 'సాటు భోజనం', 'పొగరేకులు'.

ఇంత క్రమశిక్షణ, కృతజ్ఞతగలసమాజంలో బాంధవ్యాలలోగల కట్టడి ఆసక్తికరమైనది. పెండ్లి నూరేండ్లపంట మాత్రమేకాదు – ఆరెండు కుటుంబాలమధ్య శాశ్వతంగా వర్ధిల్లవలసినవి వావివరుసలు. మానవసంపద భూభారంగా భావించే నేటివలెకాక, నట్టడవిలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న కుటుంబాలమధ్య అన్యోన్యతలు తప్పనిసరి. అన్నిదానాలలో కన్యాదానం గొప్పది. దీనితో అప్పటిదాకా కొనసాగుతున్న ఆత్మీయతలు ఫలిస్తాయి. స్వీకరించే కుటుంబంయొక్క ప్రజాబలం పెరుగుతుంది. చిలవలు పలవలుగా విస్తరిల్లే ఈ సంబంధబాంధవ్యాలు గజిబిజి కాకుండా ఈ వినిమయం సక్రమంగా సుకరంగా సాగడానికి ఉభయవర్గాలకు కొన్ని సంకేతాలు (టోటెమ్, ఇంటిపేర్లు). కష్టనష్టాలను ఓపికతోవిని ఎప్పుడు ఎవరికి ఏది రావాలో, ఏదిరాలేదో గుర్తుంచుకొని సలహాఇవ్వగలిగిన ధారణగల 'వనఎరిగిన' పెద్దమనుషులు; పరంపరాగతమైన ఈకట్టుబాటు సమాజానికి మూలాధారం. ఈ రెండుపక్షాలమధ్య వారధినేర్పరచే కన్యస్థానం ఎటువంటిది? ఈ చుట్టాలు, బంధువుల మధ్య ఆత్మీయతలు, అరమరికలు ఈ కన్యాదానాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి? మారకం వస్తువులవలె కన్య ఒకవస్తువుకాదు. ఆమెకు ఇష్టాయిష్టాలు ఉంటాయి. వివాహంవరకు కన్నవారు, తరువాత కట్టుకున్నవారు స్త్రీ బాధ్యతవహిస్తారు. కాబట్టి స్వాతంత్ర్యంలేని ఆమెవల్ల ఏ పొరపాటు జరిగినా అందుకు ఆ సంరక్షకులే శిక్షార్హులు. గిరిజనన్యాయం స్త్రీని ఎట్టి పరిస్థితులలోను దండించదు.[2]

**తీపలులాగడం – కాల్దొక్కికంకణంకట్టడం – పాపనుఉంచుకోవడం – మగనాలి :**

'ఆడపిల్ల అడ్డగింజ' (అడ్డకాయపేలి గింజఎక్కడోపడుతుంది. అక్కడ ఆవిత్తుతీగ వేస్తుంది). కన్య 'పోయినింటి బాలగాని పుట్టినింటి బాలగాదు'. ఈమాట అందరూ వల్లించేదేకాని ఈ తెగలలోనే వీటి విలువ అర్ధమౌతుంది. ఒక కుటుంబంనుండి మరొక కుటుంబానికి పిల్లనిచ్చారుకాబట్టి ఆమెపై ఆధిపత్యంపూర్తిగా అత్తవారిదే. భర్త అకాల మరణంచెందితే ఆమె అతని తమ్మునికి భార్యకావడం ఆమెఇష్టం (పిల్లల, ఆస్తి సంరక్షణకు, అనివార్యంగా కలిగే శరీరసంబంధాలకు వ్యవస్థఇచ్చిన అనుజ్ఞ). దీనిని

'పాపను ఉంచుకోవడం' (పాప-వదిన) అంటారు. మనలో ఈఅలవాటు అంతరించి అక్కగతిస్తే చెల్లెలునివ్వడం కొనసాగుతున్నది. బీజప్రధానమైన పోడు, క్షేత్రప్రధానమైన ఆస్తిహక్కు ఈరెండు జీవనవిధానాలుగల తెగలలో ఈరెండు పద్ధతులను యోగ్యంగానే భావిస్తారు. అసివేయులపాపను ఉంచుకున్న అంబటూలరాజుకు పాండురాజు జన్మించాడని గేయగాథ. చెంచులలో పాపమీద మోజుతో తమ్ముడు మోకువిడుస్తాడేమో అని ఆబాధ్యత బావమరదికి అప్పగిస్తారు. తల్లిదండ్రిలేని పిల్లలను ఎవరైనాపెంచితే ఇంటిపేరు మారదు (దత్తతలేదు. ఆస్తిలేదుకాబట్టి). కాటిలో వలుకులుకూడా ఆయా కుటుంబాలకు వేరువేరుగానే ఉంటాయి. మరిదిపెత్తనంలో ఉండనొల్లని విధవ, ఆస్తిని వేరేసాగు చేయించుకుని పిల్లలను పెంచుకోవచ్చు. మనువుచెడితే పుట్టినింటికి పోవచ్చు.

మరో ఉదాహరణ : కన్నవారి అత్తవారి బాధ్యతలనుగూర్చి తెగవేసి చెబుతుంది. కొండరెడ్లలో కన్నవారిని చూడబోయే కోడలికి పుట్టినింటవుండే రోజులకు సరిపడిన భత్యాన్నిఅత్తవారు ఇచ్చిపంపాలి. లాంఛనప్రాయంగానైనా ఈఆచారం సాగుతూనే ఉన్నది. కాని అల్లుడు బందుగుడే. అతడు ఏబత్తెము తెచ్చుకోనక్కరలేదు. మేనకోడలిపై మేనమామది జన్మసిద్ధమైన హక్కు. అతని కుటుంబంనుండి పిల్లను తెచ్చుకున్న బాకీ చెల్లుపెట్టవలసిన బాధ్యత బందుగులది. ఏకారణంవల్లనైనా పైవాళ్ళకు కన్యనిస్తే మేనమామకు మాడలిచ్చుకోవాలి. ఇదే 'ఓలి'గా స్థిరపడింది. తల్లికి పదహారుమూరల తలకట్టుచీర పెట్టాలి. దీన్ని 'పీతులచీర' అంటారు. అంతపెద్దచీర పెట్టలేరుగాబట్టి ఎన్నిమూరలు తక్కువైతే అన్ని అణాలుచెల్లించేవారు. మేనమామకూతురుపై మేనల్లునిది జన్మహక్కే. ఏదోసాకుపెట్టి మేనమామ పిల్లనివ్వడానికి విముఖంగా ఉంటే అల్లుడు జతగాళ్ళతో కలిసి దండెత్తి పిల్లనెత్తుకుపోతాడు. ఆ సమయంలో ఆడవారుతప్ప మగవాళ్ళెవరూ ఈ 'తీపలులాగే' వాళ్ళమీద చెయ్యిచేసుకోకూడదు. (తీపలు=గుంపులు) వరుడు కన్య కాల్దొక్కినతరువాత, మిగిలినవాళ్ళంతా కన్యను అవసరమైతే బలిమిని తీసుకుపోతారు. ఆమెకు ఇష్టంలేకపోతే తగవుపెట్టవచ్చు. ❊

## ఆలి అరవై – ఓలి ముప్పై :

స్త్రీలకోరికలకు అవకాశం కల్పించడం సాధారణన్యాయానికి మినహాయింపు. కన్య వివాహానికి అభ్యంతరం చెప్పినా తల్లిదండ్రులు లెక్కచేయకపోవచ్చు. కాని భర్తయెడల ఇష్టంలేని భార్యపుట్టింటికి రావచ్చు. 'విరిగినకత్తి కమ్మరింటికి – మనువు చెడితే పుట్టినింటికి'. ఆ మగనాలు మరొకడితో లేచిపోతే పెద్దలపరిష్కారం ప్రకారం అతడు, పూర్వపుభర్త ఇచ్చుకున్న ఓలి, పెట్టుకున్న పెళ్ళిఖర్చు ఇచ్చుకోవాలి. 'ఆలికి అరవై ఓలికి ముప్పై' కన్యాశుల్కంకంటె మగనాలితప్పు రెండుఖర్చులవల్ల రెట్టింపు. మగనాలి పోకుండా ఏమగడునిరోధించలేడు. కొత్తవాళ్ళు తెలియక అలాంటివాడిని 'పెళ్ళయిందా' అని పరామర్శిస్తే వాడిపెళ్ళాం 'బతకలేదు' అంటారు (అతనికి సంబంధించినంతవరకు ఆమె బతికిఉన్నా చచ్చినట్లే లెక్క) మగనాలి, పిల్లలను భర్తవద్దనే వదిలిపోవాలి. చంటి పిల్లలనైనా భర్తఅనుమతిస్తేనే గడువునాటికి అప్పగించేమాటమీద తీసుకువెళ్ళాలి. తగవు తెగిన తరువాత, తన పాతభర్తకు కొత్తభర్తకు పక్కపక్కనే కూర్చోబెట్టి మగనాలి భోజనం పెడుతుంది. వారు తమఆకులు ఒకరికొకరు మార్చుకుని భోజనంచేస్తారు. వారిమధ్య తగవులు, అసూయలు అంతటితోసరి.[8]

రకరకాల అందదుకులవల్ల దాంపత్యానికి ఆధారమైన సామాజిక జీవితంలో ప్రశాంతి తక్కువ. ఆడ, మగ ఇద్దరూ కష్టజీవులు కావడంవలన మనుగడకు ఆటంకం లేదు. చుట్టాల ఆదరణలోపెరిగే అవకాశంవల్ల ఐదేండ్లకే పిల్లలు వాళ్ళబ్రతుకు వాళ్ళు చూచుకోగలరు, కాబట్టి ఎదిగేతరంమీద ఈప్రభావం అంతగాఉండదు.

పురుషుడు ఇంకోభార్యను తెచ్చుకోవడాన్ని స్త్రీ కాదనదు. సోమరితనంతో బుద్ధి పూర్వకంగా తనకు నష్టంకలిగిస్తుందని నిరూపించగలిగినపుడుకూడా మందలిస్తారు భార్యనువదలిపెట్టడాన్ని గిరిజనులు గర్హిస్తారు. తమ్ముని భార్యను, అన్న మన్ననతో (గౌరవం)చూడాలి. 'మరదలిఇల్లు మాలఇల్లు – మన్ననఇల్లు' మరదలి యింట బావప్రవేశించరాదు. ఉమ్మడికుటుంబాలలో అనుమానాలకు తావులేకుండా ఈ కట్టడి.[3]

ఎటువంటి అపశ్రుతులున్నా స్త్రీపురుషులు పాతివ్రత్యాన్ని, ఏకపత్నీత్వాన్ని పాటించేవారే. పోడువ్యవసాయంలో భార్యభర్తలు సమంగాశ్రమిస్తారు. దుంపలు, కూరలు, పండ్లు, టెంకలు పోగుచేసే స్త్రీ సంపాదన, పురుషునివేట, తేనెలుతీయడం

వంటివాటికంటే స్థిరమైనఆధరువు. వ్యవసాయంలోకి నాగలిప్రవేశించడంతో ఊడ్పులు కోతలవరకే స్త్రీకృషి పరిమితమై ధాన్యందంచడం, పశుపోషణ, వంటావార్పు, అలుకులు ముగ్గులు. ఆస్తిపాస్తులుగల ఇంటిలో బాధ్యతలు ఎక్కువై ఆమె గృహలక్ష్మికాసాగింది. ఈ పరిస్థితులలో కుటుంబజీవితం బలపడి అంతస్తులుపెరిగి, వివిధమైన అభిలాషలు, ప్రత్యేకమైన అభిరుచులు మనసులో అంకురిస్తాయి. వీటన్నిటికీ మనిషి బానిసఅయినట్లే వీటన్నిటినీ సమకూర్చే వ్యవస్థకు మనసు సర్దుకుపోతుంది. అపుడపుడు పెద్దల పట్టుదలలు, పిన్నల తెగింపులతో పరిస్థితులు విషమించి, కుటుంబాలకు ఎసరుపెట్టక మునుపే, కాకతగ్గించడానికి, సమాజపు ఇనుపసీలలు పండుగలలోసడలిస్తారు.[4] మామిడిపండుగ (గోదావరి), గంగలమ్మపండుగ (మారేడుమిల్లి), ఇటింపండుగలలో (విశాఖ) పాటలతో, పరాచకాలతో నేస్తాలు, బందుగులు, జతలవారితో పడుచులు కిందుమీదౌతుంటారు. (గ్రామమంతా చుట్టాలు బందుగులే (చుట్టాలు = అన్నదమ్ములు, బందుగులు = వియ్యపువారు) వేలెత్తిచూపే పరాయివారెవరూ ఉండరు.

**పినతల్లి కోకిరి :**

తాతకు కూతురుకూతురు అయిన మనుమరాలితో వరుస. అవ్వకు కొడుకు కొడుకు మనుమడితో వరుస. వారు మరోవంశంతో కలిసిందున వరుసవారౌతారు. కాబట్టి ఈముసలివారినికూడా ముగ్గులోకి లాగుతుంటారు. ఈ ప్రేలాపనలు 'అమ్మ లాలులు అడుక్కోవడమట'. గోవులమామిడికి గుబ్బట్లమామిడికి పెళ్ళిచేస్తారు. ఊళ్ళోకి వచ్చేవాళ్ళను ఆటలుపట్టించి డబ్బులుదండుతారు. ఆ డబ్బుతో విందుచేసుకొని – మగవాళ్ళనుపిలిచి ఏడిపిస్తారు. ఆడవాళ్ళు 'తగిలితే' (తరిమివేస్తే) 'వేటబయలులో' ఎండన పడి పొద్దంతా గడిపే మగవాళ్ళు ఇటింపండుగలో కనిపిస్తూంటారు.

**మగనాలిమెట్ట – తప్పులమామిడి :**

అలిగిపోయిన ఆడవారికోసం కోపగృహాలవంటి 'మగనాలిమెట్ట'లలో, 'రంకుల మెట్ట'లలో వెతుకుతుంటారు. ప్రతిఊరి పరిసరాలలో ఇదిఒకభాగం. హుకుంపేట మండలంలో సంతారివద్ద కామరాజు మెట్ట ఒకటి ఉంది. జర్రాయివారు కామరాజుకు తమపిల్లనిచ్చారు. ఆఊరి చెరువునీళ్ళునిండడానికి ఒకస్త్రీని బలికోరింది. కామరాజు ఇంటలేనప్పుడు కోడలును బలివేస్తారు. 'అయిలోడు'గా(అరణం) వచ్చినదున్నపోతు

ఒకనాడు చెరువుగట్టును కోరాడుతుండగా శవం బయటపడ్డది. దుఃఖించిన కామరాజు అక్కడ శిలమల్లిపోయాడు. ఆనాటినుండినేటికి ఆఇరుగ్రామాలమధ్య బంధుత్వంలేదు.

పాడేరునుండి పెదబయలుదారిలో 'తప్పులమామిడి', నిటారైన జోడుమామిళ్లున్న స్థలం. దానికింద ఈకథే జరిగిందో, కవిత్వమేపొంగిందో! భార్యభర్తలు ఆ దారిన పోతూ మామిడిపళ్ళుచూసి మనసుపడ్డారు. తాప (వెదురుగడ) మీదుగా చెట్టెక్కిమగడు పండ్లుదులుపుతున్నాడు. ఆ దారినేపోయే గడసరిపడుచువాళ్లు ఆతాప విప్పిపారేసి ఆ మగనాలిని ఎత్తుకుపోయారు. దిగేదారిలేక ఆభర్త ఒకటేగోల. చివరకు ఆ పెళ్ళామేవచ్చి తాపవేసి మగడినిదించి ఏడుపు మొదలుపెట్టింది. ఏడుపులో నిజమెంతో, నటనెంతో.

బిజ్జివారిపిల్లను మూర్ఖుడైనమగడు శంకించాడు. ఆ సాధ్వి గోదావరిలోదూకి ప్రాణాలువదిలింది. లాంచీలలోపోయే బాటసారులు అక్కడ కొబ్బరికాయలు కొడుతారు.

**అడవికిపారడం :**

తొలిముట్టు (రజస్వల) అయినకన్య 'అడవికి పారాలి'. అక్కడ ఒక గుడిసెవేసి, రక్షగా చీడిపిక్కలుకట్టి, కఠినపత్యంతో ఉంచుతారు. పూజారిపెళ్ళాం చూరుముట్టు (ఋతువు) అయితే పండుగ వాయిదాపడుతుంది. ఈ 'మయల కీడు'తోపాటు స్త్రీని ఒక ఉత్పాదకశక్తిగా కూడా గుర్తించారు. సీతమ్మ 'మువ్వలరోకలి గవ్వలచేటలు చెల్లిన తల్లి'. 'సీతమ్మకొండ చిన్నయిపోయె – మారాశి పెద్దయిపోయె' అని కళ్ళంలో ఆకాంక్షిస్తారు. రాజులపండుగలో ఆడవారికి ఆటపాటలలోతప్ప, కర్మకాండలో స్థానం లేదు. గూపమ్మ, నందిపండుగలలో నిలిపే ఘటంమీద గొంతెమ్మగా రజస్వలకాని బాలను కూర్చోబెడతారు. పిల్లనడగడానికి వెళ్ళినపుడు పేరటమ్మలతోకలిసి వెడతారు. ఏమైనా అన్ని సందర్భాలలో స్త్రీది పరోక్షమైనపాత్రే. ❊

## ఉన్నవారిసొమ్ములు తినండి - ఊరివారిపనులు చేయండి :

కలిగినది నలుగురితో కలిసిపంచుకోవడం ఒక ఆదర్శం. ఏపూటకాపూటే తిండి కోసం తిప్పలుపడవలసిన తెగలలో ఇదిఅవసరం. కాని కలిగినవాడు బీదవాడిని చేర నివ్వడు. కాని దిష్టితగులుతుందని, అసూయతో చెడుపుచేస్తారనే భయాలు పదిమందికి పంచిపెట్టే బలవంతం చేస్తున్నవి. వీధినపడి కలహించుకునే ప్రవృత్తిలేని ఈ తెగలలో కూడబెట్టిన వాడు, పెళ్ళిలో విందులుచేసి నలుగురిప్రశంసలు పొందుతాడు. కలిగిన వాడిని, లేని వాడిని ఒకేవిధంగా పీడించవద్దు. 'ఉన్నవారి సొమ్ములు తినండి–ఊరివారి పనులు చేయండి' అని ఊరుమ్మడిఖర్చులను పోగుచేసే కోలగాండ్లను, పెద్దలు హెచ్చరిస్తూ ఉంటారు. క్రోధావేశాలు ప్రదర్శించే తెగలలో తనను అవమానించినట్లు భావించితే, వాడి ఇంటిముందు సవాలుచేస్తూ పశువులను నరుకుతారు. వాడివిరోధి ఇలాగే వాడి కంటె హెచ్చుగానరికి బదులుతీరుస్తాడు. ఇలా జలుబువదిలేవరకు వారువీరు పరుగు పెడతారు. చుట్టూరా జనమందరు వాళ్ళను పొగడుతూ ఆమాంసం తెచ్చుకుంటారు. ఈ సమరోన్మాదానికి 'పోట్లాచ్' అనిపేరు. సంపద పంపకమయ్యే విధానాలివి.[5] కాని దాచుకోవడం కష్టమైన రోజులుపోయి రూపాయిరోజులు వచ్చాయి కదా! 'కలిగినా రెడ్డివారు కట్టరు' (ఇల్లు, బట్ట) అని వాల్మీకుల ఎత్తిపొడుపు. ఒకరికి నలుగురికళ్ళలో పడతామనే భయం – 'చింతాకును మూటకట్టడం ఎంతకష్టమో (ఎప్పుడూ రాలుతుంది) రెడ్డివారి పగనుఓర్చడం అంతకష్టం' (చెడుపులు,చిల్లంగిలతో ఒకరినొకరు నాశనంచేసుకుంటారు). బడాయికబుర్లతో, పొగడ్తలతో పొంగించి బ్రతుకు గడుపుకుంటారని 'మాలవాడి మాటలు పొడుగు' అని రెడ్డివారి అధిక్షేపం.

### వలసల జాడలు :

ఆదానప్రదానాలు సక్రమంగాసాగేందుకు ఏర్పరచుకున్నదే టోటెమిక వ్యవస్థ. పులినాగ సురభి ఎలుగు (జాంబవ) అలుమంత, రాచెలుక, మేక, మత్స్య, సూర్య, సొడుగ, మైనా, తుమ్మెద, చంద్ర, డేగ, శంకు, ఎఱ్రబలిజ, నల్లబలిజ మొదలైనవి విశాఖబగతలలో, కొండదొరలలోగల చిహ్నాలు. ఒక్కోచిహ్నంక్రింద నాలుగైదు ఇండ్ల పేర్లవారుంటారు. ఆ వంశాలకు ఆచిహ్నాలురావడానికి కొంతచరిత్ర ఉండవచ్చు. కిలం కోటరాజులకు రాచెలుకరాజులని వ్యవహారం. ఈ రాచెలుకదుంప నందిపండుగలో కొండదానవుడికి గుర్తు. అలమంతపగడనుండి సత్తెవిత్తనాలు రాలుతాయి. వీరు

విత్తనాలు తీసుకొని, సురభివారు పశుధనంతో మన్యంలో ప్రవేశించారేమో. ఈ వలస వచ్చినవారికి, కొండవారికి కొంతకలహం పెరగడం సహజమే. ఎలుగువారు పర్లాకిమిడి వైపునుండివచ్చి కిముడుపల్లెలో స్థిరపడ్డారు. బలిజవారుగాజులమ్ముకుంటూ వచ్చారు. అందువల్లవారు పెళ్ళిలో 'బొయ్యి'(పందిరిరాట) మీదనో, నల్లపూసలలోనో గాజుకట్టు కుంటారట. పులిచిహ్నంవారికి పులులకు స్నేహమట. వారు 'అడుగుపసర్లు' పోస్తారు. వాటివల్ల ఆ జంతువులు తమకువశమైవుంటాయని విశ్వాసం. పులికులంవారు పులిని చంపవలసివస్తే దాని శవానికి స్నానంచేయించేవారు. ఓండ్రుగడ్డవారు మఠంనుండి వచ్చామని, మఠంవారుపెళ్ళిలో తాముకొయ్యూరు జంగాలమని తలుపుదగ్గర చెప్పు కుంటారు. వీరంతా కాలక్రమంలో బంధువులైనారు.

**కావికట్టు :**

కొండరెడ్లలో వంశచిహ్నాలులేవు. ఇంటిపేర్లు మాత్రమే ఉన్నాయి. అందెల, కేలల, నైన, మరిగల, కారుకోడి, సాదల, వలల మొదలైన స్థానికులు కానివారు. రాచవారైన గుర్తేడు కన్నమరెడ్లు, పల్లాలవారు పాలకవర్గానికి చెందినవారు. పల్లాలవారు వ్యాపించిన ఈమన్యంలోతప్ప మిగిలినచోట్ల ఈ కావికట్టులేదు. కావివారిని దొరలుగా, పాలకవర్గానికి చెందిన పల్లాలవారిని రెడ్లుగా, తమలోతాము వ్యవహరించుకుంటారు. కాని 'కొండరెడ్డి' పదాన్ని తెగగా గుర్తించడంవల్ల అందరూ ఈ పదాన్నే వాడుతున్నారు. పల్లాలవారు-దుచ్చెర్తి ముఠాదార్లు చక్కావారు-రాచవారు రెడ్లందరితో వియ్యమందారు. ఒకప్పుడు కావివారికి దాసర్లు దినకార్యాలు చేయించేవారు. ఇపుడందరికి చేమగడ్డ, గెడ్డవాడ జంగాలే దినం చేయిస్తున్నారు.

రాచవారైన కడనూతుల కడబాండ్లకు, కావివారైన చెరువూరు కడబాండ్లకు పచ్చ గడ్డివేస్తే భగ్గుమనేదట. చెరువూరు తమక్రింద ఉండాలని కన్నంరెడ్డికి 'పుల్లపొడిచారు'. ఎదురుచిల్లలు, నారసలు, కమ్మరులను సిద్ధగాఉంచుకున్నారు. చెరువూరు పండురెడ్డి పెళ్ళాన్ని మలుపుకున్నారట. అది తుపాకులలో నీళ్ళుపోసి పిరంకత్తి (పట్టాకత్తి) వాయి రాతితో సుద్దకొట్టింది. పోరాటంలోగాయపడి చావనున్నపండురెడ్డిని, అన్న పెందలవాడ లింగారెడ్డి (పెద్దలవాడ) వచ్చి ఎత్తుకొనిపోయి కానివాడన దహనంచేసి తనకు నాటిన నారసలను వాలగూడెం వాల్మీకిని పిలిపించి తీయించుకున్నాడట. పెందలవాడనుండి

కానివాడకు మకాంమార్చారట. ఇవి తొలినాటితగాదాలు. రేవడికోట–పోలమాను గొందికశపలు, రాచవారైన కన్నంరెడ్డి ముఠాదారుగాగల గుర్తేడుముఠాలో చేరినప్పటికీ, వాటికి కావిదొరలే మునసబులుగా ఉండేవారు.

వీరిలో అతిశయంగా వ్యవహరించేవారిని కొనమేపులకు (బ్రతుకుకువచ్చిన మేకలు) వచ్చినవారని నిరసిస్తూంటారు. రేవడికోట–సిరిబలకోట–కరణికోట మొదలగు గ్రామాలలోని సాదండ్లు, మరిగెండ్లు మొదలైనవారు ఏనుగంతమనుషులని చెపుతారు. కారడవిలో ఉన్నవీరందరూ బలంలో భీములు. విలువిద్యలో అర్జునులు. పెద్దరికంలో ధర్మరాజులు. అతిధిసత్కారంలో వింధ్యాచలం వంటివారు (టపా–బరువుమోస్తారు) అప్యాయతలో విదురులు. ఇతిహాసపు అట్టడుగునపడివున్న తెలుగుసంస్కృతి పునాది శిలలు.

సాదల (దివిటీ), చెదల, కారుకోడి, వలల, విండెల (విల్లు) వంటి ఇంటిపేర్లు వేటాడే సమాజమని తెలియజేస్తూనే ఉన్నాయి. కత్తులవారు శస్త్రజీవులు. పల్లా అనగా ముప్పైకుంచాల కొలగారం. పల్లాలవారు పంటరెడ్లు. వీరిపేర్లలో భూపతిపదం కనిపి–స్తుంది. చక్కావారు గొలుగొండ సంస్థానం రద్దుపరచిన తరువాత బ్రిటిష్‌పాలన క్రిందికి వచ్చారు. దుచ్చెర్తినూకాలమ్మ, గురుతేటిగుండాలమ్మ, పల్లాలవారితో గంగాలమ్మ, మన్యం ప్రవేశించిన దేవతలు.

## నేస్తం :

అహంకారంతో లేదా ప్రేమతో నలుగురికీ పెట్టడం ఐచ్ఛికం. వ్యవస్థ సూత్ర ప్రాయంగా ఆదర్శవంతమైన ప్రవర్తనను నిర్దేశిస్తూనేఉంటుంది. రాజులపండుగ, జాకరి పండుగలలో కలిమిలేములతో నిమిత్తంలేకుండా అందరూ సహపంక్తిన భుజిస్తారు. దీనికికావలసిన సామగ్రిని సమకూర్చడంలో వారివారి శక్తినిబట్టి వాటాలు నిర్ణయిస్తారు. గ్రామసభ దానిని అమలుపరుస్తుంది. వివిధకులాలతో గ్రామం విస్తరిస్తున్నప్పుడు మానవసంబంధాలను, యధేచ్ఛకువదలకుండా ఈసంబంధాల సంకోచవ్యాకోచాలు ఎలా ఉండాలోకూడా వ్యవస్థనిర్వచిస్తుంది. బంధుత్వాలులేని వారితో నేస్తమేకాక కులాంతరస్నేహాన్నికూడా 'పేర్లనేస్తం', 'స్థలనేస్తం', 'పెండ్లినేస్తం' అని (విశాఖ) మన్నన చుట్టరికాలని (గోదావరి) గిరిజనసమాజంఅనుమతించింది. పేరుఒకటే అయినందున

పేర్లనేస్తం. ఒకేగ్రామమయినందువల్ల స్థలనేస్తం. స్నేహితులుగా ఉంటామని పెండ్లిలో బాసలుచేసుకున్నవారు పెళ్ళినేస్తాలు. ఇలా బాసలతో నేస్తం కట్టుకున్నవారిని మర్యాద చేయడం అయినవారందరి ధర్మం. పెండ్లినేస్తాలు 'దసిలి'నప్పుడు ఒకరిచెవులో ఒకరు పువ్వులు ముడుచుకుంటారు. నేస్తం మరోకులం వాడయితే భోజనంవండుకునే సదుపాయం చేస్తారు. ఇంట్లోజరిగే మంచిచెడులన్నింటిలో పరస్పరం పాల్గొంటారు. ఒకసారి ఈస్నేహాలు ముదిరి బంధుత్వానికి దారితీయడం కద్దు. దీనికి సమాజం ఆమోదముద్ర లేకపోయినా, వాస్తవాన్ని అంగీకరించకతప్పదు. కులతప్పువంటి శిక్షలు మామూలే.

## మూడువర్గాల సంగమం – గంగాలమ్మ పండుగ :

మన్ననచుట్టరికాలవల్ల కుండాడ మొదలైనగ్రామాలలో వాల్మీకులు, రెడ్లు ఒకే దేవతకు పూజార్లుగా లెంకలుగా ఉన్నారు. వీరికి బంధుత్వసంబంధంలేదు కాని వ్యవహారంలో వరుసలతో పిలుచుకుంటారు. వారింటికి వీరు – వీరింటికి వారు వెళ్ళడంలో అస్పృశ్యతలాంటిఅభ్యంతరాలు నేస్తాలలోఉండవు. గంగాలమ్మ ఎఱ్ఱమార్గం దేవత. బహిష్కరించవలసినది. అందువలన ఆమె మాలయింటి ఆడపడుచు. పల్లాలవారు ప్రవేశపెట్టినఘటం ఆమెచిహ్నం. పండుగతంతు మొదటినుండి ఈ ప్రాంతానిది. ఈ విధంగా మూడువర్గాలు ఈ వ్యవసాయపుపండుగలో ఒదిగిపోయాయి. మన్నెయింటిరాజు సంజీవరాయుడు, మాలయింటిపడుచు గంగును పెండ్లాడడం విశాఖగేయగాథ. వాల్మీకుల అక్షరాస్యత, వ్యాపారదక్షత, శుభ్రత; బగత, రెడ్లనాయకత్వం ధర్మనిష్ఠ; కమ్మర్ల పనితనం, కొండదొరల కష్టజీవనం; మాటలలో మన్ననలలోనేకాక బాంధవ్యంగాకూడాఫలించడం గిరిజనసమాజానికి ఒక కల్పనగానే మిగిలిపోయింది.

## గౌరవలకొట్టి – నాయకమడి :

మునసబుగ్రామంలో పెద్ద, పెత్తందారు సహాయకారి (పిన్నపెద్ద), వాల్మీకి బంట్రోతు, సలహాదారుకూడ. పూజారి గ్రామసభలో ముఖ్యుడు. ఇతరకులాల ప్రతినిధులుకూడా ఈ బృందంలో ఉంటారు.[6] కూరలమన్ననలే కాక (గౌరవలకొట్టి, దాయం) తమపనులు మానుకొని తగవులలో మధ్యవర్తిత్వం నెరపుతున్నందుకు గ్రామస్థులంతా వారికి సాయపడడంలో (పొలంపని, ఇల్లునేత) స్వచ్ఛందంగా ముందుకు వస్తారు. విశాఖలో మునసబులకు'నాయకమడి'అని భూమికూడాఉన్నది. కులంవారు అంతా తమలోతాము

సుసంఘటితంగా సహకరించుకుంటారు. పెళ్ళిలో వధూవరులు కూర్చునే అరుగుకు మట్టి, గ్రామం మధ్యనుండి తేవాలి. శవాన్నిస్నానం చేయించడానికి ఇంటికొకచెంబుడు నీళ్ళుతెస్తారు. శవంకొంగున అందరూ కలిపికట్టిన 'కొంగుపతిక డబ్బు'తో పొగాకు కొనుక్కొని సమానంగాపంచుకుంటారు. పెళ్ళిలో పేచీలు, మగనాలి తగవులు, ఊరుమ్మడి తగవులవంటివానికి గ్రామమంతా సమావేశమై ఒకనిర్ణయానికి రావలసివస్తుంది. పొరుగూరు వెళ్ళవలసినందువల్ల, పొలంపనులలో మునిగిపోయి రాలేనివారు ముందుగా పెద్దలఅనుమతి తీసుకోవాలి. తగవుయొక్క సందర్భం పెద్దలు వివరిస్తుండగా మధ్యలో తొందరపడి కలుగచేసుకోవడం సభామర్యాద కాదు. అలా కలుగజేసుకున్నందుకు ఒకఅణా తప్పు విధించేవారు. దినమంతా పనులుమానుకుని తమతగవులో పాల్గొన్నందుకు, ఫిర్యాది ఆరోజుఅందరికీ భోజనంపెట్టాలి. పెట్టలేనివాడు కనీసం 'పొగరేకులు' అయినాపంచుతాడు. కన్య, మగనాలు మరోకులం వాడితోపోతే కన్నవారికి కట్టుకున్నవారికి ప్రాయశ్చిత్తం చేయాలి. గౌరీపట్నంవారు రాజగురువులై తమ శిష్యులను పురుషకారులుగా (పరిష్కారి) విశాఖమన్యమంతా నియమించిన తరువాత ఈతంతులు పెరిగాయి. ప్రాయశ్చిత్తంనాడు (కాల్చిన దర్భనాలిక మీద అంటించడం) పెద్దలందరికీ 'చోటాకులు' (భోజనం) దక్షిణతోసహావేయాలి. చెంచులలో తప్పువేసేందుకు సొమ్ముకాని, మేకలుకాని అందరికీలేవు. కాని శత్రుత్వాన్ని పెంచుకున్న ఇరువురిమధ్య ఘర్షణ నివారించేందుకు, పెద్దలు, నేరస్తునిగా భావించిన వాడిని పెంటనుండి (గ్రామం) బహిష్కరించేవారు లేదా వాడేపోయేవాడు. తగవులు తీర్చడానికి చెంచుపెద్దలు ఎంచుకునే పద్ధతులు చాలాసృజనాత్మకమైనది.

**సిక్కేసి చంపుతా :**

చెంచులు చమత్కార ప్రియులు. వారు తగవులు తీర్చే పద్ధతికూడ చమత్కారంగానే ఉంటుంది. పంచాయితీపెద్దలు తగవు పరిష్కారానికి చివరిమార్గంగా ఒకవర్గానికి సిక్కేస్తారు, అంటే 'శాత్రం' విసురుతారు. కోపంవచ్చినపుడు పెద్దలు సిక్కేసి చంపుతాను అని బెదిరిస్తుంటారు. అయితే తగవుస్వభావాన్నిబట్టి దానికి సంబంధించిన విషయాన్నే సిక్కేస్తారు.

గుట్టలచేను–పాలుట్లమధ్యన ఇద్దరుకలసి ఒక మామిడిచెట్టును పెంచుతారు. దానికి ఇద్దరూ చాకిరి సమానంగాచేస్తారు. తూర్పునుండి గుట్టలచేనోడు – పడమర

నుండి పాలుట్లోడువచ్చి చాకిరి చేసివెళుతుంటారు. ఆ మామిడిచెట్టు పెరిగిపెద్దదై మూడుకాయలు కాస్తుంది. వాటిని ఎలాపంచుకోవాలి?

గుట్టలచేనోడు – పాలుట్లోడు సమానంగా చాకిరిచేసినప్పటికి పాలుట్లవాడు ఉదయం పడమరనుండి తూర్పుకు నడిచిరావడంవల్ల వాడికి ఎదురెండపడుతుంది. అలాగే సాయంత్రం తూర్పునుండి పడమరకునడచి ఇంటికి పోయేటపుడుకూడా పడమరనుండి ఎదురెండపడుతుంది. గుట్టలచేనోడు నీడకొచ్చి నీడకెళుతుంటాడు. కాబట్టి పాలుట్లవాడిది కష్టం ఎక్కువగాభావించి వాడికిరెండు, గుట్టలచేనోడికి ఒకటిచొప్పున పంచారు. భార్యాభర్తలు విడిపోయేటపుడు వాళ్ళకి పుట్టిన ముగ్గురుపిల్లల గురించి పంచాయితీ చేసినపుడు ఈసిక్కు వేసి తగవు చెప్పారు.

**మార్పుకు మార్గదర్శి – సాదల రామన్నదొర :**

చుట్టుముట్టిన ఆర్థికవ్యవస్థ ఫలితంగా సంతఖర్చులు పెరిగాయి. ఈపరిస్థితు లలో పెళ్ళివారు ఓలిసొమ్ము, పాలవిందు, తమగ్రామంలో కాతవిందు (పెళ్ళికూతురి ఇంటికి సారెపంపే సందర్భంగా ఇచ్చేవిందు) పెళ్ళివిందుచేయడం కష్టమౌతున్నది. ఈ పెళ్ళిళ్ళకు, పబ్బాలకు పొలాలనుకూడ అమ్ముకోవలసివస్తున్నది. కాబట్టి ఇన్ని విందులు రద్దుపరపించి, పెళ్ళివిందుతో సరిపుచ్చుకోమని హితవుచెప్పి ఆచారంగా నిలిపిన నాయకత్వం తూర్పుగోదావరిమన్యం రామవరం మండలంలోని కానివాడగ్రామం సాదలరామన్నదొరది.

రాజులపండుగ మరునాడు భోజనంపెట్టి గ్రామమునసబు ఇల్లునేతకు వెట్టి చేయించుకునేవాడట. 'నీవుభోజనం పెట్టనక్కరలేదు మేము వెట్టి చేయనక్కరలేదు' అని తెగవేసి చెప్పినవాడు సాదలరామన్న.

ఒకడు ఆకలిబాధకుతాళలేక, ఇంకొకరి ముందు చెయిచాచలేక పనసకాయలు దొంగతనం చేశాడు. ఆ చెట్టు యజమాని పల్లాల లక్ష్మీభూపతిరెడ్డి. ఆరాతీసి పెద్దలకు తగవుచేయమని విన్నవించాడు. 'అమ్ముకోవాలని దొంగతనం చేయలేదుకద, దొంగ చేసినది పొట్ట, మనసు కాదు. పదిమందిలో వాడిమనసు చిన్నబుచ్చరాదు. మేము మందలిస్తాం' అని మెత్తబరిచాడు రామన్నదొర. 'కాదు ఊరుకుంటే దొంగతనాలు ఇలాగే సాగుతాయ'ని పట్టుపడుతున్నాడు భూపతి. తాను బ్రతికిచెడిన మార్పు (పాత)

ప్రెసిడెంటు. కాలంకలిసిరాని ఈ చివరిరోజుల్లో తానూ పెద్దతలకాయలలో ఒకడు. కాని, వెనుకటివలె తీర్పును మళ్ళించగల పలుకుబడి ఏవిధంగానూలేదు. అయినా, నలుగురికి నచ్చచెప్పి ముద్దాయిపరువు కాపాడాలని తంటాపడ్డాడు రామన్న. తగవుచేశారు. నన్నడిగితే నేనే ఇచ్చేవాడినికదా అంటాడు భూపతి. సిగ్గుతో సగంచచ్చి తలవాల్చుకున్నాడు ముద్దాయి. తప్పువేయలేదు. చెట్లకు ముళ్ళకంచెలువేసుకోవాలి అనుకుంటూ గొట్టుచాలించారు. ఆస్తిఅంతరాలు ప్రబలినాయి. అన్యోన్యతలు తగ్గాయి. దొంగగానో, బిచ్చగాడుగానో పస్తునునెట్టవలసిన రోజులొచ్చాయి. అప్పులు పెట్టి, లాభాలుకట్టుకునే వ్యాపారాలుపెరిగాయి. మానవుని వినియోగంలో ప్రకృతి వనరులు క్షీణిస్తాయి. అడవిమీద బ్రతుకుసాగక కూలీలకుపోతున్నారు. విందు పరిహారంతో సరిపుచ్చక, విశాఖలో మగనాలుకు హామీపత్రాలుకూడ రాస్తున్నారు. ఆ సొమ్ములో కొంత వ్రాతకోతలు (సిరాఖర్చు) మన్ననఖర్చులకుపోను, మిగిలినసొమ్ము ఊరుమ్మడి సొమ్ములో జమచేస్తాం అంటారు. జమచేశారోలేదో ఎందరు అడగగలరు? ఇదీ నేటి పరిస్థితి.

**పోయినింటి బాలగాని – పుట్టినింటి బాలకాదు :**

'పుడితేపురుముళ్ళు, పెరిగితేపెళ్ళి, చస్తేచావు'; యీసంస్కారాలు కులంవారంతా పాల్గొనవలసిన సందర్భాలు. (మగ) పెళ్ళివారింటికి కన్యను సాగనంపేవేళ ఊరివారిని పాలవిందుకు ఆహ్వానిస్తూ 'పోయినింటి బాలగాని – పుట్టినింటి బాలగాదు', 'కలిగినది కన్నవారికైనా–పెంచిన పెదతండ్రులు మీరే', 'మన చెట్టున మొలచినకాయ – మనమే తెచ్చుకోవాలి పెద్దలారా'. (తిరిగి కూతురుసంతానం తమగ్రామంతోనే వియ్యమందాలి) అని విందు ముందు కన్యాదాతవిన్నవిస్తాడు. ఎంతఘనంగా పెంచినా సంస్కారం అబ్బేది సమాజంవల్లనే. ఆ సంస్కారమే కొత్తయింట మసలడానికి ఒద్దికనిస్తుంది. ఇటువంటి సంప్రదాయాలకు గిరిజనసమాజాలు, వారి 'గొట్టుబసలు' పుట్టినిళ్ళు.

కట్టుదిట్టంగా ఈవివాహనియమాలను అమలుపరుస్తున్నా, ఎక్కడో తమవంశం లోనే చేసుకొనే 'ముల్లిక' వాళ్ళుంటారు. మారుమనువు ఆచారమే. కులభ్రంశానికి సిద్ధమైతే కులాంతర సంబంధమూసాధ్యమే. కాని వావితప్పిన వరుసలవల్ల 'లోక సంగ్రహాన్ని'కూర్చే 'ప్రజాతంతువు' దెబ్బతింటుంది. ఇచ్చిపుచ్చుకోవడంలో తేడాలొస్తాయి.

అందువల్ల మానవసమాజమంతా ఈ వావివరుసలను తలదాల్చింది. అదుపుతప్పిన ఉద్రేకాలవల్ల ఒకేవంశంలోవారు భార్యాభర్తలై సంతానాన్నికంటే 'తల్లి దండ్రులపాపానికి పిల్లలేంచేస్తారు?' తల్లిదండ్రులయెడ విధించిన వెలిని తొలగించక పోతే ఇక అన్నాచెల్లెళ్ళ సంసారాన్ని కళ్ళారా చూడవలసిన వారమౌతాము, ఈ తప్పు తొలగిస్తున్నాము. వారిపిల్లలను 'మేనవారు, మెచ్చినవారు తీసి తెచ్చుకోవచ్చు' అని ప్రజాభిప్రాయాన్ని మలచి, చేమగడ్డజంగంచేత ప్రాయశ్చిత్తంచేయించి పరిష్కారమిచ్చిన దొడ్డమనను స్వర్గీయుడైన సాదలరామన్నదొరది.

ఈరోజుల్లో కూలీయిచ్చి పనులు చేయించుకుంటున్నారు. నేడు చెంచులలో తగవుతీర్చే పెద్దలకు పాతికరూపాయలు ముందేచెల్లించుకోవాలి. కూలి నాలికి పోయే గ్రామాలలో గొట్టుబసలలో జనమేకనిపించరు. జనంయొక్క అదుపులేక పెద్దల పలుకుబడి పెరిగిలంచాలకు న్యాయం తలవంచుతున్నది.[7] షాహుకార్లు, కలప, వెదురు నరుకు రవాణాలారీలు, గుమాస్తాలు, ఉద్యోగులు రెండుమూడేళ్ళకు వీరిబదిలీలు ఈసంచారజనం మప్పినసరదాలతో త్రుళ్ళిపడే పడుచులు–వారి సంబంధాలవల్ల కలిగేమిడిసిపాటు అంతటా కనిపిస్తున్నది. ప్రకృతితో పోరాడినంతకాలం మానవుడు సంఘశక్తినే బలపరచాడు. యంత్రబలంతోనడిచే ఆర్థికవ్యవస్థలో మానవునికి మానవుడే శత్రువవుతున్నాడు. ఏ మాత్రం అంతుబట్టని, అలవిగాని కొత్తవ్యవస్థతాకిడికి, పాత వ్యవస్థ విచ్చిపోతున్నది. ఈ ప్రమాదాల గూర్చి మానవదార్శనికులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

ఒక భవనాన్ని కట్టడానికి రాయితీస్తాం. తీసినరాయితీసినట్లు పునాదిలో పడుతుంది. కాని అదంతా పైపై లేతరాయి. పోనుపోను లోతులనుండి తీసిన ముదు రాయి ఈపునాదిమీద గోడగాలేస్తుంది. ఈ బరువైన రాతికూర్పు క్రింద, లేతరాళ్ళపునాది బరువుతో కృంగిపోదా! పారిశ్రామికవిప్లవం తరువాత మానవజాతి తనభవిష్యత్తును యంత్రవిజ్ఞానం మీద నిర్మించుకుంటుంది. ఏదిముందు ఏదివెనుక అని ఆలోచించే తీరికనివ్వకుండా అవసరాలు మీదపడుతున్నాయి. భావి ఎటువంటిదో కాని భవన నిర్మాణం చురుకుగా సాగుతున్నది. ముందువెనుక మీమాంసలో నిర్మాణవేగం మందగించరాదు.

'మానవనిర్మితమైన యంత్రానికి భిన్నంగా ప్రాణులకు తన్నుతాను మరమ్మతు చేసుకోగల, తగిలినగాయాలను మానుపుకోగల అద్భుతశక్తి అమరి ఉంది. కోల్పోయిన కొన్ని శారీరక కార్యకలాపాలకు పరిహారం సమకూర్చగల నేర్పుఉన్నది. గతంలో సంభవించిన అశక్తతకు సంబంధించిన సమాచారాన్ని సరిగా నయం చేసుకోవలసినది ఏమిటో తెలుసుకునేందుకే మెదడు నిల్వచేస్తుంది' లక్షయేండ్ల మానవజాతి ప్రజ్ఞలన్నీ భవిష్యత్తుకోసం నిలువచేయాలి. ఇంతకాలం వాడు భూమిమీద ఉన్న సహజసంపద కొల్లగొట్టాడు, ఉత్పత్తిపెంచాడు. ఇపుడు అడవి నశించిందని, వన్యమృగాలు అంతరిస్తున్నాయని ఆక్రోశిస్తున్నాడు. మన సమకాలంలోనే ఎన్నోదశల జీవన విధానాలతో పెనుగులాడే గిరిజనసమాజపు చిరంతనమైన అంతర్మథనంనుండి ఎగసి మెరిసే పాటలపాలపుంతకు ఇంతవరకూ చేసిన పరిచయం ఒక భూమిక.

| | | |
|---|---|---|
| **కటుబాట్లు** | **-** | **సడలింపులు** |
| దొప్పకట్టడులు | - | నేస్తం కట్టుకోవడం/ మన్నన చుట్టరికాలు |
| వావి | - | వరుసలు (పినతల్లి కోకిరి మొదలైనవి) |
| బొయ్యికట్టిపెళ్ళి | - | తీపలు లాగడం |

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు


1. ఆంధ్రమహాభారతము నన్నయ 1-1
"శ్రీవాణీ గిరిజాశ్చిరాయదధతో
వక్షోముఖాంగేషు యేలోకానాం
స్థితి మావిహంత్య విధతాం
స్త్రీ పుంసయోగోద్భవాం"

2. The Reddis of Bison Hills
Page 133. Responsibility falls always on the man; on the husband while she lives under the roof, on her father, if she returns to the parents house. If she is caught in adultery, a women is hardly ever punished by tribal justice.

3. Hill of Flutes. Page 83. To knock against younger brother's wife is punishable. These rules are important for they protect a junior member of a family from exploitation by his elders, and if they are broken, the offender is liable exemplary punishment.

4. Custom conflict in Africa. Gluckman Max. Basil Blakkwel Oxford 1955.
Page 115. Lifting the normal taboos and restraints obviously serves to emphasise them.
Page 22. Rituals are statement of rebellion and never revolution.
Page 134. Once there is a questioning of the social order, the ritual of protest is inappropriate since the purpose of the ritual is to unite the people who do not or cannot query the social order.
Page 131. A union fought with conflict.
Page 112. How customary exaggeration of conflict achieves a social blessing and beyond that the problem of how conflicts are built into a system of social order.
Page 86. Jealousy comes first - witchcraft follows after.

5. Morals and Merits : A study of values and social controls in South Asian Societies. Christopher Van Furer - Heimondorf., Weiden field and Nicholson. 1967. Page 76.

If a disputes drags on the buliang representing the community as a whole, will try to negotiate a settlement or one of the opponents will attempt to vindicate himself and humiliate his enemy by resorting to procedures known as Lisudu. This procedure involves the ritual destruction of wealth in a manner reminiscent of the potlatch of Northwest Africa. A man who challenge a co-villager to Lisudu opens the contest by killing one or several mithons in front of his opponent's house leaving the meat for the villages to eat. If the opponent accepts the challenge he must slaughter cattle and destroy valuables of atleast equal value in front of the challenger's house.

6. The Reddis of Bison Hills, 1945.

Page 151. Leadership of the hereditary head of the village usually, a descendant of the village founder, lies mainly in religious field. He presides over Panchayat. He is Peddakapu or Patel. The younger brother or nearest male relative of Peddakapu acts as his assistant is Pinakapu. In Chodavaram and Yellavaram taluka the village head is Munsif.

7. Tribal Ethnography. Customary Law and Change. N.V.Kameshwara Rao., ed. K.S. Singh. Director General Anthropological Survey of India. 1993, Concept Publishing Company. P.269. Customary Law and Politics - A Case Study of the Bagata and related tribes of Andhra Pradesh.

8. Customary Laws among the tribes of A.P. Tribal Cultural Research and Training Institute. 1992 (p.118) 'Kolluvindu' (feast) During the feast both the husbands sit side by side and wife serves food to them. Both the husbands exchange their plates.

❁ జ్ఞాపకశక్తి పదార్థంఉందా? వ్లచెస్లావ్ క్రుమోవ్, ప్రజాశక్తి దినపత్రిక. 19.11.81.

❁ సోదరుని భార్యను తల్లిగా చూడవలెనన్న రామాయణ ఆదర్శం ఒకవైపున, సోదరుని భార్యను, భార్యగా స్వీకరించవచ్చునన్ని వాలిసుగ్రీవుల ఆచారం ఒకవైపున ఘర్షణ పడుతున్నట్లు 'గాధాసప్తశతి'లో గాథలు తెలియజేస్తున్నాయి.

ఆంధ్రులసంక్షిప్త చరిత్ర. పటుకూరి బలరామమూర్తి, విశాలాంధ్ర ప్రచూరణ 1998. పుట. 8

# రెండవభాగం

## కొండకోనల్లో తెలుగుపాట

ప్రకృతి తాళం - సంస్కృతిరాగం - ఆచారవ్యవహారాలు పల్లవి


| | | |
|---|---|---|
| 1. | కొండరెడ్లపాటలు | 261 |
| 2. | విశాఖగిరిజనులపాటలు | 337 |
| 3. | నల్లమల చెంచులపాటలు | 401 |

# కొండరెడ్ల పాటలు

అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చిరి బాలకోడలా
ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలెయా
లిల్లిబూచో లిల్లివేవోయ్ - లల్లకాదు బాలకోడలా
ఆటమనదే పాటమనదే - అన్నివిద్యలు గల్లవారము

ముయ్యచిలుక – పచ్చపూలుగు

పిల్లకివ్వని పాపదేశం

బొట్టుకు పోతున్నామో

పినతల్లి కోకిరి

మండెకూరలంక – కత్తిరాళ్ళఘాటి

✿ **చుక్కలున్న సూరెపుదేవి**

చుట్టాలబియ్యం

వద్దురగుంటడ వరుసలేదు లేదొ – లేదుర బావా లేతపాయమా

✿ **ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు**

కాతకావళ్ళు

సీతజాలుకము

మనవారు వచ్చిరో అక్షింతలాకి

పోలు – పీనె

ఒప్పినామో – నిట్టపాణమా

సూటిగల్ల గేదెపోతు – కారుకోడి లచ్చుమన్న

✿ **కన్నెకు కలుసుకుందాం – దసరాకు దంచుకుందారా**

ఈకతీస్తే వీసెడు కొవ్వు – బూరుతీస్తే బుక్కెడు కొవ్వు

కాచిన కందులల్లె – కారుకోడి బాలలము

వేడికీల ముంగిపిల్ల

✿ **కన్నవారి ముంగిలి – కమ్ముకుంటున్న నీడలు**

✿ **కన్నెమనసు**

దాంపత్యం

గుర్తుకు వస్తున్న పుట్టిల్లు

వేరు కాపురం

పాలెపు వేట – చేవడిబస – పొట్లంవంటకం

- **వర్రెపాప – నల్లమయ్య**
- **ఉగుతాప – కట్టుతాప**

పురుషుడులేని ఇల్లు – పులిఉన్నకోనం
పొత్తడికర్ర పొగకు చేటు
ఈతచెట్టుకిందకిరావో – ఈరిపేను నొక్కుదునోయా
వాలుగొమ్మున చిలుకలు వచ్చె – వాలకుండ తేలగొట్టు
ఆవులెల్ల అద్దరి మేసె – దూడలెల్ల దుచ్చరి మేసె
పేమగల్ల పెద్దలైతే – పెండెకట్ల తాపతేరో

- **సుక్కనుదురు సూరెపుడేగ – మద్దివీటిమయలపుంజు**

వాలారుమొగ్గ
ముక్కుమునిగిన – డబ్బిపిట్ట
తీగెలకర్రిదొర, గొడుగుసన్నాసిదొర, కారంపండు దొర
దిప్పెదిప్పె మక్కలకొరువ
కుత్తికలమేతల కున్నెపిట్టలు
పువ్వులవైము – తట్టలవైము

- **నందాలాడే గుబ్బట్లకు – గందాలుపూసే బుడ్డడు**

నూనెకొప్పుల పొన్నచిలుక – తలపాగల జంగమయ్య
చిన్నబోయిన చిన్నమరిది
సంతలు – సావాసాలు
ఉసిరిక దొర్రలో – పసిరిక పాములు
మగనాలి – పోతుమెకం
తీయనికల్లు – కొనగందులు

- **పోతు, తల్లిపండుగలు**

సృష్టిచేతి ఆయుధం కాంక్ష – సంఘంచేతి ఆయుధం ప్రతిష్ఠ
అమ్మవారుయున్నప్పుడు – ఆడేపాడే బాలలము

తేనెగండి మోరులోన - తేలివచ్చె చందురూడా

జౌకవిల్లు - దడ్డకోల

తియ్యని గున్నమామిడి

✿ **ముల్లికలు - జారికలు**

రోలు - రోకలి

దప్పిసిడగలు

మనసుకు మంచివారము - మాపటికి దొంగవారమా

✿ **గుమ్మళ్ళు - డోలగతులు - కోలాటం**

ఆడవాలె పాడవాలె - వేడుకీలు చేయవాలెయా

నడుముసన్నం నాగబంధం - తగిలి పొడిచిది పిగినిపిట్ట

మరదలకు మన్నిందాము: వదినగారు - పెండ్లికూతురు

పదమెరుగని పండుపిల్లులు

పిల్లలను పెంచని పండడు

చలికూడు - పులికూడు

రాజు - బంట్రోతు

సాగినంత సంబరాలు

తేలు తేలు ఓ చందమామయా

**భా**రతీయసంస్కృతిలో ఆటవికులకు, నాగరికులకు, దాంపత్యానికి సీతారాములే ఆదర్శం. పేరటమ్మలు వారిపాటలే పాడుతూ దీవిస్తారు. కానివధూవరుల పడుచు నేస్తాలు పాతకథలను, కొత్తమోజులను గుర్తుచేస్తూ అల్లరిచేస్తారు. పిల్లనడిగితెచ్చుకొని పెళ్ళిచేసుకోవలసిన గిరిజనులలో, మగపెళ్ళివారికి ఆడపెళ్ళివారు అతిథులు కాబట్టి, ఆడవారి ఆగడాలకు హద్దులేదు. ఈ కవ్వింపులు తారా స్థాయికిచేరి గుబ్బట్లు, గోవుల ఆటపాటలతో జట్టీపడే ప్రాంగణం, వరదమట్టాన్ని మీరే గోదారి వెల్లువలా ఉద్రేక వివశమైపోతుంటుంది. వయోసహజమైన భావోద్వేగాలతో చిన్ననాటినుండి తమతో పెనవేసుకుపోయిన ఒకతె, ఇకనుండి పరాయిగ్రామంలో సంసార బాధ్యతలు తలకెత్తుకుంటుంది. తమజత వీడిపోతున్నది. జాలిగొలిపే మంద్రస్థాయిలో గుబ్బట్లు గొంతెత్తి –

**ముయ్యచిలుక – పచ్చపూలుగు :**

**అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా**
**జోటజోటలుంటిమి - జోటజోటలెందు వీడిపోగా**
**మంపరేవు ముయ్యచిలుక - ముద్దులది ముయ్యచిలుక**
**వాడెకొమ్మన జిరుగొడ్డగా - పడ్డదయ్యా పచ్చపూలుగా**
**అచ్చుకోడ లయ్యోకోడ లాలచ్చీరి బాలకోడలా ॥అచ్చు॥**

(జోట –జోడు; మంపరేవు – గ్రామంపేరు; ముయ్య –మూగ, ముగ్ధ; వాడెకొమ్మ – పీనెమీద పందిరి; జిరుగు – జీలుగు నరుములు – సన్నని పోగులు)

పలుకనన్నపలుకని యీ పంచదారచిలుక నేర్పుగా అల్లినవలలో పడిపోయింది. పక్షులు అవకాశాన్నిబట్టి అనేకవిధాల వేటాడతాయి. ఆకాశంలో ఒక పిట్ట వేరొకపిట్టను (డేగలు మొదలైనవి) తరిమితరిమి కొట్టడాన్ని 'పేరెంతొక్కడం', కొమ్మమీద కూర్చుని పసిగట్టి, రెక్కలుకవ్వకుండగా(రెపరెపలాడించకుండ) దూసుకుపోయి కొట్టడాన్ని 'వాలం తిరిగి కొట్టడం', (వాలాయము) మాటునపొంచి వేటాడడాన్ని 'వాడెవేసి కొట్టడం'గా వ్యవహారం. వాడెవేసి కొట్టడానికి కూర్చునే కొమ్మ వాడెకొమ్మ. వాడె కొమ్మలతో వేసిన

పెళ్ళిపందిరికికూడా వాడెకొమ్మ అనిపేరు. వెనుక వలలను జీలుగు నురుములతో అల్లితే ఇప్పుడు నూలుపోగుతో అల్లుతున్నారు. 'పన్నెండురాటల పెండ్లిపందిరి'చుట్టూ నూలు పోగుచుడతారు. 'నూలుపోగు నూరువరహాలు' అదొక బాస. ఈ వాడెకొమ్మనకట్టిన నూలుపోగుల బాసలో చిక్కుకుని మా మంపరేవుగ్రామం ముద్దులనేస్తం మాజోడు విడిపోతున్నది.

**పెళ్ళనగా వింతిమిగాని - పెళ్ళి చప్పడెన్నడెరుగము**
**తిరిగెండ్లందుము మరిగెండ్లందుము - తిరగటి చప్పడెన్నడెరుగము**
**లోతడందెవు లొవ్వడందెవు - రోకలిచప్పడెన్నడెరుగము**

తిరిగెలవారు, మరిగెవారు అనడమేకాని ఎప్పుడూ పప్పుకూడుపెట్టినవారుకాదు. లోతడని (చప్పిబుగ్గలవాడు), లొవ్వడని పసితనపు కోకిరిపేర్లతో పిలవడమేకాని వీడు పెండ్లికెప్పుడెదిగాడు! అని పెండ్లికొడుకును వరుసయినవారు సరసమాడుతున్నారు.

**పిల్లకివ్వని పాపదేశం :**

**జాడిదేశం జలుబుదేశం - పిల్లకివ్వని పాపదేశం - పాపకియ్యని బాసదేశం**
**పిల్లజాడ వచ్చిన పెద్ద - పిడికెడెరుకలు చెల్లతిన్నడు**
**బొట్టెజాడ వచ్చిన పెద్ద - బుట్టెడెరుకలు చెల్లతిన్నడు**
**నడుమ వచ్చిన పెండ్లి పెద్ద - నడుముడుమ్ములు చెల్లతిన్నడు**
**ముందు వచ్చిన పెండ్లి పెద్ద - ముడుకుడుమ్ములు చెల్లతిన్నడు**
**కొసన వచ్చిన పెండ్లి పెద్ద - కోడిడుమ్ములు చెల్లతిన్నడు**
**డొక్కితోనో డొక్కెడు మందు - డెక్కి నోట వేసిడుకొన్నడు**
**బరిణెతోడి నల్లమందు - బరివి నోటవేసిడుకొన్నడు**

ఉత్తరానఉన్న జాడిదేశం 'ఝాదుఖండం'. సీలేరుదాటిన తరువాత ఒరిస్సారాష్ట్రం లోని (బెజ్జగివాడ చుట్టూ) చిత్తడిమన్యం. అక్కడ ముష్పై, నలభై తెలుగు గ్రామాలున్నా వాళ్ళు అక్కడిభాషనే ఎక్కువ మాట్లాడుతారు. తమకు పిల్లలు దొరకనప్పుడు ఇటు సంబంధాలకు రావడంతప్ప, తమపిల్లలను ఇవ్వనిపాపపు దేశం. జాడిదేశం గడిమన్యం. వారు భారీమనుషులు. అంతా బ్రతుకులు. గడుసుతనం ఎక్కువ. ఆ 'ఉత్తరానికి వెళ్ళిన వాడు విత్తులమొదలు మారడు'. ఆ జలుబుదేశంవారికి సీలలు (ఎంగ్రికలు, ఎరకలు)

బాగాదొరుకుతాయి. కాని సీలేరు ఇవతల గోదావరి(తూర్పు) అంత తడి నేలలుకావు. మనతిండ్లు నచ్చుతవోనచ్చవో, దూరదేశం నుండి వచ్చిన పెండ్లి పెద్దలకని తిరిగితిరిగి నాలుగుపీతలు తెచ్చి కూరవండితే, మొహంవాచినవాళ్ళలాగ వెనుకవాళ్ళకు మిగల్చకుండా తిన్నారు. నల్లమందు మొత్తం నోటవేసుకున్నారు' అని ఆడవారు ఎద్దేవా చేస్తుంటే, పెండ్లిమాటలకు పోయినప్పుడు, తీసుకువెళ్ళిన కల్లుచుట్టూ ఆడపెండ్లివారు ఎంత ఆత్రంగా మూగారో, మగవారు గుర్తుచేస్తున్నారు.

**చుట్టాలు తెచ్చిన కల్లు - మనమే తాగుదారి కన్నవార**
**పత్తిచెట్టుకు పక్షులు మరిగే - పంతమాడుడు కన్నవార**
**జువ్వి చెట్టుకు జూజులు మరిగే - జూజమాడుడు కన్నవార**

అంతేకాదు :

**దొడ్డిలోని లేగలకు చూచి - దొరబడ్డారు బందుగూలు**
**అటుకులోని అన్నానికి చూసి - ఆశపడ్డారు బందుగూలు**
**కుదుటిలోని కంచాలకు చూసి - కుదుటబడ్డారు బందుగూలు**
**పొయ్యిలోని పొట్లానికి చూసి - పోగుబడ్డారు బందుగూలు**

దొడ్డిలోని మందచూసి, పొట్లాలకొద్దీ అన్నంచూసి మీరు పిల్లనిచ్చారని పరువు తీస్తున్నారు.

వావివరుసలనుగూర్చి ఇటువంటి సందర్భాలలో వదరినా ఫరవాలేదు. ఆస్తి అంతస్తులగూర్చి ఎత్తిపొడుస్తే పదుగురిలో అది ప్రతిష్టకు సంబంధించిన సమస్యగా మారుతుంది. ఇలా హద్దు మీరిన ప్రేలాపనలను అదిలిస్తూ –

**'బొట్టుకు పోతున్నామో' :**

**కుంకుమేరో బొట్టూపెట్టగ - కూడినాము ఇందరము**
**కాటుకేరి కండ్లూ దిద్దగ - కలిగినాము ఇందరము**
**ఆటమనదే పాటమనదే - అన్నివిద్యలుగల్లవారము**
**కొలువు మనదే కొలతమనదే - కోటివిద్యలుగల్లవారము**
**వేటమనదే వెట్టిమనదే - వెయ్యి విద్యలుగల్లవారము**
**ఆటకు ఓటెములేదు - పాటకు పట్టులేదు**

వేగినింత పొడవాలె - వెండిరూక లేరవాలె
పగలింత పొడవాలె - పాతరూక లేరవాలె
ఆటగల్ల మానిక వేసి - పాట పాడికొలువుడన్న
ముత్యాల పందిరికింద - ముత్యాలల్లే కొలువుడన్న
పచ్చపచ్చలు గురిమిందెలు - పాయతీసి కొలువుడన్న

బాల బాల పొద్దులాయె - పలుకర్ర వేళలాయివా
జాము జాము పొద్దులాయె - జాలుకాల వేళలాయివా - జావతాగే వేళలాయివా
బొమ్మెత్తు పొద్దులాయె - బొట్టుపెట్టు వేళలాయివా
చరా చరా పొద్దులాయె - సారతాగే వేళలాయివా
దీర దీర పొద్దులాయె - దీపెలెత్తు వేళలయ్యివా
మసక మసక పొద్దులాయి - మందువేసో వేళలాయినా

గురలున్న కొండకాడ - గుమ్మడాకుల ఉత్తరాలు
కణుజులున్న కొండకాడ - కాగితాల ఉత్తరాలు
రంపరాజు వత్తుడనగ - రావియాకుల ఉత్తరాలు

'బొట్టుకు పోతున్నామో' అంటే ప్రధానం చేసుకోడానికి పోతున్నాము అని అర్థం. వరునివైపువారు, వధువుఇంటికివెళ్ళి తమచుట్టాల ఇంటి పేర్లన్నీ చెబుతూ బొట్టుపెట్టి, కట్లవారి, మట్లవారి, కారంవారిబొట్లు – విష్ణుబొట్టు – యీశ్వరబొట్టు – బ్రహ్మబొట్టు పూససేకు వేస్తున్నాం. ఇకనుండి 'ఫలానావారి అమ్మాయి మాకోడలు' అని వెల్లడి చేస్తారు. ఆ తరువాత పెళ్ళికబురుపంపడం.

'మనుమ'లుచేయడం అంటే (మనుమరాలు) పెండ్లికూతురును తయారు చేయడం. నేరేడు కొమ్మకింద పీనెపూసి, అడ్డెడు సామలమీద పిల్లను కూర్చుండబెట్టి తొగరంటుతారు. మంగలి కాలిగోళ్ళుతీస్తాడు. 'తలవెంట జాలుకాలు' (జలకాలు) తరువాత బొట్టుపెట్టడం.

బొమ్మెత్తు పొద్దు (బొమ్మ = ముఖం) ముఖంఎత్తి చూడవలసినంత పొద్దు. ఉదయం తొమ్మిదిగంటలవేళ. ఈపాటలో తమ దినచర్య చెపుతున్నారు.

సారాతాగేవేళలు - దీపెలెత్తేవేళలు - మందువేసేవేళలు.

అందరూ మనవారే. జంకితే ఆట రాణించదు. పాటలో పట్టింపులు కుదరవు. అయినా మనలో కానివారెవరున్నారు. అన్ని పనులు మనవే. కొలిచేవాళ్ళం మనమే. కొలిపించుకునే పెద్దలం మనమే. మనమే నాయకులం, మనమే సేవకులం. ఆట పాటలతో మానికలకొద్ది రూకలు బహుమానంగా కొలుచుకోవాలి.

**పందిని కొట్టవాలె - పాలవిందు పెట్టవాలె**

**పందికమ్మిన పావలా డబ్బులు - పడవేయి పెండ్లికొడుకా**

**కోడికమ్మిన కొత్తడబ్బులు - కొంగునవేయి పెండ్లికొడుకా**

**చిప్పపూవు చేరుచుక్క - చిన్నెలవాడు పెండ్లికొడుకు**

**ఉత్తండాలు పేరుకుదీసో - ముద్దుగాడో పెండ్లికొడుకోయా**

కన్నవారింట పెళ్ళికూతురునుచేస్తూ ఊరివారికిచ్చే పాలవిందుకు పందినికొట్టి పంపడంమగటిమి. 'నీవుపంపకపోతే ఊరపందితో విందుసరిపుచ్చుకున్నాం. ఆపందిని నీ అత్తవారికి అమ్మినవారం మేమే. ఆ పావలాడబ్బులు పడవేయ్' అని నిలదీస్తూ బుగ్గ చుక్కతో, పెళ్ళికళతో ముద్దొస్తున్న వరుడిమీద, మెటికలువిరుస్తూ, బుగ్గలునొక్కుతూ కొరుక్కుతింటుంటే ముడుచుకుపోతున్న పెండ్లికొడుకు నమ్రతనుమెచ్చుకుంటున్నారు.

ఉత్తండాల పేరు = పెళ్ళిలో వధూవరుల మ్రొక్కులందుకునే పెద్దలవరుస. చేతనైనంతవరకు మ్రొక్కి. ఇంకామిగిలినవాళ్ళ పాదాలమీద నీళ్ళుపోసుకుంటూపోవడం ఉత్తండాల పేరుకు తీయడం. అటువంటి మర్యాదగల మంచి పెండ్లి కొడుకు.

ఇలా ఇచ్చకాలుపలికి డబ్బులుదండుకునే వాళ్ళను.

**పినతల్లి కోకిరి :**

**లిక్కులపిన్నమ లివ్వలపిన్నమ - లివ్వాలెందు జల్లుకున్నవా**

**కావురాళ్ళ బందకాడ కల్లుతాగి జల్లుకుంతివా**

**నారదుంపల దొడ్డికాడ నడుమురాగ జల్లుకుంతివా**

పిన్నత్తను పిన్నమ్మ – బావమరిదిని తమ్మ – వదినను పాప – మనుమడిని తాత అనడం కొండవారి అలవాటు. కన్నవారింటినుండి పెళ్ళికూతురును పెళ్ళికి తీసుకు వస్తుంటే దారిలో గ్రామాలవారు నివాళి (లివాలి) ఇస్తారు. కాళ్ళుకడిగి అక్షతలబొట్టుపెట్టి

కరస్పర్శచేయడం నివాళి. నివాళి అందుకున్నవారు బహుమానం చదివిస్తారు. ఇలాపోగుచేసిన రూపాయో, అర్ధో డబ్బులన్నీ కల్లుతిక్కలో కోవురాయిబందలో పారేసుకున్నారా! నారదుంపలదొడ్డిలో ఎవరితో పెనుగులాడుతూ పారేసుకున్నారు! (ఈ పరాచకాలను 'పినతల్లికోకిరి' అంటారు).

**మండెకూరలంక – కత్తిరాళ్ళఘాటి :**

**మండెకూర లంకలోన - మతిలేక జల్లుకొంతిరా**
**కత్తిరాళ్ళఘాటిలోన - కాళ్ళురాక జల్లుకొంతిరా**
**కుల్లికూర డొంకలోన - కూడలేక జల్లుకొంతిరా**
**ఆడవారు ఆటలడబ్బుతో - వేలుబుంగల వేపినికొన్నరా**

ఆయాచోట్ల జరిగిన ఏ పాతఅనుభవాలను పరామర్శించి ఆటలు పట్టిస్తున్నారో! ఈఆటల డబ్బులతో (వేలుబుంగల = జారిన పిచ్చలుగల) ముసలికుక్కను (ముసలివాడిని) దేన్నో కొనుక్కుని ఉంటారని ఆఖరి ముక్తాయింపు. వాళ్ళూ వీళ్ళను దులిపి వదలి పెడుతున్నారు.

**ఆకులూరు అంగటివారు - అన్నదమ్ముల పెండ్లివారోయా**
**అతుకుల బొతుకుల పెండ్లివారు - ఆకులకట్ట విలువలేదోయా**
**చితుకుల బొతుకుల పెండ్లివారు - చీపురుకట్ట విలువలేదోయా**

ఆకులకట్ట అనగా తమలపాకులుకాదు అడ్డాకులు. అవి అమ్ముకుని చింకులు బొంకులు కొనుక్కుని సింగారించుకునేవారు, కర్రకంప, చీపుళ్ళుఅమ్ముకునేవారు అని తీసిపారేస్తే.

**నీరుల్లిపాయ కారాలుచేసి - నిన్న మొన్న తిన్నచెల్లదు**
**వెల్లుల్లిపాయ కారాలుచేసి - వేగిన పొద్దున తిన్నచెల్లదు**
**అని తమ భాగ్యాన్ని చాటుకుంటున్నారు.**

**'గాందులు పట్టుడు గంపనవేయుడు చెండుడి వండుడి తెడ్డెడుముక్కలు'**
(గాందు = పొగమంచు) అని ఈ కోతలను తీసిపారేస్తూ –

---

*గాందులుపట్టుడు, గంపనవేయుడు, చెండుడి వండుడి తెడ్డెడుముక్కలు*

చొక్కులయ్యో పెండ్లివారా - శోభెలయ్యో పెండ్లివారా -
ఉన్నగాని లేదనె వారోయా
నీయింటోయ్ నాయింటినడుమ - చిక్కుడాని వేసినాము
సీకులూరు చిలుకలమందా - చిక్కుడాకులు చెల్లమేసిదా
కాకనూరు కణుసులమందా - కాకరాకులు చెల్లమేసిదా

మన రెండుఇళ్లసందున కాయలు కాస్తాయని చిక్కుడుపాదువేస్తే చిలుకలనుండి, కణుసులనుండి (సోగ్గాళ్ళనుండి, బలవంతులనుండి) కాపాడుకోలేకపోయిన మగవారు అని మగనాలి పాతకథలు తోడుతున్నారు ఆడవారు. ❊

## తేనెపట్టు



-- భూమని రవీంద్ర, దోర్నాల

## చుక్కలున్న సూరెపుదేవి :

నీయింటోయ్ నాయింటినడుమ - గుమ్మడాని వేసినాము
గుమ్మడాకు నీడన పడగా - గుబ్బుమన్నరు పెండ్లులవారోయా
కాకరాకు నీడనపడగా - కదలినారు పెండ్లులవారోయా
బొంతచాటు బొబ్బరగువ్వ - కాలిఅందెల బంగారు గువ్వయా
సామపూవు రైకదాన చన్ను చక్కని పెండ్లి కూతురా
చింతపూవు రైకదాన చిలుకు చక్కని పెండికూతురా
చుక్కలున్న సూరెపుదేవి - సూరె నొక్క బాణపు జాడోయా
ఆకులున్నవి తీగల మీద - అన్నలున్నారు బోయులమీదోయా
అన్నలున్నారు బోయలమీద - మరదండ్లున్నారు మిద్దెలమీదోయా

పెండ్లికూతురు, బొంతచేలో కాలిఅందెలతో చెంగుచెంగున తిరిగే నవ్వులగుమ్మడి. చుక్కలబలంకలిగిన సూర్యదేవత. ఎగజిమ్మే మయూఖరేఖల కాంతితో శోభించే ఉషాదేవి ఈ పెండ్లికూతురు. సిగ్గుతో వంచుకున్న తలను కౌతుకంతో కొద్దికొద్దిగా ఎత్తుతున్న ఉషాదేవిని, దిక్కులకు వ్యాపిస్తున్న ఆమె సౌందర్యరేఖలను, వేదర్షులైనా పెండ్లికూతురుగా వర్ణించారో లేదో! ఆకులు తీగలమీద ఉన్నట్లు ఆమెజతకత్తెలు చుట్టూ పైన ఉన్నారు. అన్నలు పనులలో (బోయలు–సైన్యంలో పనిచేసేవారు) ఉన్నారు. మరదండ్లు మిద్దెలమీద ఉన్నారు. వీరందరికి సరియైన వసతి చూపలేకపోయినారు మీరు.

పాతపాత పెండ్లివారు - పంది దొర్లిన ముర్రెముర్రెలా (పందుల గుడిసె)
కొత్తకొత్త పెండ్లివారు - కోళ్ల దొర్లిన ముర్రెముర్రెలా

'దండుకు మంచాలు – పెండ్లికి కంచాలు' సమకూర్చలేం. పెండ్లికికూడా దండు వచ్చినట్లు వస్తారు. అలా తమ ఊరు మీదుగా పెండ్లికి తరలిపోతున్న దండును చూసి మనసులో గుద్దుళ్ళు పడుతున్నది మానవతియైన ఇల్లాలు.

### చుట్టాలబియ్యం :

చేపలేదో జెల్లలేదో - చేతనొక్క గాజులేదోయా ॥అచ్చుకోడ॥
చుట్టాల బియ్యములేదు - సూటిగల్లకోక లేదోయా

**నయ్యదాపు రాగిలేదు - రంగుగల్ల రవికె లేదోయా**
**చిలుకుగల్ల చీరలేదు - పట్టుగల్ల బట్టలేదోయా**

**కొంగుమూట లేటివప్ప - కొంగుమూట కొలతల బియ్యం**
**వడిమూట లేటివప్ప - వడిబాల కొలతల బియ్యం**

కన్నవారింట పెళ్ళికి, బీదరాలైన కూతురువెళ్ళడం ఎంతో మధనపడేసమయం. మామూలురోజుల్లో ఏ జీలుగపిండి తీసుకొనిపోయినా పట్టించుకునేవారుండరు. కానీ పెండ్లిలో బియ్యం తీసుకొనిపోకపోతే నలుగురిలో నామోషి. పుట్టింటికి వెళ్ళేటప్పుడు కొండరెడ్ల ఆడపడుచు, అత్తవారి ఇంటినుండి 'చుట్టాలబియ్యం' అంటే బత్తెం తీసుకు పోవాలి. వడిబాలబియ్యం, చుట్టాలందరూ, తమ ఇంటినుండి తలాపిడికెడన్నా పట్టుకు పోవాలి. ఏ సెనగ ఉండలైనాకొని పిల్లలచేతిలో పెట్టడానికి దాచుకున్న రాగిడబ్బులు కూడాలేవు అనిమధనపడుతూ, తోడికోడలును కాబోలు దువ్వెనకోసం అడుగుతున్నది.

**కొండమీది కొల్లెంగిపూలు - కొప్పునిండ గుప్పబోగ**
**ఇట్టె అందవు అట్టె అందవు - కొనవెంటి కొప్పకందవా**
**నీవు దూసిన దువని బన్నె - ఎందు పెడితివి రంబల దేవోయా**

ఇలా తయారవుతుండగా పైగ్రామాల పెళ్ళివారు ఊరుమీదుగా తరలిపోతున్నారు.

**కుచ్చులేరి కోకకట్టగ - కుట్రవాడ దండువచ్చె**
**మడతలేరి కోకకట్టగ - మర్రివాడ దండువచ్చె**

పెళ్ళిపందిరిలో బిళ్ళనూలు (పందిరిచుట్టూ కట్టడానికి) చిక్కుతీస్తున్నారు పడుచులు.

**నూలుతేవో సాలెవాడా - సావుతామో వడికిన నూలు**
**సావుతామో వడికిన నూలు - సందులేకర జాలెతీద్దాం**
**బొల్లొంబొరికిడి వడికిన నూలు - బొక్కలేక జాలెతీద్దాం**
**చిల్లొం చిక్కుడు వడికిన నూలు - చిక్కులేక జాలెతీద్దాం**
**మాల గుంటడు వడికిన నూలు - మలికిలేక జాలెతీద్దాం**
**కోయగుంటడు వడికిన నూలు - కొలికి లేక జాలెతీద్దాం**
**(సావుతము: నిష్ఠగా, జాలె: దండ.)**

ఇలా పేరుపేరున పొడిగించడం అదో కవ్వింపు. ఏదోవిధంగా మాటకలుపు కోవాలి గదా. ఇలాంటివారు చేసేపని తక్కువ, వగలెక్కువ. ఆ వగలకోసమే ఈ వేడుకలన్నీ.

**జాడిదీకటి బూడిరోకటి - ఎంతదంపిన డంగరిజొన్న -పెద్దన్న పెండ్లిజొన్న**
**చీకటింట దవనిగొన్నం - చిట్టియావుల పాలుతెమ్మీ**
**మలకరింట దవనిగొన్నం - మల్లెటావుల పాలుతెమ్మీ** *(దవని : దాహం)*

జాడివారు భారీమనుషులు. ఆ దేశం తిరగలి. సీకాయలేని తానం పాడుతానం బూడినీళ్ళతానం అంటారు. బూడిరోకలి అంటే మంచిపొన్ను, బరువులేని రోకలి. ఎవరో గడుసరి, పడుచువాడినిపిలిచి, రోలుచూపిస్తూ ఎంతకూ జొన్న నలగడంలేదు. చాలీచాలని రోకలి. ('గుంటడు గుడిలింగడు–వాడెంతకొట్టిన లొంగడు', రోలు–రోకలి) ఈ చీకటింట్లో ఊపిరాడక దాహంఅవుతుంది. ఈ విశాలమైన మలకరింటివారికి మంచి ఆవులుండాలి, వెళ్ళి పాలుతెస్తావా అని అడుగుతున్నది.

కొత్త కొత్త ఊసులలో కోరికలు గుబులు పెడుతున్నాయి –

**వద్దురగుంటడ వరుసలేదు లేదొ – లేదుర బావా లేతపాయమా :**

**వెన్నెలేని పందిరికింద - వేసినామో చోళ్ల తిరుగలి**(వెన్నెలేని=వెన్నెలున్న)
**వాయుపోసో విసర బోగా - వాయువాయుకు వరసలడిగెవా,**
**చేరుపోసో విసరబోగా - చేరుకు చేరుకు సెలవుడిగెవా**
**తీగెపోసో విసరబోగా - తీగెతీగెకు తిపురులడిగెవా**
**వద్దురగుంటడ వరుసలేదు లేదొ - లేదుర బావా లేతపాయమా**

స్త్రీపురుషులు కామాంధులు కారు. ఈడుగానిపొందులో ఆనందంలేదు. వరుస గాని పొందు మనస్కరించదు. ఇది వ్యవస్థకలిగించిన సంస్కారం. ఈడుజోడు తోడైన ఆనందంలోనే తనువు, మనసులీనమైపోతాయి. అటువంటి రసమయపథంలో మనం నిరంతర యాత్రికులం. ❊

## ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు :

**లచ్చుకల్లెనమో శుభలగ్గెమొ - గౌరికల్లెనమో వైభోగమొ**
**ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు - కాకరపూవులు కనకడక్కులు**
**ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు - గుమ్మడిపూవులు గుబ్బగొడుగులు**
**ఆలవరో సీతమ్మ నీపెండ్లివారు - గున్న చింతలలోన గుర్రాలవారు**
**- ఎర్రగొప్పులలోన ఏనుగులవారు**

పెళ్ళికూతురుకు సీతమ్మ పర్యాయపదం. ఆమె పెండ్లివారు కాకరపూవు వంటి కనకాభరణాలవారు. గుమ్మడిపూవువంటి గుబ్బగొడుగులు (సంతలోకొన్న గుడ్డ గొడుగులు) వేసుకొని వస్తున్నారు. చింతపండు మన్యంలోపండి, సంతలోకి తరలే మారకపుదినుసు. వాటిని స్వయంగా రవాణాచేసి అమ్ముకోగలగడం, కలిగిన వ్యాపార దక్షునిలక్షణం. 'చింతలతోపులు, గుర్రాలుకల భాగ్యశాలురమ్మా ఆ వస్తున్న నీ పెండ్లి వారు' అని ముత్తైదువలు కాతతెస్తున్న పెద్దలను చూపిస్తున్నారు. పితూరికాలంలో దొరలు ఏనుగులమీద వచ్చేవారట. అలా ఏనుగులమీద తేలిరావటం హోదా. అలా వచ్చే మునసబులు ముఠాదారులు మీవారు.

**కాతకావళ్ళు :**

**చూచివిప్ప పెద్ద చూచివిప్పయ్యా - బొడ్డుపోగుతాడులున్నవో లేవో**
**దానిలో ఊలులు ఉన్నవోలేవో - కుంకుమ కురివేలి ఉన్నవో లేవో**
**కాటిక గంధము ఉన్నవోలేవో - తల్లికి తలకట్టు చీరలున్నవా**
**పెట్టె విప్పలేక పుసులుతున్నారు - మాఊరు పెద్దలు బహుపెద్దలట**

కాతకావడిని (పెండ్లికూతురుకు పంపే సారె) జాగ్రత్తగా నూలుపోగుతో కట్టాలి. ఎక్కడా తెంపకుండా జాగ్రత్తగా విప్పాలి. అలా విప్పడం శుభశకునం. విప్పేవాళ్ళను ఏడిపించడం వేడుక. కాతలో, తల్లికి తలకట్టుచీరె, తండ్రికి పంచ, చొక్కా, ఐదు ఈనె కర్రలు, వెల్లుల్లిపాయలు, ఇరుపలబన్నె, అరటిపళ్ళు, కుంకుమ, కాటుక, గంధం మొదలైన ముప్పైమూడువస్తువులు రావాలి. ❉

**సీతజాలుకము :**

**వేనీళ్ళు చన్నీళ్ళు వెయ్యరో కడవ - చిక్కుడు చెట్టుకింద సీతజాలుకము**
**ఈరావియారావి మట్టెల్లరావి - తోటికోడలుపెండ్లి తొగరియ్యురావి**
**అన్నదమ్ములపెండ్లి తొగరియ్యురావి - ఈరావి ఆరావి మట్టెల్లరావి**
**మరదలు పెండ్లికి మల్లెలరావి - కోడండ్లపెళ్ళికి కొమ్మల్లరావి.**

శకుంతలను అత్తవారింటికి పంపేటప్పుడు వనదేవతలు ఆమెను అలంకరించ డానికి వస్త్రాభరణాలిస్తారు. మట్టెలరావిని, నీతోటికోడలు (చెల్లెలు) పెండ్లితొగరివ్వమని (సుగంధద్రవ్యాలు) అడుగుతున్నారు.

**చిక్కులిప్పంగ చీకటయ్యింది - కొప్పులిప్పంగ కో తెల్లవారె**
**దక్షిణ్నుంచి వచ్చిడోయ్ దొడ్డమంగలి - కాలిగోళ్ళు తీయు మంగలి**
**గోరుతీయు మంగలికి ఏమితో విందు - గోరుతీయుమంగలికి గొర్రెతో విందు**

కన్యను ముస్తాబుచేసి, పాలవిందుతీర్చి 'పోయినింటి బాలగాని పుట్టినింటి బాలగాదు' అని కండ్లనీరు దాచుకుంటూ ఈనెబుట్టలో దూలికూడు (వట్టి అన్నం), పానకంకావడి వెంట పంపిస్తారు.

**సుఖము సేయుడు కన్నవార - చందురుడు తేలివేళ**
**ఆడవాలె పాడవాలె - వేడుకలు సేయవాలె**
**సెలవు సేయుడుకన్నవార - చందురుడు తేలివేళ**
**పాండుగూలు వెళ్లెదారై - పచ్చపూవుల పరిమళింపు**
**రాజులు వెళ్లెదారై - రత్నముల రవ్వదుల్లు**
**ఏనుగులు వెళ్లెదారై - ఎర్రమన్ను రవ్వదుల్లు**
**ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలె**

మగపెండ్లివారి పెద్దలు పెండ్లికూతురును తీసుకుపోయేందుకు సెలవులడుగు తున్నారు. వారిదారి పాండుగులు నడిచిన ధర్మపథం. సంస్కృతి తరతరాలుగా నడిచే ఘంటాపథం. దారిలో చుట్టాల, బందుగుల నివాళులందుకుంటూ తమఊరి పొలి మేరకుచేరిన ఆడపెండ్లివారికి, మగపెండ్లివారు ఎదురువచ్చి, చాపలమీద కూర్చోబెట్టి,

తేనీరు–రెండేసి పొగముక్కలు ఇస్తారు. వధువువెంట తెచ్చిన దూలికూడును ఆడవారు, పానకాన్ని మగవారు పంచుకుని అందరూ విడిదిచేరతారు. ఇంకా చేరవలసిన పెద్దలగూర్చి విచారిస్తున్నారు.

**మనవారు వచ్చిరో అక్షింతలాకి :**

జాజిపూవువన్నెగుర్రం - జాతిదొర ఎక్కేగుర్రం
ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలె
జీడితోట చిట్టమరెడ్డి - జీడిగుర్రాన ఎక్కిరమ్మీ
బోడిదొర ఎక్కేగుర్రం - బొడ్డులోన నిట్టెగలది
కర్రిదొర ఎక్కేగుర్రం - కందిపూవువన్నెగుర్రం
బోదులూరి బొర్రం రెడ్డి - బొల్లి గుర్రాన ఎక్కిరమ్ము
కానివాడ కాటమరెడ్డి - కర్రిగుర్రాన ఎక్కిరమ్ము
రాజరాజలవారు రాజ్యాలవారు - రాజులు వచ్చిరో అక్షింతలాకి
॥లచ్చుకల్లేనయో॥

దేశదేశలవారు దేశాలవారు - దేవతలువచ్చిరో అక్షింతలాకి
మన్నెమన్నెలవారు మన్నేలవారు - మనవారువచ్చిరో అక్షింతలాకి
పల్లెపల్లెలవారు పల్లెలవారు - పడాండ్లు (పడాలు) వచ్చిరో అక్షింతలాకి
ఏడేడురోజులు ఏకలగ్గెనం - పదిరోజుల పెండ్లి పాప చినవాడిది

**పోలు – పీనె :**

దొరలు, పెద్దలు, పేరటమ్మలు కూడుకున్న తరువాత –

చెక్కు చెక్కున తీయి చేరెడిమన్ను - గోరుతో తీయవోయ్ గోరెడిమన్ను

డప్పువాయిద్యం దారితీస్తుంటే, గోవులుపట్టిన దుప్పటినీడకింద నడచివెళ్ళి తవ్విన మన్ను

ఈపోలు పొయ్యంగ ఎవ్వరిని పిలుతు - కన్నత్త సాటిదో పిన్నత్త పిలువు
ఈపోలు పొయ్యంగ ఎవ్వరిని పిలుతు - కన్నతల్లి సాటిదో పినతల్లి పిలువు
॥లచ్చుకల్లేనమొ॥

పోలుపోసి –

**ఇప్పుడే పుట్టింది ఈ లేగదూడ - ఇరవై పుడుకల గడ్డితిన్నది**

**॥లచ్చుకల్లేనమొ॥**

**ఇరవై పుడుకుల గడ్డితిన్నది - మళ్లివచ్చి వాకిట పేడకడివేసె**

**మునికి వేసిన పేడముత్యమై దుల్లె - జల్లివేసిన పేడ జవ్వాది దుల్లె**

**పారవేసిన పేడ పవడమై దుల్లె - కూడదోసిన పేడ కుంకుమై దుల్లె**

ఐశ్వర్యప్రదమైన గోమయంతో అలికి–సామలు పీనెపోసి, అలంకరించి, పన్నెండు వాసాల పందిరివేసి ఆపందిరిచుట్టూ బిళ్ళనూలుచుట్టి – ఆ పందిరిమధ్యవేసిన నేరేడు చెక్కమీద వధూవరులను కూర్చుండబెట్టి బాసికధారణం చేయిస్తారు. కూటిముద్దల మీద బాసచేసి, బాసముద్దలు వెనువెనుక ఇరువురూ అందుకుంటారు. తరువాత ఒకరికొకరు బుగ్గపూతలు.

**దేశాల పోయిరో దేశాలవచ్చి - దేశపాలకులార మీదెలివ్వాలి**

**కోననపోయిరో కోననవచ్చి - కోనదేవతలార మీదెలివ్వాలి**

అని దేవతల, పెద్దలఅనుజ్ఞ తీసికొని పేరంటాండ్రు 'ఫలానావారికోడలు',పెద్దలు 'ఫలానావారి అల్లుడు' అయినారయ్యా అని చాటి –

**భూదేవి అంత పీనెలు పోసి - ఆకాశమంత పందిళ్ళు వేసి**

**చుక్కలకు అక్షింతాలు - సూర్యుడికి బాసికమోయా**

**గుచ్చిన ముత్యాలు తోరణాలుగట్టి - గుచ్చని ముత్యాలు తలంబ్రాలుపోసి**

**లక్ష్మీకళ్యాణమో శుభలగ్నమో - సీతాకళ్యాణమో సౌభాగ్యమో**

శతమానం (తాళి)కట్టిస్తారు. సీతకు శ్రీరాములవారికి పెళ్ళిఅయిందయ్యా. కులానికంతా అడెం (అడియన్ దాసోహం) అని విన్నవిస్తారు. కొంగుమూట బియ్యం కొలవడంలో వధూవరులు పోటీపడతారు.

బాసికంతో వధూవరులఫాలభాగం సూర్యబింబాన్ని ధరించినట్లున్నదట. వారి తలలో చిక్కుకున్న తలంబ్రాలు, మల్లెలు, ముత్యాలు చుక్కలవలె ఉన్నాయట. అట్టి వధూ వరులు సాక్షాత్ లక్ష్మీనారాయణులు. వారి పెండ్లికి ఆకాశమే పందిరి, భూదేవి వేదిక.

అరుంధతినిచూశాక ఎర్రకోడిపిల్ల చుల్లించి, దిష్టితీసి ఉత్తండాలపేరుపోసిన తరువాత వధూవరులను ఎవరివిడిదికి వారిని పంపుతారు. పెళ్ళిపందిరిలో పేరటమ్మలు ఈ తంతు జరిపిస్తుంటే; ప్రాంగణంలో గోవులకోలాటం – గుబ్బట్ల గుమ్మళ్ళు, పెద్దవాళ్ళ తగవులు.

**అద్దురంతపు అడవిలోన - గిద్దువన్నె కోడికూసె**
**నెమలిపిట్ట కేకలకు - నందపురము తెల్లవారె**
**గువ్వపిట్ట కేకలకు - గూడెములో తెల్లవారె**
**పికిలిపిట్ట కేకలకు - పిట్టపురము తెల్లవారె**
**తోకపిట్ట కేకలకు - తోకబందలు తెల్లవారె**
**సిక్కుపిట్ట కేకలకు - సీమభూములు తెల్లవారె**
**రాలిపిట్ట కేకలకు - రాజమంతా తెల్లవారె**
**కారుకోడి కేకలకు - కానివాడ తెల్లవారె**
**గుమ్మడేగ కేకలకు - గుమ్మిరేవు తెల్లవారె**

మనకొక్క కోడికూతలే. అడవిలో ఎన్నోపిట్టలవి ఎన్నోకేకలు. తెల్లవారి సంపద కడవలు తొక్కడం, (పసుపునీళ్ళ బిందెలో ఉంగరంకోసం వధూవరుల పోటీ.) పిదప 'దుక్కులకు పోవడం'–'దేవుండ్లకు పంపడం'. పెండ్లితంతు ముగిసింది. ఇక భోజనాలు – వంటలకు వంకలు.

**సర్విలి నిట్టల సామకూడు - చక్కగ వండుడు పెండ్లివార**
**ఉడుక నుడుక నులవపప్పు - చక్కగ వండుడు పెండ్లివార**
**ముదిరిన వంకాయకూర - ఉత్తెకాయ చింతపులుసు**
**పోయగానె గుచ్చుకపోయే - లచ్చుకోడలయ్యో కోడలా**
**సొక్కులులేవోయ్ పెండ్లివార - శోబెలులేవోయ్ పెండ్లివార**
**చోడిరొట్టెలు మాడిన కంపోయా***(సర్విలనిట్టల: రాళ్ళు చెత్త, చోడి: రాగి)*

'అందినవాడికి ఆకువేయి, అందనివాడికి కేకవేయి' అని హెచ్చరించుకుంటూ వడ్డనవేళకు అందరూ వచ్చారోలేదో, పదార్థాలు అందుతున్నవోలేవో జాగ్రత్తగా చూసుకున్నా ఇంతమందిమీద ఏదోలోపం వస్తూనే ఉంటుంది. అందుకే 'పండుగకు

వెళితే పప్పు కూడుగాని పెళ్ళికివెడితే పెడతట్టు' అంటారు (పెడతట్టు – ఏదో ఒకప్రక్కన అందిన దానితో సరిపెట్టుకోడం). ఇలాంటి పనులలో శ్రద్ధ, నిర్వహణనైపుణ్యం జానపదులలో హెచ్చు. సోపువేటల క్రమశిక్షణలో రాటుదేలిన గిరిజనులలో పనులు, నీళ్ళమోతనుండి, పొగరేకుల పంపకంవరకు ముందుచేసుకున్న ఏర్పాటుప్రకారం ఎంతో శ్రద్ధతో చకచక చేస్తారు.

పెండ్లితంతు ముగిసి, అప్పగింతలకు అందరూ సిద్ధమౌతున్నారు. 'మళ్ళీ ఎప్పుడు' అని వత్తిడి పెడుతున్న గోవులతో – పడుచులు

**నేదుకొయ్య నాది మనసు - సిప్పపూవు తెప్పేగట్టు**
**పాలపూల తెప్పేగట్టు**
**నీకినాకి జోటాలైతె - తెప్పమీద తేలిపోదరా**
**నయ్యమీద పేమలుంటె - నారుమీద నడఁచి రమ్మోయా ॥అచ్చుకోడల॥**

*(నేదు–ముండ్లపంది, నేదుముల్లువలె నామనసు ఊసి, సున్నితం)*

నారుమీద నడచిరావడమంటే, సూటియైన మార్గంలో పెండ్లిమాటలకు రావడం.

**ఒప్పినామో – నిట్టపాణమా :**

**సంతల దారిన సామచేను - తొక్కినామో యొక్క రెత్త**
**తొక్కినామో యొక్కరెత్త - యొప్పినామో నిట్ట పాణమా**
**నీళ్ళ కెంత దూరమప్పా - సంపెగ దోనెలు దాటి**
**చారుమన్నెలు పారజూదామా -**
**కుంభకారుడు తోలినలంక - కోటిమన్నెలు పారజూదామా**
**ఆలుమానుడు తోలినలంక - ఆరుమన్నెలు పారజూదామా**

ఆటపాటలలో పెరిగిన చనువు, వయసుబులపాటం – సంతలదారిలో ఎవరి అదుపాజ్ఞల భయంలేకపోవడంవల్ల, కాలుజారితేపరిణామాలు మోసపుచ్చుతాయి. పొలంలో నారునుతొక్కడం భూదేవతను తొక్కడమే. మనసులో మయలతో అలా తొక్కినవాడు మాసిపోతాడు. అటువంటి సంఘటనలను గుర్తుకుతెస్తున్నారు గుబ్బట్లు.

సంతలదారిలోఉన్న సామచేనులో రెత్తను తొక్కినందుకు (లక్ష్మణరేఖను దాటి నందుకు) ఒక నిండుప్రాణాన్ని బలిచ్చుకున్నాం. అంతటితో ఆగలేదు, జతలవారందరికి

ఒంట్లో ఆవిరులుతేలడం మొదలుపెట్టాయి. 'ఉమ్ములుమ్మగ–ఊటలుదేలగ, నడవనడవ – నడిపొక్కులుదేలగ, విసిరిన చేత రక్తాలుట్టగ, దశపన్నెండామండ్లభూమి, నీళ్ళకోసం నడిచిపోయి కుంభకారుడి లంకలు, హనుమానునిలంకలు, మన్నెలు (సముద్రాలు) సంపెంగదోనలన్నీదాటి ఆదుకునే వారికోసం పోవలసివచ్చింది.' 'మగవాడవు నీవే నారుమీద నడచిరా. దూరదేశపు వారితో లేచి పోకూడదు. అక్కడ ఏకష్టంకలిగినా, కన్నవారికి కబురందడం కష్టం. ఇక ఊరెరుగని కాపురాలు పట్టించుకునే వారెవరు' 'పెండ్లిమాటలకోసం పెద్దలను పంపు' అని షరతుపెడుతున్నారు.

కులానికి తెలిస్తే భీమాచేసినంత భరోసా. 'కుండెడు కూటికి దాటగలరుగాని కులానికి దాటలేరు'. పెండ్లిమాటలన్నా జరిగితే, కొంత పరవాలేదు. అందుకే 'అడిగిన పిల్ల – కడిగిన ముఖం' అంటారు. కన్నవారు ఒప్పుకోకపోతే మనపెండ్లికి చుక్కలే అక్షింతలు, సూర్యుడే బాసికం.

## సూటిగల్ల గేదెపోతు – కారుకోడి లచ్చుమన్న :

**బందమాటి (మామిడి) బయలులోన - బయలుదేలిది గేదెపోతు**
**చుక్కనుదురు అలమతోక - సూటిగల్ల గేదె పోతోయా**
**గేదెకి వేసో బంటెవ్వడు - కారుకోడి లచ్చుమయ్య**
**లిప్పమంటే తప్పేలేదా - కన్నురెప్పలు గర్రులు గట్టోయా**
**సూరుడు బాణముతోటి - చుక్కబొట్టు దెబ్బతీసో**
**చందురుడు బాణముతో - చెంపమీద దెబ్బతీసోయా**
**కండలు కాకులొల్లవు - దాని రకతము చీమలొల్లవా**
**చీమలు దేవిన మన్ను - చీమరాజు లేలుంబడి**
**నాగులు దేవిన మన్ను - నాగరాజులేలుంబడి**

అడవిగేదెలు, లంకలలో–బయళ్ళలో మందలుమందలుగాతిరుగుతాయి. బాగా కొవ్వెక్కి మదించినగేదె, కణుసు, పంది 'ఒంటి'గా తిరుగుతాయి. పులులుకూడా వాటిని ప్రత్యక్షంగా యెదుర్కొనేందుకు సాహసించవు. అట్టి 'తారుణ్యలావణ్యజృంభిత' యైన 'స్వైరవిహారధీర'ను లోగొనగలిగిన బంటు కారుకోడి లచ్చుమన్న.

అతని అల్లెత్రాడు రిప్పుమంటే (టంకారం) గురితప్పేదిలేదు. కొట్టేది గేదెనే ఐతే అలుగును గురివైపు చెదరకుండా నడిపేందుకు యేకారుకోడి ఈకలనో కట్టవచ్చు. కాని రూప, యౌవనసౌష్టవం కలిగిన నెరజాణను గెలుచుకోవడానికి కనురెప్పలనే గ(్రులుగా కట్టే (ఈకలు) ప్రేమికుడు లచ్చుమన్న. అతని 'బారతీపు'కు (ఆకర్ణాంతం బాణం లాగడం) దూసుకుపోయిన బాణం చుక్కబొట్టును ముద్దాడింది. గుండెకు ఆనించి 'బొక్కతీపు'తో సంధించిన చంద్రవంకలాంటి బాణం చెంపమీద గుర్తునాటింది.

కాని వారుపెట్టిన బంతికూడును కులం ఒప్పుకోలేదు. కారుకోడివారు రెడ్లు. గుర గేదె, కోయపడుచు. రెడ్లకు గేదెమాంసం నిషిద్ధం. రెడ్లు–కోయల కులాంతర సంబంధం దోషం. దానికికులభ్రంశమేశిక్ష. అందువల్ల పప్పుకూటికోసం చేరేకాకులు, చీమలవంటి కులంవారు ఆసంబంధం ఒల్లరు. ఏజాతికాజాతికి తను దేవిన (తవ్విన) మన్నులోనే తనకు యేలుబడి, చెల్లుబాటు. ❉

## బెట్టుడత గూడు




-- తోకల గురవయ్య, అప్పాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా

## కన్నెకు కలుసుకుందాం - దసరాకు దంచుకుందారా :

ఉందాము ఉందామనగా - ఉనికిపుట్టని కాలాలాయె
పోదాము పోదామనగా - పోడు వేట కాలాలాయె
వెళదాము వెళదామనగా - వేడుకల కాలాలాయె

ఇంకోనాలుగురోజులుండాలి అనుకున్నపుడు ఉండేందుకు తావే దొరకదు. ఏదో వంకన ఉండేందుకు చుట్టాలు, బంధువులులేరు. ఎక్కడికైనపోవాలి అని సరదా కలిగినపుడు పోడు, వేట పనిరోజులు.

ఈయేడు ఈలాగుందాం - కన్నెకు కలుసుకుందాం
దసరాకు దంచుకుందారా ॥అచ్చుకోడలయ్యా కోడ॥

ఈయేటికి ఓర్చుకుందారి. 'కన్నె' (ఆగస్టు – సెప్టెంబరు) అంటే కొండపిచ్చుక హిమాలయాలనుండి ఈ కొండప్రాంతాలకు ఆగస్టునెలలో వలసవస్తుంది. అదిచొరబడే కాలాన్ని గోదావరి, విశాఖమన్యంలో 'కన్నె'నెలగా పిలుస్తారు. 'కన్నెపిట్ట దిగిందోయ్ పప్పులు చల్లాలె' అని అపరాలుచల్లే అదునును చాటుకుంటారు. ఈ కన్నెన్నెలలో తొలి పంటలు బొంత, కన్నెసామ కోతకువస్తాయి. పాలపదునులోవున్న ఈ పంటనుకోసి పొయ్యిపైన, జోలారుమీదవుంచి ఎండుగులనుదంచి వండుకుంటారు. ఈ గింజలు ఎక్కువకాలం నిలువఉండవు. ఈకాలం 'పిట్టకు బొట్టకు దీముమెర్రని కాలం'. సమస్త ప్రాణికోటి నకనకలాడుతుంటుంది. కాబట్టి ఈతరుణంలో అందివచ్చిన పంటను చుట్టాలు, బంధువులు అందరూచేరి తింటారు. 'అపుడు కలుసుకుందాం' అని ప్రియురాలు అదునుచెబుతుంది.

### ఈకతీస్తే వీసెడు కొవ్వు – బూరుతీస్తే బుక్కెడు కొవ్వు :

దసరాపిట్టలు చెలరేగేది దసరానెల. పొలాలుఈనుతుంటాయి. పైరు మీదపడే పందుల 'ఈకతీస్తే వీసెడు కొవ్వు – బూరుతీస్తే బుక్కెడు కొవ్వు'. ఈ చేలనుమరిగి కొవ్వుతో నిగనిగలాడే కుందేళ్ళు 'దశమి పోతులను కొరకవాలె' అని చూస్తుంటుంది బావురుపిల్లి. ఈ పిల్లులకు, పందులకు, పోతులకు, పిట్టలకు; మీటెలు, పాదులు ఒడ్డుతూ, పిట్టకాపు, దూడకాపులకు ఇల్లువదలి, చేనుపాకల్లోవుండేరోజులు. 'కొత్తకు (పంట) పాతకు యెడమైన ఈ దసరాకు డాకుడాకు ఇబ్బందులు'. దోసపండ్లు, జొన్న

కాయలు, దుంపలు, ఆకులు, ఎరకలు, చేపలు పోగుచేసుకుంటూ పొట్టనింపుకోవడానికి తిరిగేకాలం. ఈ చిరువేటలవల్ల ఎన్నోరకాల ఈదులతిండ్లు (చిరుతిండ్లు). ఆ రోజులలో మనకు పొలంకాపులో తమకంతీరా ఏకాంతం దొరుకుతుంది. 'చేను పాకలలో ఈ షికారు తిండ్లతో, ఆ లేత చలిరాత్రులు గడుపుదాం' అని జతగాడిని ఓదారుస్తూ ఊరిస్తున్నది ఒక విరహోత్కంఠిత.

ఇలా గుసగుసలాడుకుంటూ, గుర్తులు చెప్పుకుంటూ, అప్పగింతలకురమ్మని అదిలిస్తున్న (పడుచుల 'పదంలేకుంటే పబ్బంతీరదు') పెద్దలవెంబడి వాడెగొమ్మ వద్దకు వెడుతున్నారు పడుచులు.

**కాచిన కందులల్లె – కారుకోడి బాలలము :**

**పిల్లలము యున్నప్పడు - పిల్లివేటలాడేవారం**
**గుబ్బట్లము యున్నప్పడు - గొట్టిమాటలాడేవారం**
**పొక్కపూవు పూసేవేళ - రేవుదొక్కే బాలలము**
**అమ్మవారుయున్నప్పడు - ఆడేవారం పాడేవారమా**
**జోట జోటాలుంటిమి జోట - జోటలెందు వీడిపోగా**

**॥అచ్చుకోడలయ్యో కోడలా॥**

(రేవుదొక్కడం – రజస్వల అయిన తరువాత కాలువ ఒడ్డున చేసే తంతు)

**కాచిన కందులల్లె - కారుకోడి బాలలము**
**వేసిన కందులల్లె - వెలుగూరి బాలలము**
**పూసిన కందులల్లె - పూరిపిట్ట బాలలము**
**పండిన కందులల్లె - పాలివారి బాలలము.**

కాచిన కందిబొట్టలవలె మేం ఒక్కకంచాన, మంచాన పెరిగినవారం. (బొట్ట = కాయ) కందికంచెవలె (వెలుగు = కంచె) ఒక్క కట్టుబాటులో ఇమిడినవారం. పూసిన కందిచేనువలె (పిట్టలతో) కలకలలాడుతూ వుండేవారం. నేడు పండినకందులవలె పాలివారికి పంపకమైపోతున్నాం.

**జోడువెలమలు దాటిపోగా - జోటనగరు రెడ్లకిచ్చిరి**
**పదివెలమలు దాటిపోగా - పలకజీడి రెడ్లకిచ్చిరి** (వెలమ = చిరుమాను)

**నూరువెలమలు దాటిపోగా - నులకమద్ది రెడ్లకిచ్చిరి**

**హోరుమని వానరాగా - ఒరుగనందుకు మానేలేదు**

**చిన్నన్న వెన్నులోన - చీమనై దాగుదును**

**పెద్దన్న వెన్నులోన - పేనునై దాగుదును**

'రెప్పచాటు కనుపాపవలె పెరిగాను. అక్కడ ఎవరున్నారునాకు' అని వధువు జతగత్తెలను కౌగిలించుకొని కళ్లనీరు పెట్టుకుంటుంది. ఆమె కన్నీరుతుడుస్తూ వరునితో–

అయినింటిపిల్లకు తెచ్చి ఆకులకు పంపకుడన్నా

మేనపిల్లేకదా పరవాలేదని అడ్డమైనపనులు చెప్పకండి. ఆకులకుపంపి ఇంత సేపు ఏంచేశావు అని ఆరళ్ళుపెట్టకండి.

చాలా ఓలిపోసికొన్నాను. ఇంతడిగారు అంతడిగారు మీకన్న వారు అంటూ పాత గొడవలతో దెప్పకు.

**దీనాదానా దెప్పకులేవో - ధనమెంతో పోసికొన్నవు**

**తెచ్చిదెప్పులు దెప్పకులేవో - దొరికినదాకా వెతలుపడ్డవు**

'ఈపిల్ల దొరికినదాకా వలలుపన్నావు. వెకిలి వేషాలు వేశావు' అంటూ వరుడు పొందిన ఆశాభంగాలను గుర్తు చేస్తూ –

## వేడికీల ముంగిపిల్ల :

**వేటలకువెళ్ళి తెచ్చో - వేడికీల (వేడుకల) ముంగిపిల్ల**

**కూడుపెట్టి పెంచుదమనగా - కులముతోడి చెప్పకున్నది**

**పాలుపోసి పెంచుదమనగా - పారిపోయింది ముంగిపిల్ల**

'ఆ పిల్లతో ప్రతిక్షణం ఒకపండుగ – దానితో యోగం ఒకభోగం' అని పెద్దల ప్రమేయం లేకుండా (వేటలకువెళ్ళి తెచ్చో) 'లాగావు'. మా అమ్మాయి అసలే మూగది, బెదురుది. పారిపోయి కన్నవారితో చెప్పుకున్నది. తగవులో 'పులికరించింది పులికే, నక్కలాగింది నక్కకే, కాల్దొక్కినందుకు (లాగేముందు) నేనే కంకణంకట్టవాలె' నని నాడు ముద్దాయివై వాదించావు. 'దొరికినదాకా ఇంత వెతలుపడ్డావని నీ చేతిలో పెడుతున్నాం' అని చురకలు వేస్తూ –

**దూర దేశం మనవారిచ్చిరి - దుఃఖపడకు చెల్లెలమ్మా**

**మారుదేశం మనవారిచ్చిరి - మాటపడకు చెల్లెలమ్మా**

నెచ్చెలికి హితంచెబుతూ మరలిపోతున్నారు కన్నవారు, జతలవారు. వీళ్ళు పడుచులుకారు రేచులు. అన్నిజంతువులు చాటుమాటునుండి వేటాడుతాయి. రేచులు తాము వేటాడదలచుకున్న జంతువు బద్ధకంగా కనిపిస్తే దానికళ్ళలో ఉచ్చపోసి అది మంటతో పరిగెడుతుంటే తరిమితరిమి చెండాడుతాయట. వీళ్ళ ఎత్తిపొడుపులకు పరువు పోయి 'కోర్కెయెరిగించి నేనేల కొరతపడితి'నని మొహం చాటేసుకుంటున్నాడు పెండ్లికొడుకు. ❊

**<u>రేచుకుక్క</u>**





**<u>కొన్‌రాసిగాడు:</u>**

**కెన్‌డ్రగాడు = దుమ్ములగొండి**

## కన్నవారి ముంగిలి – కమ్ముకుంటున్న నీడలు :

ఇంటిముందు చింతలకింద మంచాలమీద ఎక్కడెక్కడి పెద్దలుకూడి ఇన్ని రోజులు తరతరాల ఇచ్చిపుచ్చుకోవడాలు, పొరపొచ్చాలు, పెండ్లిముచ్చట్లు, బొట్టుకు వచ్చినప్పటి, కాత తెచ్చినప్పటి, పాలవిందుకు కూడినప్పటి, చుట్టాలు, బంధువులు, పేరటమ్మలు, చెలికత్తెలు ఇందరితో కళకళలాడిన కన్నవారిముంగిలి

**వింత వింత దొరలుకూడి - చింతకింద విచారాలు**

**వింతదొరలు వీడిపోగా - చింతనీడలు చిమ్మునాయె**

కని, పెంచినవారి గుండెలు శూన్యంతో బరువెక్కుతున్నట్లే – ఇంటిముందు చింతల కింద నీడలు చిమ్మున కమ్ముకుంటుంటే ఆముంగిలి బోసిపోతున్నది.

మళ్ళుచుట్టాలు :

మళ్ళీ మూడురోజుల్లో 'మళ్ళుచుట్టాలు' (పెళ్ళికూతురు, పెండ్లికొడుకు, ఒక పేరంటాలు) వస్తారు. పెండ్లికొడుకు అత్తవారింట తొలిభోజనం చేస్తాడు. ❈

**<u>పొదువేట</u>**




**-- పల్లాల బొర్రంరెడ్డి, మారేడుమిల్లి**

## కన్నెమనసు :

గాలివచ్చె గాలివచ్చె - దబ్బపూవు గాలివచ్చె
దబ్బపూవు గాలిరాగా - దాగిపోదామన్న మనసు
తూరుపునుంచి గాలిరాగా - తూలిపోదామన్న మనసు
పాలపూల గాలిరాగా - పారిపోదామన్న మనసు
రెల్లపూల గాలిరాగా - రేగిపోదామన్న మనసు
తుమ్మి పూల గాలిరాగా - తూలిపోదామన్న మనసు
చూరు జల్లు జల్లుమనగా - కిన్నెరేనికోనగాద
గడపజల్లు జల్లుమనగా - గన్నేరేనికోనగాదయా

పూలను గిలిగింతలుపెట్టి సువాసనలను దోచుకునే ఎన్నోగాలులు. ఆ గాలులు సోకగానే జివ్వుమనిలాగే వయసు. ఒక్కొక్క పూవులో ఒకో సోయగం, ఒక్కో గాలిలో ఒకో పరవశం. రెల్ల పెద్దచెట్టు. వేసవిలో పూసే రేలపూలు, తంగేడు పూలవలె పసుపు పచ్చగా ఉంటాయి. గాలికి అల్లనల్లన కదిలే ఆ పూలు అడవితల్లి కొప్పులో తురిమిన పూలమాలలా ఉంటాయి. గంగాలమ్మ పండుగతీరేవరకు రెల్లపూలను తెంపరు. పండుగ తీరేవరకు చెట్టునవుండే పూలనుచూస్తే కలిగేస్ఫూర్తి కట్టుబాటునుపెంచాలి. కాని రేగిపోదామని రెచ్చగొట్టేగాలిలో గుబులు ఎటువంటిదో! దబ్బపూలు చిన్నవి, దూదికన్నా తేలిక – కాగితపు పడవలవలె ఎక్కడికక్కడే తట్టుకొని ఆగిపోతాయి. పాలతుప్పలు నడుమెత్తు మొక్కలు – దారిపొడుగునా తెల్లగ గుత్తులుగా పూస్తాయి. వాటిని తుంచినప్పుడు పాలుకారి వెగటువాసన. ఆగాలినుండి తప్పించుకొని పారిపోదా మనిపిస్తుంది. తుమ్మికపండ్లు చాలాతీయన. బంగారురంగులో ఫలించే ఆపూలగాలిలో తూలిపోవాలి. అన్నీ ఎగరేసుకుపోయే గాలులుకావు. కొన్ని పిల్లగాలులు, కొన్ని సుడి గాలులు, కొన్ని వడగాలులు.

కొత్తగానేసిన కోపిరిగడ్డిచూరు గాలికి కదులుతుంటే కిన్నెరలు మ్రోగినట్లుంది. అడవిలోని కిన్నెరలకోన ఆహ్వానిస్తున్నట్లనిపిస్తుంది. ముంజూరులోకి ఎవరోరాగానే మనస్సు పులిక్కిపడుతుంది. తనకేతెలియక తనలోసాగే వయసు ఆలాపనలో తేలి పోవడం తప్ప వచ్చినవాడు యేసరసుడుకాడు. వాడి హడావుడి గన్నెల మాత్రమూ కాదు (గన్నెలు – వాకిలి తుడిచే కంపలు).

స్నేహాన్ని, వలపును, ఆరాధనను గాఢంగాకోరుకునే ఈడు అది. చిలిపి చేష్టలతో కవ్వించుకునే కన్నెలలో, తమజోడు ఎన్నటికీ విడిపోకూడదనేకాంక్ష ఎంతోబలమైంది.

**గొందిదిక మంచంవేసి గువ్వపిట్ట పిలుపుతీద్దాం**

**గోరపిట్ట పిలుపుతీద్దాం**

**చెయ్యిమీద చెయ్యివేసో చేసుకున్న వాడికిలాగా**

**కాలుమీద కాలువేసో కలుసుకున్న వాడికిలాగా**

**ఒక్కరయిక పెడదమప్పా - ఒకతీరే ఉందామోయా**

గోర = మైనాపిట్ట. ఈ పిట్టవంటిరాగాలు అనడంలో ఒకమర్మముంది. చుట్టూ నేలను సాపుచేసి మధ్యలో ఒక 'పాదుకోడి'ని (పాదు = పంజరం; పెంపుడుకోడి) నిలిపి, చుట్టూ వలపన్ని దానికూతను 'పొదగదుర, పొదగదుర', 'సొకూకు' అని అనుకరిస్తూ వేటగాడు కవ్విస్తాడు. పాదుకోడికూడా కూతనందుకుంటుంది. ఆకూత విన్నపిట్టలు, జతకట్టడానికి వచ్చి వలలో చిక్కుకుంటాయి. గడుసుమీరిన గుబ్బట్లుకూడా ఒక గొందిలో కాపుకాసి ఆదారినపోయే గోవులమీద మాటలతూపులు విసురుతూఉంటారు. ఆవేళ ఆదారి ఎవరికి రాసిపెట్టివుందో, వీళ్ళు ఎవరికోసం వలపన్నారో.

గుడ్డలు గుంజి, అవి ఆరేవరకు కాలవలోస్నానంచేస్తూ చెప్పుకునే ఊసులు, కర్రలకో, దుంపలకో పోయినపుడు దొరికే పుట్టతేనెను పంచుకోవటానికి తరుము కోవటం, చేవడిలోదాచిన కల్లును దొంగచేసిపట్టించే అల్లరి, వెన్నెలరాత్రుల్లో పండుగ బసలో గోవులతోచేసేగొడవ, ఇన్నిటిలో పెనవేసుకున్న అనుభవాలవల్ల మరింతచేరువ కావాలని ఒకేతీరున అలంకరించుకోవాలని, ఒకే అనుభూతి తమలో ఒక్కొక్కరికి ఇచ్చే తీరుతీరుల తీయందనాలగూర్చి ముచ్చటించుకోవాలని... ఏవేవో అదుపులేని వెర్రి కోరికలు.

**చెంగున సెనగలు కట్టి చేరివచ్చిడి మామయ్య కొడుకు**

**కొంగున కొబ్బరికట్టి కోరివచ్చిడి మామయ్య కొడుకు**

ఈమె వాడికి ఏ బీడికట్టనో కట్టకుండా ఉండదు. ఇలా వరుసైనవారంతా తన మీద మనసుతో బహూకరించిన దువ్వెనలను కొప్పులోపెట్టుకొని ప్రదర్శించుకోవడం కోదుపడుచులకు సరదా.

**దాంపత్యం :**

**అందానికో మేనమామ బొందులిచ్చో నన్నెకొన్నడు**
**బులుపులకో మేనమామ బొమ్మలిచ్చో నన్నెకొన్నడు**
**మెప్పలకో మేనమామ మాడలిచ్చో నన్నెకొన్నడు**
**దరువులకు మేనమామ డాబాలిచ్చో నన్నెకొన్నడు**

మామకొడుకు మెచ్చుకోలుకుమురిసిపోతూ మెట్టినింట ప్రవేశించిన కన్యకు కొద్దిరోజులలోనే ఎన్నో అనుభవాలు; తానూ నానా అగచాట్లుపడి –

**కూరలమ్మి నారలమ్మి - కరకవన్నెచీరగొన్నమా**
**అత్తమామలెరుగకుండ - అంటివన్నెచీరగొన్నమా**
**తొటికోడలెరుగకుండ - తొగరువన్నె చీరగొన్నమా**
**గంతకోడలెరుగకుండ - గాగవన్నెచీరగొన్నమా(గాగ - సీతాకోకచిలుక)**
**ఇంటికోడలెరుగకుండా - ఈతవన్నెచీరగొన్నమా**
**చెల్లలు మరదలెరుగకుండ - సెనగపూవు రైకగొన్నమా**
**కట్టలేదు పెట్టలేదు - పెట్టెలోన వేసిన చీరెలు -**
**చీడెలెల్ల చెల్లకొరికివి (చీడె-బొద్దింక) ॥అచ్చుకోడ లయ్యోకోడ॥**

మగడే కొనితెస్తే, వాడిది ఇంకో వరస –

**కొండసంతమండువలోన - కొన్నాడయ్యా మొగ్గలచీర**
**కోండ్లబాలుడు కొన్నచీర - కట్టనివ్వడు పెట్టనివ్వడు**
**కట్టలేదు పెట్టలేదు -పెట్టెలోన పాడవేసిడా**
**ఎలుకలెలుకలు కూడుకొని - చెంగులన్నీ చెల్లకొరికివా**
**చీర చెల్ల చింకులాయె - చింతపండు బెల్లలాయిదా**

చీర కొట్లోకొనవలసినదిగాని అడవిలో కొట్టుకువచ్చేది కాదుగదా. కొనలేక కట్టనివ్వడు పిసినారిమగడు. దుంపలను – గింజలను సంవత్సరాలతరబడి దాచుకోగలరుకాని ఈచీరెలను ఎలా దాచుకోవాలో తెలియనితనం.

ఇంటినిండా – ఆడపడుచులు – మరుదులు; ఏకాస్త తినుబండారం తెచ్చినా –

**అమ్మలమ్మలేమిగోల అరటిపండు పిట్టిగోలోయీ**

**పిల్లలు పిల్లలు కూడుకొనో - పిల్లి మాంసం పులుసుగోలోయా**

**బుడ్డిబుడ్డి కూడుకొని - బుర్ర చేపల పులుసుగోలోయా**

ఇలా మొహంవాచిన వాళ్ళ మధ్య ఏ మనసూ తీరదు.

**నెలలు మరిచో నేనుండగ - నేదునూరు పోవోయ్ ఘూట**

**నేదు మాంసం తేవోయ్ ఘూట** ॥అచ్చుకోడ లయ్యోకోడ॥

తెచ్చి ఏం లాభం?

ఒకప్పుడు అడుగుల చప్పుడు వినపడితే చాలు

**గంటెకర్ర గలగల మనగ - గయ్యాళిదో మామకూతురు**

**సిప్పకర్ర సిటసిట మనగ - చిన్నెలదో మామకూతురు**

**చోడికర్ర జొటజొట మనగ - సోకులదో మామకూతురా**

గంటె అంటే సజ్జ. దున్నిన నేలల్లో బోనుసీమలో ఏపుగా పెరుగుతుంది. ఆ చేనుకు అడ్డంపడి గలగలా తోసుకువచ్చే గయ్యాళిది మామకూతురు. చిప్ప చిరు ధాన్యం. మోకాటి ఎత్తుకూడా పెరగదు. ఆ చేలో చిటుకుమనకుండా సుతారంగా నడిచివచ్చే వయ్యారి మామకూతురు. చోడి-రాగి, ఆ చోడిచేలోంచివచ్చే మెలుగుబోణి అని పెళ్ళికిముందు లొట్టలేసిన మగడితో ఏకాంతమే దొరకడంలేదు యీకొంపలో.

## గుర్తుకు వస్తున్న పుట్టిల్లు :

**రెడ్డిల్లో మెల్లటి గదులు - మెల్లాదిరిగిన చెంబేలేదోయా** (మెల్ల=వంపు)

**మూడు స్థంబాల మావారిల్లు - ముడ్డితిప్ప వశముకాదు**

**దీపెకంబాల మావారిల్లు - దీపెలులేక మసలలేను**

**జోడుగంబాల మావారిల్లు - జోటలులేక మెసలలేను**

**ఒంటికంబం మావారిల్లు - ఒక్కదానిని మెసలలేను**

**అర్దరిన మావారిల్లు - అడ్డుదూలాల బోరుతలుపు**

**ఇద్దరిన మావారిల్లు - ఇనుపసీలల బోరుతలుపు**

**పుట్టింటయున్నపుడు - పప్పకూడు భోజనాలు**

**అత్తమామలింటికిపోగ - చల్లలేని పుల్లనంబలి**

**పుట్టింటయున్నప్పుడు - పట్టుచీర కట్టేదానను**

**అత్తమామలింటికిపోగా - ఉల్లిపొర బల్లిబందరం**

ఏది నచ్చకపోయినా పుట్టిల్లుగుర్తుకువస్తుంది. పుట్టిల్లు జోడుకంబాలదైనా గొప్పే, ఒంటి కంబందైనా గొప్పే. చల్లనంబలి – పుల్లనంబలి రెండురకాలు. చోడిపిండి ఒకరోజు పిండిపిడతలో పులియబెట్టి అంబలికాచుకొని – దీనిలో పుల్లనిమజ్జిగ కలుపుకుంటే జారుపులుపు; చల్లనంబలి. మిగిలిపోయినది మరునాటిది పైనాటిది అలా కలుపుతూ పోతే పుల్లనంబలి. కట్టకల్లు ఇటువంటిదే. పులిసినరుచిమీది ఇష్టంవల్ల, దాహం కడుతుందని కొండవారు ఈ పుల్లనంబలిని ఎక్కువగా త్రాగుతారు. పాడిచేసేవారు కొండరెడ్లలో ఇంచుమించు సున్న. పెరుగుభోజనాలు దిగువ విలువలు.

## వేరు కాపురం :

తిండి, బట్ట, సంసార సుఖం అనుకున్నంత పొందలేకపోయిన పెళ్ళాం వేరింటి కాపురానికై పోరు పెడుతుంది.

**కొండ కొండ వెదురునరికి - గండిమీద ఇల్లుకట్టి**

**ఇత్తువద్దు పొత్తువద్దు - ఇద్దరమే కూడితిందాం**

గండి అంటే కొండదారి. అక్కడ ఇల్లుకట్టాలనడం నలుగురికీ పెట్టాలనికాదు. తనెంత సుఖపడుతున్నదీ చాటుకోవడానికే. గండిమీద మకాం, 'కోమటిదుకాణం వంటి కొత్తచేను', 'కొత్తన్నం – గువ్వకూర', కొండలో జీలుగుకల్లు, సంతలో కొనుక్కునే కొత్తచీరలు తలచుకొని వేరింటికాపురం పెట్టిస్తే – పెద్దలఅదుపు భయంవదలిన మగడు నెమ్మదిగా సోమరి అయిపోతాడు. అప్పుడు అదోగోల.

**పనికొల్లవు పాటుకొల్లవు - పగలు పొద్దున తిందేనందువు**

**వేటకొల్లవు వెట్టికొల్లవు - వేగిన పొద్దున తిందేనందువు**

**కూలికొల్లవు నాలికొల్లవు - కుగుడుండి తిందేనందువు**

ఇంతమాత్రమేనా... కల్లు రోజుల్లో పత్తా ఉండడు

## పాలెపు వేట – చేవడిబస – పొట్లంవంటకం :

**పోటిపిట్టకు పొట్లంవేసో - పొట్లవాడ కల్లుకుపోదాం**

**సీకిపిట్టకి పొట్లంవేసో - సీకలూరు కల్లుకుపోదాం**

**గుమ్ముగనకాగిన కమ్మనికల్లు - కురిడేపిల్లి నంజుకాలోయా**

ఇలా వాడి స్నేహాలు వాడివి. జట్టువారంతా పాలెపువేటలో (పొరుగూరు వేట) పిట్ట మాంసమో పిల్లిమాంసమో సంపాదించి, వేళతప్పకుండా చల్ది కల్లు, ఎడగీత కల్లు (మధ్యాహ్నం), పులివేళ కల్లు (సాయంత్రం 4 గం.లు), సందె కల్లు – ఇలా కల్లు సమయానికి చేవడిబసకు చేరతారు.

ఉల్లిపాయలు బుంగలు కోసి, మిరపలు గిల్లి, ఉప్పుగళ్ళు నురిమి అడ్డాకున పొట్లం వేసినమాంసంతో కల్లుదొంగతనానికిపోతారు. ఈ పొట్లంవేయడం బట్టి అనేక రకాలు.

సికపొట్లం =పట్టుకొని తిరగవేయడానికివీలుగా కొనవచ్చేటట్లుకట్టి నిప్పులు కప్పడం (పిట్టలు – మొదలగునవి)

మదురుపొట్లం = కణుసులాంటి జంతువులమాంసం దొరికితే, ములస వెదురు బొంగులోకూరి నిప్పులోవేయడం

గోనెపొట్లం = అన్నానికి.

ఇన్నినంజకాలకు తగినట్లు ఎన్నోరకాల కల్లులు.

గూనబొబ్బిలి = కట్టకల్లు, పులిసినకల్లు. అది గూనలోదాగిన పులి; తాగిన మనిషి పులి అయిపోయి చిందులు తొక్కుతాడు.

వెటగొటరం = నానారకాలు

పిట్టసోరి – తియ్యనికల్లు, పిట్టలుకూడా ఇష్టపడేకల్లు.

ఔరజ్ఞానం = భంగువలె నిషా, వగరు, చురుకుకలిగిస్తుంది.

ఏదో నంజకం కూర్చుకుని చేవడిబస చేరి, కల్లుదించీ దించకముందే ప్రాణాలు పోతున్నాయని కొట్టుకుంటున్నాడు.

**చెట్టుకల్లు చెట్టునుండగ - సెమసెమ పాణాలయె**

**ఒగ్గు కల్లు వగ్గునుండగ - ఒరుగు ఒరుగు పాణాలాయె**

**మట్టకల్లు మట్టనుండగ - మత్తు మత్తు పాణాలాయె**

**దిప్పకల్లు దిప్పనుండగ - దిమ దిమ పాణాలాయె**

---

*పిట్టసోరి, వెటగొటరం, గూనబొబ్బిలి, ఔరజ్ఞానం*

**చెట్టుగీసో చిన్నయతమ్మ - చేవడిన బుక్కెడియ్యవా**

కాస్త ఆలస్యమైతేచాలు ఎక్కడిదక్కడ సర్దేసి వట్టిడిప్పలు చూపిస్తారు – 'కల్లు పిక్కి మనుషులు'.

**దిప్పతోనో దిప్పెడుకల్లు - దిగగొందిన దాచిడుకున్నడు**

**చట్టితోనో చట్టెడుకల్లు - చాపచాటున దాచిడుకున్నడు**

**ముంతతోడి ముంతెడుకల్లు - మూలగొందిన దాచిడుకున్నడు**

ఒకోసారి వేళకే చేరినా వెళ్ళగొట్టడానికి ఏదో నాటకం.

**కల్లయితే కాగిదిగాని - కంటిదోకి కనపడదు**

అన్నీఅమరినాయికాని, మిడకలో (పెదాలకాన్చుకొనితాగేందుకు మడచిన ఒంటిఆకు దొన్నె) వంపేందుకు కంటిదోకి/ కన్నెదోకి (చిన్నదోకి) కనిపించడం లేదు అని వచ్చినవాడిని జాగుచేసి వదిలించుకోచూస్తారు. ఇన్నింటినిదాటి చెట్టుబసలో గౌరవం పొందినవాడు మొనగాడే.

కల్లుపంచేవాని గాంభీర్యం, నాలుక తడుపుకుంటూ వానిచుట్టూ ప్రదక్షిణం చేసేవాళ్ళ లేకితనం, వాళ్లు కలుపుకునే వరుసలు, నాకుతున్నట్లుచూసే ఆ చూపులు; ఇవన్నీ చూడగా అలనాడు అమృతం దొరకనివారంతా ఇక్కడకు చేరారా అనిపిస్తుంది.

**గుమ్మునకాగిన కమ్మనికల్లు - కురిడెపిల్లి నంజుకాలు**

ఏ పిట్టలరెట్టలేకాదు పిల్లులు కల్లుడిప్పలోపడవచ్చు. అందువల్ల కల్లుకాచాలి. కాచినందువల్ల ఏదోషమున్నాపోతుంది. రోగాలున్నవాళ్ళకు మందుచెక్కలు, ఎక్కువ మందికి పంచాలంటేచాలదు కాబట్టి గేస, రెల్లచెక్కలవంటివి నిషాకోసంవేసి కాస్తారు.

ఒకోవరుస అందుతున్నకొద్దీ పానగోష్ఠి మంచిరంజులో పడుతుంది. అది మరోప్రపంచం. అక్కడ వరుసలే వేరు. కబుర్లే వేరు. మనుషుల పేర్లే వేరు.

గోడిముక్కు రామన్న = గొడ్డలి పట్టుకొని వచ్చేరామన్న

సురకత్తుల వీరన్న = వాడుండేది మూరెడు. అందరినీ కొడతాడు.

గుమ్ముడుకొండవేనం = వేనంవంటి బట్టతలవాడు.

చిర్రడు = చిర్రచూపువాడు.

కెల్లిడు = మెల్లకన్నువాడు

వేలుజొండ = జారే పెదవులవాడు.

మతుకుడు = గతుకుతూ నడచేవాడూ

కల్లుడోకుల మునసబు

పెద్ద అద్దాలవాడు = కళ్ళజోడు పెట్టుకున్న అతిథి

గిరిజనులు మంచి కార్టూన్ చిత్రకారులు.

'డేగవిసురు పదును'కు చేరేసరికి స్వారస్యం మిన్నుముట్టి లోకాభిరామాయణం రక్తికడుతున్నది.

**కల్లుగీసో చిన్నయతమ్మ - వేనపుడేగలెత్తుకుపోయివా**

కల్లుగీసే గీతరి–మన చినబావమరిది కనిపించడేం. వాడిని డేగలాంటి మగనాలు ఎవతైనా ఎగరేసుకుపోయిందా? (చిన్న జంతువులను గురిచూసి తన్నుకు పోయే డేగలు, వేనం మీదనుండి గమనిస్తూంటాయి. డేగవిసురువంటి చురుకు కలిగించేకైపు, 'డేగవిసురు పదును') మరోఅల్లుడు తన ముసలిఅత్తనుకూడా లేపుకుపోయినారని మరీ చమత్కారంగా చెపుతున్నాడు.

**మయ్యృత్తాకి గుల్లెడు మోసో - గొగ్గిరాళ్ళన దాచిడుకున్నడు**

**కండ్లుపోయిన కుండ్లతమ్మ - బద్దికోడికి బౌవురడు మోసి**

**ఎండిన డుమ్ములు గండికి మోసి - బండలపులులు బాగా తిన్నవా**

(గుల్లెడు = ఆ ఇంటిపేరువాడు. కుండ్లతమ్మ = పిల్లలకోడి, పిల్లలతల్లి. బౌరెలు= నక్కలు. బండలపులి = కోతులను ఇష్టంగా తినే చిన్న పులి).

గుల్లెడు వెనుక తానువస్తూ, గొగ్గిరాళ్ళలో నిలిచిఉండమని గుర్తుచెపితే, ఈలోగా ఆ ముసలిదాన్ని నక్కలు మాయచేసి తీసుకుపోయాయి. వాటిని బెదిరించి ఆ ఎముకలగూడును బండలపులులు గండిమీద పెట్టుకొని బాగాతిన్నవి.

ఇలా కబుర్లు 'చెక్కలకట్ట' దాకా సాగుతూంటే (కల్లుకాగేటప్పుడు వేసిన చెక్కల అడుగు తగిలేవరకు ఖాళీచేసి) ముసముసలై అక్కడే మూలపడతారు. వాళ్ళకు మెలకువ, మళ్ళీ కల్లువేళకే.

తమకథలకు తామేమురిసిపోయే ఈ త్రాగుబోతులకు తామే కథానాయకులం అవుతామని తోచదు.  ఇట్లా చెట్లవెంబడి ఇల్లుపట్టకతిరుగుతుంటే, వైనమెరిగి ఇల్లాలును చేరవచ్చే వేటగాళ్ళు చాలామంది ఉంటారు. ❈

## సారుడుత వేట




... తోకల గురవయ్య, అప్పాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా

## వ్రైపాప - నల్లమయ్య :

**పుట్టలోనో బుడమరి చెట్టు - భూమికికోన సాగేయా**
**ఆకసానికి కొనసాగు - అద్దురంతన కాయకాసోయా**
**కాయతింటె ఏమి ఫలము - పండుతింటె పాలముంతుదా**
**ఎండునేల పండునేల - పక్షులకోకాని పండ్లోయా ॥అచ్చుకోడ॥**

గండిమీద వేరింటి కాపురంపెట్టించింది ఇల్లాలు. ఆమెభర్త వ్యసనపరుడు. ఆ భూమిసుజల. ఆ చెట్టుసుఫల. కాని పండేనేల ఎండునేలగానే ఉంటున్నది. ఓపికతో చనువు పెంచుకోగలవాడు ఆమె జీవితంలో ప్రవేశిస్తాడు.

**దుంపకొమ్ములు విరుచుకుంటూ - దుమికి వచ్చిడి నల్లమయ్య**
**గడకొమ్ములు విరుచుకుంటూ - గతులు వేసిడి నల్లమయ్య**
**ఈలికొమ్ములు విరుచుకుంటూ - ఈదివచ్చిడి నల్లమయ్య**

చిటికెలు వేసుకుంటూ చేరవచ్చి -

**చారకణుదురు వర్రెపాప - చలిదికి బుక్కెడు బుర్రెడియ్యవా**
**పులికణుదురు వర్రెపాప - పూటకు బుక్కెడు బుర్రెడియ్యవా**
**ఆకుకణుదురు వర్రెపాప - అయినవేళ భోజనాలూయా**

తేనెటీగలేకాక కణుదురులు (కణుదురీగలు=కందిరీగలు) కూడ కుడతాయి. పట్టుపెడతాయి. కాని పట్టులో తేనెఉండదు (వట్టి తట్టలు). చారకణుదురు (చారల ఈగలు) జిబ్బికణుదురు (పట్టవంటిదానికి పెట్టినతట్టలు) గుంటకణుదురు (తొర్రలో) పులికణుదురు (పులి: కండచీమ) ఆకుకణుదురు ఇలా చాలారకాలు.

దగ్గరకు ఎవ్వరినీ చేరనివ్వని ఓ గద్దరి వదినా! (వర్రె: వట్టితట్టలు) చలిదికి కల్లుపోస్తావా, అన్నం పెడతావా (కణుదురులన్నీ చలిపట్టగనే చచ్చిపోతాయి) ఈబింకం చలికాలం వచ్చేవరకేలే!

**కిక్కిడి గిడి గిడి సంతలదారో - నత్తగుల్ల వర్రెపాపయా**

సంతలదారిలో పలకరిస్తే నత్తగుల్లవలె లోపలకు ముడుచుకొంటుంది. నత్త గుల్లవలె నీది డొల్లుగాంభీర్యమే.

## ఉగుతాప – కట్టుతాప :

**ఉట్టిచెట్టుకు ఊగుతాప - కన్నెచెట్టుకు కట్టుతాపయా**

కల్లు ధారాళంగా కారేటప్పుడు, ఎక్కుటప్పుడు వెదురుతాపవేసుకొనిఎక్కి, దిగినవెంటనే దూరంగా పొదలలో కల్లుదొంగలకు తెలియకుండా తాపను దాచిపెడతారు. ఎప్పటికప్పుడు అమర్చుకొనే ఆతాప ఎక్కువసార్లు ఎక్కుతున్నందున ఊగుతుంటుంది. అది 'ఊగుతాప'. కల్లు కొద్దిగావచ్చేది కన్నెచెట్టు. రోజుకు ఒకటి రెండుసార్లు కల్లుదించుతారు. కొద్దిగా మాత్రమే కల్లు దిగేదానికి ఎవరు దొంగచేస్తారులే అని ఆ తాపను చెట్టుకి కట్టి ఉంచుతారు. ఆతాప 'కట్టుతాప'.

కన్నెవెంటతిరిగినా ఫరవాలేదు. కట్టుకుంటాడేమోననుకుంటారు లేదా వరుసల వారులే అనుకుంటారు. ఇల్లాలివెంటతిరిగితే ఎన్నోనిందలు. కాబట్టి అదనుదొరికి నప్పుడు తాపవేసిఎక్కి మళ్ళీ ఏమిఎరుగనట్లుండాలి. కన్నెపొందు కట్టుతాప వంటిది.

## పురుషుడులేని ఇల్లు – పులిఉన్నకోనం :

'ఇల్లాలులేని ఇల్లు – ఇండిగెలవనం – పురుషుడులేని ఇల్లు పులిఉన్నకోనం' పులి వున్న కోనంలోకిపోయినవాడు – మగవాడులేనిఇంట కాలక్షేపంచేసేవాడు మచ్చపడ కుండ తిరిగిరాడు.

**సీలేటూ సిమిలికూర - వానలేక వాడిపోయిదా**

**మయ్యే ఊరో కన్నెఘాటు - ఆలిలేక ఆరుకున్నాడా**

పెళ్ళానికి మొహంవాచి ఆఘాటు ఈ ముదురుదాని వెంటపడుతున్నాడా? జిహ్వాకోరుచి!

**ఎద్దు తొక్కిన మద్దినిప్ప - ఎంతో దీవెలై కాలె**

ఎద్దు తొక్కిన పేడలో మద్దినిప్పుపడి ఎంతో తేజరిల్లి కాలుతున్నదట.

పొద్దున్నే వచ్చి కబురులు ప్రారంభిస్తాడు –

**పొయ్యి పోసో వదినపాప - పొత్తడిరెమ్మలు దాపినట్లోయా**

**పీనె పోసో వదినపాప - పిప్పడిరెమ్మలు దాపినట్లోయా**

అంటూ ఆమె ప్రతి కదలికను, పనిని మెచ్చుకుంటారు.

**పొద్దునింత పొగాకు లేదు - పోవో గుంటడ మీవారింటికి**

మర్యాదకు ఇద్దామన్నా పొగాకుకాడలేదు. పొమ్మంటేపోక చల్లకోసం వచ్చాను అంటాడు.

**చిర్రికొమ్ముల కర్రియావు - ఇంత ముంతన ముంతెడు పాలోయా**
**గుమ్ముగుమ్మున చల్లచేయ - గుమ్మానెవ్వడి బాలుడవు**
**సల్లు సల్లున చల్లచేయ - సాలనెవ్వరి బాలుడవోయా**

కొండరెడ్లు చల్లచేయరు. అసలు కథ తెలుస్తూనే ఉంది.

నోటితో పొమ్మంటున్నా, గుండెలో కుతూహలం ఉబుకుతూనేఉంది. ఏవోకబుర్లు సాగుతాయి. వాడి చుట్టపక్కాలు ఎప్పుడో చెల్లిపోయారట. వాడు ఒక్కడేనట.

**నింగితొట్టరి మాలగుంటడ - మీవారేమై చచ్చిరి గుంటడ**
**సర్వచోళ పిట్టితిని చట్టలారో - చచ్చిరగుంటడ**
**బూడెచోళ పిట్టితినో బుగ్గలారో - చచ్చిరగుంటడ**
**అరవచోళ పిట్టితినో అంకుడారో - చచ్చిరగుంటడ**

(లింగితోట = ఆస్థలం. సర్వచోడి = లావుచోడి, బూడెచోడి = సన్నగింజ, వాతం. అరవచోడి = తోరపుకంకి)

పొగాకు వాడే తెస్తాడు. ఆమె చుట్టియిస్తుంది.

## పొత్తడికర్ర పొగకు చేటు :

**పొత్తడాకు పొగచుట్ట - ఇంద పొత్తడ పొగాకుచుట్ట**
**ఎంగిలందెపు సంగిలందెవు - అందుకొమ్మో నరుసులమ్మ**
**అందుకొనో ఆరగించు - ఎండపల్లి పోకచుట్ట, చుట్టెడాకు పోక చుట్ట**

'పొత్తడికర్ర పొగకుచేటు' ఆకర్ర పొగవలె ఊదరపెట్టేవాడు పొత్తడు.

మారేడుమిల్లిమన్యంలోపాడే ఈ అచ్చుకోడలు సీసపద్యంవలె సుదీర్ఘమైనది. తాడేపల్లి, గెడ్డవాడలలో 'ఆడవాలె పాడవాలె' ఇదే బాణిలోనడచినా ఒక్కసేకుతో ముగుస్తుంది. పదం పొట్టిదైనా అక్కడవారి సరసం ముందడుగులోనే ఉంది.

**సన్నపాటి చుట్టలను - సగముతాగి చేతికిచ్చె**

**ఆడవాలె పాడవాలె - వేడుకలు సేయవాలె**

**సగము తాగి చేతికిచ్చె - ఎంగిలని ఎగ్గుపడె**

**మందువద్దు మాకువద్దు - మనసుపుడితె నేనెవద్దు**

**చెక్కవద్దు చేమవద్దు - చెప్పకుండ నేనెవద్దు**

ఒకరి ఆశలు ఒకరికి స్పష్టమైనాయి. అప్పుడపుడు మాంసం బహుమానం తెస్తుంటాడు.

**పాతపాత గవ్వలదుడ్డు - పందిగుండెలు తిందేనన్నది**

**మేలైన గవ్వలదుడ్డు - మేకగుండెలు తిందేనన్నది**

**కొత్తకొత్త గవ్వలదుడ్డు - కోడిగుండెలు తిందేనన్నది**

ఆడవారిమాటలకు అర్థాలే వేరుగదా. గుండెకాయ మాంసం – మేలైన గవ్వలు అంటూనే తినలేననడం అదో వగలుపోవడం.

ఆమె అప్పుడపుడు భోజనం పెడుతుంది –

**సామకూడు వండుదమనగ - సన్నమున్న దొల్లనంతివి**

**చిప్పకూడు వండుదమనగ - చిన్నదున్నదొల్లనంతివి**

**గంటెకూడు వండుదమనగ - గట్టిదున్నది ఒల్లనంతివి**

**గంటెకూడు గర్రెమాంసం - గట్టిదని ఒల్లనంతివి**

**చిప్పకూడు చిరుగటి పప్పు - చిన్నదని ఒల్లనంతివి**

**జొన్నకూడు ఉలవపప్పు - జోడదని ఒల్లనంతివి**

**వడ్లకూడు ఉలవపప్పు - వట్టిదని ఒల్లనంతివి**

ఇలా విందులు రుచులు ఎంగిళ్ళు సరసాలు ముదిరి –

**ఈతచెట్టుకిందకిరావో – ఈరిపేను నొక్కుదునోయా :**

**మానుకింద మారేడుగంధం - మళ్ళీరావో సాదుకుందాం**

**దిక్కుమొక్కులేని వాడవు - దిగిరావో సాదుకుందాం**

**ఈతకల్లు తాగెవో లేవో - నియ్యిమొహము ఈరెలాయె**

**తాటికల్లు తాగెవొలేవో - నియ్యిమొహము తాటెలాయె**

తెల్లకల్లు తాగెవో లేదో - నియ్యమొహము తెల్లవారిదా

సారా కల్లు తాగెవో లేదో - నియ్యమొహము చారాలాయివా

సంకేతస్థానాలవరకు వచ్చింది.

**వాలుగొమ్మున చిలుకలు వచ్చె - వాలకుండ తేలగొట్టు :**

గండియావల గంటిచేను - కాపుకువెళ్ళు కన్నెగుంటడ

వాలుగొమ్మున చిలుకలు వచ్చె - వాలకుండ తేలగొట్టు

కాయగోరి కన్నెఘూట - ఊరినుండ యొడిసెరాళ్ళు (వడినిండ)

దెబ్బతీసెఒడిసెరాళ్ళు చాలవున్నాయి. జాగ్రత్తగా చిలుకను తేలగొట్టిఎగరేసుకుపో. మొత్తానికి హెచ్చరిక సమయం కలిసివచ్చాయి.

బురదగుంట నీళ్ళు తాగి - బూరుగుల మెట్టలెక్కి

దారితీస్తున్నది మగనాలు. పెదాలునాక్కుంటూ లొట్టలేసుకుంటూ వెంట పడుతున్నాడు ఘాటు.

గుంటనున్న గుగ్గిపిల్ల - గుక్కులు మింగుకుంటూ

మెరితెనున్న మిందెపిల్ల - మీసాల గర్లు దువ్వుకుంటూ

నయ్యదిక చూసుకుంటు - నాలికలు కొరుకు కుంటూ

తెక్కుతరావో తేలుతరావో - గుంకుత రావో గుర్రుతరావో

గుంటనీళ్ళు తాగుతరావో - తేటనీళ్ళు తాగుతరావో

వంగుతరావో వాలుతరావో ॥అచ్చుకోడలయ్యో కోడలా॥

(గుగ్గి = కాలువలో నాచుతినేపిట్ట. నిగనిగలాడుతుంది. మిందె = తొండజాతికి చెందినది) ఇలా వీరు లేచిపోతే వారి పిల్లల గతి -

**ఆవులెల్ల అద్దరి మేసె - దూడలెల్ల దుచ్చరి మేసె :**

ఆకాశానపోయే పక్షి - పిల్లలెందు పెట్టుకొన్నవు

ఆకాశాన రతలు వేసి - అద్దురంత గుడ్లుపెట్టి (రతలు=గూడు)

ముచ్చటకొ మూడేపిల్లలు - తల్లిచచ్చో ఆరునెలలు

తలచి రెండు కొమ్ముపట్టె - తల్లిదండ్రి ధరణిపాలు

పిల్లబిడ్డ భీముడిపాలు - ॥అచ్చుకోడ లయ్యోకోడ॥

*తల్లి ఫెడేలుమంటే - పిల్లలు పిసవసలు*

**ఆవులెల్ల అద్దరి మేసె - దూడలెల్ల దుచ్చరి మేసె**
**గిత్తలెల్ల బెత్తరిల్లె - పెయ్యలెల్ల పెండెవట్టె**
**తల్లి ఫెడేలుమంటే - పిల్లలు పిసవసలు**

అడ్డకాయ పగిలినపుడు – అడ్డగింజలు చెదిరిపోతాయి. చిట్లిన సంసారమూ అంతే. కొందరు పసిగుడ్లు. కొందరు పిట్టవేళ్ళ పాయపుగోవులు. ఈడువచ్చిన పెయ్యలు అద్దరికిపోయి మేస్తున్నవి. దూడలు కొనలు కొరుకుతున్నవి. తల్లిదండ్రిదూరమైన ఈ సంతానాన్ని దైవమే (భీముడు) రక్షించాలి.

## పేమగల్ల పెద్దలైతే – పెండెకట్ల తాపతేరో :

**కాలెదీవెలు కాలివిగాని - కన్నకర్మ లెవ్వరివి**
**కన్నకర్మలు కన్నవారివి - కొంత కర్మలెవ్వరివి**
**కొంత కర్మలు కొన్నవారివి - మేలు కర్మలు మేనవారివి.**

**దయగల్ల తమ్ములైతే - దండెకట్ల తాపతేరో**
**పేమగల్ల పెద్దలైతే - పెండెకట్ల తాపతేరో**

ఈ పిల్లలు ఎక్కివచ్చేవరకు అయినవారే ఆదుకోవాలి.

కాని ఇటువంటి కూతురిని ఆశ్రయించుకొని ఆమె తల్లిదండ్రులుంటే వాళ్ళ పరిస్థితి దయనీయంగామారుతుంది. ఆ మగనాలికికూడా పిల్లలను వదులుకోవడం కంటే తల్లిదండ్రులను ఏమి చేయాలెననే దిగులు అధికంగా బాధిస్తుంది. ఈ చిక్కులలో నలిగిపోవడంకంటే –

**దూరపుచుట్టాలు మేలు - దూలదామపప్ప మేలు**
**కొడుకు కోడలు మేలు - కొనగందిపప్ప మేలు**

దూలదామలను ఆరేడుసార్లు వారిస్తేగాని దురదపోదు. అయినా అది తిని కడుపు నింపుకోవడం మేలు. కోడలేమైనా కొడుకుకు ఒక నెలవంటూ ఉంటుంది. వాడిపంచన పెద్దకందులు కాకపోయినా పరిగకందులు అంటే మొలచిన కొనకందులు పోగు చేసుకొని తిన్నా బాధలేదు. వీధినపడకుండా బ్రతకవచ్చు. మేన ఇల్లు అయితే కొంత నయం; కాని ఇల్లరికం ఉండగా పెళ్ళాం మగనాలుపోతే అతడి పరిస్థితి ఆయింట దుర్భరం. అనుకూల దాంపత్యమైతే ఏ వ్యవస్థలోనూ యీ కడగండ్లుండవు కదా. J

## సుక్కనుదురు సూరెపుడేగ - మద్దివీటిమయలపుంజు :

నగరికి వెళ్ళుదమన్న - జాజివలస నగరిలోన
పుట్టిదయ్యా పూవులపోడు - కూతలేదు మేతలేదోయా
కులముతోడి కూడిలేదు - అమ్మలతోడి ఆటకులేదు
గోవులతోడి గొట్టికిలేదు - గుబ్బట్లతోడి గుమ్మళ్ళులేదోయా
కోత కోత పండుగ రాగయా ॥అచ్చుకోడ లయ్యోకోడ॥

తాడులేరి పట్టబోగ - తలపాగలెగురదన్నే
పేమగల్ల పెద్దనగార పేరు - చెప్పిపట్టుకుందారా
సుక్కనుదురు సూరెపుడేగ - వెండికుచ్చుల వేనపుడేగ
వేద్దామన్న తేలిరాదోయా

బాల్యవివాహాలకు, బలవంతపువివాహాలకు తలవంచనివారు కొందరు. మారు తల్లి అన్నవదినల పెంపకంలో ఇమడలేనివారు కొందరు. తమమీద బాగా ఓలి చేసుకోవాలని చూసే కన్నవారిమీద కసిపెంచుకున్నవారు కొందరు. పూవుల పోడిమిగల దేగవంటిపడుచు, జాజివలసనగరిలో కన్నవారితో కులంవారితో కలహించి కూత మేత మానివేసింది. 'కొత్త'ల రోజునకూడా ఆటపాటలొల్లకున్నది. వైనంతెలిసి లాగ బోయినారుకొందరు. దానిమనసులో ఎవరున్నారో ఈ పన్నాగాలను తన్నివేసి పారి పోయింది. మళ్ళీ ప్రయత్నిద్దామన్నా తేలిరావడంలేదు. పెద్దన్నలను, మొద్దన్నలను, ఈ దేగను ఎలాలొంగదీసుకోవాలా అని సంప్రదిస్తున్నారు. ఆమె కన్నవారితో సర్దుకుపోలే కున్నది. ఎటుపోవాలి, ఎవరినినమ్మాలో తోచకున్నది.

దూలనున్న దుగ్గలనాగు - దుఃఖతోవలు చెప్పగాద
పేడనున్న పేడపురుగు - పేమతోవలు చెప్పగాద

రకరకాల ఆరాలు తీస్తున్నది.

ఇంతలో ఎవరో తగిలారు. రమ్మని కబురుపెట్టి, తిండిమాటకూడా మరచి ఎదురు చూస్తున్నాడు.

మద్దివీటి మయిలపుంజు - కూతవేసి మేతమరచిదా (మయిల: మావెలి)
డెబ్బైయారుతానాలకు - మద్దివీడు మావిలి దుర్గమా

రంపరాజులు, మారేడుమిల్లిమండలం తాడేపల్లిప్రక్కన మద్దివీటిలంకలో కొంత కాలం ఉన్నట్లునానుడి. రంపరాజుల ఇంటి పేరుకూడా మద్దేటి. దీన్ని సంస్కృతంలోకి మారిస్తే మధువీటివారు అయింది. మావెలి–ఇక్కడకు వారితోచేరిన ఉగ్రదేవత.

మద్దివీటి మావెలివంటిపుంజు. ప్రేమలోపడి అన్నంనీళ్లు మరచిపోయింది.

**దుడ్డువద్దు దూపంవద్దు - దూరపు దండలందుకుందారా**
**చెంబువద్దు చెల్లంవద్దు - చేతిదండలందుకుందారా**

వీళ్ళు పెళ్ళిచేయనక్కరలేదు. వీళ్ళదండనకు మనంలొంగక్కరలేదు. పోదాంరమ్మని ఆహ్వానించాడు.

వారిదారిని ఎవరుఅడ్డగించినా ప్రాణమొడ్డి దాంపత్యరథాన్ని తోలుకుంటారు.

**చిటికెనవేస గోరుకోసి - సీలవేసో బండితోలు**
**బొటికెనవేస గోరుకోసి - బొండవేసి బండితోలు** (వేస: వేలు)

ఆమె ఎడబాటును క్షణంకూడా ఓర్వలేని మగడు పొలంపనులు ఒకటొకటే అడుగుతూ నేర్పుతున్నాడు.

**వాలారుమొగ్గ :**

**చేను చెలుపో వాలారుమొగ్గ - ఎప్పడు సెలపంగ సూడలేదా**
**మంచిదోయ్ కోడలమ్మ - మంచిదోయ్ ॥కోడలమ్మ॥**
**కయ్యులు నరుకో - వాలారుమొగ్గ - ఎప్పడునరుకంగ చూడలేదా**
**మంచిదోయి కోడలమ్మ - మంచిదోయ్ ॥కోడలమ్మ॥**
**పెంకవంటజల్లో - వాలారుమొగ్గ - ఎప్పడు జల్లంగ చూడలేదా**
**మంచిదోయ్ కోడలమ్మ - మంచిదోయ్ ॥కోడలమ్మ॥**
**రొడ్డకొట్టో వాలారుమొగ్గ ...**

**ముక్కమునిగిన – డబ్బిపిట్ట :**

అంతప్రేమగల మగనివద్దకు పోయేతొందరలో ఆపడుచు, అన్నం ముక్కునోట కుక్కుకుంటున్నది.

**కుడువు కుడువు డబ్బిపిట్ట కో ... కోడలమ్మ**
**ముక్కమునుగిది కొప్పజారిదా** *(చల్లకోలాటం)*

*కుడువు కుడువు డబ్బిపిట్టకో... కోడలమ్మ - ముక్కమునుగిది కొప్పజారిదా*

(డబ్బిపిట్ట: కంచరిపిట్ట తొర్రలోపలికి ముక్కుదూర్చి తింటుంది)

**దారకొండ సన్నాసిదొర కో... కోడలమ్మా డేరావేసి డక్కీకొట్టిడా**

**సారుకూర చలవచేసి కో... కోడలమ్మా బడ్డికింద బసవేసిరా**

రంపపితూరీలో నాయకుడు దారకొండ (సీలేరువద్ద) సన్నాసిదొర. అతడుపితూరీ ఉద్యమాన్ని ప్రచారంచేయడానికి డేరావేసి డక్కీకొట్టి పదుగురుకీ చాటిచెప్పేవాడు. ఇక్కడ మగడు సన్నాసిదొర. వాడుదించినడేరా చేనుపాక. వాడు పిట్టలనుతోలడానికి వాయించే 'లొడుమిరి' డక్కీ. నీమగడు పేరుకే అంతపెద్దదొరగాని వట్టిసన్నాసి. వాడి పిలుపుకు పారిపోతున్నావా! అక్కడనా మీ మకాం!'.

## తీగెలకర్రిదొర, గొడుగుసన్నాసిదొర, కారంపండు దొర :

తీగెలకర్రిదొర (అలుచందలు), గొడుగుసన్నాసిదొర (చేమ ,ఆకు,) కారంపండు దొర (మిరపపండు) పితూరీలో ప్రముఖనాయకులు. ఆపేర్లమీదదొర్లే పొడుపుకథల హాస్యాలివి. అలుచందలు తీగెకుకాస్తాయి. నల్లగా ఉంటాయి. చేమాకు 'భూమికి బొద్దు ఆకసానికి అడ్డు'. గొడుగువలె ఉంటుంది.

ఇందరూ గమనిస్తూ గేలి చేస్తున్నందున తత్తరపాటు పెరిగింది.

## దిప్పెదిప్పె మక్కలకొరువ :

**దిప్పెదిప్పె మక్కలకొరువ కో ... కోడలమ్మా డిప్పతీగ తుల్లుకున్నవా**

**దిప్పతీగ తుల్లుకొను కో... కోడలమ్మా దొప్పెడంబలెత్తివేస్తివా**

**గురిడెతీగ తుల్లుకొను కో... కోడలమ్మా గురివెడంబలెత్తివేస్తివా**

**పోయంబలో పోయిదిగాని కో... కోడలమ్మా బాలుడుకు బాగ పట్టోయా**

దిప్ప = సొరకాయ (ఆనప) వంటి తొడలుగల, కొరువ = కుర్రది.
అంబలి జారవిడిస్తే విడిచావుగాని మగనినిమాత్రం బాగాపట్టుకో.

గైరికపిట్ట కన్నులదానా కో... కోడలమ్మా కారుపంది ముక్కుదానవా

కాటుకపిట్ట కన్నులంటూ ముందు మెచ్చుకోలు -

పందిముట్టెదానవని వెంటనే వెక్కిరింత

## కుత్తికలమేతల కున్నెపిట్టలు :

**కూయుడుకూయుడు కున్నెలాలకో ... కోడలమ్మా కుత్తికలమేతలున్నవా**

కున్నెపిట్టలు చాలావేగంగా తింటాయి. దానిమెడచుట్టూ 'మేతతిత్తి' ఉంటుంది. తిన్నదాన్ని తిన్నట్లు దాంట్లోకి వెంటవెంటనే నెట్టివేస్తాయి. ఆ గొంతులోమేతలు అరిగేవరకు మీరు అలాగేకూస్తుంటారు. మగపిట్టలు ఆడపిట్టలను ఆకర్షించడానికి కూస్తాయి. ఇక్కడ ఆడది కూస్తున్నట్లుచెప్పడం వెక్కిరింత.

మల్లకూయుడు కున్నెలాల కో... కోడలమ్మా మరిదిచేత వలపులున్నావా
నీ ఉల్లాసం మగడిని తలుచుకుంటే కలిగేదిగాదే, అని ఒకడి విసురు.
సిరివిరి సిరివిరి చిన్నబుల్లి కో... కోడలమ్మా – రాతిరి దొంగల్‌దెంగిన కొరువా

'ఓ కుఱ్ఱదానా! రాత్రి నిన్ను ఎత్తుకుపోయి బాగా తిక్కకుదిర్చారటగదా. నలుగురూ వెంటపడేసరికి ఏదో గిరాకీ పెరిగిందని నిక్కుతున్నావు. నీ బిగువు పొగరంతా ఎంత సేపులే'

**పువ్వులవైము – తట్టలవైము :**

**ఒక్క తల్లి పిల్లవైతే కో... కోడలమ్మా - బొక్కలోని తట్టల వైములా**

తినే దుంపలలో వైము ఒకటి. పూవులుపూస్తున్న ఏ తీగదుంపలైనా ఉడికిస్తే దూదులు విచ్చినట్లుంటాయి. చవులూరిస్తాయి. కాయలుకాస్తున్న తీగల దుంపలు ఉడికినపుడు నీరుకారుతూ సాగుతూంటాయి. ఒక్కపిల్ల తల్లివికాగానే నీవంట్లో పొగరంతా తట్టలవైములా సాగిపోతుందిలే (తట్టలు: గింజపడుతున్న లేతకాయలు) అని పూవులవైము, తట్టవైము మీదపెట్టి ముసలిబావ ఎగతాళి.

**డోలు డొంగు డొంగు మనగా కో... కోడలమ్మా - డొంకదిక డెంకె దొలువులా**
**పూతికల డొంకలోన కో... కోడలమ్మా - పులి బొబ్బరించియున్నదా**
**పులికాదు ఎలుగుకాదు కోడలా - పూరిపిట్టల వేటలవాడోయా**

మావాడు డోలమోగిస్తుంటే నీవు డొంకనబడి పారిపోతున్నావ్ (ఎలుగుది దొలువుడు నడక; తొడలు విరిగినట్లు నడుస్తుంది) వాడికి తగ్గ ధైర్యమే నీది. ఆ చప్పుడు పులి, ఎలుగు చేస్తున్నదికాదు. నీలాంటి బొట్టెలకోసం పొంచుకొనికూచున్న వేటగాడి అడుగుల గలగల. అందరిది పిట్టలవేట – వీడిది బొట్టెల వేట.

**దొడ్డిలోని దోసపండు కో... కోడలమ్మా - దూరిరాగ దోసాలొడ్డునా**

కూరదోసకాక అంతకు నాలుగురెట్లు పెరుగుతుంది మన్యంలోని నీటిదోస.

చేలలోపెరిగే ఈ దోసపండు పైచెక్కు పిగిలేంతగా ఊరుతుంది. 'అలా పిటపిట లాడుతున్న కోడలా! చేనుచుట్టూ కంచెను దాటివస్తే తప్పుకాదులే!'.

ఇలా ఆటలుపట్టిస్తున్న గోవులకు బుద్ధిచెప్పేందుకు తరుణం 'ఇప్పుడుకాదు. పండుగలో' అనుకుంటూ; వాళ్ళను పట్టించుకోక, మళ్ళీవచ్చి మగడికోసం అంబలి నింపుకొంటున్నది.

**టెంకంబలో పిల్లకొరువా - లొల్లోడి గింజలు నంజుకుందారా**

'ఈసారి మామిడిటెంకఅంబలి మోస్తున్నావు. దీనిలోకి ఏ అడ్డమైనగిడ్డలు నంజు కుంటారు'? అంబలిలో మొక్కజొన్నగింజలు కందిగింజలు మొదలైనవి ఉండకేస్తారు. ఇవి 'తౌరుపులు'. ఈ తౌరుపులు నములుతూ మెల్లగా అంబలిత్రాగుతారు. గంజిలో అన్నంకూడా ఇలాగే కలుపుకుని తాగుతారు. ఈ టెంకంబలి ఒకపూట, గోంగూర వెదురుకొమ్ములకూరలతో కొత్తకూడు ఒకపూట, మామూలుతిండ్లు. 'సరవాలకూర – టెంకం భోజనం' అంటే సారుకూర టెంకంబంలి.

'సారుకూర చలవచేసి కో... కోడలమ్మా బడ్డికింద బసవేసిరా' అని వెక్కిరించిన వాడు ఇప్పుడు టెంకంబలిని ఎత్తిపోడుస్తున్నాడుకాని ఆరెంటికి జత సహజం.

'నీకునాకు బందుగులవరుస. ఇద్దరం మనువై కలిగినది తిందామంటే కాదని ఇప్పుడు బురదనీళ్ళు తాగుతున్నావా' అని ఆశచావనివాని అంగలార్పు.

**నీ యింటోయ్ నాయింటి నడుమ - గుమ్మడాని వేసినాము**
**గుమ్మడాకు దొన్నెలు గట్టి - నిన్నటంబలి తాగుదమనగా**
**లొల్లోడంబలి తాగనంటివి - బురదగుంటనీళ్లే తాగుతవా**
**లిల్లిబూచో లిల్లేలేవోయ్ - లల్లకాదు బాలకోడలా**

అంత ప్రేమగల మగడుండగా పుల్లనంబలి, లొల్లోడి అంబలి త్రాగవలసిన కర్మమేమిటి? – తాజాకల్లే తెప్పించుకుంటుంది.

**బూసిపండుకు బూతమయ్యే - కోసిపెట్టో కోమలెర్రి** (భూతం:వెర్రికోరిక)
**నయ్యచేతి నల్లగాజు - నెల్లిపుర మంపినాను**
**నెల్లిపురాన కల్లుట్టగా - మళ్ళీ వచ్చిది నల్లగాజు**
**ఢిల్లీకి డిలకరి మలకరి గాజోయా** ॥అచ్చుకోడ॥

అని పెళ్ళాం ప్రశంసలుపొందే ఆ పడుచువాడు ధన్యుడు. ❋

## నందాలాడే గుబ్బట్లకు - గందాలుపూసే బుడ్డడు :

ఓ... ఉంగరమంత పూలుపూసి
ముత్యమంతా కాయకాసె... పగడమంత పండుపండె
కోసిన పండులకు కోతులపాలుపారె
చేరిన పండులకు...
పండిన పండులకు పక్షుల పాలువారె

కనిపెంచిన పిల్లలు 'కోరివరించిన వారి'తో వెళ్ళిపోతారు. ముసలితనం మీద పడుతుంది. తుళ్ళిపడుతున్న పడుచువాళ్ళను, కొడుకులు కోడళ్ళు మనుమలను చూస్తుంటే ఎంతో సరదావేస్తుంది. వాళ్ళ ఆనందంలో తాను స్నేహితునిగా, ప్రేక్షకునిగా, పెద్దగా పాల్గొంటుండగానే జీవితంమీద పొద్దువాలిపోతుంది.

చిప్పచేను చుప్పటి బుడ్డడు - చచ్చిడట బాబు
నందాలాడే గుబ్బట్లకు - గందాలు పూసేవాడు
లేలే లేల లేలమ్మారో - ఒలే లేల లేల

ముసలితనంలో చేనుకు చెట్టుకు (చెట్టంటే తాటి, జీలుగుచెట్లు మాత్రమే) తిరగలేక ముసలివాళ్ళు చేలోనే ఉంటారు. అది వారి వానప్రస్థం. పండుగలకుఊళ్ళోకి వచ్చినప్పుడు తనవాళ్ళను నలుగురినీ చూసి; కల్లు, కూరనారలు అమ్మిన డబ్బులుంటే పిల్లలచేతిలోపెట్టి పోతూవుంటారు. అటువంటి చుప్పనిబుడ్డడు పండుగలలో నందాలాడే గుబ్బట్లకు గంధం కొనితెచ్చి పూసేవాడట. చిప్పచేలోఉండే ఆసరదా బుడ్డడు కాలంచేసాడనితెలిసి పండుగబసలో పడుచులు నిట్టూరుస్తున్నారు.

## నూనెకొప్పుల పొన్నచిలుక - తలపాగల జంగమయ్య :

కొండకొండలు తిరిగినగాని - కుండకడుగా నీళ్లేలేదోయా
రాతిచలమ నీళ్ళకోసం - రాగిచెంబులొడ్డినామోయా
భీమవరపు జంగమయ్య - బిచ్చమడగ బచ్చెమడగ
బిచ్చములేదు బచ్చెములేదు - వట్టికూడు భోజనాలుయా
బళ్లుబళ్లున తెల్లవార - బాల జంగము సంకుబట్టెయా
చిమ్ము చిమ్మునచీకటాయె - చిన్నజంగము సంకుపట్టె

**చలిదికో జంగమయ్యా - పట్టినాడు సంకుగంటయా**

**పొద్దువోయో జంగమయ్యా - పొయ్యిలోన మంటబెట్టి**

**నూనెకొప్పల పొన్నచిలుక - నూతినీళ్లు ముంచబోగ**

**తలపాగల జంగమయ్యా - తగులుకున్నడు నూటొక్క సేపోయా**

కర్రల కోసం, దుంపలకోసం కొండలన్నీతిరిగి సుడిపడివచ్చి, అంబలికుండకడిగి ఆ కడుగునీళ్ళతో దాహంతీర్చుకుందామంటే నీళ్ళులేవు. అడుక్కోవడానికివచ్చి వంట చేసుకుంటున్న జంగమయ్య చప్పిడికూడుతినలేక కూరకోసం చాలరోజులై వెంట పడుతున్నాడు. నీళ్ళకోసం నూతికిపోయిన నూనెకొప్పుల పొన్నచిలుక – తలపాగల జంగమయ్య, శతానందులైపోయారు. పూసరికుంటెలో ముక్కుపెట్టి నూనెతీసి పక్షులు శరీరానికి మెరుగుపెట్టుకుంటాయి. నూనెపూసి కొప్పుముడుచుకొన్న స్త్రీని 'నూనెకొప్పుల పొన్నచిలుక'గా వర్ణించడంలో అందం పదబంధానిది. ఆడపిట్టలకోసం మగపిట్టలే ఈసోకులన్నీ చేసుకుంటాయి. కాని మానవులలో అలంకరణ స్త్రీలసొత్తుగదా.

**చిన్నబోయిన చిన్నమరిది :**

కొత్తకోడలు ఏ పనిమీదనైనా ఒంటరిగా ఇల్లుదాటిపోతే అనుమానానికి తావిచ్చినట్లవుతుంది. ఎవరినన్నా తోడుతీసుకొనిపోతే అది దీనిని చెడగొడుతున్నదని నిందలు. ఇంట్లోవాళ్ళను తోడుకొనిపోతే పనిపాటలలోగూడా మన్ననలనుచూపడం ఎవరితరం.

**బట్టలన్ని బయటవేయగ - బాలమరిది వెంటవచ్చె**

**చిన్న మరిది వెంటబోయి - చీరలకు గుంజబోగ**

**చీరల చినుకుదలిగి - చిన్నమరిది చిన్నబోయె**

మరిదిగారిని గౌరవించాలి. ఈ బాలమరిది చిన్నప్పుడే నీలుగుతున్నాడు.

**ఎత్తుబాల కర్రలమోపో - ఎగవాగున కర్రలున్నవా**

**దిగువాగు సంగువలోన - దించుబొట్టె కర్రలమోపోయా**

**ఎర్రినేను కర్రలకు పోగా - ఎర్రిమొగుడు నాకే నమ్మడా**

**నమ్మకుంటే - నావెంట రావోయా**

(ఎగ: ఎగువ, దిగు: దిగువ, సంగువ: సంగమం)

అసలే నసుగుతున్న మొగుడు చివరిబంతిలో సవాలుకు అవాక్కై అదిరిపడి ఉండాలి. ఈ నేస్తాలు తక్కువవికావు.

**సంతలు – సావాసాలు :**

గువ్వపిట్ట గూటికి వేసి - గూడెములో వెళ్లుడన్నా
గూడెములో సంతకు వెళ్లో - గుట్టుచల్లగాడుక రావో
మాడెము సంతకువెళ్లో - మాటచక్కగాడుక రావో
కర్రలకువెళ్లినపుడు - కలుసుకున్న మాటలున్నవా
వెంటవస్తే వచ్చిరిగాని - వెల్లకిలపడుకున్నరా

ఇలా సంతలు మరిగాక కొత్తకొత్త సోకులొస్తాయి.

ఎర్ర రైక లెక్కటివమ్మా - ఏలేశ్వరం సంతలకాటివి
పచ్చరైక లెక్కటివమ్మా - పిఠాపురం సంతలకాటివి

సోగ్గాళ్లు చుట్టూతిరుగుతారు.

నయ్యకాసో నల్లటివాడు - నల్లపూసల బేరగాడోయా
నయ్యకాసో రంగులవాడు - రంగుపూసల బేరగాడు
నయ్యకాసో చిలుకులవాడు - చిలుకు చక్కని చిన్నవాడోయా
ఏటిగట్టునెవ్వడవు - ఎర్రపంచె దోవదులోయా
పాటిగట్టు నెవ్వడవో - పొట్టిపంచె దోవదులోయా

ఇప్పుడు వీడియోలవాళ్ళు, సినిమాలవాళ్ళు, లారీడ్రైవర్లు, కంపెనీల గుమస్తాలు, ప్రభుత్వోద్యోగులు వాళ్ళను పరిచయంచేయడమే పనిగాగల నిరుద్యోగులు, చిరు ఉద్యోగులు చాలామంది చేరారు.

ఎప్పటికప్పుడు కొత్తబహుమానాలు, అవి తెచ్చే కొత్తమిండగాళ్ళు.

కొండకింద లచ్చుమయ్య - గోగిపూవు
సంతకు జోగిడి - గోగిపూవు - ఏమేమి తెచ్చిడి - గోగిపూవు
నత్తులు తెచ్చిడి - గోగిపూవు - పెట్టుకోమన్నాడు గోగిపూవు
పెట్టెలో వేసిడి - గోగిపూవు
చచ్చిన నయ్యమే - గోగిపూవు

మళ్ళీ ఇంతలో అంతకానుక తేలేడుకాబట్టి చస్తేనేనయం. మరొకడితో మరో ముచ్చట. రెండుచేతులు కలిపితేగాని చప్పట్లుమ్రోగవు. ఇటువంటి చేష్టలలో మగవారే ముందుంటారు.

**పంచతలగుడ్డ తెమ్మంతినో - పప్పలబుల్లికి రమ్మంతినోయా**
**చీరతలగుడ్డ తెమ్మంతినో - సిరిబలబుల్లికి రమ్మంతినోయా**
**తడకచాటుకు రమ్మంతినో - తక్కెడ బెల్లం తెమ్మంతినోయా**

ఒకంతట చల్లారని కామదాహం – దాని హావభావాలు, ఇరువురిలో ఎవరోఒకరు పసిగట్టి తీసుకొనే చొరవలవల్ల ఏర్పడిన ఈ సంబంధాలలో ఎవరిలాభంవారు మరచిపోరు.

**నూతిదాక రమ్మంటివి - నూనె కడుగ లేదంతివి**
**పన్నెకడుగ లేదంటివి - పాయదారికి రమ్మంతివి**
**అల్లదారికి రమ్మంటివి - అద్దానికడుగ లేదంతివోయా**
**రోడ్డవేసిరాయకు బావ - రూపాయకడుగ లేదంతివి**
**ఇచ్చినావు ఇంతపొగాకు - తీసినావు తిత్తిరిడొంకకా**
**రాగుడబ్బులివ్వలేవు - రంకుదెంగులు దెంగలేవు**
**పావలడబ్బులు ఇవ్వలేవు - పట్టి పట్టి దెంగలేవోయా**

మగవారూ ఇందుకు తీసిపోరు

**కయ్యుతోనో కాలిన కొరువ - కయ్యుల్లో కాలిపోతే**
**నెయ్యితోనో తాలింపులు-ముసిరిగ పెసరపప్పు-ముండలకు వడ్లకూడోయా**

**ఆడవారికి అగ్నిగుండం - మగవారికి మోక్షగుండం**

కొండచేలకు అగ్గులుపెడుతూ ఆ అగ్గుల్లో పెళ్ళాం ఆహుతైపోతే, మగవాడు ఇష్టమైనవారితో కమ్మగాతింటూ కులకవచ్చు. ఇటువంటివాడి 'పెళ్ళి ఒకపక్క జరుగుతుంటే పెళ్ళాం పెడపక్కన పారిపోయిందట'.

**దుక్కిదున్నో దక్కం పడలు - మళ్ళొక సాలో మళ్ళా పట్టోయా**
**మళ్ళొకసారో మళ్ళోపట్టో - మర్రివేరో తేలదున్నోయా**
**ఇంకోసాలో ఇంక పట్టో - ఈతవేరో తేలదున్నోయా**

**విత్తినది ఏమిజొన్న - వీరజొన్న**
**పండినది పాలజొన్న కోసినది కొర్రజొన్నోయా**
**జోగు జోగున జొన్నకోయ - జొన్నరేకు**
**రొమ్ముతగిలి రొమ్ము రెండు బద్దలాయివా**

కొన్ని అనియతమైనభావాలు, సంఘటనలు అవ్యక్తంనుండి తీగసాగి రూపురేఖలు దిద్దుకుంటూ తిరిగి అవ్యక్తంలోనే లీనమైపోతాయి. ఆ భావాలను చిత్రించే జానపదుని కవనశిల్పంకూడా వ్యక్తావ్యక్తంగానే ఉంటుంది. ఏదో ఒకదానిమీద పెట్టి కవ్వించే గిరిజనుల పదాలలో ఇది పరాకాష్టనందుకొంటుంది.

**ఓ... కర్రికొమ్ముల కనుజువచ్చి - ఇందుమేయ అందుమేయ**
**ఆడవాలె పాడవాలె వేడుకలు సేయవాలెయా**
**నల్లగొండల నడుమవేయ కనుజుకేసిడి కారకుడు**
**గురవచ్చె గురవచ్చె - గుండువంపు గురవచ్చె**
**గుండువంపు దొర్రకాయ - కాయతింటే ఏమిఫలం**
**పండుతింతే ఫలముంతాది - తినగ తినగ తీపులొట్టి**
**తీపికొక్కబాలుడుట్టె - బాలుడొంటిన బట్టలేదు**
**పాలెవాడు పారిపోగా - పంచిపెట్ట బాలలేదు**
**పాలెపు కొండలలోన - పడ్డదయ్యి పాలవర్షం**
**కుండలు నిండ గురిసే - కురిసేవాన వెలిసెవాన**
**మన్నెమంతా చినుకుతగిలే - మట్టికుండలొడ్డుడన్న**
**రాజమంతా చినుకుతగిలే - రాగికుండలొడ్డుడన్న**
**ఆకసాన మేగెము లేదు - అగ్గినిప్పల వానకురిసె**
**నింగినింత మేగెము లేదు - నీలి కెంపుల వానకురిసె**
**జాడినింత మేగెము లేదు - జగజెంపుల వానగురిసె**

**ఉసిరిక దొర్రలో – పసిరిక పాములు :**

ఎగసిపడే కెరటాలతో ఘోషించేసముద్రంవలె, అవ్యక్తచేతనలో చెలరేగుతున్న వాసనలు కాల్పనికగంధంతో, ఇలా కూనిరాగాలవలె అప్పుడప్పుడు ఒకటొకటిగా

*జాడినింత మేగము లేదు - జగజెంపుల వానగురిసె*

వెలువడుతుంటాయి. ఈశిల్పం శబ్దగతంగా ఉంటుంది. ఇటువంటి భావాలు సలుపుతున్నప్పుడు మనుష్యుల ప్రవర్తనలో, నిలకడలేకపోవటం, చాపల్యం, అసహనం పెరుగుతుంటాయి.

శబ్దం అనేకగతులలో ఈ అనుభూతిని వ్యక్తంచేస్తుంది. జానపదగేయాలలో పునరుక్తి, అర్థచ్ఛాయలు, లయను తోడుచేసుకొని మనసులో తబ్బిబ్బులకు తాళం వేస్తాయి. మనసు శూన్యంగాఉన్నప్పుడు, అత్మీయులతోచేరి ఆనందంలో వోలలాడుతున్నప్పుడు ఆలోచనలు ఒక వరుసలేకుండా సాగుతాయి. 'అవిరళిత కపోలం జల్పతోరక్రమేణ' అని సీతారాములు ఏకాంతంలో చెక్కిళ్లుదగ్గరగాచేర్చి ఏవేవో కబుర్లు (జల్పనం) చెప్పుకుంటున్నారంటాడు – ఉత్తర రామచరితంలో భవభూతి. పిల్లలభాష వేరు, ప్రేమికులభాష వేరు. మాటలకందని మనసుల ఊసులవి.

**ఈబీయమాబీయం - కలబోసినాదో**
**కూడొండి పప్పొండి - కుదుటబెట్టిందో**
**ఇల్లెక్కి కుక్కొచ్చి - కూడుముట్టిందో**
**కూడుముట్టినచోట - కుంకమైలెగచు**
**మల్లెలకు మాతాత - కోటకట్టాడో**
**కోటలో పుట్టింది - చేరింత పూవు**
**చేరింత పువ్వుకు - చెరువు తోలించు**

పిల్లలు –

**కురువు కురువు వాన - కూటి ముద్దఇత్తుం**
**ఎండకాయ ఎండకాయ - ఎరిపోతో**
**తొండలు మెండలు - పొలివట్టె**
**చారాకల్లు చట్టెడి - పిట్ట ముక్క పిడికెడి**
**ఎద్దుకొమ్ముున మద్దెలకొడితె - వెనక్కిపట్టే డూ డూ**
**అద్దరి కొండనరికించు - అలుచందలు పండించు**
**అద్దరికొండ అలమలారా - ఆడుడోయి పాడుడోయి**

అలమలు పంట ఆరగిస్తాయని వెక్కిరింపు 'అదుపులేని ఆలి, వెలుగు లేని చేని' (వెలుగు = కంచె)

ఆడుఆడు కన్నెపిట్ట - కడుపు డివ్వు డివ్వు
అత్తమామ సంతకెడితె - చిరలు టివ్వు టివ్వు
బొక్కెత్తెర కన్నెపిట్ట - బోనమిచ్చెనా
కాలిపోయిన బోనం - కడుపు డివ్వు డివ్వు

కన్నెపిట్ట తోకను ఎప్పుడు ఆడిస్తుంటుంది. అటువంటి చపలబుద్ధికి దొరికిన ఆట విడుపునుగూర్చి మేలమాడడం.

అ అ ఆ నైన బుడ్డి కాయకాసిది - కాయలోన కన్నెపిట్ట కరిగిపోయిది
కాగుండనీళ్ళతోన కడుగుకుంటిని - పరుసరొడ్డ ఆకుతో తుడుచుకొంటిని

కాగుండ: నీళ్ళుకాచుకొనే కుండ;

నీఎద్దు నాయెద్దు నీళ్ళ కెల్లింది - తాతగారెద్దొచ్చి తగులబొడిచింది
మామగారెద్దొచ్చి మంతరించింది - బావగారెద్దొచ్చి బాగుచేసింది

కొంత అధివాస్తవిక శిల్పం మేళవించిన జానపదుల కూర్పులివి.

ఉసిరిక దొర్రలోన - పసిరిక పాములున్నావా -
ఎక్కివెల్లి లెక్కపెట్టగ - ముప్షైఆరు తుమ్మెదాలోయా
తుమ్మెదాలు తూలినట్లు - తూలగాదుర బొంగరమా-
ఆమదాలు అబ్బినట్లు - ఆడుగాదురా బొంగరమా
బొంగరాల సేకుదగిలి - బంగరాల బాలుడుట్టె
బాలుడొంటిన - బట్టలేదోయా
పాలనార విల్లుగట్టి - పారెపాముకు పారనెయ్యి -
తూలెపాముకు - తునుకలెయ్యి
బద్దపేరు ఏమిపేరు - బద్దపేరు భద్రాచలం
మిట్టపేరు ఏమిపేరోయా - మిట్టపేరు మిర్తివాడ
అత్తపేరు ఆకుచిలుక - కొడుకుపేరు కోమలింగం
కూతురిపేరు గుబ్బలమ్మ

ఉసిరికదొర్రవంటిగుండెలో పసిరికలవంటి కోరికలు. తుమ్మెదలవలె ఆడే బొంగరాన్ని

చూచి ముచ్చటపడుతుండగానే బంగారాలబాలుడు కలిగాడట. చిరునామా లన్ని చెప్పి పారిపోతున్న ముద్దాయిని శిక్షించమనే కేకలు.

భూమికి తగిన వ్యవసాయం – బుద్ధికి తగిన ఆనందం.

**బందచేను తువ్వడాలు - బబ్బిరేలు విత్తనాలు**
**కొండచేను తువ్వడాలు - కొయ్యగూర విత్తనాలు**
**రావికింద రావడిచెక్క - రాజులకో నల్లమందు**
**కొట్టుకింద కొరుకుడుచెక్క - కోయలకు నల్లమందు**

తెలిసీ తెలియని వయసు, తోటివాళ్ళ ప్రోత్సాహం, పెంపకంప్రభావం, ఇష్టంలేని పెళ్ళిళ్ళు, ఈడుజోడుచూడని సంబంధాలు – వీటిగాథలు ఇటువంటివికాగా, కొత్తకోడలికి భర్త ఆదరణ లోపించి, అత్తమామ ఆరళ్ళు ఎక్కువై

**మగనాలి – పోతుమెకం :**

**అత్తమామ మాటలకు - ఈతవేనం తేలిపోయె**
**ఈతనున్న పోతుమెకం - బూకుమని కేకవేసె**
**నూతినున్న పోతుమెకం - నూకుతనని కేకవేసె**
**కొట్టునున్నకొరివిదెయ్యం - కొరుకుదునని కేకవేసె**
**తీగనున్న తిరుగుదెయ్యం - తిందునని కేకవేసె**

కొండపైకిపోతున్న కొద్దీ, చెట్టుచేమ తగ్గిపోయి కొండవెంటిమీద కేవలం చిట్టీత పొదలే ఉంటాయి. దానిని 'వేనం' అంటారు. కొండలమధ్య లంకలలో ఊళ్ళుకాబట్టి ఊరు గడచిపోవాలంటే వేనంతేలిపోవాలి. విరిగిమనస్సుతో మనువుచేయలేక వేనంలో 'మగనాలిమెట్ట' తేలిపోతున్న ఆమె ఏదో 'పోతు' మెకం కేకకు ఉలిక్కిపడ్డది.

**పులికాదో ఎలుగుకాదో - పూరిపిట్టల వేటగాడోయా**
**ఊరికెదురు కొండలోన - ఉడుముల వేటగాడోయా**

ఈ పరిణామాలన్ని పసిగట్టినవాడు దరిచేరాడు. ఆమె తన కష్టంకొద్ది తాను పోతున్నది. ఇది నలుగురిలో రట్టుకావడం ఇష్టలేదు. మెట్టదాటేలోపల కట్టుకున్నవాడు కొట్టుకుంటూనో, కాళ్ళుపట్టుకుంటూనో తీసుకపోకపోతాడా అనే ఆశ పీకుతూనే ఉంది.

ఆశలు అడియాశలవుతున్న క్షణాలలో 'ఆపదకు అడ్డుపడినవాడు – చీకటిలో తోడు పడినవాడు' ఆత్మీయుడైనాడు.

**కొండలెక్కి చూడకులేవో - కన్నవారు దూరమాయె**
**మెట్టలెక్కి చూడకులేవో - మేనవారు దూరమాయె**
**గొందిదిక్కు చూడకులేవో - గొచ్చముక్కు సోమేడున్నడు**
**మూలదిక్కు చూడకులేవో - ముద్దముక్కు సోమేడున్నడు**
**దొడ్డిదిక్కు చూడకులేవో - తోటకూర బొజ్జడున్నడు**

వీరందరు కానకుండ బైటపడి – ఊళ్లో కోపాలు చల్లారేవరకు కొన్నిరోజులు ఎటైనాపోయిరావడమే మంచిదని వారు ముందుకేసాగారు. కన్యతోవస్తే ఆదోదారి కాని మగనాలుతోవస్తే ఎవరు ఆశ్రయమిస్తారు? పప్పుకూడుతిని ఆ పెండ్లిని అందరూ సమ్మతించినవారే. అందువలన ఆదంపతులకు అరణ్యమే శరణ్యం. మరివారి తిండి తిప్పలు.

**తీయనికల్లు – కొనగందులు :**

**కొత్తపాకల సిర్లిపూవులు - జొండికుండన వండుకు దెంగిరా**
**కొట్టుచెట్టు తీయనికల్లు - కోండ్లూరు కొనగందులా**

కొత్తపాకల, కోండ్లూరు – ఊరిపేర్లు; ఫిబ్రవరిలో కంపలమీదపూసే సిర్లిపూలను పప్పుతో వండుకుంటారు. జొండికుండ – పగిలిపోయినకుండ లేక బొచ్చె, 'ఉట్టితే చెట్టు – లేకపోతే కొట్టు' కల్లుతగ్గినచెట్టు కొట్టు. బాగా కల్లుదిగేరోజుల్లో గూనకొద్దీవస్తే ఇపుడు రోజుమొత్తంమీద ఒకగొట్టంకల్లు వస్తుంది. ఒకరో ఇద్దరో తాగే ఈ కొద్దికల్లులో చెక్కలు వేయరు, కాచరు కాబట్టి ఇది తీయనికల్లు. చేలో మిగిలిన కందిగింజలు వర్షాలకు (మార్చి) మొలకెత్తికాస్తాయి. ఆ కొనగందులను జోలిక (గుగ్గిళ్ళు) వేసికొని వాటితో తియ్యనికల్లు త్రాగారట. అజ్ఞాతవాసాన్ని ఇలా అపురూపమైన సరదాలతో, అడ్డమైన గడ్డితిండ్లతో గడిపి ఊరు చేరుకుంటారు. మగవాడు మగనాలితప్పు చెల్లిస్తాడు. కొత్తకాపురం... ❉

## పోతు, తల్లిపండుగలు :

కొండనగరులో ఉండే అడవిరాజులను రాజులపండుగకు తానానికి ఆహ్వానించి అనుపుతారు. గ్రామంలో మయల, కీడును అవకాశంచేసుకొని అడవిదయ్యాలు ఊరిమీదపడగలవు అని రజస్వల సమయంలో కన్యను అడవిలో ఉంచుతారు (అడవికి పారడం). పోతురాజు 'గడికాయు' దేవత. గంగాలమ్మ పొలిమేరలో ఉండి ఉడుకులు రాకుండ దారులు చల్లబరిచే దేవత. వేసవిలో గంగమ్మను పండుగబసకు తీసుకొనివచ్చి, మొక్కులు చెల్లించి పంపిస్తారు. కొండచేలకు అగ్గులుపెట్టిన తర్వాత జరిపే ఈ పండుగకు వ్యవసాయవాసన సోకి 'బూతులసంబరం' అయింది. గంగాలమ్మ పండుగ తరువాత, కాలువ ఒడ్డున రాళ్ళతో కోటెత్తి కాలినకొయ్య అందునిలిపి 'మామిడికఱ్ఱ అయిపోయిందయ్యా' అని చాటుతారు. ఇకనుండి కయ్యులు ఏరవచ్చు. పండుగలో ఇంటింటికి గంగమ్మను (ఘటం, కొన్నిప్రాంతాలలో ఇత్తడి) తిప్పి వారధిపోస్తారు. కొన్ని గ్రామాలలో పోతుపండుగ, కొన్ని గ్రామాలలో తల్లిపండుగ జరుపుకోవడం ఆనవాయితి.

### సృష్టిచేతి ఆయుధం కాంక్ష – సంఘంచేతి ఆయుధం ప్రతిష్ఠ :

పోతుపండుగలో నియమనిష్ఠలు ఎక్కువకాబట్టి ఆటపాటలకవకాశంలేదు. ఆ వూళ్ళవాళ్ళంతా తల్లిపండుగచేసే ఊరుకు చేరతారు. ఈపండుగ తరువాత, వర్షాకాలం శీతాకాలం గడిచి, సంకురుమనానికో, పిండిపండుగనాటికో చేనుపాకలనుండి వచ్చిన వారంతా పండుగబసలో కూడతారు. గంగమ్మను ఊరినుండినడిపినట్లే మనస్సులో తీరనికోరికలను కోపతాపాలను వెడలనడుపుతారు. బూతులు తిట్టకపోతే గంగమ్మ పైచెంగువేయదట (కడుపుతోఉండడం). పైచెంగువేయడం వ్యవసాయంఫలించడమే. కష్టపడినంతవరకు కడుపునిండడంలో ఢోకాలేని ఈసమాజాలలో యౌవనం వినోదం. పడుచుల కోరికలకు రకరకాల కోణాలుంటాయి. కొలువులలో కర్మకాండ కొంత మానసికమైన ధైర్యాన్నిచ్చినట్లే, యువతరానికి ఈపండుగలలో తమ సరదాలను తెలియచేసుకొనే అవకాశం దొరుకుతుంది. ఆటపాటలతో జనం సన్నిహితులౌతారు. అంతరాలు విస్మరిస్తారు. భావాలకు కళాత్మకమైన రూపంఇవ్వడంలో, అవి ప్రశంసలు పొందడంలో ఆనందం లభిస్తుంది. శ్రమవిభజన, వివాహవ్యవస్థ, వావివరుసలు, నిత్య జీవితంలో పాటించవలసిన నియమాలు పండుగలలోమాసిపోవు. కాని ఆసమాజంలో

ఉన్న అవగాహననుబట్టి వాటి పేరిట ఎవరు రోషపడరు. సృష్టిచేతి ఆయుధంకాంక్ష. సంఘంచేతి ఆయుధం ప్రతిష్ఠ. కోరికలు ఎన్నటికీ తీరవు. తరగలెత్తేకాంక్షలను మాటలు తెలియపరచనూలేవు. ఈ నైరూప్యమైన, సహజమైన, అనంతమైన భావోద్రేకాలను చిత్రించే కవితాశిల్పం, అవి అందుకున్న, అర్థమైనవారి ప్రతిస్పందనం ఆరాటాన్ని కొంత ఉపశమింపచేస్తాయి. గంగాలమ్మను సాగనంపిన పడుచులు తమ హృదయాలకు గళాలతో ఏత మెత్తుతున్నారు.

**అమ్మవారుయున్నప్పుడు - ఆడేపాడే బాలలము :**

ఓ... మా ఊరి అమ్మవారికి - మందమేకలు చెల్లివోలేవో
దొడ్డైన అమ్మవారికి - దొప్పసేసలు చెల్లివోలేవో
తిరగముగల్ల అమ్మవారికి - తిలికెదీపము చెల్లివోలేవో
కల్లుగొట్టాల అమ్మవారికి - కల్లుగొట్టాలు చెల్లివోలేవో
ముగ్గుముత్తేలమ్మవారికి - ముగ్గుముత్తేలు చెల్లివోలేవో
ఘనమైన అమ్మవారికి - గండదీపము చెల్లివోలేవో
గందపుండలమ్మవారికి - గందపుండలు చెల్లివోలేవో
మేలైన అమ్మవారికి - మేకపోతులు చెల్లివోలేవో
దురుసుగల్ల అమ్మవారికి - దున్నపోతులు చెల్లివోలేవో
ఓ... ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలే
పచ్చకోకలు కట్టుకొని - బయలుదేరిదమ్మవారు
నిలువుకోకలు కట్టుకొని - నిలబడ్డదమ్మవారు
వెల్లకోకలు కట్టుకొని - వెనుకనిలిచిదమ్మవారు
కోటకొప్పల గంగాలమ్మ - కొర్రలుపండితె నీవురమ్మీ
జోడుకొప్పల గంగాలమ్మ - జొన్నలుపండితె నీవు రమ్మీ
ఊరువెళ్ళేదమ్మవారు - ఊరునొక్క కేకవేసె
నగరివెళ్ళేదమ్మవారు - నగరినొక్క కేకవేసె
గూడువెళ్ళేదమ్మవారు - గూడునొక్క కేకవేసె
కొండతేలు తేలుమనగ - కొండతేలదు కొమరదేవి

పొమ్మంటే దేవత పోవడంలేదట (కొండ తేలదు)

**కరకకాయగోనెలుకట్టి - తోలినాము తోటపల్లి**

**తోటపల్లి చెల్లమదేవి - ఆరుద్రాముల సారాతాగి - అమ్మకుండ అడ్డుపడ్డదా**

భగవంతుడు భక్తపరాధీనుడు. తనపరువుతీసినా భక్తునితోపాటు తానూనవ్వుకొనే నేస్తు భగవంతుడు. ఆదేవత ఆరుద్రాములసారాతాగి (సారాకొలత డ్రాములలో) ఆ తిక్కలో ఎక్కడోపడిపోయి, సంతకుతోలిన కరకకాయలకు బేరంరాకుండగ చేసిందట.

**బూతులది గంగాలమ్మ - పోతులకు పడదెంగిదా**

గంగమ్మ అందాన్నిచూసి రాజుబలాత్కరించబోగా, తనవంటిఅందగత్తె మన్యాన జన్మించరాదని శపించి, తన అందాన్ని పల్లానికిపంచి తాను దేవతగామారింది. కన్నెగానే దేవతైన ఆమెకు బూతులసంబరం. పండుగ ఓరెంతో కొవ్విన జోడుకొప్పుల కొమరదేవి పోతులను (మగవారిని) పడగొట్టిందట. ఈపదానికి అర్థం 'ఉడుకులతో పోతులు చచ్చిపోతున్నాయి' అని. కాని ఆ పైపై అర్థాలు ఇటువంటి పాటలలో ఎప్పుడు అప్రధానమే.

## తేనెగండి మోరులోన – తేలివచ్చె చందురూడా :

**తియ్యమామిడిగండిలోన - గయ్యాళిది ఆడపిల్లన్నా**

**అమ్మవారి అరుగులలోన - ఆడవాలె పాడవాలె**

**దొప్పతోడి భోజనాలు - దిప్పతోడి కట్టకల్లులా**

**కట్టకల్లు తాగవాలె - కొత్త పిల్లపట్టవాలెయా**

**ఓరెపుకూడు తినవాలె - ఊడకవాడక దెంగవాలెయా**

**చీకటికొండన సిగ్గేలేదు - అవతల కొండన లజ్జేలేదోయా**

**తేనెగండి మోరులోన - తేలివచ్చె చందురూడా**

**గండిమీదకాయు వెన్నెల - పాపదాటు పండువెన్నెలా**

**పాపదాటు పండువెన్నెల - పగవాడు కాయు వెన్నెలా**

**తియ్యమాటి గండిలోన - గయ్యాళిది ఆడపిల్లన్నా**

యౌవనం, కల్లుతో కైపెక్కిన గంగాలమ్మ నాయకత్వం, చంద్రోదయం. చంద్రుని చూడగానే ఎవరిఏర్పాట్లు వారికి గుర్తువస్తున్నాయి. ఈ కారడవులలో 'కూకిన లోవలు'

చాలాఉన్నాయి. (తీగలు కప్పివేయడంవలన సూర్యుడు క్రుంగినట్లుంటుంది) సిగ్గు విడిచిన మనసుకు చీకటికొండ గుర్తువస్తుంది. గండిమీదవెన్నెలతేలేవేళ, పాప పొలిమేర దాటిపోవలసినవేళ – పగవాడు మధ్యలోనే తన్నుకు పోవడానికి కాచుకుకూచునేవేళ అదే. ప్రియుని పగవానిగా భావించడం రతిమర్యాద. పగవాడు దోచుకుపోతాడు.

**అద్దరివలసన మిండచేను - ఎండుడొక్కల బండచేనోయా**

**పండినపంట గండికిమోసి - బండలకు దెంగబెడితిరా**

**జౌకవిల్లు – దడ్డకోల :**

కొందరు జట్టుగాచేరి ఎవతినో ఒకతెను నిలవేసి సరదాకు బేరంపెడుతూంటారు.

**లాలికి లాలికి లాలిందాము - లక్కున కుదిరిందామోయా**

**జోలికి జోలికి జోలిందాము - జోలాట పొందిందామోయా**

**సందులు సందులు కుదిరిందామో - సందికి దిమ్మలు వేయిందామోయా**

'పండుగనాడు కూడా పాతమొగుడేనా' అంటారు. మరి మగవాడి బాధ ఇలాగుంది–

**పండుగ పొరురాగ - పండుమక్కల బొట్టెదొరికిదా**

**పిల్లచేత బెల్లంపెట్టి - తల్లితోటి తంటాలుపడదరా**

అద్దైనా వీడికి దక్కేదాకా నమ్మకంలేదు.

**అద్దరికొండన గొడ్డుచచ్చె - దద్దుగమానున గద్దలు వాలివా**

ఈచచ్చినబక్కకోసం గద్దలు కాచుకొనున్నాయి. ఈ ముసలిగొడ్డు, దారిలోమొద్దు ఒకటే.

**చిక్కువిల్లు చిల్లలకోల - లాగివేయగ చిక్కుమన్నదా**

**జౌకవిల్లుదడ్డకోల - లాగివేయ లక్కుమన్నదా**

చిక్కువిల్లు: బెట్టుగట్టిగాఉన్న చిన్నవిల్లు; చిల్లలకోల: నారసకు ఇరువైపులా ఉండే మొనలుగల అమ్ము. చిల్లలమ్ము మాంసంలో నాటుకొన్నప్పుడు, ఈ మొనలవల్ల సూటిగ బాణంపైకిరాదు, చిక్కుపడిపోతుంది; జౌకవిల్లు: బెట్టువదులుగా ఉండే పొడుగైనవిల్లు; దడ్డకోల: లావైన అమ్ము, విల్లు – అమ్ము లైంగికచిహ్నాలు.

**మరిగెలవారు మామిద్దరు - మంచిమంచి విండ్లవారు**

**తగ్గివారు తండ్రిద్దరు - తగరపు విండ్లవారు**

**జోడువిండ్లు జోడించుకొని - బోలకొండ వేటకువెళ్లో**

**పీపిడిడొంకన పిల్లున్నాదో - విల్లుతేవో పిల్లికినేద్దాం**

**గుంటుబారు పెట్టవాలె - గుండుకింద పందికినేద్దాం**

**పిప్పిడిపుంతన పిల్లున్నాదో - కోపిరిటుంపున కోలున్నాదో**

**పిల్లి బొక్కున బల్లెమున్నదా**

**రవ్వలబారు పెట్టవాలె - రాతికింద కోడికినేద్దాం**

**విల్లు విరిగిది పిల్లి పారిదా -**

**పోయి పిక్కపోయిదిగాని - జోడు వెలమల నడుమపోయె**

**ఏడెగడ్డి కొండలోన - జాడలేదు జవాబు లేదోయా**

మామిద్దరు–మామఅల్లుడు ఇద్దరు; తండ్రిద్దరు – తండ్రికొడుకు ఇద్దరు. తగరపు విండ్లు – తగరపుపట్టీలవిండ్లు; రవ్వలబారు – తుపాకిరవ్వలు; పిక్క – తుపాకిగుండ్లు.

ఈ వేటవెనుక అర్థాలు స్పష్టమౌతూనే వున్నాయి.

సావాసగాళ్లుగాక, తండ్రికొడుకు, మామఅల్లుడుకలసి ఇటువంటి వేటకుపోవడం ఒక చమత్కారం;

**తియ్యని గున్నమామిడి :**

**గొందికోటో, గున్నమామిడి - గుజ్జు గుజ్జో గున్నమామిడి**

**దాని పేరో తియ్యమామిడి - తియ్యనిదో జన్నెలమామిడి**

గొందికోట – కానివాడ, గుర్తేడుదారిలో మారుమూల ఊరు; గున్నమామిడి – కంబంవలెగాక గున్నగా కౌగిలికమిరేది, వయస్సులో చిన్నది; అడవిలో దొరికేవి తొక్కకు టెంకకుమధ్య ఎడంలేని కొండమామిడిపండ్లు. అటువంటిదిగాక మెత్తగా, నిండుగా, గుజ్జుగా ఉన్న కండగలమామిడి ఇది. ఇంతాచేసి అది పుల్లగాఉంటే విరసంగాఉంటుంది. కాని ఇది తియ్యమామిడి. జన్నెలు–ఎండిన వరుగులు; నమిలినకొద్దీ, అనుభవించిన కొద్దీ రుచులూరించే జన్నెలమామిడి. ప్రేమలోపడి చిక్కినకొద్దీ అందగించే దోరమామిడి (చక్కనమ్మ చిక్కినా అందమే). అడుగడుగుకు పరాకాష్ఠకుచేరే రసోత్కర్ష ఈపదానిది.

**నీవు విడ్డి నేను విడ్డి - కోరుకొండ కొలువుకు పోదారా**

**చింతలు చెల్లివి సంతకుపోదాం - చిట్టి చిట్టి గాజులు కొందారా**

కోరుకొండ నరసింహుడు, పట్టిసీమ వీరభద్రుడు, భద్రాచలం శ్రీరామచంద్రుడు, గోదావరిమన్యానికి ద్వారపాలకులు, నరసింహునిరథోత్సవం కోరుకొండ కొలువు. ఈ నెలకుమన్యాన కోరుకొండనెల అనిపేరు. గోదావరిఒడ్డున 'దేవునిపెళ్ళి', భద్రాచలంలో స్వామికళ్యాణం; విశాఖలో గంధమావాస్య–సింహాచలస్వామి గంధపుఒలుపు ఉత్సవం.

**చింతలుకాస్తే చెడ్డకాలం - మామిళ్ళుకాస్తే మంచికాలం**

ఈ నానుడికి ఋతుధర్మంలోనిమార్పు ఆధారంకావచ్చుకాని, కొండవాళ్ళు దీనికి ఆర్థికమైన వ్యాఖ్యానం ఇస్తారు. చింతలు విరుగకాస్తే పండుదిగుబడి బాగా ఉంటుంది. వ్యాపారులు ధరఎక్కువగా పెట్టరు. చింతలు బాగాకాస్తే ఆ పండును కొండలనుండి కిందికి మోసితెచ్చి సంతలో అమ్ముకోవాలి. బాగాపండినపుడు కనీసం ఈ మోతకూలీ గూడా గిట్టుబాటుకాదు. చింతలు దులపడానికి ఎంతోమందిని పెట్టుకోవాలి, వాటాలు ఇవ్వాలి. కాబట్టి చింతలు తక్కువకాస్తే ఎక్కువధర వస్తుంది. ఆ కొద్దిపండును మోసుకు పోవడంతేలిక. మామిళ్ళు అమ్ముకొనేవికావు. అవి పండితే కడుపునిండతినవచ్చు, టెంకలు దాచుకోవచ్చు.

'నీవు నేను ఈడుజోడు. చింతలడబ్బులు చేతిలోపడ్డాయి. గాజులు కొనిపెడతా, కోరుకొండ సంబరానికి తీసుకుపోతా' అని మరిపిస్తున్నాడు.

**తేనె తేనె నూనె నూనె - నీవు నీవె నేను నేనే**

తేనె నూనెలు కలువవు అని ఆడదాని సమాధానం. ❉

<u>**ఔజం**</u>



## ముల్లికలు - జారికలు :

**ముల్లికలు మొగ్గలెత్తగ - మోసపూరో మగనాలు**
**జారికలు జజ్జరిల్లగ - జాడిదేశం మగనాలు**
**ఆడవాలె పాడవాలె - వేడుకీలు చేయవాలెయా**

మార్చినెలలో చేలలోపండే ముల్లికపండ్లు తీయన, జారికపండ్లు పుల్లన, ముల్లిక వాడు తనవంశంలోనే చేసుకొనేవాడు; మోసపూరు-ఎవరూ ఎరుగని దూరదేశం.

ముల్లికలు మొగ్గలెత్తినట్లుండే మగనాలుతోపొందు ఎంతోమధురం. అయినవాళ్ళు ఇటువంటి సాంగత్యానికి ఆశ్రయమివ్వరు. కాబట్టి ఎవరూఎరుగని దూరదేశం తరలి పోవాలి. అక్కడ అదుపులేని ఏకాంతం. జాడిదేశంవారు భారీమనుష్యులు. అటువంటి దోరవయసుగల జాణపొందుతో పులిసిపోవాలని కోరికలు.

ఇంతవరకు మదిరాయతనయనలయినవారి కన్నుల్లోదాగినకాంక్షలు పండుగలో పురుషాయితానికై ఉగ్రూతలూగుతున్నాయి.

**కత్తులవారి అరుగులమీద దొంతిమల్లెల బంతిచెట్టు**
**మేముదెంగిన కత్తులయ్య దొంతులేరి బంతులుగట్టు**

ఇదే వరసలో వారి నోటి నుండి దొర్లిన ఒక దిగువ పాట

**అల్లుడివైతే గొల్లిగాడివయితే, రారా ఇల్లరికానికి**
**జాకెటు తెచ్చి, లంగాలుతికి, మడతలుపెట్టి మాయమ్మకిచ్చే**
**గొల్లిగాడివయితే రారా ఇల్లరికానికి**

'అమ్మకు...'అనే ప్రయోగం జానపదులలో ఒకచతురుకు బదులిచ్చే మెరుపు. పగలంతా కందిచేలో పనిచేసిన ఆడది, తోటి కూలీతో 'పొరకలు నీవేతీసుకుపోయి, పొయిలో పెట్టుకో' అన్నది. 'నీవే తీసుకపోయి దడికట్టు. అందులో నీకూతురు నేను ఉంటాం' అన్నాడుమగాడు. 'నీయమ్మని...'అని పొరకపట్టుకొని కొట్టవస్తున్నట్లు బెదిరిస్తూ ముందుకడుగేస్తుంది ఆడది. వాళ్ళిద్దరిది మనసైనవరుస. వాడుంటానన్నది కూతురుతోకాదు (వయసునుబట్టి అసహజంకూడ). పైపాటలోకూడ తనబట్టలుతక మనడం, మడతలుపెట్టి అమ్మకివ్వమనడం గడుసైన విసురు. ఇవి బజారునపడి

తిట్టుకొనేటప్పుడు కర్ణకఠోరంగా ఉంటాయి. కాని ఏకాంతంలో పాటకజనం వీటికి బదులిచ్చే హావభావాలచందమే వేరు.

**రోలు – రోకలి :**

**జొన్నచేలో ఓ యత్తా - మాయ లేళ్ళే పడ్డవో - జనకూర జనవిల్లో**
**రోకలి విల్లుచేసి - రోలైన అమ్ముచేసి - మాయలేడినేయమ్మో**

ఆపడ్డవి లేళ్లుకావు. పొలానికి రోలురోకలి మోసుకుపొమ్మని అర్థంకాదు. ఒక ముగ్ధకు ఒకజాణ ఇచ్చేసలహా. విల్లు, అమ్ము, రోలు, రోకలి లైంగికసంకేతాలు. రోకలి పురుషునికి, రోలు స్త్రీకి అన్వయించేదిపోయి, వాటిని తారుమారుచేసి రోకలిఅమ్ముగాను, రోలును విల్లుగాను ప్రయోగించడం జాణకోరుకునే వేడుక. కళాపూర్ణోదయంలో సుగాత్రీ శాలీనులు తాము పురుషుడు స్త్రీగా మారిపోయి ఆనందిస్తారు.

**అత్తకూతురుచ్చల బాల - ఉత్తకిచ్చిన నేనొల్లనా**

అత్తకూతురుకు ఓలి ఇవ్వనక్కరలేదుకాబట్టి విలువతక్కువ అనుకుంటావేమో పండుగనాడుకూడా ఊరికే ఉత్తుత్తికబుర్లకు ఎవతెపోతుంది! ఊరికేపోతే చులకన. ఏదో కానుక ఇచ్చినా తీసుకున్నా ఇదీ ప్రచారం.

**రంకుచేసి బొంకుచేసి గాజులు కొన్నదో కిలింగిచ్చ సోంబేరి**
**గుమస్తావాడితో గుద్దుకున్న లంజ...** (గుమస్తా: వెదురుకూపు గుమస్తాలు)

**నల్లసామలంకలకాడ - నెమలిపిట్టలు నెలవుగొన్నవా**
**నీటుగల్ల మాయనగాడు - మాటమీద మాటువేసిడా**

మగడు సరసుడు, సోగ్గాడు అని చెప్పుకోవడం ఒక ముచ్చట. 'సవతివే' అని తిట్టడం పొగరెక్కినదానిని సాధించేతిట్టు. 'చింకులుబొంకులు సింగారించుకొని మగడి జాడవెళ్లే' నెమలి అభిసారిక. దారిలో ఎదురైన జంతువులను 'ఏనుగు ఎత్తుమోర', 'గుర్రం గుంటికాలు', 'డొక్కి దొర్రకన్ను' అని వంకలుపెడుతూ పోతుందట.

వదినతో మరిది వరసలు, మరదలుతో బావ సరసం, అల్లుడికి అత్తమీద ఆశలు, తాత – మనుమరాలు (కూతురు కూతురు) పరాచకాలు, ఎంత చిన్నదైనా మేనల్లుడికి కూతురును మాటలలో కట్టపెట్టడం, ఇవన్నీ గిరిజనులనుండి జానపదులు, నాగరికుల

వరకు ఇష్టమైనసరసాలే. ఈ అంతర్గతమైన కాంక్షలతో మానజాతి ఇంకా పంకంవదలని పద్మమే. గిరిజనసమాజంలోకూడా ఆడవారిది రెండోస్థానమే కాబట్టి, తమకు సందు దొరికినపుడు వారు పురుషుడికి రెండోస్థానంఇస్తూ ఆటపట్టిస్తారు.

**దప్పిసిడగలు :**

**చంకనున్న చిట్టిసిడగలు - గుబ్బట్లాకు దప్పిసిడగలా**

సిడగ – చిన్నకల్లుడిప్పలు, పడుచుదాని దప్పితీర్చడానికి సిడగలో కల్లుమోస్తున్నావా!

**పిడెముసాటు పిట్టవేటో - పిట్టకు వేసాంచిన్నతమ్మ**

**విల్లులాగి చూసిఘాట - మిట్టవేసి దెబ్బతీతువా**

(పిడెం – వెదురుపొద; మిట్ట – పిట్టలనుకొట్టడానికి నారసలు అనగా ఇనప ముక్కులుకాక చిన్న వెదురుగొట్టం (తున్ను) తొడుగుతారు; విల్లు యువతికి, మిట్ట ఘాటుకు సంకేతాలు).

ఆ ఘాటుకు హితబోధ :

**ఇండిగల చేనుచేసి - పండుదాని నమ్మకుండరా**

ఇండిగలు సన్ననిముళ్లున్న కంపలు. ఆ కంపలున్న చేను చేయకు, ముసలిదాన్ని నమ్మకు. ఈ పండుగలో ఉయ్యాలవేస్తారు. దానిమీదపెట్టి ఇవే వంకరకూతలు.

చింతమాను చివటలలో – తూగుటుయ్యల :

**చింతమాను చివటలలోన - చిన్నబాల తూగుటుయ్యలా**

**వీరూగ వారూగ వెడ్డిగోవు - విరుగనూగ - కన్నెఘాటు కలగ నూగ**

ఈ కబుర్లకు సంతలదారికంటే అనువైనచోటు ఇంకేముంటుంది.

**సంతలదారి చెప్పంటివి - నీళ్ళదారిన కలుసుకొందమా**

**దార దార దప్పలాయె - దారినీళ్ళు దూరమాయివా**

**బందుగుల చిన్నబుల్లి - మత్తు మత్తు పానాలున్నవా**

**లిల్లిబూచు లిల్లిలేవోయ్ - లల్లకాదు బాలకోడలా**

చుక్కపడితేగాని చురుకురాదు. కొండలలో దిగినంతసేపు దారనీళ్ళు. బండి బాటలో నీళ్ళులేవు. ప్రాణం హుషారులేదు. సారా పోయిస్తాడేమో – అడుగుతున్నాడు.

జతగాళ్ళతోకూడా ఇదేపురాణం. వీళ్ళంతా జగిలేళ్లు (తోడల్లుళ్లు, ఒక దానికోసం పోయేవారు).

**మీరు మేము తిరిగేదారి - పచ్చగడ్డి మాడిపోయెదా**

పదిమంది తిరిగేదారిలో పచ్చగడ్డి మొలవదు.

**అమ్మిబోర ఉమ్మగున్నది కో... కోడలమ్మా**

**ఉమ్మడిగింజలు - కమ్మగున్నవా**

**(బోర-రొమ్ము; ఉమ్మగ-వెచ్చగ)**

**అట్టెచూసి అమ్మికిలాగ - కొమ్ములుకోసిన గొర్రెకులాగయా**

**(కొమ్ములుకోసిన గొర్రె: గుబ్బలులేని స్త్రీ)**

**ఎలుగుచర్మమో చర్మమోగాని - ఎంతగుంజిన తెలుపేలేదు**

**సింగవరపు సంగువలోన తేలగుంజిన తెలుపేలేదు.**

**ఎట్టిటి చండ్లది మా వదిన - ఎందుకో గాని రమ్మన్నాదోయ్**

**వగలువగలువద్దు గుంటడ - వాగదీక వగ్గదీసిరా (వగ్గ-గొయ్యి)**

ఈపదాలన్నీ ఆయాసందర్భాలలో దొర్లే హాస్యాలకు–మనస్సులో పడినముద్రలకు కవితారూపాలు. పండుగనాటిరాత్రి పాడుకొనే ఈపదాలు వాదప్రతివాదాలు.

## మనసుకు మంచివారము – మాపటికి దొంగవారమా :

సరదాలతో రెచ్చిపోయే పడుచులనుచూసి లొట్టలేసే లేకిజనానికి, గిరిజనులు పెట్టేవాతలు, విలువలుకోల్పోయిన నాగరికతకు హెచ్చరికలు.

**ఆటమనదే పాటమనదే - అన్నివిద్యలుగల్లవారము**

**వేటమనదే వెట్టిమనదే - వేయివిద్యలుగల్లవారము**

**కొలువుమనదే కొలతమనదే - కోటివిద్యలుగల్లవారము**

**వీట్లంకాము విద్దెలంకాము - వేడుకల బాలలము**

**జంగం కాదు జోగుకాదు - జోటలుండే బాలలము**

**అమ్మవారుయున్నప్పడు - ఆడేపాడే బాలలం**

**మనసుకు మంచివారము - మాపటికి దొంగవారమా**

**సపిరెలు తొక్కవాలె - చాపచుట్టు చుట్టువాలెయా**

**గుళ్ళచుట్టు చుట్టవాలె - గుమ్మళ్లు ఆడవాలెయా**

**గుంపెనలాడవాలె - గుళ్ళచుట్టు చుట్టవాలె**

వీట్లు – వీటి మేళమువారు (బోగంవారు), విద్దెలు – ప్రదర్శనకువచ్చి డబ్బులు దండుకునేవారు. జంగం, జోగు బిచ్చమెత్తుకునేవాళ్ళు. మనసుమంచిది, వయసుచెడ్డది. మనిషి సమాజంలో ఒకడుగా దాని నీతినియమాలను ఆమోదించాలి. సమాజంకూడా సమష్టిహితం దెబ్బతినకుండా, మనిషి ఉత్సాహానికి దారులుకల్పించాలి. ఈ వాస్తవాన్ని ఆమోదిస్తూనే జానపదులు వ్యవస్థను గౌరవిస్తారు. వయస్సును మన్నిస్తూనే మనస్సును సరిపెట్టుకుంటారు. ఆడుతూపాడుతూ పాతనేస్తాలు చేరువౌతారు. కొత్తనేస్తాలు మనసు విప్పుకొని జతకూడి ఆలుమగలౌతారు. జానపదుల ఆదర్శాలు సాలప్రాంశువులుకావు– వారు మరుగుజ్జులు కారు. ముందు వెనుక ఉండే నీడవలె వారి ఆదర్శం, అంతరంగం అడుగుదూరంలోనే ఉంటాయి.

మధ్యప్రదేశ్‌లోని మెరియాలఘోటుల్‌లో (పెండ్లికాని యువతీయువకులు రాత్రిగడిపే చావడి) గాని – ఈ పండుగలలోగాని, స్త్రీని పదుగురుపంచుకొనే బహుమానంగా ఎవరూ భావించరు. ఆత్మవినాశకరమైన, స్వైరవిహారం ఏసమాజం సహించదు. కాని అనేకమైన ప్రలోభాలతో యీసమాజాలను కీలుబొమ్మలుగా, అంగడి బొమ్మలుగా మారుస్తున్న ఘనత నాగరికతదే.

**రాజరాజ్యము రంపరాజ్యము**

**రాజువచ్చి చేయి వేయ**

**రాజమంత తొనుకుతొనికె ॥**

రంపరాజ్యం పద్నాలుగవశతాబ్దినాటిది. వెలితిగాఉన్నకుండలో నీళ్ళు తొణికినట్లు బయటివారి అందచందాలకు, భోగభాగ్యాలకు గిరిజనసమాజం విలువలు తొణికి పోతున్నవి. ఈ వెలితి, నాగరికతను అందుకునే తొందరలో తొణికినఫలితం. కాని వారి యీకుతూహలాన్ని అదనుగాతీసుకొని, మన్యం ప్రాకిన వ్యాపార, పాలకవర్గసంస్కృతి సొమ్ముచేసుకొనే నీచానికి దిగజారిపోయింది. ఇంతచేసి గిరిజనుల స్త్రీపురుష సంబంధాలగూర్చి అధికప్రసంగంచేసేదీ వీరే. వీటన్నింటికి తగిన సమాధానం ఉన్నది పైపదంలో.

## గుమ్మళ్ళు - డోలగతులు - కోలాటం :

సపిరి – ద్రుతగతిలో వలయమాడడం. శబరినదినికూడా సపిరె అంటారు. సపిరె చాలాదుడుకుగా సుడులుతిరుగుతూ ప్రవహిస్తూ గోదావరిలో కలిసేనది. గుమ్మళ్ళు ముందు వెనుకకు జోగుతీసుకుంటూ నడుములుచేతులతో అల్లుకుని, తాడువేసిన చెరకు తోటలవలె మంద్రగతిలో వలయమాడడం. ఈ గుమ్మళ్ళు భారతీయజానపద నృత్యాలకు భూమికలు.

పిల్లగుమ్మళ్ళు, శివాలుగుమ్మళ్ళు–శివమెత్తినవారివలె కూర్చుంటూలేస్తూ ఆడడం
జోగుగుమ్మళ్ళు– ముందుకువెనుకకు జోగుతీసుకుంటూ;
బారుగుమ్మళ్ళు– వరుసలో,
కోటగుమ్మళ్ళు–ఠీవిగా ముందుకు;
చాపచుట్టుగుమ్మళ్ళు– 'సపిరె' చాపచుట్టినట్లు లోపలకు ముడుచుకుపోవడం
తీయగుమ్మళ్ళు– చాపచుట్టు విడిపోవడం

ఈ గుమ్మళ్ళుతీసేటప్పుడు వాయించేడోలగతుల ధ్వన్యనుకరణం 'పండిక దండలు', 'తప్పితెగరగలు', 'పాతకోటభరతం', 'బొడ్డుకిందబొక్క', 'దెబ్బలగూటం', 'కరిణిక దెబ్బలు', 'పణముకు జంపం'.

**చల్లకోలాట వేయవాలె కో... కోడలమ్మ - చల్లకలుపులు కలపవాలెయా**

చల్లకలుపులు – భూదేవిపండుగలలో వెదురు, బొప్పాయిగొట్టాలతో నీళ్లు చల్లు కోవటం. ఈ వేడుక విశాఖలో ఇటికలపండుగను, తెలంగాణంలో హోలినితలపిస్తుంది.

**ఆడవాలె పాడవాలె – వేడుకీలు చేయవాలెయా :**

ప్రకృతి – పురుషుల సమాగమంగా భావించే భూమి – పంటప్రమేయంగల ఈ పండుగలన్నిట పరాచకాలు సమాజం అనుజ్ఞపొందినవే. ఈ ఆటపాటలు, జీవన భారాన్ని మోయడానికి కావలసిన సులువును, లయను అలవాటుచేసి, సమాజాన్ని సామరస్యంతో నడిపే సౌందర్యస్రవంతులు. నాగరికతలో ఎన్నోసాధించిన మనం, ఈ మనోధర్మాలనేనాడో కోల్పోయినాం. ఇవన్నీ ఎవరునేర్పారో ఈ కౌపీనవంతులకు.

**అడవిలోన నేదులార నడుములెవ్వరుదిద్దిరో లేవోయా ॥అచ్చుకోడ॥**

## నడుముసన్నం నాగబంధం – తగిలి పొడిచిది పిగినిపిట్ట :

ముళ్లపందిజాతికి చెందిన పెద్దపందికొక్కంత జీవం నేదుపంది. కలుగులలో, రాతి కట్టువలలో ఉండేదాని నెరుగనిమనం, దానినడకలో అందాన్ని ఏం ఊహించగలం! కాని కందిరీగనడుమును మన కవిసమయాలలో దక్కించుకున్నాం. ఆ కణుదురు గిరిజనుల జిటలలో (పొడుపు కథలలో) 'నడుముసన్నం నాగబంధం – తగిలి పొడిచిది పిగినిపిట్ట'. ఈ కణుదురును గద్దరివదినగా ముందు వర్ణించారు.

**చెప్పిచెప్పి యీడవాలె - మప్పిమప్పి దెంగవాలెయా**

**ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలెయా**

**రోజురోజు తుళ్ళవాలె - ఒక్కరోజు దెంగవాలెయా**

**నులుపులది నూలిగడ్డ - వలపుతోడి వంగదీద్దరా**

(నూలిగడ్డ – అరగదు. చాలసార్లు వార్చాలి)

**ముత్తెపుకాయ మగనాలికాయ - తర్రెపుకాయ తగవుల కాయయా**

ముత్యంలాంటి మగనాలు; కాయకస. పండుపస, దోరగాయరుచి, ఈ కాయ వయస్సులో వట్టి జగడాలమారితనం; నువ్వంటే నువ్వనడం బెట్టుపోవడం తప్ప ప్రేమలో లీనమైపోవడం, అనుభవంలో అర్పించుకోవడం తక్కువ. అస్తిత్వపు నిక్కు ఎక్కువ.

**బుగ్గలేరి ముద్దవాలె- మూడుదంపులు దంపవాలెయా**

మెండికెత్తేవారి మీద ధూర్తత్వం –

**కుల్లికూర డొంకలోన - కుల్లగొట్టి మల్లపంపిరా**

**బక్కతొక్క మామిడి కింద - తోకలువచ్చి పాకలు కాల్చివా**

ఇటువంటి కోరికలనే వెనుక జతకత్తెలు నెమరువేసుకున్నారు.

**దుక్కులమొహం పెండ్లికొడుకు దుక్కుల వెంటరమ్మన్నాడు**

**కండపిచ్చ కత్తులయ్యు - దెంగలేక డొంక దొలువులా**

**సంతలదారి సామచేను - సామచేను పండింది మేలు**

**కదలగోవు పట్టింది మేలు**

**చెదిరిన బియ్యమె మేలు - చెదలగోవు పట్టిందిమేలు**

**బుడ్డడికి బులుపురాగ - బుడ్డిముప్వలూడదంచిడా**

**కాయకూర కట్టువలోన - కణుజు దెంగిన...**

**బొక్కు తెంచిన బొంతబియ్యం - పిచ్చతెచ్చిన పిల్లి మాంసమో**

**ఆడవాలె పాడవాలె - వేడుకీలు సేయవాలెయా**

పూజారి గ్రామనాయకుడు. కాని వీళ్ళ నోళ్ళలోపడి వాడిపెళ్ళాం కర్మమిట్లా కాలింది.

**పండుగుల పారురాగా - పుండుగుద్ద పులిదెంగిదా**

అడవిదయ్యాలకు పులి సంకేతం. పులిదెంగడం – ఋతువు కావడం (చూరు ముట్టు) మయల గల స్త్రీని దయ్యాలు ఆవహిస్తాయని నమ్మకం 'పులిదెంగిన ఘాటా' అంటే దురదృష్టవంతుడా అని తిట్టు. పూజారిపెళ్ళాం ముట్టయితే పండుగ వాయిదా పడుతుంది. ఈ పదంలో పూజారి అనే మాటలేదు. కాని పూజారిభార్యతప్ప ఎవరు ముట్టుఅయినా పండుగ వాయిదాపడదు.

**మరదలకు మన్నిందాము: వదినగారు – పెండ్లికూతురు:**

పండుగలో మరదలును ఈ విధంగా మన్నిద్దాం అంటాడోతుంటరి

**మరదలకు మన్నిందాము - మక్కలకిందకి పొందిందామోయా**

**పెండ్లిపొడుగునా మీరురాగ - యుండుగాద వదినగార -**

**పెండ్లికూతురనుకుంటిమా**

**మియ్యతోటి నేనుండగ - మీయమ్మతోటి తప్పకుపోతివా**

మరిదివరుసయిన ఒకడికంటికి వదినగారు పెళ్ళికూతురిలాగే ఉంది. 'పెండ్లిలో చివరిదాకా పెండ్లికూతురు వెంటవున్న మీరే అసలు పెండ్లికూతురు అనుకున్నాం' అని వక్రంగా మెచ్చుకుంటున్నాడు. తండ్రితో మర్యాదకు మాట్లాడుతుంటే, తల్లితో కలిసి జారుకుని ఒకతె 'చెయ్యిచ్చిందట'.

అంతా అయినవాళ్ళున్న ఆఊళ్ళలో, తాగే సరికి నోటికి అడ్డూఆపు ఉండదు. పురుషాయితంతో తీరలేదు – ఈ పండుగలోకి చేరిన వేరే ఊళ్ళ పడుచువాళ్ళంతా మా బానిసలేనని ప్రగల్భాలు.

**కొండకింద కడారి కోట - కోకలిచ్చి మేమే కొన్నాం**

**ఊరికింద ఉరుములకోట - ఉమ్ములిచ్చి మనమె కొన్నాం**

**గంతవెనుక గవ్వలకొండ - గవ్వలిచ్చి మనమే కొన్నాం**

**కొత్తది తాడేపల్లి - కోవలిచ్చి మనమె కొన్నాం**

**రావి కిందరోలువేసి - రావోయి చాన సామలుదంచనూ**

వీళ్ళు యిలా పేట్రేగి పోతుంటే – మగవాళ్ళు బిక్క మొహాలేస్తున్నారు.

**పదమెరుగని పండుపిల్లులు :**

**తాడేపల్లిమగవారు - పదమెరుగని పండుపిల్లులా**

**డివ్విడివ్వి గగ్గలవారు - డిప్పబుర్రల పిర్రలవారోయా** *(గగ్గ-పొట్ట)*

**గనగన గంటలవారు - గంగిరెద్దు పోలికలోయా**

**కత్తిలేని కోతలవారు - కడవలేని వంటలవారోయా**

(చివరిపదం దేవతలయెడ పలికేది. అది మానవులకు వర్తింపచేస్తే నిత్య దరిద్రులని అర్థం)

**పిల్లలను పెంచని పండడు :**

**వాలు వాలు కోకలవారు - వాలమూరి రెడ్డికొడుకులా**

**పేరుకు పెద్దవాడవు - పెదవంపు ముడ్డివాడవా**

**తీర్పుకు పెద్దవాడవు - తీగవంపు ముడ్డివాడవా**

**పిల్లలను పెంచనివాడు - బండలుదెంగిన బచ్చలపండడా**

(బచ్చల=ఇంటి పేరు)

పండుగలలో ఇటువంటి పాటలు పత్రికలలో (కార్టూన్లు) హాస్యచిత్రవ్యాఖ్యల వంటివి. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లైన గిరిజనసమాజం వాటినుండి గుణపాఠం నేర్చుకొంటుంది. వారితోపాటు తానూ నవ్వుకుంటుంది.

**ఈ కామశాస్త్రోపాధ్యాయినుల మెప్పుపొందినవాడెంత అదృష్టవంతుడో!**

**అడ్డపూవు అందగాడు - అందరికి తగ్గవాడురా**

కొండలమధ్య ఇరుకైనలోయలలో, కాలువలప్రక్కన లంకలలో, మామిడి, వేగిస,

బండారు, మద్ది, నేరేడుచెట్లు సూర్యకాంతికోసం చాలఎత్తు పెరుగుతాయి. వాటిని అల్లుకున్న గిల్ల, అడ్డ, పిప్పిడి మొదలైన తీగలు, కొమ్మలనన్నింటిని చుట్టుకొని మూడు నాలుగుచెట్లకు కలయబాకి, బిగిసి వాటిసిగలను బంధించుతాయి. ఇలాపాకే అడ్డతీగల ఆకులు (విస్తరాకులు) జతలుజతలుగా పెద్దగా, పచ్చగా, వత్తుగా అల్లుకుంటాయి. ఈ పచ్చని ఆకులమధ్యలో చిన్నచిన్న తెల్లని అడ్డపూలతో, నక్షత్రాల కౌగిలిలో ఒదిగే రజనీకాంతవలె అడవి ఉంటుంది.

వీడు అడ్డపూవువంటి అందగాడు – వయసుగత్తెలనెందరినైనా తన కౌగిలిలో ఇముడ్చుకోగలడు.

**లచ్చిపిల్ల మంగిపిల్ల - అచ్చమైన రామచిలుకలా**

**చింతకింద బొంతచేను - చిలుకపిట్టలు రాపమాడివా**

**కన్నమరిది వత్తుడని కణతబొట్ట కాసి పెట్టిదా॥** ***(కణతబొట్ట - కిటికీకన్ను)***

**చలికూడు – పులికూడు :**

అడ్డతీగల (తూర్పుగోదావరి) వైపు పల్లపునేలలకోసం అన్నివృత్తులవారు చేరారు. పండుగబసలోకివస్తున్న చాకలినిచూసి దుచ్చెర్తి గ్రామంలో...

**ఓ... చాకిత చాకిత ఓయి చాకిత!**

**చాకిత నీ మగడు - చలికూటివాడు**

**చలికూటివాడు కాడు - పులికూటివాడు॥**

జంతువునుకొట్టినవెంటనే పులి వేడిరక్తాన్ని పీలుస్తుంది. నమలడానికి దౌడలలో పండ్లులేవు. కాబట్టి ఎముకలు లేని పెద్దకండలనే తింటుంది. మిగిలిన మాంసంలో దుమ్ములుతీసి, రెండుమూడుగంటలు శుభ్రపరుచుకొని (ఎముకలు అంగిట్లో గుచ్చుకోకుండ) తింటుంది. ఎటువంటి ఆటంకంలేకుండ ఒక్కసారితింటే మరల వారందాకా తినక్కర లేదు. 'దొరికితే పులాహారం – దొరక్కపోతే పామాహారం' (గాలి). సాయంత్రం ఆరు గంటలకు అందరికీ సందెకల్లువేళ. అప్పుడు కల్లు సరిగాఅందదని, చాలదని ముందే పులివేళపోయి (సాయంత్రం నాలుగుగంటలకు) కల్లు త్రాగుతారు.

'నామొగుడు చల్ది తినేవాడు కాడు. పులిబంతిలోతాగే ముఖ్యుడు. కడుపు నిండా

తినేవాడు. పులివలె మాంసం దాచుకుంతిటాడు కాని ఎంగిలి తినడు' అని చాకిత నోరు మూయిస్తున్నది.

వాల్మీకులు పండుగబసలోకిరారు. మునసబువెంటనో ముతాదారువెంటనో వస్తున్న బంట్రోతు(వాల్మీకి)ఒడ్డున 'పంటకళ్ళాలెన్నో-పాడుకళ్ళాలెన్నో' ఎంచుతున్నాడు.

**దుండిగోసి దూరి ఘూట - ఏలవస్తివి ఘూట**

**చచ్చిన బక్కలు - పాణపు బక్కలు చూడవస్తినయ్య ॥**

వాల్మీకులు బక్కల వ్యాపారంచేస్తారు. అవి చూడవచ్చానని చెపుతున్నాడు. మంత్రి వెనక పోలీసువలె, వాడు మునసబువెనుక వస్తున్నాడు. వాడు దేనికోసం వెతుకు తున్నాడో పసిగట్టిన గుబ్బట్లు –

**రాజు – బంట్రోతు :**

**ఎంట్రీత ఎగిరిపోయె - తుప్పతూలిపోయె**

**రారోయి బంట్రోత - రాజు తేలిపోయె**

**లేలే లేల లేలమ్మారో - ఓలే లేల లేల**

**లేల లేల లేలయ్యారో - ఓలే లేల లేల ॥**

పక్షులలో వేటగుంజి (గుడ్లగూబ) రాజు. బింగిరాజు (భృంగరాజు) బ్రాహ్మణుడు. తిత్రికపిట్ట చెడుపుముండ. ఎంట్రీత కొండరాజుల కోలగాడు (దీన్ని హిందీలో కొత్వాల్ అంటారు). చుట్టువున్న అన్నిపిట్టలను ఎంట్రీతపిట్ట తరిమివేస్తుంది. అలా అందరిని తరిమే ఎంట్రీతనుతరిమే అవకాశం ఇప్పుడు పడుచులకు చిక్కింది. ఓరి ఎంట్రీత! నీవు వెతుకుతున్న నీస్నేహితురాలు ఎప్పుడో పారిపోయింది. ఆ తుప్ప పాడైపోయింది. ఇక్కడ నీ రాజును జనం గుంజీలుతీయిస్తున్నారు. వాడిని త్వరగా తీసుకుపోయి పరువు దక్కించుకో అని హెచ్చరిస్తున్నారు. ❉

**సాగినంత సంబరాలు :**

సమాజం గీసిన సరిహద్దులు సడలిపోయినా, అవకాశాలు అందుబాటులోకి వచ్చినా, 'ఇక్షుశరాసన సాయకవ్యధాఖిన్నత వాడివత్తలై, వెన్నవలెం గరుంగు అలివేణుల కౌగిటచేర్చు భాగ్యమబ్బినా' శరీరశక్తికి మితమున్నది. కానీ కోరికలు ఉపశమించవు. అర్ధం తెలియకపోయినా, స్పష్టంగా తోచకపోయినా, ఇంకా ఏదో అందని, పొందని దానితో శరీరాలను అధిగమించిన ఐక్యతకోసం, ఆనందంకోసం హృదయాంతరాళంలో తప్పటడుగులువేస్తూ, వెతుకుతుంటుంది.

బందుగుల బాలలార - సాగినంత సంబరాలు ॥ఆడవాలె పాడవాలె॥
గొట్టియాకులు దూయవాలె - గోదారెనుక వేయవాలె
కారుయాకుల దూయవాలె - కమజరెనుక వేయవాలె
సీలియాకుల దూయవాలె - సీలెరెనుక వేయవాలె
కట్టెడాకులు వాడవాలె - కాడ ఓరెలు తప్పవాలెయా
పిడికియాకులు వాడవాలె - పిరంగిదెబ్బలు తప్పవాలెయా
గుంపెనరోలు గుమ్ముడురోలు - గుమ్మడిచక్కలు కమ్ముతరోలుయా
జువ్వికొమ్మలు జువ్వవాలె - మర్రియూడలు దిగవాలెయా

**తేలు తేలు ఓ చందమామయా :**

ఆడి పాడి అలసి ఊరు నిదురపోతుంది. దూదిపింజలవలె తేలిపోతున్న పిల్లమబ్బులలోనుండి చందమామ సాగిపోతున్నాడు.

ఓ... తేలు తేలు ఓ చందమామయా - నీతెలుపులు సూత్తును
నా తెలుపో ఏమిటి సూత్తురు - నా తెలుపు, తేనేపిట్ట తెలుపులు
నడువో నడువో ఓ చందమామయా - నీనడకలే సూత్తును
నానడకో ఏమిటి సూద్దురో నా నడక - నెమలిపిట్ట నడకలు
పారు పారు ఓ చందమామయా - నీ పరుగులె సూత్తును
నా పరుగు ఏమిటి సూద్దురో నా పరుగులు - పారుపిట్ట పరుగులు
గుంకో గుంకో ఓ చందమామయా - నీగుంకర్లె సూత్తును
నా గుంకర్లో ఏమిటి సూత్తురు నా గుంకర్లు - గువ్వపిట్ట గుంకర్లు

*నెమలిపిట్ట నడకలు, పారుపిట్ట పరుగులు, గువ్వపిట్ట గుంకర్లు*

**అంతటి తాణ్డేపల్లి - అంటిపువ్వుల నేతకట్టు**
**వెన్నెల్లో తాణ్డేపల్లి - వెండిసీలల నేతకట్టు**
**ధూళితుడిచి కట్టినాము - దుర్గమంత తాణ్డేపల్లి**
**పాడుతుడిచి కట్టినాము - పట్నమంత తాణ్డేపల్లి**
**పచ్చగోడల తాణ్డేపల్లి - వెన్నెల్లో వెలిగిపోయే**

పేరెము = పందెము వేసుకొని పరుగెత్తుట

పోలుపోయు = పెండ్లిపందిరిలో పిండిముగ్గులుతీర్చి బియ్యమువరుసగా పేర్చువిధానము

*– మాండలిక పదకోశము. సాహిత్య అకాడమి 1970*

# విశాఖగిరిజనుల పాటలు

(బగత, కొండదొర, కొండకమ్మరి, వాల్మీకి)

అందమ్మైన నందపురమును - నందియాటలె ఆడివద్దాం
తీయగుమ్మడి తీసివద్దాం - మళ్ళుగుమ్మడి మరలివద్దాం

✿ **వెలవెలపోతున్న బయళ్ళు**

ఆలపాటలు

కాసిపూసె కన్నెవయసు – కాయలేను కన్నవార

ఆలికి అరవై – ఓలికిముప్పై

మాయలదిముంత

దూరపు సంబంధాలు

ఆలిజగడాలు

దారకొండ బేరగాడు

అత్తమామలను నిలదీస్తున్న కొత్తకోడలు

చాటుసరసం

వదిన – మరుదులు

నీవు నీళ్ళిచ్చేవు నీ కోడలేది

మహిమకు చిత్రిక

సీతారాములు – శివపార్వతులు – పాండవులు – గొంతెమ్మ

జాతులు – రీతులు

✿ **లోకాన్ని గెలిచిన చెల్లెలు**

ఉరులలో ఉండిపోయిన సోమమ్మ

సోకులు – వగలు – గుచ్చుకునే ముళ్ళు

కాముడికి లంచం

జోలపాట

గో – వ్యాఘ్ర సంవాదం

లొల్లోసి పాటలు

ఇటింపండుగ పాటలు

కమ్మరి లచ్చుముడి కారేలు మిరేలు

ఆలినివ్వక అడుగరాదు

పితూరీదండు

మినుములూరు బాటరావాలె – ముఠాదారికట్టు పోవాలె

✲ **మోదకొండమ్మ కథ**

✲ **మోదమ్మ పదం**

మీలాటి కాలమురాగ – మిమ్ముతలచి పాడుతాము

దేశిరాజులు – దుర్గాండ్లు

దుర్గాండ్లు

దేశిరాజులు

దుర్గాండ్లు

కొత్తపల్లి ముక్వలమ్మ

దొంగ పెండ్లిండ్లు

ఏడుగడియల శిక్ష – ఆత్మహత్యలు

తీర్థయాత్రలు – వెంకటేశుని దుర్మరణం

సంజీవరాజు పుట్టుక

మేళాలకు కదిలే గంగుగారు

వేటలకు కదిలిన సంజీవరాజు

పూలగండువనంలో గంగుగారి ఆలపాటలు

కావళ్ళు మోస్తున్న సంజీవరాజు

మాలగంగువద్దకు మాకలిశక్తి

పెళ్ళిఏర్పాట్లు

గంగు – సంజీవరాజుల కల్యాణం

✲ **దొంగపెండ్లి – గౌరవంగపెండ్లి**

తప్పు – వెలి; సంకెళ్ళు – కారాగారశిక్ష

ఉంచుకోవడం, వెలివేయడం, పెండ్లిచేయడం

పల్లాన పదివేలమాయలు

## వెలవెలపోతున్న బయళ్ళు :

చుక్కలు తేలివో - చూసెవారు లేరు -
వెన్నెల తేలిదొ - ఆడేవారు లేరు
చుక్కల సురిటిపల్లి - చూడగల్ల బయలు -
వెన్నెల వెదురుపల్లి - ఆడగల్ల బయలు.

గిడసబారిన వ్యవసాయం, మట్టిజారిపోయి ఈచుకుపోతున్న కొండచెలకలు, గరువులు; పెరిగిపోతున్న ఖర్చులతో భారమైనబతుకు విశాఖగిరిజనులలో సరదాను హరించివేశాయి.

మేనెల మధ్యలోనే విశాఖమన్యం తొలకరిస్తుంది. ఆ 'ఇటిం'నెలనుండే పనులు మొదలు. 'లంజేటి', 'బైశాగి'లలో కొండచేలు, గరువులుదున్ని, విత్తి 'బందపని'లో వరిచేలో దమ్ములకందుకోవాలి. 'ఆవిటి'కి పసుపు, పిప్పలి నాటుకోవాలి. సవితి, పలకాలనుండి శివరాత్రివరకు ఇల్లుతేలనీయని మంచు. చావడిలో నెగడు వేసుకు-నేందుకు చాలినన్ని దుంగలు దొరకవు. ఫిబ్రవరిలో పిప్పలి, పసుపులు కవ్వడం (తవ్వడం) కొండచీపురు యేరడం, ఎక్కడెక్కడికోపోయి ఇంటినేతకు కోపిరిగడ్డి తరిగి తేవడం, ఒక్క ఇటింపండుగలోనే పనులు ఒగ్గేసి కాస్త సరదాగా ఉంటారు.

ఉరూరా ఒరియా, తెలుగు పౌరాణికనాటకాలునేర్చి, చమ్కీదుస్తులు, పూసల కోట్లు, తళుకుకిరీటాలు, పట్టాకత్తులుధరించి వేషంవేయాలని మగవారి ఉబలాటం. జముకులకథలు, చోడి నేర్చేవారుకొందరు. 'దెశియా'పాటలు అంత నీతిగల్లవికావనే సంస్కృతీకరణపు ప్రచారం. 'మాలవారు పాడతారులే', 'నరికె తుడుము సన్నాయి వాయించే పొరజావాళ్ళు లేరు' - 'ఆట సూటిగారాదు' అనే వంకలు, సాకులు, చిన్నతనాలవల్ల బయళ్ళన్నీ వెలవెలపోతున్నాయి.

**ఆలపాటలు :**

అయినా దేర్జదారిలో (మందదారి) పెడగా, చెట్టుకు వెదురుగడ దించి కట్టిన ఉయ్యాల మీద, అప్పుడపుడే పైటవేస్తున్న గుంటలు.

**ఓ..................................**

**ఉయ్యాలని వేసినాము - దేవుడని మొక్కినాము**

దేవుడని మొక్కినాము - దేవ దుర్గము బీరమూరు
ఓ... ఉండి ఉండిర పాడబోగ - ఉత్తమైన మన ఎలుగు
సాలఎత్తి పాడబోగ - సవరమైన మన ఎలుగు
కిక్కిసల లంకలోన - కిన్నెరల మన ఎలుగు
ఆలవేసి పాడబోగ - అందమైన మన ఎలుగు

ఉత్త: ఉత్తమమైన ఓ... ఆల; సవరం: సూటి; సాలు: ఊపిరి.

అందమైన నందపురము - నందియాటలెయాడివద్దాం
తీయగుమ్మడి తీసివద్దాం - మళ్ళుగుమ్మడి మరలివద్దాం

ఉయ్యాలవేసి దేవునికిమొక్కి గొంతుసవరించుకుంటున్నారు.

నందపురం జయపురానికి మునుపటిరాజధాని. ఆ దొరలకొలువులో ఆడాలని ఉబలాటం.

**కాసిపూసె కన్నెవయసు – కాయలేను కన్నవార :**

ఎంత తుల్లెవొ సూకురు బొట్టెవో - బారుపల్లిర బయలుమీద
బారుపల్లిర బయలుమీద - బారుతీర్చిర బంతులల్లు
నామీదర దయలుంతె - దబ్బపూవుల బంతులల్లు
నామీదర చింతలుంటె - చింతపూవుల బంతులల్లు

కన్నెవాడుర ఆడెమాటలు - కళ్లు నీళ్లుర ఒలికినట్టులు
కన్నెమామిడి కర్రదాయె - వాడిలేనిర గొడ్డలాయె
వాడి మీదర ప్రేమలాయె - కర్రవిరచిర కన్నుగీటో
గొల్లవాడుర ఆడేమాటలు - గుళ్ళపేరుర కుదిరినట్టులు

మోరి వారిర గంతవెనుక - మోహమెత్తిర వానగురిసె
నీవు తడియగ నేను తడియ - పయిమీదర బట్టతడిసె
పయిమీదర బట్టతడిసె - పడుచుదానను ఏమి చేతు
చంకకిందర బట్ట తడిసె - చేడెదానర ఏమి సేతు
బొమ్మ కిందర బొట్టు తడిసె - బొట్టెదానర ఏమి సేతు

కాసిపూసె కన్నెవయసు, ఓయమ్మలార, కాయలేను కన్నవార
ఆకసాన బండిఒరుగు, ఓయమ్మలార, ఆగలేను కన్నవార
పల్లపమ్మ వీధులలోన, ఓయమ్మలార, గణగణమని గంటమోత
గంగిరెడ్లవాడురాగ, ఓయమ్మలార, గవనితేలి నేనేపోదు
వీటిమేళంవాడురాగ, ఓయమ్మలార, వీధితేలి నేనుపోదు
బూడుబుడుకలవాడురాగ, ఓయమ్మలార, భూమితేలి నేనేపోదు

పోయెదానవు పోదువుగాని - పోలికలు ఉంచిపొమ్ము
వెళ్ళెదానవు వెళుదువుగాని - వేడుకలు ఉంచిపొమ్ము
చింతాలుర చిగురుల మీద - చిలుకలేడుర కూడుకొను
పచ్చచిలుకకు వలపురాగ - కప్పడన్నర మొగలి రేకు

అగినికొండ మొగిలిరేకు - సాలూరిరా సంపెంగ మొగ్గ
సాలూరిరా సంపెంగ మొగ్గ - సావడికిరా ఎదురెండ

దూళినున్న దూలపురుగు - దుఃఖతోవలు చెప్పపురుగు
బండిలోనిర బాలపురుగు - బతుకుతోవలు చెప్పపురుగు

సాధారణంగా మగవారివయసుఎక్కువ – ఆడవారి వయసుతక్కువ. కానికొన్ని చోట్ల మగవాని వయసు తక్కువ – ఆడదాని వయసు ఎక్కువ ఉంటుంది. అయిన సంబంధమని సరిపెట్టడం కారణం కావచ్చు. ఈడుకొచ్చిన పడుచు, జోడుగాని మగడినిగూర్చి వాపోతున్నది. వాడిమీద మనసుందికాని, తగ్గ వయసులేదు వాడికి.

ఆటపాటలలో అందెవేసినకన్నెకోసం, ఎందరోకోడెగాళ్ళు కల్లునీళ్ళవలె తీయగా కైపెక్కించే కబుర్లుచెపుతారు. తాళలేని వయసు – నిలువనీయని అగనికొండ మొగలి రేకులు, సాలూరి సంపంగిమొగ్గలు. ఎంతకూ ఎవడికో ఒకడికి కట్టబెట్టని కన్నవారు. వాళ్ళ పంతాలు, ఆశలు –

**ఆలికి అరవై – ఓలికిముప్పై :**

పూసపాటన్నలు పుణ్యమంతులు - పులిఉన్నకోనంకు వేటకెళ్లారో
పులిచంపి పులిగోరు జూజమడ్డారు - జూజపుకొమ్మెక్కి రాజమేలేరు

**రాజపు కొమ్మెక్కి రంభ పెండ్లాడు - ఆ రంభకడుపున బొమ్మపుట్టిది**

**బొమ్మకైవచ్చిరి బొబ్బిలి దొరలు -ఇమ్మంటే ఈయరు ఈ రాచవారు**

**ఆలికి అరవయ్యి ఓలి ముప్పయ్యి - బొమ్మకు బొమ్మంచు చీరకావాలి**

**చీరకు చిలుకుల్ల రవిక కావాలి - రవికకు తగ్గట్టి రత్నాలపేరు**

**పేరుకు పెట్టెడి సొమ్ముకావాలి - సొమ్ముకు తగినట్టి శోబెలవళ్ళు**

**వళ్ళుకు వడ్డాది పసుపుకావాలి - పసుపుకు పల్లపునూనె కావాలి**

ఈ పాట దిగువజానపదులలో వినిపించేదైనా మొదలు, ముగింపు గిరిజనులదే. పూసపాటి బొబ్బిలిదొరల వైరాలవైనం తరతరాలనాటిది. వేటకువెళ్ళితెచ్చిన పులిగోరు కోసం జూదమాడి, రాజ్యంపోగొట్టుకున్నారని గిరిజనుడు తనసహజపాండిత్యంతో ఊహిస్తున్నాడు. పీకలు తెగేసుకునే తగవులున్నపుడు, పిల్లను ఇచ్చిపుచ్చుకోవటం ఇరువర్గాలలో పట్టుదలలు పెంచుతాయి. ఇరుపక్షాలమధ్య, రాజగురువు, రాయబారాలు నడిపినట్లుంది. వారి కులగురువుల తీర్మానంప్రకారం, మగనాలికి అరవై రూపాయలు, ఓలికి ముప్పయిరూపాయలు. అదనపుకోరికలు అంతస్థుకు తగినట్లు ఉంటాయి. ముఖానికి పొడరువలె పసుపుపూసుకోవడం కాళింగుల అలంకరణ విధానం. మన్యం వస్తువులకు వ్యాపారకేంద్రం వడ్డాదిమాడుగుల. అంతటా పండే పసుపు వంటిదికాక విశాఖమన్యంలో పండే గుండుపసుపుకు ఛాయఎక్కువ. చింతపండుకాని, పసుపుకాని ఎంతకలిగినా, వెంటనే అమ్ముకోడమేకాని కొండవారు దాచుకోరు. చింతకాయలు, పచ్చిపసుపులతో అవసరాలు గడుపుకుంటారు. రత్నాలపేరు పెట్టగల రాజులుకూడా ఛాయపసుపుకోసం సంతకుపోవాలి అనిచెప్పడం దాచలేని నిజం.

విశాఖమన్యంలో గిరిజనులు వత్తుకునే డోల (నేపాళపు) నూనె, అడుసులనూనె తేటగాఉండవు. మదపువాసన. కాబట్టి పల్లపుపప్పునూనె కావాలి. నువ్వుపప్పునూనె సాగరాంధ్రంలో ప్రసిద్ధం.

ఓరగా ముడిచిన కోరకొప్పు, కొప్పులోముడిచిన కొమ్మసంపంగిపూలు, ముడిచిన కొప్పుకింద జడకుబదులుగాసాగే నెమలివన్నెచీరె నిలువుటంచు, మీగాళ్ళ పైకి మెడలమీదుగా కట్టినచీర, దారిలో ఎత్తుపల్లాలకుతగినట్లు తలమీద బరువుతో ఊగే

తనూలత – చిలుకుచీర తాకీతాకకచాటే శరీరపుఒంపుల, వయ్యారినడకల కొండ పడుచుల శ్రమైకజీవన సౌందర్యానికి, పెట్టెడుసొమ్ములు, రత్నాలపేరులు దిగదుడుపులు.

రావలసినవానికోసం బేరసారాలు ఏండ్లతరబడి జరుగుతుంటే, ఈ వసంత సంగీతమాను (వెదురు) నీటి విరుగుడుమాను (పంటచేను), లచ్చిమిగల చింతమాను (పసుపు) వంటి పడుచును, ప్రకృతికూడా దగాచేస్తుంది.

**మాయలదిముంత :**

**నీకు నేనుర వస్తానని - ఓ రామ ఓరామ రాఘవా**
**చుక్కలకుర బాసచేసిర - ఓరామ ఓరామ రాఘవా**
**చుక్కలకుర మొక్కుకొనిర - తందానె అయ్యొతందానె ఓ దేవనందనానా**
**పాపకారిర వేగుచుక్కవో - తేలకుండనే తెల్లవారెను**
**గాందు గాంధారి వేళలకు ఓ - ఘాటియావలె తెల్లవారెను**
**మాయదారిర వేగుచుక్కవో - మన్నెమివకడె తెల్లవారెను ॥**
**బుడిబుడిముంత భూమేలుముంత**
**మధ్యమధ్యముంత మాయలదిముంత**

పొగమంచులో చుట్టూ ముంతబోర్లించినట్లుంటుంది. చుట్టూ ఏం జరుగుతుంది, ఎంతపొద్దెక్కింది తెలియదు. సూర్యకాంతికి మంచువిరిగినతరువాత అంతా హడావిడి, ఆశాభంగం. చుక్కలకు మొక్కుకొని, చుక్కమీద బాసచేసి మాటయిచ్చి

**పొగలుబండికి పారిపోగ - పడాలు మరిదిని పిలియబోదాం**

అని ఉవ్విళ్ళూరుతూ చుక్కలకోసం ఎదురుచూస్తున్న అభిసారిక, ప్రతిరాత్రీ దగా పడిపోతున్నది. వేగుచుక్క తేలినపుడు ఇల్లువదలి పారిపోదామనిచూస్తే చుట్టూ గాందు. (పొగమంచుకమ్మి చుక్కలు కనిపించవు). మరుసటిరాత్రి, గాంధారివేళకే (రాత్రి రెండు గంటలవేళ) బయలుదేరితే కాళ్ళుకరిచే బుగ్గిమంచులో నడకసాగక ఘాటిదిగకనే తెల్లవారింది.

అక్కడ జతగాడు ఎదురుచూచిచూచి, పొద్దుటినుండి కబురులేకపోగా, రాత్రిఆటకుకూడా చేరకపోయేసరికి మండిపడుతున్నాడు.

కొర్రపూవేరును కబురులంపేను
వంకరముట్టె - వంపులబొట్టెలు - ఆటకైనరారు
గుమ్మడి పూవేరును - గురుతులంపేను
గుగ్గడుమక్కల గుల్లెలబొట్టెలు - ఆటకైనరాదు॥

వేళకు రాకపోయేసరికి వంకరముట్టె – గుగ్గడుమక్కలవారయినారు వాడికి.

వెరచిచెప్పదునమ్మ - వెరియకచెప్పదు సువ్వనాల సువ్వి
రావికొమ్మనరకి - రాజొడ్డినాను - రాచవారబ్బాయి నీ అల్లుడమ్మ
దూలకొమ్మనరకి - దూలొడ్డినాను - దూడవారబ్బాయి నీ అల్లుడమ్మ॥

అని కొందరుధైర్యంచేసి తమ ప్రణయాన్ని పెద్దలకు చెప్పుకుంటారు.

**దూరపు సంబంధాలు :**

అత్తవారిల్లు అలా ఉండాలి ఇలా ఉండాలి అని ఊహించుకుంటుండగానే –

ఆ కొండపల్లెన - ఏమేమి పండో - చందమామ
ఆ కొండపల్లెన - సామలె పండో - చందమామ
సామలుపండితే - నేదంచలేను చందమామ
దబ్బలదేశము - నన్నీయకమ్మ - చందమామ
దబ్బములుగుచ్చితే - తీసేవారులేరు

ఏకొండపక్కన సంబంధమోచేస్తారు.

ఇదికొండ అదికొండ అల్లవె - నలకొండల్
నాలుగుకొండల నడుమ - నన్నిచ్చినారు
నిమ్మబరిణలతోడి - నీళ్లందుకోని
నీళ్ళాశకిచ్చిరి - ననుకన్నవారు
దబ్బబరిణలతోడి ధనమందుకోని
ధనమాశకిచ్చిరి - ననుకన్నవారు
దూడవచ్చిన వేళ - ధూలడిగేవేళ
దుఃఖానికిచ్చిరి - ననుకన్నవారు
పసులు వచ్చేవేళ పక్షరిచేవేళ

పంతానికిచ్చిరి - ననుకన్నవారు
ఏడుకొండలచాటు - నన్నిచ్చినారు
ఏడాదికొకమాటు - రారునావారు
పది కొండలచాటు - నన్నిచ్చినారు
పలికైన చూడరు - ననుకన్నవారు
బూరుగులుపూచివి - భూమికొరిగివి
భూములెరుగమని - రారునావారు
దద్దుగులు పూచివి - దారికొరిగివి
దారులెరుగమని - రారునావారు
నేరేండ్లుపూచివి - నేలకొరిగివి
నెలవులుచాలవని - రారునావారు
ఇండుగులుపూచివి - యేరుకొరిగివి
ఏడాది కొకమారు రారునావారు

కాళ్ళలోచక్రాలున్నట్లు, విరగదొక్కుకుంటూ నడిచే, కొండవాళ్ళలో మనిషికోదారి. సవరంగా(సూటి)పోయే ఘాటీదారులు, చుట్టూతిరిగిపోయే పెండెదారులు, పశువులు తిరిగే మందదారులు. లోగొండఅవతల పెదగంతపక్కన ఊళ్ళు. దద్దుగలుపూచే శిశిర, వసంతాలనడుమ కల్లుబాగావస్తుంది. ఈ చెట్లు(జీలుగ) కొండలలో ఎక్కడెక్కడో ఉంటాయికాబట్టి చెట్టుకోదారి. ఊరుపోవాలని బయలుదేరినవాడు, దారిలో చల్దికల్లు త్రాగి, ఆదారి ఈదారితిరిగి, నిషావదిలే సమయానికి, ఎడకల్లువేళకు ఏదోచెట్టుబసకు చేరుకుంటాడు. బూరుగులు పూసేవేసవిలో, పశువులను కట్టడానికి, పొలంలో మకాం. నేరేడు పూసేరోజుల్లో, ఇల్లునేత. వర్షాకాలంలో తిండికి కటకట. ఇండుగులు పూసే రోజుల్లో, కొత్తన్నం తినడానికైనా వస్తాడేమోనని ఎదురుచూసినా జాడలేదు.

ఒంటిచింతనడుమ - వంగిరండన్న
మారాచపిల్లుకు - వంగిరండన్న
దూలాల మాయిల్లు - దూరిరండన్న
పారెళ్ళి అన్నల - పాదాలె కడుగు - పయ్యంట చెంగున పాదాలెవత్తు
అంటకుచెల్లెల - అగినిమంటలు - ముట్టకుచెల్లెల ముల్లుచీలిది

నివాళియిస్తూ పాదాలుకడుగుతున్న, చెల్లెలిచేతులు భగ్గునతగిలాయి అన్నకు. దిగ్గున లేవదీసి అక్కునచేర్చుకొని, ఆ చేతులు తన అరచేతులలోకి తీసుకొని చూస్తే, ఏకట్టెలు మోసిందో ముళ్ళువిరిగి ఉన్నాయి. 'ఆపనులకు బాధపడడంలేదు. ఇంకా ఏదో కట్టుకురాలేదు అనే దెప్పిపొడుపులు చులకనచేస్తున్నాయి' అని కన్నీరు పెట్టుకుంటుంది చెల్లెలు.

**పెద్దన్నయిచ్చిన పెయ్యి పెరిగిది - చిన్నన్నయిచ్చినచీర చినిగిది**

**మాబావ మరదులె దెప్పొచ్చిరన్న**

అత్తవారింటికి పోయిన తరువాత కూడా, ఆదరించే అన్నలున్న అడపడుచు అదృష్టవంతురాలు.

**ఆకలేసి - నేను అమ్మింటి కెడితే**

**అమ్మొచ్చి - పాలన్నం తినివెళ్ళమనెను**

**బాబొచ్చి - కొత్తచీర కట్టిపొమ్మనెను**

**అన్నొచ్చి - ఆరునెలలుండిపొమ్మనెను**

పాడిపంటలు చక్కగా ఉంటే చెల్లెలును చూడ వస్తుంటారు.

**ముందువచ్చేగొడుగు - అది యెవరిగొడుగు**

**ముద్రుడు పెద్దన్న - ముత్యంపుగొడుగు**

**నడుమవచ్చెగొడుగు - అది యెవరిగొడుగు**

**నాయకుడు నడిపన్న - నెమలిపురిగొడుగు**

**వెనుకవచ్చెగొడుగు - అదియెవరిగొడుగు**

**వెడ్డివాడు చిన్నన్న - వెండిపురిగొడుగు**

**ఎవరమ్మ నీవారు - ఎలగంటి వారు**

**ఎలగంటివారమ్మ - ఎన్నడెరుగము**

**మేలైన చేతులకు - వీరకడియాలు**

**బాగైనచేతులకు - దండకడియాలు**

మగనిఆదరానికినోచుకుంటే, భార్య ఏకష్టమైనా భరించగలదు. అయినా మనువు విరిగిపోవడంలో అత్తవారి ఆరళ్ళకు తక్కువ పాత్రేంలేదు. కాపురం ఎలాగైనా నిలుపుకోమని, కన్నవారు పెళ్ళిపాటలలో హితంచెపుతారు.

**తిట్టినా కొట్టినా చెల్లెలా - వారియింటనేయుండు చెల్లెలా**

**వారేమన్నను చెల్లెలా - దారిపట్టుకురాకు చెల్లెలా**

**ఆలిజగడాలు :**

పొద్దంతాచాకిరి, పొలంలో మగనికి చల్దులమోత. కర్రలుతెచ్చుకోవడం. వళ్ళు పచ్చిపుండు. పిల్లపాలుమరిచేదాకా మగనితో కలియగూడదు. మగడా...వేధిస్తూంటాడు. మరొకతెను కట్టుకోమని మొత్తుకుంటుంది.

**పచ్చిసామలబోసు - పాలారబోసు - పసి పురుటాలను - పనికి చాలను**
**ఏలింత ఒడ్డున వేరాల్నితెమ్ము - బాలింత ఒడ్డున సవతిని తెమ్మో**
**సవతిని తెస్తేను సరులుండగలవ! - సామివారి దయలుంటే సరులుండగలను**
**యేరాలినితెస్తేను వేరుండగలవ! - ఏలేవారి దయలుంటే వేరుండగలను**
**మరి పెద్దయమ్మకు ఏమేమి ఇండ్లు - వందనపురాటలు - కుందనవు నేత**
**మరి చిన్నయమ్మకు ఏమేమి ఇండ్లు - ఒంటికంబంమేడ ఒక్కదూలము**
**మరి పెద్దయమ్మకు ఏమేమి నగలు - మెడనిండ కుంటెండ్లు - ముద్దుబలిణెలు**
**మరి చిన్నయమ్మకు ఏమేమిచీర - పదిమూళ్ళ పట్టుచీర - అద్దంపురవిక**
**మరి పెద్దయమ్మకు ఏమేమిచీర - చిలుకుచిత్తడిచీర - చిత్రపురవిక**
**ఆవేళ వచ్చివో ఆలిజగడాలు - పుల్లలకెడతాను పిల్లలనుబట్టు**
**నాకు సిగ్గొతుంది నట్టింటబెట్టు**

ఇద్దరు జట్టీలు పడి మొగుడిని తిట్టడం మొదలుపెట్టారు.

**కల్లుడిప్పలకాడ పడిచస్తడమ్మ - కూడువండినపూట కుండవదలడు**

**కోడినికోసినపూట గొందివదలడు - అలిసెలొండిన పూట అట్టుకువదలడు**

మరొకడి కర్మమిట్లాకాలింది –

**గుత్తంపు గుడిసెకు రెండు గుమ్మాలు - గుణమైన పురుషుడికి ఇద్దరమ్మలు**
**ఇద్దరకు చోటిచ్చి పంచబడురాజ - పంచలో రాజుకు పాము కుట్టిందో**
**దొడ్డిలో రాజుకు దోమకుట్టిందో...**

'గుడిసెకు రెండుగుమ్మాలుండకూడదు' అని సామెత. రెండుగుమ్మాలుంటే నష్టంఏమిటో అర్థంకాకపోవచ్చుగాని – ఇద్దరమ్మలుంటేమాత్రం ఒకరిమీద ఒకరుపెట్టి

తప్పించుకుంటారని తెలిసినవారి అనుభవం. ఇద్దరు పెళ్ళాలుండడం గొప్పతనం – సానినుంచుకోవడం ఒక దర్జా.

అంతలో ఆరాజు సంతకెళ్ళాడో - సంతలో ఒకసాని తగులుపడ్డాదో
సంతలో సానికిచీరగొన్నాడో - సానికనికొన్నాడో నందపురిచీర
ఇంటి ఇల్లాలికొక్క ఉల్లిగొన్నాడో - సానికని కొన్నాడో సన్నగాజులు
ఇంటి ఇల్లాలికి ఈనెగాజులు - సానితో సరసానికి చక్కని మేడ ॥
నల్లసామలలంకలకు నెమలి పిట్టలు నెలవుగొను
నడిపి వాడురి నైనబాబు - సానివాడలె కొలువులాయె
సానిపాపర చక్కనైతే - ఇంటి ఇల్లాలు పులిబాబు
ఉల్లిపూవు చెల్లనైతే - మల్లెమొగ్గలు బోలు బాబు ॥

మంగలి కోడినెత్తుకు వస్తుంటే, చాకలి గొడుగు పడుతుంటే కోడి పందాలకు పోవడం ఒక దర్పం.

సంకురాతిరి పండుగనాడు - సరుబురు చేసుకొని
చంకనిండ పెట్టుకొని - తప్పదనుకుంటినే
ఓడిపోతివే కోడి నాకోడి - పూలకోడి నా కోడి
బొడ్డునున్న ముల్లెపోయె - లడ్డువంటి కోడిపోయె
కోడిపోయినవాడి యిల్లు - కొల్లపోయె దైవమా
కోడినాకోడి ఓడిపోతివే - పూలకోడి నా కోడి ॥

అన్నీపోయినవాడిని సానిది బయటకు గెంటిఉంటుంది. మొహంచెల్లక అక్కడక్కడ కాలక్షేపం చేస్తున్నవాడిని కాలమే పెళ్ళాంతో కలిపింది.

ఆగాలాయె మేగాలాయె - ఆలిమీద పేమలాయె
ఇంటి ఇల్లాలిమీద పేమపుట్టిందో - వృక్షాలు పక్షులు పడుకున్న వేళ
పసిపురుటాలు పిల్లకు పాలిచ్చువేళ - గప్పగప్పన వెళ్ళి - గడపపైనిలచు
అరటిపూవువంటి అత్తకూతుర- ఔదల మొక్కుదు తలుపుతీయమ్మ
మోదుగుపూవువంటి మగవాడవు నీవు -
ముఖము చూపకుండ మళ్ళిపోరాజ - ఇల్లుతూరకుండ వెళ్ళిపోరాజ

అరటిపూవు, మామిడిపూవులకు అందమేమిలేదు. కానిఅరటిపూవు పాండవులకు సత్తైవిత్తనాలిచ్చే హనుమంతపగడగా, మంచికూరగా ప్రసిద్ధం. మామిడిపూవు మంచి పండవుతుంది. ఇల్లాలిపొందు సానిదాని పొందువలె సమ్మోహకంకపోవచ్చునుకాని, పరిణామ రమణీయమైనది.

మోదుగుపూవు ఎర్రగా అందంగానే ఉంటుందిగాని 'వాసనలేని పూవు. ప్రేమను తెలుసుకోలేని మూర్ఖుడవు నీవు' అని భార్య తిరస్కారం.

**దారకొండ బేరగాడు :**

కన్నవారు కష్టసుఖాలు పట్టించుకోరు. మగడుకూడా పెళ్ళాన్ని నిర్లక్ష్యంచేస్తాడు. వాడి వ్యాపారాలు, వ్యసనాలు వాడివి.

**ఎద్దుమీదర సజ్జుగట్టి - ఎక్కడెక్కడి బేరగాడు**
**దవ్వుకాదోయి దారకొండ - దారకొండర డేరగాడు**
**తూరుపున కుంచముతెచ్చి - తూలగొలచిన బేరగాడు**
**పడమటిదిర కుంచముతెచ్చి - పారగొలిచిన బేరగాడు**
**చిగురులు చింతకాడ - చిత్తులాటలో పొద్దుపోయె**
**పొద్దుపోతెర పొయిదిగాని - పొద్దువెంటర ఎద్దుపోయె**
**ఎద్దుపోతెర పొయిదిగాని - ఎద్దు వెంటర సజ్జ**
**డబ్బుపోతెర పొయిదిగాని - డబ్బువెంటర ఇల్లెపోయె**
**ఇల్లుపోతె పోయిదిగాని - ఇల్లువెంట ఇల్లాలెపోయె**

మన్యంలో కుంచం – దిగువన కుంచన్నర, మణుము మణుమున్నర. ఇంకా కొక్కెలు కత్తిరించిన త్రాసులతో, మాయకుంచాలతో దారకొండవెళ్లిన బేరగాడు చిత్తులాట (పేకాట)లో మునిగిపోయాడు. ఎంతలోపలి గ్రామాలలోనైనా చిత్తులాటలు, రోడ్డుమీద మట్కాలు (బ్రాకెట్) మన్యమంతా వ్యాపించాయి. గూడెంమన్యం, దారకొండ సంతలో దొంగకుంచాలతో బాగాగడించిన బేరగాడు చిత్తులాటలో మునిగిపోగా పొద్దు పోయింది. పొద్దుతోపాటు ఎద్దు– సజ్జు – ఇల్లు – ఇల్లాలుకూడా పోయింది. ❊

**అత్తమామలను నిలదీస్తున్న కొత్తకోడలు :**

మగడు తనలో ఏంలోపముందని పట్టించుకోవటంలేదో? ఇంటిపట్టున ఉండడం లేదు? ఏదో తేల్చేసుకోవాలని, అతడి మగతనాన్నే సవాలు చేస్తున్నది ఒకధీర.

**కొండగుమ్మడికాయ కోమట్లరస్తు - నీరుల్లి వెల్లుల్లి జిలకర్రతోటి**
**తొమ్మిదితోయాలతో వండినకూర - ఓయత్త నీకొడుకు కూరలొల్లడు**
**పంచనలేడమ్మ మంచానలేడు - ఏడత్త నీకొడుకు ఎందుబోయేడు**
**చింతచెట్టునలేడు శిరసునలేడు - ఓలత్త నీకొడుకు ఎందుబోయేడు**
**మంకుగుణమని మగువలొల్లడు - చేటుగుణమని చేడెలొల్లడు**

కోడలినోటికిబెదిరి కొడుకును హెచ్చరిస్తారు. వైద్యాలు చేయిస్తారు. మగనాలు పోయినపుడు వచ్చే తగవులలో వాదనలకు ఇవన్నీ ఆధారాలు.

చాటుసరసంసాగించే వాళ్ళకంటె, ఈమగనాలుపోయేవాళ్ళు ఎంతో ఉత్తములు కాని అందరూ ఇంతసూటిగా ప్రవర్తించరు.

**చాటుసరసం :**

**చూడు నేస్తంబాబు - చూడు నేస్తంబాబు - చూడుచూడు బాబు**
**గంతవెనుకనున్న - ఇంతరేకచోళ్ళు - ఇంతరేకచోళ్ళు**
**కుంచె నెమలిపిట్ట - దిగె నేస్తంబాబు - నెమలిపిట్ట దిగె**
**వేటగాడు చూసి - వేగులు పొంచిచూచె - పొంచిచూచె**
**వెండికట్ల తుపాకి - ఎత్తగ దించగ - ఇంటెన కాలపడిపోయె**
**చూడు నేస్తంబాబు - చూడు నేస్తంబాబు - అత్త మామరాగ అత్తమామరాగ**
**ఇరుకులో దుమ్ము - నోటికాసి జారిపోయే - జారిపోయే చూడు నేస్తంబాబు**
(నోటిదగ్గర మాంసం జారిపోయింది. అత్తమామలరాకవల్ల దక్కకపోయింది)

**వదిన – మరుదులు :**

**లచ్చుమయ్యా రచ్చించర మరిదో - లచ్చుమయ్యా**
**ఇంటెనకాల ఒక పచ్చనిమాను**
**పచ్చనిమానుకు రెండురాటలు నరుకు**
**రాటలచాటు రెండుబడితలు నరుకు**

ఆ బడితలచాటు రెండుబురుజులువేయో
ఆ బురుజులపైనా రెండుడేరాలు గట్టు
ఆ డేరాపైన నేను వస్తా మరిదో
ఉయ్యాలబండి ఊరెడ్లబండి - లచ్చుమయ్య
వెయ్యరబరువు యేడుబస్తాలబరువు లచ్చుమయ్య
తోలరబండి - జోడెడ్లబండి లచ్చుమయ్య

ఇంటిలోనుండి బయటపడిన ఆ వదినమరదులే బండిబరువులుగా మారారు.

## నీవు నీళ్ళిచ్చేవు నీ కోడలేది :

రామన్న వెళ్లాడు రేవళ్ళ దుక్కు - లకుమన్న వెళ్లాడు పిట్టవేటకు
రాలను చేపట్టి రాలువడిబోసు - కూకున్నపిట్టకు గుండెతగలేసు
పారిన పిట్టకు పక్కతగిలేసు - ఈ పిట్ట ఆ పిట్ట కుదుటేసినాడా
భీముడు అప్పడు ఇంటికొచ్చాడో - వదినరో ఓయమ్మ పిట్టలందవా
నేనందుకుంటేను నీయన్న తిట్టో - అలాగే యావదిన పిట్టలందిదో
పిట్టలందినదాన నీళ్లియ్యి వదిన - నీకు నీళ్లిస్తేను మీయన్న తిట్టో
అలాగే యావదిన నీళ్ళు యిచ్చిదో - నీళ్ళిచ్చినదాన చల్లలీయవా
చల్లదెచ్చినదానవు నూనెలీయవా - నూనెలిచ్చినదానవు బుర్రకురాయెూ
రాసినదానవు నెత్తిదూయవో - సీతమ్మ తలదూసి సిగపాయ వేయు
మరిదిరో లక్ష్మన్న పువ్వు ఎక్కడిదో - నావెంట వస్తేను పువ్వులేం కరువో
అపుడే సీతమ్మ నవ్వుతున్నాదో - నవ్వేటి సీతమ్మ తానేటి పనులు
మరిది లచ్చనుడికి నీల్లెట్టినాది - అడుగుపలచనికుండకడిగి ఎసరెట్టు
ముదుక వరిబియ్యము మూటల్లో దీసు - జాజులబియ్యము జల్లున కడుగు
ఉడికిన అన్నము ఉల్లిపూచాయ - బంగారు పెదిమలతో బాగానె నవ్వు
చీరలు రవికెలు ధరియించుకోని - సెనగపూరైకలు తానుకట్టిందా
వజరకాయలుచీర తానుకట్టిందో - ఏలినదానిసిగ యొరసిగపెట్టు
ముడిచిన దానిసిగ ముంతసిగపెట్టు - దిద్దినదానిముఖము చందురుబోలు
సీతమ్మ లచ్చనుడు ఏలగున్నారో - ఇరుగతా కరుగతా వీధెంబడెల్లు
ఉల్లితోటలు దాటి ఊరెల్లదాటి - పసుపుతోటలుదాటి పట్నాలుదాటి

తెల్లగా తెల్లగా పాలవృక్షము - తూరుపుకొమ్మల లచ్చనుడెక్కాడో
పడమటికొమ్మల సీతయెక్కిదొ
రాముడు ఇలుసేరి తానేమి పనులు - పమిడాల యాపూదు పంచచేరేసు
ముత్యాల ములుగర్ర ముంజూరువేసొ - అమ్మరో ఓలమ్మ నీళ్ళివ్వవమ్మ
నీవు నీళ్ళిచ్చేవు నీకోడలేది
చెల్లెలుగలదారి చెలువుండబోయె - అన్నలుగలదారి అందుండబోయె
అత్తవారివాడలకు తానెళ్ళినాడో- రచ్చలోకూచున్న మామ ఓ మామ
వంటలు వండేటి అత్త కన్నత్త - మీ కూతురిటువైపు మళ్ళొచ్చినాదో
మిమ్మెప్పడిచ్చామొ దారి మరిచిది
ఎర్రటికళ్ళకు ఎక్కె కోపాలు - పచ్చటికళ్లకు పట్టె కోపాలు
కుడిమీసమెగరేసు గుడ్లెర్రజేసు
శాలకు వెళ్లాడో గుర్రాలొదీసొ - నీలాటి గుర్రము సవ్వరైనాడు
నాతమ్ముడెళ్ళిన తోవనే వెళ్లు
మల్లెచెట్టులోన తొలకరిమెరుపొ - ఇద్దరు ఇర్రుకొని కలిసిఉన్నారో
చెట్టుకిందికి వెళ్ళి రాముడేమి పనులు -
ఒల్లనుర ఓయన్న భయాలు వేసు - భయాలుగలవాడ వేలొచ్చి నావు
భూమికి లచ్చనుడు దిగుతనున్నాడో
దిగవలె సీతమ్మ నీవు దిగవాలె - సీతకు నరికాడు సీతబొట్టు దీసు
బట్టలుతీశాడు మూటగట్టాడో - అత్తగారింటికి పయనమైనాడు
ఇదిగోర ఓయత్త నీకూతుచీర - ఏమి చీరలుబాబు నీవుతెచ్చినావు
సమర్తచీరల! బాబు నీవు తెచ్చినావు - సమర్తచీరలుకావు, చావుచీరలు

**మహిమకు చిత్రిక :**

ఈపాట ఒక చిన్నకథను గుర్తుకుతెస్తున్నది. కట్టెలమ్ముకొనేవాడొకడు కావడిబద్ద భుజాన వేసుకొని దారిలో అడ్డంవచ్చిన ఆలమందలను కావడిబద్దతో అదిలిస్తున్నాడు. ఆ ఆవులలోఒకటి కామధేనువు. దాని వెంట్రుకఒకటి బద్దలో చిక్కుకొన్నది. ఆ మహిమ వల్ల రోజూ ఎన్నికట్టెలుకొట్టుకొని మోస్తున్నప్పటికీ బరువనిపించదు. ఈ కిటుకుఏమిటో కట్టెలుకొనే షావుకారుకు అర్థంకాక బద్దలోనే ఏదోమహిమ ఉంటుందని ఊహించి దాన్ని

కొన్నాడు. చక్కగా నునుపుగా చిత్రికపట్టించాడు. చిత్రిక పట్టించినప్పుడు ఆ వెంట్రుక కాస్తా పోయింది. పనివాడు రోజూ తను మోయగలకట్టెలు మాత్రమే తెస్తున్నాడు.

సీతారామలక్ష్మణులను ఆదర్శంగాపెట్టుకొని ఎన్నోవేలయేండ్లనుండి మనం బుద్ధులుచెప్పుకుంటున్నాం. మరోపేర్లు తగిలించి ఇదే కథ విన్నా మనం ఆశ్చర్యపడం. ఇటువంటివి జరుగని సంఘటనలేమికావు. కాని ఆ పేర్లతో అటువంటి కథనాన్ని ఊహించలేని చైతన్యంమనది. ఆదర్శం కరిగిపోవడమే కాదు – వికారంకూడా కలుగు తున్నది. నాగరికుల, జానపదుల, గిరిజనుల గృహసంబంధాలు హెచ్చుతగ్గులో ఇంకా రామాయణాన్ని ఆరాధించవలసిన దూరంలోనే వున్నాయి.

**సీతారాములు – శివపార్వతులు – పాండవులు – గొంతెమ్మ :**

మంచిది మాలచ్చిమని - గెలుచుకున్నారో
సోలన సోలెడు వరాలిచ్చిరో - సోకైన సీతను గెలుచుకున్నారో
అడ్డన అడ్డెడు వరాలిచ్చిరో - అందమైన సీతను గెలుచుకున్నారో
మానెన మానెడు వరాలిచ్చిరో -
మంచిది మంచిది మాలచ్చిమిని గెలుచుకున్నారో
కుంచెన కుంచెడు వరాలిచ్చిరో - కుసుమగిరి సీతను గెలుచుకున్నారో

'సీతకథకు చిందులు విందులు' ప్రతిసంస్కృతి తనదృక్పధానికనువుగా రామాయణాన్ని సొంతం చేసుకున్నది. సీతను ఓలియిచ్చి గెలుచుకున్నారట.

వెళ్ళిరి రాములు వెల్లెడ్లతోటి - వెళ్ళెను సీతమ్మ వెలిమందలతోటి
ముంగటి పోతులు మనవి సీతమ్మ - వెనుకటివెలపోతులు మనవె సీతమ్మ
చింతలకిందివి సీత మన పొలాలు - రావులకిందివి రంభ మన పొలాలు
జువ్వులకిందివి సుదతి మన పొలాలు
ఆకాశమేరట్టి దున్నెవారెవరు - ఆకాశమేరట్టి దున్నె శ్రీరామ
వడికట్టి విత్తనాల్ చల్లెవారెవరు - వడికట్టి విత్తనాల్ చల్లె సీతమ్మ
కొండపక్కన యిల్లు కట్టెవారెవరు - కోతులున్నచోట మసలెవారెవరు

'కోతులున్న (బండలు) చేను చేయకు' అని కొండవారిసామెత. కాని యీ పాటలో గిరిజనుడై వ్యవసాయంచేసినా, రామునినుండి కోతిబలగాన్ని విడదీయలేదు.

గిరిజనులకు, తామే పంచపాండవులు. పాండురాజు, గొంతెమ్మవారి ఆరాధ్యదైవాలు.

**ఊడండ్ల మర్రిని ఉయ్యాలో - వెండివి సేకులు ఉయ్యాలో**
**వెండివి సేకులు ఉయ్యాలో - పసిడివి బల్లలు ఉయ్యాలో**
**ఊపేవాడెవడయ్య ఉయ్యాలో - ఊపేవాడు పాండురాజు ఉయ్యాలో**
**ఊగేది గొంతెమ్మ ఉయ్యాలో -**
**- ఇటునుండి ఊగితే ఉయ్యాలో సూర్యచంద్రులమోత**
**అటునుంచి ఊపితే ఉయ్యాలో - హరిచంద్రులమోత ఉయ్యాలో**
**పాండవుల గొంతెమ్మ ఉయ్యాలో - పదమెట్ల పాడుతదో ఉయ్యాలో**

ఈడేరిన పార్వతికి ఎవరు నచ్చుతారని తండ్రి అడుగుతున్నాడు –

**ఇంతాయె అంతాయె ఈడేరిదాయె - ఇంకెవరినిత్తునె ఇలరాచగౌరు**
**కమ్మర్లనిత్తును ఓ బాలగైరు - కమ్మర్లబొగ్గులు నేకాల్చలేను**
**బామ్మర్ల తానాలు నేచేయలేను - రెడ్ల చలిముంతలు నేమోయలేను**
**కమ్మర్ల బొగ్గులు నేకాల్చలేను - మాలల మన్ననలు నాతరముకావు**
**పాలకొండనున్న బాలజంగము - మెడనిండ రుద్రాక్షల్ మొలను పులితోలు**

కొండపోళ్ళుచేసే రెడ్లకు చలుదులివ్వడానికి మోకాళ్ళపర్వతాలు, చుక్కల పర్వతాలు ఎక్కిపోవాలి. మాలలలో మర్యాదలు జాస్తి. వెలుపలదిరిగి వందనాలు, దాపలదిరిగి దండశరణాలు మాటిమాటికి చేస్తుండాలి. ఇందరితో ఈ బాధలుపడలేక ఆదిభిక్షువును కోరుకొన్నదట.

**జాతులు – రీతులు :**

ఆ జాతుల స్వభావాన్ని వాళ్ళ మాటలతోనే చెప్పడం ఉచితం.

‘కోదుబెదురు – కణుజుబెదురు’
‘ఓజులోడికి చెప్పు – ఎనుబోతుకు చెప్పు’
‘ఓజులోడిమాట – ఒడిదుడుదెబ్బ’
‘కాపువాడికి చెప్పినమాట – గురకువేసిన అమ్ము’
‘అరటిపండుతినరా కొండదొరా అంటే – ఉడకలేదన్నాడట’
‘గుర్రమెక్కరా కొండదొరా అంటే – నిచ్చెన తెమ్మన్నాడట’

'రెడ్డికి ముడ్డికి రేకలకోటికి – టీకడిల్లో మారేడు మద్ది పంపెనపది పంపెనపది'

'కొండవాడికేమెరుక కోడిముక్కలసాయ – ఆరుగుంపులబద్ద అరగమోయు

మాలవాడికేమెరుక మంచిగంధముసాయ

పడిపోయిన బక్కలకు పారుచుండు'

పంపెనకాయ పగిలినప్పుడు తెల్లనిరేకులు రూపాయకాగితాలవలె వ్యాపిస్తాయి అదీవాడి ధనం.

## లోకాన్ని గెలిచిన చెల్లెలు :

ఎవడో ఒక తుంటరి –

**ఓసపూలబంతి ఒడిన పడవైచు - ఆన్నెమెరుగనికాంత అంటిముడిచిదో**

**పున్నెమెరుగనికాంత పూవని ముడుచో -**

**భావమెరుగని కాంత బంతని ముడుచో**

**ఆ పువ్వు ముడిచిన ఆరుగడియలకు -**

**వారి మామ మన్యాన కొలువువెళ్ళడో**

**వారత్త సింహాలగద్దెను దిగదు - తోడికోడలు తోడి దంపులొల్లరు**

**గుర్రాలు దానిచేతి గడ్డినొల్లవు - పిల్లలు దాని చేతి పాలుతాగరు**

**మరుదులు మల్లారం సంతకెళ్ళరు...**

ఓసపూలు – నల్లఉలవ కొనపారకముందు పువ్వులాగేవుంటుంది. అది రెండు మూడు ఆకులు వేస్తుండగా పసుపునీళ్ళుపోసి పెంచుతారు. ఆపూలతో సంతలవారు సోకు చేసుకుంటారు. చెవులకు ముడుచుకొని నేస్తంకట్టుకుంటారు.

**ఆకసానపోయె గరుటెల్ల పక్షి**

**ఆకుమోసి అన్నలకు అందించగలవ**

**నీవెండి కాళ్ళకు అందెలెడతాను**

**నీచిన్నిముక్కుకు కన్ని కుడతాను**

**నీవెల్లె తోవల్లో పాలకావళ్ళు - పాలకావడి చూసి పారేవు సుమ్మీ**

**నీవెల్లె తోవల్లో నీలకావళ్ళు - నీలకావడి చూసి నిలచేవు సుమ్మీ**

చావుఉత్తరమని చదివిచూశాడో - పెళ్ళిఉత్తరమని పెట్టెలో వేసో

ఆరుగురన్నలు గుర్రలెక్కిరో...

ఏమిటీనేరాలు చెప్పచెల్లెలా - ఏమిటితప్పలు చెప్పచెల్లెలా

కాగులంగటవేసి కడుగుతున్నాదో - మడ్డున దిగరావో ముద్దుచెల్లెలా

లోచెయి లోదిగిచి లోకంబె గెలిచి - పెడచెయి లోదిగిచి పెద్దన్న గెలిచె

మెచ్చితి చెల్లెలా మెచ్చితినమ్మా... (మడ్డు – కాగిన నూనె).

## ఉరులలో ఉండిపోయిన సోమమ్మ :

కమ్మరోడిపోతు ఘనమైనపోతు - కంసలోడి పోతు గంటల్ల పోతు

మూడు పోతులుగూడి ముచ్చటాడంగ - తిరిగి చూదామని తిప్పదునె కడవ

మరలి చూదామని మలుపుదునె కడప -

కుండపోతేపోని అంచుతేవమ్మ - అంచుకు అన్నలు కాసియున్నారు

మట్టుకుమామలు కాసియున్నారు

పెదమామ వేసిన పెదగొప్పితాడు - చినమామ వేసిన చినగొప్పితాడు

మూడు తాళ్ళేసిది మూటగట్టిది - గొందిలో గొడ్డలి భుజాననవేసో

నల్లగొండలపైన వెళ్ళిసోమమ్మ - నల్లగొండలలోన వేగిసమాను

వేగిసమానుకు ఉరులు పన్నీది - ఉరులలో సోమమ్మ ఉండిపోయింది.

ఏదో వేడుకచూస్తూ కుండపగులుకొట్టుకొన్న సోమమ్మ అత్తమామలకు బుజువులు చూపలేక అడివిలో ఉరివేసుకున్నది.

## సోకులు – వగలు – గుచ్చుకునే ముళ్ళు :

అందంగా అలంకరించుకోవాలని ఈ అందచందాలు అందరూ మెచ్చుకోవాలని సోకుచేసుకొని వగలుపోవడం యౌవనంలో సాధారణమైన బలహీనత. చీరెఅంతా ఎక్కడ ఎలా ఉండాలో చెప్పినేయించుకొని – ఊరివెంట వెళితే కాలులో ముల్లుదిగింది.

కుచ్చుల చెంగులకు పిచ్చుకలు నెయ్యరా - నారాచగుమ్మడీ

నడిగట్టు చెంగులకు నాగుబాములునెయ్యరా - నారాచగుమ్మడీ

కొంగులచెంగులకు గువ్వపిట్టలునెయ్యరా - నారాచగుమ్మడీ

పయ్యటచెంగులకు పాలపిట్టలునెయ్యరా - నారాచగుమ్మడీ

ఆచీరకట్టుకొని తుప్పలెండెళ్ళరా - నారాచగుమ్మడీ
తుప్పనున్న దుప్పిపిల్ల తుక్కుతుక్కు తూలెరా - నారాచగుమ్మడీ
ఆచీరగట్టుకొని చెరువులెంబడెళ్ళరా - నారాచగుమ్మడీ
దొడ్డినున్న దొరసాని తెలుపు మెరుపులు చూచెరా - నారాచగుమ్మడీ
ఆచీరకట్టుకొని కంచెలెంబడెళ్ళరా - నారాచగుమ్మడీ
కంచెనున్న గరిజముల్లు కాలునాటిపోయెరా - నారాచగుమ్మడీ
మాయప్పనిత్తును ముల్లుతీయర మంగలి - నారాచగుమ్మడీ
నీయప్ప నీవరుసనాకు వదినగారు - నారాచగుమ్మడీ
మాచెల్లినిత్తును ముల్లుతీయర మంగలి - నారాచగుమ్మడీ
మీచెల్లి నీవరుసనాకు మరదలౌను - నారాచగుమ్మడీ
నేనైనవత్తును ముల్లుతీయర మంగలి...

**కాముడికి లంచం :**

పచ్చని చెట్టెక్కి- లాలి - పలుకర్ర విరుచో - లాలి - పలుకర్ర విరుచో
దంతాలరాయెక్కి - లాలి - దంతలైన కడుగు
పగడాలరాయెక్కి - లాలి - పలువరుసదోము
అక్కటి ఆ మగువ - లాలి కాలువాకి వెళ్ళు - ముకమైన కడుగు
కడిగింది - లాలి- కడవ కాకరపూవేరి
ముంచింది కడవ - లాలి - ముడుకు పైకిలెగదు
ఇటుచూసటుచూసి - లాలి - గట్టొంకచూసు
గట్టున కాముడు - లాలి - గాలపేటగాడు
నేవచ్చి జామాయే - లాలి - కడవెత్తిపోరా
కడవెత్తు కాముడికి - లాలి లంచమేమి ఇవ్వో
మాయప్పనిత్తును - లాలి - కడవెత్తిపోరా
మీయప్ప నావదిన - లాలి - వరుసగాదు నాకు
నేనైన వత్తును లాలి కడవెత్తిపోర

**జోలపాట :**

జోజమ్మకన్నులు దొంతిమల్లెలు - మనవారి అల్లుడు చిన్నచిట్టెప్ప ॥జో॥
కాలిన గజ్జెలు కంచుమొలతాడు - కలవారికోడలోయ్ చిన్నచిట్టెప్ప
వేలిన ఉంగరాలు వెండొడ్డణాలు - వెలుమలికి కోడలోయ్ చిన్నచిట్టెప్ప
పప్పతిను చిట్టెప్ప పప్పకేడ్వాక - పంటలు పండక పప్ప దొరకది
కూడుతినుచిట్టెప్ప కూటికేడ్వాక - కుప్పలు నూర్వక కూడుదొరకది
పాల్తాగు చిట్టెప్ప పాలకేడ్వాక - పడమటనున్నదా మనపాడియావు
కాలిన కొండన కన్నమామలు - కన్న మామల ముద్దు ఘనమైన ముద్దు
మేడుగుల మెట్టన మేనమామలు - మేనమామలముద్దు మేలైన ముద్దు
పిల్లిరావోయ్ తల్లి పిల్లలతల్లి - పిల్లెమ్మ కన్ను బీరమొగ్గలు
కోడి రావోయ్ కోడి ...

గోదావరి, విశాఖల సరిహద్దు గుర్తేడులోవిన్నదీపాట. గోదావరిజిల్లాలలో సవితి పలకం – 'చలికూటికి బాలయేడ్వని కాలం' పాలపంటలతో పొట్టనింపుకోవచ్చు. విశాఖలో ఇది 'ముక్కనుమకు ముక్కులు మూతులు ఎండుతుంటే ముక్కుకమ్మలు అమ్ముకొని తినేరోజులు'. పసిపిల్లకు చన్నుగుడిపే తన్మయత్వంలోకూడా తమదరిద్రం తల్లికి మరుపు రాలేదు.

స్త్రీకి భార్యగా, తల్లిగాఉన్న బాధ్యతలు ఒకదానికంటెఒకటి విలువైనవి. పాతి వ్రత్యాన్ని పాటించే భార్యలవలె, పిల్లలకోసం జీవించేతల్లులు, సత్యాన్నినిలబెట్టుకోగల సాధ్వులవలన ఈ ప్రజాతంతువు ప్రమాదరహితంగా సాగుతుంది.

**గో – వ్యాఘ్ర సంవాదం :**

ఒడ్డుబడ్డు కొండలకాడ జంబయ్‌జో జోదులంగరు
లోపలి లంకల నట్టనడుమ జంబయ్‌జో జోదులంగరు

ఉన్నదయ్యా వాయుమొకము జంబయ్‌జో జోదులంగరు ఉన్నదయ్యా కట్లమెకము
మేతకు తరలె మేలుగల్లావు - జంబయ్‌జో జోదులంగరు
- దానియొక్క కంఠములోన
కట్టిరయ్యా గంటబుడగ - జంబయ్‌జో జోదులంగరు - బూకుమని కేకవేసె

*ముక్కులు మూతులు ఎండుతుంటే ముక్కుకమ్మలు అమ్ముకుతింటారు*

పుట్టచాటు పోతుమొకము - జంబయ్‌జో జోదులంగరు

- వస్తున్నాదిర వాయుమెకము

అమ్మదీని ముండమొయ్య - జంబయ్‌జో జోదులంగరు

- నయ్యదొక విన్నపమయ్య

పులిరాజ పులిరాజ - జంబయ్‌జో జోదులంగరు - తోటిపురుటాలనైతినయ్య

తొమ్మిదిరోజులనాడు నేను - జంబయ్‌జో జోదులంగరు

- బుద్దులు జ్ఞానాలు చెప్పివత్తును

పాలుపెట్టివత్తునయ్య - జంబయ్‌జో జోదులంగరు - ననిలబడి అగ్గిబాసలు

నీటిన నిలబడి నీలబాసలు - జంబయ్‌జో జోదులంగరు

ఇందే ఉండవో వాయుమొకం తల్లిలేనిబాలవు కొడుక

- జంబయ్‌జో జోదులంగరు

గంగ ఒడ్డున గడ్డేమేయు తల్లిలేనిబాలవు కొడుక - జంబయ్‌జో జోదులంగరు

కొండకింద కొనలేమేయు తల్లిలేనిబాలవు కొడుక

- జంబయ్‌జో జోదులంగరు - మంచిజలల నీరేతాగు

బాసవారిచేనుమేయకు కొడుక - జంబయ్‌జో జోదులంగరు

- బద్దకర్రతో కొట్టునుకొడుక - కోయవారి చేనుమేయకు కొడుక

కమ్మరివారి చేనుమేయకు కొడుక - కత్తికర్రతో కొట్టును కొడుక -

కొర్రుకంపతో కొట్టునుకొడుక

రెడ్డివారి చేనుమేయకు కొడుక - జంబయ్‌జో తెడ్డుకర్రతో కొట్టునుకొడుక

మాలవారి చేనుమేయుమీ కొడుక - జంబయ్‌జో మందలోకలిసిరమ్మీకొడుక

వెనుకున్న ఓతెల్లటావో - జంబయ్‌జో

బాలకైన నీదేభారం నడుమ ఉన్న ఓనల్లటావో- జంబయ్‌జో - బాలకైన నీదేభారం

ఉక్కుతీగలూగినట్లు, కంచు గరగరలు కదిలినట్లు, పాలగరగలు తరలినట్లు

గణగణమని గంటచప్పడు - జంబయ్‌జో జోదులంగరు

వెళ్ళిపోయే గంగబొల్లావు - పులియున్నచోటికివెళ్ళు - జంబయ్‌జో

పారి పారి రావో మెకం - ఉరికిఉరికిరావోమెకం - జంబయ్‌జో

కంఠంకాడ కాటువేయో - మీయొక్కదరిసెనానికి - జంబయ్‌జో

మాటతప్పకవచ్చితినయ్య - సత్తేనికైన మెచ్చితినమ్మ - జంబయ్‌జో

వెళ్ళిపోవో గంగబొల్లావు - బాలకైన చూచుకొమ్మా - జంబయ్‌జో జోదులంగరు

ఈ పాటపాడినది మాలవారుకాబట్టి మాలవానిచేను మేయుమని పాడుకున్నారు. బాసవారు – బడియలతో కొడతారు. రెడ్లు కర్రపనివారు – తెడ్డుకర్రతో కొడతారు. కోయలు వ్యవసాయదారులు. కంచెవేసుకునే ముళ్లకంపతో కొడతారు. కమ్మరులు కత్తికాల్చి కమ్మకు తొడుగుతారు. వారి జోలికి పోకు. వాతపెడతారు.

విశాఖమన్యంలోని గొలుగొండ, మాడుగుల, కాశీపురం సంస్థానాలసేవకై ప్రవేశించిన వాల్మీకులతో ప్రాకినవే యీగాధలు. పొలంపనులు, సామాజికమైన అంతరాలుపెరిగి ఆటలుతగ్గాయి. స్త్రీలు మధ్యాహ్నం చింతపండు పిక్కతీసుకుంటూ, పొలం ఊడ్పులలోపాడే పాటలలో రాగచ్ఛాయలు గీతాలు పెరిగాయి.

**లొల్లోసి పాటలు :**

పెద్దలు ఆ పాటలు పాడుతూంటే పడుచువాండ్లు పోకిరిపాటలతో దాడిచేస్తారు. కుటుంబంలో, సమాజంలో మగవానిపెత్తనం పెరుగుతున్నకాలంలో, సంప్రదాయం తమకు పండుగలో అనుమతించిన స్వాతంత్ర్యం పడుచులు వదులుకోరు. ఈ పోకిరి పాటలకు 'లొల్లొసి' పాటలని పేరు.

**అన్నగారువచ్చిరో ఆకులేలేవో - కంచరాడిదికులవెళ్ళి - కంచలడిగితెండో**
**బావగారువచ్చిరో ఆకులేలేవో - కోయవాడిదికులవెళ్ళి - గోచులడిగితెండో**
**లొల్లొసైరన్నలాల - లొల్లొలోయ్‌లోరె**
**సైలోరె రన్నలాల - సైలోరె లోరె**
**లొల్లోసె అన్నవారికి - లోపలొకపిల్ల**
**సైలోరే అన్నవారికి - సంకనొకపిల్ల**

మనసును, వరుసనుబట్టి ఉంటుంది మన్నవ.

**కంచానబెడుదును - కాముండందును**
**ఆకునబెడుదును - అన్నలందును**
**జబ్బినబెడుదును - జియ్యడందును**

(జియ్యడు – ఈడువాడు; జిబ్బి – అన్నం వార్చే పట్టా)

భర్తయెడ మర్యాదచూపాలికాబట్టి కంచం, ఎలాపెట్టినా ఏమిఅనుకోడుకాబట్టి అన్నకు ఆకు, జియ్యనితో సరసమాడాలి కాబట్టి జిబ్బిలో...

**మాఅప్ప వచ్చిదో - ఏమేమి కూర**
**గొందినున్న కోడిపిల్ల జియ్యరు బయ్యరు కూర** ॥లొల్లోరే॥

**మాబావ వచ్చిడో ఏమేమి కూర -**
**వెలుగునున్న తొండపిల్ల-జియ్యరుబయ్యరుకూర ॥లొల్లోరే॥** (వెలుగు–కంచె)

**మాయప్ప కొప్పలు నూనెముంతలు -**
**మాబావ కొప్పలు గొర్రెగొద్దెలు**
**మాఅప్ప గిట్టలు అంటిబోదెలు -**
**మాబావ గిట్టలు గొర్రెడెక్కలు** ॥లొల్లోరే॥

ఈ ఊరి జియ్యలు ఎలగంటివారు – చావుకాళ్లు చప్పిబుగ్గలు – జీబిమొకాలవారు
ఈ ఊరి అమ్మలు ఎలగంటివారు – కొప్పుకట్లు నల్లపూసలు – నవ్వు మొగాలవారు

**గొర్రెగొద్దెలొక్కచాయ - గోవులొక్కచాయ**
**అన్నిపసుపులొక్కచాయ - అమ్మలొక్కచాయ**
**ఎక్కడనుండి వచ్చిడో బిత్తరి కండ్లబావ**
**గుమ్మము దిగబోయి బుంగదిగినాడు** ॥లొల్లోరే॥

బావగారి బిత్తరిచూపులు ఎందుకో మరదలికే తెలియాలి. కాని ఫలితం మాత్రం వాస్తవం. పల్లపునేలలు సువ్వ తేలుతాయని (చిత్తడి), పొలాలుగా మార్చుకోవచ్చునని, కొండనెత్తంలో ఇల్లుకట్టుకుంటారు. అవికూడా క్రిక్కిరిసిఉంటాయి. 'ఒక్కకుప్పకు మూడు పుట్టులు' (ఒక్కకొండలోనే మూడూళ్ళు) లోచిలిపుట్టు, కుమ్మరిపుట్టు, దుమ్మాపుట్టు.

చూరునుండి వ్రేలాడదీసిన తాడునుపట్టుకొని ఎగుడుదిగుడు మెట్లుచూసుకుంటూ ఎక్కి ఇంట్లోకిపోవాలి, రావాలి. మరదలినిచూసిన హడావిడిలో బావగారి చూపులకు మతిపోతే కాళ్ళు మెట్లలో మడతపడ్డాయి.

**గంతవెనుక గాందువేసె - మిటిక మిద్దెలు వేసె**
**దూరివచ్చిన డోకిబుర్రకు - జియ్యరుబయ్యరుచేసె** (డోకిబుర్ర – బట్టతల)

చుట్టూ గాందుకమ్మింది. ఎవరిఇల్లు ఏదో తెలియటంలేదు. ఏదోఇంట్లోదూరిన డోకిబుర్రబావ ఎవరిని ఏంచేశాడో, ఇంటివాళ్ళు అతనిని ఎలా సత్కరించారో తెలియదు. నర్మగర్భంగామాత్రం పాడుతున్నారు.

ఈ బావగారితో పాటలన్నీ గంతవెనుకనే పాడాలి కాబోలు.

**గంతవెనుక చిక్కుడుచెట్టు - తట్టగాయలుకాసె (తట్ట-లేత, గింజపట్టని)**
**తడివితడివి దేవకు బావ - తాపులుతిందువేమొ॥**
**ఎండ్రికదేవిదో - ఎర్రడెక్కలమన్ను -**
**దేవిదేవి తినకుబావ - దెబ్బలుతిందువేమొ॥**
**మేడిపండు రూపుదోయ్ - లేతపిల్లల తల్లి -**
**వాసనకొప్పదగిలి - వదిలె దానికొంగు ॥**

పెండ్లిలోబాజాలమోత ననుకరిస్తూ ....

**ఇందీడెనా అందీడెనా - పిండికుండలచాటున**
**పెంపీడెనా - మెరియూ - పెంపీడెనా**
**గుజ్జరి గుజ్జరి గుడుజడు - గుజ్జరి గుజ్జరి గుడుజడు - తనినీ .... ॥**

**అద్దరి వీధిన గొడ్డుపడిచచ్చె -**
**మాలలకు మాంసమాయె - మాకు మోసమాయె ॥లొల్లొసై॥**
**దుంపాలు తవ్వలేను - దూలి తుడువలేను**
**కొమ్మవంచి నరకలేను - నేను బతకలేను ॥**
**తీయవాలె తీయవాలె - ఏమి తీయవాలె -**
**దారకొండ వెళ్ళవాలె - దబ్బగడ్డ తీసెవారికి - దెబ్బకొట్టవాలె ॥**

మన్యంలో ఎంతశ్రీమంతుడైనా కష్టపడకగడవదు. కూలీచేయించుకుందామని ధీమాకు పోతే, వారికి అవసరమున్నంత డబ్బుకూడేవరకే కూలిచేస్తారు.

కొందరు దొంగలు, కొందరు సోమరిపోతులు.

**కోడల కోడల కోటిసుందరి -**
**పాలుకూడు తినవమ్మ - పంచలుకవమ్మ**
**పాలుకూడు తినలేను - పంచలుక లేను -**
**నెయ్యికూడు తినలేను - నేలలుకలేను**
**చూడుర చిన్నన్న వదిన - వాలుకాలు -**
**దొంతికుండలచాటు - దొంగరొట్టెలు**
**కూటికుండలచాటు - కూటిముద్దలు ॥**

ఈ దొంగతిండ్ల వళ్ళుబరువు ఒకరకం, తనతోకూడా విరసానికిదిగితే –

**కామన్న దొడ్డి కెళ్ళె న్నెలారి - కారుపుచ్చకాయ దెచ్చిందెన్నెలారి**
**కోసివండుమంటె న్నెలారి - కోయక వండిం దెన్నె లారి**
**ఉప్పవేయుమంటె న్నెలారి - తుప్పన ఊసిం దెన్నె లారి**
**వర్ర వేయుమంటె న్నెలారి - ఎర్రగడ్డ వేసిం దెన్నె లారి**
**వీపుతోముమంటె న్నెలారి - వెనక్కు దొబ్బిం దెన్నె లారి**
**తడిబట్టిమ్మంటె న్నెలారి - తాటాకిచ్చిం దెన్నె లారి**
**జుట్టు వంగదీసె న్నెలారి - మూడైన లాగా డెన్నె లారి**

**ఇటింపండుగ పాటలు :**

**కొండ గొర్రె కొవ్విదోలేదో - కొనవంచి మేయలేదు**
**ఆడబొట్టె కొవ్విదోలేదో - అంటకుండ వారియలేదు**
**మగవాడు కొవ్విడోలేదో - చంద్రహాసం కత్తిపాలు**

దబ్బగొౖరె, కొండగొౖరెలని రెండు రకాలు. బాగాబలిసి మెడవంచి తినలేని – నేలమీద చూపు ఆనని, కొండగొౖరెవంటి జంతువు పెద్దపెద్ద బద్దెలలో ఓదంపాలై చస్తుంది. మరణానికి ముగ్గురు మామలు, ఈ మామ – ఈటె, మా మామ – మంచం, ఓ మామ – ఓదం గొయ్యి.

చంౖదహాసం కత్తులన్నీ సంస్థానాల సైనికత్వంనాటివి. అడవిలో విల్లమ్ములే వేట సాధనాలు. అడవి నశించి, జంతువులు అంతరించి, గిట్టుబాటుగానివేట వేడుకగా మారింది. పొగిడి, పాటలు పాడి, వెళ్ళగొడితేగాని, వేటలకు కదలడంలేదు.

**చలి చీమలదండుగులాగ - సాగిరి - వేటలవారు**
**కూటి చీమలదండుగులాగ - కూడిరి - వేటవారు**
**వేటవెళ్ళెడి అన్నగారు - ఏమికొండలె మట్టుదురు**
**ఏమి కొమ్మలె ఒడ్డుతారు - నీరుడు మారుడు కొమ్మలు**
**బురదగుంట నీళ్ళుతాగి - బూరుగు మెట్టలెక్కి**
**ఏమి కణుసులె వేసుతారు - రివ్వకొమ్ముల బోడకణుసు**
**ఏమి దండెలె గుచ్చుతారు - బంగరపు బాలకణుసు**

లచ్చుమయ్య వేటలకి కదులుతాడు.

బందలు తిరిగినాడు బాతులు కొట్టినాడు
మెట్టలు తిరిగినాడు మేకలు కొట్టినాడు
గుట్టలు తిరిగినాడు గువ్వలు కొట్టినాడు
వెళ్ళువెళ్ళు - పూజారి బాబు - వేలమెత్తే వేలలాయె
వేలము బయలుకని - వేసినారు పాదలేమొ

కుడుకకూరబందలోన కుగుడియున్నది కురిడిపిల్లి
చేతగాని వేటలవారు - చేతికోలలు చెల్లజల్లి
సారుకూరబందలోను - సానిదాని నడకజూడు
గొల్లదాని మొలత్రాడు - గోవులకు కట్టుబందం
గొల్లదాని గోచిగుడ్డ - గోవులకు తలగుడ్డ

**కమ్మరి లచ్చుముడి కారేలు మిరేలు :**

తొలకరిముందు పుట్టలన్నీ చెమర్చగా చలిచీమలువలస ప్రారంభిస్తాయి. అలా కదిలే చలిచీమలవలె, పోరుపెడితే, కదిలే వేటలవారు. ఆడవాళ్ళతో సరసాలకుతప్ప వీరు దేనికిచాలరు. చిట్టీతనేలల్లో అండంగులు (ఈతమొవ్వు), బొడ్డంగులు (మొవ్వులో పురుగు, దానినిండాకొవ్వు) తింటూ గొల్లదానితో సరసాలాడడానికి రోజూ అడవికి పోతారు. సిర్లికణుసు, బోడకణుసులని రెండు విధాలు. సిర్లి, పదిపన్నెండు జంటల కొమ్ములువేసి బలిసిఉంటుంది. బోడకణుసు రివ్వ (సన్నని) కొమ్ములతో పీలగా ఉంటుంది. మీరు కొట్టగలది ఈ పిల్లకణుసులనే. ఇటువంటి వాళ్ళ కోతలు కోటలు దాటుతవి. 'వేటకెళ్లి వేల్పురాజు తెస్తనన్నాడు. కమ్మరి లచ్చుముడు కారాలు మిరేలు నూరతనన్నడు. కుమ్మరిబుడ్డడు కుండతెచ్చి వండుతనన్నడు'.

లింగెటూలిర గంతవెనుక - నింగినేలలే ఒక్కటాయె
లింగరాజుల శిరసులమీద - అదిగోనన్నర గురలమంద
ఏమితోటిర వేయుదమనగ - కన్ను బూర్లుర గర్రులుకట్లు
కట్లదండలె తగులనేద్దాం - అరిచంద్రుబాణముతోడి
అస్తగుండెలె తగులవేద్దాం
సూర్యచంద్ర బాణముతోడి - చుక్కనుదురె తగులనేద్దాం

*దబ్బగొర్రె, కొండగొర్రె, బోడకణుసు, సిర్లికణుసు*

ఈ పాట గూడెం, గోదావరిజిల్లాలో విన్నదే. (బందమాటి బయలలోన బయలు దేరిది గేదెపోతు) పాడేరుమన్యంలోపాట, భావం చాపచినిగి చదరైంది. దాన్ని 'సూర్య చంద్ర హరిచంద్ర...' అంటూ కొత్తగానేర్చిన మాటలతో పూరించుకుంటున్నారు.

మంచుకమ్మినపుడేకాక, వేటలవారు అగ్గులు పెట్టినపుడుకూడా పొగవల్ల నింగి నేలలు ఒక్కటౌతాయి. ఒకమూలనుండి తగులపెట్టుకుంటువస్తే జంతువు ఎదురు మూలకు పారిపోతుంది. అటు కాస్తారు, ఇది అగ్గితోసోపడం. డప్పులతో సోపడం, వలలతో సోపడం, ఓదంతవ్వి సోపడం; సెల, గుమ్మి, రేవువైపు సోపడం, పిట్టవేటలో వలలతో సోపడం; మీటెలు, బద్దెలొడ్డినవైపు సోపడం మొదలైనవి సోపే విధానాలు.

**ఆలినివ్వక అడుగరాదు :**

**బండకిందనేమొ - రామ - బర్రెమామిడేమొ**
**దాని పువ్వులేమొ - రామ - బాలతమ్ముడేమొ**
**దండులోనియేమొ - రామ - బాలతమ్ముడేమొ**
**దస్తుకట్టలేమొ - రామ - విర్రవీగునేమొ**

(దస్తు – తలలోముడుచుకొన్న అలంకారాలు)

**గంత వెనుకనేమొ - రామ - జోడు చుక్కలేమొ**
**జోడుచుక్కలేమొ - రామ - బయలుదేలివేమొ**
**చుక్కలకునేమొ - రామ - చూతమని యేమొ రామ**
**బాలరాజులేమొ - రామ - బయలుదేరెనేమొ**
**పోతుమన్నెలేమొ - రామ - శోభికోటలేమొ రామ**
**పోతునివ్వ కేమొ - రామ -అడగరాదటేమొ**
**ఆరుమన్నెలేమొ - రామ - అరడికోటలేమొ రామ**
**ఆలినివ్వకేమొ - రామ - అడుగరాదటేమొ**
**కంచమంతయేమొ - రామ - శోభికోటయేమొ**
**కాలితోనోయేమొ - మట్టుదూమొ ఏమొ ॥**

అచ్చమైన రామచిలుకలవంటి చుక్కలనుచూడడానికి షోకుచేసుకొని షికారీ బయలుదేరారు దొరలు. ఈ వేషాలుసాగవు. 'పోతునుతీసుకొని పెండ్లిమాటలకురా'

అనిబేరాలు చెపుతున్నారు కన్నవారు. 'మాఊరిఆలిని మీ ఊరివాడు ఎత్తుకుపోయాడు. ఆ తగవుకు మీవాళ్ళు ఎవరూరాక ఏమితేలలేదు – ఆ తగవుతేలితేగాని పిల్లమాట ఎత్తవద్దు' అని ఊరుమ్మడిగా కట్టడిపెడుతున్నారు. 'వీళ్ళను మట్టికరిపించాలి' అని చిందులు తొక్కుతున్నారు. తరతరాలుగా తేలని తగవులకు సమయమొచ్చినప్పుడు సమాధానం చెప్పవలసి ఉంటుంది.

**పితూరీదండు :**

అరవైయారుదుర్గాలకు పోతుమన్నెం లోతుగడ్డ. ఒకనాడు ఇది గొల్లరాజుల రాజధాని. ఇప్పటికీ శిథిలశిల్పాలతో వీరభద్రునిగుడి, గూడెంపాతవీధిలో శ్రీకృష్ణ దేవాలయం జీవకళను కోల్పోలేదు. ఇక్కడ ప్రతిఊరు దుర్గమే. ఊరిచుట్టూ రాళ్ళన్నీపేర్చి కోటెత్తుతారు. ప్రతిగ్రామమునసబు దుర్గనాయకుడు. తరువాతకాలంలో గొలుగొండకు రాజధాని మార్చారు. ఈగొల్లరాజ్యాన్ని, బ్రిటీష్‌ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ సంస్థానాల ప్రతాపం తగ్గిన తరువాత మన్యంమెట్టి, వెట్టిచాకిరీకి నిర్బంధించిన తెల్లవాళ్ళమీద ప్రతికొండవాడూ తిరగబడ్డాడు. ఈ గోచిపాతరాయుళ్ళ సమరోత్సాహాన్ని ఎదుర్కోవడానికి, తెల్లదొరలు దించిన ఎక్కడెక్కడిబలగాలను, మన్యం సుమారువంద యేండ్లపాటు ప్రతిఘటించింది. ఆ ఆవేశంతోపాటు పాడుకున్న పదాలను కూడా ప్రజలు మరిచిపోయినారేమో, దక్కినది ఇది–

**గూడెపుదొరలంత గుడికట్టుకోని - మాడెంపుదొరలంత మాటాడుకోని**
**ఏఊరుదోతమని ఆలోచించిరో - మధ్యాహ్నం మాకారం దొతమన్నారో**
**పొద్దోయి పొట్టెంగి దోతమన్నరో - చలిదికి జర్రెలిదోతమన్నరో**
**మల్లెల మటుకంబు పుల్లయ్యదండు - మరియాదలు కొన్ని మన్ననలు కొన్ని**
**కోడిపొట్లలు కొన్ని సారకల్లులు - సాయంకి తలచిడి సరువు పడలు**
**మరియాదకి కలిసిరి మల్లుపడాలు - అంతట కలకటేరంది వచ్చిడి**
**కొట్టుకొట్టుమని కలకటేరురాగ - మళ్ళేనేయాదండు మన్నెలెంబడి**
**చెదరెనే యాదండు చెలకలెంబడి - పమిడిపిక్కివెళ్ళి పక్కదగులంగ**
**పడ్డడో చంద్రయ్య ఒడ్డెములమీద - వెండిపిక్కవెళ్ళి వెన్నుదగులంగ**
**వెరవడు చంద్రయ్య వెనుకటీయడు - వాడి నడుము నట్టెడి లేడికావించు**

**వాడు శిరసు సిమ్మాలగద్దిగావించు - వాడిపండ్లు పగడాల పట్టుతోరాలు**

దారబందాల చంద్రయ్య పితూరి నాయకులతో ప్రముఖుడు. వాని శౌర్యానికి జాన పదులెత్తిన నివాళియిది. ఈ పితూరీదార్లందరు వీరమరణంచెంది జానపదుల సానుభూతిని సంపాదించుకున్నారు. గురజాడవారి పూర్ణమ్మలో ('కన్నులకాంతుల కలువల చేరెను') శిల్పానికి ఈ గేయాలు ఒరవడిదిద్దాయి. వశమైనతరువాత పగవారు కసినంతా చూపిస్తారు. వేటాడి సంపాదించుకున్న అలంకారాలు వీరలాంఛనాలు.

**పులిఉన్నకోనంకు వేటకెళ్ళారో - తగవున రాచకొడుకులురులొడ్డబోగా**
**అతనికి పడ్డది సవరాల మెకము - దానిశిరసు సీతమ్మ చిరుగద్ది పీట**
**దానిపండ్లు పార్వతికి పగడాల పేరు - దానిగోర్లు గొంతెమ్మ గొలుసుల పేరు**
**దానితొక్క దొరసాని అద్దంపు రవిక...**

మగడో, కొడుకో వీరోచితంగామరణిస్తే ఆభార్య, తల్లి తాత్కాలికంగా దుఃఖించినా శాశ్వతంగా గర్విస్తారు. కాని పోరాటంలో పిల్లవాడి ప్రాణం సంకటంలోపడితే ప్రతితల్లి ఇలాగే కలవరపడుతుంది.

**ఈడెల్ల మర్రికాడ - వుగ్గల్ల పుట్టకాడ**
**కారేటి రకతమంత కడవల్ల పట్టినారు -**
**చిమ్మేటి రకతమంత సీసాల పట్టినారు**
**ఏదారినొత్తవు కొడుకా బల్లోజి గురువులయ్య**
**బల్లోజి గురువులంటె బలవంతులనుకుంటె -**
**బండిదారివత్తనమ్మ కన్నతల్లి నరుసమ్మ**
**మునసబు లొచ్చినారు ముందట కాసినారు -**
**ఏదారినొత్తవు కొడుకో నాకన్నతండ్రి గురువులయ్య**
**పాలెగాళ్ళు వచ్చినారు పొలిమేర కాసినారు -**
**ఏదారినొస్తవు కొడుకో బల్లోజి గురువులయ్య**
**కరణాలు వచ్చినారు గడపల కాసినారు -**
**ఏదారినొస్తవు కొడుకో బల్లోజి గురువులయ్య**

ఈపాటపాడిన కొండపల్లిప్రక్కన రాజవొమ్మంగి (రాజు – శ్రీరామరాజు) దగ్గరలో, ఆయన దోచుకున్న అడ్డతీగల, రంపచోడవరం పోలీసుస్టేషను, ఆయన తపస్సుచేసిన తపసుకొండ (తబిసి చెట్లున్నకొండ. ఈమాటే మరుగునపడి కొత్త వ్యుత్పత్తి ప్రచారంలోకి వచ్చింది). రామరాజు సహాధ్యాయమైన డిప్యూటీకలక్టరు పనుపున దుచ్చెర్తిముఠాదారు రాజుకిచ్చిన 'రాజుగారితోట', 'యార్లగడ్డ'రామ'వరం', 'పలకజీడి', 'గుర్తేడు' మీదుగా 'దారకొండ', 'చింతపల్లి' యివన్నీ రామరాజు విహారభూములు. ఆ ప్రాంతమంతా, ఆనాటి అనుభవాలను చిలువలుపలువలుగా చెప్పుకునే గ్రామవృద్ధులు. దారబందాల చంద్రయ్య వీరమరణాన్ని కీర్తించిన మొదటిపాట చింతపల్లి, పాడేరుదారిలో సుప్రసిద్ధ మైనది. ఈమార్గం నాడు కాకులుదూరనికారడవి. స్వాతంత్ర్యవీరులకు నెలవైన 'పులులున్న కోనం'. నాడు వెట్టిచేయించి కట్టించుకున్న గంగరాజుమాడుగుల వెట్టి బంగళా. బంగళాప్రక్కనే కొర్రుదిగిన పొలం–డొలువుడుచేసిన చేను (పితూరీలో ముందుచేరాడు. పట్టుకోవడానికి మలబారుదండు వస్తున్నదని తెలియగానే తనను వదిలిపెట్టరని భయపడి తానే ఆపొలంలో కొర్రుదిగి మరణించాడు.) ఆపైన కొండల కోడపల్లిలో రామరాజు దేవీపూజలో పరిచారకుడైన ధన్యజీవి శ్రీకోరబుకొత్తంనాయుడు. నాడు సాయుధపోరాటంనడిపిన బందబయలు అండమానుదొర, గాముదొర, గంటందొర, మల్లుదొరలు. అడుగడుగునా ఆయా స్థలనామాల్లో చరిత్రకెక్కని ఘటనల ఘనతలు.

**మినుములూరు బాటరావాలె – ముఠాదారికట్టు పోవాలె :**

భీతావహులైన ప్రజలచేత తరువాతకాలంలో ముఠాదార్లు మరింత వెట్టి చేయించుకునేవారు. అపుడు శ్రీ మందేశ్వరశర్మ 'ఆంధ్రశ్రామిక ధర్మరాజ్య పరిషత్తు' నాయకత్వంలో 'మినుములూరు బాటరావాలె – ముఠాదారికట్టు పోవాలె' 'మిత్తికోసం గొత్తిపని మానాలె' (మిత్తి=వడ్డీ; గొత్తి=వెట్టి) అంటూ కోదుమత్రికామయ్య, మల్లు సావొత, రూకాసొక్కపతి, ఉబ్బేటి రంగారావు, కంఠామత్స్యాలు మొదలైనవారంతా నిర్వహించిన సత్యాగ్రహోద్యమాలలో నూలువడకడంలో, వయోజన పాఠశాలల్లో అన్ని జాతులవారు పాల్గొన్నారు, జైళ్ళపాలయ్యారు. గిరిజనులు అసమర్ధపునాయకత్వాన్ని భరించగలరుగాని అహంకారపునాయకత్వాన్ని సహించలేరు. సమయంచూసి ముఠా

దార్లు, తుపాకిగుండ్లతోపాటు తామూ ఒక రాయివిసురుతున్నా, ఈ ఉద్యమాలు వెనుకంజ వేయలేదు.

**జైలనగా మిగులసుఖము వీలుగ మనకు**
**పప్పు పదితులాలు - పైనకారము రేషన్ -**
**తక్కెడలోపెట్టి - చక్కగ తూచివ్వవలెను**
**రొచ్చుకంపు ఇకలేదు - గచ్చుచేసిన లోగిళ్ళు**
**ఇచ్చియున్న ఋణదాతలు - వెంటరారు మనకిపుడు**
**వేళ వేళకు స్నానాలు - వేడి వేడి భోజనాలు**
**వెంటబాయరు డాక్టర్లు - జంటనుందురు నౌకర్లు ॥**
**మనకొద్దీ జమిందారు పొందు**
**పంటపోయినగాని పన్నులువిడువక - రెండుచుట్లను వేసుతాడు**
**దేవ ఏజెంట్లనుసిగొలుపుతాడు - కాదంటే మమ్ములను కాల్చిపారేస్తాడు**
**మనకొద్దీ జమిందారు పొందు**

(జమీందారు – మాడుగుల, జయపురం; ఏజెంట్ –ఏజెంట్ టు ది గవర్నమెంట్ అంటే జిల్లా కలెక్టరు; ఏజెంట్ పరిపాలించేది ఏజెన్సీ, మన్యం)

**చెట్టుకు పన్నేస్తాడు రాతికిపన్నేస్తాడు భూమికి పన్నేస్తాడు**
**చీటీ పొందకపోతే జైలుకు పంపిస్తాడు ॥మనకొద్దీ ఫారెస్టుకట్టు ॥**

ఈ పాటలన్నిటినీ మన్యం ప్రణవమంత్రాలుగా సాధనచేసింది. మర్రిచెట్టు తన ఊడలతోనే తాను విస్తరించినట్లు, తనకుదురులోనే తాను పెరిగే గిరిజనసమాజంలో అభిజాత్యాలను సడలించి ఐకమత్యానికి ఈఉద్యమాలు దారులువేసాయి. కాని గోమాంస విధినిషేధాలు, పాలక, పాలితభేదాలు, సంస్థానాలసేవలు, సంస్కృతీ కరణాలు, వృత్తులు, వాటిచరిత్రచెల్లిపోయినా పాలకవర్గాలలో ఆ నీలుగుడుచావలేదు.

❈

" మీలాటికాలమురాగ మిమ్మతలచి పాడతాము "



మినుములూరులో మోదకొండమ్మ పాదాలు

" మాతంగ కన్యాం మనసాస్మరామి "



పాతపాడేరులో మాలగంగుపాదాలు

# మోదకొండమ్మ కథ :

మీలాటికాలమురాగ మిమ్ముతలచి పాడతాము
పాండవులకథలు పాడి, పంటభాగ్యాలతో అభ్యుదయాన్ని కాంక్షించినట్లే –

వర్ణధర్మాల ఉక్కుచట్రంసడలి, పాలకుల ఐశ్వర్యం – ఆశ్రితుల నైపుణ్యం, బగతల నాయకత్వం, కొండదొరల కష్టజీవితం, మాలల లోకజ్ఞత, కమ్మరులపనితనం వియ్యమంది ఈ అంతరాలు చెరిగిపోయి, ఎల్లలోకము ఒక్కయిల్లు కావలెనని, నిలచిన నింగిదేవతను – తొక్కిన భూదేవతను, ఆనీడలు తోడులివ్వమంటూ పొలాలు ఊడ్చే పడతులు మాలగంగు, సంజీవరాజులపెండ్లిపదాలలో కోరుకుంటున్నారు.

సప్తమాడెములుగా ప్రసిద్ధినొందిన కళింగారణ్యాలు సప్తమాతృకల జన్మస్థానాలు. దుర్గ వింధ్యాచలవాసిని, మలయవాసిని. నందపురం జయపురం సంస్థానపు పూర్వ రాజధాని. అక్కడదేవత మాకలి, ఆమెభర్త భైరవుడు. ఆమెతమ్ముడు వెంకటేశుడు. వెంకటేశునిభార్య దేవేంద్రాలు – దిగువన నర్సీపట్నం. వడ్డాదిమాడుగుల దారిలో రాపల్లెనుపరిపాలించే దేవేంద్రుని చెల్లెలు. వెంకటేశుని చెల్లెలు రాచగన్నియ దేవేంద్రుని భార్య.

ఒకనాడు వేంకటేశునికొడుకులు 'దేశిరాజులు' వేటమార్గాన విహరిస్తుండగా, మోదమ్మకొండ పాదాలకింద (మన్యం దిగువసరిహద్దు) దేవేంద్రునికూతుళ్ళు ఏడుగురు 'దుర్గాండ్లు' దసులుతారు. ఆ ఏడుగురురాకుమారులు – దుర్గాండ్లు, కళ్యాణపులోవలో దొంగ పెండ్లిండ్లౌతారు.

ఈ వార్తవిన్న దేవేంద్రుడు అల్లుండ్లను పిలిపించుకొని దొంగపనులు చేసినందుకు ఏడుగడియలశిక్ష వేస్తాడు. ఆ శిక్ష అవమానంగా భావించిన రాకుమారులు పొడుచుకొని చచ్చిపోతారు.

కొంతకాలానికి ఆడపిల్లలు ఎదిగి యజమానులై మారుమనువులకు పోతారని, పుత్రసంతానం లేకపోతే కోటలు, పేటలు రైతురాణువకు దిక్కుండదని సంతానంకోసం దివ్యతిరుపతులు యాత్రలుకదిలాడు వెంకటేశుడు. దేవేంద్రుడుకూడా అనుసరిస్తాడు. కాని దిగువవాడు దేవేంద్రుడు 'పదివేయిమాయలు'గలవాడు. 'కన్నగాడు కత్తి మరవడు

– వెజ్జుముండ చెడిపి మరవదు' అన్నట్లు వానిబుద్ధి ఊరికేఉండదు. నా తమ్ముడు (బావను తమ్ముడంటారు) సత్యం చూస్తానని ఎండలుకాయించాడు. వెంకటేశుడికి దాహం అయింది. మరలతానే అంజనంవేసి 'ఆరువేయుల పూరుబయలు' వెదకిచూసి కగ్రియావుపాలుతెచ్చి తానే దాహంతీరుస్తాడు. దివ్యతిరుపతులు వెళ్ళడమంటే మాటలు కాదు. ఇల్లు, వళ్ళు, బాండువ శుద్ధికావాలి. సత్తేడుసంద్రాలలో తానమాడి సుద్దులు, సుబ్బరాలుచేసుకొని పోవాలెనని, తానమాడేబసలో గొడుగులు నిలిపి తానంచేసి కదులుతూ, గొడుగులు మరచిపోతారు. గొడుగులు తేవడానికి వెనుకకువచ్చిన వెంకటేశుడు తిరిగివస్తూ సముద్రంలో అడుగులుజారి మునిగిపోతాడు. దేవేంద్రుడు దుఃఖిస్తూ వెనుకకు మరలుతాడు.

ఆరుగురుదుర్గాండ్లకు పెద్దది మోదమ్మగర్భాన సంజీవరాజు దండెలో దేగ వేసుకొని పుడతాడు. అతడు వేటలకు వెళ్ళినపుడు దేగ ఎగిరిపోతుంది. దేగజాడ వెతుకుతూ పూలగండువనం గంతవెనుక ఆలపాటలుపాడుతూ – అడవిరొడ్డలేరుతున్న మాతంగకన్య, మాలగంగు దగ్గరకువస్తాడు. ఆమె కిడుగనూరి దేశంలోని (దోరశి) మండెబుపర్వతాన మండికొయ్యలకు జన్మించింది. ఆజాణ తనచూపులకు ఓడిపోయిన సంజీవరాజు చేత కూరకావళ్ళు మోయించి, గొడ్డుమాంసం తినిపించి, చేతనైనంత ఏడిపించిగాని దేగనివ్వదు. మాలకూడుతినివచ్చి మాలబొట్టెను తెస్తానన్న కొడుకును మోదమ్మ ఇల్లుతూరనివ్వదు. ఆరుగురుతల్లులకు, రాజ్యానికంతటికీ ఒక్కాగానొక్క కొడుకు, ఏం అఘాయిత్యం చేసుకుంటాడోనని తల్లులు మాకలిశక్తికి కబురంపుతారు. మాకలిశక్తి పరుగుపరుగున వచ్చి గంగుగారి అందపుమెరుపులకు ఆశ్చర్యపోయి, 'జాతికి తక్కువ గాని, జనమరాసు లెక్కువ, పుట్టుకు తక్కువగాని పూర్వరాసులెక్కువున్నవి' అని గ్రహించి సంజీవరాజుకు పెండ్లిచేస్తుంది.

జాలంపల్లిదగ్గర కొత్తపల్లిలో మోదమ్మ చెల్లెలు ముప్వలమ్మ (మావుళ్ళమ్మ) అద్భుతవిగ్రహం మన్యమంతా శక్తిపీఠాలకు ఆలవాలం అని స్పష్టంచేస్తుంది. నర్సీపట్నం దగ్గరలోగల వజ్రగడంలో ఎత్తైనది సంజీవి కొండ; కళ్యాణపులోవ నేడు ఆపేరిటి రిజర్వాయర్; మాడుగుల సంస్థానంలోని దోరశిలో మాలగంగు, జయపురం

సంస్థానంలోని నందపురం మాకలిశక్తి, దేశిరాజులు, గొలుగొండ (వజ్రగడ) సంస్థానంలోనికొండ పేరిటి సంజీవరాజు, మోదమ్మ ముప్వలమ్మలాదిగాగల దుర్గాండ్లను దేశిరాజులు గాంధర్వవివాహమాడిన కళ్యాణపులోవ; వీరిగాధను రాజ్యాల, జాతుల సమైక్యతకు ఆధారంగా నిలిపిన దార్శనికులు గిరిజనులు.



కొత్తపల్లిలో ముప్వలమ్మ

ఆరుగురుదుర్గాండ్లలో మోదమ్మఒక్కతే మన్యానఉండిపోయింది. మిగిలిన దుర్గాండ్లు పల్లాన పదివేయులు పంచుకొనిపోయినారు. గంగు సంజీవ రాజులు మినుములూరున ప్రవేశించారు. గంగుగారు తానమాడినగుండం, పూలగండువనం, మాలగంగుమెట్ట దివ్యస్థలాలు. మోదమ్మ పండుగ ప్రతి సంవత్సరం వైభవంగా చేస్తారు. అరువుతెచ్చుకున్న ఆటగాళ్ళతో పోటీలు, రికార్డింగ్ డాన్సులు, బాండు మేళాలుతప్ప అప్పుడు ఈపాట మాటెవరికీ తోచదు. పాతపాడేరులో రోడ్డుప్రక్కన పడివున్న గంగుగారి పాదాలు మనసును కలవరపరుస్తాయి. చరిత్ర విస్మరించే జాతి వృద్ధిలోకిరాదు. ❊

## కొండవారి-దిగువవారి దృక్పధాలు



## కొండరాజుల - దిగువరాజుల చుట్టరికాలు



## మోదమ్మ పదం :

### మీలాటి కాలమురాగ – మిమ్ముతలచి పాడుతాము :

శరణుశరణు దుర్గాండ్లమ్మలు - మీ చరణాలు తప్పలేను
మీచరణాలుతప్పినగాని - తుమ్మెదీరో - మీ కరుణాలు తప్పలేను
మీలాంటి కాలమురాగ - తుమ్మెదీరో - మిమ్ము తలచి పాడుతాము
ఇంటి ఇలవేలుపులార - తుమ్మెదీరో - మాయందున సాయముండుడు
శరణుబాబు దేశిరాజులు - తుమ్మెదీరో - శరణుబాబు సంజీవరాజు
శరణుగాద గంగుగార - తుమ్మెదీరో - శరణుబాబు సంజీవరాజు
ఓ... మరచిన నుడుగులు బాబు - మతియందు గొలుపవాలె
తెలియని నుడుగులుబాబు - మాకుతెలియచెప్పవాలె
తప్పపాడెము తగులపాడెము - తుమ్మెదీరో - కోపచింతలొద్దుబాబు
మామీద దయలుంచుడు - తుమ్మెదీరో - మామీద సాయముంచుడు
నల్లపూస కొడివల్లన - తుమ్మెదీరో - నారు నాకు నడియవాలె
పచ్చపూస కొడివలన - తుమ్మెదీరో - పదము నాకు నడియవాలె
ఎర్రపూస కొడివలన - తుమ్మెదీరో - ఎలుగు నాకు నడియవాలె
శరణుబాబు మాకలిశక్తి - తుమ్మెదీరో - నందపురమున వెలిసియున్నది
శరణుబాబు దేబాలమ్మలు - తుమ్మెదీరో - మీ చరణాలు తప్పలేము
ఓ... చదువు సాములు లేనివారము - తుమ్మెదీరో - ఇటింపండుగ చేసుతాము
మసిరుసి బట్టలతోను - తుమ్మెదీరో - మిమ్ముతలచి పాడుతాము
ఎనలవారు జతలవారు - తుమ్మెదీరో - మీకు దండము తల్లూలార తుమ్మెదీరో

### దేశిరాజులు – దుర్గాండ్లు :

మాకలిశక్తికి వెంకటేశుడు తమ్ముడు, భైరవుడు భర్త. వెంకటేశుని పెండ్లాం దేవేంద్రరాలు (దేవేంద్రుని చెల్లెలు). దేవేంద్రుడు రాపల్లెకు (కొండదిగువ వడ్డాది మాడుగుల, నర్సీపట్నం నడుమ గ్రామం) రాజు. భైరవునిచెల్లెలు రాచగన్నిక దేవేంద్రుని భార్య. వీరు బావమరదులు. వేంకటేశుని సంతానం ఆరుగురు దేశిరాజులు ముస్తాబులై కొండమీద షికారు చేస్తా ఉంటే – దేవేంద్రుని కూతుర్లు దుర్గాండ్లు.

రేపల్లె డేర్గాలకు తుమ్మెదీరో - విధములేని ఆటలమ్మ
ఆడతానె ఉన్నారమ్మ తుమ్మెదీరో
ముత్యాలది రోకండ్లేమొ తుమ్మెదీరో గవ్వలది చేటలమ్మ
వచ్చి వచ్చి రాజులేమొ తుమ్మెదీరో - మోదమ్మ రోకలేమొ తుమ్మెదీరో
అలవిగాగ పట్టినారు తుమ్మెదీరో - లెగదెబాబు రోకలెమొ తుమ్మెదీరో

**దుర్గాండ్లు :**

ఓ...చెల్లెల ఓ సైదోడ ఓ వెన్నుదోడ
మారోకలి లెగదుబాబు తుమ్మెదీరో - మరేలాగ చూడుమన్నారు
అలివిగాని దుర్గాలమ్మలు తుమ్మెదీరో - ముఖములు చూసినారు
తలఎత్తి చూడగేమొ తుమ్మెదీరో - వారేబాబు దేశిరాజులు
ఓ...అప్ప ఓ మోదమ్మ తుమ్మెదీరో - ఏదేశపు రాజుబాబు
ఏదేశపు గులాపువారు తుమ్మెదీరో - మారోకండ్లు పట్టినారు
అలవిగాని మోదమ్మ తుమ్మెదీరో - కోపములు పడుత ఉన్నది
మీకండ్లు పేలిపోను తుమ్మెదీరో - మీ గుడ్లు చిదికిపోను
ఏ దేశపు దేవతూలుతుమ్మెదీరో - ఏ దేశపు రాజులమ్మ
అలవిగాని మోదమ్మ ఓ... తుమ్మెదీరో - కాని కంగారి మాటలమ్మ

**దేశిరాజులు :**

పాపగాద పాపగార తుమ్మెదీరో - ఆలించు అర్థములు
మాలలము మేముకాము తుమ్మెదీరో - దాసులము మేముకాము
మీకోసమే వచ్చితిమి తుమ్మెదీరో -
మాయమ్మగ మాకలిశక్తి మీకు మేనగఅత్త అవుతది
మాబాబు బయిరూడు తుమ్మెదీరో - మీకు మేనగమామ అవుతడు
మీ బాబు దేవేంద్రుడు తుమ్మెదీరో - మాకు మేనగమామ అవుతడు
మీ అమ్మ రాచగన్నియ తుమ్మెదీరో - మాకు మేనగఅత్త అవుతది
మేనమరదండ్లు మీరు మాకు తుమ్మెదీరో - మీకోసమే వచ్చినాము
ఆలకించిరి మువ్వలమ్మలు తుమ్మెదీరో - ఆలోచించిరి కన్నతల్లులు
అందరికి పెద్దదుర్గ తుమ్మెదీరో - అలవిగాని మోదమ్మవో

**దుర్గాండ్లు :**

**మనకు తండ్రిలేడుబాబు తుమ్మెదీరో - పదమ (ప్రథమ) తండ్రిగ ఉన్నడు మనకు**

**కారకుడు కన్నతండ్రి తుమ్మెదీరో - కాచితె కాచుతాడు**

**కాయకుంటె ఖండించుతాడు తుమ్మెదీరో -**

**వేగురాన దిగుడుబాబు చెల్లెలా సైదోడ**

**చేటలు జల్లినారు తుమ్మెదీరో - కొలువులోన నిలిచినారు**

**ఆరుగురు దేశిరాజులు తుమ్మెదీరో - వెంటనైన వెళ్ళిపోయిరి**

**కొత్తపల్లి మువ్వలమ్మ :**

**అందరికి చిన్నదమ్మ తుమ్మెదీరో - ఆదెబాబు మువ్వలమ్మ కొలువైన దిగదుబాబు**

**ఓ...భయములు పడుతున్నది సిగ్గులు పడుతున్నది**

**చేయులుపట్టి లాగుతూనే ఉన్నదిబాబు కదలదయ్య కన్నతల్లి**

**అలవిగాని కొత్తయ్య ఓ తుమ్మెదీరో - అందరికి చిన్నవాడు**

**వానిమీద మువ్వలమ్మకు తుమ్మెదీరో - మనసు నిలిచియున్నది**

**మరదలిల్లు మాలయిల్లు తుమ్మెదీరో - నీశక్తి మాతరము లేదన్నారు**

**అలవిగాని కొత్తయ్య ఓ తుమ్మెదీరో - చేరరాగా**

**ముఖములోన నిలచిరిబాబు తుమ్మెదీరో - ముసుగునవ్వు నవ్వుకోని**

**కొలువులోన నిలిచిరిబాబు తుమ్మెదీరో**

అలవిగాని కొత్తయ్యకు పెళ్ళులైన చేసుకొని

ఓ... అత్తగారు బావగారు ఇంటికైన వారు పోయి కొత్తపల్లి పోయినారు

కొత్తపల్లి మువ్వలమ్మ తుమెదీరో – నీకు దండాము కన్నతల్లి

**దొంగ పెండ్లిండ్లు :**

ఓ... ఆరుగురు దేశిరాజులు ఆరుగురు దుర్గాలమ్మలు –

వారైన కూడుకొని రతలైన ఎక్కినారు

ఆకాశ మండలాన పెద్దగెద్దులలాగబాబు

రతాలైన వెడత ఉన్నయి పులులు దూరనట్టి పుల్లలైన సిడగలుబాబు

కాకులు దూరనట్టి కారండపడవిలోన రతలైన యాపినారు

*కొత్తపల్లి మువ్వలమ్మ తుమ్మెదీరో - నీకు దండాము కన్నతల్లి*

శరణు శరణు దుర్గాలమ్మలు ఉపజాప మంత్రములు వారేలాగ మంతరించిరి
కారండపు అడవిలోన వారేలాగ జల్లినారు.

కోటలు, పేటలు, మిద్దెలు, గాలిపురి మేడలు కలిగిపోయింది. రైతు రాణువంత పిలిపించుకొని దొంగపెండ్లిండ్లౌతున్నారు.

అగదులు ఎగురుతున్నవి, దగదులు మోగుతున్నవి, అక్కడ అగదులు ఎగురుతుంటె రాపల్లె రామకచ్చేరిలో కొలువులై దేవేంద్రుడు ఆలకించినారు. ధరణి ఒకతొనుకు తొనికిపోతున్నదట. దుర్గాండ్లకు, దేశిరాజులకు దొంగపెండ్లిండ్లుగద. శీతగాలి కమ్మినట్లు సీమచినుకు తగిలినట్లున్నది, ఆ అగదులు రణబేర్లు.

పుడితిని బుద్దెరిగితిమిగాని ఎన్నడింత ఆగదులెరుగము. రాజ్యమున రాజుపుట్టిడ, దేశమున దేవుడుపుట్టిడ, రాజ్యమంత చిట్టచీకటి కమ్మిపోతున్నది. నా కూతుర్లు, మా అల్లుండ్లు దేశిరాజులు ఉండవచ్చు!

వేగురానవెళ్ళి పిల్లలున్న మేడలకు వెళ్ళిచూస్తే లేదు. "నాకెరుకలేకుండ దొంగ పనులుచేసి దొంగపెండ్లిండ్లు అవుతున్నారు. ఈడుజోడుగల్ల రాజులకు, గౌరవంగ పెండ్లి చేద్దాం అంటే దొంగపనులు చేసినారు. మాయప్ప మాకలిశక్తికేం బుద్ధిలేద, మా బావ బాయిరూడుకు జ్ఞానంలేద. ఎదురుగవస్తే ఇయ్యకపోదున, గౌరవంగ పెండ్లిచేయక పోదున. తగనిపని చేసినందుకు కోపం" అని వేగురాన జాబురాసి బారికవానికిచ్చి పంపినాడు. ఆ జాబు అందుకొని అందరికి పెద్దది మోదమ్మకిచ్చారు.

'కారకుడు కన్నతండ్రి – కాస్తే కాస్తాడు కాయకపోతే ఖండించుతాడు' అని అందరు కల్లేనపులోవ (కళ్యాణపులోవ) వెనకబెట్టి రాపల్లి దేర్జాలకు పయనమైనారు.

## ఏడుగడియల శిక్ష – ఆత్మహత్యలు :

**మామగాద మేనమామ - మామగాద కన్నమామ**
**వలపల దిరిగి వందనము - దాపల దిరిగి దండము**

మీరు తప్పుపనులు చేసినందుకు కోపంపడితిని. మీకున్న భయములేదు, మీకున్న కొదువలేదు. అరనిముసము శిక్షలు వేస్తాను అని చుట్టూర కోటల తలుపుడెక్కి అందరిని ఒక్కకాడ కూడేసినాడు.

అందరికి పెద్దరాజు ఈ శిక్షలో మనం చచ్చిపోయిన మంచిదిగాని మనము బతికిన ఫలములేదు అని అందరు పొడుచుకొనిచచ్చి గుండమైపోతారు. రాజ్యమంత చిమ్మచీకటి కమ్మిపోయింది. దేవేంద్రుడు ఏమికారణాలు అని రాజమంతా చాటింపు చాటిస్తూ ఉన్నాడు.

పంజరంలో ఉన్న రామచిలుకలు, హంసలు, బాతులు, గోరలు, మైనలు అమ్మ! రాచగన్నియ మాదొక్క మనవి తల్లి; ఏమంతె ఏమనుకోకు, మీ ఆరుగురు అల్లుండ్లకు మీ బావ దేవేంద్రుడు కల్లేనపు లోగిలిన దొంగపెండ్లిండ్లు అవుతుంటె మీ బావ పిలనంపి – సంకెళ్ళువేస్తే పొడుచుకొనిచచ్చి గుండమైపోనారు. అప్పుడు రాచగన్నియ తలుపుడెక్కి చూస్తే అయ్యో తల్లిముండ ఉండగనే కూతురుకూడా ముండవా అని రాచగన్నియ పక్కనున్న ఆబాకుతీసి పొడుచుకొని తానుగూడ గుండమై పోయింది.

**తీర్థయాత్రలు – వెంకటేశుని దుర్మరణం :**

వేంకటేశుడు ఆరుగురు దుర్గాండ్లకు మేడలుకట్టి తీర్థయాత్రలు వెడుతుంటే దేవేంద్రుడు

**తమ్ముడ ఓ సైదోడ - తమ్ముడ ఓ వెన్నుదోడ**
**నీవైన యాలకించు - అడుగులైన నిలిచి నీవు**
**ముందుకు వెళ్ళిన అడుగులమ్మ - వెనుకలైన తగ్గినాడు**
**శరణుశరణు వెంకటేశు - యింటికైన నిలచెనోయి**

మన ఆడపిల్లలు ఎదిగి యజమానులై మారుమనువుకు వెళ్ళిపోతే మనకెవరు దిక్కు లేదుగద. మనం యాత్రలువెళ్ళి పుత్రసంతానంకలిగితే మగపిల్లలుకలిగితే మన కోటలు పేటలు రైతురాణువకంత మనదే పేరు. అలాగని దివ్యతిరుపతులు యాత్రలు వెడుతున్నారు. నేను కూడా వస్తానని దేవేంద్రుడు పయనాలు గట్టినాడు.

నా తమ్ముడు సత్యముచూస్తాను. నేనొక అగదుచేస్తాను. ఈ అగదుకు ఆగుతాడ లేద! దేవేంద్రుడువెనుక, వెంకటేశుడుముందు. మూడునేత్రాలు గల్లవాడు దేవేంద్రుడు. రెండునేత్రాలుగల్లవాడు వెంకటేశుడు. వేయుమాయలవాడు వెంకటేశుడు. పదివేయి మాయలుగలవాడు దేవేంద్రుడు. దేవేంద్రుడు పెట్టిన అగదుకు భూమి, ఆకాశాలు బద్దలయ్యే ఎండకాస్తుంది. వెంకటేశుడికి దాహంపుట్టింది. ఆరువేయుల పూరుబయలు. తలమీద చేయివేసి ప్రార్థించి చూస్తున్నాడు. బయలుమీద వేంకటేశుడు. చూడచూడగ

గొల్లవాడు పసులుకట్టియున్నాడు. ఆ పశువులలో కర్రియావుపాలు అరగుంచాన కుంచెడు తీసుకొని దాహం తీర్చుకొన్నారు.

దివ్యతిరుపతులు వెళ్ళడమంటె – శుద్దులు తానాలుచేసి ఉండవాలె. సత్తేడు సంద్రాలు తానంచేస్తేనే పెదతిరుపతి వెళ్ళడం అని ఆబసలో గొడుగులిడేసి తానమాడి కదలిపోయినారు.

గట్టులోన యిడితిమి మనగొడుగులు - తెమ్మనిపంపిడి దేవేంద్రుడు. వెంకటేశుడు గొడుగులేరుకునివస్తూ సంద్రాన అడుగులు జారి, అలాగే ఉండిపోతే, తమ్ముడా అంటే తమ్ముడులేదు ఏంలేదు. యాత్రలేదు ఏమిలేదు తిరిగి వచ్చినాడు.

**సంజీవరాజు పుట్టుక :**

వారు నాలాగుండగా దుర్గాండ్లు మగళ్ళుపోయినందుకు ఏడ్చిఏడ్చి కళ్ళనార్చుకొని దుఃఖాలు మరుచుకొనిఉంటారు. మోదమ్మకు పాపకష్టాలు, పాపనొప్పులు కలుగుతవి. మంత్రసాని కాలుచేతులు పట్టి మట్టివరుగుచేస్తే.

సరవాల సంజీవిడేగ, వెండికుచ్చుల వేనపుడేగ, పమిడికుచ్చుల బంగారు దారాల డేగ దండెలోన వేసుకొని సంజీవరాయుడు జలిమిస్తాడు. డేగనుచూసి కోపంపడి మొగముచూసి మోదమ్మ చెపుతుంది. 'వీడు మాలకూడు తింటాడు, మాలబొట్టెకు తెస్తాడు, మనవాడుకాడు' అని మొహంతిప్పుకుంటుంది. 'లేకలేక ఆరుగురు తల్లుల సందు దొరికినాడు. మనకోటలు పేటలు రైతు రాణువకొక్కడే దిక్కు' అని పినతల్లులు పేమతో పెంచుతూండగ ఉంగరాల బొంగరాలబాల యీడుకొస్తాడు. ఈడుకొస్తే మేళాలు కట్టిస్తున్నాడు. వీటిమేళం విజ్జోటిమేళం, సానిమేళం, సంగీతమేళం. మండేబుపర్వతాన మండికొయ్యలకు జలిమించిన గంగుగారు అప్పుఇద్దరు మేళాలకు కదులుతున్నారు.

**మేళాలకు కదిలే గంగుగారు :**

అలవిగాని గంగుగారు, – ఉట్లపై చమురులేమొ – మట్లందు దించినాది
ఓ...మెరుగకని చేసిరిబాబు – మినపపిండి మరదనాలు
చాయకని చేసిరిబాబు – చోడిపిండి మరదనాలు
ఉట్లపై నూనెలేమొ – మట్లందు దించినాది

*మెరుగుకు మినపపిండి, చాయకు చోడిపిండి మర్దనాలు*

చేరేడు నూనెలు - చేతియందు తీసినారు
మానెడు నూనెలు తీసి - మానాపతివారి చెలులు - మాడందు పెట్టినారు.

వన్నెలది దువనిబన్నె - వెల్లచిక్కులు తీసినారు
బంగారపు దువనిబన్నె - బాగుగ దూసినారు
వన్నెలది దువనిబన్నె - పాయలైన తీసినారు
జడకు తగునని - జడకుచ్చులు వేసినారు
అరపడి సొమ్ములు - అద్దపుచీరెలు తుమ్మెదీరో - అందమైన గంగుగారొ
అప్పగాద పెద్దయప్ప తుమ్మెదీరో
ఆటలకి సాటింపులు తుమ్మెదీరో మన బావ సంజీవరాజు

తొలకరి మెరుపులు మెరసినట్లు తుమ్మెదీరో
తోలెటెండలు గాసినట్లు తుమ్మెదీరో
అద్దపు మెరుగులు నిద్దపునీడలు తుమ్మెదీరో అందమైన గంగుగారు.

పాపడిబిళ్ళలు నెలవంకలు - కొప్పులకు కొనగొలుసులు
మట్టెలకు పిల్లెండ్లు - బాజుబందులు పలకసార్లు
ముత్యాలమంజూరులోన తేలినారు గంగుగారు
దారినున్న దబ్బలుదాటి తుమ్మెదీరో నీడనున్న నిమ్మలుదాటి
ఉల్లిదొడ్లు దాటినారు పట్నాలెనుక వేసినారు
ఆరువేయుల పూరుబయలు తుమ్మెదీరో అందినారు గంగుగారు
శరణుబాబు గొప్పరాజులు - వారేలాగు చూసినారు
రంగైన రాచబొట్టెవ - తుమ్మెదీరో - పట్టయిన పడాలు బొట్టెవో తుమ్మెదీరో
మేము మిమ్ము పెండ్లాడతాంగాని మాలబొట్టెలకు దారివ్వం
మేము మాలబొట్టెలంగాదు మన్నెచేడె పడుచులం

గొప్పవారి డేర్జాలు మన మేలాగు దాటిపోవాలి అని పెద్దగంగు వెనుకదీస్తుంటే ఆ పాపంమీదే, మేందాటిపోతాం అని అప్పరెక్కపట్టిపోయింది గంగుగారు.

పన్నెండు వేల పమిజుబలము మల్లెలపందిరికింద, బంగారు కురుచులమీద

కూడినారు సంజీవరాజు. గంగుగారు మెరుసుకొని వస్తాఉంటే రాజమంతా మూర్ఛిల్లి పోయింది. సంజీవరాజుకూడా మూర్ఛిల్లుతాడు. మూర్ఛలుతెలుసుకొని, మాయమ్మ కారకుడు కన్నతల్లి కాచితే కాచుతది, కాయకపోతే ఖండిస్తాది. మీరు వేగురాన వెళ్లుదని కొలువుచాలించినాడు.

**వేటలకు కదిలిన సంజీవరాజు :**

వారు అలాగుండగా... ఊరివారు, ఉగపువారు, పల్లెలవారు, పట్నాలవారు రైతు రాణువంత వేగురాన వేటలకి కదిలినారు. సరవాల సంజీవదేగ, వెండికుచ్చుల వేనపుడేగ దండెలోన వేసుకొని సంజీవరాజు వేటలకు బయలుదేరి.

బందలు తిరిగి బాతులు కొట్టిడి మెట్టలు తిరిగి మేకలు, గుట్టలు తిరిగి గువ్వలు కొట్టి, మోదమ్మ కొడుకు వస్తాఉండగా –

**పూలగండువనంలో గంగుగారి ఆలపాటలు :**

కూరలకు కదిలెనమ్మ - బొడ్డుకూర బొరగకూర - కొమ్మతంటెపు కూరలేమొ
మాసిపుట్టు మండిపుట్టు - సూకురూరు బాకురూరు - బయలుమీద తేలినారు
పాడేరూరిగంతవెనుక తానాలైన చేసినారు -
పూలగండు వనములోన కూరలైన ఏరుతున్నారు
చెల్లెల ఓ చిన్న గంగు - తుమ్మెదీరో - పాటలైన పాడుగద
ఆడ బొట్టెకు ఆలపదము - తుమ్మెదీరో - ఆలపాట పాడో చెల్లె తుమ్మెదీరో
ఆలపాటలు పాడుకొను - తుమ్మెదీరో - అడవి రొడ్డలు ఏరుకొను
మండెమానుమీద చేరి - తుమ్మెదీరో - కూరలైన యేరుతున్నరు
ఆలపూల అడవిలోన పాలపూలు పట్టెమంచం
దూది పరుపులు దుప్పటిరేకులు - దూరమైతిరి కన్నవార
ఓ... పాడవీటి పట్టపుడేగ - పాటకైన నావాడరావో
సరవాల సంజీవిడేగ - సరదకైన నావాడరావో
బాకురూరి బాలడేగ - బంగరాల నావాడరావో
వెళ్ళి వెళ్ళి సంజీవిడేగ గంగుగారి కొప్పులో వాలింది
గద్దవో గిద్దువో నాకొప్పులోవాలిది, తిట్టినపోదు, కొట్టినపోదు

అని పట్టిచూస్తే

**చిట్టిమువ్వల చిన్నమరిది - నీసిరసుకు దండము**

**బంగారు మువ్వల బాలమరిది - నీపాదాలకు దండము**

**వేనూరిచ్చిన వెండికుచ్చులడేగ - ఏనూరిచ్చిన బంగారుకుచ్చులడేగ**

అని మెచ్చి పంటిగూన దాచిడ్డదట

సంజీవరాజు దేగజాడ వెతుకుతూ ముఖం తేలవేసుకొని

**అప్పగాద గంగుగార - తుమ్మెదీరో - డేగలైన తేలలేద**

**అప్ప అప్ప అంతావు నీవు - నీకు తల్లినౌతాన నేను**

**అమ్మ అమ్మ అంతావు నీవు - నీకు తల్లినౌతాన నేను**

**మరదల ఓ కన్నె మరదల - తుమ్మెదీరో - డేగవచ్చిన జాడచెప్ప**

ఇటువస్తే అటు రమ్మన్నదట అటువస్తే ఇటురమ్మన్నదట.

సంజీవరాజు బంగారు ఎడమ భుజానికి కుడి పాదము, వెండి ఎడమ భుజానికి ఎడమ పాదము వేసి

కూరమాండ్లైన దిగిదిబాబు తుమ్మెదీరో

ఆడబొట్టె మూట. పెద్ద ఉపకారము నీవు కాకుంటె ఎవరు మోస్తారు.

**కావళ్ళు మోస్తున్న సంజీవరాజు :**

ఓ... అలవిగాని సంజీవరాజు కూరకావళ్ళు ఎత్తుకొన్నడు ఇటొకమూట అటొకమూట.

**ఏలాంటి నడకలమ్మ**

**నిక్కుతాను నిగుడుతాను - నీలంపు నడకలమ్మ**

**తొక్కుతాను తోగుతాను - తోరంపు నడకలమ్మ**

**మాయూరు నేను ఎరుగను తుమ్మెదీరో, ముందుగుంట నడవో బాబు**

**దారితోడు నడువోబాబు తుమ్మెదీరో, తోవలైన ఎరుగడో బాబు తుమ్మెదీరో**

**నారాయణ దేవుడని - కులకులాన దుఃఖాలేమో**

**తల్లితండ్రితలచి బాబు - దండాలు పెట్టినాడు**

**బావ బావ అంతివ బొట్టె, - వారు చూస్తే గొప్పేసిరాజులు**

మనం చూస్తేం మాలబొట్టెలం - బావబావ అనకు సెల్లె
నేరములుగాదటమ్మ - పాపములు గాదటమ్మ
శరణుబాబు సంజీవరాజు తుమ్మెదీరో
పేముటడవులు సెలపుకొని - చిట్టడవులు సెలపుకొని
పూలగండు మేడలకు - తరలుతుండగ
మసిపుట్టు మండిపుట్టు - కావురాయి డుమ్మాపుట్టు
దొరలైన చెండుతున్నరు - ఆరుమేగుల గొడ్డుమాంసం
అప్ప ఓ పెద్దగంగు - దొరలు మాంసం చెండుతున్నారు

ఆ సామాన్లంతా పడేసి ఒక చిన్న బుట్టి, పీటగత్తి ఏరిచ్చి బావకు ఏమని బుద్ధులు చెపుతున్నది–

ఉన్నవారము ముగ్గురము - కూరలు మంచిగ తిందాము బావ
దుమ్ములు తీసి తేను - దుమ్ముపోగులు ఇస్తారు మనకు
పొట్టలైన పిసికితేను - పొట్టపేగులు ఇస్తారు మనకు
అడ్డిపుట్ట గుండెకాయ - ఆరుమేగుల మాంసము బావ - మనకైన చాలునన్నది

వస్తున్న సంజీవరాజును చూసి దొరలు, ఏదేశపురాజో! మనం ఇక్కడ ఉండ వద్దు... పారిపోదాం అంతే.

ఎంతమాత్రం పోవద్దు మీకున్న భయము లేదు, మీకున్న కొదువలేదు అని వారికి ధైర్యంచెప్పి, వారిచ్చిన వాటాలు మోసితెచ్చి గంగుగారికిస్తాడు. పొయ్యిమీద పెట్టి పుర్రుపుర్రున ఊదుతున్నది. అగ్గిపగ్గెలు చేసి, అపరాలు గిపరాలు వండి, గవులుకొట్ట కుండ దొంతిమీదదొంతి వన్నాలుపెట్టి, భోజనాలకు పిలిచింది పెద్దగంగు. ముగ్గరికి మూడువాటాలు పెట్టింది.

గంపెడైన నీకుచాలదు పెద్దగంగు - ఒక మూట నీకు చాలదు
ముఖముఖాలు చూసుకొని తుమ్మెదీరో - మనమీలాగె తింతెనప్ప
మనకెంత పున్నెములు తుమ్మెదీరో
సంజీవరాయునికి కొరబోయి - కక్కులైన కట్టదమ్మ
తలమీద చేటయిడి - ఎడమపాదం మోపినాది - చేటబుగ్గి ఉదినాది

**బూర్దగుమ్మడి పండులాగ - బుగ్గైన తేలిపోయిడి**
**చేటెడు బుగ్గిబాబు - చెల్లైన ఊదినాది**

తుమ్మివేరు, మంగవేరు వనాంతరాలుకలిపిఇచ్చినాది. సంజీవరాజు తేరుకొని నాడేగ నాకిస్తేను నేనిలాగ వెళ్ళిపోతాను. మాయమ్మ మోదమ్మ కాసితే కాసుతది కాయకుంటె ఖండించుతాది అనగానే

**తెలియని లంజకొడుకు తెలియనిపని చేసెడిగాని**
**తలవెంటతానంచేసి భోంచేసి వెళ్ళుబాబు అని మనవులుచేసి**

**ముత్యాల ముంజూరులోన - లక్కవంటి పీటలు బాబు**
**గిలుకులది చేరుచెంబు - గలుకులైన గంగతోడి**
**పాదాలు కడిగినారు - పయ్యంటచెంగులతో యొత్తినారు**
**సుద్దికట్టలు యేరుకొని - ఇల్లు ఎల్లర తుడిచిరట**
**పాపగాద గంగుగారు - అన్నములె వడ్డనాలు**
**గిలుకులది చెంబులేరి - గలుకునైన గంగముంచి**
**బావగద సంజీవరాయ - చెయ్యులే వార్చుమన్నారు**
**బాబుగాద గొప్పరాజులు - భోజనాలు చెల్లినావో**

అప్పుడు గంగుగారు పంటిగూన నడుమ దాచిడ్డ దేగపిట్ట తీసియిచ్చిది. అపుడా దేగను దండెలోన వేసికొని కిడుగ నూరిదేశాలు ఆసివేయులపట్నాలు వెనకపెట్టి కల్లేనపు లోవకి కదిలి పయనమైనాడు. ఆ పర్వతాలు, పంచలు, లొద్దులు, లంకలు, గద్దలు దూరని గిద్దుటడవులు, రాగికోట, రంపకోటలెక్కివస్తున్నాడు సంజీవరాజు.

మోదమ్మ 'మాలవాడు మనవాడుకాడు మాలఎంగిలి తిన్నాడు. ఏడు మన్నె వెలుగులు అవతల గిడుపుమంటున్నది'. చెల్లెండ్లు వేడుకుంటున్నారు. 'దండమమ్మ కన్నతల్లి. ఏదో పెనిమిట్లులేనందుకు వాడే మన పెనిమిటి, వాడే మనకొడుకు. ఆడ పిల్లలు మనకెంతవున్నా ఏంలేదుగద. మాలకూడు తిన్నప్పుడు మనకేటపెడదాం కాని కోపపడవద్దు' అని చెప్పి గునపాలు పండబెట్టి కుడిగూనకుపొడిస్తే కుడిపక్క ఎంగిలి వెళ్లుకొచ్చిది. ఎడమగూనకు పొడుస్తే ఎడమపక్కఎంగిలి వెళ్ళుకొచ్చిది. 'వారవ్వ బండి మాకలి ఎప్పుడైతేవచ్చిదో అపుడు మనం ఏడుమూళ్ళ కచ్చేరిలో, మునిగొప్పున దాచిడి

అప్పుడు వాడి అప్పుదగ్గర పెడదాం. అది మంచిదంటదో, చెడ్డదంటదో' అని శాంతం చెప్పి కొడుకును పైకి పెట్టేశారు.

పైకిపెట్టేస్తే పర్వతాలు దిగడు, ఆకలనడు, అన్నమనడు, గంజి అనడు, కడుగులనడు.

**మాలగంగువద్దకు మాకలిశక్తి :**

కబురందుకొని నందపురం దేశంనుండి ఆతల్లి కదులుతున్నది. నా కొడుకులకు యాత్రలు పంపిస్తే దొంగ పెండ్లిండ్లైనారు. శిక్షలువేస్తే ప్రాణాలుతీసుకొన్నారు. ఇపుడైనా గౌరవంగా పెండ్లిచేయాలని బారికను పిలిపించి –

**ఒరోరి కొత్తిలివాడ పంచనున్న కంచురతలు -**
**తుమ్మెదీరో పడవేయు బయటబాబు**
**మరపోయిన బండులను మరలైన అమరించు**
**కీలుపోయిన బండులకు కీలులైన వేయు బాబు**
**సీలపోయిన బండులను సీలలైన వేయుబాబు**
**నూనెపోయిన బండులకు నూనెలైన రాయుబాబు**
**నూరొక్క చక్కురానికి నూనెలైన రాసినాడు**
**ఎర్రడేరా, పచ్చడేరా డేరాలైనా కట్టినాడు. పువ్వులు దోరనాలు కట్టినాడు.**
**అలవిగాని రైతు రాణువ తుమ్మెదీరో మారెందు వెడుతున్నది**
**కిడుగనూరి దేశమందున తుమ్మెదీరో అంది వెళ్ళిది కన్నతల్లి**
**అప్పగాద పెద్దగంగు - మనఅప్ప బండిమాకలి - కదిలైన వస్తున్నాది**
**చెల్లెలా ఓ చిన్నగంగు తుమ్మెదీరో అప్పఅప్ప అనకువమ్మ తుమ్మెదీరో**
**వారు చూస్తే గొప్పవారు**
**అలాంటి మాటలంతవ నీవు - మనం చూస్తే మాలబొట్టిలం**
**ముత్యాలాది ముంగిలి - కన్నతల్లి అందివెళ్ళిది**

లోగిలి చూడగాను లోకండ్లు వెలిగెనమ్మ ఎర్రటి నయనాలు ఎత్తయిన చూసితేను
**అలవిగాని కన్నతల్లి తమ్మెదీరో నవరత్నాల రాగమెత్తి కెవ్వుమని కేకవేసి**
**అమ్మగాద గంగుగార నీకున్న భయములేదు నీకున్న కొదువలేదు**

*నీకున్న భయములేదు - నీకున్న కొదువలేదు*

మామనుమ సంజీవరాజుకు - ఈడు జోడు చూచుతాను - ఎనలైన ఎంచుతాను
అప్పగాద పెద్దగంగు - మనయప్ప బండిమాకలి - మన చూపులకు వస్తున్నది
ఎదురైన అయినారు - ముత్యాల ముంగిలిలోన
భయములు పడ్డరమ్మ - మండిగర్లు తేలిపోయిది తుమ్మెదీరో
దాగిపోయిది ఆసివేయుల దురుగాన
మీకున్న భయములేదు మీకున్న కొదువలేదు
మా మనుమ సంజీవరాజుకు - ఎనలైన చూసుతాను
ఆ మాటలు ఆలకించి - తుమ్మెదీరో - అలవిగాని గంగుగారు
అద్దాలు మెరిసినట్లు - గంగుగారి మెరుపులట తుమ్మెదీరో
వెసెగియెండలు వెర్రియెండలు తుమ్మెదీరో

గంగుగారి మెరుపులకి కన్నతల్లి మూర్ఛిల్లిపోయినాది. దాని మూర్ఛయది తీసుకుని యాదైననిలిచినాది.

ఓ...జాతికి తక్కువగాని - జలమరాసు లెక్కువున్నవి
పుట్టుకు తక్కువగాని - పూర్వరాసులెక్కువున్నవి
ఈడుజోడు తగునమ్మ - తుమ్మెదీరో - నా మనుమ సంజీవరాజు
పెండ్లులైన చేసుతాను - తుమ్మెదీరో - ఉండుడోయి బాబుగారు
నేనైన మళ్ళుతాను - తుమ్మెదీరో - బండ్లయిన మళ్ళినాది తుమ్మెదీరో
నందపురపు దేశాలందున - తుమ్మెదీరో - అందివచ్చిది కన్నతల్లి

## పెళ్ళిఏర్పాట్లు :

అలావుండగా అరిసెలప్పలు, గారెలుబూరెలంత తయారుపెట్టుకొని దుర్గాండ్లకు చీరెలు, రెవికలు, నగలు; సంజీవరాజుకు వారి ముస్తాబులు కాశిలూరు (కాశిపురం) సంతకు వెళ్ళి అప్పుడప్పుడు కొని సంపాదించిరి.

ఆ దినము అట్టెపోగా అలవిగాని గంగుగారికి రవికెలు, నగలైనచీరలు చేస్తున్నది కాశిలూరి సంతలోన

అలవిగాని సంజీవరాజుకు కమలపూలకమీజు ఆదిగాద కొన్నదేమొ
బంగరపు జలతారులు - అంచుఅంచుకు అద్దాలేమొ

బంగరపు బటుంగరాలు - వేలివేలికి వెండుంగరాలు
మువ్వజవ్వాది గోరెండిగలు
ధనరాశి ఒరుమల్లెలు
ముస్తాబులు కొన్నదమ్మ
నిమ్మకాయంత బంగారాలుతీసి - కమసలివాడిని పిలనంపి
కుదురు చింతన - కుదురు కొలుములువేసి
మదురు చింతన - మరి కొలుములువేసి

ఏడేడు రోజులు బంగారాలు చేయించింది. అందరికేమోగాని నా చిన్నకోడలు మువ్వలమ్మ, నాతీరున పుట్టిది. దానికి ఎనుమట్టు పుస్తెలనిచేయించి –

కంసాలికి పిలనంపి తుమ్మెదీరో వారివారి కొలువులలోన తుమ్మెదీరో
సిరికొలుములు పెట్టించినాది తుమ్మెదీరో
ఆ మన్నెనగరిలోన మరికొలుములు పెట్టించినది
పట్టయిన బాజుబందులు తుమ్మెదీరో ఎనుమట్టుపుస్తెలమ్మ తుమ్మెదీరో
పుస్తెతాళ్ళు చేయించిది బాపన దగ్గరికి పరుగుపరుగున వెళ్ళినారు
వెలుపల దిరిగినారు వందనాలు చేసినారు తుమ్మెదీరో
దాపల దిరిగినారు దండశరణాలు పెట్టినారు
కర్రియావు పేడతెచ్చి - కల్లంపులు చల్లినారు
గరిసెడు గుగ్గిలాలు - తుమ్మెదీరో - పునుగులు వేసినారు
అక్షరాలు తప్పకుండ ఆకుతప్పకుండగ - తుమ్మెదీరో-పంచాంగాలు చూచినారు
శుక్కురారమురోజు చుక్కతగులుతది - శనివారము రోజు మంచిదికాదు
మంగళారపురోజు అమ్మ దోసములు - బుధవారములు డుంబరోజులు
లచ్చివారము మంచిదినము - మూర్తాలు చెప్పినారు

మూర్తాలకబురులుచాటించిది కన్నతల్లి. అట్లుపెట్లు ఆరెలుబూరెలు ఆదంత వేసుకొని అలవిలేని రైతురాణువ బండిమీదకదులుతున్నది. ఆరుగురు బోయులమ్మ కన్నతల్లి మాకలిశక్తి.

వేగురాన రైతురాణువ వారికంత పిలిపించుకొని కల్లేనపులోవవరకు అగదులమీద బయలుదేరిది.

పల్లాన పదివేయులు - కొండనొక్కవేయు బాబు
అమ్మవారు కదలగానే - తుమ్మెదీరో - డప్పమేళం కదిలినాది
సానిమేళం సంగీత మేళాలు - తుమ్మెదీరో - వీటిమేళం విజ్జొటిమేళం
రణభేరులు మోగుతున్నవి - తుమ్మెదీరో - కంచుతుడుములు కాలిగొమ్ములు
అగదులు ఎగిరెనమ్మ - తుమ్మెదీరో - దగదులు మోగుతున్నవి
అడుగడుగున ఆరదులు - తుమ్మెదీరో - ఎత్తెత్తుకు ఎనుబోతులు
అక్షింతాలుపట్టుకొని - తుమ్మెదీరో -
గిలుకులది సిరిచెంబు గలుకుమని గంగతోడి
లక్కవంటి పీటలమ్మ - తుమ్మెదీరో - ఏరెనమ్మ గంగుగారు
ముత్యాల ముంజూరులోన - పీటలైన వేసినారు
బండ్లయిన దిగినారు - తుమ్మెదీరో -
పీటలకు కొలువులయి పాదాలైన కడిగినారు

## గంగు – సంజీవరాజుల కల్యాణం :

వేగురానకూడినారు - పదివేల పమిజుబలము - కల్యాణపు లోగిలిమీద
లచ్చుకల్లేనమొ శుభలగ్గెమొ - సీత కల్లేనమొ వైభోగమొ
పెద్దలు పేరంటాలు దిగివచ్చినారు - దేవేంద్ర దేవతలు సభలుదీర్చిరి
అందులో పెద్దలు యెవరెవరుబాబు - సూరుడు చందురుడు పెండ్లిపెద్దలు

సుక్కలాచార్యుడు గడిమూర్తగాడు - అందులో పేరంటాలు వారలెవ్వరు
దేవేంద్రకూతురు దేవగన్నిక - నాగేంద్రకూతురు నాగగన్నిక
వారు ముగ్గురప్పచెల్లెలుపేరటమ్మలు - పేరటమ్మలు వచ్చిరి కల్లేనపులోవ

ఘనులు మునులు ఘనమైన పెద్దలు - అష్టాదిపాలకులు అందివచ్చిరి
పెద్దలువచ్చిరి మిద్దెలున్నారు - గోవులువచ్చిరి గోడలలికిరి
పడుచులువచ్చిరి పంచలలికిరి - చిలుకలువచ్చివి చిత్తరించివి
కాకులు పిలిపించి కావళ్ళగట్టి - కావళ్లగట్టించి గంగతెప్పించి
మైనాలచేతను మన్నుకలిపించి - పిచ్చుకలచేతను పీనెపోయించి
గాలిదేవుడువచ్చి ధూళులు తుడిచి - వానదేవుడువచ్చి కల్లెంపిజల్లి

ఆడి తప్పనివారు అయోధ్యపెద్దలు - హరిచంద్రమారాజు అతికిన పెట్టె
పాలచంద్రవారు పంపినా పెట్టె - సూర్యచంద్రవారు సేకిప్పవాలె
శ్రీరాముడంపిడి చిక్కులపెట్టె

అలవిగాని కాతలవారు - తుమ్మెదీరో - కదులుతూనే ఉన్నరమ్మ
కిడుగనూరి దేశమందు - తుమ్మెదీరో - అందైన వెళ్ళినారు
చూసినారు గంగుగారు - ఇల్లుజల్లు శుద్ధి చేసి తుమ్మెదీరో
పీనెలు పందిరికింద - దర్శనాలు చేసినారు - అలవిగాని కాతలవారు
తేలెనమ్మ గంగుగారు తుమ్మెదీరో

కొంగువిసిరి నడువబోగ - తుమ్మెదీరో - కొండలే వెలుగులాయె
కాలువేసి నడువబోగ - తుమ్మెదీరో - కాళింగ వెలుగులాయె
మల్లెలాదివారిపందిరి - తుమ్మెదీరో - వారేబాబు పెండులవారు
కస్తూరిగంధాలేమొ - తుమ్మెదీరో - కాటుకలు పెడుతున్నారు

అలవిగాని సంజీవరాయుడు - తుమ్మెదీరో
సూర్యుడు మెచ్చునట్లు - తుమ్మెదీరో - చుక్కబొట్లు పెట్టినారు
నాగేంద్ర పంచలది - తుమ్మెదీరో - నడుమెల్ల గట్టుకొను
వేలివేలికి వెండుంగరాలు - తుమ్మెదీరో - బంగారపు బంటుంగరాలు
ధరణి ఆకాశము దండమన్నాడు - సూరుడు చందురుడు నీదె భారము
కాలు తొక్కియేమొ కంకణాలుకట్టు - అర్రువంచియేమొ అందెపుస్తెలు
ఎనుమట్టె పుస్తెలమ్మ తుమ్మెదీరో వాడేలాగు కట్టినాడు

దాని తరువాత పెద్దగంగుకు - పుస్తెలైన అందిది బాబు
దాని తరువాత చిన్నగంగుకు - పుస్తెలైన అందలేవో
ఆఖరువుకు చిన్నగంగుకు - పుస్తెలైన అందలేదో

పూలబంతి చల్లినాది - తుమ్మెదీరో - అలవిగాని చిన్నగుంట
ఇట్టెదానవు నీవుముండ - ఆట్టె దానవు నీవు గాద
ముగ్గురు మొగుళ్ళున్నదానవు - కళ్ళుపోయిన పెద్దగంగు
పదిమంది జనముదగ్గర - పల్లెత్తి నవ్వితీవి

గోలలైన చేసుతున్నది - కాని కంగారి మాటలేమొ - అలివిగాని బాలపాప
ఆ మాటలు ఆలకించు కోపములుపడ్డరమ్మ అలవిగాని కన్నతల్లి
పుస్తెలైన కట్టించిది అలవిగాని కన్నతల్లి

పన్నెండురోజుల పెళ్ళులైన - ఎక్కటివారు బాబు
లెక్కలేకపోయినారు - పెద్దలు పేరంటాండ్లు మరలయినపోయినారు
అందరికి పెద్దదమ్మ అలవిగాని మోదమ్మ
దాని తరువాత పుట్టినాది అలవిగాని పెద్దదుర్గ

పెద్దదుర్గ తరువాతేమొ - అదె బాబు కనకదుర్గ
దానితరువాత పుట్టినాది - అదె బాబు బోశుకొండ
దానితరువాత పుట్టినది - అదె బాబు విజ్జడగ్గు
అందరికి చిన్నదమ్మ - యాదెబాబు ముప్వలమ్మ తుమ్మెదీరో
అత్తతీరు పుట్టినది - కొత్తపల్లి కొలువైనది
ఆరుగురు దుర్గాండ్లేమొ - తుమ్మెదీరో - పల్లాన పదివేయులు తుమ్మెదీరో
పంచుకొని పోయినారో తుమ్మెదీరో
మోదమ్మ పాదాలలో అలవిగాని - కన్నతల్లి అక్కడైన ప్రవేశించు
గంగుగారు సంజీవరాజు మినుములూరు ప్రవేశించు

అమ్మగాద ముప్వలమ్మ - తుమ్మెదీరో - కొత్తపల్లికి ఉన్నదిబాబు
అమ్మగాద కనకదుర్గ - బెజ్జవాడ యున్నదిబాబు
అమ్మగాద మాకలిశక్తి - నందపురము యున్నదిబాబు
నా మనవి చిత్తగించుడు - తుమ్మెదీరో - నా మీద దయలుంచుడు

ఊరు ఊరున దుర్గాలమ్మలు - తుమ్మెదీరో - శరణుతల్లులు మీకు దండము
ఏడుకోటిదేవతలు - తుమ్మెదీరో - మీ చరణాలుతప్పలేను
శరణు బాబు దేబాలాల - తుమ్మెదీరో - మీ చరణాలుతప్పలేము
మీ శరణాలు తప్పినగాని - మీ కరుణాలు తప్పలేము
మీలాంటి కాలమురాగ - తుమ్మెదీరో - మిమ్ముతలచి పాడుతాము.

*ఊరు ఊరున దుర్గాలమ్మలు - తుమ్మెదీరో - శరణుతల్లులు మీకు దండము*

## మోదకొండమ్మ పదంలో ప్రదేశాలు




## సొండవిల్లు




-- పల్లాల బొర్రంరెడ్డి, మారేడుమిల్లి

## దొంగపెండ్లి – గౌరవంగపెండ్లి :

నందిపండుగపదం వ్యవసాయానికి సంబంధిచినట్లే, ఈపదం పెండ్లికిచెందినది. పెండ్లిలో ఇచ్చిపుచ్చుకోవడాలకు, వావివరుసలు ప్రాతిపదికలు, అంతస్తుది తరువాత కీలకపాత్ర. ఈపాటలో జరిగిన రెండు పెండ్లిండ్లలో మొదటిది నందపురం దేశిరాజులకు దిగువవాడైన దేవేంద్రుని కూతుళ్లు దుర్గాండ్లతో పెండ్లి. కులంతో పట్టింపులేకుండా రాజులుగా వారిమధ్య వియ్యంసాగుతున్నది. కాని ఇరుపక్షాల వివాహమర్యాదలలో, దృక్పథాలలో భేదమున్నది. మన్యంవారైన దేశిరాజులకు 'లాగడం' (గాంధర్వ వివాహం వంటిది) తప్పుకాదు. దేవేంద్రునికి ఇవి 'దొంగపెండ్లిడ్లు'గా కనిపించడం దిగువ మర్యాదనుబట్టి సహజం. ఈ పెద్దవాళ్ళ మర్యాదలు, పట్టింపులు యువతరానికి పట్టవు, తట్టవు.

**తప్పు – వెలి; సంకెళ్ళు – కారాగారశిక్ష :**

ఈ 'దొంగపని' ఒరవడికాకుండా, పాలకుడుగా తనఅల్లుళ్ళను దేవేంద్రుడు లాంఛనంగా శిక్షించాడు. కాని నేరము – శిక్ష వీటినిగూర్చి గిరిజనసమాజం దృక్పథం వేరు. గిరిజనసమాజం ఊరుమ్మడి నిర్ణయాలను స్వచ్ఛందంగా అమలుపరుచుకుంటుంది. కోశము, దండము ఈ రెంటిబలంతో నడిచేది రాజరికం. గిరిజనసమాజం ఒక కుటుంబం. మగనాలుతోపోవడం 'తప్పు'. కులాంతరసంపర్కం 'నేరం'. 'తప్పు'కు ప్రాయశ్చిత్తం, జరిమానా, నేరానికి 'వెలి' గిరిజనుల శిక్షాస్మృతి. సంకెళ్ళు, జైలుశిక్ష వంటి దండనలు లేని సమాజాలవి. ఒకడిని దొంగగా నిరూపించడానికి ఇష్టపడని సాదలరామన్న ప్రయత్నం తెలిసినదే. ఉద్యమాలు చెలరేగినపుడు అన్నివర్గాల ప్రజలు రక్షకదళంతో ఎప్పుడో ఒకప్పుడు దేనికోఒకదానికి తలపడుతూనే ఉంటారు. వారు జైలుశిక్ష అవమానంగా భావించరు, పైగా వారికది ఒకకితాబు. పల్లెలలోనివారు ఇప్పటికీ పోలీసువారు ఇంటికివచ్చినా, పోలీసుస్టేషనుకురమ్మని కబురంపినా గౌరవం తక్కువగా భావిస్తారు. సంకెళ్ళమాట చెప్పనవసరంలేదు. పోలీసులు పిలిపించి, నేరం మోపినంతమాత్రాన ఎవరూ నేరస్థులుకారు. కాని ఈవిచారణ ఎవరికీ అక్కరలేదు. అదొక అవమానం అంతే. అందుకు చిన్నబుచ్చుకున్న దేశిరాజులు, తమకు, తమవారికి ఈశిక్ష తలవంపులు తెస్తుందని అభిమానపడి ఆత్మహత్య చేసుకున్నారు.

**ఉంచుకోవడం, వెలివేయడం, పెండ్లిచేయడం :**

మాలకూడు తిన్నావని వెలివేసినందుకు సంజీవరాజు చిన్నబుచ్చుకున్నాడు. కాని గతంలోవలె ఎటువంటి విషాదకరమైన పర్యవసానికి దారితీయకమునుపే మాకలిశక్తి వచ్చి పెండ్లికి ఒప్పుకుంటుంది. మాకలిశక్తి గంగుసంజీవరాజులకు వివాహం 'గౌరవంగ' జరిపించి గంగును దేవేరిని చేసింది. మన్యంలో కులాంతర సంబంధానికి శిక్ష వెలి. కులాంతర సంబంధాన్ని 'ఉంచుకోవడం'గా దిగువవారు అనుమతిస్తారు. ఈ రెండు ఒరవడులను తోసిపుచ్చి గంగువారింట పట్టపురాణిగా ప్రవేశించటంతో కులాల, వ్యవస్థల, అంతస్తుల, దృక్పథాల సరిహద్దు చెరిగిపోయింది.

ఈపరిష్కారం జాతికివివేకాన్ని, హితాన్ని భారత రామాయాణాలవలె బోధిస్తున్నది. ఈ వివేకం లక్షలలో ఏ ఒక్కడి ప్రవర్తనలో ఫలించినాచాలు, మరొక మాలగంగుపాటను జాతి పాడుకొంటుంది.

**పల్లాన పదివేలమాయలు :**

ఈ కథలో మరొక వివాదం, వెంకటేశుడు దేవేంద్రులమధ్యది. 'పల్లాన పదివేయులు' పదివేల వింతలు మాత్రమేగాదు పదివేలమాయలు అనికూడా అర్థం. దేవేంద్రుడు మూడు నేత్రాలుగల్లవాడు. తన దృక్పథంపెంచిన గర్వంవల్ల తన అల్లుళ్ళను, తన భార్యను; తన మాయలాడితనంవల్ల తనబావ వెంకటేశుని కోల్పోయినాడు. ఈనాడు మన్యంచేరి నీతిమాలిన వేషాలువేస్తున్నవారి చరిత్రలకిదొక నమూనా. తమ విలువలబట్టి, గిరిజనులను లోకువగాచూడడం, గిరిజనుల దృక్పథాన్ని వాడుకొని వారిని వంచించడం, దిగువవారికి అలవాటైపోయింది. అవకాశాలను తమకనువుగా మలచుకొని, దోచుకునే ధోరణి మానుకుని నాగరికులుగా, విద్యావంతులుగా తమ సంస్కారాన్ని, వ్యవహారదక్షతను పంచిపెడితే ఎగువవారు, దిగువవారు, ఎల్లప్రజలు సుఖపడతారు.

ఇది ఈకథ నిర్మాణపరమైన విశ్లేషణ సందేశాలుకాగా –

శిల్పపరమైన కొన్ని విశేషాలు–

చారిత్రక వృత్తాంతాలుకూడా గేయగాథలలో శిలాజాలవలె ఒదిగిపోతాయి. జానపదగేయం నిత్యనూతనం. కథలోపాత్రలు వెంకటేశుడు, దేవేంద్రుడు, దివ్యతిరు

పతులు సమకాలీనపు పేర్లు 'దుర్గాండ్లుఎదిగి యజమానులై మారుమనువు వెళ్ళిపోతే...' అని గిరిజనసమాజంలో వెంకటేశుడు ఊహించాడు. పుత్రసంతానం కోరుకున్నా గిరిజన సమాజంలో దానికోసం అంగలార్చరు. ఇది ఆస్తి, రాజకీయమైన పెత్తనం బలపడిన పితృ స్వామ్యసమాజలక్షణం. 'మాల బొట్టెలంకాము – మన్నెచేడె పడుచులం' అని గంగు, రాజులకు సమాధానమిస్తుంది. సంజీవరాజును పెండ్లాడగలిగిన ఆమె యోగ్యత, భాగ్యం ఆమెను ఆయోనిజనుచేశాయి. పాతపాడేరులోగల మాలగంగు పాదాల "గంగ పూజారి" పాలకవర్గానికి చెందిన బగత, కిలో కొటారు తనపూర్వీకులు నందపురంనుండి వచ్చినట్లు తెలియచేశాడు. విశాఖమాన్యుయల్‌లో(1869) పేర్కొన్న మత్స్యరాజుల శిథిలమయిన రాతి సింహాసనం పాతపాడేరు శివాలయం చుట్టూ ఉండవచ్చు.

బ్రిటిష్ పాలననుండి ఢిల్లీ కొందవారికి తెలుసు. పార్లమెంటు ఎన్నికలవల్ల అది గొప్పస్థానంగా ఈ ప్రాంతాలలో ప్రచారమైంది. వాల్మీకులు సుంకరులుకాబట్టి 'ఢిల్లీకి రాజులము ఢిల్లీ సుంక మడిగేవారము' అని చెప్పుకున్నారు. కాని పాటలలో పడుచుల ఊహాలుమాత్రం, అందమైన నందపురాన్ని దాటిపోలేదు. బండిమీదరావడం ఒక గౌరవం. బండిమీద వచ్చేశక్తి బండిమాకలి.

ఆడవారు పాడుకునే ఈ పదంలో సంజీవరాజు వట్టిబొమ్మ. ఆవు మాంసం బుద్ధి పూర్వకంగా తినిపించి – ఎవడో బుద్ధిలేనివాడు ఇచ్చాడని మాలగంగు బొంకుతుంది. నందిపదంలో పాండవులు ఆవుమాంసంతినబోతూ కృష్ణునిచూచి మానుకుంటారు. మాంసాన్ని, మర్యాదను రెంటినీవదులుకోలేని మనస్తత్వంతో ఈ జాతులలో కొందరు ఊగిసలాడుతుంటారు.

ఊడిచేటప్పుడు లయబద్ధంగా పాడేపాటను (నలుగురు అందుకోవడానికి), ఒక్కరు రాగయుక్తంగా మధ్యమధ్య వరుసమారుస్తూ ఆలపిస్తే మిగిలినవారు అందుకుంటారు. తంతులో ముడిపడే మగవారి నందిపదంలో రాగంలేదు. మాలగంగు పదం మనోహరమైన రాగచ్ఛాయలో పాడతారు.

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

❃ The impact of money on an African subsistence economy - Paul Bohannan.

Cultural and Social Anthropology selected readings, ed. Peter B.Hammond. Macmillan & Co., 1964 - P. 136.

❃ Anthropos. Vol. 75. 1980

Prehistoric background to pastoralism in the Southern Deccan in the light of Oral Traditions and cults of Pastoral communities by M.L.K. Murthy and Gunther D. Sontheimer.

❃ Tribal India - Gisbert

If crime is considered a misfortune and punishment, the conjunction of the two cannot make for happiness. This is how the Eskimo mind seems, not illogically works as long as the rule is binding on all members of an independent community (no matter how reduced it may be) and is supported by its organs, there is law. But for the administration of this kind of law neither Police nor court nor jails are necessary; the adoption here of any of the device of civilisation would be the cause of serious mal adjustments.

❃ Orissa District Gazeetters. Koraput , 1966. P.41. In Nandapur, there are ruins of the temples of Mahakaleswara, Vaitala Bhairava and of Goddess Durga.

రెడ్డిరాజ్యచరిత్ర (2001) మల్లంపల్లి సోమశేఖరశర్మ. తెలుగువిశ్వవిద్యాలయం. పుట. 160. నందాపుర శీలవంశరాజులు గంగరాజు, భయ్యలేక భైరవరాజుపుత్రుడు (శక 1348) ఒడ్డాది జయంతుని కొడుకు మత్స్య సింగరాజు, గంగరాజుయొక్క మేనమామ విశ్వేశ్వర లేక విశ్వనాధ రాజు మత్స్యజయంత రాజతనయ సింగమాదేవిని వివాహమాడెను. పుట140. అల్లాడరెడ్డి సచివుడులింగన ఒడ్డెరాజును పలాయితునిచేసి, అతని నివేశన స్థలమున పెద్ద తటాకము కట్టించెనని శివలీలావిలాసం.

❃ Vizagapatnam manual 1869. P.320

The "Madgole" family and Estate"

These Zamindars claim descent from the sovereigns of "Matsya Desa"

who were closely connected with the Pandava race. They state that they established themselves first at Paderu, a place lying above the ghauts to the north of Madgole. There is a reservoir there, called 'Matsya Gundam', containing great numbers of fish. Before signing their names, the Zamindars of Madgole inscribe the figure of a fish on the paper, and the same is borne on their flags. An other account is that they came into the country with the founder of the Jeypore family, whose cousins they are, and who gave them the Madgole country as a fief; with the title Bhupati, or lord of the earth.

❁ ‘వృక్షాలు పక్షులు పడుకున్నవేళ’ – ‘అరటి పూవు వంటి అత్తకూతురు’ మొదలైన చరణాలు శ్రీ నేదునూరి గంగాధరం సంకలనాలలో కూడా ఉన్నవి.

❁ ‘బొమ్మకు బొమ్మంచు చీర’ పు. 99. ‘నల్లగొండలపైని నన్నిచ్చినారు’ పు. 183. ‘దూలాల మా యిల్లు దూరి రారన్న’ పు. 189 – మిన్నేరు.

❁ ‘చిలకరో ఓ చిలక ఓ రామచిలక – ఎఱ్ఱని ముక్కుకు వెండి పొదిగిస్తు’ పు. 25. ‘కొండ పక్కచేను చేసెవారెవరు’ పు. 44.

‘పగడాలరాయెక్కి పలువరుస తోమింది’ పు. 274. – మున్నీరు (1973)

❁ గొంతాలమ్మ పండుగ :

‘మాలవారి చేనులో మసలుమా – ముద్దూల నందన్నా

మాలోరు మంచోరు మక్కువతో కొలుస్తారు – ముద్దూల నందన్నా’

“రాజులకు తగినట్లు రంభలొచ్చారు

అరుగుమీద అరవై – ఓలి ముప్పై

తల్లిగట్టె చీరతోటే – తగునమ్మ ఓలిలే” పు. 94.

ఏడుకుంచాలపిండి ‘తోప’ వండింది. పు. 102. – సెలయేరు (1955).

❁ ‘పొయ్యేటి పిట్టలను బోర పగలేసు – కూర్చున్న పిట్టలను గుండె తగలేసు’ 147

❁ ‘చిందేటి రక్తాము సీసాల బట్టేరు’ మున్నీరు పు. 271

❁ ‘నడుము నాగబంధములే సుందరిపిల్ల’ మున్నేరు పు. 202

# నల్లమల చెంచుల పాటలు

చెంచోడైతే నీకేమి తెచ్చె
    తాంబేలు ఇరగలు తెచ్చిపెడతాడు
    కన్నెగుల్ల తేనె తెచ్చిపెడతాడు
సారాయి తాగితే కొడతాడు బిడ్డ
సారాయి తాగైన సాకుతాడయ్యో

- **రావగాని పాట**
    - దుర్మార్గపుఆలోచన
- **పన్నాగం**
    - అడవికి పయనం
    - మోసం
    - దొంగ ఏడుపు
    - ఆస్తులపంపకాలు
    - దూపకి పడిపోయిన రావగాడు
    - పీతగద్దవ్వ సాయం
    - తేరుకున్న రావగాడు
    - పీతవ్వసాకిన రావగత్తె
    - దబ్బఅంబులు తెచ్చియిచ్చిన పీతవ్వ
    - రావగత్తెను లొంగదీసుకోవడం కోసం పాట్లు
    - చేతకాని వట్టిరావగాళ్ళు
    - రావగాడికి దక్కిన దబ్బలు
    - ఇంటిమీదికి గాలి
    - రావగాని దగ్గిరకు చేరిన రావగత్తె
    - ఇద్దరు పెళ్ళాల రావగాడు
    - పెండ్లికొడుకును ఎంచుకున్న చిన్నలింగి
    - మల్లన్నను చేరిన పూలబండి

## రావగాని పాట

రావగాడిభార్య మంచిఅందగత్తె. ఆమెపై గూడెంలోఉన్న బూడిద రావగాళ్ళు (వట్టిరావగాళ్ళు) కన్నేసి ఆమెనుఎలాగైనా పెళ్ళిచేసుకోవాలనుకుంటారు. అలా చేసుకోవాలంటే ముందు మగడ్నిచంపాలి, వట్టిరావగాళ్ళంతా కుమ్మక్కై కొల్లంచర్రిలో కొండముచ్చులుండాయి పట్టుకొద్దాంరమ్మని రావగాడ్ని పిలుస్తారు. రావగాడు రానంటాడు. అందరితో కలిసి వెళితే ఏదోకటి దొరుకుతుంది మనంకూడా తినవచ్చని భార్య నచ్చజెప్పి పంపుతుంది. గుహలో కొండముచ్చులున్నాయి – నువ్వెళ్ళికొట్టు, మేము బయట ఉండికొడతామనిచెప్పి రావడు గుహలోకి వెళ్ళగానే పెద్దబండతో గుహను కప్పేసి, వాడి అంబులు దబ్బ, గొడ్డలి, కాసికోక పంచుకొని పెళ్ళాం మాత్రం అందరిదని చెప్పుకొని ఇంటికివచ్చి, రావగత్తెతో నీమొగుడు చచ్చాడనిచెప్పి ఉడతఇరగలు అవి తెచ్చిపెట్టి, మంచిచేసుకోడానికి ప్రయత్నిస్తుంటారు. అక్కడరావడు, బండను తప్పించుకొని దూపఅయ్యిపడిపోతే, పీతవ్వ (రాకాసి) గద్ద రూపంలోవచ్చి వాడ్నిరక్షించి, తనుపెంచిన రావగత్తెతో సేవలు చేయిస్తుంది. జరిగిన కథంతా తెలుసుకొని వీడిఅంబు దబ్బలు తెచ్చిపెట్టి రావగాడ్ని–రావగత్తెని కలుపుతుంది.

**దుర్మార్గపుఆలోచన :**

కొల్లముచర్రిన ఓలాలి కొండముచ్చులుండయి ఓ లాలి
కొల్లముచర్రిన ఓలాలి కొండముచ్చులుండయి ఓ లాలి
అప్పడు గూడ - ఓలాలి - గూడెపు దిడ్డలు - ఓ లాలి
గూడెపు దిడ్డలు - ఓ లాలి - రావగత్తె మీద ఓ లాలి
రావగత్తె మీద - ఓ లాలి - ఇష్టము పెట్నారు - ఓ లాలి
ఏం లేదర్రా - ఓ లాలి - ఏం లేదర్రా ఓ లాలి
మనముగూడ ఓ లాలి వీడ్ని చంపాలి ఓ లాలి
ఈ లంజకొడుకును ఓ లాలి చంపాలన్నరు ఓలాలి
అంటానే వాళ్ళు ఓలాలి గూడెపు దిడ్డలు ఓలాలి
గూడెపు దిడ్డలు ఓలాలి బుజురుకుంటుండరు ఓలాలి

## పన్నాగం :

ఒక రోజేమో ఓలాలి ఏమైతవుంది ఓలాలి
వాని కాకి పోయి ఓలాలి మనము గూడ ఓలాలి
చర్రికికూడా ఓలాలి తోలకపోదాం ఓలాలి
॥ కొల్లము చర్రిన ఓలాలి కొండ ముచ్చులుండయి ఓలాలి ॥
అందరు బుజురుకుండిరి ఓలాలి రావనిగాకి పోయిరి ఓలాలి
పొద్దున్న పొయ్యిరి ఓలాలి రావనిగాకి ఓలాలి
పదర పదబ్బ ఓ లాలి పలాని చోట ఓలాలి
పలాని చోట ఓలాలి కొల్లము చర్రిన ఓలాలి ॥ కొల్లాము ॥
పోదాం పదన్న ఓలాలి పోదాం చినబ్బ ఓలాలి
అంటానే వాళ్ళు ఓలాలి బొంకిస్తు ఉండరు ఓలాలి
నేను రాను ఓలాలి పోర్రా మీరు ఓలాలి
అప్పడుగూడ ఓలాలి రావగత్తె ఏమో ఓలాలి
పోయి రారాదా ఓలాలి పోయిరారాదా ఓలాలి
గట్లానే చెప్పే ఓలాలి పోయిరారాదా ఓలాలి
అప్పడు రావడు ఓలాలి రావడు గూడా ఓలాలి

## అడవికి పయనం :

కాశె మీద కాశె ఓలాలి వనమంత కాశె ఓలాలి
దట్టిమీద దట్టి ఓలాలి వనమంత దట్టి ఓలాలి
ఒంట్రెక్క రుమ్మలి ఓలాలి గుడ్లమ్మర కత్తి ఓలాలి
పురు కడియంబులు ఓలాలి దబ్బ చేతపట్టే ఓలాలి
గొడ్డలి బుజాన పెట్టుకొని ఓలాలి వెళ్ళే రావడు ఓలాలి
పదర్రమరి ఓలాలి ఏడ ఉండవో ఓలాలి
పదండి పోదం ఓలాలి పదండి పోదాం ఓలాలి
పొయ్యిరి కదా ఓలాలి కొల్లము చర్రికి ఓలాలి ❊

**మోసం :**

నేను గడమ కాడ ఉంటను ఓలాలి మీరు లోపడకి పోర్రా ఓలాలి
లోపలికి పొయ్యి ఓలాలి చంపండి మీరు ఓలాలి
అంటాను గూడ ఓలాలి రావడుగూడ ఓలాలి
లోపడకి పొయ్యిరి ఓలాలి వట్టిరావగాళ్ళు ఓలాలి
బావ బామ్మర్ది ఓలాలి గడమకాడ ఉండరు ఓలాలి
వచ్చిందానిని వచ్చినట్టు ఓలాలి చర్రికేసి దక్కుతాడు ఓలాలి
ఆన్ని గూడ ఓలాలి చంపేరావడు ఓలాలి
చంపి గూడ ఓలాలి గుట్టపెట్టెడు ఓలాలి
బొక్కల లేవు ఓలాలి బయటకు వెళ్లిరి ఓలాలి

**దొంగ ఏడుపు :**

బామ్మర్ది బామ్మర్ది ఓ లాలి నీవు ఏమని ఏడస్తావు ఓలాలి
ఎర్రచర్రి కొండముచ్చులో లాలి మా బావ నెత్తి తన్నిపాయె ఓలాలి
బూదచర్రి కొండముచ్చు లోలాలి మా బావ నెత్తి తన్నిపాయె ఓలాలి
రండియన్న ఓలాలి పదర మనము ఓలాలి
అన్నినేనే ఓ లాలి చెప్పినాను గాని ఓలాలి
ఆ లంజకొడుకు ఓ లాలి ఒకటి తన్నెటేలకి ఓలాలి
ఒక్కటి తన్నేటేలకి ఓలాలి ఎట్టపోయి చచ్చినాడో ఓలాలి
ఏ లొంకన పడ్డడో ఓ లాలి ఏ ఉరుకున పడ్డడో ఓలాలి
అంటూనే ఏడుస్తున్నాడు ఓలాలి బామ్మర్ది గూడ ఓలాలి
నవ్వుకుంట మురుసుకుంట ఓలాలి బయటకు ఎల్లిరి ఓలాలి
బయటకు ఎల్లి ఓలాలి గూడెపు రావళ్ళు ఓలాలి
నవ్వుకుంట మురుసుకుంట ఓలాలి బయటకు ఎల్లిరి ఓలాలి
బయటకు ఎల్లి ఓలాలి గూడెపు రావళ్ళు ఓలాలి
అప్పడుగూడ ఓలాలి ఏమైత ఉంది ఓలాలి
కొల్లముచర్రి కొండముచ్చులో ఓలాలి మాబావ నెత్తి తన్నిపాయె ఓలాలి
బూదచర్రి కొండముచ్చులోలాలి మాబావ నెత్తి తన్నిపాయె ఓ లాలి
ఎక్కపోయి చచ్చినాడో ఓలాలి అంటానే గూడ ఓ లాలి

*ఏ లొంకన పడ్డడో ఓ లాలి ఏ ఉరుకున పడ్డడో ఓలాలి*

గూడెపుదిడ్డలు ఓలాలి పోదం మనం ఓ లాలి
ఏసికోర్రా ఓలాలి పదం మనం ఓలాలి
కొండముచ్చుల నేసుకొండి ఓలాలి పోదం మనం ఓలాలి
అట్టాకాదర్రా ఓలాలి అట్టాకాదర్రా ఓలాలి

**ఆస్తులపంపకాలు :**

వాడుచస్తే ఓలాలి మనకి మంచిగా ఉంది ఓలాలి
కదరా కదరా ఓలాలి, నాది దబ్బ ఓలాలి
నీది గొడ్డలైతే ఓలాలి, నాదిగాసికోక ఓలాలి
నీది కాసికోకైతే ఓలాలి, నాది రుమ్మలి ఓలాలి
కదరా కదరా ఓలాలి, నాది పెండ్లము ఓలాలి
అందరిది పెండ్లము ఓలాలి, నీది ఒక్కద ఓలాలి
కొండముచ్చులనేమో ఓలాలి కావండ్లకు కట్టుకొని ఓలాలి
నీళ్లకాకి పోతుండరు ఓలాలి వట్రావగాళ్ళు ఓలాలి
పయిగూడ ఓలాలి కాలుస్తా ఉంటరు ఓలాలి
గుండు చాటునుండి ఓలాలి రావడు విన్నడు ఓలాలి
మాయన్న చచ్చినాడని ఓలాలి లంజకొడుకు పడనే ఓలాలి
ఈ లంజకొడుకును ఓలాలి తన్నర్ర దాన్ని ఓలాలి
అరె వాన్నిగాని కొడుతుర్రంట ఓలాలి ఏం లేదర్రా ఓలాలి
ఏంలేదన్న ఓలాలి ఇంక పోదాం పండి ఓలాలి
నీళ్లకాడికి ఓలాలి పోదాం పండన్న ఓలాలి
పయిగూడ ఓలాలి వాళ్ళుగూడ ఓలాలి
నాకూ దూపయింది ఓలాలి అడ్డంపడ్డా ఓలాలి
అడ్డం పండ్తా ఓలాలి కాల్చుండి తమ్ముడా ఓలాలి
కాల్చుండి తమ్ముడ ఓలాలి కాల్చిని మీరు ఓలాలి
అడ్డంపండ్తా ఓలాలి రావడు గూడ ఓలాలి
వట్రావగాళ్ళు ఓలాలి వాళ్లది పండుగ గమ్మత్తు ఓలాలి
కాల్చుకునేడు కాల్చుతుంటే ఓలాలి తినేటోడు తింటుంటే ఓలాలి

అరండమడుగుల ఓలాలి చలమ ఉంది ఓలాలి
చలమమీద ఓలాలి చలమ మీద ఓలాలి
వాళ్ళు తాగుడ ఓలాలి బండపెట్టుడ ఓలాలి
రావనికేమో ఓలాలి చూపియ్యి కుండరు ఓలాలి

**దూపకి పడిపోయిన రావగాడు :**

అప్పుడుగూడ ఓలాలి ఏమైతా ఉంది ఓలాలి
రావడుగూడ ఓలాలి పడిపోయినాడు దూపకి ఓలాలి
అన్ని వెంట్లను ఓలాలి పడిపోయినాడు దూపకి ఓలాలి
కావండ్లతోని ఓలాలి కావండ్లతోని ఓలాలి
రావనికి ఒక్క గంటలో ఓలాలి దట్టచేసి పెట్టి ఓలాలి
దట్టచేసిపెట్టి ఓలాలి కల్లము కాడ ఓలాలి
కల్లముకాడ ఓలాలి ఆ గండను పెట్టి ఓలాలి
వీల్లుకూడ ఓలాలి వేసుకోని ఓలాలి
వేసుకోని ఓలాలి వెళ్ళిపోయింది ఓలాలి
మెలక పుట్టి ఓలాలి రావడుగూడ ఓలాలి
రావడుగూడ ఓలాలి లేచినాడు ఓలాలి
లేచి గూడ ఓలాలి దుడుగున వేచి చూస్తే ఓలాలి
అక్కడకక్కడ చూస్తే ఓలాలి అక్కడకక్కడ చూస్తే ఓలాలి

**పీతగద్దవ్వ సాయం :**

కొండ్లచర్రి రాచ్చసి ఓలాలి పీతవ్వ రూపు ఓలాలి
ఎల్లింది రాచ్చసి ఓలాలి కొండ్లచర్రి పీతవ్వ ఓలాలి
రెక్కలు ఎత్తి ఓలాలి మిన్నుకి లేచి ఓలాలి
రావనికాకి కల్లముకాకి ఓలాలి వచ్చిదిగే ఓలాలి
వచ్చిదిగితే ఓలాలి పడ్డడు రావడు ఓలాలి
కుక్కలన్ని ఎరుక తింటుంది ఓలాలి ఆగుండు దగ్గరపోకుంది ఓలాలి
రావడు పండిండాడు ఓలాలి లేపేయకవ్వ ఓలాలి
మనమడ మనమడ ఓలాలి ఇడ పండినావే మనమడ ఓలాలి

దుడుకున లేచి ఓలాలి కండ్లు నలుస్తాడు ఓలాలి
ఎవ్వరబ్బ ఓలాలి యంటాను చెప్పి ఓలాలి

ఏం మనమడ! ఏం జరిగింది! ఇడపండినావు అని కొల్లంచర్రిరాక్షసి రావగాడ్ని అడిగింది (పీతవ్వ) వీడికి లేయ్యనికి, నడవనికి చేతకాకున్నది. దూప అవుతుందని చెపుతాడు. అప్పుడు రావగాడ్ని అడకలపైకి ఎక్కించుకొని మెడమీద ఈకలు పట్టకుండా గొంతుకాడ చేతులేసి పట్టుకోమని చెప్పి...

**తేరుకున్న రావగాడు :**

చలమ కాకేసుకోని పోయి ఓలాలి దించింది పీతవ్వ ఓలాలి
ఇవేనీళ్ళు ఓలాలి తాగు మనుమడ ఓలాలి
రెండుమూడు దోసిండ్లు ఓలాలి ఎత్తుకొని తాగినాడు ఓలాలి
ఎత్తుకొని తాగి ఓలాలి అడ్డం పడ్డడు ఓలాలి
అడ్డంపడి ఓలాలి సోలసపోయి పడ్డడు ఓలాలి
కూడులేక నీళ్ళులేక ఓలాలి మల్ల పానంపాయె ఓలాలి
ఉన్నవాణ్ణి ఉన్నియక ఓలాలి నేను చంపెతట్టాయె ఓలాలి
గంటసేపటికి ఓలాలి లేచె రావడు ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి ఆడికి పదవ్వ ఓలాలి
కొండముచ్చులు మొత్తము ఓలాలి నాకొద్దవ్వ ఓలాలి
నీవే తినవ్వ ఓలాలి నాకూవద్దు ఓలాలి
మనమడా ఎక్కడో చూపెట్టు ఓలాలి ఎప్పడో ఒక బుక్కకాలాలి
రెండుమూడు బుక్కలు ఓలాలి చేసింది పీతవ్వ ఓలాలి
మాఇంటిబాట ఓలాలి ఎక్కడుందో చూపియ్యి ఓలాలి
చూపిస్తాగాని ఓలాలి ఎక్కుమనమడ ఓలాలి
నా అడకల మీద ఓలాలి ఎక్కు మనమడ ఓలాలి
అడకల మీద ఎక్కి ఓలాలి గొంతు కింద చేతులు పట్టుకో ఓలాలి
మెడమీదబొచ్చు ఓలాలి పట్టక మనుమడ ఓలాలి
ఎవ్వరువ్వ లేదు ఓలాలి మనమడ నీకు ఓలాలి
నీ ఇంటిబాట ఓలాలి చూపిస్తానేను ఓలాలి
అప్పడుగూడ ఓలాలి పీతవ్వ యేమో ఓలాలి

మిన్నుకు లేచె ఓలాలి మిన్నుకు లేచె ఓలాలి
ఎసుక పోయి ఓలాలి కొండ్లచరిన దించె ఓలాలి

**పీతవ్వసాకిన రావగత్తె :**

కొండ్లచర్రిన ఓలాలి రావగత్తె ఉంది ఓలాలి
కొండ్ల చర్రిన ఓలాలి ఇంకొక రావగత్తె ఉంది ఓలాలి
రావగత్తెనేమో ఓలాలి పీతవ్వ సాకింది ఓలాలి
ఇదేమి మనుమడ ఓలాలి ఇదే బాట ఓలాలి
అప్పుడుగూడ ఓలాలి రావడు గూడ ఓలాలి
బిడ్డబిడ్డా ఓలాలి నీళ్ళు కాగపెట్టు ఓలాలి
నీళ్ళు కాగపెట్టి ఓలాలి పిల్లగానికి తానం చెయ్యమ్మ ఓలాలి
అప్పుడు రావగత్తె ఓలాలి ఉరుకులాడి ఉరుకులాడి ఓలాలి
నీళ్ళు కాగబెట్టి ఓలాలి నీళ్ళు కాగబెట్టి ఓలాలి
తానంచేసే ఓలాలి రావనికికూడా ఓలాలి
తానంచేసి ఓలాలి బట్టలేసి ఓలాలి
బట్టలేసి ఓలాలి మంచం ఏసి ఓలాలి
అన్నంపెట్టి ఓలాలి తినుబావా ఓలాలి
అన్నం తిను బావా ఓలాలి బావా బావా ఓలాలి
బువ్వ తిను ఓలాలి రావడు గూడ ఓలాలి
ఒకవారం వచ్చేటల్లకి ఓలాలి కుసి సంతోషం మీద ఓలాలి
కుసి సంతోషం మీద ఓలాలి రావడు గూడ ఓలాలి
అవ్వాఅవ్వా ఓలాలి నాకు దబ్బలేదు అంబుల్లేవు ఓలాలి
లెయ్యి మనుమడ ఓలాలి తానంచేసి ఓలాలి
తానంచేసి ఓలాలి అన్నం తిందువు ఓలాలి
అట్టన్న గూడ ఓలాలి లెయ్యడు రావడు ఓలాలి
ముసుగుపెట్టినాడు ఓలాలి లెయ్యడురావడు ఓలాలి
ఏమైంది మనమడ ఓలాలి ఏమైందయ్యి ఓలాలి
ఏంలేదవ్వ ఓలాలి ఏం లేదవ్వ ఓలాలి

**దబ్బఅంబులు తెచ్చియిచ్చిన పీతవ్వ :**

నాదబ్బ నాయంబులో ఓలాలి లేవు అవ్వ ఓలాలి
ఎవరు చిక్కకు పోయినారో ఓలాలి ఎవరు చిక్కకు పోయినారో ఓలాలి
ఏం పరవ్వలేదుగాని ఓలాలి నేనుపయి తెస్తనుగాని ఓలాలి
నేను తెస్తగాని ఓలాలి తానంచేసి ఓలాలి
తానంచేసి ఓలాలి అన్నంతిను మనుమడ ఓలాలి
అప్పడుగూడ ఓలాలి రావడుకూడా ఓలాలి
తానంచేసి ఓలాలి బట్టలు కట్టి ఓలాలి
అన్నంతిని ఓలాలి రావడు రావగత్తె ఓలాలి
అప్పడుగూడ ఓ లాలి పీతవ్వ ఏమో ఓలాలి
దబ్బకోసానికి ఓలాలి లేచె పీతవ్వ ఓలాలి
లేచిన లేచడం ఓలాలి గూడేనికెళ్లే ఓలాలి
గూడేనికివెళ్లి ఓలాలి పీతవ్వ గూడ ఓలాలి

**రావగత్తెను లొంగదీసుకోవడం కోసం పాట్లు :**

ఇడ వట్టిరావగాళ్ళు ఓలాలి వట్టిరావగాళ్ళు ఓలాలి
రావగత్తెకేమో ఓలాలి రావగత్తెకేమో ఓలాలి
సన్నిరక ఇరగలు ఓలాలి సన్నిరక ఇరగలు ఓలాలి
తెచ్చిపెడుతుండరు ఓలాలి
పతన్న రోజు ఓలాలి తెచ్చి పెడుతుంటారు ఓలాలి
తినకుంది రావగత్తె ఓలాలి గీము లేస్తుంది ఓలాలి
గీముకు సగానికి ఓలాలి పైనని ఇరగలు ఓలాలి
సన్నిరక ఇరగలు ఓలాలి వట్టిరావగాళ్ళు ఓలాలి
తినుమని తివుర్తె ఓలాలి తినమని పెడ్తె ఓలాలి
ఇవ్వితిని ఓలాలి మాకాడ పండులంజ ఓలాలి
ఇరగలుతిని ఓలాలి లంజముండ నీవు ఓలాలి
నీ మొగుడెట్టా ఓలాలి ఎక్కడ చచ్చినాడో ఓలాలి
మాకేమి గురుతు ఓలాలి మాకేమి గురుతు ఓలాలి
ఇవన్ని తిని ఓలాలి మాకాడ పండులంజా ఓలాలి

అంటానేగూడ ఓలాలి వాళ్ళు గూడ ఓలాలి
అవన్ని ఇస్తుంటే ఓలాలి చరిమీద పడుకుంట ఓలాలి
గీముకు కూడా ఓలాలి సగానికి చేసే ఓలాలి
సగానికి చేసింది ఓలాలి రావగత్తె గూడ ఓలాలి

**చేతకాని వట్టిరావగాళ్ళు :**

మర్రి చెట్టుమీద ఓలాలి వాలింది కొండల్లచర్రి పీతవ్వ ఓలాలి
ఎయ్యర్రదాన్ని ఓలాలి ఎయ్యరదాన్ని ఓలాలి
ఆదయ్యాన్ని ఓలాలి ఎయ్యర్ర దాన్ని ఓలాలి
రావనిదబ్బను ఓలాలి ఎక్కిపెడతాకి ఓలాలి
ఒకను ముంచ ఒక్కడే ఓలాలి ఎక్కపెడదమంటే ఓలాలి
ఎక్కకుంది దబ్బఓలాలి ఎట్టగో ఒకట్లు ఓలాలి
ఎగబెట్టి ఓలాలి ఏసిరి కదా ఓలాలి
ఒక్క అంబు లేకుండా ఓలాలి
ఆకులేగిచ్చాల ఓలాలి కింద ఊడిపడకూడదు ఓలాలి
అంటూనే కూడా ఓలాలి శపించింది ఓలాలి (సాటేసింది)
ఒక్క అంబులేకుండా ఓలాలి గిచ్చే ఆకులకు ఓలాలి
తలిదెంగవాని ఓలాలి ఇది పీతవ్వ కాదు ఓలాలి
దెయ్యంరా ఇది ఓలాలి రచ్ఛాసిరా ఇది ఓలాలి
దబ్బతో వెయ్యర్రా ఓలాలి దబ్బతో వెయ్యర్రా ఓలాలి
దబ్బకూడా ఓలాలి ఇసిరి దెంగిరి ఓలాలి
దబ్బకూడా ఓలాలి తట్టికుండే ఓలాలి
పురికెడు అంబులు ఓలాలి పీక్కున్నది ఓలాలి
పీకికోని ఓలాలి కట్టకట్టుకుండే ఓలాలి
కట్టకట్టుకోని ఓలాలి దబ్బగూడా ఓలాలి
దబ్బలుగూడ ఓలాలి మెడకు తగలేసుకుండే ఓలాలి
మెడకు తగలేసుకోని ఓలాలి మిన్నుకు లేచే ఓలాలి
ఎంత మోసం చేసే ఓలాలి ఎంత మోసం చేసే ఓలాలి

చూడర్రా దయ్యం పోతుందది చూడర్ర – వీళ్ళదబ్బలు సన్నపిల్లల దబ్బలు (చిన్నపిల్లలు ఆడుకునే దబ్బలు) ఎయ్యర్రా దాన్నే – దెంగర దెంగర్రదాన్ని అంటూంటే ఏం దెంగుతారు దాన్ని. వీళ్ళకు అందకున్నది. దానికి పడిఏడుస్తుండారు.

**రావగాడికి దక్కిన దబ్బలు :**

పొయింది కదా ఓలాలి పీతవ్వ కూడా ఓలాలి
కాండ్ల చర్రికి ఓలాలి పోయింది పీతవ్వ ఓలాలి
మనమడ మనమడ ఓలాలి నీదబ్బ అంబులు తెస్తి ఓలాలి
దబ్బ అంబులు తెస్తి ఓలాలి లెయ్యి మనమడ ఓలాలి
అప్పడు కూడా ఓలాలి నవ్వుతో మురుస్తా ఓలాలి
అల్లాట ఉండి ఓలాలి తెల్లారెటల్లకి ఓలాలి
అడవికి గూడ ఓలాలి పొలము తిరిగె ఓలాలి
పొలముతిరిగె ఓలాలి అడవి తిరిగె ఓలాలి
అడవి తిరిగి ఓలాలి ఒక పందినేసే ఓలాలి
పందినేసే ఓలాలి దబ్బ కోపుకేసుకోని ఓలాలి
దబ్బకోపుకేసుకోని ఓలాలి తెచ్చె రావడు ఓలాలి
రావడుతినడు ఓలాలి రావగత్తె తినదు ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి అడొక్క నల్లదాన్ని తెచ్చినా ఓలాలి
ఆడ ఉంది చూడవ్వ ఓలాలి ఏమన్న చేసుకో ఓలాలి
నాకైతే తెలువదు ఓలాలి నాకైతే గుర్తులేదు ఓలాలి
ఏం పరవ్వాలేదు మనుమడ ఓలాలి ఏం పరవ్వాలేదు మనుమడ ఓలాలి
నేను తెచ్చుకుంటగాని ఓలాలి మీరు అన్నం వండుకు తినండి ఓలాలి
అంటానే గూడ ఓలాలి పీతవ్వ చెప్పె ఓలాలి
చెప్పి గూడ ఓలాలి రావగత్తె రావడు ఓలాలి
పప్పవండుకుతినే ఓలాలి పప్పవండుకుతినే ఓలాలి
పీతవ్వ పందిని ఓలాలి ఒకకొయ్యకిందపెట్టి బొక్కె ఓలాలి
మల్ల రెండువారాలకి ఓలాలి అప్పడు రావడు ఓలాలి
ముసుగుపెట్టి ఓలాలి తిన్నడు లెయ్యడు ఓలాలి

లెయ్యుబావ ఓలాలి మొఖము కడుగుదువోలోలాలి
అంటే గూడ ఓలాలి దగ్గడు మూలగడు ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి లెయ్యకుండడు బావ ఓలాలి
అప్పడు అవ్వపోయి ఓలాలి అప్పడు పీతవ్వ ఓలాలి
ఏమైంది మనమడ ఓలాలి ఏమి సంగతి ఓలాలి
ఏమి సంగతి ఓలాలి నాకు చెప్ప ఓలాలి

**ఇంటి మీదికి గాలి :**

నా పెండ్లము ఓలాలి ఎట్టపొయ్యిందవ్వ ఓలాలి
ఏంలేదు మనుమడా ఓలాలి నేను కనుక్కొస్తాదాన్ని ఓలాలి
నేను కనుక్కొస్తాగాని ఓలాలి తానముచేసి ఓలాలి
తానము చేసి ఓలాలి అన్నము తిను ఓలాలి
అప్పడు రావడు ఓలాలి తానము చేసే ఓలాలి
తానము చేసి ఓలాలి తానము చేసే ఓలాలి
మల్లాలేచే ఓలాలి పీతవ్వ కూడా ఓలాలి
మిన్నుకు లేచే ఓలాలి కొండ్లచర్రి పీతవ్వ ఓలాలి
పొయ్యిగూడ ఓలాలి దిబ్బగడ్డన ఓలాలి
రావగత్తె దిబ్బగడ్డన ఓలాలి ఆయాకు ఈ ఆకులాని
ఏరక తింటుంది ఓలాలి కాండ్లచర్రి పీతవ్వ ఓలాలి
పండుకొనిగూడ ఓలాలి దుడుకున ఓలాలి
పండి పండి ఓలాలి రావగత్తె పండి లేచె ఓలాలి
అవతలనుంచి చూస్తే ఓలాలి పీతవ్వ ఏరుకు తింటుంది ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి ఆడ పోయి ఏరుకు తింటవు ఓలాలి
ఇక్కడరా అవ్వ ఓలాలి ఆడ ఏమి ఏరుకుతింటవు ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి ఇంద్లో ఏముందోచూడు ఓలాలి
అంద్లోన చూస్తే ఓలాలి సన్నిరిక ఇరగలు ఓలాలి
పురుగులు మల్లెలు ఓలాలి లుకటిస్తుండయి ఓలాలి
గీమి గీమి ఓలాలి పోర్లా తీసింది ఓలాలి

పోర్లా తీసింది ఓలాలి రావగత్తె కూడా ఓలాలి
అవ్వా అవ్వా ఓలాలి ఇవన్ని బొక్కు ఓలాలి
ఇవన్ని బొక్కు ఓలాలి బొక్కిపో అవ్వ ఓలాలి
కన్నుమూసేలోపట ఓలాలి అప్పడే బొక్కింది ఓలాలి

**రావగాని దగ్గిరకు చేరిన రావగత్తె :**

మనమరాలు మనమరాల ఓలాలి దగ్గరకురా నివ్వు ఓలాలి
దగ్గరకువచ్చి ఓలాలి గుర్రము ఎక్కు ఓలాలి
గుర్రము ఎక్కి ఓలాలి మెడకింద చేతులు పట్టుకో ఓలాలి
మెడకింద చేతులుపట్టుకోమని ఓలాలి అని చెప్పిందిపీతవ్వ ఓలాలి
గుర్రమెక్కిచ్చుకోని ఓలాలి రావని దగ్గరకు తీసుకుపోయింది ఓలాలి

**ఇద్దరు పెళ్ళాల రావగాడు :**

రావని చూసి ఓలాలి రావగత్తె పట్టె ఓలాలి
ఏడుసుకోని ఓలాలి ఇద్దరక్క చెల్లెళ్ళు ఓలాలి

**పెండ్లికొడుకును ఎంచుకున్న చిన్నలింగి :**

ఒక కన్య తన వరుణ్ణి ఎంచుకుంటూ ఒకొక కులానికి చెందిన వరుణ్ణి తిరస్కరించడానికి కారణాలు చెపుతూ – చివరకు చెంచును వరిస్తుంది. ఇటువంటి పాటలు గ్రామప్రాంతాలంతటా వినిపించేవే. తమచుట్టూగలవారి మంచిచెడ్డలను చెప్పడం ఈ పాటలో విశేషం.

గురుగింజ గురుమల్లెలూ గురుగింజ గురుమల్లెలూ
చింతచెట్టుకింద నా చిన్నలింగి - నా చిన్న లింగిని ఇంకెవరికిత్తునో
మాదిగోని కిస్తను పోతావా - చింత చెట్టుకింద నా చిన్నలింగి
చాకలోని కిస్తను పోతావా బిడ్డ - చాకలోని చాకిరి చేను చెయ్య లేను
కుమ్మరోని కుండలు నేను కొట్టలేను - ఉప్పరోనికిస్తను పోతావా బిడ్డ
ఉప్పరోని బావులు నేను తవ్వలేను - మాలోనికిస్తను పోతావా బిడ్డా
మాలోని తోలు నేనోల్ల లేను - శంకరయ్య కిస్తను పోతావా బిడ్డా
శంకరయ్య చాకిరి నేను చెయ్యలేను - లంబడోనికిస్తను పోతావా బిడ్డా
లంబడోని కడాలునేను తొడగలేను - చెంచోనికిస్తను పోతావా బిడ్డా

చెంచోనికైతే నేను పోతాను - చెంచోడు నీకేమి తెచ్చె
చెంచోడైతే తాంబేలు ఇరగలు తెచ్చిపెడతాడు -
చెంచోడైతే కన్నెగుల్ల తేనెతెచ్చిపెడతాడు
సారాయి తాగితే కొడతాడే బిడ్డ -
సారాయి తాగైనా నన్ను సాకుతాడయ్య ॥గురుగింజ॥

## మల్లన్నను చేరిన పూలబండి :

పూలతోటలోని పూలన్నీ కోసుకుని, ఎడ్లబండి కట్టుకొని, దానినిండా పూలు పోసుకొని, ఆ పూలను అమ్మడానికి ఒక స్త్రీ బయలుదేరుతుంది. పువ్వుకు పుట్టెడు, ఎద్దుకు పదుము బంగారం కావాలని మన్ననూరు అంజనయ్య దగ్గరకువెళ్ళి అడగ్గా, ఆయన కొనలేనంటే అక్కడి నుండి ఫరాబాదు చౌరస్తా లింగమయ్యను, ఫరాబాద్ మశమ్మను, దోరాలలింగమయ్యను, పుల్లాయపల్లె మశమ్మను, అప్పాపురం పెద్దమ్మను, బౌరపురం బౌరమ్మను, నడింబావి మశమ్మను, మేడిమలకల లింగమయ్య, గుండాల బయ్యన్నను, కురవమీద లింగమయ్యను, శ్రీశైలంమల్లికార్జున స్వామిని చేరుకొని మల్లయ్యస్వామికి అమ్మి ఆడబ్బును అదేబండ్లో పోసుకొని వెళుతుంది.

*(గతంలో శ్రీశైలం కాలిదారిన నడిచివెళ్ళే బాటవెంబడి ఈ పాట సాగుతుంది)*

మన్ననూరు అంజనయ్య పూలనే కొనరయ్యా ॥ జీవందరేకులపూలు ॥
పూలాన ధరలు చెప్పరమ్మ - పూవుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదునమ్మ - ఆడ్నించి ఆబండి చౌరస్తా వచ్చిందో
చౌరస్తా లింగడా పూలనే కోనరయ్యా - పూలాన దారాలు చెప్పరమ్మ
పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము - అబ్బబ్బ ఆధరలు మాచేత కాదునమ్మ
ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది - ఫరబాదా మశమ్మ పూలనే కొనవమ్మా
ఫరబాదామశమ్మ పూలనే కొనవమ్మా - పూలాన దారాలు చెప్పరమ్మ ధరలు
పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము - అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ
ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది - దోరాల లింగడా పూలనేకొనవయ్యా
దొరాల లింగముడా పూలనేకొనవయ్యా - పూలాన దారాలు చెప్పరమ్మ ధరలు
పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము - అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ

ఆడ్నించి ఆబండి ఫరబాదా వచ్చింది - పుల్లాయపల్లె మశమ్మ పూలనే కొనరమ్మ
పూలాన దారాలు చెప్పరమ్మ వచ్చేడి - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది
అప్పపురం పెద్దమ్మ పూలనే కొనరమ్మ - అప్పపురం పెద్దమ్మ పూలనేకొనరమ్మ
పూలాన ధరలు చెప్పరమ్మ - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆబండి ఫరబాదా వచ్చింది
బారపురం బొరమ్మ పూలానే కొనరమ్మ - పూలాన ఆధరలు చెప్పరమ్మ
పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము - అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ
ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది - నడింబావి మశమ్మ పూలానేకొనరమ్మ
నడింబావి మశమ్మ పూలానే కొనరమ్మ - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది
మేడిమలకల లింగమయ్య పూలానే కొనవయ్య జీవందరేకులపూలు
పూలాన ధరలు చెప్పరమ్మ - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది
గుండాల బయన్న పూలానే కొనవయ్య - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది
పూలాన ఆధరలు చెప్పరమ్మ - పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము
అబ్బబ్బ ఆధరలు మాచేత కాదమ్మ - ఆడ్నించి ఆ బండి ఫరబాదా వచ్చింది
శ్రీశైలం మల్లిఖార్జున పూలానే కొనవయ్య - పూలాన ఆధరలు చెప్పరమ్మ
పువ్వుకు పుట్టెడు ఎద్దుకు ఏదుము - ఆబండి కొన్నానే నీవెంత మొనగత్తె
అబ్బోసి ఆధరలు గోగిపువ్వు - మేం కొనలేమండి గోగిపువ్వు

ఈ పల్లవి తెలుగునాడు అంతటా వినవచ్చేదే. అయితే చెంచులు శ్రీశైలం నడక దారిలో వచ్చే ప్రదేశాలను ఇందులో కూర్చారు.

H మరిన్ని చెంచుపాటల కోసం 'గిరిగింజ గిరిమల్లెలు' చూడండి.

# మూడవ భాగం


| | | |
|---|---|---|
| 1. | శైలి | 419 |
| 2. | తెలుగుసంస్కృతిలో గిరిజనుల భూమిక | 433 |
| 3. | తెలుగుగిరిజన మాండలికం | 471 |
| 4. | మాండలికపదాలకు అర్థవివరణ | 479 |
| 5. | సంప్రదించినగ్రంథాలు | 491 |
| 6. | సమాచారం, ఆతిథ్యంఇచ్చిన గ్రామాలు | 501 |
| 7. | వార్తయందు జగము వర్ధిల్లుచున్నది | 505 |
| 8. | ఆంగ్లంలో సారాంశం | 525 |
| 9. | పదసూచిక | 529 |

# శైలి

" ఏ గూటి చిలుక ఆ గూటి పలుకే పలుకుతుంది "

"ఎన్ని దేశములు తిరిగినను పక్షి తిరిగి తన గూటికే చేరుకొనును

- అదియే జాతీయత" [1]

అనేకజాతులుగా లెక్కకువచ్చినా ఒకేభాషతో, ఒకేస్ఫూర్తితో పరిభాషతో గోదావరి, విశాఖజిల్లాలో ప్రక్కప్రక్కనే నివసిస్తున్న తూరుపుకనుమల కొండజాతుల పాటలతోపాటు దూరంగాగల నల్లమలచెంచులపాటలు ఇవి. పండుగపదాలనుండి పోకిరిపదాలవరకుగల యీసాహిత్యంలో జీవనవిధానంలోవలెనే ఒక క్రమము ఉన్నది. రాజులపండుగపదం ఇల్లునువర్ణించగా, నందిపదం ఇల్లుకట్టుకోవడానికి స్ఫూర్తినిచ్చిన చెదలమ్మ, నందమ్మగా, బండిబసవన్నగా, సీతమ్మగా పూజలందు కొంటున్నది. ఒక నాడు పితాళ్ళపండుగగా, పురాణకాలంలో శ్రీకృష్ణవిజయంగా, నేడు మతాబుల వేడుకగా దీపావళివిస్తరించినట్లు ఈ పండుగ జీవనవిధానంతోపాటు వికసించింది. స్వయం సంపన్నులైన కొండరెడ్లు 'ఆటమనదే పాటమనదే–కొలువు మనదే కొలత మనదే' అని తమ స్వతంత్రాన్ని చాటుకుంటే, సంస్థానాలప్రభావం హెచ్చుగాగల విశాఖగిరిజనులు 'అందమైన నందపురం నందియాటలే ఆడివద్దాం' అంటూ నాగరికుల మెప్పుకోసం, ప్రదర్శనలివ్వడానికి మనసుపడుతున్నారు.

కొండరెడ్లపాటలు తాళప్రధానాలు. ఆటకుతగిన నడకవారిది. విశాఖగిరిజనుల ఆటలో నరికె, తుడుము, సన్నాయివాద్యాలహోరు ఎక్కువ. రెడ్లు మువ్వలదుడ్లు – గిల్లకాయలతో లయవేసుకుంటూ ఆడతారు. విశాఖపాటలలో రాగచ్ఛాయవల్ల ఆ బాణీ అన్నిరకాల జానపదులపాటలను తమకనువుగా మలచుకొంటున్నది. మలచుకు నేందుకు తగిన స్థిమితంగల వ్యవసాయసమాజం వారిది. దిగువవారు క్రమంగా మన్యాన స్థిరపడడంవల్ల రకరకాల దిగువపాటలు సినిమాపాటలు ఈ ప్రాంతాలలోకి ప్రవేశిస్తున్నాయికాని – ఆత్మవిశ్వాసం కోల్పోయిన సమాజం వాటిని లీనంచేసుకో లేకపోతున్నది.

గోదావరిఒడ్డున గండిసీమలో అచ్చుకోడలకు ప్రచారం లేనేలేదు. అక్కడివి లేల పాటలు–ఔజం కొలువులు. లేలపాటలు (ఓలే లేల లేలమ్మారో ఓలే లేల లేల) ముక్త కంఠంతో రాజులకు ఆహ్వానగీతం ఆలపిస్తున్నట్లుంది. ఈలేలపాటలు, ఔజం కొలువులు కానివాడప్రాంతాన లేవు. అచ్చుకోడలుపదం ప్రక్కన గూడెం పసిబయలులో

చాపచినిగి చదురైనట్లుగా వినవస్తున్నది. (ఉదా: 'అదిగోనన్నర గురలమంద', 'కొండ సంత మండువలోన') కాని అక్కడ 'ఉండిఉండి పాడబోగ ఉత్తమైన మన ఎలుంగు' వంటి ఆలపాటలకే ప్రాచుర్యం. ఇవేగాక విశాఖమన్యాన 'లొల్లోసిపాటలు', తుమ్మెద పల్లవిగల కథాగేయాలు, పండుగపదాలు విస్తారంగా ఉన్నవి. రెడ్లగంగాలమ్మ పాటలు (ఆడవాలె పాడవాలె) ఆలపాటలే. లేలపాటలవలెనే విశాఖ కొలువుపండుగ పల్లవి 'లేలే లేరన్న లే కోలన్న'. ఈవిధంగా ఈరెండుప్రాంతాలలో వివిధరూపాలలో ఒకే వాఙ్మయం విస్తరించింది.

కొండరెడ్లలో ఆడమగ ఆటపాటలలో సరిసమానంగా పోటీపడతారు. కలుములబాలన్న (కానివాడ), పల్లాలబొర్రంరెడ్డి (చాపరాయి) ఆకుమామిడికోట సుబ్బారెడ్డి మొదలైనవారు మంచి పాటలవారు. విశాఖమన్యంలో ఆటపాటలునేర్చిన మగవారొకరూ తటస్థపడలేదు. పెండ్లిలోపాడుకునే కళ్యాణాలు తుమ్మెద పదాలు ఇతర జానపద గీతాలు సంస్థానాలలో స్తోత్రపాఠకులు కోలగాండ్లైన వాల్మీకులవలన వ్యాపించినవే. క్రైస్తవులుగా మారిన వాల్మీకులు ఈ సాహిత్యాన్ని పూర్తిగావిస్మరించారు.

'ఆటకు ఓటెంలేదు–పాటకు పట్టులేదు' ఆటలో మన్ననలపట్టింపు, పాడేటప్పుడు అర్థాన్నిగూర్చిన బిడియం వదిలివేయాలి. 'వర్షాకాలంలో వావిలేదు – శీతాకాలంలో సిగ్గులేదు' (ఒక గొడుగు క్రింద చేరడానికి – చలిమంటదగ్గర చోటుచేసు కోవడానికి) 'పాడేవారికి – కీరేవాడికి (ఏడ్చేవాడికి) సిగ్గులేదు'. ఇవి రెండు ప్రాంతాలలో వినిపించే హెచ్చరికలే అయినా శ్రమవిభజనవల్ల విశాఖమన్యంలో 'ఆటపాటలు పాడుకోవడం – అడవిరొడ్డలు ఏరుకోవడం' ఆడవారి బ్రతుకైపోయింది. జానపదులు ఎంత సిగ్గువిడిచి పాడినా నాగరికులవలె వళ్ళుచూపించి సొమ్ముచేసుకోరు. ఎటువంటి బూతులుపాడినా నియమాలహద్దు మీరరు. సాన్నిహిత్యం బాంధవ్యంకల సమాజాలుకాబట్టి వారి చూపులో, తూగులలో క్రూరమైన కామదాహం ఉండదు. హాస్యంతో, ఆనందంతో ప్రాంగణం త్రుళ్ళిపడుతుంటుంది.

'అతుకులు బొతుకులది అలపదం – చితుకులు బొతుకులది సీతపదం'. ఆల పదాలన్నీ ఈపదం ఆపదం తమమనోభావానికి తగినట్లు అతుకువేసి పాడుకుంటారు. అలపదమేకాదు మనోమయ ప్రపంచమంతా ఒక అతుకే. 'సీతకథకు చిందులు,

విందులు'. కవియైనా, జానపదుడైనా మూడులోకాలను ఊహలతోకొల్లగొట్టి తన అభిరుచులకు అనుగుణంగాకూర్చి ఒక కాల్పనికమైన, రసవత్తరమైన ఆదర్శప్రపంచం నిర్మించుకుంటాడు.

కొన్ని కథాగేయాలున్నా విశాఖపదాలు ఎక్కువ ముక్తకాలు. ఉయ్యాల, లొల్లోసి పాటలబాణీలకు స్వతంత్ర వ్యక్తిత్వమున్నది. కాని కొండరెడ్ల పాటలకున్న ప్రత్యేకమైన అస్తిత్వంవాటిలో తగ్గిపోయింది. కొండరెడ్ల సంవాదశైలి ఎంతహృద్యమైనదో విశాఖ పాటలలో సాత్వికభావచిత్రణం, పాత్రపోషణ అంత పటిష్టమైనవి. 'రాగం రంభ – పదం బానిస' అని చెప్పుకునే వీరిలో లలితసంగీత ధోరణులు వికసిస్తున్నాయి.

జానపదవాఙ్మయం వట్టికవిత్వంకానట్లే వారికళ కేవలంవినోదంకాదు, గిరిజనుల జీవితంలో కళ ఒకభాగం మాత్రమేకాదు, మనోజ్ఞతకు ఆధారమైన వారి దృక్పధమే రసాత్మకం.

ఇంద్రధనుస్సు చెంచులకు 'రావగానిదబ్బ'. గజ్జలకొండరాకాసిని కొట్టడానికి రంగురంగుల వెదుళ్ళతో అతడు తయారుచేసుకున్న దబ్బ ఇంద్రధనుస్సు.

కొండరెడ్లకు 'తొలకరివర్షం ఆట – బూరంపాట' (పోతబూరం – దూకే కొండ కాలువ) అంటే వర్షంపాటకు – జలపాతం ఆట. పరిసరాలు నెమలాట పనుకులు, ధింసాపనుకులు, కొండ కట్టువలు గుమ్మళ్ళదొడ్లు, గుబ్బట్లగండ్లు, నెమలినాట్యంలోనే కాదు నేదు సడుములోకూడా సోయగాన్ని చూడగల రసదృష్టివారిది.

చూరు జల్లుజల్లుమనగా కిన్నెరమోత
కిక్కిసలలంకలో కిన్నెరల ఎలుంగులు

కొండపడుచులు, పాడే 'వసంతసంగీతమానులు' (వెదుళ్ళు) 'నీటివిరుగుడు మానులు' (పంట) 'లచ్చిమిగల చింతమాండ్లు' (పసుపు). గోదావరిపొందుకోసం పరవళ్ళు తొక్కే శబరి 'సపిరెలు'. గోదావరిజిల్లావారి సొండవిల్లు, విశాఖవారికి డెండేరి (గడ్డి పిడెంలో పురుగుపేరు). ఆ పురుగు మోతవలె ఆ వాయిద్యం మ్రోగుతుందని ఆ పేరు.

చెంగుచెంగున పరుగుతీసే పడుచు – కాలిఅందెల బొంతచాటు బొబ్బర గువ్వ, ఉషోరాగంలో ఉదయించేసూర్యబింబం – ఓరగా తలయెత్తుకునే పెండ్లికూతురు.

*వసంతసంగీతమాండ్లు, నీటి విరుగుడుమాండ్లు, లచ్చిమిగల చింతమాండ్లు*

మొగ్గలెత్తినట్లు తేనెగండిమోరులో తేలివచ్చే చంద్రవంక. చింతమాను చివటలలో, అడ్డతీగ పందిరిలో హత్తుకునే అనుభవాలు.

నెమలిపిట్ట నడకలు, పారుపిట్ట పరుగులు, గువ్వపిట్ట గుంకర్లు, కున్నెపిట్ట రాగాలు. పొన్నచిలుక నూనెకొప్పులు, ఆమె నగరికిపోయేటప్పుడు నాగుబాము నట్టువలు. గూడెము పోయేటప్పుడు గువ్వపిట్ట నట్టువలు, నెమలిఅంచు నడికట్లు, పారు పిట్టలద్దిన పయ్యటలు, ముత్యాలముంజూరులో తేలివచ్చే ఆమెసొగసులు, తియ్యమామిడి గండిలో ఆమెగయ్యాళితనం: ప్రకృతిలోని అందాలను తన సంస్కృతిలో పొదువుకున్న శిల్పి ఏ గాంధర్వ లోకంవాడోకాదు – మన తెలుగుకొండవాడు.

వారి దేవతలకు కోనేటిపళ్ళేలు, పేపరకాయ పిండివంటలు, కాకరకాయ కమ్మనంటులు, నిప్పులోన పప్పులెత్తి కావించిన నిమ్మదనాలు, కుమ్ములోన కూరలెత్తి కావించిన కమ్మదనాలు. వారు చేతులువార్చే గిలుకుల చేముంతలు, పదాల సంబరాలు, అమ్మవారుయున్నపుడు ఆడిపాడే స్నేహాలు, వేగినంత వేడుకలు, సాగినంత సంబరాలు, 'కల్లుతాగితిమి కమము తప్పితిమి – కూడుతింతిమి గుణము తప్పితిమి' అని లెంపలు వేసుకుంటూచేసే విన్నపాలు. 'ఒదిగితిమి కొడుక కొదువ కొంచము లేదు' అని ఓదార్పులు.

'ఆటగల్ల మానికవేసి అటలాడుక కొల్వుదన్న
వేగినంత పాడవలె వెండిరూక లేరవాలె'

ఆట పాటలతో ఆనందించాలనే వారికోరికలు. నందపురంలో నందియాటలు, తియ్యగుమ్మళ్ళు తీసే విశాఖసమాజాలు.

దంపుళ్ళకు, వేటకు, పోడుకుకావలసిన శారీరకమైన, సాంఘికమైన క్రమశిక్షణ నేర్పేవి యీఆటలు. జానపదజీవితం, కళ పరస్పరపూరకాలు, పోషకాలు.[2] ప్రతిపని ఒకలయ కొదిగినపుడే ఒకసులువు దొరుకుతుంది. కయ్యులు ఒకరిచేతినుండి మరొకరు అందుకొని గుట్టవేస్తూ

'ఒడ్డుఒడ్డు కొండలకాడ, పట్టిదయ్యా నీలమేఘం
కురిసిదయ్యా పాలవర్షం, విత్తిరయ్యా వీరజొన్న
పండిదయ్యా పాలజొన్న'

చకచకా పనిసాగించే పదునుతోపాటు ఒక చల్లనిఆశ. ఈ ఒడుపు సంస్కృతిలోని అన్నిరంగాలలో జానపదులు అప్రయత్నంగా సాధించుకోగలరు. జానపదసమాజం తన సమస్త ప్రతిభలను, ఆటపాటలను, పరిసరాలను, సరదాలను, కథలను ఒకటేమిటి యావజ్జీవనసర్వస్వాన్ని తన వృత్తి ప్రవృత్తులకనువుగా నడుపుకుంటుంది.

విప్లవోద్యమాలు నిర్మించినవారు మైదానప్రాంతాల కళారూపాలలో, బాణీలలో తమ ఆశయాలు ప్రచారంచేశారేకాని, తెలుగు గిరిజనులున్న ప్రాంతాల్లోనైనా వారి కళారూపాలను, రీతులను పట్టించుకోలేదు.[3]

'ఆలజాతికి తిన్నది పుష్టి, మానవులకు ఉన్నది పుష్టి', సంస్కృతికి ఊహాబలం. నిరంతరము వికసించే దాని ఆదర్శమే పుష్టి, అనుభవాలను సంకేతించే పదాల, చిహ్నాల పునాదిమీద ఊహలవిలాసం సాగుతుంది. ప్రకృతినుండి పొందినస్ఫూర్తిని, తన ఆశయాలకు అనువుగా మలచుకోవడంలోనే జాతి చేవతేలుతుంది. మనిషిలో నిద్రాణమైనఉన్న యీభావుకతను వికసింపచేయడానికి, దేశకాలాతీతమైన ఐక్యమత్యం సాధించడానికి, నాటిఋషులు ప్రయత్నించారు. భావాలు అరిగిపోయి అర్థాలు మరుగు పడి మంత్రాలుగా మిగిలిపోతున్నప్పుడు ఉపనిషత్తులు వానిస్ఫూర్తికి ప్రాణంపోశాయి. తరువాతకాలంలో మనకళలు, దేవాలయాలు, సంగీతం మొదలైనవానిలో భావుకత మిన్నుముట్టింది. పాత ప్రతీకలను అనేకవిధాల విడదీసి, సవరించి, జతగలిపి, కొత్తభావాలకు రూపమిచ్చి, క్రొత్తప్రతీకలమీద కొంగ్రొత్తలోకాలలోకి, భూమినుండి అంతరాళంలోకి, అక్కనుండి గ్రహాంతరాలకు నేడు వ్యోమనౌకలు పయనిస్తున్నట్లు; నాడు కల్పనలు చొచ్చుకుపోయాయి. ఈకల్పన, ఆశయం, ఆదర్శాలే మనిషిని, జాతిని పరుగెత్తించేవి. నరుని నారాయణునిగా, పురుషుని పురుషోత్తమునిగా చేసేవి.

వేదర్షులవలెనో, జానపదులలో కళాకారులవలెనో, ఒక ప్రత్యేకవర్గం గిరిజనులలో లేకపోయినా మనోమయప్రపంచాన్ని కదిలించగల యంత్రాగమంతా వారికీ ఉన్నది.[4]

కొండ, చెట్టు, కాలువ ఇవికనిపించే రూపాలుకాగా పర్వతం, వృక్షం, ఉదకం, జల్ది(జలధి)గన్నికలు (కన్యకలు), జాంబవకులం, నాగకులం, అలమకులం... ఈ తత్సమతద్భవాలు వాటిఆత్మను ద్యోతకంచేస్తాయి. ఆ పరలోకంతో వ్యవహరించేవారు గౌరవలు, వెజ్జులు, పూజార్లు; బుగ్గి, గుగ్గిలపుధూపాలు, సేసలు వారిద్రవ్యాలు. మత్స్య

*కొండ, చెట్టు, కాలువ - పర్వతం, వృక్షం, ఉదకం, జల్ది*

గడ్డ, మత్స్యదేవత, మత్స్యాలు, మత్స్యరాజు మీనాక్షివంటి పేర్లుగాని మొయ్య – చేప వంటి పేర్లేవరికి లేవు. వాలగూడెంవద్ద (తూర్పుగోదావరి) వద్ద వాలిపర్వతం బహుశః మొదట వాలకొండ అయివుంటుంది. కాని ఈ సంస్కృతీకరణంలో అది వాలిపర్వతం – ఇది వాలి సుగ్రీవులరాజ్యం. ముక్కులు మూతులలో విలక్షణతగల గిరిజనులు వానరజాతి ఇటు వంటి నిరుక్తులు, సమర్ధనలు పెరిగాయి. విశాఖలో గురువులు పురుషకారుల (పరిష్కారి) ప్రాబల్యంపెరిగి, ప్రజలను పీడించడానికి ఈసంస్కృతీకరణం తోడ్పడింది. దిగువ నుండివచ్చిన నూలుపోగు, కూటిముద్దలు, కుండ, మంగలిపెంకలు, బాసలకు, దేవతలకు, పంటలకు నియమనిష్ఠలకు గుర్తులైనాయి. సంకేతాలైన పదాలఅన్వయాలు తప్పించి శాపానుగ్రహాలు మార్చుకోగల ప్రతీకాగతమైన ప్రయోగం పట్టుబడింది. అన్నమూలదేవి తనుకొలచినవిత్తనాలతో ఎంతకూ భీముని కొసరికాయతుంబ నిండకపోగా వాని మాయకు కోపగించి కుప్పకు ఒక్కచేటెడే రాలుబడికావాలని శపిస్తుంది. అప్పుడు కుంతీదేవి పన ఒక్కకుప్పగావెయ్యి–కుప్పకు చేటెడు అన్నశాపం అనుగ్రహమైపోతుందని, శాపానికి విరుగుడు చెపుతుంది.

ఈ చరాచర జగత్తుఅంతటా ఆత్మఉన్నది. దానితో సంబంధం కోసమే కర్మకాండ వంటి భారతీయవిశ్వాసాలు, గిరిజనులు అందించినవే. ఆదర్శాన్ని సొంతం చేసుకోవడంలో దేశకాలోచితమైన స్వాతంత్ర్యాన్ని మనపరంపర మన్నించింది. సప్త మాతృకలు, భారత, రామాయాణాల ముద్రలేని అంగుళంనేల ఆసియా అంతటా గాలించినా కనిపించదు. పాండవులనగా గిరిజనులకు అనంతకోటిదేవతలు. ఆయా దశలలో ఆవిర్భవించే దేవతలు ఇలా ప్రపంచమంతటా ఉన్నారు.[5]

కాని ప్రకృత్యారాధనంవలన పెరిగిన ఆధ్యాత్మిక ప్రపంచం, వాస్తవజగత్తులో సందేహాలకు తావివ్వలేదు. కేవలం తత్త్వవిచారంలో బుద్ధిజీవులుగా బ్రతికేఅవకాశం లేని సమాజాలివి. పాముమాంసంకోసం అంబటూలరాజు గుగ్గిలపుధూపాలు గునపం ఏరుకుని బయలుదేరతాడు. ధూపం నాగదేవతకు – గునపంపుట్టతవ్వి పామును పట్టడానికి. గిరిజనుని దృష్టికిది చిన్న ఉదాహరణ – ఈ ధోరణి యీ ఖండమంతా ఉన్నదే. కాని చెట్లమీద బదనిక, రణాలను చూపించి తిత్రికపిట్టరెట్టకు మొలచిన చెట్లను పెట్టుబడులను, చెడుపు, చిల్లంగులను సమర్ధించుకోవడంవంటి గుడ్డితర్కం ఈ సమాజాలను కుంగదీస్తున్నది.

---

*మత్స్యదేవత, మత్స్యగుండం, మత్స్యదేశం, మత్స్యాలు, మత్స్యరాజు, మీనాక్షి*

గ్రామదేవతల ఆరాధనలోపాటించే కర్మకాండ విశాఖగిరిజనులలో ఉన్నది. పాండవయోగం పూనినవారుచేసే భీభత్సం, వెజ్జుగౌరవల తాండవాలుగాని, అభినయాలుగాని కనికట్టులు కావు. కాని వట్టిమాటలు వింటుంటే కనికట్టు అద్భుతం ఏమైనా ఉన్నదేమోనన్న భ్రాంతి కలుగుతుంది. 'పాలకి కూటి పురుగులున్న పుట్టకే పోతుంది', 'కోలన్న, గౌంతెమ్మ సత్తెవిత్తనాలు రాలుస్తారు', 'తవ్వపట్టడం', 'కోటు చేయడం' పాటపూజారి దేవతలను పిలువగా పాలకిపట్టుకున్నవాడు చెదపురుగులున్న పుట్టకేపోతాడు. తవ్వపట్టినవాడు పూజారివెంటపోతాడు.

మనంకూడా 'స్వామివారు' (దేవుడు) వేంచేస్తున్నారు అంటూ 'రూపకం'లో చెపుతాం. ఈ రూపకంలో ఉపయోగించే పదజాలంకూడా పర్వతం, వృక్షం, ఉదకం... ఇలా విశిష్టంగా ఉంటుంది.

భూదేవి అంత పీనె – ఆకాశమంత పందిరి
చుక్కబొట్టు అక్షింతలు – సూర్యుడు బాసికము
చుక్కలున్న సూరెపుదేవి
సూర్యుడు బాణం – చుక్కబొట్టు దెబ్బ
చంద్రుడు బాణం – చెంపమీద దెబ్బ
మునికి వేసిన పేడ ముత్యం
కూడదోసిన పేడ కుంకుమ, జల్లివేసిన పేడ జవాది

సృష్టి అంతా తన కొంగుబంగారంకావాలనే యీకోరికలతోపాటు 'పాలసంద్రం, నీలసంద్రం, పాములేరు, సోకులేరు గోదావరినీరు కలిసివచ్చి వార్ధిపొంగినట్లు కల్లు పొంగవాలె'ననే కాంక్షలు.

గంగేచ యమునే చైవ గోదావరి సరస్వతీ
నర్మదాసింధుకావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు
అనే సంకల్పాలకు కులస్వాములు.

కవిసమయాలతో పెండ్లిసన్నాహాలు రక్తికడుతుంటాయి. మైనాలతో మన్ను కలిపించడం, కాకులతో కావళ్ళుకట్టించడం, చిలుకలు చిత్తరించడం, పెద్దపులులు

బేండులు – చెవులపిల్లి పిల్లంగోవి పట్టడం. చందురుని బోలుఅన్నం – చుక్కల బోలు కూరలువంటి ఉపమానాలు; మెఱుగుకని మినపపిండి మర్దనాలు, చాయకని సామ పిండి మర్దనాలు, నలుగుకు వడ్డాది పసుపు, పల్లపునూనెలు తోడైనాయి.

కొండరెడ్ల పన్నెండురాటల పందిరి, విశాఖలో బొయ్యికట్టి వేసిన పందిరిలో అయిరేని కుండలు అరిసెలసారెవరకు పోయింది. కొండరెడ్ల సూరెపుదేవి – అద్దపు మెరుపులతో, చెంగువిసిరినదువ చెలకలు వెలుగు, కొంగువిసరగా కళింగవెలుగులతో మాలగంగు రూపమెత్తి సంజీవరాయని దేవేరిగా పూజలందుకుంటున్నది.

కొండరెడ్లకున్న నృత్త, గీతప్రీతికి తెలుగుజాతిలో మరెవ్వరుచాలరు. నాగరిక సోకనందున, జంకుగొంకులేక తుళ్ళే పడుచులు – పండుగలు అందుకు కారణాలు. ఎక్కడ సామాజికంగా మరొకదశకు చెందిన దిగువవాళ్ళుచేరారో అక్కడ వారి విలువలైన అలంకారాలు (చీరె, కట్టు, బొట్టు) ఒక అర్హతగా మారాయి. ఈ రాజులు రాగానే మన్యమంతా తొనుకు తొనికింది. అనేక ప్రలోభాలుచూపి స్త్రీలకుగల స్వేచ్ఛను కొల్లగొట్టే వారి లేకిచూపులు, వెకిలిబుద్ధులు, బడాయి వేషాలు పానకంలో విషపు బిందువులు. తమలో ఇట్టివారున్నా వారిని శిక్షించే అవకాశం(తప్పు–వెలి) తమచేతిలోనే ఉందిగాబట్టి గిరిజనులు నిభాయించుకోగలరు. కాని వ్యాపార, ఉద్యోగరీత్యా వచ్చినవాడు కొందరిని తనచుట్టూ చేర్చుకుంటాడు. వారి మద్దతుతో అన్నివైపులా గండికొడతాడు. వాడికి ఏ వావివరుసలేదు. వ్యాపారిని బహిష్కరించగలరు గాని ఉద్యోగి వీరికి జవాబుదారీకాడు. వీరి పరిధిలోకిరాడు. బహిష్కారం వాడికి వరం. ఊరు మొహంచూడకుండా జీతాలుతీసుకోవచ్చు.

మన్యంలో కూలినాలి మొదటలేవు. ఇక్కడకు చేరినవారికి నీళ్ళు, పాలు, ఇళ్ళు దొరకడంకష్టం. వైద్య, రవాణాసౌకర్యాలు నామమాత్రం. భార్యలు ఇక్కడఉండనొల్లరు. కరువుతో మొహంవాచిన మగవాళ్ళకు కల్లు, మాంసం, మగువలతో ఇది భోగభూమి. దానివల్ల సంసారాలు కూలిపోతున్నాయి. వారి సంతానమూ భ్రష్టులౌతున్నారు. ఈ తాటాకుమంటచుట్టూ మూగే గిరిజనులు మిడతలవలె మాడిపోతున్నారు. మానసికమైన విలువలను కోల్పోయిన సమాజం ఎన్నో తరాలకుగాని బ్రతికిబట్టకట్టలేదు. సంస్కారాలు ఒకనాటి పంటకావు. ఎన్నోతరాల తపఃఫలాలవి.

కొందరు పెద్దలు, జాతరలను సొమ్ముచేసుకునే సాధనంగా వాడుకొని, ఈ నమ్మకాలను, తంతులను తమ అండదండలతో నిర్వహిస్తున్నారు. మన్యానికి చేరిన వ్యాపారులు, ఉద్యోగులలో పెద్దలు, రికార్డింగ్ డ్యాన్సులు పెట్టించడం గిరిజనులలో కూడా ఇటువంటి బృందాలు తయారుచేయించడం ద్వారా 'కళాపోషణ' చేస్తున్నారు. దీనికి సారాకొట్టు, వ్యాపారుల చందాలు పెట్టుబడి; పండుగలో అమ్మకంవల్ల సారా కొట్టు బాగుపడుతుంది. పండుగకు అప్పులిచ్చి తరువాత పనిలోకి తోలడానికి పంట కొనుక్కోవడానికి వ్యాపారికి బెత్తం దొరుకుతుంది. ఈ సారాకొట్టు సొమ్ములే రాజకీయాలకు మూలధనం. పండుగలో కట్టుబాట్లు సడలిపోతే, దొరికే ఎంగిలికోసం అందరూ తలా ఒకచేయి వేస్తారు. వినోదంకోసం చేరినవాళ్ళు తమకు తెలియకుండానే ఈ ఊబిలో పడిపోతున్నారు. ఈ దుర్మార్గాలకు వెరచి కొందరు ఆటపాటలకు దూరమౌతున్నారు. ఎంత మారుమూలగ్రామాలలోనైనా పండుగలకు, పెండ్లిండ్లకు దుకాణంమీది బియ్యం తప్పనిసరి. వ్యాపారవర్గాల దోపిడీ తీరుతెన్నులివి. ఖర్చులకు దడిచి చాలామంది పెళ్ళిజోలికి పోకుండా కాపురాలు పెడుతున్నారు. పెళ్ళిళ్ళు తగ్గినకొద్దీ ఆటపాటలకు అవకాశాలుకూడా తగ్గిపోతున్నాయి.

వేర్వేరువిలువలకు చెందిన జీవనవిధానాలు సంగమించినపుడు తబ్బిబ్బులు, తంటాలుతప్పవు. ఇటువంటి సందర్భాలనెన్నింటినో చరిత్రజీర్ణించుకొన్నది. గిరిజనులు చీకటి నుండి చీకటికికాక, సమస్త మానవజాతివలెనే వెలుగు నుండి వెలుగులోకే పయనిస్తున్నారు. శరవేగాన్నివదలి, తరంగవేగంతో సంస్కృతి మారుతున్నప్పటికీ, తెలుగు సంస్కృతి పునాదులన్నీ గిరిజన భూమికలోనివే. ఆ చిత్రణం చివరిఅధ్యాయం.

## సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. మహతి. యువభారతి ప్రచురణ. 1971 పుట. 250 –విశ్వనాధ సత్యనారాయణ

2. Current Anthropology : 1977, (4) 18. Alan Lomax and Arensberg , P.670.

Geometrical order of the plough field which displays the effort expended with a larger return, becomes the model for similar orderly arrangements in other departments of human activity, as in the state careful longitudinal articulation of foot and leg in dance movements in typical of plough cultures plough cultures, the orderly stepping wise enables the farmers to walk and to burrow between plants without damage to them becomes a model for other careful stepwise procedures. The layout the ploughed field gives rice to the grid pattern for community organisation and to the squadron layout in human choreographies in the dance and military drill. The plough eliminates the women with a child in her arms. Farming becomes man's work. Their basic person is masculine rather than feminine.

3. శ్రీకాకుళ ఉద్యమసాహిత్యం. డా॥ కె. ముత్యం. దృష్టి ప్రచురణ. 1993, పుట179. ఈ ఉద్యమ కార్యకర్తలు గిరిజనులసాంస్కృతిక జీవితంగూర్చి తెలుసుకోక పోవడంతో వారిని కదిలించగల మౌఖికసాహితీప్రక్రియలగూర్చి తెలుపకుండా పోయింది. గిరిజనులు ఆశువుగా పాడుకునేపాటలస్థానంలో కవుల లిఖితశైలి, వారికి పరిచయంలేని బాణీలు, వారిదికాని భాష ఉద్యమవస్తువుతో పాటలురాయడానికి గిరిజన రైతాంగాన్ని పురికొల్ప లేదు.

కార్యకర్తలు పాటలను సవర భాషలోకి అనువదించినా, వాటి లిఖితశైలి, భిన్న అభివ్యక్తి, నిర్మాణాలవల్ల వాటిని తమఅనుభవాలను కవితాబద్ధం చేయడానికి గిరిజన ప్రజలు స్వీకరించలేదు.

కార్యకర్తలు ప్రచారలక్ష్యం నెరవేరినా ప్రజలు తమ అనుభవాలను కవితాబద్ధం చేయడానికి, వారు కార్యకర్తలు విన్పించిన పాటలను ఆదర్శంగా భావించడంతో, ఆ స్థాయిలో రాసినవే పాటలనీ, తాము ఆ స్థాయిలో రాయలేమని భావించడంతోకూడా

వారు తమఅనుభవాలకు పాట రూపాన్నివ్వలేకపోయారు. ఈ పాటలు వారి స్వేచ్ఛా వ్యక్తీకరణకు ఆటంకాలయినాయి. ఇలా లిఖితశైలి రచనలు ఆదర్శంకావడం, మౌఖిక సంప్రదాయంలోని కార్యకర్తల స్వేచ్ఛావ్యక్తీకరణకు ఆటంకంకావడం అనేవి ఈ దశలో (లిఖితశైలి ఫలితంగా) విస్తృతంగా పాటలు రాకపోవడానికి ముఖ్యకారణాలు.

4. The Chenchus of Hyderabad. Page 274.

Chenchus draw what they knew to exist, but not what they saw. Realism will certainly stand him in good stead and help him to adopt himself to the recent changes in the environment provided that the measures taken to promote this adaptation.

Page 272. The Chenchus attitude to parapsychic phenomena is not very far removed from that of present day civilisation .....

5. The Origins of Agriculture. ed. Reeds, 1979, Hauge.

Page 250. Cayman is the father and gourd is the mother in African Culture.

## చెంచుల విల్లంబులు




... పురుషోత్తం

# తెలుగు సంస్కృతిలో గిరిజనుల భూమిక

మనం చరిత్రను నిర్మించకపోతే,
చరిత్రే మనకు రూపాన్నిస్తుంది
మనం బలవంతపెడితేనే,
గతం ముందుకు దారిచూపిస్తుంది.
లేకపోతే ద్వారాలు లేని కూపంలో అది మనలను బంధించివేస్తుంది

- **మాలిడ్లు - ఆస్ట్రోలాయిడ్లు**
  - చక్కెర దేవతలు - భైరవ దేవతలు - మావెలి దేవతలు
  - చక్రకూటం
  - మత్స్యదేశం
  - జంతురునాడు, చీకూర, గొలుకొండ, మాడుగులాదిగాగల మన్నెకొట్టాలు
  - ఝాడుఖండం
  - బోయ ఫౌజు
  - పాటపూజారులు - శివసారులు - పాండవులకథ - ప్రతిఘటన
  - కురువాట - చెంగరసీమలు
- **కోరుకొండ - రేకపల్లి - కూనవరం**
  - కోటనాగవరం - కోటరామచంద్రపురం - రంప - పోలవరం
  - నల్లమలలో కోటలకు తీర్చి గుర్రపు బాటలు
  - రాజనీతి
  - సీతాపతిరాజు
  - గుర్తేడు కన్నమరెడ్డి
- **చెంచు మల్లన్న - చెంచులక్ష్మి**
  - లంజెబయన్న - భక్తకన్నప్ప - చెంచుకాంభోజి
  - మార్గసంప్రదాయంలోకి ఆరోహణం
  - మామిడి కొత్తే - తెలుగువారి ఉగాది

**"శూరుల జన్మంబు సురల జన్మంబు యేరుల జన్మంబు ఎరుగంగనగునె"**

ప్రవాహినివంటి మానవజాతి మొదలు ఎప్పుడో ఎక్కడో – పట్టుకోవడం కష్టం. ఎత్తైనప్రదేశాలనుండి జంతుజాలాన్ని గమనించడానికి అవకాశం ఎక్కువకాబట్టి తొలినాళ్ళలో మానవసమాజాలు కొండప్రాంతాలలో నెలవైనారు.[1]

## మాలిడ్లు – ఆస్ట్రోలాయిడ్లు :

జీవావిర్భావానికిముందే రూపొందినట్లు భావించే కడపరాతి శ్రేణులలోని నల్లమల అడవులలో మానవుల ఉనికి, రాతియుగాలకంటె పురాతనం. నల్లనిరంగు, నొక్కుల జుట్టుగల ఈజాతులకు ఆస్ట్రేలియన్, ఆఫ్రికాపసిఫిక్ ప్రాంతాలలోగల జాతుల శరీర లక్షణాలతో పోలికలున్నట్లు మానవశరీరశాస్త్రజ్ఞుల భావన. ఈ ప్రాంతాలలోగల ఇండోనీగ్రిడ్‌లు (ప్రోటోనీగ్రిడ్ – ఆస్ట్రోలాయిడ్) ఆఫ్రికానుండి అండమాన్‌వరకుగల జాతిలో ఒక ప్రాంతీయమైనభాగమే. ఈ ప్రాంతాలన్నీ ఒకేభూఖండంగాఉన్నట్లు, తరువాత ఖండచలనంవలన వేరైనట్లు శాస్త్రజ్ఞుల నిర్ధారణ. ఈ నల్లనివారంతా ఆహారాన్ని సేకరించుకొనే సమాజాలే. మధ్యహిమయుగాలలో కొంతలేతరంగు కలవారు తూర్పు నుండివచ్చి సింహళందాకా వ్యాపించారు.[2] జీవనవిధానంలో సామ్యమున్నందున ఈ జాతులు కలిసిపోవడంలో అడ్డంకి లేకపోయింది.

ఈ కలయికవలన రూపొందినదే భారతదేశంలో మౌలికమైన జాతి. వీరిలో దక్షిణాదికొండలలోగల మాలిడ్లు (మలై – కొండ, Malids) ఆరణ్యకులుగానే మిగిలి నందునవారి శరీరలక్షణాలలో, జీవనవిధానంలో పెద్దమార్పురాలేదు. ఐదడుగుల నుండి– ఐదడుగులనాలుగుఅంగుళాల సగటుఎత్తు, కురచకాళ్ళు, నొక్కులజుట్టు, వంటి మీద తక్కువ రోమాలు (గడ్డం, రొమ్ము). బట్టతలలు తక్కువ. చిన్నమూతి, ఉబ్బెత్తుగా ఉండే చెక్కిళ్లు, వెనుకకుతగ్గే నుదురు, ముందుకువచ్చిన దౌడలు (Prognathism), క్రుంగిన నాసికామూలం (deep nasal root) పొడవంత వెడల్పుగల తప్పటముక్కు– ఈ జాతులలో సాధారణంగాకనిపిస్తాయి. మాలిడ్లలో (చెంచు) నలుపుఛాయ ఎక్కువ కాగా ఆస్ట్రోలాయిడులైన తూర్పుగిరిజనులలో చామనఛాయ ఎక్కువ. చెంచుల నల్లని ముఖాలలో ఒకవిధమైన చురుకుదనం కనిపిస్తుంటే, ముద్దమందారం వంటి కొండరెడ్ల ముఖాలు ముక్కుకు బూలాకీలు, గీసినట్లుండే కనుబొమ్మలతో దేవాలయాలలో ఉత్సవమూర్తులవలె అందగిస్తాయి.

**చక్కెర దేవతలు – భైరవ దేవతలు – మావెలి దేవతలు :**

రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యునికూతురు వాకాటకరాణిప్రభావతి, నందపురం రాజధానిగా రాజ్యమేలింది. నందపురంనుండి జయపురానికి రాజధానిమార్చి నాలుగువందలయేండ్లే అయింది. నందపురంలో మహాకాలేశ్వర – బేతాలభైరవ – దుర్గాదేవతల శిధిలదేవాలయాలున్నాయి. నందపురం మాకలిశక్తి గిరిజనులకు ఆదిశక్తి. నందపురం ప్రసక్తి అమరావతిబౌద్ధాలయ శాసనాలలో కనిపించింది. దండకారణ్యంగా ప్రసిద్ధమైన ఈఆటవిక ప్రదేశములందు చక్కెరదేవతలు,(రాజులపదంలో చక్కెరదేవికోట ప్రసక్తి) గోండుల ఒకనాటి రాజధాని మాహూర్ పేరిట ప్రసిద్ధినొందిన మాహురీ దేవతలు (మావెలమ్మ), భైరవదేవతలు లెక్కకుమిక్కిలిగా ఉన్నాయి. మాఠర వంశజుడు వాసిష్టపుత్రుడు శక్తివర్మవంశమువాడైన అనంతవర్మ విశాఖమన్యానికి సరిహద్దునగల శృంగవరపుకోట శాసనంలో తాను కళింగాధిపతినని చెప్పుకున్నాడు. మహాకాంతారము నందలి (విశాఖమన్యం) వ్యాఘ్రరాజునోడించినట్లు సముద్రగుప్తుని అలహాబాదు శాసనంలో ప్రశస్తి.[3]

**చక్రకూటం :**

'చక్రకోట బస్తరు రాజ్యములోని రాజపురమునకు ఎనిమిదిమైళ్ళ దూరమునగల చిత్రకూట గ్రామము. ప్రతిష్టానపురంవరకు జైత్రయాత్రసాగించిన చాళుక్యులలో దీనిని పూర్వచాళుక్యప్రభువు మూడవ విజయాదిత్యుడు, చోళరాజు, రాజేంద్రచోళుడు, కులోత్తుంగ చోళుడు, పశ్చిమచాళుక్యచక్రవర్తి, విక్రమదేవుడు, కాకతి ప్రోలనాయకుడు గెలుచుకున్నారు.' ఇందరిని అట్టి దుర్గమారణ్యమధ్యానికి రప్పించిన చక్రకూటంనాడు రాజకీయాలలో, సైనికశక్తిలో, మెరుపుదాడులలో కీలకపాత్రవహించింది. దంతెక్షి తీశులు (దంతెవాడ) కాకతీయప్రతాపరుద్రుని సోదరుడు అన్నమరాజు సంతతివారమని చెప్పుకున్నారు.[4]

**మత్స్యదేశం :**

"ప్రస్తుత జయపుర రాజకుటుంబంయొక్క ప్రధమపురుషునకు ఇద్దరు జ్ఞాతులు గొడుగు పట్టుచుండిరి. వారిపై దయతలచి ఒకరిని (వజ్రగడం) గొలుగొండలో, ఒకరిని మాడుగులలో జమీందార్లుగా నియమించిరి. వడ్డాది రాజులకు జయంతరాజులని పేరు.

వడ్డాదిరాజులు తాము పాండవవంశస్థులకత్యంత బంధువులగు మత్స్యదేశ ప్రభువుల సంతతివారమని, మొదట పాడేరుప్రవేశించినట్లు, మత్స్యలాంఛనం స్వీకరించినట్లు చెప్పుకున్నారు".[6] వంశంగొప్పతనం చాటుకోవడానికి కలుపుకునే ఈ చుట్టరికాలు, భావాలు, మన్యం భారతీయ సంస్కృతిలో లీనంకావడానికి చేసిన దోహదం తెలిసిన విషయమే.

## జంతురునాడు, గొలుకొండ, మాడుగులాదిగాగల మన్నెకొట్టాలు :

విజయనగరంమన్యంలోని అనంతగిరి, కాశీపురం శృంగవరపుకోట ప్రాంతాలను జంతురునాడుగా పిలిచేవారు. లోపలి గడిమన్యంలోగల, కొండకంబేరు, మలకనగిరి జిల్లాలోగల మాచేరు (మత్స్య–మాచ్‌ఖండ్) పాలేరు సంగమస్థలమునగల శివక్షేత్రము. గంగవంశజుడగు కుంభాళరాజుచే ఈ ప్రాంతం పాలింపబడినట్లు, ఈ కుంభేశ్వరలింగ మూర్తిని అతడు ప్రతిష్ఠించినట్లు ఐతిహ్యం. ప్రసిద్ధిగన్న కోణార్క, పూరీదేవాలయాలను నిర్మింపచేసినది గంగరాజులే. 'పాతాళేశ్వరుడు గొలుగొండకొండలలో యాదవరాజులచే ప్రతిష్ఠితుడైన లింగమూర్తి'.[4] ఆపాతాళగంగే నేటి లోతుగడ్డ – ఒకనాడు 'అరవైయారు దుర్గాలకు పోతుమన్నెం'. ఇక్కడ వీరభద్రునిగుడిలో చాళుక్యలిపినిపోలిన శాసనం ఉన్నది. గూడెంలో శ్రీకృష్ణదేవాలయం, లంబసింగిలో కూర్చున్న భంగిమలో పాండవుల విగ్రహాలుఉన్నవి. జాలంపల్లిదగ్గర కొత్తపల్లిలో మోదమ్మచెల్లెలు మువ్వలమ్మ (మావుళ్ళమ్మ) అద్భుతవిగ్రహం మన్యమంతా శక్తిపీఠాలకు ఆలవాలం అని స్పష్టం చేస్తుంది. వజ్రగడ దగ్గరనున్నది సంజీవికొండ; కళ్యాణపులోవ నేడు ఆపేరిటి రిజర్వాయర్; 'యాదవ పురాధీశ్వరునిదిగా పేరుగాంచిన వజ్రగడ, నరసిపట్టణమునకు ఆరుమైళ్ళు దూరమున గల గ్రామము. కోటగోడలపై 12వ శతాబ్దపు శాసనంఉన్నది. ఈకోట ఒడ్డెపురాధీశ్వరునిచే (వడ్డాది) నిర్మూలము కావింపబడినది'. అని కళింగ సంచిక పేర్కొన్నది. తరువాత కాలంలో గొలుగొండగా మారిన ఈ రాజ్యాన్ని బ్రిటీష్‌వారు కలుపుకున్నారు. ఇప్పటికీ రంగురాళ్ళ(వజ్రాలు) తవ్వకాలు ఇక్కడ ముమ్మరంగా సాగుతుంటాయి.

మాడుగులసంస్థానంలోని దోరశిలో మాలగంగు; జయపురం సంస్థానంలోని నందపురం మాకలిశక్తి, దేశిరాజులు; గొలుగొండ (వజ్రగడం) సంస్థానంలోని కొండపేరిటి సంజీవరాజు, మోదమ్మ ముమ్వలమ్మలాదిగాగల దుర్గాండ్లను దేశిరాజులు

గాంధర్వవివాహమాడిన కళ్యాణపులోవ; పరస్పరం నాశనం చేసుకునే రాజ్యాల, ఒకరి నొకరు చిన్నచూపుచూసే జాతుల సమైక్యతకు మోదమ్మ కధను ఆధారంగా చేసుకున్న దార్శనికులు గిరిజనులు.

**ఝాడుఖండం :**

'ఝాడేశ వన సప్తమాడె బారహ దొంతివంతు నాదిక్షితీశ్వరుల గెలిచి' నారని రెడ్డిరాజులగూర్చి శ్రీనాధుడు.

ఝాడుదేశం, ఝాడుఖండం, కిలంకోట, బెజ్జగివాడల వెనుకనున్న ఈ ఝాడి దేశం జలుబుదేశమని పిడపరి (పిడెం – వెదురుపొద) దేశమని కొండరెడ్ల పాటలు. ఝార్స్‌గూడ పెద్ద రైల్వేకూడలి. ఆనాటి ఝాడుదేశంలోని కొంతభాగం ఈనాడు ఝార్కండ్‌రాష్ట్రంగా అవతరించింది. సప్తమాడెములు, మాడుగోలాదిగా విశాఖమన్నె కొట్టములు. సప్తమాడెములు సప్తమాతృకలస్థానాలు. దుర్గ వింధ్యాచలవాసిని. మాలగంగుకథ ఈస్థలదేవత మహాత్మ్యాలను జానపదరీతిలో పాడుకొన్నది. జయపురం వారికి ఝార్కండ్ ప్రభువులనిబిరుదు. బారహ ఒక మన్నెరాజ్యం. ఇది మధ్యప్రదేశ్‌లోని నరసింహాపురం జిల్లాలోని బారహాగ్రామమో, గంజాంలోని బారువా గ్రామమోతెలియదు. ఒరిస్సాలోని సంబల్‌పూర్ జిల్లాలోకూడా బార్‌ఘర్ ప్రాంతమున్నది. 'భారహ మన్నెగండపెండేర' విరాజితులని పూసపాటివారి బిరుదావళి. 'అరిబలంబులు నందపురపు శైలమునొద్ద మర్దించినరపతి మాన్యుడయ్యె'నని 'నరపతి విజయం'. మడికిసింగన్న ముప్పభూపాలుని 'దొంతిమన్నెవిభాళ' అని సంబోధిస్తాడు. 'సప్తమాడియ రాయచంద్ర బింబాననా చికురవల్లరులపై చిన్నిపువ్వు'గా అల్లాడవేమారెడ్డిని కాశీఖండంలో శ్రీనాధుని వర్ణించాడు. 'మాడెములగెల్చి వడ్డాది మసియొనర్చి' నాడని మనుచరిత్రలో పెద్దన శ్రీకృష్ణదేవరాయలను కీర్తించాడు. వడ్డాది – ఓఢ్రదేశానికి ఆది. గజపతుల సామంతులైన పదహారుగురు పాత్రులలో ఒకరి సంస్థానం వడ్డాది.

'క్రీ॥శ॥ 1292నాటి దిబ్బిడాగ్రహార తామ్రశాసనంలో మత్స్యవంశానికిచెందిన అర్జునదేవుడు వడ్డాది రాజధానిగా మాడుగుల, చోడవరం, పిట్టగడ్డ పరిసర ప్రాంతము లను తన అధీనములోనుంచుకొని కాకతీయుల ఆధిపత్యమునంగీకరించి రాజ్య పాలనము చేసినట్లు పేర్కొనబడెను'.[5] 'పిట్టగడ్డ – జాలంపల్లి పట్టపు కోలన్న' అని నంది

పండుగలో ఈ పిట్టగడ్డను చాలాసార్లు ప్రస్తావించారు. మత్స్యరాజ్యంలో ఒక ప్రాదేశిక భాగమైన 'పిట్టగడ్డ' (నేడు వడ్డాది మండలంలో గ్రామం) ఒకగిరిజన నాయకుని అధీనంలోది కావచ్చు. రెడ్డిరాజులు, తమ అధీనంలోకివచ్చిన మత్స్యదేశాన్ని వర్ణిస్తూ పసిబయలులోని లోతుగడ్డనుకూడా పేర్కొన్నారు.

## గూడెం పాతవీధిలో విగ్రహాలు



**బోయ ఫౌజు :**

'ప్రతాప రుద్రగజపతి మరణానంతరం కళింగ గజపతుల సామ్రాజ్యం బలహీన పడింది. 1542 నుండి 1559 వరకు 'బోయ' వంశస్థులు కళింగసామ్రాజ్యాన్ని పరిపాలించారు. 1734లో విజయరామగజపతి, రాజమండ్రి ఫౌజ్‌దార్ నిజాముల్ – ముల్క్‌నూరుద్దీన్‌ను పిఠాపురంవద్దగల చేబ్రోలులో నలభైవేల సైన్యంతో ఎదిరించాడు. ఉత్తరాంధ్రప్రాంతంలో అనేకమంది సంస్థానాధీశులు విజయరామ గజపతికి అండగా ఈయుద్ధంలో పాల్గొన్నారు. వారిలో అనకాపల్లి–సత్యవరం సంస్థానానికి చెందిన కాకర్ల పూడి గోపాలపాయకరావు ముఖ్యుడు. ఆయననాయకత్వంలో రెండువేల బోయ ఫౌజు అత్యంతసాహసంతో శత్రుసైన్యంలోకిచొచ్చుకుపోయి, నూరుద్దీన్ అధిష్టించిన అంబారీ తాళ్ళనుతెంచి, అతడిని కిందపడవేసింది. గోపాలపాయకరావు వెంటనే అతడిని కడ

తేర్చాడు'[6] గిరిజనప్రాంతాలు మన్నెకొట్టాలుగా సముద్రతీర ప్రాంతాలు బోయకొట్టాలుగా చరిత్రలో ప్రసిద్ధం.

పద్మనాభయుద్ధంలో, విజయనగరంవారితో చేతులుకలిపినందుకు బ్రిటిష్‌వారు వడ్డాదిమాడుగులను జయపురంలో కలిపివేశారు. కొండరాజ్యాలను లొంగతీసుకోడానికి విజయనగరం దివాన్ సీతారామరాజు ఇక్కడొక స్కంధావారం నిర్మించాడు. తరువాత అదేమాడుగులసంస్థానానికి కోటఅయింది. 1930లో ఆ జమీందారీ పునరుద్ధరింపబడి, కోట, దేవాలయాలు శిధిలమైపోయి నేడు పాడేరుమన్యపు వ్యాపారకేంద్రంగా మిగిలింది. ఇవి శాసన చారిత్రక సాక్ష్యాలుకాగా విశాఖజిల్లా కలెక్టర్ ఆనరబుల్ డి.యఫ్.కార్నెకిల్ 1865లో వ్రాసిన విశాఖచరిత్రలోని కొన్ని ఐతిహ్యాలు.

'జయపురంరాజులు జంబూదేశమున ప్రాచీన రాజవంశజులు. హిందూస్థాన ములో వేనుడను రాజు సంతతిలేక చనిపోగా – ఋషులు ఆరాజు తొడఎముకతో తైలమును మథించి మంత్రబలముచే కర్తను సృష్టించిరిగాని వారిసృష్టి జంతు, మనుష్య లక్షణములు కలిగియుండుటచే రాక్షసుడాయెను. అతనిని వారు వింధ్యదక్షిణ ప్రాంత మునకు పంపివేసిరి. అతనికి గైత, మూ, మన్య, కొండ, కోదులని అయిదుగురు కొడుకులు. ఈ అన్నదమ్ముల సంతతి కోయ, చెంచు, సవర, ఎరకల, మద్దు, చాప, కోన, కొండ, బొడియ, పంగు, నాగల, బొత్తడ, బొంగ జాతులు. క్షత్రియులమనుకొనెడు వీరు సులభముగ పౌరోహిత్యమునకు జతపడెడు బ్రాహ్మణపురోహితులు గలిగియుండిరి. కొండరాచ కులస్థులయిన జమీందార్లకు నిషాదుని కుమాళ్లలోనెవడో ఒకడు కూటస్థుడై ఉండవచ్చును'.

'గౌర, సొండి, బుదరాకులములలో విధవస్త్రీలకు రాజుగారి విధవాకుమార్తెలని పేరు. వీరిని ఎవరైన పెండ్లిచేసుకోనిచ్చగించిన రాజుగారికి కొంతరుసుము 'ఆలి' ఇయ్యవలెనట'.

మల్కనగిరిలో తాట్రాజు చేయించుకునే క్రూరమైనవెట్టిని ఈచరిత్ర ప్రస్తావిం చింది.[7] గుణుపురు పితూరీ అణచడానికి, జయపురంలో నరబలి మాన్పించడానికి నాటి దొరతనం చాలాకష్టాలుపడ్డది. ❊

**పాటపూజారులు – శివసారులు – పాండవులకథ – ప్రతిఘటన :**

బ్రిటీష్‌వారు గిరిజనప్రాంతంమీద ఆధిపత్యంకోసం ప్రయత్నాలు మొదలుపెట్టిన నాటినుండి గిరిజనులువారిని ప్రతిఘటిస్తూవచ్చారు. నందిపదంపాడేపాటపూజారులు, ఈపండుగలో శివాలుతొక్కే శివసారులు ఈపితూరీ వార్తలను ప్రచారంచేస్తూ ప్రజల మద్దతు కూడగట్టారు. రంపమున్సబుదారుకు వ్యతిరేకంగా, గొలుగొండ జమీందార్లకు మద్ధతుగా గిరిజనులు పోరాడారు.[8] గొలుగొండ జమీందారీని ప్రభుత్వం 1830లో స్వాధీనం చేసుకున్నప్పటికీ, రంపపితూరీ నాయకులతో చేతులుకలిపి, తరువాత శ్రీరామరాజు నాయకత్వంలో 1924వరకు ఈ గొలుగొండ గిరిజన సర్దారులు నాటి ప్రభుత్వాన్ని ప్రతిఘటించారు. సగటున 5–6 ఊర్లకు ఒక ముఠాదారును గుర్తించి, బ్రిటిష్‌ప్రభుత్వం పరిస్థితులతో రాజీపడింది. రంపరాజ్యంలో అటవీశాఖఉద్యోగులు ప్రవేశించరాదని 1890లో విధించిన నిషేధం – స్వతంత్రం వచ్చాక 1955లోగాని తొలగించలేదు.[9]

**కురువాట – చెంగరసీమలు :**

తూర్పుపశ్చిమ గోదావరిమన్యాలు, 'కురువాట', 'చెంగర' ప్రాంతాలుగా ప్రసిద్ధం. సాలంకాయన నందివర్మ కంతేరుశాసనంలో మొదట ఈ 'విషయం' కనబడుతుంది. ముమ్మిడినాయకుని శ్రీరంగపురం కోరుకొండ శాసనాలలోకూడా ఇవి 'కురువాట' భూములే. జీర్ణకాకతీయరాజ్య పునరుద్ధరణకు ప్రయత్నించిన ముమ్మిడి నాయకుడు 'కోన' (కోనసీమ) లేదా రంపఅడవి ప్రాంతం 'పానార' (భీమవరం, నరసాపురం) 'చెంగర' (పెద్దాపురం, శంఖవరం) సీమలు ఏలేవాడు.[4]

క్రీడాభిరామంలో మధుమావతి భావిజన్మలో దక్షారామమున చిన్నిపోతుగా 'గంధర్వాప్సరో భామిని'గా, తరువాత జన్మమున కురువాటికాదేశమునందు చెంచుకత్తెగా జన్మించునని కలదు.

పావనంబైన తమిలేటి పరిసరమున
వేగి కురువాటికా దేశ విపిన భూమి
గోవులను పేర చెంచుల కులమునందు
గడిమి కత్తుల యమ్మునా కలుగగలదు

*మధుమావతి, చిన్నిపోతు, చెంచుకత్తె*

వేగి కురువాట విపినభూములలో ఉన్నవారికి తరువాతికాలములో కొండరెడ్లని పేరువచ్చింది. అపుడే కోయలు ఈ ప్రాంతాలలో స్థిరపడుతున్నారు. చెంచులు నల్లమల లోనివారుకాని గోదావరితీరంవారు కారు. యువకులను గోవులని, కన్యలను గుబ్బట్లని కొండరెడ్లలో, దిడ్డది – దిడ్డకాడు అని చెంచులలో పేర్లు.

మధుమావతి భావిజన్మను గిరిజనులలోభావించిన కవిసౌందర్యదృష్టికి జోహారు చేసితీరాలి. 'ముదురంగ పండిన మాలూరఫలములు – చెంచుకన్యల కుచశ్రీ'లను గుర్తుతెచ్చాయి. ఈ దట్టమైన అడవులు–అక్కడి పడుచుల గాఢయౌవ్వనం సాహసికులను నాటికీ, నేటికీ కవ్విస్తూనే ఉన్నాయి. మన ఆటవికులలో ఆంధ్రేతరుల కట్టు, కోరకొప్పు, పచ్చబొట్టు, గడసరితనం, ఎవరి మనసునైనా ఉరకలెత్తిస్తుంది. తెలుగుల సిగ్గు, అప్యాయతలకు ప్రతిగుండె లొంగిపోతుంది. ❈

## కోరుకొండ - రేకపల్లి - కూనవరం :

మహమ్మద్‌బీన్‌తుగ్లక్ చండశాసనుడు. అతడు ఎప్పుడు ఏ దేశముమీద పడునో యని ప్రోలయనాయకుడు దుర్గమారణ్య ప్రదేశమైన గోదావరీతీరపు మాల్యవంతమునకు సమీపమున రేకపల్లి రాజధానిగా ఎంచుకొనెను. ముసునూరి నాయకుల ప్రధమ స్థానము రేఖపల్లి. ఇది విప్పర్ల పద్మనాయకప్రభువుల పాలనలోని భాగము. కోరుకొండ నాయకులు 'మంచినాయకులు' కోరుకొండ ముప్పిడి నాయకునకు ముసునూరి కాపయ నాయకుడు తన సోదరినిచ్చి వివాహము కావించెను. పాల్వంచ, భద్రాచల పాలకులైన ప్రతాపరుద్రుని అశ్వదళాధిపతి,అప్పన్నఅశ్వారావు జాగీరు. ప్రతాపరుద్రుని అనంతరము తైమూర్ స్వాధీనము చేసికొనజాలక జాగీరుగా ఇచ్చినట్లు గోదావరిజిల్లా గెజిటీరు. శంకరగిరిమాన్యాలు ఈ పరగణాలోనివే.

**కోటనాగవరం - కోటరామచంద్రపురం - రంప - పోలవరం :**

కాకతీయసామ్రాజ్య పతనానంతరం ఆంధ్రవిమోచనోద్యమాన్ని ఒకనాటి చీకూర విషయం[10] గోదావరితీరానికి పోలయ, కాపయనాయకులు విస్తరింపచేశారు. పోలవరం కాపవరంగ్రామ నామాలు ఈ నాయకుల పేరిటివే. కాపయ ప్రతినిధిగా వ్యవహరించిన అనపోతు తొలిరాజధాని తొయ్యేరు. దగ్గరలోపోతవరం అతని పేరిటిది కావచ్చు. చక్రకూటంలో పరాజితులైన రాజురాణువ తూర్పుగోదావరిలోని తొయ్యేరు (దేవీపట్నం) చేరి అటునుండి రంపచేరినట్లు విదితమే. రంపలో కోటజాడలు కనుపించవుకాని శివాలయం, పంటచెరువులకు సున్నపుగచ్చుచేసిన తూములు, కాలువలున్నాయి. శిధిలమైన రామగిరి దుర్గం, పురుషోత్తమ గజపతి పేరిటిదైన కోట, పట్టిసీమలోని వీరభద్రస్వామి భక్తులైన 'రెడ్డి పోలవరపు' చరిత్రలలో గిరిజనులపాత్రకు స్పష్టమైన రూపంరావాలి. రాజమహేంద్రవరం రాజధానిగా ఈ ప్రాంతాలనేలిన రెడ్డిరాజులు 'దండకారణ్య మధ్య పుళింద రంభాహి వంశజులకు అభయమొసంగి'నారని భీమేశ్వర పురాణంలో శ్రీనాధుడు పేర్కొన్నాడు. 'రంప ఇమ్మడిరాజు సొంపు మాసె'నని శివలీలావిలాసంలో నిశ్శంక కొమ్మన. రంపచోడవరంనుండి వాడపల్లి వేళ్ళేదారిలో 'ఇమ్మడివరం' అనే కుగ్రామం ఈ 'ఇమ్మడి' రాజు పేరిటిదికావచ్చు. రాజమహేంద్రవరం రంపచోడవరం దారిలోగల ఏజెన్సీ వ్యాపారకేంద్రం, గోకవరాన్ని వెలనాటి చోడరాజు 'గొంక' నిర్మిచాడు. ఈ చోడులలో ఒకరిపేరిటిదే నేటి రంప'చోడ'వరం. తొయ్యేరు

నుండి (దేవీపట్నం) కొందరు రంపదారిపట్టగా–కొందరు ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలంలోని కోటనాగవరం రెడ్డిరాజులకు సామంతులుగా పోలవరం, గూటాల కొత్తపల్లిలో స్థిరపడ్డారు. వీరి ఆధిపత్యాన్ని, వీరిని సమర్థించిన బ్రిటిష్‌వారిని సుమారు రెండుశతాబ్దాలపాటు అన్నితెగల గిరిజనులు ఎదిరించారు.[11] ఈ ప్రాంతంలో కంబాల చెరువులన్నీ నాటి పితూరీదార్లను ఉరితీసిన 'ఉరికంబాల చెరువు'లే.[12]

ఈనాడు భూపతిపాలెం రిజర్వాయరుకింద మునిగిపోతున్న భూపతిపాలెం గ్రామం రంపపితూరీ నాయకుడు కారం తమ్మన్నదొర స్వగ్రామం. ఎన్నో దశాబ్దాలుగా పట్టుబడని ఈ తమ్మన్నదొర తలతెచ్చిచూపేవరకు రాజమండ్రిలో బ్రిటిష్ అధికారులు అతనిమరణవార్తను ధ్రువపరచలేదు. బోదులూరుఅంబులురెడ్డి, 'కుట్ర'వాడ పులికంత సాంబయ్య, అడ్డతీగల దారబందాల చంద్రయ్య, కొరుటూరు కారుకొండ సుబ్బారెడ్డి, రేకపల్లి కోండ్ల భీమిరెడ్డి నాయకత్వంలో చెలరేగిన రంపపితూరీ, అణగారిన ప్రజలు చేసిన సుదీర్ఘమైన తిరుగుబాటుగా చరిత్రకారులు కీర్తించారు.

**నల్లమలలో కోటలకు తీర్చి గుర్రపు బాటలు :**

ఆంధ్రదేశంమధ్యనున్న నల్లమలఅడవులను ప్రాక్చారిత్ర, చారిత్రకదృష్టితో ఇంత వరకు గాలించలేదు. ప్రకాశంజిల్లా గంజివానిపల్లెలోపల కృష్ణఒడ్డునగల అలాటంపచ్చి బోయలకోటలు ఒకనాడుబొబ్బిలి ప్రాంతాలనుండి వలసవచ్చి శ్రీకృష్ణదేవరాయలు కొలువులోచేరిన సైనికులవిగా దిగువపాలెంలోని ఆ వంశస్థుల కథనం. ఈకోటలకు తీర్చిన గుర్రపుబాటలు భైరవునితాపలు, జంగంమిద్దెతాపలు, మొండివాని తాపలు.

పాలుట్లలోని పెద్దశాసనం వెల్లడికావాలి. పన్నలబయలులోని శాసనం శ్రీమన్మహా మండలేశ్వర మలద్దరగండ మనుమయ్యదేవ మహారాజులు శా.శ. 1325 తారణ సంవత్సరం పాలంకగురువు సిద్ధశంకరదేవ అయ్యంగారికి ఆచుట్టాగల పొలాలను ధారపోసినట్లుచెబుతుంది. అమరాబాదు శ్రీశైలం ఉమామహేశ్వరం చరిత్రలే కాక అడవినిండా లెక్కకుమించిన పాడుబడిన దేవాలయాలు, శాసనాలు, కోటలు, చెరువులు, పొలాలు – అడుగడుగునా కనిపిస్తాయి.

గెలిచిన, ఓడినరాజులు ఈ అడవిలో దాగుడుమూతలాడారు. శ్రీకృష్ణదేవరాయల

శ్రీశైలయాత్ర ఈ రాజులజాడ తెలుసుకునేందుకు చేపట్టిన రాజకీయతీర్థయాత్ర కావచ్చును. శ్రీశైలంనడకదారిలో పెద్దచెరువు తవ్వించి దారిదోపిడితో బ్రతుకుతున్న చెంచులకు రాయలు స్థిరమైనజీవనం కల్పించాడు. ఆయన తన పాలనావిధానాన్ని ఇలా చెప్పుకున్నాడు.

దేశవైశాల్యము అర్థసిద్ధికి మూలము -
ఇల ఒకింతైన గుంటకాల్వలు రచించి
నయము పేదకు అరిగోరు ననువొసంగి -
ప్రబలచేసిన అర్థధర్మములు పెరుగు

(రాజనీతి - అముక్తమాల్యద)

కాని బ్రిటిష్‌ప్రభుత్వం చెరువుకింద టేకుతోటవేసి చెరువుకు గండికొట్టి చెంచుల పొట్టకొట్టారు. ఫారెస్టురేంజి ఆఫీసు పెట్టారు. వీరికివెరచి, చెంచులుపొలాలు బీడు పెట్టారు. దోర్నాల-శ్రీశైలందారిలోగల తుమ్మలబయలుగ్రామంలో బ్రిటిష్‌వారిని ఎదిరిస్తూ మండ్లబయన్న వీరమరణం పొందాడు.[13] ఈ గ్రామాలు ఇపుడు పులుల అభయార్యణంలో ఉన్నాయి. లక్షఎకరాలుపైగా అడవిని నైజాంప్రభుత్వం చెంచురిజర్వ్‌గా ప్రకటించింది.

**రాజనీతి :**

బోయకొట్టాలను జయించినట్లు గుణగవిజయాదిత్యుని సేనాని పండరంగని (క్రీ.శ.849- 892) శాసనం. ఈ బోయకొట్టాలలో తెగలు, యానాదులు, ఎరుకలు. సైన్యంలో ఆటవికదళాల ఆవశ్యకతను కౌటిల్యుని అర్థశాస్త్రంలో నొక్కిచెప్పారు. దండయాత్రలో సైన్యానికి ముప్పైమైళ్ళముందు ఈబోయలను ఊళ్ళు దోచుకోమని పంపేవారట. వారి అరాచకానికిభయపడి ప్రజలు పారిపోతే సైన్యం నిరాటంకంగా వెనుకవచ్చేది. 'తన మగడు బోయవీటంగల మగవారి నెల్లకూర్చుకొని కొలగోళ్ళకు దూరంబు పోయినాడని' ఆముక్తమాల్యదలో వర్ణన. రాయలు 1544నాటి శాసనంలో 'బోయసుంకం' ఈ దోచుకున్నదానిలో రాజుకు చేరవలసిన వాటాయేమో.[14] ఇలా గతకాలంలో వారి బ్రతుకులను పాచికలను చేసికొన్న పాపం, వట్టి సంక్షేమపథకాలను, రిజర్వేషనులను శ్రద్ధలేకుండగ అమలుపరచినంత మాత్రాన తీరేదికాదు.

---

*బోయసుంకం*

క. ధరణి నసాధ్యనగాటవు - లిరవుగ భూపీడసేయునెరుకల పొరుగూ
ళ్లెరవగు నస్థితి శూరుల - కెరువుగ నిచ్చునది మిధము నెట్లయినససున్
(ఆముక్తమాల్యద. 4వ ఆశ్వాసము. 223-225)

ముందుముందు తనకు ఎసరుపెడతారనుకున్నవారిని ఈఅడవులకు రాజులను చేస్తే, అటు ఆటవికులను అదుపులోపెట్టినట్లు. ఇతరుల పెత్తనానికి తలవంచని ఆటవికులతో సతమతమౌతు శత్రురాజు చెలరేగకుండగ చూసుకున్నట్లు. ఈనీతినను సరించి ఏ ప్రాంతాలను ఏ రాజులకు కట్టబెట్టారో! ఈ అడవులు ఎందరో పరాజితులకు ఆశ్రయమిచ్చాయి. ఎందరో యువరాజులకు మృగయావిహారంద్వారా, గిరిజనులు, యుద్ధవిద్యలలో శిక్షణనిచ్చారు. ఆంధ్రదేశంలో చిన్నచిన్న జమీందారులు కూడా 'మన్నె సుల్తానులే' 'చెంచుమలచూరకార' 'కూటువ మన్నె కుమాళ్ళ గుండెదిగుల' అని రెడ్డి, వెలమపాలకుల బిరుదులు.

కానిఅటు బ్రిటిష్‌వారు, స్వదేశీ జమిందార్లు, చెంచులతో తమ అవసరాలు తీరిన తరువాత వారిని దారుణంగా వధించారు. వినుకొండ సమీపాన ఐదుగ్రామాల పాలెగాడు రామనాయక్ అనే చెంచును, కేశవులు అనే తిరుగుబాటుదారును బంధించి వదిలిపెట్టినందుకు ఉరితీశారు. కాని తరువాత లొంగిపోయిన కేశవులును క్షమించారు. వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు 150మంది చెంచులను భోజనానికి పిలిచి వధించాడు. ఆ పాపంవల్ల అతనికి భోజనపదార్ధాలు విషకీటకాలుగా కనిపించసాగాయి. ఈ పాపపరిహారార్ధం అతడు 108 దేవాలయాలు నిర్మించాడు. అనేక దానధర్మాలు చేశాడు.[15]

**సీతాపతిరాజు :**

ప్రతాపరుద్రునికి తలవంచని కోయవీరుడు జంపన. కోయపడుచులు సమ్మక్క సారాలక్క తెలంగాణమంతటికీ ఆరాధ్యదైవాలు. కాకతీయసామ్రాజ్యం కూలిపోయిన తరువాత హిందూధర్మరక్షణకై పట్టంకట్టుకున్న సీతాపతిరాజు (షితాబ్‌ఖాన్) గిరిజనుడే. సీతాపతిరాజుమంత్రి పెద్దనకు చరిగొండధర్మన 'చిత్రభారతా'న్ని అంకితమిచ్చాడు ప్రతాపరుద్రగజపతి ప్రోత్సాహంతో సీతాపతిరాజు ఏలూరు కొల్లగొట్టాడు. శ్రీకృష్ణదేవ రాయలను కళింగదేశంలో ముందుకుసాగనీయకుండ అడ్డుపడి వీరమరణంపొందాడు.

సమ్మక - సారక్క, జంపన, పగిడిద్దరాజు ప్రతాప రుద్రునితో తలపడి వీరమరణం పొందడం, పురాగాథగా రూపాంతరం చెందిన సీతాపతిరాజు చరిత్ర కావచ్చును. ఇతని పోరాటాలను కృష్ణాజిల్లా గెజిటీర్ ప్రస్తావించింది.[16]

## గుర్తేడు కన్నమరెడ్డి :

గుర్తేడు కన్నమరెడ్డిగూర్చి దారకొండ వాస్తవ్యుడు. జక్కుల చిన్నయ్య (వాల్మీకి) వ్రాసిన కోలాటంపాట.

గురితేటి కన్నమరెడ్డిగారు పుణ్యమంతులయ్యా
- తమరు ధర్మముగల ప్రభువులు
దూదిపరుపులు జాజిమేడలు చేదబావులండీ
మదురుగోడలు సున్నపుగచ్చులు కుదురుసావటిండ్లు
చదునుచేసి కంపెనీదొర్లతో ఎదురు కుర్చులండీ
అసలింటి పట్నపు రెడ్లని దెసలు పొగడగాను
విశాఖపట్నపు కచేరిలో తమ వశపు మాటలండీ
బజారెంబడి ఖజాన పెట్టెలు హాజరుండగాను
రాజమందిరం బజారులో తమ పేర ధర్మమండీ
కోర మీసము ఓరశోభిలి సారముగల ప్రభులు

నాధుడైన కన్నమరెడ్డికి భార్యలిద్దరండీ
చిన్నమ్మి పెద్దమ్మి ఇద్దరు పద్ధతిగల స్త్రీలు
హద్దుతప్పక నాధుని సేవకు బుద్ధికలిగి ఉండీ
వాటమైన లోకోట లోపల కొమిరెతోటలండీ
కొమిరెతోటలు కొబ్బరిఫలములు జామిఫలములండీ

నాధుడైన కన్నమరెడ్డికి ధాన్యగాదెలండీ
చాలపశువులు వేలగుర్రాల్ మేల్పల్లకీలు
ఎటుచూసిన మందగేదెలు వందలెక్కలండీ
॥గురితేటి కన్నమరెడ్డిగారు॥

పాలకి వచ్చిది పాపవచ్చిది - పట్నపు మారాజ తలుపుతీయించు
అద్దంపు గోడలు మిద్దెటరుగులు - అతి వెలుగుతున్నదోయ్ రాజదివాణం
ఇత్తడి గుబ్బలు దిడ్డితలుపులు - సిరి వెలుగుతున్నదోయ్ రాజదివాణం
మొక్కుమొక్కు రఘురామ
- మొక్కు రఘురామ మొక్కినచేతులు మొగలిరేకులు
పట్టెమంచంనేత కలవెండి నేత - వారిదిగ కలవెండిరేకుల్ల నేత
బొడ్డున పొన్నపూవన్నెల్ల నేత - బల్లలమీదనే ఒల్లెల్లుపేర్చి
ఒల్లెలమీదనే మల్లెలు పేర్చి - మల్లెలమీదనే మారాజు వచ్చె
హరిశ్చంద్ర మారాజు గొడుగులు పట్టె - సురకోటిదేవతలు సురటి వేసిరి
- అయోధ్య మారాజు హరిపాదలొత్త
వంగి మొక్కిన నడుము సింగిడీవిల్లు
మొక్కంగ మారాజు ఏమిచ్చినారు
కీర్తి ఉండెనని గిత్తలిచ్చిరి - పేరు ఉండెనని పెయ్యలిచ్చిరి

వాల్మీకుల కైవారాలకిది ఒక మచ్చుతునక

ఇవన్నీ అచ్చైన, వినవచ్చే ఆధారాలలోని అంశాలు. అడవులు, ఆటవికులు చరిత్రహీనులుకారు. వాటిని వెలికితీయని బలహీనులం మనమే. ❈

## చెంచు మల్లన్న - చెంచులక్ష్మి :

చరిత్ర ప్రస్తావనలు మాత్రమేకావు - మనసాంస్కృతికమైన పునాదులుకూడా ఆటవికమైనవే. తేనెలుతీయడం రాతియుగాలకంటె పూర్వంనాటి ముఖ్యమైన జీవనాధారం. నల్లమలలో కొండసరులనుండి తీసిన తేనెపెరలో మల్లమ్మకు ఒకగడ్డ సమర్పిస్తారు. తేనెలుతీయడంలో నాటికీనేటికీవచ్చినమార్పేమీలేదు. ఒకనాటిచెంచుల మాతృస్వామ్య సమాజం ఆరాధించిన ఈమల్లమ్మ, తరువాత - మల్లికార్జునుడై ఆసియా సంస్కృతిలో జ్యోతిశ్చక్రమైనాడు. మధ్యభారతంలోని యీ గిరిజనవరునికి, పృధివికి మానదండమైన హిమవంతునికూతురుకు పెండ్లిచేసి ఈభూభాగంలో ఏకాత్మతను సాధించుకున్నది మనసంస్కృతి.



అహోబలక్షేత్రం
మంటపంలో చెంచులక్ష్మి



అహోబలక్షేత్రం
కళ్యాణమంటపంలో చెంచులక్ష్మి

కేవలం మల్లన్ననే కాదు ఆయన పరివారాన్ని మొత్తం కల్పనకుఅందించిన వారు ఈ చెంచులు. కొరవజాతివారిని తమిళనాడులో పాంబాడివారని సింహళంలో, అహికుంటికులని (పాములు పట్టేవారు) పిలుస్తారు. వారి భాష 'వడిగేరి'. వడిగేరి అనగా వేటకుక్కలజాతివారని తమిళమహాకావ్యాలు ఇచ్చిన అర్ధమట. చెంచులది కుక్కవేట. తూరుపు కనుమలవలె కాక నల్లమలలు పరుగెత్తె జంతువులకు అనువైన సాపునేలలు. చెంచులు ఒక బంగారుకుక్కను తమ పూర్వునిగా చెప్పుకుంటారు.[17] ఈ కాలభైరవునితో ఆహారాన్నిసేకరించుకునే ఆదిభిక్షువుమల్లన్న. ఆయన పినాకధ్వని, సారంగపాణి. అగ్నిని ఆయుధంగా, సాధనంగాచేసుకున్న ఆదిమానవుడు- శ్రీశైలంలో వృద్ధమల్లికార్జునుడే ఆ పురాణపురుషుడు 'చెంచుమల్లన్న' లేదా 'చెవిటిమల్లన్న'.

ఈతత్త్వం వికసించేందుకుకావలసిన తంత్రానికి మూలమైన మూలికలను నల్లమలచిట్టడవులు, రసవాదులైన సిద్ధనాగార్జునాదులకు, సులభంగా సమకూర్చినవి. నల్లమల రాతినేలలపై మూలికలను సేకరించుకోవడం తేలికైనపని. అంతేగాక రాతి నేలలపగుళ్ళలో మొక్కలు ఎత్తుపెరగవు, త్వరగాచావవు. అందువలన ఎన్నోసంవత్సరాలు జీవించే ఈ వృక్షధర్మాలలో పలుమార్పులొస్తాయి. ఇటువంటి మొక్కలు కొన్నింటికి వందల సంవత్సరాలవయసుంటుంది. వీటికి నేటి వృక్షపరిశోధనాసంస్థలలో చాలా గిరాకీఉంది. అటువంటి చెట్ల జీవాణువులతో, జన్యుకణాలతో ఒకనిధిని వారు ఏర్పరుస్తారు. వీటిని విజయవంతంగా వినియోగించుకొని శ్రీశైలం ప్రాధాన్యాన్ని వైజ్ఞానికంగా, తాంత్రికంగా, సాంస్కృతికంగా వర్ధిల్ల చేసినవారు నాటిసిద్ధులు, ఆయుర్వేద విద్వాంసులు.


శ్రీశైలం-దోర్నాల మార్గంలో చింతల దగ్గర భైరవగుహలోని బయన్న శిలారూపాలు

భారతఉపఖండంలో ఆర్యద్రావిడుల కలహాలు మనం ఊహిస్తాం. కాని శైవ వైష్ణవుల కొట్లాటలు చరిత్రకు తెలిసినవే. వారి అంతఃకలహాలు ఎట్టివైనా ఈ రెండు మార్గాలు భారతీయసంస్కృతికిమూలధనాలు. పరిసరానికున్నపరిమితులు మనసుకు లేవు. విభిన్నప్రాంతాల, జాతులమధ్య అన్యోన్యత పెంచడానికి మానవజాతి ఎన్నో ప్రయోగాలుచేసింది.

శ్రీరంగనాథుని పెండ్లియాడిన తమిళుల ఆడపడుచు గోదాదేవి. రావణసంహారం తరువాత అయోధ్యకు మరలే శ్రీరామచంద్రుడు గోదాదేవి ప్రేమలోపడి శ్రీరంగంలో నెలవైనాడు. ఆమెమీదిప్రేమతో దక్షిణాభిముఖుడై పవళించాడు. భారతవర్షంలో సార్వ భౌమత్వాన్ని, వ్యవసాయ పురోగతిని, ఆశ్రమధర్మాలను నిలబెట్టడానికి విల్లుపట్టిన శ్రీరామతత్త్వంతో తమకడుపు పండాలని తల్లులు నోములునోచుకుంటే, అనురక్తులు తమతో వియ్యమందాలనికోరుకున్నారు. తమిళనాడులోవర్ధిల్లిన ఈభావాన్నేఆంధ్ర దేశంలో అహోబిలమఠం చెంచులక్ష్మిని నరసింహునికి అర్ధాంగినిచేసి అనుసరించింది. నరసింహుని కౌగిలిలో తన్మయురాలైన లక్ష్మి, కౌగిలివీడక భక్తునివైపు ముఖంతిప్పి అభయమిస్తుంది. ఈభంగిమ ఏదేవతలోనూ చూడము.[24] చెంచుదంపతులుకూడా ఈ 'ఇల్లు ఇరకటం (చుట్టుగుడిసెలు)– ఆలి మరకటం' కోవకు చెందినవారే. ఒక్క చెంచుల లోనేకాదు ఎరుకలు, ఏనాదులు వగైరా ఆటవిక జీవికగల జాతులలో మగనిని పెండ్లాం వేటలోకూడా వదిలిపెట్టదు. అందుకుతగ్గ యిల్లు, పరిమిత సంతానం, చెట్టు మందులు... అదొక సంస్కృతి.

**లంజెబయన్న – భక్తకన్నప్ప – చెంచుకాంభోజి :**

దిగువపాలెం (ఎరగొండపాలెం) దేవాలయం కోనేరులోని నరసింహుడు చెంచులకు 'లంజెబయన్న' (భైరవుడు). బయన్న విగ్రహాలు దారబయలులో, పెద్ద చెరువులో, విలుబద్ధ తుపాకులతో కనిపించాయి.

మల్లన్న, బయన్నలను మార్గసంప్రదాయం ఎగరేసుకుపోగా, భ్రమరాంబ, చెంచు లక్ష్మలను శివకేశవులకు యిల్లాండ్రుగాచేసి తమబావలను, అల్లుళ్ళను చేసుకున్నారు మాతృస్వామ్య సమాజంవారైన చెంచులు. తమ ఆడపడుచులను ఇద్దరు ప్రధానదైవాలకు దేవేరులనుచేసి మనసాంస్కృతికమూలధనాన్నిపెంచిన ఈ చెంచుజాతి ఎంతో ధన్యమైనది. కావ్యపురాణ ప్రశస్తిగన్న తిన్నడు, కన్నప్ప ఎప్పటివాడో. అన్నమయ్య గానం చేసిన చెంచుకాంభోజి రాగమేదో – ఈ నాలుగు శతాబ్దులలో ఏమైనదో. ఆంధ్రుల అభిమాన శృంగారనాయిక చెంచులక్ష్మి. చాలా నృసింహక్షేత్రాలలో శ్రీలక్ష్మితోపాటు ఆమె కొలువైవుంటుంది. పెద్ద అహోబలాన హిరణ్యకశిపుని చీల్చిచెండాడుతున్న స్వామి సన్నిధిలోనే చెంచులక్ష్మి, ప్రహ్లాదుడు ఉన్నారు. శ్రీలక్ష్మితో కల్యాణానికి ఒక రోజుముందే

ఇక్కడ చెంచులక్ష్మి కల్యాణం చేస్తారు. కృష్ణాజిల్లాలోని వేదాద్రిలో రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి, స్వామికిరువైపులా కొలువుతీరి ఉన్నారు. అనంతపురంజిల్లాలోని పెన్న అహోబిలంలో రథసప్తమినాడు చెంచులక్ష్మి కళ్యాణంజరుపుతున్నారు. కానీ ఇది బసివిసంప్రదాయంలో భాగం కావడం మనసును కలచివేస్తుంది.[18]

## మార్గసంప్రదాయంలోకి ఆరోహణం :

అనేకజాతుల, ప్రాంతాల ప్రత్యేకతలను మేళవించుకొని విస్తరిల్లిన మనసంస్కృతి, తన మూలాలను విస్మరించడంతో క్షీణదశ ప్రారంభమైంది. ఇతరులకు లోకువైంది. సాంఘికంగా తమఅంతస్తు పెరుగుతున్నకొద్దీ, సంస్కృతీకరణంవైపు మళ్ళుతున్న బలహీనవర్గాలు, తరతరాలుగా ఆరాధనకేంద్రాలలో, పద్ధతులలో తమ వారికిగల మర్యాదలను, దేశిసంప్రదాయాలను కాలానుగుణంగా సంస్కరించి బలపరచడంపోయి 'వేదోక్తం' పిచ్చిలోపడిపోతున్నారు. లేదా ఇతర మతాల్లోకి మారిపోతున్నారు.[19]

ఆంధ్రదేశంలోని దేవతలందరూ గిరివాసులే. కడపశ్రేణిలోని ఎత్తైన స్థానాలు ఒకటి మల్లికార్జునునకు రెండవది నరసింహునకు నెలవైనాయి. శ్రీగిరిమధ్యాన్ని తమ రంగస్థలం చేసుకున్న ఆదిదంపతులు భ్రమరాంబమల్లికార్జునులు. ఈ దేవాలయాలలో చెంచులకున్న మర్యాదలు పురాతనమైనవి. గిరిజనులకు దైవాలిద్దరే. అందరికి లింగమయ్య; ఆయనతో పాటు తూర్పుగిరిజనులకు పాండవులు. మనకు శివరాత్రినాడు అభిషేకాలతో జాగారం. గిరిజనప్రాంతాలలోని శివరాత్రి, తరువాత పండుగలలో పడుచులుకలవడానికి నాందిపలుకుతుంది. కోయలదేవుడు క్రమంగా రాముడైనాడు. భద్రాచలం చుట్టూగల కోయలు శ్రీరామభక్తులు. కోయలకు ఇష్టమైన ఇప్పపూలను స్వామికి నివేదిస్తారు. నాటి రేకపల్లిసంస్థానానికి చెందిన వరరామచంద్రపురం మండలం లోని శ్రీరామగిరి కల్యాణంలో 'దొంగలదోపు' జరిపిస్తారు. పెళ్ళికూతురును 'దొంగ చేయడం' అనే ఈతంతు చాలాదేవాలయాల కల్యాణోత్సవాలలో ఒక ఉల్లాసకరమైన వేడుక.

తెలుగుసంస్కృతిలో రాజకీయాలకు, మతానికే కాదు, తెలుగుల ఆచారాలకు కూడా గిరిజనసంస్కృతి భూమిక. ఆచారాలు, పండుగలు, వలసలవలన తెలియవచ్చే చరిత్రే సంస్కృతి. ❉

**మామిడి కొత్తే – తెలుగువారి ఉగాది :**

ఉగాది, సంక్రాంతి ఋతుధర్మం మీద ఆధారపడిన పండుగలు. మామిడి పిందె పడుతున్న సందర్భంగా మనంచేసుకునే ఉగాది, మామిడి పండుగగా మన్యాన ఎంతో ప్రసిద్ధమైనది. సంక్రాంతికిముందు(దేశవిడి)పొలంలో అయినవారందరూ తిని మిగిలిన మాంసాన్ని పూడ్చిపెట్టడం రాజులపండుగ పరిణామమే. పోడు వ్యవసాయం చేసే కొండరెడ్లు కొండలకు (నగరి) మ్రొక్కి అక్కడే ఆ పండుగ తీర్చుకుంటారు. గిరిజనుల 'పెంకవంట' శ్రోత్రియుల 'వైశ్వదేవం' ఒక్కతీరువే. యుద్ధభూమిలో 'రణంకుడుపుట' గిరిజనులు పొలానికి బలియివ్వడంవంటిది. వెన్నులుముంపడంవలెనే వరికంకులను ఇంటివసారాలలో కట్టడం జానపదుల అలవాటు. పచ్చిపండు విభాగాలు, పండుగ చేయడం జానపదులలోనూ ఉన్నవే.

పురిటాలురేవుకు మొక్కడం 'కప్పతల్లి నీళ్ళాడే' అని పిల్లలు ఊరేగడం తెలిసినవే. అనేకవిధాల గిరిజనులు ప్రస్తుతించే ఈ జలకన్యకలపాత్ర తెలుగుసంస్కృతిలో ప్రముఖమైనది.[20]

తెలుగుప్రజల విశ్వాసాల మూలస్వరూపాలను గిరిజనసంస్కృతిలో చూడవచ్చు. రాజకీయమైన ఆక్రమణవలెకాక, సాంస్కృతిక ప్రగతి, నూతన కల్పనలను ప్రవేశ పెడుతుంది. కత్తిపట్టే రాజరికంకంటే, ప్రజల మనోమయ ప్రపంచాన్ని కదిలించే ఆచారాల ప్రభావం శాశ్వతమైనది.

చరిత్ర తెలియని ఆచారాలు మూఢనమ్మకాలై అలౌకికమైన విశ్వాసాలనుపెంచి ప్రగతికి సంకెళ్లౌతాయి. వివిధ దృక్కోణాలనుండి వచ్చే విమర్శలను తట్టుకోలేక, తమను సమర్థించుకోవడంలో సంకుచితమైపోయే సంస్కృతిలో, ద్వంద్వప్రమాణాలు మొదలై జాతి తలెత్తలేకపోతుంది. ఏదోఒకదానికి శాస్త్రీయప్రతిపత్తినిచూపిస్తూ, చమత్కారమైన నిరుక్తులతో వ్యాఖ్యానించడం మొదలైతుంది. దీనివల్ల ఆలోచన పరిధి భవిష్యత్తుకు తగినట్లుగా విస్తరించదు. లోకంలో ఎన్నో చిల్లరమల్లర ఆచారాలు అర్థంతోచక విసుగు కలిగిస్తాయి. అవి అర్థరహితము. యాదృచ్ఛికము అయినపుడు, ఒకో జాతిలో ఒకో రకమైన ఆచారాలుండాలి. కాని యీఆచారాలలో ఒకనిబద్ధత, పునరావృతిని గమనించ గలిగేదశకు ఎదిగాంకాబట్టి, ప్రయోగాలనన్నింటిని పరిశీలించి అర్థనిర్ణయం చేస్తున్నట్లు,

ఆచారాల వ్యాప్తినంతా వెలికితీసి పరిభాషను నిర్ణయించాలి.[21] మనం బలవంతపెడితేనే గతం ముందుకు దారిచూపిస్తుంది. లేకపోతే ద్వారాలులేని కూపంలో అది మనలను బంధించివేస్తుంది. మనం చరిత్రను నిర్మించకపోతే, చరిత్రే మనకు రూపాన్నిస్తుంది.[22]

భూగర్భ ప్రాక్చారిత్రక శాస్త్రాలలో భూమినుండి తీసిన రాళ్ళను వస్తువులను కర్బన కాలనిర్ణయ విధానంతో విశ్లేషిస్తారు. బొగ్గులోపల మట్టిని పరిశీలించి పుప్పొడిని గమనించి బొగ్గునిలువలను అంచనావేస్తారు. శిలాజశాస్త్రజ్ఞులు చమురును గూర్చిన ఇటువంటి పరిశోధనలు చేస్తుంటారు. సంస్కృతినిగూర్చిన పరిశోధనలు సంస్కృతికి, సమాజానికి కొత్తప్రాణం పోయగలవు. బహిరంతరాలలో సంకోచంలేని ప్రగతికి, ధైర్యాన్ని అందించగలవు.

ఈదృష్టితో చూసినపుడు ప్రాచీనసమాజాలగూర్చిన బహుముఖమైన అవగాహన స్పష్టంగాలేని తెలుగుల సంస్కృతి కాళ్ళులేనిదౌతుంది. మార్గసంస్కృతి ఆలంబనంలేని గిరిజనులు చేతులులేనివారౌతారు.

తెలుగుదేశపు వాతావరణంలో, పరిసరంలో ప్రకృతి సంపదలో ఎంతో వైవిధ్య మున్నది. దీనిని ఎక్కడికక్కడ సమగ్రంగా వినియోగించుకోగల ప్రతిభ సాధనసంపత్తితో మనసంస్కృతి వర్ధిల్లింది. ఆయాప్రాంతాలలో తెగలందరు తమ పరిసరానికి తగిన విశిష్ట జీవనవిధానంతో విజ్ఞానంతో స్వతంత్రులుగా చిరకాలంగా జీవిస్తున్నారు. తొలిగా అనువదింపబడిన భారతీయగ్రంథం పంచతంత్రమట. ప్రతిగిరిజనుడు ఎన్నో పంచ తంత్రాలు చెప్పగలడు. ప్రతికథ పరిసరవిశేషాలకు మనోజ్ఞమైన కరదీపిక. జానపద జీవితం వ్యవసాయంచుట్టూ పరిభ్రమించేదికాగా ఈ తెగల జీవితాలకు అడవిఆధారం. జానపదుల సామెతలలో మిగిలిన, పలకంనెల (పలకమ్మకు పడమటి కొమ్మైనా పూస్తుంది) ఋతుచక్రమంతా గిరిజనులకు తెలిసినదే. 'ఊటనేల దుక్కికిరాదు'. 'ఊటనేలలో ఊడుపులు ఉద్ధరించినట్లు', ఈ జానపదుల అనుభవాలన్నీ 'ఎండ్రిక నీళ్ళు'గా విశాఖ గిరిజనులకు, 'రెల్లపూచినట్లు' అనే పోలికలు 'రెల్లపూల గాలిరాగా రేగిపోదామన్న మనసు' అని పాడుకునే గోదావరి గిరిజనులకు సమగ్రంగా తెలిసినవే.[23]

ఈ జానపద విజ్ఞానం నిగ్గుతేలాలంటే శాస్త్రచరిత్రను గిరిజనులనుండి పరిశోధించుకుంటూ రావాలి.

*పలకమ్మకు పడమటి కొమ్మైనా పూస్తుంది*

యంత్రబలంతో నాగరికత పెట్టే పరుగులకు, యీ సంప్రదాయవిజ్ఞానం ముకుదాళ్ళు వేయకపోతే, మానవజాతికి ఊపిరాడకుండపోతుంది. మానవదార్శనికులు పదార్థవిజ్ఞానవేత్తలసాయంతో వాఙ్మయ ప్రక్రియలద్వారా ఈవివరాలు వెలికితీయాలి. భూగోళ, జంతు, వృక్ష, మత్స్య, పక్షి, సర్పశాస్త్రాదులు మన బోయల, కొరువల, ఎరుకల, పాముల, కురుమల, బెస్తల, జాలరులసొత్తులు. ఆటవికనేపథ్యంలోని ఈ జాతుల అభివృద్ధి నేడు పెద్దసవాలుగాతయారైంది. సిక్కుల, గూర్ఖాల, మరాఠాల, రాజపుత్రులు మొదలుగాగల జాతుల యుద్ధకౌశలాన్ని మనసైన్యం ప్రత్యేకదళాలుగా ఏర్పరచి ఆ వారసత్వాన్ని గౌరవిస్తున్నట్లే, మన తెగలలో ఇట్టి వైజ్ఞానిక బృందాలను తయారు చేయాలి. ఆ ప్రాంతపు కళాశాలలో ఈ జాతుల, కళల, శాస్త్రచరిత్రల అధ్యయనాన్ని ప్రోత్సహించి, ఈ తెగలపట్ల 'గౌరవం' పెంచాలి. వారిలో పెరుగుతున్న 'ఆత్మన్యూనత' వదిలించాలి.

ఈ తెగల కళాత్మకమైన సారస్వతం ఎనిమిదికోట్ల తెలుగుప్రజలకు, ప్రపంచానికి జ్ఞానభిక్ష పెడుతుంది. ఎదిగే తరంలో ఈ ఆటపాటలు మనోవికాసాన్ని, ఈ అడవులలో పర్యటన ధైర్యసాహసాలను, ఈజాతులగూర్చిన సదవగాహన మానవత్వపు విలువలను పెంచుతుంది.

*ఆ సాధనలో ఈ పరిశోధన :–*

తొలిపూవు, చేగంట, చిరుదివ్వె, బాలభోగం, మంగళకైశికి.

ఓం తేజస్వినావధీతమస్తు

# సంప్రదించిన గ్రంథాలు - ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. The stone -tipped arrow. Bridget Alchin ; Phoenix Book , London. P.121.

Firstly, the type of the site favoured by the late Stone age people is very much the same throughout the whole of India, They almost always selected spots on rising ground, on hillock spurs, often over looking rivers above the water very much as the Chenchu and other tribal do today. The reason, these people give for their choice include safety from wild beasts, coolness, freedom from mosquitoes and the inevitable .'Thats' where we always lived. In addition to those for whom the hunting the larger animal was important, a good view of surrounding country and of places where game came to drink was obviously an advantage. (Page 119) There can be little doubt throughout most of India whether is quartz or in other materials belonged to the group known as Veddoid or Proto Austroloid which is so strongly represented in the population today especially among groups like Chenchus who live virtually at the hunting level.

F Page 79. The basis ethnic type throughout the Indian subcontinent is the Veddoid or Protoaustroloid variously named by different authority which predominates among the southern tribes but occurs everywhere.

F Page 76. Throughout India today, the areas of highest rain fall are generally the most heavily populated but in prehistoric times this was not the case and the most densily populated areas were those of lower rain fall ........ In many parts of the world, there has been a tendency for hunters and early agriculturists to prefer grasslands and light-wooded country areas of lightish soil and moderate rainfall, in which game was abundant and the amount of forest tolerance necessary for cultivation was at a minimum.

F Page87. For the purpose of general cultural interpretation, therefore, the south African Bushmen, the Congo Pygmies and Chenchus and the Veddas

of Indian and Ceylone are in some ways probably more representative of the late stone age culture of their own and adjacent territories, albeit in somewhat fossilized form.

2. Ancient races of Deccan, 1972. Sarcar S.S., Page 196.

... it is not unjustified to consider Dravidians as a race evolved from the autochthonous Austroloids. The first contact was perhaps with the Indo caspians in the course of latter southward movement along western region of India.

3. India - a regional geography - P.775. NGSI.

History reveals the fact that Dandakaranya was ruled by Nal dynasty. Stone Inscription of Podagarh (Koraput), gold seals from Adnega village of Kondagaon Tahsil (Bastar dist).

The Vakataka queen Prabhavati Gupta, the daughter of Chandragupta Vikramaditya II had established her kingdom Capital at Nandapur which is probably the same as Nandapur township in Koraput dist.

The Chakrakot mandal was ruled by Chalukyas, Kakatiyas and Chindaknagas were followed by Annamraj who gave the Bastar to it which appears to have been derived from the Sanskrit Word Bakhtitar. Annamraj is identified as a Kakatiya ruler justified by a rock inscription of Dantewada.

4. ప్రాచీనాంధ్రచారిత్రకభూగోళము. కుందూరి ఈశ్వరదత్తు, బి.ఎ.,ఆ.ప్ర.అకాడమి. 1963. పుట.148

5. ఒడ్డాది మత్స్యరాజుల వంశావళి. సింహాచలం: తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన యం.ఫిల్. సిద్ధాంతగ్రంథం.

6. పద్మనాభయుద్ధం – తెలుగు అకాడమీ మోనోగ్రాఫ్, 2004.

7. ఆనరబుల్ డి.యల్. కార్మైకిల్ – విశాఖజిల్లా గవర్నమెంట్ ఏజెంట్ వ్రాసిన విశాఖజిల్లా గెజిటీర్, 1935 అనువాదం: విజాపురపు వెంకటరామయ్య, ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంధాలయంలోని ప్రభుత్వ పురాతత్త్వశాఖలో లభ్యం.

8. P. 97. Subaltern Studies I. Adivasi also made pilgrimages to cult centres and shrines reverenced by hillmen throughout the wider Eastern Ghats region. One such site was Peddakonda, eight miles east of Rekapalle, which was sacred to the deity Sarlamma; another, Papikonda, on the right bank of the Godavari a few miles upstream from Rampa, was the site ofl a major festival held every seven or eight years in honour of the Pandavas (whom the adivasis believed to be five separate deities). Sacrifices to Maveli may also have been made here. Other cult centres lay within the boundaries of Rampa - for example at Taddepalle, twelve miles north of Chodavaram. In origin these were adivasi gods and sacred sites, but, through long association with the Koyas, the Bagatas had absorbed them into their own practices and beliefs. Indeed, the idea that they were part of an ancient and indigenous religion, springing from the hills and streams among which the hillmen lived, perhaps gave them an extra potency in times of collective distress and outside oppression.

P. 232. Reading Subaltern Studies, Critical History, Contested Meaning, and the Globalisation of South Asia, Ed. David Ludden. 2002, Permanent black.

In the Gudem-Rampa case religion was used to express dissatisfaction with subjugation and frame the terms of deliverance within a known model that provided symbolic capital to counteract the superior control of economic capital by their oppressors. Traveling ecclesiastes (sivasaris) moved throught the region, with the prophecy in 1886 of one Bodadu that God had ordained a successful fituri (rebellion). This was rendered authentic by the encounter of Bodadu with the five pandavas (the redemptive brotherhood of the Mahabharata epic in the Hindu Tradition) in the jungle, a symbolic mediation of local and national culture that was politically expedient for integration hillmen with supporters in the plain (Arnold 1982).

P. 394. We should not allow histrocial forces to subsume us but truly take charge or our lives and act now in making our own history as we please, before it is too late.

9. East Godavari Forest Working Plan 1995 - 2005. Preemptory order

excluding all forest officers from the agency. G.O.Ms.No.2829 dated : 4.8.1893. The government in their G.O.Ms.No.1227 dt.8.6.1955 passed orders lifting the out moded ban on the entry of Forest Officers. P.61

10. E. I. Vol XIII P. 104-105.

కళింగదేశ చరిత్ర సం. రాళ్ళబండి సుబ్బారావు. ఆంధ్రేతిహాస పరిశోధక మండలి, రాజమండ్రి 1930. పుట. 56, 62, 427, 417.

**చీకూరవిషయము :**

తూర్పుగోదావరి మండలములోని చోడవరము తాలూకా శరభవరమను గ్రామమున దొరికిన ఎనిమిదవ శతాబ్దమునాటి సంస్కృత శాసనములోనిది పేర్కొనబడినది.

"ఓం స్వస్తిశ్రీ విజయ చీకూర పురాత్.... చీకూర విషయాధిపతిః

పులక గ్రామాణ్యయుక్త కాశ్చైవ అజ్ఞాపయః ।"

ఈ శాసనములో దాత పేరులేదు ప్రతిగ్రహీత హారితగోత్రుడైన హరిశర్మయను బ్రాహ్మణుడు. దానమొసంగబడిన గ్రామము పులక. శాసన పరిశోధకులు దీనిని గుర్తింపలేదు. చీకూరపురము చోడవరము తాలూకాలోని చీడేరు. పులక లేక పులోక యనునది ఈ తాలూకాలోనిదే. గుయ పలకూరు అను పల్లె చీకూర విషయము నేటి తూర్పు గోదావరి మండలములోని చోడవర ప్రాంతమునగల మన్నె దేశము.

11. District Gazetteers, Godavari. F.R. Hemingway 1907.

P.283 Polavaram village contains some tombs which are locally stated to be those of European soldiers who fell in the fituri of Mangapathi Devu at the end of eighteenth century. They bear no inscriptions. Another grim relic of the old disorders in these parts which existed here till recently was the gallows on which Subba Reddy and Kommi Reddy, the ringleaders of the fituri of 1858, were hanged. This was carried away by the floods of 1900.

12. తిరగబడ్డ తెలుగుగడ్డ 1857 – ఎం.వి.ఆర్.శాస్త్రి. ఆదివారం ఆంధ్రభూమి, 14జనవరి 2007. ఆధారం: South India in 1857, V.D. Divekar, Tilak Smarak Trust, Poone.

గోదావరి తీరాన ఎర్నగూడేనికి ఉత్తరాన పాపికొండల్లో గోదావరిఒడ్డునగల కొరుటూరుగ్రామానికి చెందిన కారుకొండ సుబ్బారెడ్డి సింహంలా గర్జించాడు. వ్యవసాయ భూములను, సంపన్నమైన అటవీ భూములను లాగేసుకుని, దేశంలోని బీళ్లు, అడవులు అన్నిటినీ బ్రిటిష్ సర్కారు ఆస్తిగా ప్రకటించేందుకు ఏర్పాటైన ఇనాం కమిషన్ తన పనిని అప్పటికి దాదాపుగా పూర్తిచేసింది. 1857 సంవత్సరం మొదట్లో చిన్నరైతులు, గిరిజనులు, చిన్న భూస్వాములు, జమీందార్లు తరతరాలుగా అనుభవిస్తున్న భూములపై వారికిగల యాజమాన్య హక్కులను రద్దుచేస్తూ దుర్మార్గపు చట్టాన్ని చేశారు. భూములు, వసతులు కోల్పోయి దారుణమైన అన్యాయానికి గురిఅయినవారు ఆంగ్లేయుల పేరుచెబితే మండిపడుతున్నారు. నడమంత్రపు పెత్తందారుల పీచమణచి, తమ హక్కులు తాము తిరిగి పొందాలని తహతహ లాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎర్నగూడెంలోని కొండరెడ్లు, కోయలు కారుకొండ సుబ్బారెడ్డి నాయకత్వంలో తెల్లవారిపై సాయుధ తిరుగుబాటు చేశారు.

సుబ్బారెడ్డికీ, బుట్టాయగూడెంలోని తెల్లవారి తొత్తు శంకరస్వామికి మధ్య ఏదో పెళ్ళికి సంబంధించి వచ్చిన తగవు కాస్తా చినికి చినికి గాలివానలా పెద్ద గొడవకు దారి తీసిందని బ్రిటిషు అధికారులు మొదట్లో అనుకున్నారు. అది వ్యక్తుల తగవుకాదు, ప్రజల తిరుగుబాటు అని పోనుపోను వారికి అర్ధమైంది. 1857 ఆగస్టులో రాజుకున్న పోరాటం నవంబరుకల్లా ఉద్ధృతమైంది. గోదావరి లోయలోని ఎర్నగూడెం కొండ ప్రాంతాల్లో తాడిమళ్ల తాలూకాలో గ్రామగ్రామానా విప్లవాన్ని జ్వాలలు రగిలాయి. సుబ్బారెడ్డి తన గిరిజన సేనతో నాగవరం, బుట్టాయగూడెంలను చేజిక్కించుకున్నాడు. కోపల్లె జమీందారు కొర్ల వెంకటసుబ్బారెడ్డి, రేకపల్లి జమీందారు, సూరెడ్డి వెంకయ్య, భద్రాచలం రాజాల అండదండలు అతడికి లభించాయి. నాగవరం ప్రధాన స్థావరంగా పెద్దఎత్తున ఆయుధ సమీకరణతో ఏజన్సీ ప్రాంతాల్లో భీకర యుద్ధానికి భారీ సన్నాహాలు మొదలయ్యాయి.

నిజాం ఏజంట్లు ఈ విషయాన్ని పసిగట్టి హైదరాబాద్ రెసిడెంటుకు నివేదించారు. ఆయన ఈ సంగతి మద్రాసు ప్రభుత్వానికి తెలిపాడు. బెంబేలెత్తిన రాజమండ్రి కలెక్టరు రెండు కంపెనీల సైన్యాన్ని సుబ్బారెడ్డిపైకి పంపించారు. పోలవరం తాలూకా జీలుగుమిల్లి వద్ద ఇరువర్గాలకూ యుద్ధం జరిగింది. అడవిలో పోరాడే విద్యలో అరితేరిన

సుబ్బారెడ్డి జరిపిన గెరిల్లా దాడులకు బ్రిటిష్ సేనలు కకావికలయ్యాయి. పంట పొలాలను పాడుచేసి, ఊళ్లను తగులబెట్టి ఎన్నివిధాల సతాయించినా సుబ్బారెడ్డికి గల ప్రజాబలాన్ని వమ్ము చేయలేకపోయారు. చేసేది లేక, సుబ్బారెడ్డి ధాటికి నిలవలేక తెల్లసైన్యం కాలికి బుద్ధి చెప్పింది.

1858 జనవరిలో రాజమండ్రి మేజిస్ట్రేటు కారుకొండ సుబ్బారెడ్డి, కొర్ల సుబ్బారెడ్డిలను పట్టించిన వారికి 500 రూపాయల బహుమతి ప్రకటించాడు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ మొత్తాన్ని తరువాత 2500కు పెంచారు. మొత్తం 20 మంది మీద రాజద్రోహం, తిరుగుబాటు చేసులు పెట్టారు. 1857 సెప్టెంబర్ 23న బుట్టాయగూడెంలో అసిస్టెంట్ మేజిస్ట్రేటును చుట్టుముట్టి, ప్రభుత్వ అధికారాన్ని ధిక్కరించి, ఫలానా ఖైదీలను విడిపించారన్నది వారిమీద అభియోగాల్లో ఒకటి. సుబ్బారెడ్డి చాలాకాలం బ్రిటిషు వారికి దొరక్కుండా ప్రజల సాయంతో తిరుగుబాటును కొనసాగించాడు. అదనపు బలగాలను ఎక్కడెకక్కడి నుంచో సమీకరించిన బ్రిటిషువారి బలాధిక్యం ముందు చివరికి నిలవలేకపోయాడు. ఎట్టకేలకు అతి కష్టంమీద 1585 జూన్‌లో ఇద్దరు సుబ్బారెడ్లనూ తెల్లవాళ్లు పట్టుకోగలిగారు.

రాజమండ్రి కమిషనరు కోర్టులో ఈకేసు విచారణ అప్పట్లో పెద్ద సంచలనమైంది. నానాసాహెబ్ పీష్వాను ఆదర్శంగా తీసుకుని ఉత్తరాదిన తిరుగుబాటు ప్రేరణగా తాను బ్రిటిషు వారిపై పోరాటానికి నడుంకట్టినట్టు కారుకొండ సుబ్బారెడ్డి సగర్వంగా చెప్పాడు. అతడికీ, ఇంకో నలుగురికీ ఉరిశిక్ష, 16గురికి జైలుశిక్ష పడ్డాయి. కారుకొండ సుబ్బారెడ్డి, కొర్ల సీతారామయ్యలను బుట్టాయగూడెంలో 1858 అక్టోబర్ 7న నదీ తీరాన బహిరంగంగా ఉరితీసి శవాలను ఉరికంబంకింద పాతి పెట్టారు. అదే రోజున కొర్ల వెంకట సుబ్బారెడ్డి, గొరుగుంట్ల కొమ్మిరెడ్లను పోలవరంలోనూ... కారుకొండ తమ్మిరెడ్డిని తూటిగుంటలోనూ బహిరంగంగా ఉరితీసి శవాలను అక్కడే పాతేశారు. సయ్యద్ లాల్ అనే వాడికి 14 ఏళ్ళు... సున్నం నందప్పకు 12 ఏళ్ళు... వంకా గంగులు, తోట ముత్యాలు, తెల్లం సింగప్ప, వౌదాల దోసిరెడ్డి, కెచ్చెల రాజిరెడ్లకు తలా 10 ఏళ్ళు, గుంజరపు పెంటయ్య, సూరపు పుల్లసా, కరటం గంగులు, చోడెం గంగులు, మడకం గంగులులకు తలా 7 ఏళ్ళు కఠిన కారాగారశిక్ష విధించారు.

ఉత్తరాన గంజాంనుంచి, దక్షిణాన నెల్లూరుదాకా, కోస్తా జిల్లాల్లోనూ, రాయలసీమ, తెలంగాణల్లోనూ విదేశీ దురాక్రమణదారులపట్ల తొలినుంచీ తీవ్ర వ్యతిరేకత ఉంది. రాజులు, జమీందార్లు, పాలెగాళ్లతోబాటు సవర, ఖోండ్ వంటి గిరిజన తెగలు తెల్లవారిపై రాజీలేని పోరు సలిపాయి. నేడు కొండ తెగలు, గిరిజనులుగా మనం వ్యవహరిస్తున్నవారు ఒకప్పుడు రాచకుటుంబీకులు. జమీందార్లు, వారిని దొరలుగా గౌరవించేవాళ్లు. విదేశీయుల దాష్టీకానికి తల వంచక తెలుగునాట నాలుగు చెరగులా రాజాలు, జమీందార్లు, పాలెగాళ్లు, గిరిజనులు ఎన్నో యుద్ధాలు చేశారు.

నేడు ఒరిస్సాలో ఉన్న గంజాం ఒకప్పుడు ఆంధ్రప్రాంతం. పర్లాకిమిడి జమీందారు రాధాకృష్ణ దండసేన 1857లో సవరలను కూడగట్టి బ్రిటిషు వారిపై గొప్ప పోరాటం సాగించాడు. కెప్టెన్ విల్సన్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు నానా అవస్థపడి చివరికి 1857 చివరిలో ఆయనను పట్టుకోగలిగాయి. దండసేననూ, అతడి మామనూ ఉరితీసి, వారిప్రధాన అనుచరులకు దీర్ఘకాలం కారాగారశిక్షలు విధించారు.

13. The Nomads, V. Raghavaiah

P.123. When the Govt. took the forests, he (tribal) considered it as definite assurpation and resisted through pillage plunder untill atlast as March, 1929 when the last of the rebels Mandla Baiga was shot dead at Thummala - bayalu.

14. Studies in the History-Third dynasty of Vizianagar.
Dr.N.Venkataramanaiah, University of Madras ; 1935.
కృష్ణా మూర్తీర్యసోయం యవన జనపదం వహ్నిసాత్కృత్య సర్వం.

When Krihsnaraya started on his Digvijaya, he is said to have invited that Boya Chiefs of eighteen Kampanas march ahead of the army at a distance of thirty miles and entering the muslim territory, plunder it , and carry away men, cattle, sheep, goats, and horses.

P.218. Boyi Sunkam is mentioned in an inscription of Kandlayudun dt. 1544 A.D. Tax paid by the members of the Boyis or the hunter community dwelling the forests which of course belonged to the state.

Men and Women of Boyis class were professional bearers of palanquines.

P.346. The Chandalas usually infested the high-ways and robbed the travellers of all their belongings. Another class of people who were given thieving and robbery were the Boyas, living on the outskirts of the forests.

P. 138. The forest tribes were treated by the government generously because they were expected to be useful for plundering purposes, during invasions if they were kept in good humour.

తన మగడు బోయ వీటంగల మగవారినెల్ల గూర్చికొని కొల్లగోళ్ళకు దూరంబు పోయినాడు మనుచరిత్ర 4:27, 4.37 ఆముక్తమాల్యద 2:29.

స్వాతివార పత్రిక, డిసెంబర్ 2005 – ఓంకార్ : కృష్ణ, తుంగభద్ర నదుల మధ్య ప్రాంతంలో హుబ్లీ, ధార్వాడ్‌లవరకూ ఇప్పుడుకూడా దేవాలయాలలో అర్చకత్వం చేస్తున్నది (దళితులుగా పిలవబడే) బోయలే తప్ప బ్రాహ్మలుకాదు. ఇక్ష్వాకుల కాలంలోనే అక్కడి భూములను గురజాలనుంచి నాగళ్ళు తెప్పించి సాగుచేశారు అనటానికి ఆధారాలున్నాయి. స్త్రీ దేవతారాధన, శ్రామికులను గౌరవించటం, కులవ్యవస్థకు ప్రాధాన్యం లేకపోవటం, బౌద్ధాన్ని ఆదరించటంవంటి కారణాలవలనే కృష్ణా పరీవాహక ప్రాంతం పాపపంకిలమైనదని వైదిక పండితులు ముద్రవేశారు.

15. AndhraPradesh District Gazetteers, A Manual of the Krishna District in the Presidency of Madras. 1883.

P.181. After some time, however, the peace of the country was much disturbed by a leader of banditti named Karavakollu Kesavulu, and the Collector's efforts to introduce settled cultivation were frustrated. At length the robber chief was apprehended by a Chentsu Poligar named Ramanaick, who held five villages in the forest-clad hills to the north-west of Vinukonda. The Collector issued orders to the Poligar to send in his prisoner with an escort to Guntur, but Ramanaick, far from obeying, released his captive and, secure in his jungle fastnesses, set the Company at defiance. The Collector, thereupon, requested Malrazu Gunda Rao of Vinukonda to coerce the refractory Poligar into submission and sent bands of sepoys and peons into

the Palnad who hunted Kesavulu from place to place. Before long Ramanaick was taken prisoner by the peons of Malrazu Gunda Rao who handed him over to the Collector. He was tried as a rebel and sentenced to death. Meanwhile Karavakollu Kesavulu, tired of being pursued about the Palnad, sent word to the Tanadar that he would surrender if his life were spared and an allowance paid to him for maintenance. The Tanadar sent on this offer to the Collector who refused to listen to it. Upon this the Tanadar sent a message to Karavakollu Kesavulu to come in and hear the Collector's answer. Kesavulu came in to Dachepalle and met the Tanadar. When the Tanadar read out to him the Collector's reply, Kesavulu rose to go, but the doorway was blocked by sepoys, who had hidden in the adjacent room, and Kesavalu, cut off from his followers in the street, found himself a prisoner. When this story was reported to the Government at Madras they said it was a breach of public faith, and ordered the immediate and unconditional release of Kesavalu. But no such blunder had been made in the capture of the jungle Poligar Ramanaick, and he was executed, his villages being given over to the Malrazu and Vasireddi Zemindars and lands in that neighbourhood were allotted to Kattubadi peons who should watch the ghats.

P. 236. Behind the hills to the north-west of Vinukonda lie the five villages of Kammalacheruvu, Malapadu, Birzupalle, Gannavaram and Girakepadu. These villages, in our old records, are often alluded to as the "Chentsu villages". They were under a Poligar named Ramanaick who trusted too much in the remoteness of his jungles and bid defiance to the Company. The Collector of Guntur requested Raja Venkata Gundu Rao of Vinukonda to put down the rabel, and he was accordingly arrested by the Zemindar's forces and was hanged in 1804 as a warning to other lawless inhabitants of these jungles. His village of Kammalacheruvu was given to Vasireddi Venkatadri Naidu, and the four other to the Vinukonda Zemindar.

P. 364. His (Venkatadrinaidu) charities were lavish and one popular legend states that this was to remove a curse which had fallen upon him. It is said that during his energetic days he had determined to get rid of a tribe of

Chentsus who pillaged his Zamindari and so, inviting 150 of the men of the tribe to a feast, he had them all beheaded. Remorse overwhelmed him for his treachery and whenever he sat down to his meals the grain turned into insects. Such is the popular legend.

16. Andhra Pradesh District Gazetteers, A manual of the Krishna District, In The Presidency of Madras. Originally Published in 1883. Published by The State Editor, District Gazetteers, Hyderabad, A.P. P.No.28.

Bellamkonda was at this time held by a Raja named Sitapati who also held Warangal and Kammamet and who seems to have been a vassal of Orissa.

This Sitapati Raja not only possessed these three strongholds, but had in his service a trained body of twelve thousand infantry noted as good marksmen. Confident in the security thus afforded him, he laid hands on some of the Qutb Shah districts which adjoined his territory. This roused the king who marched from Golconda and, leaving Warangal and Kammammet on his left hand, crossed the Kistna river and laid close siege to Bellamkonda. The fortress held out much longer than the king expected, so, losing patience, he ordered a general escalade on all sides simultaneously and thus took the place, but with heavy loss.

Bellam konda had hitherto been considered impregnable and Sitapati Raja, who had been well content to see the king waste his time below its walls, no sooner heard of its fall than he marched with his army to cut off the king's retreat. A desperate battle ensued. The Hindu ifantry with a well directed fire inflicted severe loss upon their enemies and firmly withstood several charges of the Muhammadan cavalry but at last gave way, leaving the baggage and treasure to Sultan Quli who returned with his booty to Golconda.

17. Census of India, vol l, part 1-B (IV) Chenchus.
Page 11, Descendants of a Dog.

The dog will not be able to sleep comfortably in the mud oven. Instead it digs up the earth from the oven and deforms the mud structure.

So they keep three - four stones to make a oven and the dog can accommodate itself in the oven without causing any deformity.

18. Report on The Socio-Economic Conditions of the Aboriginal Tribes of The Province of Madras. A. Aiyappan, M.A., Ph.D. Secretary, Aboriginal Tribes Welfare Enquiry Committee. Govt. Press, Madras 1948.

P.153. Degeneration of Chenchus: The degeneration of the Chenchus who claims even to-day the shrines of SreeSailam and Ahobilam, whose daughter was coveted by Vishnu himself and in whose habitat traces of civilized life including iron-smelting, etc., are abundantly found can be explained only as due to the degeneration of the forests into park lands. It is evident that these hills and forests have suffered from neglect.

In the wars that raged in these areas, the more martial hillmen appear to have joined the armies and moved down far and wide in the plains, Such are the Boyas-who formed the soldiery of the Vijayanagar Empire and Hyder Ali. A Boya was sometimes called 'Chenchu'. Boya may be derived from 'Bhogya', when the men took service of all types in plains. The tradition among Boyas of dedicating some of their women for prostitution is noteworthy. The tribe, compelled to find a place in the plains, was probably prepared to yield this far to the plainsmen at the same time preserving family life for the bulk of the community.

19. Culture and Public Action 2004.

P.35. Hirschman (1970, 109) discusses how this may also happen at the individual level in a process of "evolutionary individualism", in which "the successful individual who starts out at a low rung of the social ladder, necessarily leave his own group behind as he rises; he 'passes' into, or is 'accepted' by, the next higher group." He takes his immediate family along, but hardly anyone else. Bloch and Rao (1993m 2001) have models of these ideas.

20. మాండలిక పదకోశము. కూర్పరి, మరుపూరుకోదండరామిరెడ్డి ఆం.ప్ర.సాహిత్య అకాడమీ 1970. కన్నెలు – కనికలు – ముదురు పచ్చ వన్నె వీరికి వేయుదురు. వీరికి

పొంగళ్ళు పెట్టగనే వర్షం వచ్చి చెఱువు నిండునని నమ్మకం. కన్నెలు – కన్నె – కొండ ప్రాంతంలో కేవలం రాళ్ళుండే ఎత్తైనప్రదేశము. పినాకిని ఉత్తరంలో అరణ్యం ఉండేది. కిరాతులు కుటీరాలు నిర్మించుకొని ఉండేవారు. పూర్వభాగంలో బావి ఉండేది. ప్రత్యూషంలో దేవకన్యలు కృతస్నానులు వచ్చేవారు. తెల్లవారేసరికి మాయమయ్యే వారు. ఆప్రాంతంలో అరణ్యం ఛేదించి పల్లెనిర్మాణంజరిగింది. దేవకన్నెలు స్నానంచేసే బావిని కన్నెలబావి అంటారు. గ్రామంపేరు కన్నెలూరు. అగ్గారు – చెరువుకట్టమీద నిర్మించిన ఏడు మట్టిగుళ్ళములు. ఇవే సప్తకన్నెలు – కన్నెలు – కట్ట మీద కన్నెలగుడి.

మాండలికవృత్తిపదకోశం. ప్రథమ సంపుటం 'వ్యవసాయం' సంపాదకుడు భద్రిరాజు కృష్ణమూర్తి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ – 1974.

| | |
|---|---|
| కనికెలపూజ – 304 | అవిటి – 315 |
| కన్నెపొంగలి – 304 | అవిటిగాలి – 315 |
| కప్పతల్లి – 304 | అవిటివాన – 315 |
| కప్పలదేవర – 304 | అవిటి (వారాలు) – 303 |
| కప్పలకావడి – 304 | |

21. Myth & Meaning, Schocken books, 1978. Claud Levistrauss. P.11.

.... there were lots of rules of the marriage all over the world, which look absolutely meaningless and it was irritating because, if they were meaningless, then there should be different rules for each people, though nevertheless the number of rules could be more or less finite.

So, if the same absurdity was found to reappear over and over again, and another kind of absurdity also to reappear, then this was something not absolutely absurd, otherwise it would not appear.

22. The past leads us
Only when we force it to
Otherwise it shut us
In its asylum with no gates
We make history
Or it makes us - *Merge Piercy.*

23. తెలుగు సామెతలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1974. పుట.389. 'పలకమ్మ పున్నానికి పడమటి కొమ్మపూస్తుంది', 'పలకమ్మ పున్నానికి పడుగులు పడతాయి'. పుట 390.

'పల్లికమ్మ గడిస్తే, తల్లితో కలుస్తారు'.

మున్నీరు. నేదునూరి గంగాధరం, 1973. పుట. 281.

విశాఖపట్టణాన వీధిగుమ్మాన – వింతరాచకొడుకు బంతులాడేడు
బంతివెళ్ళి పాలకొండ సభలోనపడితే – యిది ఎవరి బంతని విచారించె రాజు
గొలుకొండవారి గొలుగుల్ల బంతి – పాలకొలండవారి పచ్చల్లబంతి
శ్రీకాకుళమువారి బంగారుబంతి –
ఓయి ఓయి రాజ, వడ్డాదిరాజ – పొడిచిగెలిచిన రాజ బొబ్బిలిరాజు
బొబ్బిలి పొడుగాయె – కిమిడి కిందాయె
మాడుగుల మనదాయె – మళ్ళుమీరాజ
'సాలూరు రాజులకు జారత్వమే చేటు – పాలకొండకు దొంగపనులు చేటు'

మిన్నేరు. నేదునూరి గంగాధరం 1968. పు. 370.

"పుట్టిన బిడ్డలు బ్రతకని స్త్రీలు 'చెంచు పేరంటాలు కోక' అనగా ఎర్రతొగరుగళ్లు అరంగుళం వెడల్పుగానూ, నిట్టనిలువు పట్టెలతో నేసింది కట్టుకుంటారు."

❁ The Chenchus of Hyderabad. C.F.Haimondrof. Page.277.

The basic features are common to most races of primitive hunters, food gatherers and a knowledge of the culture of other equally primitive tribes in southern Asia. Such as the Veddas, Andamanis. Semong and Philippines, Negritos can therefore help to determine which element in the material social and spiritual spheres may belong to the nucleus of ancient Chenchu culture. Undoubtedly, the chase and the gathering of wild fruits, tubers, and probably also honey taking were the original sources of food supply.

❁ P.278 . Economically the Chenchus belonged to the same world as paleolithic and mesolithic man.

❁ The Early History of Deccan. Ed., Yazdani VII-XI Vol. Appendix chapter-3.

❋ ఈ అధ్యాయంలోని చాలా చారిత్రకాంశాలు కళింగదేశ సంచికలోనివి.

❋ District Census Hand Book, Census of India. Visakha. dt. 1971. A 27.

❋ The Reddis of bison hills, Page 45.

❋ ఆంధ్రుల సాంఘిక చరిత్ర. మధ్యయుగం. అల్లాడి వైదేహి. 1978. పుట. 4.

❋ కాకతీయ శాసన సాహిత్యము. సంకలనకర్త. పుచ్చా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి. ఆంధ్రసారస్వత పరిషత్తు. 1981. పుట. 99.

❋ భాషాశాస్త్రం, లా, ఎంకి, కుంటముక్కల లక్ష్మీనారాయణశర్మ 1982. సింహళం, తెలుగు విభేద పరిశీలన. పుట 96.

❋ తెలుగుభాషా చరిత్ర. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.

❋ జానపద గేయాలు – సాంఘిక చరిత్ర, ఆచార్య బి. రామరాజు మరియు డా. నా. కృష్ణకుమారి, ఆం. ప్ర. సాహిత్య అకాడమీ.

❋ సీతాపతిరాజు, ఆదిరాజు వీరభద్రరావు. లక్ష్మణరాయ పరిశోధన గ్రంథమండలి.

❋ ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు: డా॥పి. నరసింహారెడ్డి, 1991.

❋ ఆంధ్రజిల్లాల గ్రామనామములు, డా॥విజయదత్, 1986.

❋ శ్రీకాకుళ ఉద్యమసాహిత్యం. డా॥కె. ముత్యం. దృష్టి ప్రచురణ, 1993.

24. అహోబలనరసింహుడు. పరిష్కార వ్యాఖ్యాత కామిశెట్టి శ్రీనివాసులు, మాలోల గ్రంథమాల 1999.

‘యెదురు గద్దెలనెక్కి – యెక్కుడు తమకమున
కదిసి కూచుంటి వింతి – గద్దెమీదకు
ఎదలో నెవ్వరికైనా – నిట్టుండుమోహము’

వజ్రగడం (గొలుగొండ): ఇప్పటికీ ఇక్కడ రంగురాళ్ళకోసం తవ్వకాలు ముమ్మరంగా సాగుతుంటాయి. తవ్వేటప్పుడు మట్టిపెళ్ళలు మీదపడి గిరిజనులు బలి అవుతుంటారు. 1993లో పప్పుసెట్టిపాలెంలో ఎందరో గిరిజనులు ఇలా జీవసమాధి అయిపోయినారు.

## పక్షుల దర్బారు




...... సుగుణశ్రీ

# తెలుగు గిరిజనుల మాండలికం

" దుర్గమాలైన మహానదులు, పర్వతపంక్తులు, అరణ్యాలు రెండు భాషాప్రాంతాలను వేరుచేస్తూ ఆయా వ్యవహర్తల రాకపోకలకు ఆటంకాలుగా ఉన్నంతవరకు అవికూడా భాషామండలాలకు సరిహద్దులవుతాయి. ఇటీవల రాకపోకల సౌకర్యాలవల్ల పరిస్థితి కొంతమారినా పూర్వచరిత్రలో ఏర్పడ్డ మాండలికభేదాలు అంత తొందరగా మాసిపోవు "

– మాండలిక వృత్తిపదకోశం(1974) భద్రిరాజు కృష్ణమూర్తి

తూర్పుగిరిజనప్రాంతాల తెలుగు మాండలికపు తీరుతెన్నులను నాలుగుభాగాలుగా పరిశీలించవచ్చు.

**వర్ణసంబంధి :** ప్రమాణభాషకుగలవ్యాప్తి గిరిజనుల వ్యవహారంలో అధికంగా కనిపించదు. మాండలిక ప్రభావం తెగలవారీగామారుతుంటుంది. ఉదాహరణకు కొన్ని మాత్రమే ఇక్కడ స్వీకరించడం జరిగింది. వీటిని ధ్వని మార్పులు, ఉనికి ఉచ్చారణ మార్పులుగా విడదీసి చూడవచ్చును.

**1) ధ్వని మార్పులు :**

| అ | | అయి (ఐ) |
|---|---|---|
| **ప్రమాణభాష** | **–** | **గిరిజనభాష** |
| వస్తాను | – | వైతాను |
| బస్తా | – | బైత |
| బస్తరు | – | బైతరు |

సంయుక్తాలు అసంయుక్తాలుగా మారడం.

కుండాడనుండి ఉప్పునపల్లి గట్టువరకు (గోదావరి) ఈ రూపాలు వినిపిస్తాయి. తాడేపల్లి ప్రాంతంలో వినిపించేవి సమీకరణ చెందిన ద్విత్వరూపాలు. వత్తను, బత్తా, బత్తరు.

**2) ఉనికి ఉచ్చారణ మార్పులు :** గిరిజనుల వ్యవహారంలో ప్రమాణభాషకుభిన్నంగా కొన్ని ప్రత్యేకలక్షణాలు కనిపిస్తున్నాయి.

*ఉదాహరణకు కొన్ని :* సాధారణంగా తెలుగుభాషలో ప్రథమాక్షరంమీద ఉనికఉంచడం సహజం. దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంవల్ల కొన్ని అధికలయగల రూపాలు వినిపిస్తున్నాయి.

ఏల – సూత్తువేమో

ఉనికను రెండవ అక్షరంపై మార్చే ప్రయత్నం ప్రచురం.

దిగువవారు గెద్దాడ అంటే కొండరెడ్ల గెడ్డవాడ అంటాడు.

అలాగే కుండాడ – కొండవాడ

ఇలా కాలక్రమంలో కలిసిపోకుండా ఉండడమేకాక – వాటికి ఒక ప్రత్యేకమైన ఊనిక ఉండడం గిరిజన భాషలో ప్రచురం.

సాగరాంధ్రంలోవలె పదాలచివర దీర్ఘాలుతీయడం గిరిజనులలో వినిపించదు. ఈ పలుకుతీరులోనేకాక పదజాలంలోకూడా తెలంగాణం మాండలికరూపాలని పోలిఉండడం గమనించదగిన విశేషం.

తెలుగుభాషకు ప్రాచీనలక్షణమైన అర్ధానుస్వారరూపాలను, పూర్ణానుస్వారంతో పలకడం ఇప్పటికీ తమిళనాడు, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలోనే కాదు గిరిజన వ్యవహారంలోనూ ఉంది.

కోంతి (కోతి), ఆంపు (ఆపు), తాణ్డేపల్లి (తాడేపల్లి), నూరుపూణ్డి (నూరుపూడి) ఇవేగాక తెలుంగు, వెలుంగు, పెండ(పేడ)వంటివిమాత్రమే కొండరెడ్లలో వినిపిస్తాయి.

**పదసంబంధిదశ :** ప్రమాణవ్యవహారభిన్నంగా కొన్నిప్రయోగాలు కనిపిస్తున్నాయి. వ్యతిరేకక్త్వార్థక రూపాలకు బదులు యకార రూపాలు కనిపిస్తున్నాయి.

| **ధాతువు** | **వ్యతిరేకక్త్వార్థకం** | **గిరిజనులు** |
|---|---|---|
| ఊడ్చు | ఊడ్వక | ఉడియక |
| జడుపు | జడవక | జడియక |
| విడుచు | విడువక | విడియక |

అనునాసికాంత ధాతువులలో (అను, విను, కను, కొను) కాలప్రత్యయం చేర్చే టప్పుడు మూర్ధన్యీకరణం జరుగకుండానే రూపాన్ని సాధించడం.

| **ధాతువు** | **ప్రమాణభాష** | **గిరిజన భాష** |
|---|---|---|
| అను | అంటాము | అంతాము/అంతిమి |
| తిను | తింటాము | తింతాము/తింతిమి |
| కొను | కొంటాము | కొంతాము/కొంతిమి |

**3)** మూర్ధన్యాక్షరరూపాలు తెలుగుభాషకుగల ప్రాచీనలక్షణాల్లో ఒకటి. గిరిజనుల వ్యవహారంలో ఈ లక్షణాన్ని నిలుపుకోవడం కద్దు.

| **ప్రమాణభాష** | **గిరిజనులు** |
|---|---|
| తంగేడు | టంగుడు |

| | |
|---|---|
| దోకి | డోకి |
| దిప్ప | డిప్ప |
| దాగు | డాగు |

**4)** తద్భవాలుగా శబ్దరూపాలు మారేటప్పుడు కొన్ని ఆసక్తికరమైన మార్పులు వినిపిస్తాయి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| జూదం | జూజం | : | ద | జ | | |
| ఓగిరం | ఓరెం | : | గ | ం | | |
| ఉహ | ఉగ | : | గ | హ | | |
| కన్యకలు | గన్నికలు | : | క | గ; | న్య | న్న |
| జలధి | జల్దీ | : | వర్ణచ్యుతి | | | |
| ఉద్యోగి | ఉద్దెగాడు | : | ద్య | ద్దె | | |
| కొయ్యలు | కయ్యిలు | : | ఇవి అచ్చ తెలుగు పదాలు | | | |
| లంకెలు | లెంకలు | : | కాని వాని ఉచ్చారణ మారింది | | | |

**5)** **పదాదానం :** పరిసరభాషలైన ఒరియా, కోదు, కోయభాషల పదాలుచాలా ఈ మాండలికంలో జొరబడ్డాయి.

| | | |
|---|---|---|
| కరవడి | : | చివరి (విశాఖ) |
| జుగుడి | : | చిరుతిండి (విశాఖ) |
| జువతబాబు | : | చిన్న నాయన |
| మోరి | : | అడ్డాకులతోకుట్టిన కోటు (విశాఖ) |
| మోర్ధ | : | పందికొక్కు (గోదావరి) |
| ఘూటు | : | 15 – 16 ఏండ్ల కుర్రవాడు (గోదావరి) |
| సొంద | : | పెదవులు |
| జియ | : | యీడువాడు |

**6)** **బాంధవ్య పదాలు :**

వదినకు పాప. తమ్మ అనగా బావమరది.

మనుమలు చేయడం = పెండ్లికూతురును చేయడం.

**7) సమాసనిర్మాణం :** కొండసంతమండువ, నూనెకొప్పుల పొన్నచిలుక, దిప్పె మక్కలకొరువ, దొప్పసేసలు, కోనేటిపళ్ళేలు, తూరురాయికట్టువ, వేలుబుంగలవేపి, పులిబరుకుడుమానువంపు, కత్తురాళ్ళఘాటి, పందుమక్కలబొట్టె, కంటిదోకి (కన్నెదోకి) లోతుగడ్డ, కన్నెఘాటు, పోతబూరం, ఆడకట్టు (ఆడమళయాళం), అడవికట్టు, మాయరతం (విమానం), టెంకగిడుగు, తోకగిడుగు; ఉండవిలుబద్ద (ఉండేలు) నారవిలుబద్ద.

ఇరుబలపన్నె = దువ్వెన; గుమ్మాలవాడు = మలేరియావర్కర్;

గుమ్మంవద్ద కాగితంమీద తనువచ్చినట్లు సంతకంపెడతాడు. వాడే ఆకురాతల వాడు, మచ్చలు (టీకాలు) వేయువాడు. అతనిని తనిఖీచేయడానికివచ్చే సూపర్వైజర్ చేసేపని కనిపించలేదుకాబట్టి వాడికి సొంతపలుకుబడిలో పేరులేదు. సూపులేరు అంటారు. కణుసుమొరకలఎండ= మొరక(చెవి) జన్నెలు(వరుగులు) కణుసు చెవులవలె ఎండిపోతాయి.

ఎఱ్ఱగాయరొండి=మామిడికాయలను ఎఱ్ఱపరిచే (పండటానికి ముందు) రోహిణి. (రొండి రోహిణిగా సంస్కృతంలోకి చేరినదా లేక రోహిణి–రొండిగా మారినదా!)

**8) శబ్దపల్లవాలు :**

కొండపెట్టడం = కొండకు అగ్గిపెట్టడం

పొట్లంపెట్టడం = పొట్లంపెట్టి వండడం. పొట్లంవేయడం

కబురుకట్టడం = టపా తీసుకుపోవడం,

పులిదెంగింది = కర్మ కాలింది.

తులుసూరు పలిగినపుడు = తులుసూరు చిగురించినపుడు,
కొన్ని చిగుళ్ళు పగిలినట్లే విచ్చుకుంటాయి.

సామిపిట్టలు వెలిసినపుడు = అవి దేవుని పిట్టలు కాబట్టి
అవి కనిపించడం – వెలువడం.

అడవికి పారడం = రజస్వలకావడం, ఇప్పుడు రజస్వలఅయిన కన్యను అడవికి పంపకపోయినా ఈశబ్దపల్లవం వ్యవహారంలో ఉంది.

చెయ్యిలు వార్చుకోవడం = భోజనానికిరమ్మని పిలువడం.

**9)** జీవన విధానం, సంస్కారంతోపాటు నుడికారం, ఆచారంకూడా మారుతుంది. గోదావరిలో కొత్తలు కలపడం. విశాఖలో వెన్నులు ముంపడం.

**10)** తద్ధిత ప్రత్యయాలు క్రియలలో లోపించడం. దొంగతనంచేయడం అని మనము, దొంగసేయడం అని గిరిజనులు; ఇల్లుసేయడం, తప్పుచేయడం, గొరవ సేయడం. గొరవతనం అనే స్వతంత్ర ప్రయోగంకూడా ఉన్నది.

వడిసెల, సెలయేరు, సెలకలపడం, సెలమళ్ళడం.
సెల = రాయి (ఈసెల సంస్కృతాన శిలగామారినదా!)

దాయం మూటకూడు : సోపువేట వెళ్లినవారు మునసబుకు ఇచ్చే మాంసంవాటా (దాయాదులనగా పాలివారు). గ్రామపెద్ద అయిన మునసబు, గ్రామంలో తక్కినవారు ఒకనాడు పాలివారని ఊహించడానికి ఈ దాయం పదం అవకాశం ఇస్తున్నది.

**11) తరచుగా వినిపించే పదాలు :**

చెల్ల =మొత్తం; పల్లక = మాటాడక;
పల్లకాయిడి = నోరుమూసుకున్నాడు
(వేటలో 'శిపశీలన' అనగానిశ్శబ్దం అనిహెచ్చరిక)
మోయుమి = తీసికొనిపో, ఏరుకొని = తీసికొని
జల్లివేయడం = పారజల్లడం; కొండతేలడం = దాటిరావడం
డెక్కడం = తీయడం 'తిన్నమ్మ తినిపోతే తలుపుడెక్కినవాడికి తంటా'
దసులు = తారసపడడం; తగులు = వెంటపడు, తరుము
దాచిడుకున్నడు = దాచిపెట్టుకున్నాడు
ఈడబెట్టిరమ్మీ = దించిరా, తీసి తెచ్చుకున్నాడు
నెత్తి దూసుకోవడం, పదునుపూసుకోడం.
క్రియలకు చేసిడి, వచ్చిది ఈ విధంగానే ప్రయోగం.

**12) యడాగమం :** నయ్యది, మయ్యది

**13) జననిరుక్తి :** తబిసికొండ = తబిసిచెట్లున్న కొండ.
కాని అక్కడ శ్రీరామరాజు తపస్సుచేయడంవలన తపసుకొండ అయింది. వాలి

కొండ ప్రక్కగ్రామంపేరు ఇప్పటికీ వాలగూడెమే. కాని వాలకొండ సంస్కృతీకరణంలో వాలికొండ అయి – ఇది వాలిసుగ్రీవులరాజ్యం – ముక్కుల, మూతులతో తేడా ఉండే ఇది వానరజాతి, ఇలా కథలు పెరిగాయి. ఇది దండకారణ్యంలో కిష్కింధరాజ్యం అనే అనాది భావనలకు ఊడలుదించాయి.

**3.** వాక్యసంబంధమైన విశేషాలు=కారకపరమైనవి. ప్రత్యేకంగా పేర్కొనదగినది. 'నిన్ను పిలుస్తున్నారు' అనే ప్రమాణభాషాప్రయోగానికి బదులుగా 'నీకి పిలువడమట' వంటి ప్రయోగాలు – భావార్థంలో వర్ణకం. ద్వితీయకు షష్టిరావడం నన్నయనాటి ప్రయోగాలు.

**4.** అర్థ విపరిణామం = చేవడిబస అనగా నేడు కల్లుబస అనిఅర్థం.

వెనుకగ్రామ నౌకరులైన వాల్మీకులు కల్లుఅమ్మేవారు. ఆనౌకరు కచేరీ చావడి బసన ఉండేవాడు కాబట్టి వాడు చేవడు. చివరకు చేవడిబస కల్లుబసగా దిగిపోయింది (అర్థసంకోచం).

వేట అనగా మనలో సాధారణంగా జంతువులవేట అని మాత్రమే స్ఫూర్తినిస్తుంది. కాని దుంపలవేట, మొయ్యలవేట (చేపల, ఎరకల, ఎంద్రికలవేట). ఇలా ఆహార సేకరణపరంగా విస్తృతమైన అర్థంలో వేట అనే పదానికిప్రయోగం. ఎవరు ముందుగా పట్టుకుంటే, ఎవరుతవ్వితే, అమ్ముమేస్తే వారిదేఅది అనే వేటనియమాలే వీటన్నిట వర్తిస్తాయి. (అర్థవ్యాకోచం).

**సాధు ప్రయోగం :**

జరిగిపోయిడి = కాలంచేశాడు

ఉపవాసం తీర్చారు = ఉపవాసం తరువాత భోజనం చేశారు

కడుపు కదిలింది = బయలుకు వెళ్ళాలి.

సంస్కృతి పరిణామాన్ని, వాఙ్మయంలో ఇముద్చుకున్న గిరిజనుల ప్రయోగాలను సేకరించి, వాటి జీవశక్తిని ఆకళించుకొన్నప్పుడే మనతెలుగుతనం వృద్ధిచెందుతుంది.

# కొన్ని మాండలిక పదాలకు అర్ధవివరణ

తెలియని నుడుగులు - తెలియచెప్పవాలె
మరచిన నుడుగులు - మతినిగొలుపవాలె

-మోదమ్మపదం

| | | |
|---|---|---|
| అండంగులు | = | ఈతమొవ్వులు |
| అక్కర | = | అక్కర, పూటపని; బుగ్గిమంతరించడం, పట్టువాల్చడం, భూతవైద్యంలో దశలు |
| అగదులు | = | పొగలు |
| అడప | = | జంతువులను ఉప్పుపోసి, ఉచ్చుపోసి, ఎరకట్టి మప్పేచోటు, అడుగు కృదంత రూపం |
| అయిలోడు | = | అరణం |
| అగ్రకూడు | = | అసలుకూడు, మృష్టాన్నం |
| అగ్రకుంచం | = | నికరమైన కుంచం, పెద్దకుంచం. |
| ఇల్లుచేయడం | = | ఇంటివాడిని చేడయం |
| ఇడుట, ఈడుట | = | పెట్టుట, దించుట |
| ఈకలతుంటి | = | అమ్ముచివర ఈకలు కట్టినచోటు |
| ఉగం కొట్టడం | = | మట్టి వర్షధారలకులోనై జోరెలవెంట పెళ్ళలు పెళ్ళలుగా కొట్టుకుపోవడం |
| ఉత్తరగన్నిక | = | పలాశ దండం; రావిమొద్దువంటిది కావచ్చు |
| ఉండవిలుబద్ద | = | ఉండేలుబద్ద |
| ఎండ్రికనీళ్ళు | = | ఊటపొలాలలో భూమిలోపలినుండి ఎండ్రకాయలు నేల తొలచుకొని పైకివస్తాయి. ఆ నీళ్ళ పొలాలు. |
| ఎడగీత | = | మధ్యాహ్నం కల్లుగీత |
| ఓటెం | = | జంకు; ఓటమి రూపాంతరం |
| ఓదం | = | జంతువు పడిపోవడానికై తవ్వినగొయ్యి |
| ఓరెం | = | ఆహారం, ఓగిరం, ఓరెం. నైవేద్యం అనే అర్థంలో మాత్రమే వాడుక |
| ఓలికపూదు | = | పూదును ఓలికమానుతో చేస్తారు (పూదు – కాడిమాను) |
| ఔజం | = | మద్దెలవంటి వాయిద్యం |
| జౌరజ్ఞానం | = | భంగువలె నిషాకలిగించే కల్లు |

| | |
|---|---|
| కన్నె | = ఆగస్టు, సెప్టెంబరు నెలల మధ్యకాలం; కన్నెపిచ్చుకదిగే నెల |
| కణుజుదుమ్ముకల్లు | = కణుజుమాంసంతో వండిన కల్లు |
| కట్టువ | = కొండల వరుసకు అడ్డముగా తిరిగియున్న కొండబోటు |
| కంటిదోకి | = కన్నెదోకి, చిన్నదోకి; కల్లుతాగేందుకు ఉపయోగిస్తారు |
| కయ్యుదిగడం | = కొత్తచేలో కొయ్యలు, చెట్లు నరకడం |
| కరవడి | = చివరి (విశాఖమన్యం) |
| కరమాటి | = కారుమామిడి |
| కాగుండ | = కాగుకుండ, నీళ్ళు కాచుకునే కుండ |
| కుద్దె | = జంతువులను పట్టడానికి వలపన్నే ఏర్పాటు |
| కురవ | = కట్టువనుండి సెలకుదిగే మార్గం (నల్లమల) |
| కుంద్రం | = విశాఖగిరిజనులు రాచవేటలో (సోపువేట) మునసబుకివ్వ వలసిన వాటా తూర్పుగోదావరిలో దాయం అంటారు |
| కొక్కిపాక | = తీరుతెన్నులేకుండ వేసుకున్న పాక |
| కొత్తలుకలపడం | = కొత్తన్నం తినేరోజు కొత్తపాతపంటలు కలపడం |
| కొత్తెలి | = నౌకరు |
| కొమ్ము | = కొండశిఖరం, శృంగం |
| కొంగుపతికడబ్బు | = శవంకొంగున ప్రతిఒక్కరుకట్టే డబ్బు |
| కొండపెట్టడం | = కొండకు అగ్గులుపెట్టడం |
| కొండసంతమండువ | = కొండలలోని మారుమూల గ్రామాల సంతలు |
| కొట్టు | = కల్లు ఉట్టితే చెట్టు, లేకపోతే కొట్టు, మొట్టు |
| కోళ్ళదొంగ్రి | = కోళ్ళగూడు |
| కోలగాడు | = బంట్రోతు, బారికవాడు |
| కొరువ | = కుద్రది |
| గండి | = కొండదారి |
| గంత | = వెనుక; ఎద్దువీపుమీద పట్టా |
| గత్తం | = ఎరువు |

| | | |
|---|---|---|
| గఱ్ఱులు | = | ఈకలు |
| గాగ | = | సీతాకోకచిలుక |
| గాందు | = | మంచు |
| గాంధారివేళ | = | అర్ధరాత్రి ఒంటిగంట – రెండు గంటలు |
| గిద్దు | = | కొమ్మలలోపల వేటాడే పక్షిజాతి |
| గిడుపు | = | దాటించు |
| గిడ్డ | = | విత్తు |
| గుంజు | = | గుడ్లగూబ |
| గట్టు | = | ఖమ్మంజిల్లా కొండరెడ్లు గొమ్ముృవారు (గోదావరి ఒడ్డు గ్రామాలు), గట్టువారు (కొండలలోవారు. ఉప్పనపల్లి కూటూరుగట్లు) వ్యవహారం |
| గుగ్గి | = | నీళ్ళలో నాచుతినే పిట్ట |
| గుర | = | అడవిదున్న |
| గూనబొబ్బిలి | = | గూనలో ఉన్న బొబ్బిలి; పులిసిన కట్టకల్లు |
| గుడ్లతమ్మ | = | పిల్లలున్న వరుసైన ఆడది |
| గుబ్బట్లు | = | యువతులు |
| గుంపెనలాట | = | గుమ్మళ్ళలో ఒకరకం (ఎగురుతూ) |
| గుమ్మళ్ళుగుప్పడం | = | నడుముచుట్టూ చేతులువేసి ఒకరొనొకరు పట్టుకొని వలయ మాడడం |
| గుండేరి | = | గుమ్మలాటలో ఒకవరుసకు విశాఖలో పేరు బారుగుండేరి, ఒయిసాగుండేరి, చుట్టుగుండేరి మొదలైనవి |
| గుంపులు | = | వెదురు కణుపు. ఉప్పనపల్లి కుటూరు గట్టులలో గ్రామాలు |
| గుమి | = | గుంపు |
| గొట్టు | = | గోష్ఠికి వికృతి – గొట్టిబస |
| గొంది | = | సీరుపుడితే లోయ, లేకపోతే గొంది |
| గొరవలకొట్టె | = | పూజారికిచ్చే తుంటిమీది మంచిమాంసం |

| | | |
|---|---|---|
| గోనెపొట్లం | = | గోనెవలె పొట్లంపెట్టి పొగపడం |
| గోర్జ | = | డొంకదారి |
| గోవు | = | పడుచువాడు |
| ఘాటీ | = | కొండదారిలో ఎక్కుడు |
| ఘాటు | = | 15–16 యేండ్లవాడు |
| చిక్కువిల్లు | = | బెట్టు బాగాఉన్న చిన్నవిల్లు |
| చిడుగలు | = | కంపలు |
| చివటలు | = | తోపులు |
| చిల్లంగి | = | ఒకరికి హానికోరుతూనేచేసే మంత్రతంత్రాలు |
| జీడెలు | = | బొద్దింకలు |
| చెక్కలకట్ట | = | కల్లులోవేసే చెక్కలకట్ట |
| చెయ్యులువార్చుడం | = | చేతులు కడుక్కొని భోజనానికి కూర్చోడం |
| చేవడి బస | = | కల్లుతాగే బస. చావడి ఈఅర్థంలో పరిమితమైపోయింది. |
| చేవడు | = | కల్లు అమ్ముకునేవాడు, చావడిన ఉండేవాడు బంట్రోతు, వాల్మీకులే ఇదివరలో ఈ వరసకల్లు అమ్మేవారు. చేవడు అంటే కల్లు అమ్ముకునేవాడు. చేవడిబస – కల్లుబసగా అర్థం దిగిపోయింది. |
| చెడుపు | = | హానికోరుతూచేసే మంత్రతంత్రాలు ('పైకి మన్ననలు – లోపల చెడుపులు') |
| చాపచుట్టు | = | ఆడుతూ చాపచుట్టినట్లు ముడుచుకుపోవడం, గుళ్ళచుట్టు – లోపలికి చుట్టుకుపోవడం. |
| చోటాకులు | = | కులభ్రంశం పొందినవాడు ప్రాయశ్చిత్తంనాడు ఇచ్చేవిందు |
| చోడి | = | రాగులు |
| జవుక | = | కొండలో తగ్గిన భాగం. ఇటే జంతువు పారిపోతుంది. దారులు ఇటే ఉంటాయి; కొన్ని జవుకల్లో నీరు నిలబడుతుంది. బెట్టు తగ్గిన విల్లును జవుకవిల్లు అంటారు. |

జన్నెలు = వరుగులు
జాకరమ్మ = విశాఖ మన్యంలో భూదేవత. (శాంకరమ్మ = జాకరమ్మ)
జాడిదేశం = ఝాడుఖండం – సీలేరు (మత్స్యగడ్డ) ఆవలి ప్రాంతం
జియ్య = ఈడువాడు, వరుసైన పడుచువాడు
జిబ్బి = అన్నంవార్చుకునే పట్టా
జొండి = మొండి;
('జొండివాడు పెళ్ళానికి వదలడు, కల్లుచెట్టుకు వదలడు')
జోట = జోడు
జోరెలు = కొండకాలువలు
జోవర్లు = చిక్కుపొదలు
టెంకంబలి = మామిడిటెంకల అంబలి
టెంగి గొడ్డలి = దర్జాకుపట్టుకునే మెరిసేగొడ్డలి
డేగవిసురు పదును= వేటలో డేగ చూపించే పదును
డొంకె = (beaver) నీటిలో తుప్పకట్టుకునే ఎలుకజాతి
డెక్కు = తీయు
డిప్ప = సొర – ఆనపడిప్ప
డోకి = వడ్డించే డిప్ప
తమ్మ = బావమరిది
తలనేస్తం = ఒకే ఊరివారైన స్నేహితులు
తానం = కొండరాజులు కొలువుతీర్చే బస. తానంకొండ పరిసరంలో భాగం.
తాప = చెట్టు ఎక్కడానికివాడే పలవలుగల వెదురుగడ
తారాజి = ఇటింపండుగలో ఆడించే మగ, ఆడ బొమ్మలు
తారువేయడం = చేనుచుట్టూ కంచె వేయడం
తీడడం = నూరడం
తీపలు = గుంపులు

తిలికె, తిల్లికె = దీపం

తుడుము = చిన్న నగారావంటి వాద్యం, నరికె ఇంకా పెద్దది

తూతుగొమ్ము = గోవులుకాసే గౌడు ఊదేబూర,
సాధారణంగా ఇది గురగేదె కొమ్ము

తువ్వడం = పొలంలో కర్ర కంప రాళ్ళు ఏరి దంతెతో సాపుచేయడం

తొట్టెడు = అలుగు మధ్యభాగంతొట్టి.
అంతవరకు దూసుకుపోయేటట్టు – తొట్టెడు పలం

తొగరు = నలుగు, తొగరుస్నానం

తొరుపులు = అంబలిలో నమలడానికి వేసిన మొక్కజొన్న, కందిగింజలు

తోప = రాగిపిండిలో కొద్దిగా బెల్లంవేసి హల్వావలె చేసుకునే వంటకం;
కోదులకు ఇష్టం

తోము = పెద్ద చెట్ల క్రింద తీగలతో అల్లుకుపోయిన పొద

దద్దుగు = చిరిమాను

దసులు = తారసపడు

దానుగుడు = దానవుడు

దాయం = సోపువేటలో తెచ్చినమాంసంలో మునసబుకు ఇచ్చేవాటా.
మునసబు ఒకనాడు దాయంవాడు; దాయాది

దువనిబన్నె = దువ్వెన

దూలికూడు = పెండ్లిలో కన్నవారు వధువువెంట పంపుతారు.
ఈ దూలికూడును మగపెండ్లివారిలో ఆడవారు తింటారు.

దుల్లు = రాలు

దేశవిడి = దేశమంతా పండుగవిడిపోయేనెల సంక్రాంతి.
'పండుగతింటాం' అంటే కొత్తన్నం తింటాం అనిఅర్థం.
పండుగ చేయనంతవరకు ఆ పంటను తినరాదు.

దొప్పసేసలు = దొప్పలో ఓరెం

దొంగచేయడం = దొంగతనం చేయడం

నరికె = నగారావంటి వాయిద్యం

నలయేరడం = తుక్కు ఏరడం

నారవిలుబద్ద = అల్లెతాడుగల విల్లు

నివాళి = పాద్యం

నీళ్ళుకొలపడం,
చెవిలో నీళ్ళుకొల్పడం = చెడగొట్టేమాటలు చెప్పడం

నుడుగులు = చరణాలు

నెలలు మరిచి = కడుపుతో ఉంది

నేదుకొయ్య = నేదుపంది ముల్లు

పచ్చిబద్దలు = వడపప్పు

పంచలోవ = పనసలోయ

పదును పూయడం = పదును పెట్టడం

పమిడిపిక్క (బంగారు)
తుపాకీ తూటా = పిక్క

పాదుకోడి = పెంపుడు కోడి

పావులు = అడుగులు

పావంచులు = మెట్లు

పిందె పట్టిన చేను = పాతబడిన చేను

పింజరి కట్టు = అమ్ముకు ఈకలతో కట్టిన కట్టు

పిట్టవేళ్ళపాయం = పదేళ్ళ వయస్సు

పిట్టసోరి = తియ్యని కల్లు

పిండి పెండెపుకల్లు = సామబియ్యం మొదలగు వాటితో కాచినకల్లు

పీనె = అరుగు

పురుముళ్ళు = బాలసారె (బారసాల)

పుల్లపోదవడం = ఎక్కులు చెప్పడం

పులివేళ = పులి షికారుకు బయలుదేరే సాయంత్రం నాలుగుగంటలవేల

పువ్వులు–

ముడుచుకోవడం = నేస్తం కట్టుకోవడం

పెండె = ప్రక్క

పెద్దవిడి = మే – జూన్ నెలలు. పెద్దవిడికి మామిడిపేరు లేకుండపోతుంది

పెతర = పితృదేవతగా భావింపబడే మిడత

పెంటలు = చెంచుల గ్రామాలు

పొట్టసరువు = సుంకు

బగిడె = గబ్బిలం

బంటం = మూటకూడు

బండలపులి = కొండముచ్చుల మాంసాన్ని తినే చిరుత పులి

బతకలేదు = పెళ్ళాం దక్కలేదు, మగనాలుపోయింది

బద్దెలు = పెద్ద బరువు మీదపెట్టి కట్టిన అడప

బడ్డిపండుగ = కంకులకు బడ్డికట్టే పండుగ

బారిక = గ్రామ బంట్రోతు

బారతీపు = ఆకర్ణాంతం విల్లులాగడం

బావమరదుల గడ్డ = తేనె పెరలో చెంచులు బావమరదికి ఇచ్చే వాటా

బుంగదిగడం = వరిబీజం – బుడ్డదిగడం

బూతం = కోరిక బూతానికి దొరుకకున్నదయ్య

బొక్కతీపు = బాణం గుండెవరకు లాగడం

బొయ్యి = పెళ్ళి పందిరిలో పెద్దరాట

బౌరె = నక్క

మదురుపొట్లం = మెత్తని మాంసం ఉడికించడానికి ఆకుతో కట్టే సాపుపొట్లం

మర్రెం = కొండశిఖరపు కట్టువ, పాపికొండ మర్రెం (బంగ్లావలె) ఈ వాడుక పాపికొండకు మాత్రమే.

మసడాలు = మసి తిండి

మండిసం = వేయించుకునే మూకుడు

ముతాదారు = కొన్ని గ్రామాలకు ఏలికగా ప్రభుత్వం గుర్తింపు పొందినవాడు. 1969లో వీటిని రద్దుచేసి రైతువారి విధానం ప్రవేశపెట్టారు.
మునుములు కట్టడం = పొలం మళ్ళు చేయడం
ముయ్య = మూగ
ముల్లికవాళ్ళు = తనవంశంలోవారినే చేసుకున్నవారు
మెర్రని = దొరకని
మెరియ = పిల్ల
రేవుదొక్కడం = రజస్వల అయిన పిల్లకు కాలువ ఒడ్డున జరిపేపండుగ
లంకెలు = లెంకలు
లొద్ది = కొండ చెంపలు
లోవ = లోయ; నీరు పుట్టేదానిని మాత్రమే లోవ అంటారు, లేకపోతే గొంది
వగ్గు = కల్లు దిగడానికి కట్టే గొట్టాలు మొదలగునవి
వన ఎరిగినవాడు = శాస్త్రం తెలిసినవాడు
వనాంతరం = మూలికలు
వర్రె = ఉట్టి తట్టలు, ఏమి సారం లేనిది
వాయవ = తగ్గినకొండ తిరిగి ఎత్తును పుంజుకోవడం
విసకర్ర = బరువులుతూచే కర్ర. దాని గీతలమీద తాడుమారుస్తూ బరువునిర్ణయిస్తారు.
వెటగొటరం = నానారకాల కల్లు
వెడ్డి = పెళ్ళికాని
వెన్నులుముంపడం = కొత్తపంట దేవతలకు పెట్టడం (విశాఖ)
వేనం = కొండవెంటిమీద చిట్టీతతుప్పలతో నిండిన సాపునేల
వేలంబస = వేటకు బయలుదేరేముందు అందరు కూడే బస
వెన్నెలేని = వెన్నెలున్న (పాట నడకననుసరించి ఉచ్చారణతీరు మారింది)
శతమానం = తాళిబొట్టు

సంగువ = రెండు కాలువలు కలిసిన సంగమం

సంపద కడవలు

తొక్కడం = పెండ్లి అయిన మరునాడు వధూవరులు నీళ్ళబిందెలో వేసిన వెండి, బంగారు వస్తువులు తీయడానికై పోటీపడడం.

సత్తర = అటక

సపిరె = ఆటలో ద్రుతగతి

సర్వ్విలినిట్టల = రాళ్ళతో నిండిన

సవరం = సూటి

సాటు = అరుగు (దిమ్మిసకొట్టడం)

సిడగ = చిన్న కల్లుడిప్ప

సెలగలపటం = చచ్చినవాడి బుగ్గి నీటకలపడం

సెలపడం = దారిన కంప కర్ర శుభ్రంగా నరికి తుడిచేయడం

సేకు = వరుస

సోప = కోదులబారు గుడిసెలు

# సంప్రదించిన గ్రంథాలు

- అమృత సంతానం – గోపీనాధ మహంతి. అనువాదం పురిపండా అప్పలస్వామి, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురణ.
- అర్థశాస్త్రం. అధికరణం 9,9వ అధ్యాయం.
- ఆంధ్రభూమి దినపత్రిక. జూలై 11, 18, 1976. విశాఖ గోదావరి గిరిజనుల పాటలు, పి. శివరామకృష్ణ.
- ఆంధ్రజ్యోతివార్తపత్రిక. కాంట్ జ్ఞానతత్త్వ మీమాంస. నండూరి రామమోహనరావు 7–8–81. (ఈ వ్యాసాలన్నీ 'విశ్వదర్శనం'గా తరువాత ప్రచురించారు).
- ఆంధ్రప్రభ దినపత్రిక. ఆకాశహర్మ్యాలు నిర్మించే అల్పజీవి. 12 ఆగస్టు 1982.
- ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి. ఖండవల్లి లక్ష్మీరంజనం – బాలేందు శేఖరం, సరస్వతీ బుక్‌డిపో, కర్నూలు.
- ఆంధ్రాలో స్వాతంత్ర్యసమరం. ఆచార్య మా. వెంకటరంగయ్య – యస్. ఇన్నయ్య, సాంస్కృతిక వ్యవహారాలశాఖ, 1972.
- ఆంధ్రుల సాంఘిక ఆర్థిక చరిత్ర, మధ్యయుగం. అల్లాడి వైదేహి, 1978.
- ఆముక్తమాల్యద, శ్రీకృష్ణదేవరాయలు.
- ఆల్బర్ట్ ష్వయిట్జర్ ఆత్మకథ. దక్షిణ భారత భాషా సంస్థ.
- ఆంధ్ర మహాభారతం.
- కృష్ణ విజయం, పూసపాటి తమ్మిరాజు.
- కళింగదేశ చరిత్ర, సంపాదకత్వం – రాళ్ళబండి సుబ్బారావు, రాజమండ్రి – 1930.
- కాకతీయ శాసనసాహిత్యము, డా.పి.వి. పరబ్రహ్మశాస్త్రి, ఆంధ్రసారస్వత పరిషత్ ప్రచురణ 1981.

- గతితార్కికభౌతికవాదం – చారిత్రక భౌతికవాదం, ప్రగతి ప్రచురణాలయం, మాస్కో 1980.
- గిరిజన భాషా మాండలికం, పి. శివరామకృష్ణ, భారతి 1978 ఏప్రిల్, 1979 ఏప్రిల్.
- జాగృతి వారపత్రిక, గిరిజన జీవితంలో వెలుగు నీడలు, పి. శివరామకృష్ణ, 16–9–77.
- జానపద గేయసాహిత్యము, డా. బి. రామరాజు, 1978. 1–8–117/2, చీకటిపల్లి, హైదరాబాద్ – 20.
- జానపద గేయాలు – సాంఘిక చరిత్ర, డా. బి. రామరాజు – నాయని కృష్ణకుమారి, ఆంధ్ర సాహిత్య అకాడమీ ప్రచురణ, 1974.
- తెలుగు భాషా చరిత్ర. సంపాదకత్వం: భద్రిరాజు కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1974.
- ప్రాచీనాంధ్ర భూగోళము, కుందూరి ఈశ్వరదత్తు, 1979.
- ప్రజాశక్తి దినపత్రిక. 19–11–81. 'జ్ఞాపకశక్తి పదార్థం నిజంగా ఉందా', వ్యచెస్లావ్ ఖ్రమోవ్.
- పద్మనాయక చరిత్ర.
- భాషాశాస్త్రం – లా – ఎంకి. కుంటముక్కల లక్ష్మీనారాయణశర్మ 1982.
- భారతి, 1969 అక్టోబర్ – నవంబర్, ముసునూరు సాంబశివరామమూర్తి
- మాండలిక పదకోశము. కూర్పరి. శ్రీ మరుపూరు కోదండరామ రెడ్డి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ. 1970.
- మాండలిక వృత్తిపదకోశం. సంపా. భద్రిరాజుకృష్ణమూర్తి. ఆం.ప్ర.సాహిత్య అకాడమీ 1974.
- మానవ విజయం. రచన: ఇలిన్ – సెగాల్, అనువాదం వి.ఆర్.శాస్త్రి. విశాలాంధ్ర ప్రచురణ. 1954.

✳ మానవులు మహీధరాలు, మహీధర జగన్మోహనరావు, విశ్వసాహిత్యమాల, రాజమండ్రి.

✳ వివేచన, పరిశోధన పత్రిక, తెలుగుశాఖ – ఉస్మానియా విశ్వవిద్యాలయం; జూలై 1981 – 82. తెలుగు వనసీమలలో ప్రకృతి పురుషులు; వార్తయందు జగము వర్ధిల్లుచున్నది, పి. శివరామకృష్ణ.

✳ విశాఖజిల్లా గెజిటీర్ 1835, ఆనరబిల్. డి. యఫ్. కార్నెకిల్, అనువాదం విజాపురపు వెంకట్రామయ్య, ఆంధ్రవిశ్వకళాపరిషత్ గ్రంథాలయంలోని ప్రభుత్వ పురావస్తుశాఖలో లభ్యం.

✳ శాస్త్రీయ విజ్ఞానం, కొడవటిగంటి కుటుంబరావు, విరసం ప్రచురణ.

✳ శ్రీమద్భాగవతమ్.

✳ సంజీవదేవ్ – రసరేఖలు, దేశికవితామండలి 1963, విజయవాడ; తెగిన జ్ఞాపకాలు, ఆదర్శ గ్రంథమండలి 1963 విజయవాడ; రూపారూపాలు, నవీనా పబ్లికేషన్, తెనాలి.

✳ సీతాపతిరాజు, ఆదిరాజు వీరభద్రరావు, లక్ష్మణరాయ పరిశోధక గ్రంథమండలి.

✳ స్త్రీ, చలం, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్, హైదరాబాద్ 1979.

✳ పద్మనాభయుద్ధం – తెలుగు అకాడమీ మోనోగ్రాఫ్, 2004.

✳ ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము. మల్లంపల్లి సోమశేఖరశర్మ. 1991.

✳ కాకతీయవైభవతోరణాలు. డా. పోలవరపు హైమావతి, 2005.

✳ అహోబలనరసింహుడు. పరిష్కార వ్యాఖ్యాత కామిశెట్టి శ్రీనివాసులు, మాలోల గ్రంథమాల 1999.

✳ 'గిరిగింజ గిరిమల్లెలు' నల్లమల ఫౌండేషన్, 1, ఓల్డ్‌బ్లాక్, సమ్రాట్‌కాంప్లెక్స్, సైఫాబాద్, హైదరాబాదు–4.

## ఓ।ఓఉ।౦స్తుప్రుజఆ౽మ


- A Hand Book of Social & Cultural Anthropology, ed. JJ Honnigmann, 1973.Rand Mcnally & Co.
- Lomax Alan 1977. Appeal for Cultural Equity. Journal of Communication 27 (2) : 125-138. Lomax Alan, and Conrad M. Arensberg. 1977. A worldwide evolutionary classification of cultures by subsistence systems. Current Anthropology 18 (4); 659-708.

  Lomax Alan with the contrometrics project staff 1968. Folk song style and culture. American association for the advancement of Science. Monograph No. 88. Washington AAAS, and Science Volume No, 137 , Year 1963. A summary of the factor analysis that grouped the 71 measures of social and performance norms into 14 clusters and 5 single factors.
- An Analysis of Kinship Economy and Religion of the Jatapus. A Scheduled Tribe in A.P. Thesis submitted to the Andhra University, 1970.
- A grammar of Kuvi Language. 1911. Madras.
- Ancient Races of Deccan, 1972. Sarcar S.S.

  Anthropologist -As a Hero. Hayes (Levistrauss).
- Anthropos : Volume 75, 1980.

  Prehistoric background to pastoriliam in the southern Deccan in the light of oral tradition and cults of pastoral communities. MLK Murthy and Gunther Sontheimier.
- Census of Andhra Pradesh, Census of India. Volume 1, Part 1-B ( IV) Chenchus.
- Cognitive Anthropology, ed. Stephen Taylor.
- Culture and Cognition - Readings in cross cultural Psychology, ed. J.W. Berry and P.R. Dasen, Metuen & Co. Ltd., London 1974.
- Cognitive Development. A.R. Luria, Harvard University, 1976.

- Culture and Experience, Irwing A. Hollowell, University of Pennsylvania Press 1967.
- Culture & Cognition Language.
  Ronald Casson, Macmillan 1981.
- Cultural & Social Anthropology ed. P. B. Hammond, 1964. Macmillan Co.
- Custom Conflict in Africa, Max Gluckman, Basil Blackwell, Oxford 1955.
- Culture and Public Action, 2004. Rao & Walton, Permanent Black.
- Collected works of A.K. Ramanujan. Oxford 1999.
- Encyclopedia of Anthropology. David E. Hunter Philip. Harper & Row 1976.
- Explanation for prehistoric change ed. James N. Hill 1977.
  A School of American Research Book.
- Field Theory. ed. Borwin Cartwright, New York, 1951.
- Forest working plan, Kurnool Division, Govt. of A.P. 1978.
- Forest working plan, East Godavari 1995-2005.
- Geographical Data in early Puranas. M.R. Singh, 1972.
- High Points in Anthropology, ed. Paul Behannan and Mark Glazer Alfred A. Knof, New York.
- History of the Cult of Narasimha in Andhra Pradesh, Madabhushini Narasimhacharya, Sri Ahobila Math, Hyderabad - 13, 1989.
- Illusion & Reality, Christopher Caudwell, 1956, Peoples Pub. House, New Delhi.
- Indian Hill Birds, 1942. Salim Ali, Oxford.
- Intelligence & Cultural Environment, Methuen & Co. Ltd., 1972.
- India - A Regional Geography, ed. R.L. Singh, NGSI.
- Kondadora - A Study in Socio-cultural change.
  Dr. D.V. Raghava Rao, Andhra University, 1975 (thesis).
- Lore; Munros Edmonson. Holt Rhinehart & Winston Inc. 1970.
- Myth & Meaning. Claude Levistrauss, Shocken Book 1978.

- Moral & Merit. Weiden field and Nicholson 1967. Christoph V. Furrer Haimendrof.
- Madras Districts Gazetteers, Statistical Appendix for Visakapattanam Dt. 1915.
- Origins of Agriculture, Read Charles. Monton Publishers, Hague. 1979.
- Plough & Pasture, The Early History of Farming, E. Ceicil. Curven and Gummaund Hutt. Collier Books. 1961.
- Religion & Society of the Koyas in the agency area of A.P., Dr. A.Satyanarayana Murthy. Thesis submitted to Andhra University 1971.
- Rethinking Symbolism. Dan Sperber. Translation: Alice L. Morton, Cambridge Studies in Social Anthropology, 1975.
- Statistical Compendium on Education of Scheduled Tribes in A.P. 1977, Tribal Cultural Research and Training Center, Hyderabad.
- Science Reporter , October, 1981.
- Studies in the History of third Dynasty of Vizianagar. Dr. N. Venkataramanaiah, University of Madras, 1935.
- Studies in Eco-climatology of A.P. Thesis submitted to Andhra University by Miss Hemamalini, Dept. of Geography, 1979.
- Satyakeerti Raju, Dissertation submitted to the Andhra University, Anthropology Dept. 'Kondapalle folksongs'.
- Social capital; A multi faceted perspective 2000. The World Bank.
- The Agriculture Systems of the World. D.B. Grigg. Cambridge Geographical Studies, 1974.
- The Nomads, V . Raghavaiah.
- The Little Community, Peasants Society & Culture, Robert Redfield, Phoenix University of Chicago.
- The Early History of Deccan Yazdani, Gen. Editor Part VII-XI.
- The Bagatas and Related Tribes, Thesis submitted to Andhra

University by Dr. Muni Venkataratnam Reddy, 1971.

- The Human Direction. James L. Peacock and A Thomas Kirch .1970. Meridth Corporation.
- Terrestrial Environment. J.C. Cloudsley - Thompson, London 1975.
- The Race Concept - Results of an enquiry. UNESCO. 1952.
- The Hill of Flutes. W.G. Archer, George Allen & Unwin Press.
- The Book of Indian Animals, K.S.H. Prater, BNHS, 1971.
- Tribal India, P. Gisbert, Ravat 1978.
- The Anthropoligist as a Hero. Fol Nelson Hayes and Tanya Hayes, 1972 M.I.T. Press.
- Tiger. The Story of the Indian tiger. Kailash Sankhala, 1978. Rupa & co. 15 Bunkimchatterjee Street, Calcutta - 700 073.
- The Reddis of Bison Hills, Christoph Furrer Haimendroff.
  The Chenchus of Hyderabad, Macmillan & Co., London. 1945.
- The Stonetipped Arrow. Bridget, Phoenix London.
- Understanding the Sociology. S.C.Dube, NCERT, 1979.

# సమాచారం, ఆతిధ్యం ఇచ్చిన గ్రామాలు

**తూర్పుగోదావరి జిల్లా :-**

- రంపచోడవరం మండలం –
  చినగెడ్డవాడ, గెడ్డవాడ, వాడపల్లి, వేములకొండ, తున్నూరు, కాకవాడ, కోయలగూడెం
- మారేడుమిల్లి మండలం –
  దేవరవెలమలకోట, తాడేపల్లి, మారేడుమిల్లి, ఆకుమామిడికోట, బంద.
- అడ్డతీగల మండలం – దుచ్చెర్తి
- యార్లగడ్డరామవరం మండలం –
  జంగాలతోట, గుర్తేడు, బబ్బిలోవ, దారగడ్డ, జలగలోవ, కానివాడ, చాపరాయి, మంగంపాడు.

**ఖమ్మంజిల్లా :-**

- వరరామచంద్రపురం మండలం – వేలేరుపాడు మండలం
  *గోదావరిఒడ్డున :* గొందూరు, కొల్లూరు, పేరంటపల్లి, కాకివిసనూరు, కల్తనూరు, చిట్టంరెడ్డిపాడు.
  *ఉప్పునపల్లిగట్టు :* (ఏడుగుర్రాలపల్లివద్ద) చింతలపాడు, జిన్నెతోగు.

**విశాఖ జిల్లా :-**

- గంగరాజుమాడుగుల మండలం –
  కుంబిడిసింగి, వంతాలు, నిట్టమామిడి, నురమాతి, ఒంచెడిగొంది, గొందేలి, లోతుగడ్డ
- హుకుంపేట మండలం – పాతకోట చింతలవీధి
- పాడేరు మండలం – మఠం, బీరం
- చింతపల్లి మండలం –
  లంబసింగి, జర్రిలి, అంతర్ల, కరణికలంక, కొండల కోడపల్లి, పలకజీడి, మఠం భీమవరం, సాడేకు.

**ప్రకాశం జిల్లా :-**

- ఎర్రగొండపాలెం మండలం – గుట్టలచేను, అలాటం, పాలుట్ల
- దోర్నాల మండలం – చింతల, తుమ్మలబయలు

**కర్నూలు జిల్లా :-**

- ఆత్మకూరు మండలం – పెద్దచెరువు.

**మహబూబ్‌నగర్ జిల్లా :-**

- ఆమరాబాద్ మండలం – మద్దిమడుగు, మారడుగు, వంకేశ్వరం.
- బల్మూరు మండలం – పులిచెలమ

ఇవి సమాచారం, పాటలు సేకరించిన గ్రామాలు.

# వార్తయందు జగము వర్ధిలుచున్నది

వార్తయందు జగము వర్ధిలుచున్నది
యదియులేనినాడు యఖిలజనులు
నంధకార మగ్నులగుదురు గావున
వార్త నిర్వహింపవలయు...

50, ప్రథమాశ్వాసం, సభాపర్వం, ఆంధ్రమహాభారతం.

వస్తుతంత్రం – పురుషతంత్రం
దేశకాలాలకు తగిన ప్రజ్ఞలు
హెచ్చుతగ్గులులేని ప్రతిభలు
జ్ఞానం – వర్గీకరణ
అనుభవాలను పదిలపరచుకొనే విధానాలు
నిర్మాణవాదం
తాత్విక విశ్లేషణలు
రాజకీయనేపథ్యాలు
ప్రకృతితో సమరసంగా జీవించడమే పరిష్కారం
భారతీయ తాత్త్వికమూలాలు
సత్త్వరజస్తమస్సుల కలయిక సంస్కృతి
దేశకాలాలు – రాగద్వేషాలు
అంతర్ముఖులు – బహిర్ముఖులు
ఋతంభరులు
ప్రత్యేకత కోసం ప్రయత్నం
సృష్టిపై సంస్కృతి సృజనాత్మకమైన ముద్ర
వనరులమీద పెత్తనం స్థిరపరచుకొనే మనోమయప్రపంచం
మాట్లువేసే కమ్మరి
ఎంచుకోవడం – వెక్కిరించుకోవడం – వంకలుదిద్దుకోవడం
భౌతిక మానవశాస్త్రాలు – పరస్పర పూరకాలు
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష
వేదాలు – అరణ్యకాలు
అరణ్యవాసం వరించిన శాస్త్రజ్ఞులు
ఆశించే ప్రమాణాలు – వాస్తవంలో అర్హతలు
ప్రగతి – జాతిపరిభాష

**వస్తుతంత్రం – పురుషతంత్రం :**

శాస్త్రజ్ఞుడు పండితుడు, కవి క్రాంతదర్శి. ఈ రెండు ప్రతిభలను తమ కష్టంలో మేళవించుకున్న పల్లెప్రజలు ప్రాజ్ఞులు. వారిని గూర్చిన అధ్యయనం ఒక దర్శనం.

సూక్ష్మావగాహన దర్శనం. ప్రత్యయావగాహన జ్ఞానం. జ్ఞానం వస్తుతంత్రం (ళీశీఎబీశిఱఙఎ) పురుషతంత్రం (ఇఎవీశీఎబీశిఱఙఎ - బీఱశీదీఱశిఱఙఎ) అని రెండు విధాలు. రూపం మనం గమనించేతీరు. నామం దాని సంకేతం. ఈ గమనించడానికి, సంకేతించడానికి కర్త మానవుడు. నామరూపాత్మకమైన ప్రపంచాన్నిగూర్చిన అతని సంజ్ఞానం (ఆశీగబీనీశ-ఆనీగిశీఱబీశ) పురుషతంత్రజ్ఞానం. శాస్త్రజ్ఞులది వస్తుతంత్ర జ్ఞానం.

**దేశకాలాలకు తగిన ప్రజ్ఞలు :**

నాగరికులకు కొండ ఒక అఖండస్థూలపదార్థం. దానిమీద వేటాడే ఆటవికులకు ఆభూగోళంలో లంక, నెత్తం, గండి, వేనం, లోయ, గొంది, తరుము, జవుక, వాయవ, సరి, కురవ, కట్టువ, సారవ, పెంటవంటి స్థలవిశేషాల స్పష్టమైన పరిజ్ఞానం అవసరం. దూరంగా ఉన్నవాడికి భాగ్యనగరం ఒక నగరం. కాని పనిపడినపుడు తెలుస్తుంది ఇవి జంటనగరాలు–ఎన్నోవాడలు, బస్సులు, బస్తీ, పిన్, ఇల్లు, ఫోన్ల సంఖ్యల వర్గీకరణాల వైనం. ఇక్కడ సంచార నిబంధనలు సంకేతాలువంటివే – అడవిలో జంతువుల కదలిక గూర్చిన నిశితమైన జ్ఞానం. దేశకాలాలబట్టి జీవన విధానాల భేదమే కాని, మానసిక ప్రజ్ఞలలో ఏజాతీ ఇంకొకజాతికి తీసిపోదు. భారతీయవేదాంతం మానవజాతి సమానత్వాన్ని ముక్త కంఠంతో ఘోషిస్తుంది. ఆర్యుల, ద్రావిడుల శత్రుత్వాల వెక్కిరింపుల మాట అటుంచితే – వారివారి తెలివితేటలగూర్చి ఎవరూ ఎవరిని తక్కువ అంచనా వేయలేదు. ఎన్నో వారసత్వాలు భారతీయసంస్కృతిని సుసంపన్నంచేసినవి.

**హెచ్చుతగ్గులులేని ప్రతిభలు :**

సాంస్కృతిక పునరుజ్జీవనం – పారిశ్రామిక విప్లవం తరువాత ఆఫ్రికా, ధ్రువప్రాంతాలు, పసిఫిక్ దీవులు, అమెరికా మొదలైన దేశాలలో సమాజాలను పాశ్చాత్యాదేశాలు తమ ఆధిపత్యంకిందకు తెచ్చుకోసాగాయి. 70–80 యేండ్లు మానవ శాస్త్రజ్ఞులు శ్రమించినతరువాత ఆ సమాజాలప్రజ్ఞలు పడమటిదేశాలకు అర్థంకాసాగాయి.

కొందరు ఈతెగలది అంతర్బుద్ధి (intuition) అన్నారు. కొందరు వీరిజ్ఞానం అవతార్కికం (prelogical) అని సందేహించారు. ఈఅంచనాల క్రమవికాసంవెనుక ఆనాడు వెలువడుతున్న పరిణామ వాదం అనుభూతివాదంవంటి తత్త్వశాస్త్రసిద్ధాంతాల ప్రభావంఉన్నది. కాలం గడిచిన కొద్దీ సాంస్కృతిక, శారీరక, మానవశాస్త్రవేత్తలు ఆ సమాజాలలో యేండ్లతరబడి నివసించి, అధ్యయనంచేసి బహుముఖమైన వారి ప్రజ్ఞాపాటవాలను అర్థం చేసుకో గలిగారు. లక్షయేండ్ల నేటి నరమానవుని ప్రతిభలలో హెచ్చుతగ్గులులేవు అని నిర్ధారించారు.[1]

## జ్ఞానం – వర్గీకరణ :

మానవుని మేధస్సు ఒక స్వయంచాలితయంత్రం. ఒక గణనయంత్రంవలె అది పనిచేస్తుంది. ఈ గణకాలు సాదృశ్య (బిటీబిజిళిశీ), సంఖ్యాకాలని (ఖిటిశీశిశిబిజి) రెండురకాలు.[2] సాదృశ్య గణకంలోకి 'క్ష' అనే అక్షరాన్ని ఎక్కించితే – దానికి సంబంధించిన ధ్వనులను అదిగ్రహించి నిలువచేస్తుంది, స్పందిస్తుంది. సంఖ్యాకయంత్రం 0–1అనే రెండంకెలలోనే ఎట్టి సమాచారాన్నైనా చూపిస్తుంది. (తంతిలో మోర్స్‌కోడ్ – అన్ని సంకేతాలను సూచించినట్లు). ఇదొక వ్యతిరేక యుగళం. మంచి–చెడ్డ, పచ్చి–పండు, వెలుగు–చీకటి, తీపి–చేదు, చావు–బతుకు, కుడి–ఎడమ, మడి–మయల, సత్–అసత్, మృత–అమృత, తమస్–జ్యోతిస్ ఇవీ మానవుడు తనఅనుభవాన్ని వింగడించుకునే తీరులు. ఈవిభాగాల ప్రసారాన్ని మేధస్సు సాదృశ్యగణకంవలె నిర్వహిస్తుంది.

'వేద వేదాంతాలలో జంటలుగా (తమస్సు,జ్యోతిస్సు) భావావిష్కరణము ఆచారము. సన్నిహిత భావముల సుదీర్ఘపట్టిక వ్యుత్పత్త్యర్థములతో ఇచ్చుప్రయత్నం కనిపిస్తుంది'.[3]

మధువు పాశ్చాత్యులలో స్వచ్ఛత, పవిత్రతకు సంకేతం. దానికి అక్కడ ద్రాక్ష తోటలు, శీతలపరిస్థితులు, పాతబడినకొద్దీ రుచిపెరిగేవంటకం కారణాలు కావచ్చు. మనకు మధువు మోహానికి – పాలు స్వచ్ఛతకు సంకేతం. ఆర్యులు పశుపాలకులు. గోధనం – గోమాత – పంచగవ్యాలు – పంచామృతాలు – గోలోకం ఇలా విస్తరిల్లినవి మనసంస్కృతి విశ్వాసాలు. చల్లదనం, మంచు చలిదేశాలకు నిరుత్సాహకరమైనవి. ఉష్ణదేశీయులమైన మనకు చల్లదనం హాయినిస్తుంది. ఈ అనుభవాలలో భేదం విశేషణాలలో, కవిసమయాలలో వికసిస్తుంది.

**అనుభవాలను పదిలపరచుకొనే విధానాలు :**

శారీరకమైన విశిష్టతలు ప్రాణికోటిలో మానవునికి ఒక ప్రత్యేకప్రతిపత్తి కలిగిస్తున్నవి. ఇంద్రియాతీతమైన పరోక్షభావ వ్యాపారంలో మానవుడొకడే సమర్థుడు. అనుభవానికిరాని, రానున్న విషయాలనుకూడా సంకేతాలద్వారా ఊహించగలడు, భాష ద్వారాముందుతరాలకు అందించగలడు. అవిచ్ఛిన్నంగాసాగే యీజ్ఞానం ప్రవర్ధమానం. వేలయేండ్ల జీవనయాత్రలో మానవుడు సన్నిహితమైన అనుభవాలను వివరంగా, సుదూరమైనకాలంలో సంఘటనలను సంక్షిప్తంగా సూత్రప్రాయంగా గుర్తుంచుకుంటాడు.

'మానవనిర్మితమైన అత్యంత సునిశితమూ సమగ్రమూనైన యంత్రానికి భిన్నంగా, ప్రాణులకు తన్నుతాను మరమ్మతు చేసుకోగల, తగిలిన గాయాలను మానుపుకోగల అద్భుతశక్తి అమరింది. కోల్పోయిన కొన్ని శారీరక కార్యకలాపాలకు పరిహారం సమకూర్చగల నేర్పుంది. గతంలో సంభవించిన ఆశక్తతకు సంబంధించిన సమాచారాన్ని సరిగ్గా నయంచేయవలసినది ఏమిటో తెలుసుకునేందుకే మెదడు నిల్వ చేస్తుంది.[4]

నాడీ, మేధోశాస్త్రవేత్తలు మెదడునుగూర్చి చెప్పిన దీనినే మానవజాతియొక్క సామాజికవారసత్వానికి అన్వయిస్తే – అనుభవాలను పదిలపరచుకోవలసిన అవసరం స్పష్టమౌతుంది. వ్యక్తికైనా, జాతికైనా అనుభవాలే ఆస్తులు. వనరులు వట్టిపోవచ్చు. వానిని వివరించిన శాస్త్రాలు అంతరించిపోవచ్చు. కాని ఒరవడి, దృక్పథం మనలో జీర్ణించి పోతుంది. మన పలుకుబడిలో మిగిలిపోతుంది.

మానవజాతిని పోషించడానికి ఎన్నోకోట్లయేండ్లసృష్టి ఆవిర్భావక్రమాన్నంతా వెలికితీస్తున్నారు శాస్త్రవేత్తలు. ఒక జంతువు, కీటకం అంతరించిపోతుంటే లబలబ లాడుతున్నారు. ఇది కేవలం పరిశోధనావేశం కాదు – లోకకళ్యాణాభినివేశమే. ఆ జంతువు, కీటకం ఆవరణవ్యవస్థలో అనితరసాధ్యమైన పాత్రను గూర్చిన జ్ఞానం వారి ఆందోళనకు కారణం.

ఈ సృష్టివయస్సును ఒక సంవత్సరంగా భావిస్తే మానవుని వయస్సు కొన్ని నిమిషాలే. ఈ కొన్నినిముషాలలో అతడువేసినముద్ర ప్రధానమైనది. నాగరికత ప్రస్థానంలో అడుగడుగునా కుదుపులకు లోనౌవుతున్న మనం కాలానికి దేశానికి తగిన సంతులనంతో ప్రవహించే జానపదసమాజాలను పరిశీలించడం ఉపదేశాత్మకమైన

అనుభవం. వివిధదశలలో జాతిలో పెరిగేవిజ్ఞానం, జాతి దృక్పధాన్ని, వ్యవస్థను, కర్మకాండను, కళలను, ఎటువంటి క్లేశము, అట్టహాసము లేకుండా ఎలా సర్దుకుంటుందో, ఎన్నివివరాలను లెక్కలోకి తీసుకుంటుందో గమనించడం భవిష్యత్తుకు పాధేయం, కరదీపిక. గతం వర్తమానంలోపడే చిక్కుముళ్ళను విప్పుతుంది.

సంకేతాలు అవగాహనకు అర్ధంచెపితే, నిర్మాణసూత్రాలు వాటి అమరిక, గతి తర్కాన్ని వివరిస్తాయి. అంకెల విలువను వాటి స్థానం,రాసుల సంబంధాలను కూడిక, తీసివేత మొదలైన గుర్తులు; ఉత్పరివర్తనం, వరణం, నాశం జన్యుకణాల కలయికను నిర్ణయించినట్లు, అనుభవాలను అవసరాన్నిబట్టి కలుపుకుంటూ, వదిలేస్తూ, దిద్దుకుంటూ సంస్కృతి ముందుతరాలకు అందిస్తుంది.

**నిర్మాణవాదం :**

భూగర్భశాస్త్రం, సంగీతం, భాషావిజ్ఞానం, మార్క్సిజం, ఫ్రెంచి తాత్త్వికవిచార ధారలతో పరిచయం పదిహేనేండ్ల తన క్షేత్రకృషితో సమన్వయించి క్లాడ్ లెవీస్ట్రాస్ ప్రతిపాదించిన నిర్మాణ సిద్ధాంతం స్థూలచిత్రమిది. ఆయన విశ్లేషణ పురాగాధలకు పరిమితమైనా, అందుకాధారమైన భావాలప్రకంపనలు పాశ్చాత్యుల తాత్త్విక విశ్వాసాలనే కదిలించడంతో నిర్మాణవాదం ఒక ఉద్యమంగా అన్ని రంగాలలోకి వ్యాపించసాగింది.

మానవుని ప్రజ్ఞకు దేశ కాలాతీతమైన సత్తాను అంగీకరిస్తే చారిత్రక భౌతిక సిద్ధాంతాలేమైపోతాయి! నిజమే. పరిణామంలో అత్యున్నతదశకు చెందినవారమను కొనే తెల్లజాతుల గర్వాన్ని, నిర్మాణవాదం దెబ్బతీసింది.

**తాత్విక విశ్లేషణలు :**

'అనుభూతివాదులు మానసికశక్తిని అంగీకరించరని ఎవ్వరూ అనుకోవలసిన పనిలేదు. మేముమనస్సులను, దానిశక్తిని అంగీకరిస్తాం. కాకపోతే పరిణామం బహిర్గతమౌతున్న అనేక రూపాల్లో అదొక రూపంమాత్రమే అంటాం. సంఘటనలను నిర్మించే విధానంలో ఆలోచన ఒక భాగం. ప్రతిసిద్ధాంతం మారే విధానంలో ఉన్న అనుభవమే' నంటారు శామ్యూల్‌బట్లర్‌వంటి యదార్ధవాదులు. 'మన అవగాహనను కేవలం అనుభవానికి పరిమితం చేయడం అనుభూతివాదులు చేసిన పొరపాటు. అనుభవం వల్ల ఏదిఉన్నదో అది మనకు తెలుస్తుంది. కాని అది అలాగే ఎందుకుండాలో మరొక విధంగా

ఎందుకుండరాదో మనకు తెలియదు. అనుభవాన్ని ఎంత విశ్లేషించినా నిశ్చితత్త్వం, కార్యకారణత, సార్వత్రికత మొదలైనవి మనగ్రహణశక్తికి అందవు. అంత మాత్రాన సార్వత్రికసత్యాలు, అవశ్యకత్యాలు, నిశ్చితసత్యాలు అనేవిలేవని చెప్పలేము. అవి నిస్సందేహంగా ఉన్నాయి'అనే కాంట్ భావవాదం ప్రత్యక్ష ప్రమాణం మాత్రమే విశ్వసించడం సంకుచితంగా భావించింది.[5]

బుద్ధియొక్క స్వతఃప్రమాణానికి పట్టంకట్టినవాడు డేకార్ట్. దాని చలనం గతి తార్కికం అని చెప్పినవాడు హెగెల్. వారి ఆలోచనలకు మార్క్స్ భౌతికతను జతచేసి, ప్రకృతిని నేపథ్యంగానిలిపాడు లెవిస్ట్రాస్. ఈభావాలలో, ప్రకృతికి సంస్కృతికి రూసోగీసిన సరిహద్దులు; నాగరికత యెడ అతనికిగల ఏవగింపు 'తరతరాలవికాసాన్ని కొనసాగించేది సృజనాత్మకత' అన్న బెర్గ్‌సన్ ప్రతిపాదనలు స్పష్టంగానే ఉన్నాయి.

**రాజకీయనేపథ్యాలు :**

రూసో, బెర్గ్‌సన్‌లు ఫ్రెంచి తాత్త్వికులు. ఇంగ్లీషు, ఫ్రెంచి దేశాలు రోమన్ సామ్రాజ్య కాలంనుండి రాజకీయంగా యేరాండ్లు. ఆ పరంపరను దృష్టిలోపెట్టుకొని తాత్త్విక విభేదాలనుకూడా బ్రిటిష్అనుభూతి పరిణామవాదాలు – ఫ్రెంచి తర్కసృజనాత్మక సిద్ధాంతాలను విమర్శకులు పోటీపెడుతుంటారు. జాకబ్సన్ సాహచర్యంతో భాషా నిర్మాణాన్ని సంస్కృతిలోని గతితార్కికతను గణకాలసామ్యంతో విశదీకరించిన స్ట్రాస్, మానవమేధను యంత్రాలస్థాయికి దిగజార్చాడని పొరబడరాదు. ఈ సృష్టిఅంతా మా కోసమే అన్న మానవజాత్యహంకారాన్ని అతడు మన్నించడు. ఈ నాగరికత వికారాలకు విరుగుడేమిటి అన్న ప్రశ్నకు జీన్‌పాల్‌సార్త్ర్, అభ్యుదయం చూడగల భవిష్యత్తు అని ముందుకు చూస్తాడు. ఆలోచించడమే మానవుడికి ఉన్న పెద్దరోగం. నాగరికత దాని ఫలితం–స్వతంత్రంగా ఉండడం అతనికర్మ అని అస్తిత్వ, అసంబద్ధతత్త్వాన్ని బోధిస్తాడు.[6]

**ప్రకృతితో సమరసంగా జీవించడమే పరిష్కారం :**

నాగరికత యాంత్రికబలంతోవేసే గంతులు సమాజంయొక్క అభ్యుదయం కాదని మానవుడు ప్రకృతితో సమరసంగా జీవించడానికి ప్రయత్నించాలని స్ట్రాస్ హితబోధ చేయడంలో ఆశ్చర్యంలేదు. కారణం అతనికి స్ఫూర్తినిచ్చినవి ప్రాక్తన సమాజాలు. నాగరికత బంగారుపంజరంగామారడం, ప్రకృతివనరులు వట్టిపోవడంతో భయ

విహ్వాలమౌతున్న పాశ్చాత్యలోకంలో అస్తిత్వవాదులు, మేము ఇకనుండి నిర్మాణవాదులం, సహజంగా జీవిస్తాం అని సాంఘిక నియమాలను బాహాటంగా కాలదన్నుతుంటే, నేను ఊహించిన నిర్మాణవాదం ఇటువంటిదికాదని స్ట్రాస్ మొత్తుకుంటున్నాడు.

అంతకుముందున్న మానవశాస్త్ర సంప్రదాయాలన్నింటిని క్షేత్రకృషికి జోడించిన ఫలితం నిర్మాణవాదం అనిమరచిపో రాదు. అది ఆసంప్రదాయంలో సహజమైన మలుపు. దానికోసం బారసాచేముందు మనసంస్కృతిలో యీ భావవికాసానికిగల పునాదులెట్టివో, సమీక్షించు కొనడం అవసరం.

**భారతీయ తాత్త్వికమూలాలు :**

తత్త్వశాస్త్రంపేరిట ప్రతిష్టను, అప్రతిష్టనుతెచ్చుకున్నఘనకీర్తి భారతీయులది. డేకార్ద్ ద్విసత్తావాదంవంటిదే మన సాంఖ్యదర్శనం 'విశ్వసత్తాజ్ఞానం ఆధ్యాత్మికము, ఆధ్యాత్మికేతరమునని (పురుష – ప్రకృతి) రెండు ముఖ్యసూత్రములననుసరించును. మనస్సు (చైతన్యం, ఆత్మ) కలవాడు పురుషుడు. ఆ చైతన్యంతో పదార్ధసంబంధమే సంసారము. ఈ సంబంధానికి సాధనాలు జ్ఞానేంద్రియపంచకాలు, పంచభూతాలు, పంచతన్మాత్రలు (శబ్ద, రూప, రస, గంధ, స్పర్శలు – ఇంద్రియాలు), సత్త్వరజస్తమాలు, పురుషుడు, ప్రకృతి మొత్తం ఇరువదియైదు.

**సత్త్వరజస్తమస్సుల కలయిక సంస్కృతి :**

ప్రకృతి అనగా వ్యక్తమైన భౌతిక, ఆధ్యాత్మిక క్రమమునకంతకు అన్వయించు ఒక చిహ్నము. ప్రకృతి సంఖ్యాపరముగా ఒకే పదార్ధమైనను అది సత్వరజస్తమస్సులనే మూడు పదార్ధముల సంఘటన. ఇవి స్వభావముచే, వృత్తముచే పరస్పర విరుద్ధములు. విశ్వమావిర్భవించక పూర్వం ఇవి సామ్యావస్థలోనుండును. పురుషుని ప్రమేయంతో ప్రకృతితో సంబంధం ఏర్పడుచున్నది'.[3]

**దేశకాలాలు – రాగద్వేషాలు :**

ఎక్కడికక్కడ తనపరిశ్రమతో ప్రకృతిని మలచుకోవడం ఒక జీవనదృక్పధాన్ని ఏర్పరచుకోవడం సంస్కృతి లక్షణం. సంస్కృతికూడా అదేస్థితిలో (వేట, వ్యవసాయం) నిలబడిపోదు కాబట్టి మనిషి పెట్టుకొన్న నామరూపాలు, దృక్పధాలు తాత్కాలికమైనవి. కాని అవి సమకాలంలో అవసరమే. అనుక్షణం మారిపోయే ఈ పురుషతంత్రజ్ఞానాన్ని

మాయన్నారు. దేశకాలాలబట్టి సంస్కృతిలోఏర్పడే రాగద్వేషాలు జాతీయ సమైక్యతకు, సౌభ్రాతృత్వానికి అవరోధమౌతాయి. గుణరహితమైన ప్రకృతికి చైతన్యానికి, గుణాలనా రోపించడం మాయ. ఈ అహంకారంలోపడి కొట్టుకుపోక తమస్సునుండి జ్యోతిస్సుకు, అవిద్యనుండి విద్యకు సాగవలసిందిగా మన తత్త్వశాస్త్రం చెపుతున్నది. మన మనస్సు నిర్మాణంలో సహజంగాఉన్న స్థలం, కాలఅవగాహన మనకు కనిపించే (పురుషతంత్ర) ప్రపంచానికేతప్ప యదార్థప్రపంచానికి వర్తించవు. యదార్థవస్తువులు వీటికి అతీతమైనవి. స్థలం, కాలాలను యదార్థప్రపంచానికి వర్తింపచేసే ప్రయత్నాలలో వైరుధ్యాలు ఎదురవుతుంటాయి. ఈ వైరుధ్యాలను సమన్వయించుకోగల సమైక్య దృష్టిని అలవరచి, ఐకమత్యాన్ని సాధించినవారు భారతీయతాత్త్వికులు.

**అంతర్ముఖులు - బహిర్ముఖులు :**

తత్త్వదృష్టి,అద్వైతభావన లౌకికవ్యవహారాల్లోకూడా అతిశయించి భారతీయులు చరిత్రను అనాదరంచేస్తూవచ్చారు. 'నాగరికత దృక్పథంనుంచి గతాన్ని పరిశీలించే ప్రయత్నమే చరిత్రతత్త్వం. చారిత్రక సంఘటనలగమనాన్ని ఇది పరిశీలిస్తుంది. ఇది తత్త్వశాస్త్రచరిత్రకు భిన్నమని గమనించుకోవలె'.[9] చరిత్రకారులు చరిత్రరాయకపోయినా జాతికి అనుభవాలు ఎప్పుడూ అవసరమే. మనది అలిఖితం, మౌఖికమైన జానపద సంప్రదాయం. జాతి తనఉనికికి ప్రమాదం వచ్చినపుడు, తన వ్యక్తిత్వాన్ని పరాభవించి నపుడు, గతవైభవాన్ని తలచుకొని రెచ్చిపోతుంది. చరిత్రగర్వం విజిగీషువులనుచేస్తుంది. ఈ చరిత్రగర్వం రజఃప్రకోపం, కర్మపరాయణత్వం పాశ్చాత్యులలో కనిపిస్తుంది. మనలో కూడా 'ఇదం బ్రాహ్మ్యం - ఇదం క్షాత్రం' అని విజృంభించినవారు అనేకులు ఉన్నారు. కాని అది ఒక సామాజికతత్త్వంగా కనిపించదు. మనం సాంస్కృతికంగా విస్తరిస్తే, వారు అహంతో ఆక్రమిస్తారు. మనం అంతర్ముఖులమై వైరాగ్యాన్ని ఆశ్రయిస్తే, వారు బహిర్ముఖులై నిశితదృష్టితో పరిశీలిస్తారు. మనం సత్త్వంపేరిట తమస్సులోకి జారి ఆక్రోశిస్తూంటే, వారి రజోగుణం క్రౌర్యాన్నిపెంచి ప్రపంచాన్ని పీడించడం జరుగుతున్న కథ.

చారిత్రక భౌతికవాదాలలో సంస్కృతిగతి శంఖాకారంలో (spiral) పైపైకి సాగుతుంది. తాత్త్వికదృష్టిలో ఇది చక్రనేమిక్రమం. ఓడలు బండ్లు అవుతాయి. బండ్లు ఓడలవుతాయి.

**ఋతంభరులు :**

'సృష్టిక్రమము మారనిది తిరస్కృతముకానిది. దీనిని ఋతమందురు. ఋత మనగా తిరస్కరించరానిది. ఇదిమతనైయాయికములకు కూడా (వేదాంత, విజ్ఞానాలకు) చెల్లును. ఈ విశాలఋతమును దీక్షతో రక్షించువారు ఆదిత్యులు'.[3] ఎవరి జీవితంలో ప్రకృతికి–ప్రవృత్తికి లయకుదురుతుందో. వారు ఋతంభరులు. ఏజాతి జీవనరాగంలో బతుకు బరువుల లయ, ఆటపాటల రసప్రవాహంలో కరిగిపోతుందో, వారిసంస్కృతి సౌందర్యమయం, సంగీతమయం, ఆనందమయం. ప్రాచీనమానవ సమాజాల (తెగల) 'శ్రమైక జీవనసౌందర్యం' అట్టిదని లెవిస్ట్రాస్ భావన.

**ప్రత్యేకత కోసం ప్రయత్నం :**

రూసో అడుగుజాడలలో లెవిస్ట్రాస్, పశుత్వంనుండి మానవత్వానికి, ప్రకృతినుండి సంస్కృతికి, సహజాతాలనుండి స్వోపజ్ఞకు, ఏకత్వంనుడి భిన్నత్వానికి, అక్షర స్వనాల నుండి అలంకారధ్వనులకు మానవుని నడిపిస్తున్నది ప్రాణికోటిలో తన ప్రత్యేకతల గూర్చి ఆత్మజ్ఞానమేనంటాడు. ఇదే రజోగుణం.

మానవుడు తన భిన్నత్వాన్ని స్థాపించుకోవడంలోని (పదార్థంతో పురుషుని సంబంధం) వ్యాపారక్రమం ఎటువంటిది? అందుకు మేధస్సుకున్న గుణగణాలేమిటి?

1. వర్గీకరించుకోగల ప్రజ్ఞ.
2. వ్యతిరేకధర్మాలుగల సృష్టికి, తనకు సమన్వయంకుదిర్చే మాధ్యమం గుర్తించడం.
3. బహూకరణం : రెండువర్గాలమధ్య ఈబహుమతులు అనుబంధాన్ని పెంచుతాయి. ఆ బహుమతి అనేకమైన విలువలకు ప్రతీకగా చలామణిలోకి వస్తుంది. ఆహారంనుండి కన్యాదానంవరకు లోకసంగ్రహం కొనసాగుతుంది.[11]

**సృష్టిపై సంస్కృతి సృజనాత్మకమైన ముద్ర :**

'వైదికపరిభాష వర్గీకరణకు సూటియైన ఉదాహరణ. అశ్వం శక్తికి, ఆవు జ్ఞానానికి ప్రతీకలు. వేదర్షులుగోపురస్సరమైన అశ్వాలనిమ్మని ఉషస్సునుప్రార్థిస్తారు 'గామశ్వం'. ఉషాదేవి, నిశాదేవి అక్కచెల్లెళ్ళు. రాత్రితయారుచేస్తుంది. ఉషస్సు ప్రసవిస్తుంది. వృషభం పురుషశక్తికి, పర్వతం ఘనీభవించినశక్తికి సంకేతాలు. ఆకాశం అవ్యక్తం–భూమి వ్యక్తం. హిరణ్యగర్భుడు అవ్యాకృతుడు. విరాట్పురుషుడు–వ్యాకృత విశ్వపురుషుడు. భౌతికము

హిరణ్యగర్భుడు అవ్యాకృతుడు. విరాట్పురుషుడు-వ్యాకృత విశ్వపురుషుడు. భౌతికము ఆధ్యాత్మికమునైన సప్తవిధజ్ఞానాలు – సప్తమాతృకలు – సప్తనదులు. వీనిలో భౌతికము ఆధ్యాత్మికమైన ఆవరణాలకు వారధి సరస్వతి– వాక్కు–వార్త. ఈ జ్ఞానవేత్తలు సప్తర్షులు. ఆ జ్ఞానాగ్నినిపోషించేవి సప్తనదులు. ఈఅగ్నివ్రతులు ఆర్యులు. ఆ ఆర్యులే అంగీరసులు, పితరులు. ఈ పరిభాష, వ్యక్తమైన ప్రకృతికి, అవ్యక్తమైన అంతర్లోకాలకు సమంగా, స్పష్టంగా అన్వయిస్తుంది'.[3] భౌతికమైన వస్తువులు ఆయాధర్మాలకు ప్రతీకలై ఊహాబలం వల్ల తాత్త్వికమైన, అమూర్తమైన చైతన్య విశేషాలను స్ఫురింపచేస్తున్నవి. ఈ అర్థాలను సంకేతాలను కొల్లగొట్టినవే మనశాస్త్రాలు, పురాణాలు.

మానవుడు ప్రయోజనాపేక్షతో ఆయాజంతువుల, చెట్లవిశేషాలను గుర్తించాడు. టోటెం మొదలైన సంకేతాలుగా వానిలో ఏదో ఒకదానిని పెట్టుకున్నాడు – అనే ప్రయోజన సాంఘిక ఉపపత్తులను బెర్గసన్‌సాయంతో లెవీస్ట్రాస్ చీల్చిచెండాడుతాడు. ఏ ముందు ఆలోచనలేకుండా, ఎప్పటికప్పుడు అవసరాన్నిబట్టి ఈసంకేతాలు వ్యాప్తిలోకి వచ్చాయి, నశించాయి అనే సాంఘిక, ప్రయోజన కారణాలు అన్ని సంకేతాలకు ప్రయోజనాన్ని, సందర్భాన్ని చూపలేవు. వాటిలో గతితర్కాన్ని నిరూపించలేవు.[7]

**వనరులమీద పెత్తనం స్థిరపరచుకొనే మనోమయప్రపంచం :**

చెదలు పుట్టకట్టడం ఇళ్ళు కట్టుకోవడానికి స్ఫూర్తినిచ్చినట్లు విశాఖ, గోదావరి గిరిజనుల దృక్పథం. చెదపుట్టవారి కర్మకాండలో ప్రకృతికి సంస్కృతుల మాధ్యమంగా ప్రముఖస్థానం వహిస్తుంది. కన్నెపాపలు జలదేవతలు. జీలుగుచెట్టనుండివచ్చే కల్లు జలం. కన్నెపాపల పెత్తనంనుండి దీన్ని తప్పిస్తేకాని మానవులకు స్వేచ్ఛగా అనుభవించ వీలుకాదు. కాలువ ఒడ్డునగల ఫెరన్‌కు కన్నెజీలుగు (జీలుగునుపోలి ఉంటుంది; ఆకృతితర్కం) అని పేరుపెట్టి అసలు జీలుగును కన్నెపాపల అధికారపరిధినుండి వర్గీకరణంతో, నామీకరణంతో మెళకువగా తప్పించారు. కన్నెజీలుగు కన్నెపాపలది అంటే ప్రకృతిది. కల్లుజీలుగు పాండవులది అంటే సంస్కృతిది.

దానుగుడు (దానవుడు) అడవిరాజు. అడవినరకి వ్యవసాయం చేసుకొంటున్న కొద్దీ భీమునికి (మానవునికి) దానుగుడితో వైరం పెరుగుతుంది. దానుగుని గుర్తుగా రాచెలుక దుంపను, భీమునికి, భీముని జటతీగను కర్మకాండలలో నిలిపి, పాటలతో ఉసిగొలిపి భీముడు గెలిచినట్లు భావిస్తారు.

**మాట్లువేసే కమ్మరి :**

అనంతమైన నిత్యనూతనమైన సంస్కృతికి తగినవర్గీకరణం, ఎన్నో వేలయేండ్ల క్రిందటే మానవుడు చేశాడనడం, గొడ్రాలికొడుకు ఆకాశకుసుమాలతో ముస్తాబై వస్తున్నాడన్నట్లు అసంభావ్యంగా కనిపిస్తుంది. దానికి నిర్మాణతత్త్వవేత్త సమాధానం ఎంతో సహేతుకంగా కనిపిస్తుంది.

మాట్లువేసేకమ్మరి తనవద్దనున్న పనిముట్లతోనే ఊహతో కొత్తవస్తువు తయారు చేస్తాడు. ఒక బిందెను తయారుచేయడానికి కావలసిన సామగ్రి అతనివద్ద ఉండక పోవచ్చు. కాని బిందెనుగూర్చిన కల్పన మనసులో ఉంటుంది. ఒక వస్తువు మట్టు, వేరొకదాని అంచు, ఇంకొకదాని రేకుకలిపి బిందెను రూపొందిస్తాడు.[8] జానపదుని శక్తి యుక్తులూఇట్టివే. పాతనుండి కొత్తకు సేతుబంధనంవంటి క్రమపరిణామమే కాని సముద్రలంఘనంవంటి ఆకాశయానం ఉండదు. అందువలన మానసికమైన, వ్యవస్థా పరమైన సంక్షోభానికి యీసమాజాలలో ఆస్కారంలేదు. పదాలు పరిమితమైనవే. వాటి కూర్పు కొత్తభావాలను ఎదుటనిలుపుతుంది. సప్తస్వరాలు అనేక భావాలను శ్రుతి చేస్తాయి. వివిధరూపాలలో తరతరాలుగా ప్రసారమయ్యేదే వార్త. దాని నిర్మాణవ్యవస్థ నిర్వహణ యంత్రాంగం తీరుతెన్నులను ఆవిష్కరించే సూక్ష్మావగాహన దర్శనం. ఎన్ని పేకలైనా కలుపవచ్చు. ఎటువంటి ఆటలైనా ఆడవచ్చు. ఏ సూత్రాలప్రకారం ఆట సాగుతుందో తెలియనంతకాలం అంతా గందరగోళమే.

**ఎంచుకోవడం – వెక్కిరించుకోవడం – వంకలుదిద్దుకోవడం :**

మానవుడు తనప్రత్యేకతను చాటుకోవడానికి వండడంఅలవాటుచేసుకొన్నాడు అని పురాగాథలు వ్యాఖ్యానిస్తుంటే ఒప్పుకోవడానికి అయిష్టంగానే ఉంటుంది.[7] కాని ప్రకృతికి సంస్కృతికి అదేసరిహద్దు. మేరీడగ్లస్ లేలే తెగ వాఙ్మయంలో జంతుప్రతీకలను వివరిస్తూ జంతుపోలిక ఎంతనింద్యంగా ఆ జాతిభావిస్తుందో వర్గీకరణమంతా వెలికిదీసి నిరూపిస్తుంది. వర్గీకరణంలో తెలుగుగిరిజనులకు చెదలవలె, ఉభయచరాలలోచేరే పంగోలియన్ ఆ తెగవారికి తాంత్రిక స్ఫూర్తినిస్తుంది. మనంకూడా కుక్కబుద్ధి, గాడిద బరువు అంటూ నిందిస్తాం. మగనిని అస్తమానం కాపలాకాసే పెళ్ళాలను 'కంచరిపిట్ట జాతి' అని ఎత్తిపొడుస్తారు. (కంచరిపిట్ట పిల్లలను–మగపిట్టను తొర్రలో తాపడంచేసి ఒక

కన్నుంగుండా తిండిపెతుంది) వైష్ణవులు మడి-మయల,ఎంగిలి-మంగలంపాటించని అనాచారులను 'ఏమిటీ అద్వైతం' అంటూ మందలిస్తారు. అద్వైతులు 'ఆహా! ఏమి భాగవతకైంకర్యం' (ఆషాడభూతివేషాలు) అంటూ దెప్పిపొడుస్తారు. గువ్వల దాంపత్యాన్ని గుర్తిస్తూనే 'చిలకగోరింకలు' అంటూ (ఇవి వేర్వేరు జాతులకుచెందినవి కాని వాని ఈడు, జోడూ తగినవని ఊహ) సృష్టికి వంకలుదిద్దే ఔచిత్యదృష్టి మానవునిది. ప్రకృతి నుండి నేర్చుకుంటాడు. తన ప్రత్యేకతకనువుగా మలచుకుంటాడు. కల్పన చేస్తాడు. ఈ సంస్కారబుద్ధికి మేధస్సు సాధనం.

**భౌతిక మానవశాస్త్రాలు - పరస్పర పూరకాలు :**

ప్రకృతి పురుషుల అనుబంధాన్ని వివరించడంలో ఆద్యుడు ఆల్‌ఫ్రెడ్‌క్రోబర్, లెవీస్ట్రాస్ మిత్రుడు. మాలినోవ్‌స్కీ, రాడ్‌క్లిఫ్‌బ్రౌన్ మొదలైన మానవశాస్త్రజ్ఞుల కృషి ఆయనకు ఒజ్జబంతి. వీరందరి కృషి ఫలితంగా పాశ్చాత్య ప్రపంచం మానవుని ప్రజ్ఞలను గూర్చిన మరిన్ని సాక్ష్యాలకోసం, మౌలిక పరిశోధనల కోసం ఎదురుచూడసాగింది. మాతృభాషలోనే సమాచారం సేకరించడం సమాజంయొక్క సత్తాను గ్రహించడానికి ఉత్తమపద్ధతి అని గ్రహించి భాషాశాస్త్రాన్ని వృద్ధిచేశారు. భౌతికమానవశాస్త్రాలు పరస్పరపూరకాలని, పదార్థంగూర్చి తెలుసుకోవడం ఎంత ముఖ్యమో మనోప్రపంచం గూర్చి గ్రహించడం అంతకంటె మిక్కిలి అవసరమని గమనించారు. ఈ అదనులో వెలువడిన నిర్మాణ సిద్ధాంతాలు, కేవలం ఒక పరిశోధన ఫలితంగానేకాక, నాగరికత సృష్టించే సమస్యలకు పరిష్కారంగా మన్ననపొందాయి.

**నాకవిత్వంబు నిజము కర్ణాటభాష :**

ప్రతీకల సంప్రదాయాలు మూలానుసారం వ్యాఖ్యానించడానికి అలవాటుపడిన పండితులకు నిర్మాణవ్యాఖ్యానంద్వారా అవతరించేమూలాతిరిక్తమైన వ్యాఖ్యలు విపరీతంగా స్ఫురించాయి. ఇది స్ట్రాస్, రచనలో చూపించేవిదగ్ధతగా, తర్కంలోని డొంక తిరుగుడుగా సందేహించారు.

ఇటువంటి కుశంకలకు స్ట్రాస్ సమాధానం 'నా కవిత్వంబు నిజము కర్ణాటక భాష' అని దబాయించిన శ్రీనాధుని తలపుకుతెస్తుంది. 'మూడేండ్లకొకయేడు క్షేత్రకృషి చేయని వాళ్ళు మానవశాస్త్రం బోధించడానికిచాలరు. పదార్థవిజ్ఞానం, పరిణామవాదం చేసే

గోబెల్స్ ప్రచారంనుండి దూరంగాపోయి అరణ్యాలలో కౌపీనవంతులమధ్య మానవుని స్వతంత్రప్రజ్ఞను అధ్యయనంచేయడం తప్పనిసరి' అని సందేశమిస్తాడు స్ట్రాస్.[7]

**వేదాలు - అరణ్యకాలు :**

నాటి మహర్షులందరూ దార్శనికులే. 'వైదిక నాగరికత కర్మప్రధానము. కర్మ బాహుళ్యము తత్త్వచింతనకు ఆలోచనకు తగిన వాతావరణంకాదు. నిర్గుణ భావనకు నిశ్చలధ్యానమవసరము. యజ్ఞవిధానము (నేటి శాస్త్రాలు, యంత్రాలు నాగరికతవలె కామ్యకర్మలు) అందుకు పొసగనిది. ఋగ్వేద ఋషులు నాగరికులు, గ్రామీణులుకారు. వారు ధ్యానమునకై అరణ్యమునాశ్రయించలేదు. వేదములలోని దైవములు అరణ్య దైవములుకావు. వారివాహనములు అశ్వములు, రథములతో కూడినవి. వారికి వేటతో సంబంధములేదు. తైత్తిరీయారణ్యకము, గ్రామము, ఇల్లువిడచి ఏకాంతమున నివసించుట జిజ్ఞాసువు ధర్మమన్నది'.[3] దేశకాలపరిమితులతో చేసే ప్రచారాలను చిత్తవృత్తులను నిరోధిస్తేగాని ఆత్మానుసంధానం సాధ్యంకాదని వారుతలచారు. లెవిస్ట్రాస్ కూడా క్షేత్రకృషినిగూర్చి ఇందుకే నొక్కిచెప్పాడు.

**అరణ్యవాసం వరించిన శాస్త్రజ్ఞులు :**

నాటి దార్శనికులు ఆర్యుల భోగలాలసతను, ఆక్రమణశీలాన్ని, జాత్యహంకారాన్ని అసంఘటితము, స్థవిరము, స్వయంపోషకమైన ద్రావిడసమాజాల శత్రుత్వాలకు, ఆజ్యంపోసే వ్యవహారజ్ఞానంలో సామ్యవైషమ్యాలకు కారణమేమని ఆలోచించుకొని ఉంటారు. వారు అరణ్యవాసాన్నివరించినా అణువిజ్ఞానంతెలిసిన శాస్త్రజ్ఞులు, లోకజ్ఞులు. సత్యాన్వేషణలో వారిఅనుభవాలు, పరిశోధనవిధానం, వెయ్యేండ్ల దాస్యంలో కృశించి పోయి దుర్వ్యాఖ్యలకులోనై మనకు సూత్రప్రాయము, శల్యావశిష్టమైన శాస్త్రగ్రంథాలు మాత్రమేమిగిలాయి.

ఆ 'సారపు ధర్మము విమలసత్యము' నేడు పడమటిదేశాలలో ఆవిష్కృతమౌతుంటే ఆ భావసంవాదానికి మనసు పులకిస్తుంది. సన్నిహితము, అధునాతనమైన విదేశీ సిద్ధాంతాలపై పరిశోధకులు నేడు ఆధారపడకతప్పదు. ఆ సహకారాన్ని ఆశించేముందు ఎంత అస్పష్టమైనప్పటికీ మనపరిశోధనాసంప్రదాయాన్నికూడా పోల్చిచూస్తేగాని మనదేశ కాలాలలోని రాగద్వేషాలకు తగినన్యాయం జరుగదు. ఆ దిశలో యీవ్యాసం ఔత్సాహిక

ప్రయత్నం మాత్రమే. ఎడ్మండ్‌లీచ్ అన్నట్లు పాశ్చాత్యభారతీయదర్శన విశేషాలకు స్వేచ్ఛగాచేసిన కూర్పుయిది.

**ఆశించే ప్రమాణాలు – వాస్తవంలో అర్హతలు :**

ఈనాడు మనజిల్లాలు పరిపాలనాసౌలభ్యంకోసం ఏర్పడినవికాని, సాంస్కృతిక మండలాలుకావు. జిల్లాలనుండి అనేక జాతుల, వివిధరూపాల వాఙ్మయాన్నిసేకరించి, గ్రామీణవాతావరణాన్ని కళ్ళకుకట్టిస్తున్నామేకాని జాతుల ప్రజ్ఞలు, ప్రాపంచిక దృక్పథం, పూవులో తావివలె ఆసంస్కృతిలో సర్వాంగీణంగా పుంజుకున్న తీరులను ఆవిష్కరించ లేకపోతున్నాము. జానపదీనమైన అన్వేషణ, జీవితం అన్నికోణాలను వెలుగులోనికి తెచ్చిననాడు అది జాతిఆత్మకథ అవుతుంది. తన్నుతాను దిద్దుకోవడానికి 'బలహీన వర్గాలకు' ఉపయోగిస్తుంది. సంస్కృతి, ప్రతిభలగూర్చిన స్పష్టమైన అంచనా, ఆశించే జీవనప్రమాణాలకు – వాస్తవంలో అర్హతలకు, అంతరమెంతో స్పష్టంచేస్తుంది.

**అర్థ, పదార్థ శాస్త్రజ్ఞుల అహంకార – మమకారాలు :**

ఐదునక్షత్రాల సౌధంలోఉనప్పటికీ, చుట్టూగలవాళ్ళు తనకు నచ్చకపోయినా, నచ్చిన వాళ్ళు లేకపోయినా వెలితిగానే ఉంటుంది.[12] ఈ మానవ సంబంధాలకు మూలమైన వ్యవస్థను, సంజ్ఞానాలను గుర్తించినప్పటికీ వీటిని పరిగణనలోకి తీసుకోవడానికి అర్థశాస్త్రవేత్తలు తటపటాయిస్తున్నారు.

కోట్లాది జాతుల, తెగల ఉపాధికి ఆధారమైన అలిఖిత విజ్ఞానాన్ని, పాశ్చాత్య విజ్ఞానాన్ని సమన్వయించవలసిన అవసరాన్ని అంగీకరించినప్పటికి, పాలకవర్గాలు పాశ్చాత్య విజ్ఞానానికి పట్టం కట్టడంవల్ల అనాది సమాజాల విజ్ఞానం ఆదరణకు నోచుకోవడంలేదు.[10]

**ప్రగతి – సామాజిక సంపత్తి :**[13]

మనుష్యసంపద, యంత్రశక్తివలె ముడిపదార్థంకాదు. జాతికిగల ప్రతిభలలో, ఇష్టాయిష్టాలలో గమనించదగిన వైవిధ్యముంటుంది. ప్రతివృత్తికి స్వీయపరిభాష ఉంటుంది. ఎన్నోభాషల, వృత్తుల, ప్రాంతాలకు చెందిన మనపల్లెప్రజలకు వారిపరి భాషలో ప్రణాళికాలక్ష్యాలను మనసుకు హత్తుకునేటట్లుగా వివరించగలిగి, జాతి శక్తి

యుక్తులను ప్రణాళికా నిర్మాతలకు వారి పరిభాషలో నచ్చచెప్పగలిగినపుడే మనది సంక్షేమరాజ్యమన్న ఆదర్శం ఆచరణలోకి వస్తుంది.

'ప్రజలను, ప్రగతిని ఒక్కత్రాటిపై నడిపించే ఈ దారినిపోవువారెన్నడును అలసిపోరు. కారణము అదియేమార్గము అదియేమజిలీ.'

## అధ్యయన సంప్రదాయం ఒక శాస్త్రం - జానపద సంస్కృతి ఒక కళ

(వివేచన, 1981, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధన పత్రిక)

# సంప్రదించిన గ్రంథాలు – ఉపయోగించుకున్న ఉట్టంకింపులు

1. Race, Concept ; Results of an Enquiry - UNESCO, Paris, 1951.

2. Dictionary of Science, Ed. E.B. Uvarov and Champman, English Language Book Society Publishers; 1979, Page 118.

Digital Computer: A Computer that operates on data in the form of digits, rather than physical qualities used in Analog Computers. Modern Digital Computers are usually based on binary notation, numbers and letters being coded into groups of digits consisting of only 1 or 0. (page 119)

Analog Computer: A computer in which numerical magnitudes are represented by physical quantities such as electrical current, voltage or resistance.

Myth and meaning, Claude Levistrauss, Schocken Books. Newyork, 1979.

